# Vimarśakuḍiga cuṭṭamañci rāmaliṅgāreḍḍi

A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment
of the requirement for the award of

Doctor of Philosophy
In
Telugu

Researcher
**MORUMPALLI CHANDRAMOULI**
**(Reg No: 15HTPH02)**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad- 500046
Telangana, India

December – 2020

# విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి

పిహెచ్ .డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం


**పరిశోధకుడు**

**మొరుంపల్లి చంద్రమౌళి**

15HTPH02

**పర్యవేక్షకులు**

**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**

**తెలుగు శాఖ**

**మానవీయ శాస్త్రాల విభాగం**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు – 500046**


**డిసెంబర్ 2020**

# DECLARATION

I, **Morumpalli Chandramouli** hereby declare that this thesis entitled **Vimarśakuḍiga cuṭṭamañci rāmaliṅgāreḍḍi** submitted by me under the guidance and supervision of Prof. Darla Venkateswara Rao is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this thesis can be deposited in Shodganga/INFLIBNET.

Signature of the Student

Date:

Name: MORUMPALLI CHANDRAMOULI

Registration No. **15HTPH02**

## CERTIFICATE

This is to certify the Thesis entitled Vimarśakuḍiga cuttamanchi ramalingareddy submitted by Mr. Morumpalli Chandramouli bearing Regd. No.15HTPH02 in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance. The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.A.Published in the following publications: Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter-1and 2 of the thesis.)

1."Kavijīvitālaariśōdhanallo:*Dr:C.R.reddyjeevitham,rachanlu*"(ISBN978-93-81992-32-6), Pg.No.-87-89, February 2016. 1st Chapter. "Pariśōdhana: nāḍu, nēḍu, rēpu (pariśōdhana patrāla saṅkalanaṁ)" Edited by Prof. Sampathkumar, Madabhushi. Department of Telugu, Madras University. Madras.
2."*telugusahityavimarshakudiksuchiC.R.reddy*"(RNI/APTEL/2016/69069),Rayalaseemajagruthi .Pg.No.32,33,january2018.4thChapter.ChiefEditor“S.Sriharimurthy’’,Doorno,13/3645,kajganag ar,ananthapur Dist., A.P.

Further, the Student has passed the following courses towards fulfilment of coursework requirement for Ph.D./was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his M. Phil programed the M. Phil degree was awarded.

Further, the Student has passed the following courses towards fulfilment of coursework requirement for Ph.D./was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his **M. Phil** program and the M. Phil degree was awarded.

| S.N | **Course Code** | **Name** | **Credits** | **pass/fail** |
|---|---|---|---|---|
| 1 | HT700 | Research Methodology | 4.00 | PASS (B) |
| 2 | HT701 | History of Telugu Research | 4.00 | PASS (A) |
| 3 | HT702 | Studies in Specialized Area | 4.00 | PASS (A) |
| 4 | HT703 | Broad Field | 4.00 | PASS (A) |
| 5 | HT780 | Dissertation(M. Phil) | 16.00 | PASS (B+) |

**(Prof. DARLA VENKATESWRA RAO)**
**Research Supervisor**

**(Prof. G.ARUNAKUMARI)**
**Head, Department of Telugu**

**(Prof. S. SARAT JYOTSNA RANI)**
**Dean, School of Humanities**

# కృతజ్ఞతలు

ప్రతి బిడ్డకు మొదటి గురువులు తల్లి దండ్రులే. వారు జన్మనివ్వడం వల్లే ప్రతి ఒక్కరికీ ఈ లోకంతో పరిచయం ఏర్పడుతుంది. నాకు జన్మ నిచ్చి విద్యా బుద్ధులు నేర్పించిన నా తల్లి దండ్రులు శ్రీమతి భారతి, శ్రీనరసింహులు గార్లకు నా పాదాభివందనాలు. తమ కష్టాన్ని నాకు తెలియనివ్వ కుండా నా ఆనందంలో వారి సంతోషాన్ని వెతుకున్న తల్లి దండ్రులు ఋణం ఎప్పటికీ తీర్చ లేనిది.

విద్యార్థులను తన బోధనతో చైతన్య వంతులను చేస్తూ, వారి ఆసక్తిని గమనించి, అటు వైపుగా వెళ్ళమని ప్రోత్సహిస్తూ విద్యార్థులను ఎల్లప్పుడూ అభివృద్ధి పథంలో నడవమని మార్గ నిర్దేశం చేసే చైతన్యశీలి, నా పర్యవేక్షకులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు. నేను ఏం. ఎ విద్యార్థి గా ఉన్నప్పుడు విమర్శలో నా ఆసక్తిని గమనించి విమర్శ రంగం వైపు పరిశోధన చేయమని ప్రోత్సహించి నా ఎం.ఫిల్, పిహెచ్.డి. కి పర్యవేక్షణ వహించి నాకు పరిశోధనలో వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ తగిన సూచనలు, సలహాల నిచ్చి నా సిద్ధాంత గ్రంథమిలా రూపు దిద్దుకోవడానికి ముఖ్య కారకులు. పరిశోధన విషయం లోనే కాకుండా వ్యక్తి గతంగా కూడా నా అభివృద్ధికి దోహదపడే తగిన సూచనలు సలహాలు ఇస్తూ నన్ను తమ కుటుంబసభ్యుడిలా భావిస్తూ నా అభివృద్ధి కి బాటలు వేశారు. వారికి నా హృదయపూర్వక పాదాభివందనాలు.

నాకు పిహెచ్.డి చేయడానికి అవకాశం కల్పించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం వారికి, నా పరిశోధనకు జె.ఆర్.ఎఫ్, ఎస్.ఆర్.ఎఫ్ ల ద్వారా ఆర్థికంగా సహకరించిన యూనివర్సిటి గ్రాంట్స్ కమీషన్, న్యూఢిల్లీ వారికి, నా పరిశోధనకు సహకరించిన తెలుగు శాఖకు, శాఖ పార్వాధ్యక్షులు, ప్రస్తుత ద్రావిడ విశ్వవిద్యాలయం (కుప్పం) వైస్–ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, నాకు డాక్టోరల్ కమిటీ మెంబర్ గా ఉండి నా పరిశోధనకు సూచనలు సలహాలు ఇచ్చినటు వంటి ప్రస్తుత తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య. జి అరుణకుమారి గారికి, ఏం. ఎ,లో పాఠాలు బోధించిన ప్రస్తుత మానవీయ శాస్త్రాల విభాగం

అధ్యక్షురాలు ఆచార్య. శరత్ జ్యోత్స్న రాణి గారికి, అధ్యాపకులు ఆచార్య రేమిల్ల వేంకట శాస్త్రి గారికి, ఆచార్య పిల్లలమర్రి రాముల గారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, ఆచార్య డి.విజయలక్ష్మి గారికి, డా.బాణాల భుజంగ రెడ్డి గారికి, డా. డి.విజయకుమారి గారికి, నూతనంగా తెలుగు శాఖకు వచ్చిన అధ్యాపకులు ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, ఆచార్య గోనా నాయక్ గారికి, నేను కనపడినప్పుడు చిరునవ్వుతో పలకరించి పరిశోధన బాగా చేయమని ప్రోత్సహించే ఆచార్య బృందానికంతటికీ నా నమస్కారాలు.

తెలుగు పట్ల ఆసక్తిని కలిగించి నేను శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల, తిరుపతిలో చేరడానికి ముఖ్య కారకులు మా తెలుగు మాస్టారు విజయ్ కుమార్ గారికి, ఎంతో పేరు ప్రఖ్యాతులున్న హైదరాబాదు విశ్వవిద్యాలయం గురించి నాకు తెలియ జేసి, ఇక్కడ చేరడానికి తోడ్పాటు అందించిన రామలింగ రెడ్డి సార్ గారికి, ప్రాథమిక విద్య నుండి స్నాతకోత్తర విద్య వరకూ నాకు చదువు చెప్పి నాలో జ్ఞాన జ్యోతిని వెలిగించిన గురువర్యులందరికి నా పాదాభివందనాలు.

నా పరిశోధన కాలంలో విషయ సేకరణ కోసం వెళ్లినప్పుడు సహకరించిన వివిధ విశ్వ విద్యాలయాలలో పని చేస్తున్న తెలుగు శాఖ ఆచార్యలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. వారిలో ప్రధానంగా ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు, ఆచార్య విస్తాలి శంకర్ రావు గారు,(మద్రాసు విశ్వ విద్యాలయం), ఆచార్య సిహెచ్. శ్రీరామ చంద్ర మూర్తి గారు (బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం), ఆచార్య వెలమల సిమ్మన్న గారు (ఆంధ్ర విశ్వ కళా పరిషత్, విశాఖ పట్టణం), ఆచార్య కె. ఆశాజ్యోతి గారు (బెంగళూరు విశ్వ విద్యాలయం) మరియు డా.ఎలిజబెత్ జయ కుమారి గారు.(ప్రెసిడెన్సీ కళాశాల మద్రాసు) గారికి, ఇతర అనేమంది ఆచార్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఎప్పుడు ఇంటికి వెళ్ళినా ఆప్యాయంగా పలకరించి, సొంత బిడ్డలా చూసుకొని, పరిశోధన త్వరగా పూర్తి చేయమని చెప్పి, ఎప్పుడూ నా ఉన్నతిని కోరుకునే మాతృమూర్తి డా. మంజుశ్రీ గారికి కృతజ్ఞతలు. చిరంజీవి దార్ల శ్రీనివాసరావు కి శుభాశీస్సులు.

పూర్వ పరిశోధనలకు సంబంధించి సమాచారాన్ని తెలియజేసి, నాకు దొరకని పుస్తకాలను సేకరించి ఇచ్చిన సీనియర్ అన్నలు డా. సతీష్, డా. నాగరాజు, డా. ఉమేష్,

కృష్ణారెడ్డి, నాగ మల్లయ్యలకు ధన్యవాదాలు. సమాచార సేకరకు తోడ్పడిన మా యూనివర్సిటీ లైబ్రరీవారికీ, ఇతర విశ్వవిద్యాలయాల లైబ్రరీలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

గత 15 సంవత్సరాలుగా నా పక్కనే ఉండి నా కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ నాకు వెన్ను దన్నుగా నిలచిన మిత్రులు అంకిరెడ్డి సునీల్, కందుకూరి శ్రీధర్, బాలులకు, నా పరిశోధనాగ్రంథం చదివి అక్షర దోషాలు సవరించిన మిత్రులు, సహపరిశోధకులు మాడిశెట్టి అభిషేక్, గరికిపాటి గురజాడ , యజ్జల ప్రవీణ్ లకు,పరిచయం అయినప్పటి నుండి తమ్ముడు అని ఆప్యాయంగా పలకరిస్తూ.. పరిశోధన సమయంలో లైబ్రరీలో పుస్తకాల సేకరణ లోనూ, థీసిస్ సబ్మిట్ చేసే సమయంలో మూడు పుటల అన్నం వండి పెట్టి ఆకలి తీర్చిన నలసాని రాంప్రసాద్ అన్నకి ధన్యవాదాలు.

కట్టమంచి రామలింగారెడ్డి గారికి సంబంధించి నాకు దొరకని వ్యాసాలను, పీఠికలను అంతర్జాలం లోని వివిధ సాహిత్య పత్రికల నుండి ఓపికతో సేకరించి ఇచ్చిన పుష్పిణికి, టైపింగ్లో సాంకేతిక సహకారం అందించిన పెంచల ప్రసాద్ కి...డిగ్రీతోనే చదువు ఆపేయకుండ ఉన్నత చదువులు చదవడానికి ప్రేరణ, ప్రోత్సాహం ఇచ్చినటువంటి మిత్రులు శశికళ, రసూల్ కి ప్రేమ పూర్వక ధన్యవాదాలు.

విషయ సేకరణలో సహకారం అందించిన మిత్రులు రామంజి, సునీల్ (mla), గుప్తా, సుమా, కవిత, గీత, వనజా, కుసుమలకు ధన్యవాదాలు.నాతో పాటు చదువుకొని ఇప్పుడు టీచర్లు అయి నన్నుకూడా తొందరగా సెటిల్ అవ్వమని నిత్యం నన్ను ప్రోత్సహించే మిత్రులు ఝాన్సీ, జయంతి, శ్రీలత, శారదమ్మ లకు...

చదువులోనే కాకుండా ఇప్పటి వరకూ నా జీవితంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా, సాఫీగా సాగిపోవాలని ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న అక్క, బావ మంజుల – రమేష్ లకు, అన్నయ్య ,వదిన భాస్కర్– వేదా లకు మామ ఆది– సౌమ్య లకు ...తమ్ముడు సుదర్శన్ బాబు–నేత్రావతి లకు...పోటీ పరీక్షలలో నాతో పోటీ పడి చదివే చెల్లి శ్రావణికి విజయం చేకూరాలని ఆశిస్తూ...నా పరిశోధనను అందంగా డి.టి.పి. చేసిన ఆనంద్ గారికి కృతజ్ఞతలు.

నా పరిశోధన, సిద్ధాంత గ్రంథంగా రూపు దిద్దుకోవడంలో ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

# ప్రస్తావన

## *1) పరిశోధనాంశ పరిచయం. (Introduction)*

కట్టమంచి రామలింగారెడ్డి పేరు వినగానే మనకు గుర్తుకు వచ్చేది ఆయన రాసిన ***కవిత్వతత్వ విచారం*** గ్రంథం. ఈ గ్రంథం వెలువడిన తర్వాతనే తెలుగు సాహిత్య విమర్శ ఆధునిక మార్గాన పయనిస్తుందని అనేక మంది విమర్శకులు భావించారు. వీరిది పండిత సంప్రదాయ కుటుంబం కావడంవల్ల చిన్నప్పటినుంచే భారత, భాగవత, రామాయణం మొదలైనవన్నీ పరిచయమయ్యాయి. ఈయన 19వ యేటనే రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. ఈయన ఉన్నత చదువులు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో చదివారు. ఈయన దాదాపుగా వంద పుస్తకాలకు పీఠికలు రాశారు. వీరి పీఠికలు మీద "***కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలు– పరిశీలన***" అన్న పేరుతో సిద్ధాంతం వ్యాసం రాసి హైదరాబాద్ విశ్వ విద్యాలయం వారికి సమర్పించి ఎం. ఫిల్ పట్టా పొందాను. వీరి పీఠికల మీద పరిశోధన చేస్తున్న క్రమంలో వారి విమర్శ దృక్పథం పై ఆసక్తి కలిగింది. మా పర్యవేక్షకులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారితో చర్చించి వారి సూచన మేరకు కట్టమంచి విమర్శ, రచనల మీద పరిశోధన చేయడానికి పూనుకున్నాను. అందులో భాగంగా ***"విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి"*** అనే అంశాన్ని పరిశోధనకు ఎంచుకున్నాను.

## *2) పరిశోధన ఆవశ్యకత (Necessity of the research)*

కట్టమంచి రామలింగారెడ్డి రాసిన కవిత్వ తత్వ విచార గ్రంథాన్ని విమర్శించిన వాళ్ళు ఉన్నారు; ఈయన భావాలని సమర్థించిన వాళ్ళూ ఉన్నారు. వీటిని జాగ్రత్తగా పరిశీలిస్తే అవన్నీ ఆధునిక, సాంప్రదాయక భావాలకు సంబంధించిన వాద ప్రతి వాదాలుగా కనిపిస్తాయి వీటిని క్రమ పద్ధతిలో లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందనిపించింది. నేను పరిశీలించిన పూర్వ పరిశోధనల ఆధారంగా ఇప్పటి వరకూ ఈయన వివిధ రచనల మీద పరిశోధన జరిగిందే తప్ప, ప్రత్యేకించి ఈయన విమర్శా కోణాన్ని తెలిపే పరిశోధన జరగలేదు. అందువల్ల ఆయన విమర్శనా దృక్పథాన్ని తెలపడం కోసం ఈ అంశాన్ని పరిశోధనకు ఎన్నుకున్నాను.

### *3) పూర్వ పరిశోధనలు (Review of literature)*

నేను సేకరించిన సమాచారం మేరకు కట్టమంచి రామలింగారెడ్డి గారిపై జరిగిన పరిశోధన వివరాలు ఇలా ఉన్నాయి.

1) **సి. ఆర్. రెడ్డి. జీవితం – రచనలు** అనే పేరుతో ఎం. వెంకట రెడ్డి, గంధం అప్పారావు పర్యవేక్షణలో 1979లో పరిశోధన చేసి మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం. ఫిల్ పట్టా పొందారు.

2) **డా:సి. ఆర్. రెడ్డి తెలుగు రచనలు– ఒక పరిశీలన** అన్న పేరుతో పి. వి. మురళీ కృష్ణ, బి.వి సూర్య నారాయణ గారి పర్యవేక్షణలో 1982లో పరిశోధన చేసి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుండి PhD పట్టా పొందారు.

3) **సి. ఆర్. రెడ్డి ముసలమ్మ మరణం– ఒక పరిశీలన** అన్న పేరుతో కె. దామోదర్ రెడ్డి, కె. వీరభద్ర రావు గారి పర్యవేక్షణలో 1983లో పరిశోధన చేసి హైదరాబాద్ విశ్వ విద్యాలయం నుండి ఎం. ఫిల్ పట్టా పొందారు.

4) **సి. అర్. రెడ్డి జీవితం– రచనలు** అనే అంశాన్ని పరిశోధనకు ఎంచుకొని జి. చలపతి గారి పర్యవేక్షణలో 1988లో డి. మహా లక్ష్మమ్మ, పరిశోధన చేసి శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం నుండి PhD అందుకున్నారు.

5) **కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలు– పరిశోధన** అనే అంశం మీద ఎమ్. చంద్రమౌళి, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి 2014లో హైదరాబాద్ విశ్వ విద్యాలయం నుండి ఎం. ఫిల్ అందుకున్నారు.

కట్టమంచి రామలింగారెడ్డిగారిపై జరిగిన పూర్వ పరిశోధనలను అన్నింటినీ నేను పరిశీలించాననుకుంటున్నాను. వీటిలో ఎక్కువగా ఆయన రచనలను పరిచయం చేసేవిగా ఉన్నాయి. వారి విమర్శనా దృక్పథాన్ని తెలిపే పరిశోధన జరగలేదనీ భావించి ఈ అంశాన్ని పరిశోధనకు ఎంచుకున్నాను.

### *4) క్షేత్ర పర్యటన/గ్రంథ సేకరణ (Field work/Book collection)*

కట్టమంచి రామలింగారెడ్డి రచనలను సేకరించే క్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల లైబ్రరీలను సందర్శించాను. వాటిలో ముఖ్యంగా ఇందిరా గాంధీ మెమోరియల్ లైబ్రరీ (హైదరాబాద్ విశ్వవిద్యాలయం), రాష్ట్ర ఆర్కైవ్స్ (హైదరాబాద్) ప్రాచ్య లిఖిత భాండాగారం (మద్రాసు), రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం (అఫ్జల్ గంజ్,హైదరాబాద్), నగర కేంద్ర గ్రంథాలయం (చిక్కడపల్లి,హైదరాబాద్), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథాలయం (హైదరాబాద్), తెలంగాణ సారస్వత పరిషత్తు (హైదరాబాద్), శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయం (తిరుపతి), శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య కళాశాల గ్రంథాలయం (తిరుపతి), శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గ్రంథాలయం (తిరుపతి), బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ లైబ్రరీ (వారణాసి), బెంగళూరు విశ్వవిద్యాలయం గ్రంథాలయం (బెంగళూరు).

వీటిని ప్రధానంగా నా విషయ సేకరణ కోసం సందర్శించాను. అలాగే కట్టమంచి రామలింగారెడ్డి మీద పరిశోధన చేసిన వాళ్ల వంశస్థురాలు, మనుమరాలు అయిన కట్టమంచి మహా లక్ష్మమ్మ గారిని కలిసి కట్టమంచి రామలింగారెడ్డికి సంబంధించిన కొన్ని ఉపన్యాసాలను, వ్యాసాలను సేకరించాను. ఆమె దగ్గర కట్టమంచి రామలింగారెడ్డి సంబంధించి మరెన్నో విషయాలను తెలుసుకున్నాను. ఈ అంశాలన్నింటినీ నా పరిశోధనలో చేర్చాను.

### *5) పరిశోధన ఆకరాలు(Research source)*

నా పరిశోధన సిద్ధాంత గ్రంథ రచనకు అనేక పుస్తకాలు, పత్రికలు, నిఘంటువులు, ఆధారమయ్యాయి. వాటన్నింటినీ పరిశోధన అంశం చివర ఉపయుక్తగ్రంథసూచిలో పేర్కొన్నాను. ఇక్కడ రామలింగారెడ్డి రచనలు, వారి మీద వెలువడిన ప్రత్యేక గ్రంథాలను కూడా కొన్నింటిని పేర్కొంటున్నాను.

1. రామలింగారెడ్డి.కట్టమంచి,***ముసలమ్మమరణం***. చెన్నపురి:
   కళారత్నాకర ముద్రాక్షరశాల, 1990.
2. రామలింగారెడ్డి, కట్టమంచి. ***కవిత్వతత్వవిచారము*** అను పింగళి
   సూర్యనార్యకృతకళాపూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్నముల విమర్శనము.
   వాల్తేరు: ఆంధ్రకళాపరిషత్. (ఐదవ ముద్రణ:1973– ప్రథమ ముద్రణ:1914).

3. రామలింగారెడ్డి, కట్టమంచి. ***భారత అర్థశాస్త్రము***.రాజమండ్రి:
విజ్ఞానచంద్రిక ప్రచురణ,1958.

4. రామలింగారెడ్డి. కట్టమంచి, ***వ్యాస మంజరి.*** వాల్తేరు: ఆంధ్ర యూనివర్సిటీ ప్రెస్, 1947.

5. రామలింగారెడ్డి.కట్టమంచి,***లఘుపీటికాసముచ్చయము.***ఏలూరు:
రామాపవర్ ముద్రాక్షరశాల,1928

6. రామలింగారెడ్డి. కట్టమంచి, ***పంచమి.*** రాజమండ్రి: ఆంధ్ర విశ్వకళా పరిషత్, 1954.

7. సుబ్బయ్య, గొర్రెపాటి. **డాక్టర్. సి. ఆర్. రెడ్డి**. విజయవాడ: దేశికవిత మండలి.1961.

8. సుబ్బయ్య, గొర్రెపాటి. **డాక్టర్. సి. ఆర్. రెడ్డి – జీవిత చరిత్ర**. హైదరాబాదు:
విజ్ఞాన సరోవర ప్రచురణలు. 2006.

9. రాజారాం,మధురాంతకం. ***సి.ఆర్.రెడ్డి.*** రెడ్డి హైదరాబాదు: పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వ విద్యాలయం ప్రచురణ. 2006.

10. భాస్కర చౌదరి, బి. (సం). ***డా. సి. ఆర్. రెడ్డి పీఠికలు***. చిత్తూరు జిల్లా రచయితల
సహకార ప్రచురణ సంఘం. 1983.

11. భాస్కర చౌదరి, బి. (సం). ***సాహితీమూర్తి కట్టమంచి***. చిత్తూరు: ఆంధ్రశాఖ
ప్రభుత్వ కళాశాల. 1983. (ప్రథమ ముద్రణ:1980).

12. బంగోరె, ***వేమన– సి. ఆర్. రెడ్డి***. విశాఖపట్నం: ఆంధ్ర విశ్వకళాపరిషత్, 1981.

13. భూమయ్య. అనుమాండ్ల, ***ఆద్యుడు కట్టమంచి***. వరంగల్లు,
వాగ్వాదినీ ప్రచురణలు, 1992.

14.మహాలక్ష్మి,కట్టమంచి,***కట్టమంచిరామలింగారెడ్డిజీవితంసాహిత్యం***.తిరుపతి:
సాయిప్రచురణలు ,1991.

15. మురళీకృష్ణ,పి. వి, ***డా: సి.ఆర్.రెడ్డి. తెలుగు రచనలు ఒక పరిశీలన***. పిహెచ్. డి.
అముద్రిత సిద్ధాంత గ్రంథం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, 1981.

16. చంద్రమౌళి,మొరుంపల్లి. కట్టమంచిరామలింగారెడ్డి ***పీఠికలు–పరిశీలన***
ఎం.ఫిల్. ఆముద్రిత సిద్ధాంత వ్యాసం హైదరాబాదు విశ్వవిద్యాలయం.2015.

***6) పరిశోధన గ్రంథ రచనా పద్ధతి (Method of research)***

నా పరిశోధన ముఖ్యంగా కవి జీవిత సమన్వయ పరిశోధన పద్ధతి (Biographical Research Method) ఆధారంగా చేసుకొని కొనసాగింది. కట్టమంచి రామలింగారెడ్డి

తెలుగు సాహిత్య విమర్శ పై ప్రధానంగా దృష్టి సారించి, పరిశోధన అధ్యయాన సౌలభ్యం కోసం ఈ సిద్ధాంత గ్రంథాన్ని నాలుగు అధ్యాయాలుగా విభజించుకున్నాను.

మొదటి అధ్యాయం: ***కట్టమంచి రామలింగారెడ్డి జీవితం – రచనల పరిచయం.***

రెండవ అధ్యాయం: **కట్టమంచి సాహిత్య విమర్శ దృక్పథం**

మూడవ అధ్యాయం: **కట్టమంచి వారి సాహిత్య విమర్శ పద్ధతులు**

నాల్గవ అధ్యాయం: ***విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి.***

ఈ అధ్యాయాల్లో అధ్యయనం చేసిన ముఖ్యాంశాలను కింద తెలియజేస్తున్నాను.

***మొదటి అధ్యాయం***

కట్టమంచి రామలింగారెడ్డి జీవితం – రచనలు పరిచయంలో రెడ్డిగారి జీవితంలోని ముఖ్య ఘట్టాలను స్థూలంగా పరిచయం చేశాను. వారి బాల్యం, విద్యాభ్యాసం, వారి రచనలు ముఖ్యంగా ***ముసలమ్మ మరణం, కవిత్వతత్వ విచారము, భారత అర్థశాస్త్రం, వ్యాస మంజరి, పంచమి*** గ్రంథాలను గురించి పరిచయం చేశాను. వాటితో పాటు కట్టమంచి రామలింగారెడ్డి వ్యక్తిత్వం గురించి, వారు చేపట్టిన పదవులు, వారి హాస్య చమత్కారం గురించి ఈ అధ్యాయంలో వివరించాను. వారి విమర్శను అర్థం చేసుకోవడానికి పూర్వరంగా ఈ అధ్యాయం ఉపయోగపడుతుందని భావిస్తున్నాను.

***రెండవ అధ్యాయం***

కట్టమంచి సాహిత్య విమర్శ దృక్పథం అనే అధ్యాయం లో కట్టమంచి రామలింగారెడ్డి గారిపై పాశ్చాత్య సాహిత్య ప్రభావం విస్తృతంగా ఉందని ఆయన జీవితాన్ని, రచనలను పరిచయం చేసుకున్న తర్వాత స్పష్టంగా తెలుస్తుంది. ఆయన తాను చదువుకునే రోజుల్లో చదివిన కళాపూర్ణోదయం, దానిపై రాసిన విమర్శ వ్యాసం ఆయనలోని లోతైన ఆలోచనను అప్పటికే గమనించగలిగే అవకాశం ఉన్నా, పాశ్చాత్య దేశాల్లో చదువుకోవడం, తర్వాత భారతదేశం వచ్చి మరలా ఆ వ్యాసాన్ని రాయడంలో ఎంతో పరిపక్వత కనిపిస్తుంది. అందువల్ల ఆ 'కవిత్వ తత్వ విచారం' తెలుగు సాహిత్య విమర్శలో ఎంతో ప్రాధాన్యం పొందింది. అందువల్ల ఈ అధ్యాయంలో ఆ గ్రంథాన్ని అనుసరించి కట్టమంచి రామలింగారెడ్డి గారి సాహిత్య విమర్శ దృక్పథాన్నితెలిపే ప్రయత్నం చేశాను. కట్టమంచి రామలింగారెడ్డిగారు ప్రతిపాదించి, నిరూపించిన అనేక అంశాలు కవిత్వతత్వవిచారం లో ఉన్నాయి. వీటిని సోదాహరణంగా విశ్లేషించే ప్రయత్నం చేశాను.

*మూడవ అధ్యాయం*

కట్టమంచి వారి సాహిత్య విమర్శ పద్ధతులు అనే అధ్యాయంలో సాహిత్యాన్ని విమర్శించడానికి కొన్ని పద్ధతులను పాటించాలి.సాహిత్య స్వరూప , స్వభావాలనుబట్టి, కాలమానపరిస్థితులను బట్టి,ఆసాహిత్యాన్ని అనుశీలించే పద్ధతిని బట్టి విమర్శకుని శక్తి సామర్థ్యాలు అవగాహన స్పష్టమౌతాయి. కట్టమంచి రామలింగారెడ్డి గారు సంప్రదాయ సాహిత్యాన్ని ఆలంకారిక స్వభావాన్ని ప్రదర్శిస్తూనే ,వస్తుతత్త్వ పద్ధతిలో విశ్లేషించారు.కవులను వారి జీవితం,రచనలను కవిజీవితకావ్య సమన్వయపద్ధతిలో సమన్వయించారు.

కావ్యాలనుతులనాత్మక పద్ధతిలో వస్తువు, పాత్రలను వివిధాంశాలను తులనాత్మకంగా విశ్లేషించారు. తిక్కన, పింగళి సూరన, వేమనలను కవి జీవిత కావ్యం సమన్వయ పద్ధతిలో శాస్త్రి యంగా విశ్లేషించారు. వీటితో పాటు కావ్య సంవిధానాన్ని అలంకారిక పద్ధతిలోనే విమర్శించారు.వీటన్నింటిలోనూ చారిత్రక, సామాజిక, వస్తుతత్త్వాన్ని విశ్లేషించడం వీరి విమర్శలో కనిపించడం ఒక ప్రత్యేకత. వాటిని ఈ అధ్యాయంలో సోదాహరణంగా వివరించే ప్రయత్నం చేశాను.

*నాల్గవ అధ్యాయం*

విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి అనే ఈ అధ్యాయంలో. రెడ్డి గారి విమర్శ పై పాశ్చాత్య విమర్శ ప్రభావం గురించి వివరించాను. అలాగే రెడ్డి గారు చేసిన తులనాత్మక, సాంఘిక విమర్శల గురించి ఉదాహరణలతో పేర్కొన్నాను. కట్టమంచి రామలింగారెడ్డి పేర్కొన్న భావనా శక్తి, ప్రతిభను సవివరంగా వివరించి చెప్పే ప్రయత్నం చేశాను. అంతేకాకుండా వీరి పీఠికలోని విమర్శ గురించి కూలంకషంగా ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది.కట్టమంచి రామలింగారెడ్డి రాసినటువంటి ముసలమ్మ మరణం, కవిత్వ తత్వ విచారం అటు కవిత్వంలోనూ ఇటు విమర్శలోను సంచలనం కలిగించాయి. వీరి రచనల ప్రభావం తరువాత సాహిత్యంపై ఎటువంటి ముద్ర వేశాయన్నది ఈ అధ్యాయంలో చర్చించాను. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ,బసవరాజు దువ్వూరి రామిరెడ్డి, పింగళి లక్ష్మీకాంతం, మొదలైన విమర్శకులపై రామలింగారెడ్డి కవిత్వ తత్వ విచారం ఏ విధమైనటువంటి ప్రభావాన్ని చూపింద అన్న అంశాన్ని ఇందులో వివరించే ప్రయత్నం చేశాను.

*అనుబంధం: (annexures)*

నా పరిశోధన అంశానికి సంబంధించిన పరిశోధనా వ్యాసాలను, వివిధ సంచికలో ప్రచురితమైన అటువంటి వ్యాసాలను అనుబంధంగా ఉంచాను.

*పరిశోధన లక్ష్యం / ప్రయోజనాలు:*

కట్టమంచి రామలింగారెడ్డి జీవితం, రచనలు – విమర్శ దృక్పథాన్ని తెలియజేయడమే ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం.

రామలింగారెడ్డి చిన్నప్పటి నుండి పండిత వాతావరణం గల కుటుంబంలో పెరిగాడు. వారి ముత్తాత కవి. వారి నాన్న న్యాయవాది, సాహితీవేత్త వారి ఇంటి వద్ద ఎప్పుడూ భారత ,భాగవత, రామాయణం గురించి ఎప్పుడూ చర్చ నడుస్తూ ఉండేది. వాటి సారాన్ని అంతటినీ బాగా అవగాహనచేసుకున్నాడు. అందువల్లనే *కవిత్వ తత్వ విచారం*లో భారత కవిత్రయం రచన రీతుల్ని సోదాహరనలతో విమర్శించాడు.

రామలింగారెడ్డి పంతొమ్మిది సంవత్సరాల వయసులోనే ***ముసలమ్మ మరణం*** అనే ఖండ కావ్యాన్ని రాశారు. ఆ కావ్యంలో స్త్రీని కావ్య నాయిక గా చేసి కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టాడు. అప్పటివరకూ వచ్చిన ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే కావ్యాలు అన్నీ కూడా సాధారణంగా సుఖాంతం గా ముగుస్తాయి. అయితే రామలింగారెడ్డి ముసలమ్మ మరణం మాత్రం విషాదాంతంగా ముగిస్తుంది. ఇది ఇందులోని నవ్యత. అప్పటి పరిస్థితులకు అది కొత్త ఒరవడిని సృష్టించింది అని భావించవచ్చు.

కవిత్వ తత్వ విచారంలో భావనాశక్తి, భావతీక్షత, సంబంధాలలోని శృంగార వర్ణనలు, అలంకారాలు, పాత్ర రచనా తత్త్వము, నాటకీయత, కవిత–కవి, పద్య గద్య తారతమ్యాలు, అనే అంశాలపై వీరు చేసిన లాక్షణిక చర్చ నూతన సిద్ధాంత ప్రతిపాదనలకు దారితీశాయి.

కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చదువుకోవడం వల్ల, అక్కడి వాతావరణం, పాశ్చాత్య సాహిత్య ప్రభావం రెడ్డి గారి భావాలపై ప్రభావాన్ని చూపాయి. అందుకనే వారు కావ్యాలలో బాహ్య సౌందర్యం కన్నా సౌందర్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలని చెప్పారు. అలంకార శాస్త్రాలు లక్షణ గ్రంథాల ప్రకారం రచనలు చేయకుండా, భావాని కి ప్రాధాన్యం ఇస్తూ స్వతంత్ర రచనలు చేయాలని సూచించారు.

కట్టమంచి రామలింగారెడ్డి తన కవిత్వతత్వ విచారంలో భారత, భాగవత లను, ప్రబంధాలను చర్చకు పెట్టాడు. ఈ రెండింటిని వేర్వేరు కోణాల్లో విమర్శించాడు.

సి. ఆర్. రెడ్డి. వ్యాసరచనా విధానం ఎంతో ప్రామాణికమైన ఆధారాలతో విశ్లేషణాత్మకంగా ఉంటుంది. రాజమండ్రిలో రాజరాజనరేంద్రుని వర్ధంతి సభలో చేసిన ఉపన్యాసం ఎంతో

ప్రామాణికమైనదిగా చెప్పవచ్చు. రాజరాజనరేంద్రుని వంశ పుట్టుపూర్వోత్తరాలు దగ్గర నుండి, భారత రచన చేయడానికి గల ప్రధాన కారణాలు, నన్నయ భారత రచన విధానాన్ని శాసనాల ఆధారంగా వివరించాడు.

రామాయణ గ్రంథానికి పీఠిక రాస్తూ రంగనాథ రామాయణాన్ని రంగనాథుడు కాక కోన బుద్ధారెడ్డి రచించాడని సోపపత్తికంగా నిరూపించాడు.

సాంఘిక పరమైన వ్యాసాలు, విద్యాపరమైన వ్యాసాలు ఎన్నింటినో రాశాడు. వాటన్నింటిలో కూడా ఆధారాల సహితంగా, ప్రతిపాదించిన అంశాన్ని నిరూపించాడు.

రామలింగారెడ్డి కవిత్వ తత్త్వ విచారం లోనే కాక వీరు వివిధ గ్రంథాలు రాసిన పీఠికలలో కూడా వీరు విమర్శ విధానం బోధపడుతుంది. అంటే కేవలం గ్రంథంలోని అంశాన్ని పరిచయం చేసి వదిలిపెట్టకుండా అందులో కూడా ఏదో ఒక నూతన సిద్ధాంతాన్నో నూతన అంశాన్నో చెప్పేవాడు. రామలింగారెడ్డి గారు తమ గ్రంథానికి పీఠిక రాశారు అంటే రాత మారి పోతుంది అని చాలామంది రచయితలు అనుకున్నారు. అది వారి పీఠిక రచన కున్న విలువ.

వీరి వ్యాసాలలో సాంఘిక విమర్శ కనిపిస్తుంది. హిందూమతంలోని లోపాలను, స్త్రీల సమస్యలను, ఆదిమజాతి స్థితిగతులను గురించి వీరి వ్యాసాలలో చర్చించాడు. ఈ విధమైన విమర్శ వీరికి గల సంఘ సంస్కరణాభిలాష తెలియజేస్తోంది.

కట్టమంచి రామలింగారెడ్డి మంచి వక్త. దాదాపుగా మూడు వందల వరకు వివిధ విశ్వవిద్యాలయాలలో వివిధ సభలలో ప్రసంగించి ఉంటారు. కానీ వారి ఉపన్యాసాలు రెండు మాత్రమే లభిస్తున్నాయి. వీరు ఉపన్యాసాలలో ఎక్కువగా సాంఘికంగా, సామాజికంగా, సమాజంపై బలమైన ముద్ర వేసిన ఆదర్శ మూర్తులను గురించి ఎక్కువగా ఉపన్యసించాడు. వారిని ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని వీరి ఆకాంక్ష.

వీరి విమర్శ ప్రధానంగా సంప్రదాయ విమర్శ నుండి స్వతంత్ర విమర్శ వైపు సాగిందని చెప్పవచ్చు. తెలుగు సాహిత్య విమర్శలో స్వతంత్ర విమర్శను ప్రవేశపెట్టింది రామలింగారెడ్డి గారే అని భావించవచ్చు.

వీరికి అనుభవంలోకి వచ్చిన విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పడం వీరి విమర్శలో ఉన్న మరొక లక్షణం.

రామలింగారెడ్డి  సాహిత్య చర్చలలో కానీ, సాహిత్య గోష్టులలో గాని పాల్గొనేటప్పుడు వీరి వాదన తప్పని ఎవరైనా విమర్శిస్తే, వారి విమర్శను సహృదయంతో స్వీకరించి వారి తప్పుని సరిదిద్దుకునే వారు. ఎదుటివారి వాదనతో ఏకీభవించి వారిని అభినందించే వాడు. ఇది నేటి సాహిత్యకారులు అందరికీ స్ఫూర్తి దాయకం.

రెడ్డి గారి భావాలలో నవ్యత కనిపించినా, భాషలో మాత్రం నవ్యత ని చూపించ లేదు. చివరి వరకు కూడా ఆయన గ్రాంథికంలోనే రాశారు.

రామలింగారెడ్డి విమర్శ చదవడం వల్ల అభ్యుదయ భావాలు కలగడమే కాకుండా గుణదోష జ్ఞానం కలుగుతుంది. సాంఘిక విమర్శ , తులనాత్మక విమర్శ అధ్యయనం అలవడతాయి.

కవిగా, విమర్శకుడిగా, సామాజిక వేత్తగా, రాజకీయ వేత్తగా, విద్యావేత్తగా, ఇలా ఎన్నో రంగాలలో సేవలందించిన రామలింగారెడ్డి జీవితం నేటి సమాజం లోని వ్యక్తులందరికీ ఆదర్శప్రాయమని నా భావన.

ఈ అంశాలన్నిటినీ వివిధ అధ్యాయాలు గా వివరించే ప్రయత్నం చేస్తాను.

# విషయసూచిక


పుటలు

కృతజ్ఞతలు v–vii

ప్రస్తావన vii–xvi

మొదటి అధ్యాయం

కట్టమంచి రామలింగారెడ్డి జీవితం –రచనల పరిచయం(1–66)

1.0. పరిచయం 1

1.1 బాల్యం 1

1.2 ప్రాథమిక విద్యాభ్యాసం 2

1.3 ఉన్నత విద్య 2

1.4 కళాశాల విద్య 3

1.5 విశ్వవిద్యాలయ విద్య 4

1.6 సాహిత్యాభిలాష 5

1.7 పదవులు 6

1.8 బహుమతులు–సత్కారాలు 7

1.9 రచనలు 8

1.9.1 ముసలమ్మ మరణము 8

1.9.1.1 ముసలమ్మ మరణం మూలకథ 11

1.9.1.2 ముసలమ్మ మరణంలో రెడ్డిగారు చేసిన మార్పులు 13

1.9.1.3 ముసలమ్మమరణం కావ్యంలోని పాత్ర చిత్రణ 19

1.9.1.4 ముసలమ్మమరణం కావ్యంలోని రస పోషణ 20

1.9.1.5 ముసలమ్మమరణం– నాటకీయత 21

1.9.2 నవయామిని 25

1.9.3 కట్టమంచి పద్య రచనలు 31

1.9.3.1 అంపకాలు 32

1.9.3.2 భారత ప్రశంస 33

1.9.3.3 ప్రాస్తావిక పద్యావళి 33

1.9.3.4 దయ్యంబు దైవంబున 36

1.9.3.5.మారుతికి వినతి 38

9.3.6. నవ వధువుకు – శుభాశీస్సులు 39

1.9.4 0. రెడ్డిగారి వ్యాస సంపుటి– పంచమి 41

1.9.4.1.రంగనాథ రామాయణ కర్తృత్వం 41

1.9.4.2 ప్రాచీనములు – వికృతములు 43

1.9.4.3 ద్రౌపది – సీత 45

1.9.4.4. ద్రౌపది తన్ను గుఱించి చెప్పుకొన్న ప్రకారం 45

1.9.4.5 అవాల్మీకము 46

1.9.4.6 భాసుడు 47

1.9.5 కవిత్వ తత్త్వ విచారం 47

1.9.6 అర్థశాస్త్రం 49

1.9.6.1 భారత అర్థశాస్త్రం – ముఖ్యోద్దేశం 49

1.9.6.2 అర్థశాస్త్ర ప్రకరణ విభజన 50

1.9.6.3 అర్థశాస్త్ర రెండవ ప్రకరణ విభజన 52

1.9.6.4 భారత అర్థశాస్త్రంలోని ఉదాహరణలు ప్రతిపాదికలు 57

1.9.6.5 పురాణ సంబంధమైన ఉదాహరణలు 59

1.10 కట్టమంచి వ్యక్తిత్వం 60

1.11 ఛలోక్తులు 63

1.12 రాజకీయ రంగం 64

1.13 సాహిత్య, సామాజిక దృక్పథం 65

**రెండవ అధ్యాయం**

## కట్టమంచి సాహిత్య విమర్శ దృక్పథం(67–126)

2.1 దృక్పథం 67

2.2 కవిత్వ తత్వ విచారం – కట్టమంచి విమర్శన దృక్పథం 68

2.2.1 భావనాశక్తి 69

2.2.2 భావ తీక్ష్ణత 72

2.2.3 ప్రబంధములు – శృంగార వర్ణన 75

2.2.4 కావ్యం - అలంకారాలు 78

2.2.5 కావ్యం - పాత్ర రచనా తత్త్వం 79

2.2.6 ప్రబంధాలు – నాటకీయాంశాలు 83

2.2.7 కావ్యంలో నీతిబోధ– ప్రాధాన్యం 84

2.2.8 కథా నిర్వహణ పద్ధతులు 86

2.3 భారతంలో భావనాశక్తి 88

2.4 ప్రబంధరచనలో పింగళి సూరన ప్రత్యేకత 89

2.4.1 ప్రబంధ లక్షణ విమర్శ 91
2.4.2 ప్రబంధ శబ్దం 92
2.4.3 ప్రబంధ భేదాలు 94
2.4.4 ప్రబంధ లక్షణాలు 94
2.4.5 కళాపూర్ణోదయము 99
2.4.5.1 మణిహార వృత్తాంతము 100
2.4.5.2 కళాపూర్ణోదయం – సంవిధానం 110

**మూడవ అధ్యాయం**

**కట్టమంచి వారి సాహిత్య విమర్శ పద్ధతులు (127–216)**

3.1 తులనాత్మక విమర్శ 127
3.1.1 రంగనాథ రామాయణ కర్తృత్వం 128
3.1.2 అవాల్మీకములు 137
3.1.2.1 అవాల్మీకములు– గోనబుద్ధుడు 137
3.1.2.2 కంబ రామాయణం – అవాల్మీకాంశములు 139
3.1.3 భాసుడు – రామాయణ నాటకాలు: తులనాత్మక విమర్శ 144
3.1.3.1 అభిషేకము 147
3.1.4 భారత, భాగవతాలు – తులనాత్మక విమర్శ 148
3.1.5 ద్రౌపది – సీత: తులనాత్మక విమర్శ 155
3.1.5.1 ద్రౌపది యెడ బాండవులు చూపిన గౌరవాదరములు 155
3.1.5.2 ద్రౌపది తన్ను చెప్పుకున్న ప్రకారం 157

| | |
|---|---|
| 3.1.5.3 సత్యా ద్రౌపది సంవాదమునందు | 159 |
| 3.1.5.4 సైంధవ దుర్మతి ఘట్టము | 161 |
| 3.1.5.5 కుంతికి ద్రౌపది యందుండెడి ప్రేమ గౌరవములు | 162 |
| 3.1.6 సీతా – ద్రౌపదులు : తులనాత్మక విమర్శ | 164 |
| 3.1.6.1 ద్రౌపది మనస్తత్వ చిత్రణ | 165 |
| 3.1.7 భాసుడు రచన– భారతంతో తులనాత్మక విమర్శ | 166 |
| 3.1.7.1 దూత వాక్యము | 166 |
| 3.1.7.2. కర్ణభారము | 166 |
| 3.1.7.3. దూతఘటోత్కచము | 166 |
| 3.1.7.4. ఊరుభంగము | 167 |
| 3.1.7.5. మధ్యమ వ్యాయోగము | 167 |
| 3.1.7.6. పంచరాత్రము | 167 |
| 3.1.8 భాగవతం | 168 |
| 3.8.1 బాల చరిత | 168 |
| 3.2 ఆలంకారిక విమర్శ– వస్తు దృక్పథం | 169 |
| 3.2.1 ప్రభావతీ ప్రద్యుమ్నం– ఆలంకారిక విమర్శ | 180 |
| 3.3 పాత్రల మనస్తత్వ చిత్రణ : ఆధునిక విమర్శన దృష్టి | 194 |
| 3.3.1 కళాపూర్ణోదయంవస్తుత్తత్వ పరిశీలన | 196 |
| 3.4 సాంఘిక విమర్శ పద్ధతి | 202 |
| 3.4.1 స్వయంవరములు రాక్షసవివాహములేనా? కాదా? | 204 |
| 3.4.1.1 హిందూ వివాహం – రకాలు | 205 |

3.4.2 హిందూ మత పరిణామంలో భజన కూటముల–ప్రాముఖ్యం 211
3.4.2.1 పూర్వ మీమాంస పద్ధతి 212
3.4.2.2 ఉత్తర మీమాంస పద్ధతి 212
3.4.2.3 వ్యక్తి పద్ధతి 213
3.4.2.4 సాంఘిక పద్ధతి 213
3.4.2.4 హిందువుల భజనలలోని విశేషాలు 214

## నాల్గవ అధ్యాయం

**విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి** (217–271)
4.1 విమర్శ లక్షణాలు 218
4.2 రామలింగారెడ్డి సాహిత్య విమర్శపై – పాశ్చాత్య ప్రభావం 226
4.3 తులనాత్మక విమర్శ 230
4.4 సాంఘిక విమర్శ 231
4.5 ప్రతిభ – భావనా శక్తి 235
4.6 కట్టమంచి రామలింగ రెడ్డి పీఠిక విమర్శ 237
4.6.1 పీఠిక 237
4.6.2 పీఠిక–నిర్వచనాలు 238
4.6.3 ఆధునిక కావ్యాలు–తెలుగు పీఠిక 239
4.6.4 కొందరు పీఠికా కర్తలు 240
4.6.4.1 రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ 240
4.6.4.2 నిడదవోలు వెంకటరావు 241
4.6.4.3 వేటూరి ప్రభాకర శాస్త్రి 241

| | |
|---|---|
| 4.6.4.4 విశ్వనాథ సత్యనారాయణ | 242 |
| 4.6.5 పీఠికా ప్రయోజనం | 243 |
| 4.6.6 రామలింగారెడ్డి పీఠికల్లోని కావ్య విమర్శ విలువలు | 244 |
| 4.7 విమర్శకుడిగా కట్టమంచి – వివిధ విమర్శకుల విశ్లేషణ | 250 |
| 4.8 కట్టమంచి సాహిత్య విమర్శ తెలుగు విమర్శకులపై ప్రభావం | 254 |
| 4.8.1రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ పై కట్టమంచి ప్రభావం | 257 |
| 4.9 తెలుగు కవిత్వంపై రామలింగారెడ్డి ప్రభావం | 264 |
| 4.9.1 రాయప్రోలు సుబ్బారావు పై కట్టమంచి ప్రభావం | 264 |
| 4.9.2 దువ్వూరి రామిరెడ్డి పై రామలింగారెడ్డి ప్రభావం | 264 |
| ఉపసంహారం | 272–274 |
| ఉపయుక్త గ్రంథ సూచిక | 275–280 |
| అనుబంధం ( పరిశోధకుని ప్రచురిత వ్యాసాలు) | |

మొదటి అధ్యాయం

# కట్టమంచి రామలింగారెడ్డి జీవితం–రచనల పరిచయం

మొదటి అధ్యాయం

# కట్టమంచి రామలింగారెడ్డి జీవితం – రచనల పరిచయం

## 1.0 పరిచయం

తెలుగు సాహిత్య విమర్శకుల్లో కట్టమంచి రామలింగారెడ్డి ప్రముఖులు. సాహితీ లోకంలో ఆయన సి.ఆర్.రెడ్డిగా ప్రసిద్ధులు. ఆయన కవిగా, విమర్శకుడిగా, సామాజిక శాస్త్రవేత్తగా, రాజకీయ నాయకుడిగా, వ్యాసకర్తగా, పీఠికా కర్తగా ప్రసిద్ధిపొందిన వ్యక్తి. ప్రస్తుత నా పరిశోధనాంశం **"విమర్శకుడిగా *కట్టమంచిరామలింగారెడ్డి*"** కు నేపథ్యంగా ఆయన జీవితం, రచనలు విశేషాలను ఈ అధ్యాయంలో పేర్కొంటున్నాను. సి.ఆర్.రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో కట్టమంచి[1] అనే గ్రామంలో సుబ్రహ్మణ్యం–నారాయణమ్మ దంపతులకు10 డిసెంబరు 1880లో జన్మించారు.

## 1.1 బాల్యం

కట్టమంచి రామలింగారెడ్డి గారికి వారి ముత్తాత పేరే పెట్టారు. ఎందుకంటే వారి ముత్తాత గొప్ప పండితుడు. ఇతడు కూడా అంతటి గొప్పవాడు కావాలని వీరి కుల పురోహితులు, గురువు అయిన కుప్పనయ్యంగారు ఆపేరు పెట్టారు.[2] రామలింగారెడ్డికి ఐదేళ్ళవయసులోనే అక్షరాభ్యాసం చేసి వీధి బడిలోకి పంపారు. అక్కడ పిల్లలందరితో పాటుగా కలసి మెలసి ఆడుతూ, పాడుతూ చదువుకునేవారు. బడికి సెలవులు వచ్చినప్పుడల్లా రామలింగారెడ్డి వాళ్ళ బంధువుల ఇళ్లకు వెళ్ళేవారు. వారు ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా విందు భోజనాలు, పట్టు పంచెలు పెట్టి బాగా చూసుకునేవారు. రామలింగారెడ్డి కుటుంబంలో

---

[1] 'కట్టమంచి' అనే గ్రామం పేరు మీదుగానే వీరి ఇంటి పేరు స్థిరపడింది.

[2] డా.సి.ఆర్.రెడ్డి–జీవిత చరిత్ర, పుట: 57

రోజు వారీ పనుల్లో రామాయణ, భారత, భాగవతాలు వినడం, చదవడం ఒక పనిగా ఉండేది. చిన్నతనం నుండే వాటితో పరిచయం ఉన్న రామలింగారెడ్డి గారిని మహాభారతం ప్రత్యేకంగా ఆకర్షించింది. చిన్న వయస్సులోనే ఆంధ్రమహాభారతాన్ని బాగా చదవడమే కాకుండా, ఆ పద్యాలను భావంతో సహా వివరించి చెప్పేవారు. రామలింగారెడ్డికి వరుసకు అక్క అయిన నరసమ్మగారి దగ్గర అనేక కథలు చెప్పించుకుని ఆనందించేవారు. ఇలా చెప్పినవాటిని మళ్ళీ మళ్ళీ జ్ఞప్తికి తెచ్చుకుంటూ, తన తోటి మిత్రులకి, బంధువులకు చెప్తూ జ్ఞాపక శక్తినీ, భావనా శక్తినీ పెంపొందించుకొని ఉండవచ్చు. ఎందుచేతనంటే రామలింగారెడ్డిగారే తనలో కలిగిన భావనాశక్తి గురించి ఒకచోట ఇలా చెప్పుకున్నారు[3]. తమ అక్కగారింటికి వెళ్ళినప్పుడల్లా

*''ఆమె నన్ను భారతం చదవమని, ఆ పద్యాలకు అర్థాలు చెప్పమందురు. శంకలేక తప్పో, ఒప్పో ఏదో ఒక వ్యాఖ్యానం చేసి, నా పాండిత్యం నిలుపుకొనుచుంటిని. పూర్వము నాకామె ఊకుడు కథలు చెప్పి జ్ఞాపకశక్తిని, భావనాశక్తిని వృద్ధిపరిచెను''* రామలింగారెడ్డికి పన్నెండు సంవత్సరాల వయసుకే సుమారు నూరు కథలు నోటికి చెప్పేవాడని ఈయన చరిత్ర రాసిన గొర్రెపాటి వెంకటసుబ్బయ్య అభిప్రాయపడుతున్నారు[4].

## 1.2 ప్రాథమి విద్యాభ్యాసం:

రామలింగారెడ్డికి ఐదవ సంవత్సరంలో అక్షరాభ్యాసం చేసి, వీధి బడిలో చేర్చారు. అక్కడ మునిస్వామిమందడి వీరికి గురువు. వీరి వద్ద రామలింగారెడ్డి అమరం, రామాయణం నేర్చుకున్నాడు. తరువాత కొద్ది కాలానికి గురువు మునిస్వామి మందడి గారు చనిపోతే, వీరి నాన్నగారి దగ్గర భారత, భాగవతాలతో పాటు ఇంగ్లీషు కూడా నేర్చుకున్నారు.

## 1.3 ఉన్నత విద్య:

వీధి బడిలో చదువు పూర్తి అవగానే రామలింగారెడ్డి, కట్టమంచి గ్రామానికి కొద్ది దూరంలో గల చిత్తూరులోని జిల్లా బోర్డు ఉన్నత పాఠశాలలో 1890లో మొదటి ఫారంలో ప్రవేశించారు. వీరికి హైస్కూలులో పాఠాలు చెప్పిన వారిలో కుప్పుస్వామయ్యంగారు ఒకరు.

---

[3], డా.సి.ఆర్.రెడ్డి–జీవిత చరిత్ర, పుట: 57

[4] డా.సి.ఆర్.రెడ్డి–జీవిత చరిత్ర, పుట: 58

వీరు గొప్ప వ్యాకరణవేత్త. ఇతని వద్ద రామలింగారెడ్డి గారు *నలోపాఖ్యానం* మాత్రమే చదువుకున్నారు. అయితే అందులోని వ్యాకరణాంశాలు మొత్తం క్షుణ్ణంగా రామలింగారెడ్డికి కుప్పుస్వామయ్యంగారు నేర్పించారు. శిష్యుడి పట్ల గురువుకి ఉండే ఆదరం ఎంతటిదో, ఆ గురువుగారి పట్ల రామలింగారెడ్డికి కుదిరిన భక్తి కూడా అటువంటిదే. ఈ విషయాన్ని ఒకచోట రామలింగారెడ్డిగారే ఇలా రాసుకున్నారు.

> ***"కుప్పనయ్యంగారు వారి అనంతరం వచ్చిన వేంకట కృష్ణమాచార్యులు గారూ నేర్పిన దానికంటే ఎక్కువ నేను కాలేజికి వెళ్ళిన తరువాత నేర్చుకోలేదు. అనగా కాలేజి పండితులు చెప్పలేదని కాదు, నేను నేర్చుకోలేదు. ఆ వచ్చిన దానితోనే భాషాయాత్ర గడుపుచున్నాను[5]".***

ఈ విషయాన్ని బట్టి చూస్తే రామాలింగారెడ్డిపై ఆ ఇద్దరి గురువుల ప్రభావం ఎలాంటిదో అర్థమవుతుంది. బహుశా వీరి ప్రభావం చేతనేమో తన రచనల్లో గ్రాంథిక భాషా ప్రయోగాలు విస్తృతంగా కనిపిస్తాయి. పాఠశాలలో చదివే రోజుల్లో రామలింగారెడ్డి దివ్యజ్ఞాన సమాజం పట్ల ఆకర్షితుడై ఆ సభలు, సమావేశాలకు వెళ్ళేవారు. ఈ ప్రభావం చేతనే చిన్నప్పటి నుండే దేశంపట్ల, ప్రజలపట్ల భక్తి భావం, ఉదారత ఏర్పడి ఉంటాయని అనుకోవచ్చు. పరీక్షలకోసం కంఠస్థం చేసే అలవాటు రామలింగారెడ్డికి లేదు పరీక్షకు వెళ్ళేముందు చదివినా తన జ్ఞాపకశక్తితో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేవాడు 1896లో ఉన్నత పాఠశాల విద్యపూర్తిచేసుకునేటప్పటికి, ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడటం, పద్యరచన చేయడం నేర్చుకున్నాడు.

## 1.4 కళాశాల విద్య

దక్షిణ భారతదేశంలోని చాలామంది వివిధ ప్రాంతాల నుండి ఉన్నత విద్యకోసం మద్రాస్ వెళ్ళేవారు. పాఠశాల విద్య ముగించుకొని రామలింగారెడ్డి కళాశాల విద్యకోసం మద్రాసు క్రైస్తవ కళాశాలలో 1897లో చేరారు. ఆ కళాశాల ఉన్నత విద్యా ప్రమాణాలకు ప్రఖ్యాతి చెందినది. ఎఫ్. ఎ., విద్యార్థిగా రామలింగారెడ్డి క్రైస్తవ కళాశాలలో చేరేనాటికి డా.విలియం మిల్లర్ అనే ఆయన దానికి ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. ఆయన గొప్ప విద్యావేత్త. విద్యార్థులకు చదువు పట్ల శ్రద్ధాసక్తులు కలిగించడంలో ఆయన ఎంతో నేర్పు ప్రదర్శించేవారు.

---

[5]. సి. ఆర్. రెడ్డి.పుట:8.

సి. ఆర్. రెడ్డి మిల్లరుగారి విశిష్ట వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా స్వీకరించారు. వీరికి చదువు బోధించిన గురువు ప్రొఫెసర్.కెల్లెత్. చదువు పట్ల రామలింగారెడ్డికి ఎక్కువ ఆసక్తి కలిగేలా చేసింది ఈయనే. కళాశాలలో ఇతన్ని ప్రభావితం చేసిన గురువులలో డా. స్కినర్ ఒకరు. ఈయన తత్వశాస్త్రాన్ని చాలా సులభంగా అర్థమయ్యేలా చెప్పేవారు. ఇతని గొప్పతనాన్ని గురించి చెప్తూ "*ఆ మహానీయున్ని నా మౌనంద్వారా మాత్రమే ఆరాధించగలను*" అని రామలింగారెడ్డి చెప్పుకున్నాడు.[6]

తత్వశాస్త్రం పట్ల సి.ఆర్.రెడ్డిగారికి గాఢమైన ఆసక్తిని కలిగించడంతో పాటు క్రైస్తవ కళాశాలలో డిగ్రీ పుచ్చుకున్న తరువాత అతన్ని ఇంగ్లాడుకు పంపించడంలో డా. స్కినర్ ముఖ్య పాత్ర వహించారు.ఈ కళాశాలలో రెడ్డికి కలిగిన మరొక అదృష్టం వేదంవెంకటరాయశాస్త్రి గారి పరిచయం. వేదంవారు ఈ కళాశాలలో సంస్కృత అధ్యాపకులుగా ఉండేవారు. ఈ కళాశాలలో 'ఆంధ్రభాషాభిరంజనీ' అనే సమాజం ఉండేది. ఈ సమాజం వాళ్ళు విద్యార్థినీ విద్యార్థులు కొత్త రచనలను రాయడానికి ప్రోత్సహించేవారు. దీనితో పాటు తెలుగు సాహిత్యంలో అభిలాషను పెంపొందించడానికి వివిధ పోటీలను నిర్వహించేవారు. ఈ పోటీ న్యాయనిర్ణేతలలో వేదం వారు ఒకరు. రామలింగారెడ్డి వీరు పెట్టిన పోటీకోసం ఒక కావ్యాన్ని రాసి బహుమతి గెలుచుకున్నాడు[7]. ఆంధ్రభాషాభిరంజని సంఘం నిర్వహించే సభలు, సమావేశాలలో రెడ్డి చాలా ఉత్సాహంగా పాల్గొనేవారు. కళాశాలలో రామలింగారెడ్డిని భారత, భాగవతాలతో పాటు కళాపూర్ణోదయము బాగా ఆకర్షించింది. దానిమీద రాసిన విమర్శ వ్యాసమే "*కవిత్వతత్వవిచారం*"గా విస్తరించింది. ఈయన1920లో కళాశాల పట్టా పుచ్చుకున్నాడు.

## 1.5 విశ్వవిద్యాలయ విద్య:

1902లో బి. ఏ., పూర్తి చేసిన రామలింగారెడ్డి ప్రభుత్వం ఇచ్చిన స్కాలర్ షిప్పుపై ఇంగ్లాండ్ నగరంలోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ అనుబంధ కళాశాల అయిన సెయింట్‌జాన్స్ కళాశాలలో చేరారు. కళాశాలలో చేరిన కొంతకాలానికే రామలింగా రెడ్డికి అత్యుత్తమ విద్యార్థికిచ్చే "రైట్" బహుమతి లభించింది. విద్యార్థిగానే ఉన్నప్పటికీ విద్వాంసుడుగా (ఫౌండేషన్ స్కాలర్) ప్రత్యేక గౌరవాన్ని పొందగలిగారు. పరిపూర్ణమైన మానసిక వికాసం

---

[6]. సి. ఆర్. రెడ్డి– పుట:13.

[7] డా. సి.ఆర్.రెడ్డి–జీవిత చరిత్ర, పుట: 70

ఏర్పడటానికి అనువైన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ వాతావరణంలో అతడు స్వేచ్ఛగా ఆలోచించడానికి, నిస్సంకోచంగా తన అభిప్రాయాలను వెల్లడించడానికీ అలవాటు పడ్డారు. తోటి విద్యార్థుల అభిమానం చూరగొనడం వల్ల అనతికాలంలోనే లిబరల్ క్లబ్‌కు కార్యదర్శిగా కూడా ఎన్నికయ్యారు. తరచుగా వివిధ సభలు ఏర్పాటు చేసి అనర్గళంగా ఉపన్యాసాలిచ్చేవారు. అతని వాగ్ధాటికి, హాస్య చతురతకు, విషయ పరిజ్ఞానానికి ఆంగ్లేయులు ముగ్ధులయ్యేవారు. స్వాతంత్రోద్యమకాలంలో భారతీయుల ఆంక్షలను తెలపడానికి లాలా లజపతిరాయ్, గోఖలే వంటి నాయకులు తరచూ ఇంగ్లాండు వెళ్లేవారు. లిబరల్ క్లబ్ కార్యదర్శిగా ఉన్న రామలింగారెడ్డి సభలు ఏర్పాటుచేసి వారిచేత ఉపన్యాసాలిప్పించేవారు. గోఖలే మృదుభాషణం, విశాల దృక్పథం రామలింగారెడ్డిగార్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. బారిష్టరు చదివి న్యాయవాది కావాలనుకున్న రెడ్డి గోఖలే సలహాపై చరిత్ర, అర్థశాస్త్రం, తత్వశాస్త్రం ప్రధాన విషయాలుగా ఎంచుకొని ఎం. ఏ. పరీక్షల కోసం చదివారు.1905సంవత్సరంలో ఎం.ఏ. పట్టా పొందారు.

## 1.6 సాహిత్యాభిలాష:

కట్టమంచి రామలింగారెడ్డిగారిది పండిత కుటుంబం కావడంచేత చిన్ననాటి నుండే రామాయణ, భారత, భాగవతాలు వినేవారు.వాళ్లింట్లో వీటి గురించి చర్చలు సాగుతూ ఉండేవి. ఆ ప్రభావం కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్యాభిలాషకు కారణమై ఉంటుంది. అంతే కాకుండా పన్నెండవ యేట నుండే ఆయన చేత తల్లిదండ్రులు భారత,భాగవతాలు చదివించేవారు. దీనితోపాటు రామలింగారెడ్డికి వరుసకు అక్క అయిన నరసమ్మగారు కొన్ని కథలుచెప్తుండేదనిఇంతకుముందేచెప్పుకున్నాం.అది కూడా రామలింగారెడ్డి సాహిత్యాభిలాషకు కారణమైఉంటుంది.దీనితోపాటుమద్రాసుకళాశాలలోచదువుకునేటప్పుడుఆంధ్రభాషాభిరంజనీ సంస్థవారు నిర్వహించే కార్యక్రమాలు ఆయనలో సాహిత్యాభిలాషను మరింతగా పెంచడానికి దోహదపడ్డాయి. సమర్థరంగయ్యశెట్టిగారు నిర్వహించిన పోటీలు కూడా ఆయనలో సాహిత్యాభిరుచిని మరింతగా పెంచాయి. దానికి నిదర్శనమే "***ముసలమ్మ మరణం***" ; కళాపూర్ణోదయము మీద రాసిన విమర్శనావ్యాసం. ఈ వ్యాసమే తరువాత ***"కవిత్వతత్వ విచారం"*** అనే విమర్శ గ్రంథంగా రూపుదిద్దుకొందన్న విషయం సాహిత్యవేత్తలెందరికో తెలిసిన విషయంగా చెప్పుకోవచ్చు.

## 1.7 పదవులు:

1905లో ఎం.ఏ. పట్టా పుచ్చుకున్న రామలింగారెడ్డి ప్రతిభ గురించి విని బరోడా సంస్థానాదీశుడైన గైక్వార్ శ్రీశాయాజీరావురెడ్డి సేవలను తన సంస్థాన విద్యాశాఖలో వినియోగించుకోదలచి నూతన విద్యావిధానాలను తెలుసుకోవడానికి రెడ్డిగారిని ప్రోత్సాహించి అమెరికా పంపించారు. రామలింగారెడ్డిగారు అక్కడి విద్యా రంగంలో చోటుచేసుకుంటున్న నూతనపరిణామాలను ఆకళింపుచేసుకున్నారు. తన ఇరవై ఎనిమిదో యేట స్వదేశానికి తిరిగివచ్చి బరోడా మహారాజా కళాశాలలో ఆచార్యుడు గాను, ఉపాధ్యక్షుడుగాను తన తొలి పదవిని స్వీకరించారు. రామలింగారెడ్డి బరోడాలో ఉన్నది కొద్దికాలమే అయినప్పటికీ కాలేజీ చరిత్రపై అతనిముద్ర గాఢంగా పడింది. మైసూరు ప్రభుత్వ ఆహ్వానంతో 1909లో రామలింగారెడ్డిగారు మైసూరుకు వచ్చి కొన్ని ఉపన్యాసాలిచ్చారు. వాటిని విన్న మైసూరు సంస్థానం దివాను రామలింగారెడ్డిగారిని ఎంతో మెచ్చుకొని మైసూరు కళాశాలలో ఆచార్యుడిగా నియమించారు. స్పష్టమైన ఉచ్చారణతో భావస్ఫోరకమైన భంగిమతో ఆయన ఒకసారి పాఠం చదివే సరికి అందలి సారాంశం విద్యార్థులకు అవగతమైపోతుండేది.

మైసూరు ప్రభుత్వం వారి కొలువులో ఉన్నప్పుడు రామలింగారెడ్డి రెండుసార్లు ప్రపంచదేశాలు తిరిగి దాని ద్వారా పొందిన అనుభవం ఆధారంగా మైసూరు సంస్థానం అభివృద్ధికోసం తీసుకోదగ్గ చర్యలను గురించి నివేదికలు సమర్పించారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయం స్థాపనకోసం ఆయన సమర్పించిన నివేదిక అత్యంత ముఖ్యమైంది. ఈ నివేదిక ఆధారంగా 1916లో మైసూరు విశ్వవిద్యాలయం ఏర్పడింది.తూర్పు,పడమటి దేశాలనుతిరిగిఅనుభవంలోకితెచ్చుకున్ననూతనవిద్యావిధానాలు,పద్ధతులఈవిశ్వవిద్యాలయం లో అమలు చేయబడేవి. రామలింగారెడ్డి ఈ కళాశాలకు ప్రిన్సిపాలుగా నియమింపబడ్డారు.

విద్యార్థుల అభిరుచులను గుర్తించి ప్రోత్సాహిస్తూ ఉత్సాహకరమైన పాఠ్యేతర ప్రణాళికలను అమల్లో పెడుతూ వయోజన విద్య,గ్రామ పునర్నిర్మాణంవంటి సేవాకార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తూ ప్రిన్సిపాల్‌గా కూడా అద్వీతీయమైన సేవలందించారు. ఆయన ప్రిన్సిపాలుగా ఉన్న కాలంలో పాత విభాగాలతోపాటు స్వదేశ భాషలకోసం కొన్ని కొత్త విభాగాలు కూడా నెలకొల్పబడ్డాయి. అలా నెలకొల్పబడ్డదే తెలుగుశాఖ కూడా. ఆ శాఖలో ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు అయిన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మను అధ్యాపకులుగా నియమించారు.

రెండేళ్ల పాటు ప్రిన్సిపాలుగా సేవలందించిన రెడ్డిగారికి సంస్థాన విద్యాశాఖాధికారిగా పదోన్నతి లభించింది. అంతేకాకుండా ఈ సంస్థాన విద్యాశాఖాదికారిగా రామలింగారెడ్డి సాధించిన కృషి సామాన్యమైంది కాదు. నిరక్షరాస్యతను పోగొట్టడం కోసం ప్రతి ఊరికి ఒక పాఠశాల అంటూ ఆయన ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. హరిజనులకు పాఠశాల ప్రవేశం కల్పించారు. ఉన్నత వర్గాల వారు ఎంత ఇబ్బంది పెట్టినప్పటికీ లెక్కచేయకుండా హరిజనుల్లో విద్యావ్యాప్తి జరగడానికి గట్టిగా కృషి చేశాడు[8]. ఈయన మైసూరులో ఉన్న కాలంలోనే ***అర్థశాస్త్రం, కవిత్వతత్వవిచారం*** అనేగ్రంథాలురాశారు.రామలింగారెడ్డి ఆంధ్రవిశ్వవిద్యాలయం మొదటి ఉపాధ్యక్షుడిగా, మద్రాసు విశ్వవిద్యాలయం ప్రో. వైస్ చాన్స్‌లర్‌గా కూడా చేశారు. ఇలా రెడ్డి జీవితంలో అనేకమైన ఉన్నత పదవులు చేపట్టి ప్రతి పదవిలో ఉన్న కాలంలో గొప్ప మార్పులు తీసుకువచ్చాడు.

## 1.8 బహుమతులు–సత్కారాలు:

చిన్నప్పటినుండి సాహిత్య వాతావరణం కలిగిన ఇంట్లో పెరగడంవల్ల రామలింగారెడ్డి 19సంవత్సరాలకే ***"ముసలమ్మమరణం"*** అనే పద్యకావ్యం రాసి ఆంధ్రభాషాభిరంజని సంఘంవారి మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఈ భాష సంఘం పోటీలు మద్రాస్ క్రైస్తవ కళాశాలలో నిర్వహించేవారు. 1901వ సంవత్సరంలో క్రిస్టియన్ కళాశాలలో చరిత్ర, అర్థశాస్త్రాలలో మొదటిస్థానంలో ఉత్తీర్ణత సాధించి బంగారు పతకం గెలుచుకున్నారు. వీరి ప్రతిభను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సాహక బహుమతిగా విద్యార్థి వేతనాన్ని మంజూరు చేసి విదేశాలలో చదువుకునే అవకాశం కల్పించింది. 1903లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటి రామలింగారెడ్డి తెలివితేటలకు మెచ్చి "రైట్" బహుమతిని ప్రదానం చేసింది. ఆయన కృషికి గాను 1937 సంవత్సరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి **కళాప్రపూర్ణ** అనే గౌరవ డాక్టరేట్ పొందారు.ఆంగ్ల ప్రభుత్వం1942లో అత్యంత గౌరవ ప్రదమైన "సర్" బిరుదుతో సత్కరించింది. కొద్ది రోజుల తర్వాత ఆంగ్లేయులు భారతీయులపై చూపుతున్న వివక్ష, స్వాతంత్రోద్యమంలో ఆంగ్లేయ వైఖరి చూసి "సర్" బిరుదు తిరిగి వెనక్కి ఇచ్చేశారు. చిన్నప్పటినుండీ తన విజ్ఞానంతో ఎన్నో పదవులు, పురస్కారాలు పొందారు.

---

[8] డా.సి.ఆర్.రెడ్డి–జీవిత చరిత్ర, పుట:86

## 1.9 రచనలు:

కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్యపాఠక లోకానికి కవిగా, విమర్శకుడిగా, పీఠిక కర్తగా, ఉపన్యాసకుడిగా కనిపిస్తారు. ఆయన రాసిన రచనలు సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నా, సాహిత్యంలో ఒక కొత్త మార్గాన్ని, నూతనోద్యమాన్ని తీసుకురావడానికి అవి ఎంతగానో దోహదపడ్డాయని సాహితీ ప్రముఖుల అభిప్రాయం[9].

### 1.9.1 ముసలమ్మ మరణము(1900)

ప్రతి కావ్యానికి ఒక మూలమున్నట్టే ఈ కథకీ ఒక మూలముంది. మూలకథ కావ్య కథగా మారేవరకు కార్యకారణ సంబంధాన్ని కలిగివుంది. ఒక్కో కారణం లంకెలా తగులుకొని పెద్ద సరంగా మారింది. చిక్కప్ప ఒడయరు కథ మొదటిదిగా కనిపిస్తున్నా చిక్కప్ప ఆశ్రయించిన బుక్కరాయల చరిత్ర ఇందులో మొదటిది. చిక్కప్ప ఒడయరు బుక్కరాయలకు మంత్రియై బుక్కరాయ సముద్రం (తటాకం) నిర్మించడం రెండవ కథ. భారీ వర్షాలు పడి ఆ చెరువుకు గండి పడడం, ముసలమ్మ అనే బాలిక బలి కావడం మూడవ కథ. తాళపత్రాలలో ఉన్న ఆ కథలను సేకరించి ఆంగ్లంలోకి మార్చి "*Histories and tales of the Annals of Handesh Anantapuram*" అన్న పేరుతో బ్రౌను దొర ప్రచురించడం ఇది ఈ కథ యొక్క నాల్గవ దశ. ఈ కథల సంకలనంలో అనంతపుర మండలానికి చెందిన క్రీ.శ. 1750–1810కి మధ్య జరిగిన చారిత్రక కథలు చేరినాయి.

అనంతపుర చరిత్రను చదివి అందులోని ముసలమ్మ కథను తీసుకోని కావ్యంగా మలచి క్రైస్తవ కళాశాలలో విద్యార్థిగా ఉన్న కట్టమంచి రామలింగారెడ్డి సమర్థి రంగయ్య శెట్టి పోషిస్తున్న శ్రీమదాంధ్ర భాషాభిరంజని సమాజం నిర్వహించే బహుమాన కావ్య రచన పోటీకి సమర్పించడం ఇందలి ఐదవ దశ. 1819 సంవత్సరంలో రెడ్డిగారిచే పందొమ్మిది సంవత్సరాల ప్రాయంలో రాయబడి, పారితోషికమును పొందుట ద్వారా ఉత్తమ కావ్యంగా గుర్తింపు పొంది 1900 సంవత్సరంలో మొదటిసారి ముద్రణకు నోచుకొన్నది.

ఈ ముద్రణ కార్యాన్ని వీరి మిత్రులు కందూరు మల్లికార్జునాచారి నిర్వహించారు. 1915లో గాడిచర్ల హరిసర్వోత్తంగారు దీనిని రెండవసారి ముద్రించారు. 1940లో కట్టమంచి రామలింగారెడ్డి షష్టిపూర్తి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ కార్యదర్శిగానున్న శ్రీ పాతూరి

[9] సాహితీమూర్తి కట్టమంచి:పుట: 21-22

నాగభూషణం,శ్రీగాడిచర్లహరిసర్వోత్తమగార్లచే రెడ్డిగారి షష్టిపూర్తి కానుకగా ముసలమ్మ మరణం కావ్యం తిరిగి ప్రచురింపబడింది. 1943లో పింగళి లక్ష్మీకాంతం గారి ఉపోద్ఘాతంతో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వాల్తేరు వారిచే ఇది నాల్గవ ముద్రణ పొందింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు వారు 1950లో దీన్ని ఇంటర్మీడియేటు విద్యార్థులకు పాఠ్యపుస్తకంగా నిర్ణయించారు.

ప్రపంచమంతా కార్యకారణ బద్ధమని ఒక్క భగవంతుని కరుణారసం తప్ప నిర్హేతుక జాయమాన సిద్ధులు ప్రపంచంలో లేవని వీరు భావిస్తారు[10]. ఈ భావానుసారం వారి ముసలమ్మ మరణంలో కార్యకారణ సంబంధము కనిపిస్తుంది. "***జాతస్య మరణమ్ ధ్రువమ్***" అన్న ఆర్యోక్తి నాటికీ నేటికీ యుగాలకు స్థిరమైన జీవిత సత్యం. కానీ మానవునికి జీవితంలో పుట్టుక అన్నది గొప్ప వేడుకైతే మహాత్ముల విషయంలో మరణమన్నది చరిత్రలో, సాహిత్యంలో చెరగని సత్యమై పదుగురికి మార్గోపదేశమై నిలుస్తుంది. అందుకు కారణం వారు గావించిన త్యాగం. ఆ త్యాగం ముందు తరాలవారికి ఆదర్శం. గొప్పవారి మరణం తరతరాలు చెప్పుకోదగ్గ విషయమౌతుంది. ముసలమ్మ మరణానికి అట్టి విశిష్టత ఆమె కావించిన త్యాగం వల్ల లభించింది. తన ప్రాణ త్యాగంతో వందలాది ప్రజల జీవితాలని రక్షించడం చేత ఆమె కారణజన్మురాలని చెప్పవచ్చు.

ఈ కావ్యం ఆమె మరణంతో అంతమౌతుంది. ఈమె మరణం పరోక్షంగా ప్రజలకు మంగళదాయకమైనది. కావున ఇది మంగళంతో అంతమయ్యే కావ్యమన్న భావన కొందరిలో వుంది[11]. ముసలమ్మ మరణం ఆ కుటుంబానికి విషాదాన్ని, ముక్కుపచ్చలారని పసికందుకు తల్లి వియోగాన్ని కలిగించింది. ఈ రకంగా 'ముసలమ్మ మరణం' విషాదాంతమే. ఇల్లాలు లేని యిల్లు వత్తి లేని దీపం లాంటిది. పామర జనుల నమ్మకాలకు బలియైపోయిన ఆమె జీవితానికి నూరేళ్లు నిండాయి. బలిపశువులా కాక ఆమెను త్యాగమూర్తిగా తీర్చిన ఘనత కవిగా రామలింగారెడ్డిగారికి దక్కింది.

రెడ్డిగారు ఈ కావ్యం రాయడానికి ఆయన వ్యక్తిగత అభిప్రాయం కూడా తోడైందని చెప్పక తప్పదు. స్త్రీలోని సహజంగా గోచరించే అందం కాలాతీతమైంది కాదు. అది కాలాన్ననుసరించి నశిస్తుంది. అంటే స్త్రీ సౌందర్యం శాశ్వతమైనది కాదు. కానీ స్త్రీలోని త్యాగనిరతి మాత్రం శాశ్వతంగా నిలిచి పోతుంది. స్త్రీ సౌందర్యానికి వన్నె తెచ్చేది ఆమె త్యాగ

[10] కట్టమంచిరామలింగారెడ్డి జీవితం-సాహిత్యం:పుట.77

[11] కట్టమంచిరామలింగారెడ్డి జీవితం-సాహిత్యం:పుట.77

గుణం మాత్రమే. స్త్రీ సౌందర్యాన్ని ఆమె త్యాగనిరతి పరంగా అర్థం చేసుకోవాలని ఈ విషయాన్ని ఈ కవిగారు 8–2–1900 నాడు తమ డైరీలో గుప్తపరచుకొన్నారు.

*"I seem to be incapable in my lofty moods of feeling joy at the sight of a beautiful woman. Human beauty I can never enjoy beauty in trees, mountains, birds etc. I do enjoy, why is this? The movement I call to my imagination a most charming picture of a woman my heart asks. Is life a matter of muscles? No doubt her muscles in the different parts are properly developed and she wears a delicate skin. But muscles are muscles and skin is skin. Muscles all over the world are intrinsically the same. They all sweat and emit odour. Cut the most beautiful and the most ugly to pieces and anatomize them. You find all things the same! Thus my heart positively hates human beauty. But it loves moral point of view. The thing is when I am absorbed in the contemplation of moral or spiritual excellence, my mind invests these abstract things with rom and colour of the most ethereal nature and this beauty thrills every fibre of my heart. Humanity means morality, spirituality and nothing more. It was in the spirit. I wrote Musalamma and I may write miran sanjanty etc."*[12]

1900 28 days 8 Thursday [39–326] February ఇందులో *'My creation of Musalamma was from the moral point of view',* అన్న వాక్యం చాలా ముఖ్యమైంది. ఈ వాక్యం రెడ్డిగారి మనస్సును మనకు పట్టి చూపుతుంది. ఈ కథకు మూలమేది చేసిన మార్పు లెట్టివి? ఇందులో ఔచిత్యమేమిటి? అన్న ప్రశ్నలన్నీ ఈ Moral point of view అన్నదానిలో లీనమై పోతాయి. ఆయన రాసింది నైతిక వర్తనకు రూపం కల్పించడానికి, అంతేగాని కావ్య గతి గుణాలన్నీ అందులో పొదగడానికి గాదు. కానీ కొన్ని కావ్యగత గుణాలు వాటంతట అవే అమరి పోవడం కవిగా రెడ్డిగారి కున్న నేర్పువల్ల సంభవించింది. ***"ఆర్యులారా! నేను నిశ్చయముగఁ బండితుడను గాను. మరి పామరుఁడను బాలుఁడను కావున. నిందెవ్వియేని***

---

[12] కట్టమంచిరామలింగారెడ్డి జీవితం-సాహిత్యం:పుట.77

***దోషములన్నఁ జూపి ననుం గృతార్థునిఁజేయ మీరెల్లరుఁ బ్రార్థితులు",***[13] ఇవి సకల జన విధేయుడైన రెడ్డిగారు ఇందలి ముఖపత్రంలో చేర్చిన విన్నప వచనాలు.

మూల కథ దేనిలోనుండితీసుకోన బడిందో? అనంతపుర చరిత్ర 1920లో వావిళ్ళ రామస్వామి శాస్త్రులు ప్రకటించారు. "బ్రౌను దొర సంపాదకత్వం పొంది అనంతపుర చరిత్ర తాటియాకు ప్రతి యుండగా దీనిని ప్రకటించుట జరిగినదని ఈ తాటియాకు ప్రతిలోని మూల వృత్తాంతం రెడ్డిగారు సంగ్రహించి కావ్యరూపం ఇచ్చిరి అని డా॥ మురళీకృష్ణగారు తమ పరిశోధన గ్రంథంలో పేర్కొన్నారు.'ముసలమ్మ మరణం' కావ్యానికి మూలకథను ఆంగ్లం నుండి అనువదింపబడిన దానినుండి రెడ్డిగారు గ్రహించినట్లు లంకా వెంకప్ప శాస్త్రిగారు చెప్పారు.

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌను 1853 Story of Anantapuram తెలుగులో ముద్రించారు. ఆ అనంతపుర చరిత్ర ప్రతి మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ గ్రంథాలయంలో వుంది. ఈ ముద్రితా ముద్రిత ప్రతుల్లోని ఏ కథను మూలంగా గ్రహించినా కథాక్రమంలో పెద్ద మార్పు లేదు. భాషలో ఇసుమంత తేడా గోచరిస్తుందంతే. ఏది గ్రహించారన్న వివాదానికి ఆస్కారం లేకుండా ***"ఒకానొక త్రిలింగ దేశీయునిచే వ్రాయఁబడిన బ్రౌన్ దొరచేఁ బ్రకటితమైన అనంతపుర చరిత్రము అను గ్రంథము నుండి యిందలి కథ గైకొంటిని..."*** [14]అని రెడ్డిగారు కావ్య పీఠికలో స్పష్టంగా రాసుకొన్నారు.

## 1.9.1.1 ముసలమ్మ మరణం మూలకథ:

*"పంపా తీరమందు విద్యానగరమును బుక్కరాయలవారు ఏలుచుండగా, అతని ప్రధానియైన చిక్కప్ప వొడియరు శాలివాహన శకం అను నేటి క్రోధి సంవత్సరమందు నంద్యాల తాలూకాలో దేవరకొండ దగ్గర కంబుగిరి స్వామి కొండలో పుట్టి వస్తూ వుండిన పాండునదిని చూచి దాన్ని దేవరకొండకు అడ్డము కట్టి ఒక తటాక నిర్మాణము చేసి, ఆ తటాకమునకు రెండు మరవల. రెండు గ్రామములు కట్టించి, తూర్పు మరవను వున్న గ్రామమునకు బుక్కరాయ సముద్రమని తమ దొరవారి పేరున్ను, పడమటి మరువను వున్న గ్రామమునకు అనంత సాగరమని తమ దొరసాని పేరున్ను పెట్టి బుక్కరాయ సముద్రమునకు దక్షిణం 16 క్రోసుల మీద యలమంచినాడు తాలూకాలో వరగిరి వేంకటేశ్వర కొండలో ప్రవహిస్తూ వున్న చిత్రావతి*

---

[13] ముసలమ్మ మరణం-ముఖపత్రము:4

[14] ముసలమ్మ మరణం-ముఖపత్రము:4

*నదిని చూచి అచ్చట నున్న మునుపటివలెనే వ్రెక తటాకమును నిర్మాణము చేయించి దానికి వుభయ పార్శ్వముల రెండు గ్రామములు కట్టించి తూర్పు పడమరనవున్న గ్రామమునకు, బుక్కపట్నమనిన్ని, అనంత సాగరమనిన్ని పేర్లుబెట్టి ఆ స్థలమునందే అదృశ్యమై పోయెను.'' ఈ* కథ అంతా చెరువు నిర్మాణం ఎవరి వలన, ఏ విధంగా నిర్మింపబడినదో చెప్పబడే చరిత్రాంశం ఈ కావ్య కథకు మూలకథగా తెలుస్తుంది.

*మరి కొన్నాళ్లకు బుక్కరాయ సముద్రపు చెరువు అధికంగా నిండి, రెండు మరవలు (ఒడ్లు) పట్టక పూర్ణముగా పారుతూ వుండెను. అదియ గాండ్లను పురజనులున్ను వచ్చి చూస్తూవుండగా, వారిలో వ్రెక స్త్రీకి ఆశేశము వచ్చి నేను గంగాభవానిని; నాకు ఆహారము నరబలి యిచ్చిన యిక్కడ నిలుస్తాను; లేనట్టాయెనా నిలువని చెప్పెను. అంతట అక్కడ వున్న గ్రామస్థులు పెద్ద మనుష్యులు బలి నిమిత్తము యోచనచేస్తూ వున్నంతలో, బుక్కరాయ సముద్రములో వున్న బసిరెడ్డి కడగొట్టు యేడో కోడలు యీడేరని ముసలమ్మ అనే చిన్నదాన్ని గంగాదేవి పూని, నీవు బలికావలెనని చెప్పెను. ఆమె అదే ప్రకారము బలికి సిద్ధమై పసుపు, కుంకుమ పెట్టుకొని, వుతికిన చీర కట్టుకొని, నిమ్మ పండ్లు పట్టుకొని యిల్లు వదలి బయలుదేరి కట్టమీదకి వచ్చి మామయైన బసిరెడ్డి కాళ్లకు మొక్కి పురజనులకు నమస్కారము చేసి నాకు గంగాభవాని సెలవు అయినది; నేను బలియైపోతానని చెప్పి మీద గుమ్మడి పడి, ఆ గుమ్మడి లోనికిని కట్టలోనికి పోయి నిలిచినందున ఆ కట్టపై మన్నురాయి వేసిరి. అంతట ఆ కట్ట నిలిచెను.*

*ఆ మరునాడు యీ బలియైపోయిన ముసలమ్మ ఆ గ్రామము స్త్రీ జనము మీద ఆవేశము వచ్చి శిలారూపంగా తన ప్రతిమను చేసి చెట్టు క్రింద పెట్టి కొలవండి అని చెప్పినందున, ఆ ప్రకారము పెట్టి కొలుస్తూ వున్నారు. గానీ, దేవాలయము లేదు. మరిన్ని, ఆ గుమ్మడి (గండి) దగ్గర వచ్చే పోయే జనులు ముసలమ్మా అని పిలిస్తే, ఆమె 'ఓ' అని పలుకుతూ వుండేది. ఇట్లా వుండగా, ఒకనాడు రాత్రి గడ్డికి పొయ్యేవారు అదే ప్రకారము పిలిస్తే పలికెను. అది విని 'చచ్చినా నీ కావరము విడువక పోతివి' అని వారు చెప్పినందున ఆ దినము నుండి పలికేది లేదు, ఆ ముసలమ్మ. అది మొదలుకొని పూజ నడుస్తూ వుంది". బుక్కరాయ సముద్ర అనంతపురముల వంటి గొప్ప గామమ్ములున్ను యీ చెరువుల వంటి గొప్ప చెరువులున్ను యీ యితర స్థలములో యెక్కడా లేవు".*

ఇందులో మరుగుపడ్డ కథ కొంత వుంది. ఈ తటాక నిర్మాణం గావించిన చిక్కప్ప ఒడయరు కారణజన్మునిగా భావింపదగ్గ కథ ఇది. చిక్కప్ప తల్లి మేళమ్మ భర్త వియోగంతో

తిరుగుతూ విజయనగరం చేరింది. పంపా నదీ తీరాన కోదండరామస్వామి కోవెలలో చిక్కప్పని నిద్రపుచ్చి భిక్షాటనకు వెళ్ళింది. సమీప వల్మీకంలోంచి నాగసర్పము వచ్చి చిక్కప్పకు పడగ నీడ నిచ్చింది. 'నాగభోగి' అనే పాములవాడు ఈ విషయం ఆ బిడ్డ తల్లికి చెప్పాడు. ఆమె బుక్కరాయ ఆస్థానంలో పరిచారికగా చేరడం. చిక్కప్ప పెద్దవాడడం జరిగింది.

ఒకనాడు తురుష్కుల దగ్గరనుండి వచ్చిన లేఖను రాజ్యాంగవేత్తలు బుక్కరాయలకు చదివి వినిపించారు. మరునాడు సమాధానము రాయవలసి వుండగా ఆ లేఖ కనిపించలేదు. ఏక సంధాగ్రాహి అయిన చిక్కప్ప ఆ లేఖను వున్నదున్నట్లు వప్పజెప్పారు. ఈ సంఘటన చిక్కప్పను మంత్రిని చేసింది. చిక్కప్ప ప్రజాక్షేమం కోరి తటాక నిర్మాణం గావించారు. చిక్కప్ప ఒడయరు తర్వాత హండే కుటుంబానికి చెందిన హనుగుప్ప నాయుడు పరిపాలించడంతో అనంతపురానికి హండే అనంతపురమనే పేరు ఏర్పడింది. క్రీ.శ. 1343–1379 మధ్యకాలంలో హండే ప్రభువుకు పూర్వం చిక్కప్ప పరిపాలించినట్లు అనంతపురం గెజటీరు వల్ల విదితమౌతుంది[15].

## 1.9.1.2 ముసలమ్మ మరణంలో రెడ్డిగారు చేసిన మార్పులు:

ముసలమ్మ ఈడేరని చిన్నదిగా మూలంలో ఉంటే రెడ్డిగారు ఆమెను కావ్య నాయికగా పసిబిడ్డ తల్లిగా మార్చారు. ఈ మార్పు కథౌచిత్యాన్ని కలిగించేదిగా వుంది. ముసలమ్మ కావ్యంలో ఆమె గుణగణాలు వర్ణించడంలో ఆమెపై ఆరాధనాభావం కలిగేలా చిత్రించారు. ఈ వైశిష్ట్యం మూలంలో లేదు. పసిపిల్ల బలికిష్టపడితే ఆమెను అమాయకురాలిగా భావించి ప్రజలు జాలిపడేవారు. అంతకు మించి మరో భావన వుండదు. జగమెరిగిన బిడ్డ తల్లిగా మార్చడంతో కథను కావ్యంగా మార్చగల అవకాశం పెరిగింది. ముసలమ్మను ఒక పాత్రగా చిత్రించే అవకాశం కల్పించబడింది.

పసిబిడ్డ తల్లిగా ఉండిన ముసలమ్మ చేసిన త్యాగంలో కవి, స్త్రీ యొక్క త్యాగ నిరతిని చిత్రించారు. మాతృప్రేమ వెలలేంది. జంతుజాలాలు సహితం తమ కూనలు తమంతట తాము బ్రతక నేర్చేవరకు అంటి పెట్టుకొని వుండి కాపాడుతాయి. అలాంటిది వెన్నలాంటి హృదయం గల ముసలమ్మ అపురూపమైన భర్తృప్రేమనూ, చిన్నారి పొన్నారి చంటిబిడ్డ అనుబంధాన్నీ ప్రజాక్షేమం కోరి కాలదన్నుకొన్నదని కవి కల్పన.

---

15 Madras District Gazeeteer – Anantapur by W. Francis L.C.S. 1905 – Chapter XV Anantapur Taluk p.143.

మూల కథలో రెండు సార్లు పూనకాలు జరిగాయి. మొదట ఒక స్త్రీకి పూనకం వచ్చి నాకాహారం నరబలి కావాలన్నది. 'బలికి యెవరిని పంపాలా అని పెద్దలు యోచిస్తుండగా తిరిగి ముసలమ్మకే గంగాభవాని పూని నీవే నాకు బలిగావాలన్నది. ఈ పూనకాలకి బదులుగా ఒకేసారి ఆకాశవాణి చేత చెప్పించారు రెడ్డిగారు తన కావ్యంలో.

ఇప్పటికీ జానపదులు ఎల్లమ్మ, మల్లమ్మ, గంగమ్మ, పోలేరమ్మ, కుంకాళమ్మ వంటి గ్రామదేవతారాధనలు జరిపిస్తారు. ఆ సమయంలో దేవి ప్రజలలో భక్తులకు పూని తమ యిష్టాన్ని తీర్చమంటుంది. పూనకమొందినవారు మండే హారతిని మ్రింగేస్తారు. పూనకం దిగిన తర్వాత స్త్రీ గానీ, పురుషుడు గానీ తామొనరించిన అద్భుత కార్యం గుర్తున్నట్లు ప్రవర్తించరు. ఇదంతా నమ్మదగనట్టున్నా హిందూ పూజా సంప్రదాయ సమయంలో దైవ సాక్షాత్కారం పూనకమే. రెడ్డిగారికి ఈ పూనకం నచ్చనట్టున్నది.

పింగళి సూరన యొక్క కళాపూర్ణోదయానికి పిన్న వయస్సులోనే విమర్శ రాశారు. కానీ విదేశాలనుండి స్వదేశం వచ్చాక వావిళ్ళవారు ఆ వ్యాసము ప్రచురించాలని భావించారు. అప్పుడు అది సగానికి సగము శిథిలమైపోయిందని రెడ్డిగారు గమనించారు. అప్పుడు దాన్ని తిరిగి మరలా కొన్ని మార్పులు చేస్తూ రాశారు. అలా మార్పులు చేసిన దాన్ని చూసి తనకు తెలియకుండానే పాశ్చాత్య సంప్రదాయ రీతులు విమర్శలో కొన్ని చోటుచేసుకున్నాయని రెడ్డిగారు 'కవిత్వ తత్త్వవిచారం' పీఠికలో రాశారు. ముసలమ్మ మరణ కావ్యాన్ని కూడా మార్పు చేసి, ముసలమ్మ ఊరిలోని స్వార్థపరుల కల్పనయైన పూనకానికి బలియైనట్టు ఆ ఊరికే ఆణిముత్యం వంటి ఆమె మరణం పశ్చాత్తాపంతో ప్రజావళి కుమిలి ఆమె దివ్యస్మృతికి చిహ్నంగా దేవాలయం నిర్మించినట్టు చూపి వుంటే కావ్యంలో సంఘ సంస్కారాన్ని పురిగొల్పినట్టు అయ్యేది. మూలంలో ముసలమ్మ తనకు తానై పసుపు కుంకుమ, ఉతికిన చీర ధరించి, నిమ్మపండు పట్టుకొని, యిల్లు నుండి బయలుదేరి కట్టమీదికి వచ్చి మామకు మ్రొక్కి పురజనులకు నమస్కారం చేసి గంగాభవాని సెలవైనది నేను బలికి పోతానని చెప్పినది.

రెడ్డిగారి కథానాయిక సంసార స్త్రీ. తానొనరించే కార్యానికి భర్త అనుమతి, అత్తమామల అనుమతి పొందవలసి వుంటుంది. భర్తను ఏనాడు ఏదీ కావాలని కోరని ఇంతిగాను ఆనాడది అడిగినా అది మొదటి కోరికగాను, తుది కోరికగాను చిత్రించారు రెడ్డిగారు. ముసలమ్మ మూల కథలో తానుగా "*ఆ గుమ్మడలోనికి కట్టలోనికి నెర విడిచి యుండగా ఆ నెరగుండా లోనికి పోయి నిలిచినందున ఆ కట్టపైన మన్నురాయి వేసిరి గనుక అంతట ఆ కట్ట నిలిచెను* '' అని రాయబడి వుంది.

సజీవ సమాధి గావించటానికి, అందును తనకై తాను ప్రాణార్పణ గావించె స్త్రీపై మట్టిరాళ్లు వేసి పూడ్చు మానవత్వంగల వాడెవరు ముందు నిలుచు? ప్రజల నెల్లర స్వార్ధపరులుగా చిత్రించ నిచ్చగించక *"... దరహాస మలర మంద మందగతి, బోయి, చొచ్చెనమ్మగువ నీట"* అని ఆమె తనం తటతానే జలప్రవేశం చేసినట్లు మార్చి కవి మానవతావాది అయ్యారు. ***"ముసలమ్మ జలప్రవేశం చేయించుట కవికి, కావ్య ఔన్నత్యానికి భంగము. హిందూ సంప్రదాయ పద్ధతి ననుసరించి భూస్థాపితమూ, ఖననమో చేయవలసి యుండును. నీట మునిగిన స్త్రీ తేలకుండునా? తిరిగి ఆమెకు అగ్ని సంస్కారం జరుపనేల? ఆత్మతో భూస్థాపితము చేయించిన కథే సహజముగా నున్నది"*** [16]అని కటివరపు వేంకటరామయ్య అన్నారు. ముసలమ్మ ఆత్మబలిని గోరిన గంగాభవాని తాను గర్భమున నుంచు కొనక సామాన్య స్త్రీ ఆత్మహత్య గావించుకున్న విధాన తేల్చునా? ఆకాశవాణి పలుకులివి –

**కం. బసిరెడ్డికిఁ గడ గోడలు**
**ముసలమ్మ యనంగనొప్పు పూత చరిత తా**
**వెసబలిగాఁ బోయిన మీ**
**కిసుమంతయుఁ గష్టమెన్నుఁడేలా కలుగున్**[17]

**(ముసలమ్మ మరణం పద్యం.31)**

ఈ విధంగా తానే కోరి పిలిపించుకున్న ఆ తల్లి ముసలమ్మ తేల్చి అప్రతిష్ఠ పాలు గావించునా? తానే స్వయంగా బలి కాబోయిన పడతిని అమానుషంగా భూస్థాపితం గావించ అవసరమేమున్నది? బలిగోరినది గంగ కానీ భూమాత కాదు. నీరు తన సహజ గుణాన్ని చూపి ఆమెను నీట తేల్చితే అశరీరవాణి వాక్కుకు విలువేమున్నది?

రెడ్డిగారు కథనంతా గ్రహించక ముసలమ్మ జలప్రవేశం చేయుటతో కావ్యం అంతమౌతుంది. తర్వాతి కథ రెడ్డిగారికి తెలియదేమో? తెలిసినా వద్దనుకొన్నారేమోనన్న అనుమానం వస్తుంది. *"నా మిత్రులకు నారాయణస్వామి గారి యింట నేనీ పుస్తకమును జదివినప్పుడు వారే తత్గ్రామ సంబంధమైన విషయం జెప్పగా కమితాశ్చర్యమైనది"* అని రెడ్డిగారు రాశారు. రెడ్డిగారి ముసలమ్మ మరణాన్ని ఒక కావ్యంగా భావించి అందులో కావ్యాన్ని కుండవలసిన తళుకులన్నీ చూపడానికి చాలా ప్రయత్నించారు. ఒక రకంగా కావ్యవర్ణనలన్నీ

---

[16] కట్టమంచిరామలింగారెడ్డి జీవితం-సాహిత్యం:పుట.83

[17] ముసలమ్మ మరణం:పుట.9

అందులో ఉన్నాయని చెప్పవచ్చు. దీన్ని పరిశీలించిన సాహితీవేత్తలందరూ దీన్ని కావ్యంగా పరిగణించారు. వర్ణనలు, రసం, నామౌచిత్యం ఇత్యాది విషయాల మీద ఎందరో రాశారు. అందులో కొందరు రెడ్డిగారిని మంచి ఔచిత్యమెరిగిన కవిగానూ, మరి కొందరు కావ్యంలో ఔచిత్యం కొంత దెబ్బతినడంవల్ల రెడ్డిగారికి రావలసిన పేరు రాలేదని, పైగా అది రెడ్డిగారి ప్రథమ గ్రంథం కావడం మెచ్చుకోవలసిన విషయమేనని సమర్థించారు. ఈ కారణాలవల్ల ఈ సిద్ధాంత వ్యాసంలో ముసలమ్మ మరణంలో కావ్యగత విశేషాల చర్చ పూర్తిగా చేయకున్నా ఔచిత్యపరంగా ఆలోచించినపుడు సామాన్యులకు సైతం తూచే కొన్ని విషయాలు మాత్రం పరామర్శించడము రెడ్డిగారు ముసలమ్మ పాత్రని తీర్చిన విధానం చర్చించడము ఆవశ్యకంగా కనిపిస్తున్నాయి.ముసలమ్మ మరణం సృజనాత్మక శక్తితో రాయబడిన స్వతంత్ర కావ్యం. శృంగార రస మిసుమంతయు లేనిది. కరుణ రసాధిక్యం కొరకే కథాకల్పన జరిగినది. కవిస్యకుల సాంఘికాచారాలు, నియమాలు, కుటుంబ వర్తనం ప్రతిబింబించు కావ్యంగా సందర్భోచిత వర్ణనలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చి, తక్కినదానికి కథానుగతంగా కల్పించడం జరిగింది.

కథ నాటకీయతకు రంగరించుకున్నది. భార్యాభర్తల పవిత్ర ప్రేమను, అత్తమామల అనురాగాన్ని, కన్నబిడ్డపై తల్లికుండే మమకారాన్ని, సంఘంలో పల్లె పడతికి ఇరుగు పొరుగుతో వుండే బాంధవ్యాన్ని, జానపదుల సంప్రదాయాన్ని, భక్తిని, నమ్మకాలని, పల్లె పరిసరాలని, వాతావరణాన్ని, భాషని, భావాల్ని, ఆధ్యాత్మిక చింతనని చూపే ఇతివృత్తాన్ని సహజత్వానికి గీటురాయిగా త్యాగానికి ఆధారభూతంగా కథ సాగిపోయింది.

కావ్యారంభము ప్రాచీన సంప్రదాయబద్దంగా శ్రీకారంతో మొదలౌతుంది. కావ్యాంతము ప్రాచీన సాంప్రదాయాన్ననుసరించి విషాదాంతము. మన సంప్రదాయబద్ధమైన ఇష్టదేవతా పూజలు, సుకవిస్తుతి, గణనకెక్కిన కవి పంగవుల, ఇష్ట కవుల మనస్సున స్మరించిన విధానమీ విధంగా వుంది.

**"కవి కులబ్రహ్మఁ దిక్కన గణనజేసి**
**సూరనార్యుని భావంబు సొంపుఁ బొగడి**
**వేమన మహాత్ము సహజ విద్యామయాత్ము**
**మ్రొక్కి, కవన మొనర్పఁ బూనినాఁడ"** [18] **(ముసలమ్మ మరణం పద్యం.10)**

ఇది ప్రబంధ సంప్రదాయం.

[18] ముసలమ్మ మరణం:పుట.3

పల్లె వాతావరణం ముఖ్యంగా పరిసరాలు రెడ్డిగారు వర్ణించిన తీరిది.

**సీ. చెఱకుఁ దోఁటఁల జొచ్చి కొటికి పాడొనరించి**

**దొరలట్ల పోవు పందుల గుణంబు...** (ముసలమ్మ మరణం పద్యం.18)

**ముసలమ్మమరణం కావ్యంలోని వర్ణనలు:**

పై పద్యంలో వీరిలా వర్ణించారు.

**నెంద్రకాయల కొఱ కేతెంచి గుంటిపై**

**మెక్కి కూసెడు గుంట నక్కగములు**

**బుడును బక్కలు గాక కడుపార దిని పంది**

**గున్నలతో రాము గొఱియ పిండుఁ**

**బొలములలేఁ బచ్చికల మేసి బియ్యచే**

**నిగనిగలాడు గోనికరములునుఁ**

**తే. గలకలారావముల మీఱ గలసిజొన్న**

**చేలపై వ్రాలు గువ్వం చెఱువుఁ గలిగి**

**పైరుపచ్చల నొప్పు నాపల్లె... ...** (ముసలమ్మ మరణం పద్యం.18)

ఎంద్రకాయల కోసం వచ్చి గుంటెక్కి కూసే నక్కల గురించి కడుపార తిన్న పంది గున్నలను, పొలాల్లో పచ్చిక మేస్తూవున్న నిగనిగలాడే గోవుల్ని, జొన్నచేలపై రాలు తినే గువ్వలను కవి కర్షక సాంగత్యం గలవాడు గావున పల్లెసీమను పసందుగా వర్ణించారు.

**"మ. చల దుత్తుంగ మహోగ్ర భంగపటలీ సంఘట్టనారావ, ము**

**జ్జ్వల కూలాగ్ర నటత్తరంగ రవ, మంచన్మధ్యభాగ్భూమి భృ**

**త్కుల సంపాతి మహోర్మికానికర నిర్ఘోషంబునుం, గూడఁగా**

**నలరున్ ఘోరసరస్సు దిగ్విదళనవ్యాపారపారీణమై"** (ముసలమ్మమరణం పద్యం.20)

కదలుచు పొడవైన మెరయుచుండు తీరపు చివరలను అడ్డుటచే యేర్పడిన అలల యొక్క శబ్దాన్ని, భీకరమైన అల్ల సమూహం యొక్క పరస్పరం ఢీకొనుటచే ఏర్పడిన శబ్దాన్ని, పర్వత సమూహాల మధ్య ప్రవహించే నది నిండి దిక్కులను బద్దలు కొట్టే పనిలో దట్టంగా నిండి భయంకరంగా చెరువు వున్నట్టు కవి వర్ణించారు. రెడ్డిగారు వర్ణించిన ఈ చెరువు మూడు వందల ఎకరాల వైశాల్యం గలది. పల్లపు భూమిలో పచ్చని పైరుల నిండా బంగారం పండించగల సామర్థ్యము గలది. ఇది పేరునకు బుక్కరాయ సముద్రమైనా, నిజానికి సముద్రం కాదు. కనీసం నదీ గాదు. నిర్ఘోషంబునుం గూడగా అని సముద్ర ఘోషలన్నీ దీనికి ఆపాదించి

భయ విభ్రాంతి సృష్టించారీ కవి. తిక్కన కవిత్వ పుక్కిట బెట్టుకున్న వాడు గాన భాషా పటుత్వాన్ని పరిశీలించదగును. పై పద్యం నన్నయ్య, ఎర్రన పద్యాల్ని పోలివుంది. కావ్యాలు చరిత్రలవలె సత్య నిరూపణలు కావు. అతిశయ రూపాలు జోడించి వుంటాయి. ***"ఈ గ్రంథము రచియించుటకుఁ బూర్వమే నాకీ సంగతులు తెలిసియుండిన నేనచ్చటికి బోయి సర్వమును జూచి ప్రదేశ వర్ణన మిక్కుటముగఁ జేసి యుండును"*** [19]అన్నారు వీరు. ఊహ చిత్రణ గావున కొంత అతిశయం మరోచోట గూడా స్పష్టమౌతుంది.

శాలివాహన శకం 1286లో నిర్మించబడిన ఈ చెరువు అనంతపురానికి పది క్రోసుల 'నంబుగిరి' గ్రామం వద్ద శ్రీ స్వామి కొండల్లో పుట్టి వచ్చే పాండునది, పండమేరు, బుక్కరాయ సముద్రంలోంచి వచ్చి చేరుతుంది. వర్షం బాగా పడే రోజుల్లో చెరువు నిండితే మూడేళ్ళు వర్షాలు కొరవైనా నీటి కొరత లేదావూరికి. ప్రస్తుతం పూడినందువల్ల యే యేటికా యేడు నీరు సరిపోతాయి.

చెరువు నిండి ఎల్లువ గావాలంటె పైనుండి నీటి పారుదల గావాలి. పాండునది దానికి దోహదం చేసిందనో మరో సాకు చూపించక నీటి వురవడికి కుండపోతగా కురిసే వర్షాన్ని వర్ణించారు కవి. నిశ్శబ్దంగా నిలిచివున్న సరస్సుకి అలల వురవడి భీకరాకృతి వర్షపు నీటివలన ఏర్పడుతాయా అన్నది ఊహకందని విషయం.(భావనాశక్తి లోపంగా భావింపదగిన విషయం) కడవల ముంచి వంచిన ప్రకారం మన్ను మిన్ను ఏకమై వర్షం కురియ ఆ వూరి వారందరికి భయమేసింది. ఎప్పుడూ యీలాంటి వాన ఎరిగినవారలం గామని గంగమ్మకు పూజ గావించి పొంగలి పెట్టాలనుకున్నారు. దాని కావలసిన సరంజామా నల్ల కోళ్లను, పొట్టేళ్లను గొని వణికిపోయే చలిగాలినీ, లెక్కజేయక "పోలేరమ్మకుఁ బొంగలో" యనుచు బయలుదేరారు ప్రజలని వర్ణించారు కవి.

పోలేరమ్మకి పొంగళ్ళు పెట్టించే ఆరాటంలో వారు వెళ్ళిన చోటు స్పష్టం చేయలేదు కవి. వారు ప్రార్థించిన విధానం ఇలా వుంది.

**"క. కరిముఖ విశాక చండీ**
**శ్వర భైరవ వీరభద్ర భవ్యకిరీట**
**స్ఫుర దురు మణి గణతేజో**
**భర భాసిత దివ్యపాద పద్మా! కాశీ!" (ముసలమ్మమరణం పద్యం.25)**

అన్ని గ్రామ దేవతల స్వరూపాలను విశ్వశక్తి కాళీమాతగా భావించి పూజించి నారనుకోవచ్చు.

---

[19] ముసలమ్మ మరణం-ముఖపత్రము:4

### 1.9.1.3 ముసలమ్మమరణం కావ్యంలోని పాత్ర చిత్రణ:

ఈ కావ్యంలోని పాత్రలు నాలుగే నాలుగు. ముసలమ్మ, ఆమె భర్త, అత్తమామలు, సామూహిక జనం. ఈ నాలుగు పాత్రలలో ముసలమ్మ బంగారు పాత్ర, అంతకన్న మిన్నగా చెప్పాలంటే నవరత్న ఖచ్చితమైన సువర్ణ పాత్రిక, సజీవమైన, అమరమైన మూర్తి మత్త్వాన్ని పొందిన ఉత్తమ స్త్రీ పాత్ర. కావ్యంలో హృదయ స్పందన కలిగించే పాత్ర ఇదే. ముసలమ్మ రూపవర్ణన చేయక ఆమె నడవడిక చేత గుణాలను కుమ్మరించిన రీతిలో వర్ణించారు.

**సీ. “లేఁగమై నాకుచు లీలమై మెడమలం**

**చినగోవుఁ బింటెడు వనరుహాక్షి” (ముసలమ్మమరణం పద్యం.38)**

లాలించి లేగదూడను మళ్ళించి పాలు పితికే పల్లె పడతిని, బొండు మల్లెల తోటలో పూవులు గోయుచు వనలక్ష్మిని పోలిన ఆయింతిని బీదసాదలనెల్ల నాదరించుచు గడుపారకన్న తల్లి వలె. భోజనం పెట్టే మంచి యిల్లాలు గాను, వ్యాధిగ్రస్తులను వేయికళ్లతో చూచే విను చరితగాను చిత్రించారు. పరాయి బిడ్డలు తమ తల్లుల్ని వదలి ఆమె జంకచేరేవారంట. ఆమె గుణాలను కొంత ప్రజల నోట చెప్పించడంతో తనియక పూని తానే ఆమె ప్రవర్తన నిలా వర్ణించాడీకవి. యేమి ఎరుగని దానివలె నుండు వినయశీలి. ఈమెలాంటి సుగుణాలన్నీ ఒక్కచోట ముప్పిరిగొన్న వేరొక స్త్రీని బ్రహ్మకు కూడా సృష్టించ వీలుగాదేమో అనిపించేటంతటి అద్భుత గుణసంపన్నురాలుగా కవి ముసలమ్మను సృష్టించారు. ఇంతటి త్యాగ గుణ సంపన్నురాలు గావుననే దేవతవలె పవిత్ర స్థానాన్ని అలంకరించింది!

కన్య నుండి స్త్రీ పాత్రగా మార్పులు, కూర్పులు చేకూర్చుటచే దివ్య, నవ్య, శోభాయమానంగా నవ్య శిల్పాన్ని ప్రాణం పోసి నిలిపినారు. అత్తకొంగుఁ బట్టుకొని బిడ్డలాగ తిరుగుతుంటుందని, తనవారు, ఇతరులు అన్న బేధము లేక సర్వజన ప్రతీకరంగా మెలుగుతుందట. హృదయము అప్పుడెత్తు వెన్నలాంటిదట. చిడిముడిగాక ఎన్ని కష్టాలున్నా ఆమె మొఖము చూస్తే జాలు. హృదయతాపంబెల్ల పోయి మనస్సు నిమ్మళించు నట్లుటుందట! ఇంతేగాదు మామపై భక్తి, భర్తమీద మక్కువ, మరదులపై ఆదరణ, ప్రజలయెడల వాత్సల్యం గలిగి మంచితో ఏర్చి కూర్చినట్టు చిత్రించాడు కవి. అవయవ వర్ణన చేయక ఆమె గుణాలు అపురూపంగా వర్ణించారు.

### 1.9.1.4 ముసలమ్మమరణం కావ్యంలోని రస పోషణ

భార్యాభర్తల మధ్య అన్యోన్య దాంపత్యంలో శృంగార రస ప్రాధాన్యత కల్పించవచ్చు. విడిపోయే తరుణంలో అందు శాశ్వతంగా దూరమవుతున్నామని తెలిసినప్పుడు భర్త భార్యని లాలించడం. అక్కున జేర్చుకోవడం, ముద్దివ్వడం వంటి సహజ శృంగారం తిలకింపజేయు ఆస్కారం వుండగా, కావ్యంలో కవి శృంగార రసాన్ని దూరంగా వుంచారు. ఇక్కడ శృంగార రసానికి అన్యాయం జరిగినా, కరుణ రసానికి సంపూర్ణ న్యాయం చేకూర్చారనవచ్చు.

ముసలమ్మ భర్త ఆమెను విడుచునా! అన్న సందేహాన్ని ప్రజలు వెలిబుచ్చునప్పుడు మరికొన్ని సందర్భాలలో ఈ కరుణ రసం యెలా పోషింపబడిందో చూద్దాం.

"చ. **అదియును గాక నీమె మగఁడాత్మ సహోదరుడట్ల మమ్ముఁ జూ**
**చు; దినము తప్పెనేనియును సువ్రత మెన్నడుబాయ; దప్పు డాతడిం**
**కఁ దినమనంబు శోకశిఖ కాఱియ వెట్టగ గుండె చీలఁగా**
**మదికొకటైనఁ దోఁప కతిమానముతో నెకమూలఁ జేరడే?"**

(ముసలమ్మమరణం పద్యం.40)

"చ. **అహరహమున్ దుదుజ్జ్వల కరాబ్జకృతాఖల సౌఖ్యపాలికా**
**సహితుడు, తన్మనోవిభుఁడు, చంద్రముఖిన్ గులకాంతఁ బాసిదు**
**స్సతర దుఃఖహవ్యవహ చండతరోగ్ర శిఖాపరంపరన్**
**బహువిధ బాధలం బొరల, వానిఁ గనుంగొనుటెట్లో యీశ్వరా!"**

(ముసలమ్మమరణం పద్యం.40)

తాను బలిగావాలన్న విషయం తెలిసినపుడా ఇంతి మానసిక వేదన...

గీ. **"మగని నత్తను మామను మఱుఁదుల మఱిఁ**
**గల జనమ్ముల విడిపోఁ గాళ్ళురాక"** (ముసలమ్మమరణం పద్యం.40)

లేనగవును గన్నీరునుగా, గుండె దడదడ కొట్టుకున్నదంట. భర్త యెదుటికి పోవాలంటే ఎండ, వాన ఒకేసారి కురిసినట్టు ఆనంద, దుఃఖాలు ఉక్కిరి బిక్కిరి చేశాయి ఆమెని.

మరొక చోట గీత పద్యంలో ఈ ముదుసలుల చేయూతనేల తీసివేయ మనసొచ్చె తల్లీ! కన్నులు లేని మాకు నూతకోలవై, కొడుకుల కన్న మిన్నగా వుంటివే! అని పరిపరి విధాల ఆ వయోవృద్ధుల దుఃఖం, కరుణరసానికి పుష్టి నిచ్చింది.

తే. **హృదయమున నగ్గలంబగు ప్రీతి మెఱయ**
**దనదు చిన్నారి పొన్నారి తనయుఁ దేర**

**బనిచి కన్నుల నొక క్రొత్త ప్రభ సెలంగఁ**

**జంక నిడికొని ముద్దాడి, జాలిదోఁచ** (ముసలమ్మమరణం పద్యం.93)

అన్నపోర, నీకింక అమ్మ లేదురా. తండ్రితో వుండు తండ్రీ! అని బిడ్డను దీవించింది. నన్ను తలచుకొని నయాన్ని అడగవద్దు. పోయి వస్తా పంపు తల్లీ అంటుంది. ఈ ఘట్టం కరుణ రసంలో పరాకాష్టకి చేరింది బిడ్డని కౌగలించుకొని మూర్ధాఘూణం చేసి అయ్యా బిడ్డ జాగ్రత్తని భర్తకప్పజెప్పునపుడు పట్టరాని దుఃఖమామెలో పెల్లుబుకింది. అతడు గమనిస్తే తిరిగి తనకై విలపిస్తాడని ముఖాన్ని మరోవైపుకి తిప్పుకుంది.

భయానక రసాన్ని గూడా కొంత సృష్టించారనుకున్నాం. రేయింబవళ్ళు కురిసే వానని గాంచగా ఏమి ముంచుకొస్తుందోనన్న భయం ప్రజల్లో దోత్యమైంది.

గీ. **"రక్కసుని మాడ్కి మమ్మెల్ల నొక్కగ్రుక్క**

**గొనఁగ మారి మసంగి నట్టేనసి వచ్చు**

**నీ చెఱువు బారినుండి మమ్మెల్ల నెట్లు**

**శుభముగా నేలుకొందువో చూడవలయు"** (ముసలమ్మమరణం పద్యం.28)

ఈ దిగువ పద్యంలోను భయంతో గూడిన శోకం వ్యక్తమగుతుంది.

క. **"మనమొందు తలంప దైవం**

**బున కామోదంబు లేక పోయెగద! బా**

**విని ద్రవ్వఁ బోవలేచె**

**బెనుభూతం బనెడు మాట విశదంబయ్యెన్"** (ముసలమ్మమరణం పద్యం.33)

శాంత రసాన్ని ముసలమ్మ భర్తలో, కవి కావ్యాంతంలో పోషించాడనవచ్చు. విరక్తితో నిండుకున్న ఈ శాంత రసం, దుఃఖ రసానికి సహోదరిలాగ కావ్యాంతంలో అమరింది. ఊరి ప్రజల్లోను అవ్యక్త వల్ల ఏర్పడ్డ శాంతరసం చోటుచేసుకుంది.

## 1.9.1.4 ముసలమ్మమరణం– నాటకీయత:

కావ్యంలో నాటకీయత, శ్రవ్య కావ్యాన్ని దృశ్య కావ్యంగా దర్శింప జేస్తుంది.

ముసలమ్మ భర్త దగ్గర అనుమతి పొందాలని వచ్చి నిలుచుండ, అతడు 'వచ్చిన కార్యమేమి' అని అడగ్గా –

**"చ.అసమ చరిత్ర! భూమి, జలమందును, నగ్నిని, గాలిలోన నాకస**

**మున, మీకు గోచరము కానివిలే; వయినన్ మదీయమానసమును..."** (ముసలమ్మమరణం పద్యం.46)

నేనే చెప్పితే వినాలని వేడుకగా వుందా మీకు. భార్య మాటలు వినాలని గోరుట భర్తల రీతియేగదా, అని వివరాలన్నీ వివరించి, తన ఉద్దేశాన్ని తెలిపింది.

పిట్ట పిడుగు పడి శ్రవణ రంధ్రాలు స్తంభించినట్టు కాగా ఆమె మాటలకు హృదయము తామరపాకు నందలి జలబిందువులవలె అల్లలలాడగా మూర్ఛపోయి, కళదేరి భగవంతుని తలచుకొని, దీర్ఘ నిశ్వాసపూరితుడై స్థిరత్వాన్ని పొంది –

గీ. **"ఎంత మంచి మాటలు పల్కితేమి చెప్ప!**
**నింత కఠిన చిత్తము నీకు నెట్లాకలిగె?**
**తెలిసి తెలిసి నన్నిట్టుల పలుకఁ దగునే?**
**పడతి! నీవు లేకున్న నే బ్రతుకఁ గలనె?"**

క. **"నినుమాని నిముసమేనియు**
**వనజానన! యుండఁ గలనె? ప్రతిన నెఱపఁగన్**
**జనఁదలఁచి తేని, నన్నున్**
**గొనిపో నీవెంట, నిపుడ కోరికవత్తున్"** (ముసలమ్మమరణం పద్యం.50)

'నన్నూ నీతో తీసుకుపో; లేదా మనల్ని మనము రక్షించుకోవాలంటే యీ ఊరు విడిచి వెళితే మేలు' అంటాడా భర్త. ఆమెకు అతడు రక్షించుకోవాలంటే అంతకు మించి మరో మార్గము కనిపించలేదు. 'నోరు నొప్పి పుట్ట మాటలేల? నన్ను చంపినా నీవు చచ్చుటకు ఆజ్ఞ యివ్వనని' మరోసారి దృఢ నిశ్చయంగా పలికాడా భర్త. ఆమె చింతాక్రాంతయై ప్రాణేశ్వరుని మాటలు వినగా వినగా బాలసూర్యోదయమ్మున విరుగు మంచువోలె నా నిశ్చయం కరికి పోతున్నదని తలంచి కొంత కాఠిన్యాన్ని సమకూర్చుకొని – *"ఎఱిగి యెఱిగి మీరీ విధముగా చెప్పవచ్చా?"* అన్నది. "మిమ్మల్ని అని ప్రయోజన మేముంది? నేను వడిగట్టికొన్న పాపఫలం గుడువకగునే?"అని తన్ను తాను ప్రశ్నించుకున్నట్లు భర్తని ప్రశ్నించింది! తరతరాల నుండి సౌఖ్యాన్ని అనుభవించిన ఈ వాసాల్ని, ముసలి తల్లిదండ్రుల్ని వదలి, నీ ప్రియ సోదరులంతా దుఃఖిస్తూ వుండగా భార్యని గూడిపోతావా? అని మందలించింది. *"నీచమైన యిహలోక సౌఖ్యాల కోరిక మీకు పుట్టడం నాకు అత్యంత అద్భుతంగా వుంది. నేను దైవంగా గెల్చే మీరా ఈ విధాన మాట్లాడేది? నేనిక ఏమి సమాధానం చెప్పగలదానను? నన్ను పోయి రమ్మని పంపు"* అంటుంది. 'పొగరెక్కి మీకు మంచి, చెడులు చెప్పరాలేదు. మీరు కోపించినా నేను చెప్పక తప్పదు' – అన్నది కొంత లాలింపుగా.

అప్పటివరకు విచారవదనంతో భీష్మించుకు కూర్చున్న భర్త ముఖంలో చిరునగవు పొడసూపింది. 'యెన్నడైన నిను ఏ విషయాన్నైనా వారించానా? అన్నాడు. భర్త పట్టుదల కొంత సడలడం చూచి "*తాత ముత్తాతల నుండి సంక్రమించిన ఇల్లు విడవడం భావ్యం కాదు. విడిచినా శుభం జరుగదు. తిండి ఎట్లు? నీళ్ళు ఎట్లు? భూమి ఎవరిస్తారు? అమ్మా భిక్షాం దేహి అని ఇల్లిల్లు అడుక్కు తినగలమా? కష్టాలల్లో పసికందులు చావరా? ఇవన్నీ ఆలోచించావా? అని నిలదీసినట్టు ప్రశ్నించింది*".

చావకుండా మిగిలిన వాళ్ళయినా ఆకు అలములు తింటావా? వారికేల ఈ కష్టాలన్నీ నన్ను పంపండి అన్నీ కుదురుకుంటాయి అంటుంది. 'తినడానికి లేక కట్టడానికి లేక పలు కష్టాలల్లో వుంటే వారిని చూడాలనుకుంటున్నావా? లేక భూమికి భారంగా వున్న నన్ను విడిచిపెట్టదలంతువా? వివేకంతో ఆలోచించి నిర్ణయించుకో అంటుంది. అంతటితో ఆపలేదు. భర్తకు ఆలోచించుకునే సమయమివ్వలేదు. అప్పుడప్పుడే కొంత సుముఖత చూపించే భర్తకు మరికొంత నీతి చెప్పాలనుకొన్నది. నీతులు ఆమెకు వారినుండి లభించినవే. సమయానుకూలంగా వాడుకున్నది.

'తన శక్తి సామర్థ్యం మేరకు, సోదరుల, పురజనుల కష్టాలు తీర్చకపోతే పుట్టనేల నరుఁడు మఱి గిట్టనేల?' అన్నది వేమన పద్యాలల్లోని భావము. ప్రజల్లో నిండా ప్రాకి వుందని అలాంటి నీతులు ఆమె భర్త నుండి గ్రహించిందని కవి పరోక్షంగా తెలిపాడిక్కడు. 'జనుల మేలొనరింపని బ్రతుకెందుకు? కాల్చిన మేలే' అంటుంది. 'మనవారంతా కష్టాలు పడుతుంటే తలయెత్తుకు తిరుగగలమా? మీరు చూస్తూ గౌరవంగా సాగనంపేకన్నా నాకు గొప్ప గౌరవమేముంది? నీ భార్య యిట్టి త్యాగము చేసినదని గొప్పగా చెప్పుకొంటూ వుంటే నీకు మనస్సుకి ఇంపుగాదా!' అంటుంది.

***'జనకుల అన్నల విడవద్దు అన్నవే? ఊరు విడవద్దాన్నావే? భర్తని నీవు విడువవచ్చా?'*** అని తెలివిగల ప్రశ్నవేశాడా భర్త. తిరిగి ఇలా అన్నాడు. "నీవు చెప్పిన దానిలో అసత్యం లేదు. కానీ మనస్సులో నీవు లేని జీవితం తలచుకుంటే ఆరాటం పుడుతుంది". "నువ్వు మాకందరి కన్న నూరు మణుగుల గొప్పదానివని అనుకోగా విన్నాను. నాకూ తెలుసు నీవు నాతోనూ ఇతరులతోనూ పోల్చదగినదానవు గాదు. నీలో యెన్నో సుగుణాలున్నవి. నీకు నేను తగినవాడను గాదు" అన్నాడు.

**సీ. అరుణోదయ చ్ఛాయ లాకాశపథమున**

**నంభోధరముల వేఁటాడు వేశ**

మార్తాండ చండాతపార్తికి ననిలముల్
పొదరిండ్ల గుసగుసల్ పోవువేళ
సాయాహ్న లక్ష్మి కసూయ కలుగ భూమి
తళుకు విరుల చీరఁ దాల్చువేళఁ
బండు వెన్నెల ఱేఁడు కొండపై జలజల
మని పాఱునదిఁ దాన మాడు వేళఁ
తే. గల మనోహరాకృతులెల్లఁ గాంచి నీవు
చెక్కి మ్రొక్కు నిక్కుంగాంచి యొక్కనాడు
మమ్ము మోసపుత్తు వటంచు మదికినప్పు
డపుడు దోఁచు; నయ్యది నిజమయ్యెనేడు" (ముసలమ్మమరణం పద్యం.75)

మానవ మనస్తత్వానికి చక్కగా అద్దం పట్టిన పద్యమిది. ఏదో అదృశ్య శక్తి మానవుడి ముందు జరగబోయే విషయాన్ని చూచాయగా తెలుపుతుంది. అదొక అనుమాన అనుభూతి, ఆ అనుభూతి అనుభవయోగ్యమే గానీ, విన సాధ్యం కాదు. ఆ అనుభూతిని ముసలమ్మ భర్త పొందినట్టు కవి చెప్పారీ పద్యంలో. ఇంకా ఏదో చెప్పాలనుకున్న భర్తను మధ్యలోనే ఆపింది. ఆ వియోగాన్ని ఆమె సహించలేక పోతూవుంది. మనస్సు గట్టిపరచుకొన్నది. లేని కోపాన్ని (మెరుపు తీగతో పోల్చాడు కవి.) మెరుపు వచ్చి పోతున్నట్టుండగా మందహాస కందళిత సుందర వదనార విందమైంది.

'చిన్నప్పటి నుండి మీకు సేవ చేస్తున్నానేగానీ నోరు తెరచి యేమి అడుగవే?' అని మీరెన్నో సార్లు నామీద అలిగినారు గదా! ఇప్పుడు అడుగుతున్నాను. కైకేయికి దశరథ మహారాజు – ఒసగిన వరాల్ని ఉపయోగపెట్టుకొన్నట్టు ముసలమ్మ భర్త ఏనాడో కోరికలడగమన్నమాటను గడుసుగా నేడు గుర్తుచేస్తూ అడిగింది. ఇది చిట్టచివరి అస్త్రం. సామదాన భేద దండోపాయం చేత ఆమె తన కోరిక నెరవేర్చుకుంది. స్త్రీలో వున్న పట్టుదల, తాను అనుకున్నది మంచి గానీ, చెడు గానీ అది ఆఖరికి చావు గానీ సాధించిన ప్రౌఢ ఇల్లాలుగా ఆమెను తీర్చారు కవి. ఈ కావ్యంలో నాటకీయతకు పరిసరాల వర్ణన హావభావ ప్రవర్తన కూడా కొంత జోడించి వుంటే అత్యంత మనోహరంగా తీరేది దృశ్యం. భర్త దగ్గరకు వెళ్ళినప్పుడు కూర్చొని ఉన్నాడా? నిలుచోనా? ముసలమ్మ ఎక్కడ వుండి మాట్లాడింది? అతని కరంబునేఁ గీలించి, పెదవికి లీలనెత్తి, అంతవరకు చేతులు గట్టుకు మాట్లాడిందా? అప్పటి దాకా అక్కడ వారిద్దరే వున్నారు. తర్వాత అత్తమామలచ్చోటికి వచ్చినారు. సోదరులున్నారు తక్కిన కోదండ్ర

మాటేమిటి? వారిని మాట వరుసకన్నా కవి పలకరించలేదే? అది గ్రామము. ముసలమ్మని గంగాభవాని బలిగోరిన వార్త తెలియగానే ఇరుగు పొరుగు ఆమె నిశ్చయాన్ని తెలిసికోను వచ్చి ఏమి మాట్లాడక నిలుచున్నారు, 'అన్నలార! మిమ్ము నడిగెద నొక చిన్నవరముఁ దప్పకుండఁ బడయఁగోరి కాదు గీదటంచు వాదు సేయక, గొప్ప బుద్ధిఁ జేసి యిచ్చి పోవరయ్య' అని ఆమె అడుగ మూగమొద్దులుల్లాగ ఆమెని వారించని ఆ గ్రామ ప్రజల్ని ఎందుకు సృష్టించినట్టు? ముసలమ్మకు బదులు చెప్పి గంగాభవాని ఆగ్రహానికి పాత్రులవుతామన్న సహజ భీతి గలవారై యుండిరేమో! ఆమెకై వారు దుఃఖించినట్టు చూపినారు.

అత్తమామలు దుఃఖించారు. అశక్తులగునపుడు దైవాన్ని నిందించడము పరిపాటి. 'యేటేటా పొంగళుల నైవేద్యము ఆరగించి మాపైనే బండ వేస్తావా? అని ప్రశ్నించారు. 'నీవు లేని యిల్లు యిల్లుగాదది, అడవి తల్లీ' మాకని వారికి ఆమెపై వున్న అభిమానాన్ని ప్రేమని తెలుపుకున్నారు. వారిని వూరడించడము ముసలమ్మ విధి.

'పుట్టీ పుట్టగానే నా తల్లిదండ్రులు పోగా మీరే వారై నన్ను పెంచారు. మీ అందరి శుభం గోరి చేస్తున్నానీపని. ఏమీ శుభం చేయక శరీరాన్ని పెంచి పెంచి యేమి చేసుకోను? పొయ్యిలో వేయనా? నేను అస్తమించినా తక్కిన మీ కోడండ్రు. రాములంటి మీ కొడుకులు ఈ విధంగానే సేవిస్తారు'. అని చెప్పింది. 'నాకు తల్లియు, దండ్రియు, గురువు, దైవము అంతా మీరే. 'మీరే నా ప్రయత్నము నెరవేర నియ్యకున్న, నా మాట ఎక్కడ చెల్లుతుంది? శరీరమంతా పరోపకారానికే అని మీరు నేర్పితిరి గదా! మీరు చెప్పిన రీతినే నేను చేయనున్నా'నన్నది. అత్త దగ్గర, మామ దగ్గర సెలవు పుచ్చుకొన్నది. అత్త మెల్లగా ముద్దు పెట్టుకున్నది. పోయి రమ్మని పల్కినారీ అత్తమామలు. పై విధాన నాటకీయతా గుణాన్ని మనోజ్ఞంగా కవి ఇందులో నెలకొల్పినాడు.

## 1.9.2 నవయామిని:

బిల్హణుడు సంస్కృతంలో రాసిన బిల్హణ చరిత్రలోని కావ్యకన్య శీలానికి మెరుగులు దిద్దుటకై రెడ్డిగారు కథను మార్చి రాసినారు. యామినీ పూర్ణతిలక రాజకుమార్తె యువరాణి ఆమెకు సకల శాస్త్ర విద్యాపారీణత గరుపనెంచినాడు రాజు. పండితుడు, కవియైనట్టి వానిని చూచి నియమించ నెంచగా పండితులు బిల్హణుని పేరు రాజుకి చెప్పిరి. బిల్హణుడు యవ్వనుడు. అందువల్ల రాజు సంశయించి ఉపాయమాలోచించి, యామిని గ్రుడ్డివాడిని గాంచనన్న నియమముండుటచే బిల్హణుడు గ్రుడ్డివాడని చెప్పెను. బిల్హణునికి కుష్టురోగిని చూడనన్న

నియమముండుటచే యామిని కుష్టురోగియని చెప్పి వారిరువురి నడుమ తెరగట్టించిరి. విద్య కొన్నాళ్లు కొనసాగెను.

ఆలోచనలన్నీ సక్రమంగానట్టే రాజు పన్నుగడ పల్టీలు గొట్టిన సందర్భమొకటి జరిగింది. బిల్హణుడు చంద్రోదయ వర్ణన అద్భుతంగా చేయు సందర్భములో యామిని గ్రుడ్డివాడైనను చూచినట్లు ఈ కవి ఎలా వర్ణించ గలుగుతున్నాడన్న అనుమానంతో ఇరువురి మధ్య కట్టబడి వున్న తెర తొలగించింది. పరస్పర వీక్షణానంతరము, వారి శంక తొలగిపోయినది. ఇరువురు మన్మధ బాణ బంధీకృతులయ్యారు. రాజుకీ విషయం తెలిసి కవిని వధింప ఆజ్ఞాపిస్తాడు. అప్పట్లో ధర్మం అరపాదం మీదున్నట్టుంది. తప్పు చేసింది ఇద్దరైనా శిక్ష ఒక్కరికే పడింది. అదీ ఇక్కడ వురి బిగిసేది సామాన్య బ్రాహ్మణుడికి గాదు. పండితుడు, కవి అయిన వానికి కొరత వేసే ముందు బిల్హణుడు పలికిన పలుకులు చారుల ద్వారా విన్న రాజు అతన్ని శిక్షా విముక్తుడ్ని చేస్తాడు.

ఈ కథను నాటక రూపంలో గురజాడ అప్పారావు రాసి అసంపూర్తిగా వదిలేశారు. మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారు సంస్కృత కథ పక్కీలోనే ఈ కథను నాటకంగా శృంగారభరితంగా చిత్రించారు. ఇది గాక కామేశ్వరీ బిల్హణీయమను ప్రబంధ పక్కీ కావ్యమొకటుంది. దీనికి వేదం వేంకటరాయశాస్త్రిగారు తెలుగు తాత్పర్యటీక రాశారు. రెడ్డిగారు తెలుగు కథని మార్చిరో, సంస్కృత కథను మార్చిరో తెలుపుట కష్టం. ఈ విషయం వారెక్కడా చెప్పలేదు. ఖండ కావ్యంగా రూపుదిద్దుకున్న నవయామిని మాత్రము మనకు కనిపిస్తున్నది. రెడ్డిగారు సవరించి రాసిన ఈ కథ సగం నుండే కనిపిస్తుంది. ఈ కథను ఎందరో రాసినా, మార్పు చేసింది వీరొక్కరే. శృంగార రసాభాసయైనా పర్వాలేదు. స్త్రీ పాత్రలోని ఔన్నత్యాన్ని తెల్పాలన్న ధర్మ సంకల్పము రెడ్డిగారిది.

రెడ్డిగారు చేసిన మార్పులవల్ల జరిగిన రసభంగము కన్న కావ్యప్రయోజనము మిన్న. ఇక రెడ్డిగారు ఏ విధంగా మార్పు చేశారో చూడండి. అవివాహితులు, యవ్వనులు గురుశిష్యులుగా ఉండినపుడు వారి మధ్య గల ప్రేమ పవిత్రమైనదైనా సామాన్యులకు నీచము. ధర్మ విరుద్ధము, యామిని సామాన్య స్త్రీ గాదు. రాజ పుత్రిక, అందును సర్వగుణ సంపన్నురాలు తననావిధంగా తీర్చిదిద్దిన గురువే కామలోభంలో పడడము ఓర్వలేక పోయినది ఈ మార్పు రెడ్డిగారిది.

**“సంతసమును విషాదంబు సదమలాత్మ**
**యందుఁ బెనఁగ; నాశ్చర్యంబు వ్యథయు గూర**

నెండయు వానయును మది నిండి పొరలి

నట్లు దీక్ష్ణతయును నశ్రులదరఁ గనుల" (నవయామిని.పద్యం.10)

యామిని తానూహింపని ప్రవర్తన బిల్హణునిలో గాంచినపుడు ఈ హటాత్ పరిణామము వలన గల్గిన పరితాపాన్ని చూపించారు కవి. యామినిలో గురుభక్తియుత ప్రేమని మరో పద్యంలో ఇలా చెప్పారు.

"సంతసించితి, నీ సరస ప్రసంగ

రీతి దిలకించి, కంపించె హృదయ మనఘ;

అద్భుతంబున మునిగె నా యాత్మ; యేమి

యెటుల బదులాడఁ బోలునూ యెఱుఁగ నేర" (నవయామిని.పద్యం.11)

అన్నది. 'కంచు చేనుమేస్తే' అన్న సామెత ఆమెకి స్ఫురించలేదేమో! నయాన చెపుతున్నది గురువులో.

"నీవు మనోజ్ఞమూర్తివి; వి

నిర్మల కీర్తివి, జ్ఞానమందు వి

ద్యా వివంబునందు, బర

మహాద్భుత శక్తివి, నాకు జూడఁగా

దైవముఁ దండ్రియున్, గురువుఁ

దల్లియు నీవ సుఖుండవున్ సదా;

కావున సాహసించితిని

కర్మము ధర్మము పూని తెల్పఁగన్" (నవయామిని.పద్యం.12)

యామిని ప్రార్థనలో గురువుగారి గుణగణాలు అవగతమౌతున్నాయి సర్వగుణ సంపన్నుడైన గురువు అడ్డదారిలో ఆలోచించగా, గురువు బుద్ధి మార్చాలన్న తలంపుతో మొదటే అతని ఉద్దేశాన్ని ప్రతిఘటించక, "నీ పెంచిన బిడ్డ పేరు నేర్తువే చెఱుపన్" అని గురువుకు ప్రశ్నించింది. మోహాంధుడికి ఆ ఒక్క మాటలో కనువిప్పు గలుగదు కదా! కనువిప్పు కలిగేవరకు బుద్ధి గరుపుతూ ఒక్కో ప్రయత్నం చేస్తూ వచ్చింది.

"క్షణికంబు నీ యీ మోహం

బనఘా, నిక్కంబ కా దయని, యెఱుఁగుదు సూ

ర్యపార్శ్వ గ్రహణము కాం

తిని మూయునే? చాలసేపు నిలుకడఁ గనునే?

ఇవి నా నిరాకరణ వా
క్య వికటములు గావు మీ సదాదేశ సుపవి
త్ర వివిధ సూక్తులె ... ... ... ... (నవయామిని.పద్యం.14)

సూక్తులు గుడువబెట్టాక ఇవన్నీ మీరు నాకు నేర్పినవే. నే క్రొత్తగా చెపుతున్నవి గాదు, అని "బుద్ధులు చెప్పి గడ్డి తింటావా అన్నట్లు మెత్తవాటంగా చీవాట్లు పెట్టింది. చివరికి బిల్హణుడిచేత అమ్మా నీవు నా బుద్ధిని వక్రబుద్ధి నుండి మళ్లించావు తల్లీ అని చెప్పించింది. గురువు వలన శిష్యురాలకి అపవిత్రత అంటకుండా ఇరువురు అగుణశీలులు కాకుండా రెడ్డిగారు కాపాడారు. గంగపాలుగాబోతున్న ఇరువురి జీవితాలను సమర్థవంతంగా సరిదిద్దారు.

రెడ్డిగారు కథారంభం నుండి మార్చక మధ్య నుండి ఎందుకు మార్చినట్లు మధ్య నుండే పాత్రల స్వభావాలు బయటపడుతున్నాయి గాబట్టి, రెడ్డిగారు ఆరంభం నుండి గాక మధ్యనుండి కథ మార్చి వుండాలి. కథ ఆరంభం నుండి చివరిదాక అనుచితాలను ఒక్క మార్పుతో అడ్డుకున్నారు.

బిల్హణ చరిత్రలో రాజు తన కూతురికి విద్యాబోధన విషయమై చూపిన అవివేకం రాజ్యపాలనలోను కనిపిస్తున్నది. న్యాయ విచక్షణలోను కనిపిస్తున్నది. ఏ రాజ్యపాలనలోనైనా నేరస్థుడికి న్యాయవిచారణ జరిగాకే కొరత వేయబడుతుంది. కొరత వేసే స్థలం రాజ అంతఃపురం ప్రక్కనే ఉండి ఉండదు గదా! కవి చెప్పిన పద్యాలు తిరిగి రాజుకి వినిపించి రాజు ఆజ్ఞ బడసే వరకు కొరతగాళ్ళు బిల్హణుని మధ్య వుంచుకొని అంతదవ్వు వేచివుంటారా? ఇలాంటివి చరిత్రలో సంభవమూ కాదో యోచన లేక కవి రాజుని రాజ్యపాలనని అజ్ఞానంపాలు గావించారు.

తెలివిగల రాజైతే తన కూతురు అప్రతిష్టపాలు గాని, విధాన న్యాయ విచారణ గావించకుండానే కొరత వేయిస్తాడు, అతి రహస్యంగా. అతి రహస్యంగా చేసే పనికి నిందితుడి చివరి కోరిక తీర్చడం జరుగదు. పద్య స్థానంలో ఇరువై పద్యాలు అందు సంస్కృత శ్లోకాలు వల్లె వేస్తే అవీ యామినీ తిలకని తను కోరుకొన్న విధానం. అవన్నీ గ్రుక్కబట్టి రాజుకి కొరత గ్రాంట్లు వల్లించి చెప్పడం ఎంత ఆశ్చర్యకరం. కొరతగాళ్లు ఏక సంథానగ్రాహులు లేక కవులైనా అయివుండాలి. అదీ అష్టావధానం చేయగల అంత నేర్పుగలవారుగా వుండి వుండాలి. ఇలాంటివి అసంభవాలు. బిల్హణుడి కథలో కల్పనా చాతుర్యం మృగ్యం. రాజు ఎంత త్వరితంగా బిల్హణుడిని తెగ నరకమని ఆజ్ఞాపించాడో అంత యోచన లేకుండానే ఇరువురికి పెండ్లికి ఏర్పాటు గావించాడు. తలార్ల చెవుల్లో బడిన ఈ విషయం ప్రజలకందరికి తెలిసిన ఇక యామినీ

పూర్ణతిలకకు పెండ్లి గాదనా? సమన్వయం లోపించిన ఈ కథ రెడ్డిగారి చేతిలో ఆణిముత్యంలా తయారైనది.కథలో లోపాలు రెడ్డిగారు గుర్తించినవి కొన్ని, గుర్తించో, గుర్తించకో తెలియపరచనివి కొన్ని వున్నాయి.

"ఎంత తెలివిగల రాజుగా నుండినను యువకుఁడైన పండితునికి యువతియైన కుమార్తెకు గురువుగాఁ జేర్చి వారికి ఏకాంత సంఘటనము నిరపాయముగ, నిర్భీతి జరుపునట్లు మర్చియుండునా?" అని రెడ్డిగారు భావించారు. పలుచని తెర అమర్చడము గూడా అర్థము లేని పనిగా రెడ్డిగారు గుర్తించారు. వారిరువురుని తెరకి రెండు వైపులా కూర్చోబెట్టకుంటే కుమార్తెతో పాటు సహపాఠినులుగ బాలికల కొందరిని జేర్చలేకపోయారా? అని రెడ్డిగారికి అనుమానం వచ్చింది.

అలా చేర్చితే యువరాణి కన్న తక్కినవారు విద్యలో అధికులైతే! అన్న కుత్సిత భావము రాజుకి వుండి వుండాలి లేదా కూతురుపై సంపూర్ణ విశ్వాసం గలవాడైనా అయివుండాలి. కూతుర్ని తానెరిగినవాడైనా పండితుని బుద్ధి రాజెరుగడు గదా! బిల్హణ చరిత్రలో రాజు యోచనలు తారుమారయ్యాయి. ఇరువురి నడుమ తెరగట్టినంత మాత్రాన వారి ఆలోచనలకు కట్టలేమన్న యోచన వీరికి తోచలేదు. మనుషులని చూడకుండానే పేరు విన్నంత మాత్రాన్నే ప్రేమించే రోజులు రాజుల కాలం నాటివి. ఏది గుప్తంగా దాచాలనుకుంటామో దానియందు అనురక్తి ఎక్కువ అవుతుంది. ఒకరినొకరు చూడరాదన్న ఆంక్ష ఉన్నప్పుడు ఒకరినొకరు తెలుసుకోవాలన్న ఆతృత పెరుగుతుంది. ఇవన్నీ ఆలోచించలేని వాడంటే అజ్ఞానం అనాలి.

రెడ్డిగారు యామిని వల్లించిన నీతుల చేత బిల్హణుడికి బుద్ధి వచ్చి పశ్చాత్తాప పడేట్టు చేశారు. పాపం తెలివిలేని రాజుని వాని మానానికి వదిలివేశాడు. రాజు పుడకలకి వెళ్ళే సమయమాసన్నమైనది గదా! నాకేల ఈ కాల వ్యయమని తలంచినట్లున్నారు. వదలిన దాన్ని వదిలేసినా చేపట్టిన కథ మార్చెలా చేశారో పరికిద్దాము. పూర్వ కథలో వర్ణనలు కామినీ రూపాన్ని గుర్తు తెచ్చేవిలాగున్నాయి.

**"యలరు యరువలపు మొలకకాయజుని చిలుక కలిత కర్పూర**
**తిలక సుగంధ పలక యామినీ పూర్ణతిలకనీ**
**లాలచ దలక, రాజసముగల్గు శృంగార రసము జిల్కు"**

**సీ. నలినాక్షి గొప్ప కృష్ణత్యంబుఁ బ్రాప్తించు నెమ్మోము విదుర నీతి నిల్వ**
**టెల్లు నాబ్జాక్య కన్నులబ్జోలోక తహించు, నధరంబు మాదవ ఖ్యా**
**తీనమరు, నలవేణి చనుదోయి యభు తత్త్వము గాంచు జేయిప**

ర్మాహిత స్థిత భజంచు, నగకుచ నూగ్రారనంత భూతిఁ జెలుంగ లేకగాను

శ్రీహరి లీలఁదాల్చు

తే. నాభి కమలా కరత్యం బనంగ నెసఁగు!

దనువు హేమాంశు కస్తూర్తి దనరునట్లు

విష్ణు విభావంబు చెలియందు వెలయుచుండు

క్షితి జనంబులు మెచ్చి సన్నుతులు సేయ. [20]

తే ఏఘన రెన వేఁడంచు నీశుభాంగి తనువు బంగారమేమో". పై రీతిని స్త్రీని, పురుషుని వాంఛా ప్రవృత్తికై సృష్టించబడిన ఆకర్షణీయమైన ఆటవస్తువుగా చిత్రించి చిత్రించి దాన్ని పాఠకుడు తిలకించి తిలకించి కవి చూపించే ఆ సౌందర్యంపై అనురక్తి పోయి, విరక్తి పుడుతున్న సందర్భాన స్త్రీ స్వభావంలోని ఔనత్యాన్ని చాటే విధాన యామినిని స్వచ్ఛందమైన ధవళ వస్త్రంగా మార్చుటేగాక నాయకుడు లేని నాయికగా మార్చి కవి తప్పుకున్నారు. సాహిత్యంలో ఆధునికత అనే పురి విప్పిన నెమలి నాట్యమాడినదని చెప్పవచ్చు. ఈ సవరణ కావ్యంవలన.

*"దీనిలో నాకొక్కటే కొరత; వస్తు గౌరవమునకు తగినంత విడివి చాలకపోవుట. సంప్రదాయకమైన విస్తరి భయము కాదు. నేనెఱుగుదును. మీ దృష్టి యంతయు ప్రధాన విషయమైన పాత్ర మనోధర్మమందే కేంద్రీకృతమైనది కానీ ప్రాచీన పద్ధతిలో నడిచిన నావంటి వానికి కథానాయకీనాయకు పూర్వోత్తరములు యింక కొంత చేర్చఁబడి యుంటెనేనని రసానుభవము సులభముగా నుండి యుండెడిది"[21].* ఈ అభిప్రాయాన్ని రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు, రెడ్డిగారికి తన అభిప్రాయంగా రాసిన ఉత్తరంలో రాశారు.

యామినీ పూర్ణతిలకని బిల్హణుడికిచ్చి వివాహం చేస్తే ఎందుకు సమంజసం గాదు అన్న ప్రశ్న వస్తుంది. యామినీ పూర్ణతిలక రాజుగారి ఏకైక కుమార్తెగా కనిపిస్తుంది. రాజుకి మరో మగ సంతానమున్నట్టు కాన్పించదు. యువరాజుని వివాహమాడినవాడే రాజు కావలసి వుండును గదా! రాజార్హత క్షత్రియులకే వున్నదని కట్టమంచి వారి భావన కాకపోవచ్చు. బ్రాహ్మణ వరునికి రాజకుమార్తెను కట్టబెట్టుటా లేదా అన్న భావన వీరిలో వుండి వుండదు. కవులంతా బ్రాహ్మణులే కానక్కరలేదని వీరి అభిప్రాయం. ఈ పద్ధతిలో ఆలోచిస్తే విశాల హృదయంతో ఆలోచించే వీరు కులతత్వానికి ప్రాధాన్యత యిచ్చి వుండరు.

[20] సి.ఆర్.రెడ్డి.జీవితం-రచనల పరిచయం:పుట.98

[21] సి.ఆర్.రెడ్డి.జీవితం-రచనల పరిచయం:పుట.99

ఆనాటి సాంఘిక పరిస్థితులు దృష్టిలో నుంచుకొని మార్పు గావించి వుంటారు. రాజుకి భుజబలము ప్రధనం. బిల్హణుడు బుద్ధి బలంగల సర్వ శాస్త్ర పారంగతుడే గానీ శస్త్రాస్త్ర విలువిద్యలు బడసిన వాడుగాదు. అందువలననే దేశశ్రేయస్సు దృష్టితో రెడ్డిగారు నాయకీనాయకులకు వివాహం చేయలేదు. పట్టమహిషి కాబోయే యామినీకి శీలం ప్రధానం. యామినీని పూర్తిగా మార్చి నవయామిని చేశారు రెడ్డిగారు.

యామిని విద్యాభ్యాస సమయంలో రెడ్డిగారు సహితం చెలికత్తెలను, సహ పాఠకులను సృష్టించలేరు. మనము తరచు చూచే ప్రబంధాలలో కావ్యాలలో, చెలికత్తెలు స్నేహితురాండ్రున్నా, ప్రేమ వ్యవహార సమయానికి తప్పుకుంటారు. మరికొందరు చెలికత్తెలు తమ చెలి ప్రేమ ఫలవంతమయ్యే విధానాలని వెతుకుతారు అందుకే రెడ్డిగారు చెలికత్తెల ప్రసక్తి తలపెట్టలేదనిపిస్తుంది.

ఈ ఖండ కావ్యాన్ని సంపూర్ణంగా చదివాక రెడ్డిగారు చేసిన ఈ మార్పు సమంజసమైనదిగా కనిపిస్తుంది. సహృదయుల కెందరికో ఆనందప్రాయమైనది. ***"తమరంపిన 'నవయామిని'ని వందనములతో నందుకొంటిని. చదివి మిగుల నానందించితిని. దీని వలన నాంధ్ర భాషయందలి యొక యసత్కావ్య పఠనము నుండి విద్యార్థులు విముఖులగుటయు, భారత నారీమణుల యదార్థ ధర్మమును గ్రహించుటయుఁ జరుగఁ గలదు.*** [22]అని కపిలేశ్వరము జమీందారు అన్నారు.

తారాశశాంక విజయాది ప్రబంధములపట్లఁ గూడ నెట్టి ఖండ కావ్యము లవసరములని తలంచెదను అని కపిలేశ్వరము జమీందారు రెడ్డిగారికి 16–10–1947లో తెలియపర్చారు. దీనిని బట్టి కొందరీ కావ్యానికి ఆమోదముద్ర ఇచ్చినట్లు అర్థమౌతుంది.

## 1.9.3 కట్టమంచి పద్య రచనలు:

కట్టమంచి రామలింగారెడ్డిగారు ముసలమ్మ మరణం నవయామిని గాక మరికొన్ని పద్యాలు రాశారు. వీనిలో అర్థశాస్త్రం – అంకిత పద్యాలు ఆత్మ గతం అన్న పేరుతో పదకొండు పద్యాలున్నాయి. రెడ్డిగారు భగ్నప్రేమికుడిగా ప్రియ సఖిని మరువలేక ఆమె మరుపురాక రాసుకున్న పద్యాలనిపిస్తాయి. ఈ పద్యాలలో ఆరాధన, వైరాగ్యం, తాను ప్రేమించిన స్త్రీ దూరమైనందుకు వగపు అగుపిస్తుంది.

[22] సి.ఆర్.రెడ్డి.జీవితం-రచనల పరిచయం:పుట.100

సీ.    తన కీర్తి భువనభోంతరముల నిరసించి
చిఱునవ్వులై తన్నె చేరి కొలువఁ
దన భావనా ప్రభల్ ఘన వీధి గర్జించి
కలికి చూడ్కుల మెఱుంగులు
దన మనోహరత చంద్ర జ్యోత్నలకుఁ బోక
నడకల సొగసులో నడగి యాడ ...

(భారతఅర్థశాస్త్రము:పద్యం.2)

ఆమెలోని మార్దవము చిగుళ్లను పువ్వులను దొంగిలించినట్లుందు, ఆమె పలుకులు తీపితో గలసివున్నట్లు ఆత్మలాగై దేహం. దేహంలాగే ఆత్మ సుగుణాలన్నీ అవతార మెత్తాయా అన్నట్టుంటుందట. "కమల మొకటియ నీదు ముగ్ధతకు సాటి అవడంతో ఆమె మీద రెడ్డిగారి కున్న నిసర్గప్రేమ కనిపిస్తుంది.

కవిత్వ తత్త్వ విచారం పీఠిక కొన్ని పద్యాలు రాస్తూ 1913లో ఈ విమర్శ రాయగలగడానికి శక్తిని తన చిన్ననాట తండ్రి నాటిన విమర్శనా జ్ఞానమే కారణమని మొదట పద్యంలో చెప్పి, కవిత్వ విద్య నెఱుగ తనకి శక్యమైన పనిగాదని పఠితలు ఆలోచించగలరన్న సంకల్పంతో రాసిందే గానీ ఇది మంచిది, ఇది చెడ్డదని నిర్ణయము చేయ నేనెవ్వడను, సిద్ధాంతాలు నాకక్కరలేదు. పాఠకులు ఆదరిస్తే చాలన్న అభిప్రాయాన్ని ఆ పద్యాల్లో వీరు వ్యక్తం చేశారు. ఇందులోని ఆరు పద్యాల భావమింతే.[23]

## 1.9.3.1 అంపకాలు:

1919లో తన పెంపుడు కుమార్తె సంజతమ్మను కంటే మిన్నగా పెంచుకొన్నారట. ప్రేమ, కూర్మి, సరసత, ముద్దు విలాసాలు దినదినమ్ము క్రొత్త వెలుగులు చిందించిన ఆ కూతుర్ని తల్చుకుంటూ, ఎంతో ప్రేమామృతాన్ని చవి జూపిన ఆమె లేక నా బ్రతుకు శూన్యమైపోయినది గదా! అని వాపోయారు. ప్రాణం మామెవెంట గొనిపోవగా తాను ప్రాణంలేని జడంలా మిగిలానని దుఃఖించారు. ఆమెకు శాంతి సౌఖ్యాలు గలగాలని అందరి తండ్రులవలె దీవించారు.

[23] కవిత్వతత్వ విచారము:పుట.4

'నీ సుఖమే నా సుఖము. నీ దుఃఖమే నాకు నరకం' అని చెపుతూ "నన్ను మరవకమ్మా అన్నారు. తన బిడ్డ క్షేమం కోరి మహాత్ములను, దేవతలను పరిపరి విధాల వేడారు.[24]

### 1.9.3.2 భారత ప్రశంస:

1919లో రాసిన ఆరు పద్యాలల్లో, భాషా కన్యను చేపట్టి ఆనందాన్ని పొందుతానని ఆమె యేనాడు తన చేయి విడువదని నమ్మారు.

భారతాన్ని, శైలిలో, వృత్తంతో, ఆలోచనల్లో మహాద్భుత పాత్రల ప్రదర్శనలో, భూలోకంలో మొదటి పుస్తకం అని ప్రశంసించారు.[25]

### 1.9.3.3 ప్రాస్తావిక పద్యావళి:

వీరు 1900 సంవత్సరంలో విద్యార్థి దశలో రాసిన కొన్ని పద్యాలు 1983లో ప్రాస్తావిక పద్యావళి అన్న శీర్షికలో ముద్రణకు నోచుకున్నాయి. ఇందులో పార్వతీస్తుతి, సూర్యోదయ, ప్రకృతి వర్ణనలున్నాయి. [26]

గీ. **తిరిగి తిరిగి నం జూచుచు, తిరిగి చూచు**
**వేళ, చిరునవ్వులలరించి, వ్రేసి చిటికె,**
**లాస గొని వెంబడించు నన్నులత బెట్టి**
**యెచ్చటనో జొచ్చితివి యింకనెట్లు చెపుమ**
**యెండమావుల వెనుకాడ నేగినాడ**
**హరిణ పోతము నిక్కు వీనుల ...**

పై పద్యం శాకుంతలంలోని జాతస్యబే ప్రణయవాన్మృగ తృష్టికాయామ్ అన్న శ్లోకాన్ని పోలి వుండి.

మ. **పగ్గముల్సడలింప ముందరి ప్రక్కలన్నిగి డింప సొం**
**పగ లింపఁగజా జామరాగ్రము లాడనీక కరంబుపై**
**కొగ్గి వీనులఁ దాము లేపుచునున్న దాళుల దాఁటన్**
**కిగ్గుటాలు మృగస్య దాక్షమ హెచ్చెనో యనఁ బాఱెడిన్**

---

[24] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–48.

[25] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–50

[26] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–67

శ్రీరామ దుర్గ నరసయ్య శాస్త్రి విరచితమైన శాకుంతలంలోను రెడ్డిగారు వ్యక్తం చేసిన భావం అగుపిస్తున్నది.

**గీ. జడుని భంగి నున్మత్తుని వడువు దనర**
**మూగపోలిక నుండెడు యోగులెల్ల**
**దైవమెత్తిన వారలో? దయ్యమెత్తి**
**నట్టి వారలో చెప్పుమా? మిట్టిపడక**[27]

జ్ఞాత తత్త్వోపి లోకస్య జడోన్మత్త పిచాచ యత్ ... అన్న ధన్యాలోకనం – లోచనంలోని శ్లోకానికి పోలిక కనిపిస్తున్నది.

**"బుద్ధి వెనుకకు జిత్తంబు ముందునకును**
**బోవు భిన్నత శాంతిఁ గోల్పోయి; తగును**
**దగద యను నిలుకడ లేమి దాల్మి వొలియ**
**గోరరాదని తెలిసియుఁ గోరినాడ"**[28]

పై పద్యం శాకుంతలంలోని "గచ్చతి పురశ్శరీరం ధామతి పశ్యాద సంస్తుతం చేతః" అన్న శ్లోకాన్ని పోలి వుందనవచ్చు.

**గీ. బూడిదెను బోలు మేఘముల్ పువ్వుబోడి**
**యాకసమ్మున రయమున నరుగుఁ జూడు**[29]

ఈ పద్యానికి క్రింది కాళిదాసు రఘువంశ శ్లోకానికి సంబంధం కనిపిస్తున్నది. (రఘువంశ నాల్గవ సర్గ)

**రజోభిః స్యన్దనోద్ధూ తైర్గజైశ్చఘన సన్నిభైః**
**భువస్తల మివవ్యోమ కుర్వన్ వ్యోమేవ భూతలమ్**

విజయయాత్ర యందు తేరులచే రేగిన దుమారం జగతి నిండుటచే ఆకాశం భూతలంవలె అగపడెను; వన్నెయందును, వ్యాపారమందును, పరిణామం అందును మేఘముల వంటివైన యేనుగులు అంతటను వ్యాపించుచుండుటచే భూతలము ఆకాశమువలె అగపడెను. (వేదం వేంకటరాయ శాస్త్రి టీకా తాత్పర్యం).

[27] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–69

[28] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–57

[29] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–77

గీ. ఏకవర్ణ సంయుక్త మహీధరాంబు
ధరము లల్లదె గదియు విధమును జూడు
కొండలన్నియు దామల్ల గుప్పగంతు
లిడుచు నెగయుచు దిగుచుండునేమో? నాథ![30]

ప్రకృతిని ఎవరికో తిలకింపజేయడం, భావంలో పోలికలు గమనిస్తే రెడ్డిగారు సుప్రసిద్ధ కవుల భావాలను మననం చేస్తున్నారా అనిపిస్తుంది. భావనాలోకంలో విహరించే కవుల మనస్సులు అతి సమీపంగా పయనిస్తాయేమో అని అనిపించగల పద్యాలు రెండు చాటువులుగా రెడ్డిగారు చెప్పినవి గమనించదగినవి.

క. గంగా సైకత భూముల
సంగర హితుఁడగుచు నుండ జను, లేదా సా
రంగాక్షీ స్వర్ణాంచిత
తుంగ కు చాగ్రముల నొప్పుఁ దొలగక యుండన్[31]

రెడ్డిగారి పై పద్యం భర్తృహరి పద్యాన్ని పోలి వుంది.

మాత్సర్య ముత్సార్య విచార్యకార్య
మార్యాః సమర్యాద మిదం వ దన్తు
సేవ్యాని తమ్యాః కి ముభూధ రాణా
యుత స్మరస్మేర విలాసనీనామ్[32]

పెద్దలు నిర్మత్సరంగా ఆలోచించి కొండ నెత్తములందు తపమాచరించుట మేలో, రమణీరమణుల పొందుల నానందించుట మేలో న్యాయముగా తీర్మానింతురు గాక.

సీ. మిన్నిందు కొండల మేఘముల్ మేపుట
విడిచి విచ్చలవిడి వెడలుదారిఁ ...[33]

అనే సీస పద్యంలోని భావం శాకుంతలం మొదటి సర్గలోని ఈ పద్యానికి పోలివుంది.

గ్రీవాభంగాభి రామం మహురను పతతిస్యం దనే బద్ధదృష్టి
పశ్చర్థెన ప్రవిష్ట శ్శర పతనభ యాద్భూయ సాపూర్యకాయామ్

---

[30] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–77

[31] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–79

[32] భర్తృహరి శృంగార శతకం పద్యం – 36.

[33] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–73

**దర్భైర ర్థావలీ ఢ్రైశ్రమ వివృత ముఖ భ్రంశభిః కీణన్ వర్త్మ!**

**పశ్యాదగ్ర ప్లుతాత్వాద్వియతి బహుతరం స్తోక ముర్వాం ప్రయాతిః**

**ద్వి. పట్టపరీక్ష నాపాలిటదయ్య**

**మెట్ట యెదుట నిల్చెనేమి చెప్పుదును?**

**పుస్తకం బొకటైనఁ ముగియలేదనుచు**

**హస్తంబునన్ దాల్చి, హా! యత్నమంద**

**తన మనమ్మున నున్న తరుణినిం దలచి**

**కనుల నీరొలకించుకై కొంచునంత**[34]

ఈ పద్యం జగన్నాథుని రసగంగాధరంలోని –

**సర్వేపి విస్మృతి పథం విషయాః ప్రయతా**

**విద్యాపి ఖేద కలితా విముఖీ బభూవ**

**సాకేవలం హరిణ శాబక లోచనామే**

**నై వా పయతి హృదయాదధి దేవతేవ**

ఇతర విషయాలను, విద్యను, సర్వమును మరచి, సర్వ విషయాలపై విముఖత్వం పెంచుకొన్నా లేడి కనులు గలిగిన ఆమెను మాత్రం మరువలేకున్నాను అన్న భావానికి రెడ్డిగారి భావానికి పోలిక వుంది.

## 1.9.3.4 దయ్యంబు దైవంబున:

అన్న శీర్షిక క్రింద ఈ రకపు వర్ణన వుంది. పొగ గప్పిన పూవుబోలు నధరముతో మనస్సు చింతజెంది, దేనిపైనా ధ్యాస నిలుపనీక బూడిద కప్పిన శరీరంవలె చేతిలో నొసలు అప్పుడప్పుడు తుడుస్తూ దయ్యం బట్టినవాడో, దైవం బట్టినవాడో తెలియకుండా వుందట. ఈ పద్యం తర్వాత మరో పద్యంలో దైవ ధ్యాసలో వున్న ఋషి వర్ణన గావిస్తూ దైవపూజ చేసే ఋషులు సహితం దయ్యం పట్టిన వారిలాగే వుంటారన్న భావన చేశారు. చీకి పొదలాగా వున్న జుట్టు ఎంతో వూడలులాగా భూమి యడుగువరకు ప్రాకి, చేతుల కాళ్ళగోళ్లు పొడవుగా పెరిగిపోయి, కట్టెలాగున్న కాళ్లతో నడవరాక, కూర్చున్న చోటునుండి లేవలేక, దేవుడు కనులిచ్చినా అవి తెరువక, అన్నం నీరు లేక జీవంలేని వానివలె పిచ్చివానిలాగ మౌనం

---

[34] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–71

వహించిన యోగిపుంగవులంతా దైవము పట్టినవారా? దయ్యం పట్టిన వారా? అన్న ప్రశ్న ఈ పద్యాలలో కనిపించే హేతువాదం. ఈ ఆధునికమైన ఊహ ఎంతో సమంజసంగా వుంది.

**క.** **ఒకపరి సుజనుల మనములు**
**వికసించిన గనునె మోడ్పు వేయేండ్లైనన్?**
**ఒకపరి విరిసిన మల్లియ**
**ముకుళించునె? మఱియు విరియు మోదంబు గతిన్** [35]

వేమన పద్యాలను పోలిన ఇలాంటి పద్యాలు అనేకం ప్రాస్తావిక పద్యాలల్లో అగుపిస్తున్నాయి.

**సీ.** **చిన్ని వెన్నెలల నెచ్చెలియైన లేసిగ్గు**
**కన్నుదమ్ముల నించుక ముకుళింప**
**నల్లని మబ్బు తున్కల వెల్గు చంద్ర బిం**
**బముఁ బోలు మొగము కొంచెముగ వంచి**
**చల్ల మంచులు మెల్ల మెల్లగా మెత్తని**
**జిగురుటాకుల సెజ్జఁ జేరునట్లు**
**కలలోన నడచిన గతిని చప్పుడు లేక**
**చెలువంబుతో నన్ను జేరి పిలిచి**
**యేలకో పల్క నోటి ముత్యాలు రాలు**
**నట్టులుండెడు ప్రియరూపు నలరి చూచి**
**డాయ భయపడి వెనుకకుఁ దీయలేక**
**యుయ్యేలయుఁ బోలెఁ గొంత సేపుండి యుండి** [36]

ప్రబంధ శైలిలో గనిపించే ఈ పద్యం భావకవుల ధోరణిలో అతి రమ్యంగా నడిచింది.

**సీ.** **"... బాలభానుడు ముద్దుఁ బచరింప మంచు బిం**
**దువులు సిగ్గున లేచి తొలగు మాడ్కి**
**ప్రత్యుషః ప్రకటిత ప్రభలచే చంద్రికా**
**తతు లంతకంతకు తఱుగు మాడ్కి**
**భ్రమరంబు రాలిన వరవల్లి సూనమ్ము**
**నన్ మరందములు గానని విధమున**

---

[35] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–69

[36] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–71

(రాత్రి కాలంబను రాకాసి కౌగిలి" ...

వెన్నరీతి గరుగు వెలుతురనగ – అధికపాదము).[37]

పై పద్యంలో ప్రకృతి వర్ణనకి పద్యపాదాలు చాలక అధికపాదం రచించారు రెడ్డిగారు. వారికి ప్రకృతిపై వున్న ఆపేక్ష అట్టిదని చెప్పక తప్పదు. అతి రమ్యంగా ప్రకృతిని, పరిసరాలని, వెన్నెలని వృక్షాలను సౌందర్యపేతంగా వర్ణించారు.

క. **గాలుల యాలింగన వా**
**చాలత్వంబునను లజ్జ సందడి గొనగా**
**లోలత జెక్కులు నెఱ్ఱన**
**గ్రాలంగ గులాబియును మొగంబును వంచెన్**[38]

ఈ పద్యంలోని సుకుమార భావం సుందరంగా అమరినది. మలయానిలయాలని ప్రబంధాలలో తరచు వర్ణిస్తున్నా ఈ కింది పద్యంలోని మలయానిలయాలు తరుణ తురు చ్చాయలతో మచ్చికగా సంచరించే తీరు మధుర భావాన్ని కలిగిస్తున్నది. దీని సొగసుకు కారణం మృదుపదాల వాడుక.

క. **వచ్చిన మలయానిలయములు**
**మచ్చిక సుకుమార సూనమాలాలసిత**
**స్వచ్ఛంద జనిత తరుణత**
**రుచ్చాయల సంచరించె రుతము లలరన్**[39]

**1.9.3.5.మారుతికి వినతి**: ఈ శీర్షిక పద్యాలల్లో హనుమంతుని స్తుతితో పాటు తనను రక్షించమని వేడుకోలు, పవనకుమారుని ఘనత వర్ణించబడినాయి. ఈ పద్యాలను బట్టి హనుమంతుడు వీరి ఇష్ట దైవంగా భావించవచ్చు.[40]

---

[37] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–72

[38] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–73

[39] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–73

[40] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–75

### 1.9.3.6. నవ వధువుకు – శుభాశీస్సులు:

ఈ శీర్షికలో 1910లో వీరి తమ్ముడు కృష్ణారెడ్డి వివాహ సందర్భంలో నవవధువుకు (మరదలు తిరుమలమ్మ) శుభాశీస్సులు అందిస్తూ కొన్ని పద్యాలు రాశారు. వరుని గుణాలు ఆమెకు రెడ్డిగారు తెల్పిన విధమిది.

**క. వరుఁ, డురు సుగుణాకరుఁ డు**
**ద్దుర విద్య విభవ శోభితుఁడు, కరుణా సం**
**భరితాత్ముడు, ధర్మశ్రీ**
**పరుఁడరులకు నైన మెచ్చవలసిన వాఁడున్**[41]

**క. నయ వినయ ధైర్య గాంభీ**
**ర్య యశో విభ్రాజితుండు, నస్మత్ప్రాణ**
**ప్రియ సఖుఁడునైన కృష్ణుండు**
**ప్రియుఁడఁట నీకేమి కొదవ వికచాబ్జముఖీ**[42]

అని అంటూ రెడ్డిగారు వధూవరుల నుద్దేశించి, యే భేదాభిప్రాయం లేక పాలు, నీరు కలసిన విధంగా రుక్మిణీ కృష్ణులవలె, శివపార్వతులవలె జీవించమని దీవించారు. **"క. పదమును నర్థమును బలె"** అనే పద్యం **"వాగర్థా వివ సపృక్తౌ..."** అనే రఘు వంశంలోని మొదటి శ్లోకాన్ని పోలి వుంది. ఇతర పద్య రచనలు అన్న గ్రంథంలో చివర మూడవ అనుబంధానికి సుజాత అన్న శీర్షిక యివ్వబడింది. ఈ సుజాత, రెడ్డిగారి తమ్ముని కుమార్తె. ఆమె పెండ్లి 1933లో జరిగింది. ఆ సందర్భంలో రాసిన మూడు పద్యాలిందున్నాయి. కుమార్తె యందు అతనికి గల ప్రీతి గుణగణాలు వర్ణించబడినాయి.

మిగిలిన రెండు అనుబంధాలలో మొదటిదానిలో పద్యాలు రకరకాల భావాలు కలగాపులగంగా చాటువుల వలె వున్నవి. రెండవ అనుబంధంలో పార్వతీస్తోత్రం, మరికొన్ని ప్రార్థనలున్నాయి. బాగా పరిశీలిస్తే ఇవన్నీ రెడ్డిగారు రాసుకున్న చాటు పద్యాలనిపిస్తాయి. ఈ పద్యంలో రెడ్డిగారి కవిత హృదయం వెనుక దాగిన హాస్యం ద్యోతకమౌతుంది.

**సీ. కిచ్చిలి పండ్లకు నెచ్చెలిగా నుండు**
**మమ్మా యరటిపండ్ల నందుకొమ్మ**
**అమ్మ యంతయు నీ పొట్టకగునే నీదు**

---

[41] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–81

[42] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–81

**మగడు శివునికి నొకపాలు మంగళాంబ..."**

అని రెడ్డిగారి కవితా వైభవాన్ని తెలిపే కొన్ని పద్యాలు.

**సీ. ఆకాశ మండలం బను వార్ధిలోనుండు**
**మేఘంబునా నొక్క మీను తలప**
**అది విహారార్థమై యటు నిటు దిరుగుచు**
**పై భాగమునకును వచ్చె తలప**
**అవ్వేళ నద్దాని యద్దంబులన్ బోలు**
**పొలుసులను కిరణములు పడియెను**
**కానకేగదు మిత్ర కంఠ దేశంబును**
**చిన్నచిన్నవిగను చెలుగుచుండు**
**దేహముపై బోను దేదీప్యమానమై**
**పెద్దపెద్దవిగాను వెలుగుచుండు**
**కాన నీ మాటలన్నియు గట్టిపెట్టి**
**వినుము పోవుదామయ్య**
**యాలకింపుము పోవుదామయ్య...**[43]

ఆకాశమండలమును వార్ధిగాను, మేఘలను చేపలు గాను ఉపేక్షించి హృద్యముగా వర్ణించినారు. చివర ఎత్తు గీతలో పోవుదామయ్య అన్న మాటలుండటం వలన ఈ పద్యం మిత్రులతో విహరిస్తూ ఆశువుగా చెప్పినట్లుంది.

పార్వతిని స్తుతిస్తూ రెడ్డిగారు రాసిన పద్యాలల్లో 'కం. కరిముఖ విశాఖచండీ' అన్న పద్యంలో సంస్కృత పదాడంబరం కనిపిస్తున్నది.

**కం. అమ్మా! నిన్నటి దినమున**
**నిమ్ముగ శ్రీవాణి నెంచియే నిప్పుడు మే**
**లమ్ముచ మీపద తామర**
**సమ్ముల గొలువంగ వచ్చి సరసిజనేత్రీ!**[44]

ఈ పద్యంలో తెలుగు పదాల సొంపు చూడదగినట్టున్నది.

---

[43] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–79

[44] ముసలమ్మ మరణం,ఇత్యాది పద్యరచనలు: పుట–79

**1.9.4 0. రెడ్డిగారి వ్యాస సంపుటి– పంచమి:**

ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారిచే 1954లో ముద్రితమైన ఈ గ్రంథంలో కట్టమంచి రామలింగారెడ్డిగారు రాసిన ఐదు వ్యాసాలున్నాయి. 1) రంగనాథ రామాయణము, 2) ప్రాచీనములు – వికృతులు, 3) ద్రౌపది–సీత, 4) అవాల్మీకము–కలుంబదు, గోన బుద్ధుడు, 5) భాసుడు అన్న విషయాలపై తనకున్న అభిప్రాయాలను ప్రతిపాదించే భావాలను సోపపత్తికంగా వివరించడానికి ప్రయత్నించారు.

**1.9.4.1.రంగనాథ రామాయణ కర్తృత్వం:**

1933లో రామలింగారెడ్డిగారికి రంగనాథ రామాయణాన్ని పరిష్కరించి ప్రజాముఖంగా తేవాలన్న తలంపు పుట్టింది. బాధ్యతాయుతంగాను, శక్తివంతంగాను, సమర్థవంతంగాను నిర్వహించ గలిగిన వేటూరి ప్రభాకర శాస్త్రిగారిపై నీ బాధ్యత మోపబడింది. పుస్తకం ముద్రణాలయంలో రూపుదిద్దుకుంటూ వుండగా ప్రభాకర శాస్త్రి నుండి వారు పీఠిక కోసం రాసుకొన్న నోట్సు తెప్పించుకొని చూచారు. మొదట ముద్రణ సమయంలో రాయబడిన కొన్ని అంశాలు రెండవసారి రాసిన దానిలో కనిపించని కారణం ఏమని ప్రశ్నించారు. ప్రభాకర శాస్త్రి అణారోగ్యంగా ఉన్నందున పింగళి లక్ష్మీకాంతం గారిని గ్రంథకర్తృత్వం చేయమన్నారు. ***"ఈ గ్రంథమునకు విపులమైన పీఠిక రాయవలయునని సంకల్పముండెను. కానీ నా యిప్పటి అనారోగ్యకతమున నా కార్యభారము పింగళి లక్ష్మీకాంతమున కప్పగించితిని. భాషయందును, నా యందును గల అభిమానముచే నతడీ భారమును వహించుట కంగీకరించి యెంతో చక్కగా నిర్వహించెను. అతడు పీఠికా స్వరూపమును గూర్చి నాతో బెక్కు మారులు సంప్రదించి మొత్తంమీద నా యభిప్రాయానుసారము గాఁదన పరేంగిత జ్ఞాన శక్తికిని, స్వీయాభిప్రాయమునకు దీటుగా దానినిం రచించెను. కానీ, ఒక వ్యక్తి యింకొక వ్యక్తిని సంపూర్ణముగా బ్రతిబింబింపజేయుట యసాధ్యమైన యోగము. కొన్ని చిల్లర విషయములలో వ్యత్యాసములుండుటయు ననివార్యము ఆగుటచే నాకు గల్గిన మీమాంసలను అనుబంధ పీఠికలో దిక్ ప్రదనముగా నా గ్రంథమునందే ప్రకటించితిని.[45]*** వానిని గూర్చి విపులమైన రాయవలయుననెడి సంకల్పము నేడు కార్యరూపము దాల్చినందులకు సంతసించుచున్నాను", అని రెడ్డిగారు అను బంధ పీఠికలో చెప్పడాన్ని బట్టి తన ఉద్దేశాలను పింగళి లక్ష్మీకాంతం గారి

[45] డా:సి.ఆర్.రెడ్డి పీఠికలు:పుట.124

రాతల ద్వారా పాఠక లోకానికి తెలియజేసినట్టు అర్థమౌతుంది. అంతటితో తృప్తిచెందక తిరిగి తానే పీఠిక రాయుటకు పూనుకున్నారు. అదే అనుబంధ పీఠికగా వెలసినది.

గోనబుద్ధ భూవిడు రాజని, పుట్టుకచే రెడ్డి కులజులని తెలుపుతూ, గోన బుద్ధారెడ్డి తండ్రి ఆజ్ఞమేరకు ఈ రచన తిక్కన కన్నా ముందే ఈ రామాయణాన్ని రచించి వుండి వుండాలని అందువల్లనే తిక్కన పూర్వకాండలని రచింపక ఉత్తరకాండని చేపట్టారని తిక్కనకు పూర్వికుడో సమకాలికుడో కావచ్చున్న అభిప్రాయం వరకు పింగళి లక్ష్మీకాంతంగారు సమర్థించి వదిలేశారు. *"రంగనాథ రామాయణము గోన బుద్ధారెడ్డి కృతం దీనికి బ్రమాణ మా గ్రంథము. అవతారిక యందు నా శ్వాసాంతములందు గోనబుద్ధుడు రాసినట్లు ప్రత్యక్ష ప్రమాణములు గలవు. అవి యొకటియు, రెండును గావు. రాయవలెనన్నచో నొక యాశ్వాస గ్రంథమగును"* క్లుప్తముగా నిట జూపుదును అని రెడ్డిగారు ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. *"బుద్ధభూవిభుని తండ్రియగు విట్టల ధరణిపాలుడు "రామత్రయోదారణ విశారదుడే..."* కాక బహు కావ్యనాటక ప్రౌఢమానసు" డనియు బేరెన్నిక గాంచినవాడు. ఆత్మభుజస్థాపితావని పాలనయండెంత దిట్టయో, భారత రామాయణాది రసగోష్ఠి "యందంట", "రసిక శేఖరుడు" కావుననే రామాయణ కథావృత్తా స్వాదనం సాహిత్యపరులకే గాక ప్రజాసామాన్యమునకును అందుబాటులో నుండవలయునను తలంపుగలవాడై రమణీయమైన దెనుగున రామాయణంబు" రాయింప బూని, యట్టి "కావ్యశక్తిగల కవులెవరున్నారని ప్రశ్నింపగా

**నీతనాజన్ముండు నిపుణమనసుఁడు ...**
**పురుష చింతామణి బద్ధాహ్వముండు ...**
**పాకజ్ఞడత్యంత పాండిత్య ఘనుఁడు ...**
**రామాయణ మర్మమాతండ యెఱుగు**
**అతని బంపు మీకథ చెప్ప"** (పంచమి, పుట–14)

యని సభాసదులు తెలుప తండ్రి తన కొమరుని వైపు జూచుట –

**"భూమి గవీంద్రులు బుధులును మెచ్చ**
**రామాయణంబు పురాణ మార్గమున**
**దప్పక నాపేర దగ నంధ్ర భాష**
**జెప్పి ప్రఖ్యాతంబు సేయింపు ము** (పంచమి, పుట–15)

అని పలుకుట "అత్యంత పాండిత్య" గరిమగల గోనబుద్ధుడు తండ్రి యానతి మేరకు వాల్మీకి రామాయణం తాను తెనుగు ద్విపదలో రాయడం జరిగిందని రెడ్డిగారు స్పష్టీకరించి సందేహ విముక్తి గావించారు. యాశ్వాసాంత ద్విపద పద్యంలో ఈ విధంగా వుందని చూపుతూ

**"అని యంధ్ర భాష భాషాధీశనిభుఁడు**
**వినుత కావ్యాగమ విమల మానసుఁడు**
**పాలితా చారు డపార దీశరధి**
**బూలోకనిధి గోనబుద్ధ భూవిభుఁడు**
**తమ తండ్రి విట్టల ధరణీసు పేరఁ**
**గమనీయ తర ధైర్య కనకాద్రి పేర** (పంచమి, పుట–15)
**రసికమై చెలువొందు రామాయణమున**
**బరగనలంకార భావములు నిండ**
**గరమొప్పనీకాండంబు చెప్పె"**

***"గోనబుద్ధుడు శూద్రుడు; వ్రాసిన గ్రంథము రమణీయమైనది, హిందూ సంఘంలో జాతి, మతాది వైషమ్య జనిత భావములచే బ్రాహ్మణేతర కవులకు అన్యాయం కల్పింపఁ బడెనా న్యూనత చేకూర్చఁ బడెనా యనుట నిష్పక్షపాత బుద్ధితో విచారింపనగును"*** [46]అని రెడ్డిగారి ప్రశ్న.

"ధరణీసుదుడు..." అనే పద్యంలో అప్పకవి కావ్య రచనకు జన్మ విరోధం కల్పించినాడని, ఎక్కువ జాతివాడు తక్కువ జాతి వానిని స్తుతింపరాదన్న భావనని, పాల్కురికి సోమనాథ కవి స్తుతి పొందకపోవడానికి కారణం గానించిన తీరును, మరికొందరు విమర్శకులు విమర్శించారు.

### 1.9.4.2 ప్రాచీనములు – వికృతములు:

అన్న వ్యాసంలో భారత, భాగవతాలలో కొన్ని ఘట్టాల తారతమ్యాన్ని వెలికి తీసి వాటిని పాఠక లోకానికి అందించుటే గాక అనుచితాన్ని తర్కబద్ధంగా విమర్శించారు.

ఉదా: భారతం ప్రకారం – విదురుడు ధృతరాష్ట్రుని మరణమునకు ముందే యోగమార్గాన శరీరం త్యాగం చేసి ధర్మరాజునందు లీనమగును. (వారిరువురు యయాంశ సంభూతులవడంవల్ల).

---

[46] పంచమి, పుట–21

భాగవతం ప్రకారం ధృతరాష్ట్ర నిర్యాణము "చూపబడిన విదురుఁడు చింతా సంతాప మొదవ బ్రీత స్వాంతుండై తీర్థములకు జనియె". విదురునికి మరణప్రాప్తియైనది ప్రభాస తీర్థమున. సంతాపము చేతఁ బ్రీతస్వాంతులగుట మహాత్ముల లక్షణము కాఁబోలు.[47]

హరివంశంలో కృష్ణజన్మకు, భాగవతంలోని కృష్ణజన్మకి గల భిన్నత్వాన్ని ఒక్కో అంశాన్ని సూక్ష్మంగా పరిశీలించి పాఠకునికి తెలియపరచారు. హరివంశం ప్రకారం దేవకి చెఱసాలలో బంధింపబడినట్లు లేదు. ఒక్క ఇంటనే యుండి కంసుడు వారిని గమనించుటకై వేగులవారిని నియమించినట్టున్నది. భాగవతం ప్రకారం కారాగృహంలో వుండి అన్ని బిడ్డలను మృగాలైనా కనవట. ఇంక మానవులెట్లు కనిరో! హరివంశం గాథే సమంజసమైనదిగా కనిపిస్తుందన్నదన, రెడ్డిగారి తర్కబద్ధమైన ఆలోచన[48].

భారతం ద్వాపరాంతమునకు చెందిన గాథ. భాగవతం వేయి నూరేళ్లు తర్వాతి రచన. భాగవతారుల చేతులలో పడి కథ నికృష్టతను పొందినదని వీరు భావించారు. హరివంశంలో కృష్ణలీలలు ఔచిత్య శోభితంగా వున్నదంటూ రెడ్డిగారు రెండింటిలో నున్న విధానం వెల్లడి చేశారు. వెన్నపాలు, పెరుగు నెవరికి దెలియకుండా సంగ్రహించుట. దూడలను ఆవుల చెంత వదలుట, పసిబాలుర పోకిరి పనులు హరివంశంలో కనిపిస్తుండగా భాగవతంలో కృష్ణలీలలు శృతిమించి వున్నవని కొన్ని పద్యాలుదహరించారు.

క. **"వెన్నదనగ బొడగని మా**
**పిన్నది యడ్డంబు వచ్చి పిఱిఁదికిఁదివియన్**
**జన్నోడిసి పట్టి చీరెను**
**జిన్నికుమారుండె యతఁడు శీతాఁశుముఖీ?"** పంచమి, పుట–43)

క. **"కొడుకులు లేరని యొక సతి**
**కడు వగవఁగ, దన్ను మగనిగాఁ గైకొనినం**
**గొడుగులు గలిగెదరని పైఁ**
**బడినాఁడిది వినుము శిశువు పనులే తల్లీ"** (పంచమి, పుట–44)

పై విధంగా యశోదమ్మతో శ్రీకృష్ణుని ఆగడాలు వివరించి చివరగా –

**"ఓ యమ్మ నీ కుమారుడు**
**మా యిండ్లను బాలు పెరుగు మననీడమ్మా?**

---

[47] పంచమి, పుట–33

[48] పంచమి, పుట–36

పోయెద మెక్కడికైనను

మాయన్నల సురభులార మంజులవాణీ!" (పంచమి, పుట–46)

అని మొరపెట్టుకుంటారు. దానికి రెడ్డిగారిలా విమర్శించారు. తుదకు నీయమ్మ లక్కలకు పాలుపెరుగుపై నుండు నభిమానం కూతుండ్రయు, కోడండ్రయు సౌశీల్యమందు లేదాయెగా! అప్సరోంశ సంభూతులు కాబట్టి పాతివ్రత్యం కంటే పాలే ముఖ్యమేమో! అని విమర్శించారు.

హరివంశం, భాగవతం, వర్ణనలు మన ముందుంచి యోగ్యా, అయోగ్యాల విచక్షణ పాఠకులమైన మనకు వదిలేశారు రెడ్డిగారు.

## 1.9.4.3 ద్రౌపది – సీత:

భారతంలో రెడ్డిగారు అమితంగా నచ్చిన ఏకైక స్త్రీ పాత్ర ద్రౌపది. భాగవతం ప్రథమ స్కంధంలో 337 పుటలలో "ద్రుపదరాజ పుత్రియుఁ బతులవలన నుపేక్షితయై" అన్న విషయం గాంచి రెడ్డిగారికొకింత ఆశ్చర్యం గలిగి ద్రౌపది ఎక్కడా పతులచేత ఉపేక్షింపబడలేదు. మీదు మిక్కిలి గౌరవింపబడినది అని తెలియజేయడానికి ఈ వ్యాసం రాశారు.

ఈ వ్యాసాన్ని రెడ్డిగారు నాలుగు భాగాలుగా వివరించారు. మొదటి భాగంలో ద్రౌపదిపై పాండవుల గౌరవాభిమానాలు తెలియజేశారు. అరణ్య పర్వంలో గంధమాధన పర్వతానికి పోవునపుడు నడవరేక మూర్ఛిల్లిన ఆమెను భర్తలు మోసిన ఉదంతం, సౌగంధిక కమలం ద్రౌపది తెమ్మనినప్పుడు, భీముడు, ధర్మరాజు ఆజ్ఞబడయకయే భార్య కోరిక ఆజ్ఞగా భావించి వెళ్ళడం, మరెన్నో సందర్భాలలో ద్రౌపది తన పతులను సహితం లెక్కచేయక తన ఆత్మగౌరవాన్ని కాపాడుకొన్న సందర్భాలు వివరించారు రెడ్డిగారు.

## 1.9.4.4. ద్రౌపది తన్ను గుఱించి చెప్పుకొన్న ప్రకారం:

అన్న వ్యాసం రాస్తూ ద్రౌపది శ్రీకృష్ణుని సఖిగా ఆమె తెలియజెప్పిన సందర్భం, సత్యద్రౌపదుల సంవాదం ద్రౌపది తన భర్తకై గాక శ్రీకృష్ణుడు ఆమెకు అండగా నిల్చిన సందర్భాలు చెప్పుకున్న విషయం రెడ్డిగారు గుర్తుచేశారు. ఆడబిడ్డని, అత్తగార్ని తలచుకొని సైంధవుడిని చంపవద్దని భీముడికి ఆజ్ఞాపించిన విషయం చెప్పి సుభద్ర కంటె శ్రీకృష్ణుడికి ద్రౌపదంటె ప్రీతియని రెడ్డిగారు తెలిపినారు.

కుంతికి ద్రౌపది మీదుండే ప్రేమ గౌరవాలు ఒక వ్యాసంగా రాశారు. కుంతి ద్రౌపదిని సుభద్ర కంటే మిన్నగా జూచే విషయం ఉదహరించారు. అత్తగారి మనస్సు ఆకట్టుకున్న

కోడలుగా ద్రౌపదిని పరిచయం చేశారు రెడ్డిగారు. సీత, ద్రౌపది అన్న విషయంలో చివరగా మహాసాధ్వీమ తల్లిగా పేర్గాంచిన సీతాదేవి గుణగణాలతోను, వ్యక్తిత్వంతోను, ద్రౌపదిని పోల్చి సీతాదేవి కన్న మిన్నయైనదిగా వీరు రాశారు. ఆమెను పాండవులు ఎక్కడా ఉపేక్షించలేదు. పై పెచ్చు గౌరవించారు. ఆరాధించారు. అది వారి జీవిత పరమార్థం అని రెడ్డిగారు సమర్థించారు. ద్రౌపదిని రాయలసీమవాసులు దేవతగా కొలుస్తారు. రెడ్డిగారికి ద్రౌపది పాత్రపై ఆరాధ్యభావం వుందని నొక్కిచెప్పే నాలుగు భాగాల వ్యాసమిది.

### 1.9.4.5 అవాల్మీకము:

రామాయణాలన్నింటిలో వాల్మీకి రామాయణం ప్రాచీనమైనది. వాల్మీకి తరువాత ఎందరో రామాయణాన్ని రాశారు. కంబడు, గోన బుద్ధుడు రాసిన రామాయణంలోని అంశాలు వాల్మీకి రామాయణంలో లేకపోవడం గమనించి వాటినెత్తి చూపారు. వాల్మీకి రామాయణంలో లేని కొన్ని కథలు మైరావణ చరిత్ర, శతకంఠ రావణ చరిత్ర, సహస్రకంఠ రావణ చరిత్రలు, సీతాదేవి అగ్నిప్రవేశం చేయుట ఇత్యాది కథలు తర్వాత పుట్టినవి అని వీరు స్పష్టం చేశారు. కంబ రామాయణంలో సీతను రావణాసురుడు నేలతోపాటు పెల్లగించి కొనిపోవును. ప్రాతివత్య ధర్మాన్ని ఉద్ధరించాలన్న ఉద్దేశ్యంతో సీత రావణుని అంటితే ఆమె ఎడల మనకి పవిత్ర భావం నశిస్తుందన్న భావనతో కల్పించిన కల్పన. గడ్డపాఱతో గుంత త్రవ్వినంతవరకు ఆమె అక్కడే నిలిచియుండునా అని రెడ్డిగారు సంశయపడినారు. ***"ఆమె యొక్క శుచిత్వము చెడలేదనుట నిజమైన క్షాత్రగుణ ప్రకాశితంబులైన వీర యుగములందలి స్త్రీలకు నెట్టి సందర్భములందు బలాత్కార ప్రజనిత దోషములంటినట్లును, తద్వారా వారి కులముగాని, గౌరవముగాని చెడినట్టును ఎక్కడను లేదు. దుశ్శాసనుడు ద్రౌపదిని ఏకవస్త్రను రజస్వలను దలపెట్టి యీడ్చుకొని వచ్చి సభలో విగత వస్త్ర గావించినను, ఆమెను సైంధవుడు బలాత్కారముగా బట్టుకొని రథముపై నిడుకొని పోయినను, కీచకుడు వీధి మధ్యమున నందర యెదుట క్రిందబడునట్లు చేసినను ఆమెపై మనకు అసహ్య భావము ఉదయించదు గదా!"*** [49] అని రెడ్డిగారు ప్రశ్నించారు. రాముడు మాంసాహారి కానట్టు చూపడం, బ్రాహ్మణేతరులు సహితం శాఖాహారులుగ చెప్పడం ఇదంతయు వాల్మీకములోనివని తెలిపారు.

"ఈ కథలో ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగపాశము గానీ, బ్రహ్మాస్త్రము గాని రాముని బంధింపలేదు. ఎట్లు బంధించును ఆయన దేవుడు గదా? దేవుని దేవిగారు తప్ప నింకెవ్వరు

---

[49] పంచమి, పుట–82

బంధింప గలరని" హాస్యపూరిత చమత్కారంగా విషయాన్ని విశదీకరిస్తూ వచ్చారు. గోన బుద్ధ రామాయణంలో గూడ ఎన్నో మార్పులున్నవి. గోన బుద్ధుడు పెద్ద పండితుడు గాడని జనులలో వ్యాపించియున్న కథల నుండి రామాయణాన్ని రచించాడని అందుకే అవాల్మీకాలు ఎన్నో యిందులో కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. వాల్మీకంలో కైక దశరథుని నుండి రెండు వరాలు పొందింది. ఇందులో ఒక్క వరమని ఉన్నది. దశరథుడు పుత్రకామేష్టి వలన గాక సాధారణంగానే బిడ్డలగన్నాడు. వాల్మీకి శత్రుఘ్నుని గుణముల గూర్చి యెచ్చట గాని ప్రస్తావించలేదు. కంబ రామాయణంలో శత్రుఘ్నుని మిక్కిలి కొనియాడెనని, కథలో గర్భితమైన భేదాలనెన్నో రెడ్డిగారు పరిశీలించి విడమరచారు.

### 1.9.4.6 భాసుడు:

ఈ వ్యాసంలో రామాయణ, భారతాదులలో గల కథలు భాసుని నాటకంలో ఎలాంటి మార్పు చెందాయో రెడ్డిగారు వివరించారు. ఈ వ్యాసంలో రాయబడిన విషయాలను బట్టి రెడ్డిగారు రామాయణ, భారత, భాగవతాలకు సంబంధించిన పలువురి రచనలు ఆమూలాగ్రంగా పఠించారన్న విషయం అవగతమౌతుంది. భాసుని నాటకంలో భారతంలో లేనివి ఎన్నో విషయాలు కల్పించబడ్డాయి. భాసుడు నాటకానికి అనుగుణంగా మార్పులు చేసి వుంటారని ఈ విధంగా సమర్థించారు. "పురాణాలలో సామాన్యంగా కన్పించే పాత్రలను మంచివిగా మార్చడం, వస్తు సన్నివేశానికి తగిన సందర్భ శుద్ధిని కలిగించడం వల్ల భాసుని నాటకాలు మార్పులతో కనిపిస్తున్నాయన్నారు" పై అయిదు వ్యాసాల్లో రెడ్డిగారు నిశిత పరిశీలన ద్వారా పాఠకునికి సత్య దర్శనం గావించారు.

## 1.9.5 కవిత్వ తత్త్వ విచారం(1914)

1899లో మద్రాసు క్రైస్తవ కళాశాల విద్యార్థి దశలోనే వీరు కళాపూర్ణోదయ విమర్శ రాశారు. ఆంధ్ర భాషాభిరంజనీ సమాజంలో వ్యాసాన్ని చదివారు. వీరి మిత్రులు మొండ్రేటి బాపనయ్య ప్రోత్సాహంతో ఈ విమర్శ రాశారు. ఈ వ్యాసం చదివినప్పుడు, చిలకమర్తి లక్ష్మీనరసింహం వంటి పండితుల మన్ననలని పొందింది, రెడ్డిగారిని వారు ప్రశంసిస్తూ తమ కృతులను బహూకరించారు. శ్రీ వేదం వేంకటరాయ శాస్త్రులవారు అత్యుక్తి దోషాల సవరించుకోమని సలహా ఇచ్చారు. 1899 నాటికే ఈ వ్యాసం పలువురి మన్ననలందుకొన్నది కానీ, ముద్రణలోకి రాలేదు.. రెడ్డిగారు ఇంగ్లాండు నుండి తిరిగి వచ్చిన తరుణంలో వావిళ్లవారి

కోరికతో రాయబడిన ఈ గ్రంథంలో రెడ్డిగారికి తెలియకయే ఎన్నో మార్పులు పొందినట్టు రెడ్డిగారు ఆ గ్రంథ పీఠికలో తెలియజేశారు.

కవిత్వ తత్త్వ విచారంలో ఈ విమర్శనా వ్యాసాంగం మూడు భాగాలుగా విభజించబడింది. **మొదటి ప్రకరణంలో** ఆదికవుల గుణదోషాలు, గద్యానికి, పద్యానికి గల బేధాలు, భావనాశక్తిని గూర్చి చెపుతూ వేమన సహజ కవిత్వ లక్షణాలు వివరించారు. అనవసర అలంకారముల వలన కథ కుంటుపడుతుందని భావమన్నది కవిలో లోపించినపుడే అలంకారాల సంఖ్య పెరుగుతుందన్న భావాన్ని వీరు వెల్లడి చేశారు. పాత్రలన్నీ ఒకే రకమైన గుణాలు గల్గివుండక విలక్షణ వ్యక్తిత్వాలను గల్గివుండాలని, అప్పుడే పాత్రలు సజీవంగా వుంటాయని అభిప్రాయపడ్డారు. కావ్యాలలో వర్ణనల గూర్చి ప్రస్తావిస్తూ వర్ణనలు సహజంగా సందర్భ శుద్ధి గలిగివుండాలని, శృతిమించిన వర్ణనలు కథను కుంటుపరుస్తాయన్నారు. అధిక వర్ణనల వలన కాలయాపనే గానీ, ప్రయోజనం లేదని వివరించారు.

**రెండవ ప్రకరణంలో** పూర్వ ప్రబంధాలను వివరిస్తూ వసుచరిత్ర ననుసరించి వచ్చిన తక్కిన ప్రబంధాలను పిల్ల వసుచరిత్రలని పిలవవచ్చునని వాటిలోని లక్షణాలను చూపిస్తూ, వ్యంగ్యంగా చమత్కారంగా విమర్శించారు. ప్రబంధాలలో నాటకీయత లోపించి ఒకే మూసలో పోసిన బొమ్మల తీరు గావడానికి ఆనాటి సాంఘిక కారణాలని పేర్కొన్నారు.

**మూడవ ప్రకరణంలో** కళాపూర్ణోదయ రచనలో కనిపించే ప్రతిభ శైలి ప్రభావతీ ప్రద్యుమ్నంలో ఏ విధంగా పరాకాష్ఠను చేరినదో వివరించారు. ప్రభావతీ ప్రద్యుమ్నంలో సూరన కవిత ప్రౌఢిమ విశదపరిచారు. ప్రబంధాలలోని కచకుచాది శృంగార వర్ణనలకు కారణం మన సంస్కార హీనతేనని అభిప్రాయపడ్డారు. విమర్శకుడు పాలు త్రాగి నీరు పరిహరించు హంసవంటి వాడుగాదు. మంచి చెడుల సమన్వయాన్ని బేరీజు వేసే న్యాయాధినేత వంటివాడు. సాహిత్య విమర్శకుడు కవికానక్కరలేదు. కానీ రెడ్డిగాదు కవి విమర్శకుడు కావడంతో విమర్శ క్రొత్త పంథాలో నడిచింది. ప్రతిభ, ప్రాచీన గ్రంథ పరిజ్ఞానం, విషయ విపులీకరణ సామర్థ్యం, సహృదయత, నిశితబుద్ధి, సద్వివేచన ఈ సద్విమర్శకునిలో పుష్కలంగా గలవని ఈ విమర్శ నా గ్రంథం ఋజువు చేస్తున్నట్టున్నది.

మధుర లాలస ప్రభావతుల శృంగారం అసహ్యకరంగా ఉన్నదని – భారతంలోని శృంగార వర్ణనలతో పోల్చ వీలులేదని, భారత కవుల శృంగారం ఔచిత్య స్ఫోరకంగా వుంటుందని విమర్శించారు. ఏ విషయాన్నైనా విమర్శించను దానికి పలసిన పరిజ్ఞానం సంపాదించాలి. వీరి అలంకారిక విమర్శ గావించక స్వతంత్రంగా విమర్శించినా అందులో ఒక

పద్ధతి, క్రమం కనిపిస్తున్నాయి. కవిత్వం యెలా వుండాలో చెప్పడం, నేటి కవులకు భారత కవుల ప్రతిభను తెలపడం వర్ణనల కంటే భావనాశక్తి ముఖ్యమనడం పాత్ర స్వభావాలను ఆలోచించి వివరించవలయుననడం. కావ్యంలో సంఘటనలందలి ఉచితా ఉచితాలను పరిశీలించడం, కవితా విషయాన్ని వ్యక్తం చేసే రీతిని, రచనాశైలిని, కథాంశాల్లో నవ్యతని, కథ కూర్చిన విధానంలోని ప్రతిభని, కథ కేంద్రీకృతమైన ముఖ్యోద్దేశాన్ని, కవిత్వ వైశిష్ట్యాన్ని తరచి చూచిన ఈ విమర్శనా విధానంలో ఎన్నో నూత్నాంశాలు ప్రత్యక్షమౌతాయి.

## 1.9.6 అర్థశాస్త్రం(1911)

20 శతాబ్దం ఆరంభంలో కవిత్వ పోకడలకు, వేదాంత పఠనానికి అధిక ప్రాధాన్యత నివ్వబడింది. భారతదేశంలో ఆధ్యాత్మిక చింత అధికం, ఎవరికో కొద్దిమందికి శాస్త్ర పరిజ్ఞానం మీద ఆసక్తి వుంది. శాస్త్ర పరిశోధనలు సాగుతూ వచ్చాయి. కానీ ఈ శాస్త్ర పరిశోధనలు ప్రజా బాహుళ్యం కాలేదు. సామాన్య ప్రజలలో శస్త్రావగాహన తక్కువ, మూఢ నమ్మకాలు సంఘంలో పాతుకుపోయి వుండి శాస్త్ర పరిజ్ఞానాన్ని ఆదరించలేని స్థితిలో మనదేశం ఉన్న సమయంలో ఆంగ్లేయులు భారతదేశంలో అడుగుపెట్టారు.

ఆంగ్ల పాలన ఫలితంగా భారతీయులు భాషాధ్యయనం చేయడం మొదలుపెట్టారు. అప్పటికే ఆంగ్లేయులు శాస్త్ర పరిజ్ఞానంలో ముందంజవేశారు. ప్రకృతి శాస్త్రాల అధ్యయనంతోపాటు, పారిశ్రామిక విప్లవం మొదలైంది. ఇతర దేశాలతో వారు వర్తకం సాగిస్తూ ధైర్య సాహసాలతో విదేశాలను హస్తగతం చేసుకునేంత ముందంజ వేశారు. పారిశ్రామిక విప్లవం వల్ల ఉత్పత్తిలో ప్రగతి సాధించిన విదేశీయులు వస్తు విక్రయ నిమిత్తమై క్రొత్త దేశాల్ని కనుక్కొనే ధ్యాసతో సముద్రయానం చేసి కొత్త మార్గాలు కనుగొన్నారు. భారతదేశం విచ్చేసి వారే ఏలికలయ్యారు. ఆంగ్లేయులు ఆంగ్ల విద్య ప్రవేశపెట్టడం చేత, వలస రాజ్య విధానాన్ని ప్రవేశపెట్టారు. వలస రాజ్య విధానం అంటే విదేశీయులు వారి వ్యాపార వస్తువులను మనదేశంలో అమ్మి మన దేంశ నుండి ధనం ప్రోగు చేసుకొనే విధానం. దీనివల్ల మన దేశ సంపదకి నష్టం వాటిల్లి మనదేశం వెనుకబడిన దేశంగా మారింది.

### 1.9.6.1 భారత అర్థశాస్త్రం – ముఖ్యోద్దేశం:

కళాశాలల్లో విద్యాబోధనకు వాడబడే అర్థశాస్త్ర గ్రంథాలన్నీ విదేశాలవి. అవి కేవలం ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థని తెలిపేవిగా వున్నాయి. భారతదేశ స్థితిగతులను భారతీయులకు

తెలియపరచి వారిలోని మౌఢ్యపు పొరలను తొలగించి అభ్యుదయ భావాలను నెలకొల్పి, దేశ పురోభివృద్ధి సాధించాలన్న ప్రగాఢమైన కోరికలో రెడ్డిగారు భారతీయ అర్థశాస్త్రం రాశారు.

భారతదేశపు స్వాతంత్రోద్యమంలో జాతీయ సాంస్కృతిక పునర్జీవనాన్ని, ఆర్థికాభివృద్ధిని కాంక్షించి అనువైన ప్రణాళికుల రూపొందించే రోజులవి. 1913 జనవరి శ్రీ మహారాజా వారి కాలేజీలో వీరున్నప్పుడు రూపుదిద్దుకున్నదీ గ్రంథం. అప్పటికి స్వాతంత్ర్యం రాలేదు. ఆంధ్ర రాష్ట్రం అసలే లేదు. ఏ జాత్యాభివృద్ధి అయినా వారి వారి భాషాభివృద్ధి మీద ఆధారపడి వుంటుంది. వీరు మాతృభాషాభివృద్ధిని కాంక్షించి, ఈ నూతన శాస్త్ర ప్రయోగానికి పూనుకున్నారు. ఆంగ్ల భాషయందు వీరికి ఆంధ్ర భాష వలె మంచి పాండిత్యముండడానికిదే కారణం. రెడ్డిగారి శాస్త్ర లక్ష్యం ఫలించాలంటే ప్రతి భారతీయుడు లేదా ఆంధ్రుడు ఈ గ్రంథాన్ని చదివి ఆర్థికాభివృద్ధికి తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోవలసి వుంది. ఇతర భాషలలోను ఈ గ్రంథాన్ని అనువదించవలసిన ఆవశ్యకత వుంది.

ఏ దేశం ప్రగతియైనా ఆర్థిక విధానంపై ఆధారపడి ఉంటుంది. ఆర్థిక పునాదులు గట్టి పడాలంటే భారతీయులు స్వతంత్రులు కావాలి. ఈ దైన్య స్థితి పోవాలంటే దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం కావాలని గాంధీ మహాత్ముడు వంటి మహా పురుషులెందరో బ్రిటీషు పాలన నుండి మన దేశాలన్ని విడిపించి స్వతంత్రత్ సంపాదించాలన్న ప్రయత్నంలో నున్న రోజులవి. రాజకీయ స్వాతంత్ర్యం మూలంగా ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించాలని వారనుకుంటే, ఒక్క రాజకీయ స్వాతంత్ర్యం వల్ల దారిద్ర్య నిర్మూలన జరగదు. ఆర్థికాభివృద్ధి జరగాలంటే భారతీయలకి శాస్త్ర పరిజ్ఞానం కావాలని, ఆర్థిక శాస్త్ర పఠనం ఆంధ్రులకి అత్యంత అవసరమని గుర్తించినవారు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఆర్థిక న్యాయ సూత్రాలని సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేట్టు రాసి ఈ శాస్త్రం ద్వారా ఆర్థికాభివృద్ధి ప్రజల్లో తీసుకురావాలన్న అభిప్రాయంతో రెడ్డిగారు భారత అర్థశాస్త్రాన్ని రాశారు. ఇవి రెండు భాగాలు.

### 1.9.6.2 అర్థశాస్త్ర ప్రకరణ విభజన:

అర్థశాస్త్రం మొదటి భాగంలో 16 ప్రకరణాలున్నాయి. రెండవ భాగంలో 9 ప్రకరణాలు. వీరు గావించిన విభజన అర్థశాస్త్రవేత్తలకు సమ్మతిదాయకంగా వుంది.

**మొదటి ప్రకరణంలో** అర్థార్జనం ధర్మగుణ హేతువని, వాంఛలు పురోభివృద్ధికి కారణమని, శీలం అభ్యాసము వలన కలుగుని రాశారు.

**రెండవ ప్రకరణంలో** ఆర్థికాభివృద్ధికి వాంఛలు కారణమని తిరిగి ప్రతిపాదన చేశారు. ఈ శతాబ్దంలో వచ్చిన కీన్సు వారి ననుసరించి వచ్చిన నియోకీనిషియనులు వారు ఈ సిద్ధాంతాలను బలపరచారు. మన భారతీయుల సిద్ధాంతం ప్రకారం "కోరికలు దుఃఖ హేతువులు", కానీ ఆర్థిక న్యాయాన్ని అనుసరించి భౌతిక వస్తువులపై కోరిక లేనప్పుడు కొనుగోలు జరుగదు. గిరాకీ లేనప్పుడు ఉత్పత్తి చేసి ప్రయోజనం లేదు. శాస్త్ర పరిజ్ఞానం లేనిచో ఆర్థిక విధానం అభివృద్ధి పెంపొందడం కష్టం. అర్థశాస్త్ర దృష్టిలో చూస్తే కోరికలు వస్తువుపై (వాంఛ) పాపరహితములని వీరి అభిప్రాయం. ఇటువంటి అభిప్రాయం ఆనాటి సమాజానికి నవీనం.

**మూడవ ప్రకరణంలో** అర్థానికి డబ్బు అన్న సామాన్య అర్థముండగా అర్థానికి గల విస్తృతిని వీరు విపులంగా, వివరంగా విశదీకరించారు.

**నాల్గవ ప్రకరణంలో** వస్తువు మూల్యము లేక ధనము, వస్తువు విలువకు దాని ధరకు గల సంబంధాన్ని తెలియజేశారు. మూల్యం ఏకవస్తు గర్భితం గాదని మూల్యం వస్తు సముదాయాల అన్యోన్యతని తెలిపారు. వస్తువులకు, ధరలకు గల పరస్పర అనుబంధమును ఉదాహరణలతో వివరించారు.

**ఆరవ ప్రకరణంలో** వాంఛలకు మానవ యత్నాలకు ఉన్న సంబంధాన్ని తెలుపుతూ, రాశికి కోర్కెలకు, తృప్తికి గల వ్యత్యాసాలను వివరించారు.

**ఏడవ ప్రకరణంలో** గిరాకీకి గల అర్థాన్ని గిరాకీ పెరుగుదల, తరుగుదలలకున్న సంబంధాన్ని తెలిపినారు.

**ఎనిమిదవ ప్రకరణంలో** ఆర్థిక న్యాయ, స్వభావాలపై కాల ప్రభావాన్ని విశదీకరించారు.

**తొమ్మిదవ ప్రకరణంలో** వినియోగానికి, ధరకి గల సంబంధాన్ని తెలిపినారు. ఈ విషయాలన్నీ నేడు Consumption (వినియోగం) అన్న విభాగంలో అర్థశాస్త్ర విద్యార్థులు పఠిస్తారు.

**పదవ ప్రకరణంలో** ఉత్పత్తి (Production)కి మూలాధారమైన ప్రకృతి ఒనరులు ఏ విధంగా ఆర్థికాభివృద్ధికి అనుకూలంగాను, ప్రతికూలంగాను ఉంటాయో తెలియజేశారు. ఈ ప్రకరణంలో ప్రకృతి ఒనరులన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. మూలధనం మానవశక్తి సామర్థ్యాలపై ఆధారపడి వుంటుందన్నారు. కానీ మన భారతీయుల శక్తివంతులైనా, సామర్థ్యాన్ని వినియోగించుకొనే మనోప్రవృత్తిని అలవరచుకోలేదని, అలవరచుకోవాలని, వీరి అభిప్రాయం.

**పదకొండవ ప్రకరణంలో** శ్రమ విభజనం, విభజన చేయుటకు కారణాలు తెలుపబడినాయి.

**పన్నెండవ ప్రకరణంలో** మూలధన నిర్వచనం, మూలధన ఉత్పత్తి. మూలధన రకాలు మొదలైన విషయాలు వివరించారు.

**పదమూడవ ప్రకరణంలో** మానవుని ఆర్థిక ప్రగతి విధానాన్ని తెలియపరచినారు. మానవుని పురోగతి ఆర్థిక రంగంలోని వివిధ పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. ఆటవిక దశనుండి నవీన యంత్ర యుగానికి మానవుడు ఎగబ్రాకిన విధానాన్ని గురించి తెలిపినారు. ఈ ప్రగతికి మన మతాలు తోడ్పడక అడ్డుపడిన విషయాల నిక్కడ చర్చించారు.

**పదనాల్గవ ప్రకరణంలో** సమర్థన ఉత్పాదక శక్తి, ఉత్పాదన పెంపొందించే అంశాలు చర్చించారు.

**పదహైదవ ప్రకరణంలో** మనదేశంలో యంత్రాలకు గల ఆవశ్యకత ఆనాటి పారిశ్రామిక అభివృద్ధి ఎలా జరగాలన్నది చర్చించారు.

**పదహారవ ప్రకరణంలో** దేశానికి, కార్మికులకి గల సంబంధ బాంధవ్యాలు గురించి వివరించారు.

కార్మికుల సామర్థ్యాన్ని గురించి పూర్వం పెద్దగా యోచించేవారు కాదు. ఈ యంత్ర యుగంలో ఈ అంశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకొన్నది. నేటి మన రాజ్యాంగ విధానంలో జాతి ప్రగతికై ప్రకృతి ఒనరులకు, ఓ మంత్రి వర్గాన్ని గూడా ప్రభుత్వం నియమించింది.

ఈ ప్రకరణంలో సంపూర్ణంగా మన భారతీయుల ఆచార వ్యవహారాలు ఆర్థిక ప్రగతికి అడ్డుగోడలుగా ఎలా వున్నాయో తెలిపినారు. కర్మాగారాలు, వాటిని నిర్వహించు విధానం చర్చించారు.

### 1.9.6.3 అర్థశాస్త్ర రెండవ ప్రకరణ విభజన:

**మొదటి ప్రకరణంలో** వృత్తులు, వాటి పరిణామం గ్రామ్యపద్ధతి ఇత్యాది విషయాలు వివరింపబడినాయి. ఆ కాలంలో రాకపోకల సౌకర్యాలు లేనిదానివల్ల గ్రామం తనకుతాను స్వయం సమృద్ధిగా వుండటానికి ప్రయత్నించేది. ఏ వృత్తివారు వారి వృత్తులను అవలంబించాలని నియమముండేది. ఆనాటికా సిద్ధాంతం సరిపోయింది. కానీ నేడున్న యంత్ర యుగంలో ఈ పద్ధతి దేశ పురోగాభివృద్ధికి ఆటంకం. వృత్తిపై వ్యక్తిగతమైన ఇచ్ఛ లేకుండా

జన్మరీత్యా అవలంబించే ఈ పద్ధతివల్ల వ్యక్తిలోని ఉత్సాహం సన్నగిల్లుతుంది. గానుగెద్దులాంటి ఈ ఎదుగు బొదుగులేని జీవితం వలన, ఆర్థిక స్థితి దెబ్బదింటుంది. ఈ విషయాలన్నీ ఇందులో చర్చింపబడినాయి.

**రెండవ ప్రకరణంలో** వృత్తుల పరిణామం తెల్పుతూ పాశ్చాత్య దేశాలలో ఒక వృత్తివారంతా కలిసి స్వలాభానికై శ్రేణులు (సంఘాలకు వీరు వాడిన పదం) నిర్మించుకొన్నారు. ఈ శ్రేణులకు కొన్ని నియమాలు పెట్టుకొని వృత్తిని నియమబద్ధం గావించారని, భారతదేశంలో అటువంటి సంఘాలు లేనందున వృత్తులకు, జాతులకు సంబంధం లేకుండా పోయిందని రెడ్డిగారు వివరించారు. వస్తువు గిరాకీ తగ్గినప్పుడు ఆయా వృత్తులవారి ఆదాయం పడిపోతుందని, యంత్రశాల పద్ధతి ఆచరణలోకి రాగానే ఉత్పత్తి పెరిగి, ఆర్థిక సామర్థ్యం పెరిగిందని వీరు చెప్పారు.

**మూడవ ప్రకరణంలో** ఆధునిక వృత్తి అవలంబనకు సామాన్య లక్షణాలు తెలిపినారు. జాతి ననుసరించి వృత్తి రావడంవలన వారిలో స్పర్ధ లేకుండా పోయిందన్నారు. పాశ్చాత్య దేశాలలో అభిరుచిని బట్టి వృత్తిని స్వీకరించడం వల్ల స్పర్ధ పెరిగి దానితోపాటు వస్తు నాణ్యతలో సామర్థ్యం పెరిగి, ఆర్థికాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. స్పర్ధలు శ్రామికుల మధ్య, మూలధనం మధ్య, యాజమాన్యం మధ్య, మేధావుల మధ్య, నిపుణుల మధ్య ఉండాలని, అప్పుడే పెద్ద పరిశ్రమలు అభివృద్ధి జెందుతాయని రెడ్డిగారు వివరించారు. ఈ స్పర్ధకి గూడా హద్దులుండాలి. లేనిచో ఏకఛత్రాధిపత్యానికి దారి తీస్తుంది. అలాగని అసలే స్పర్ధలేని మనలాంటి దేశాల్లో దారిద్ర్య విభజనేగాని, ధన విభజన జరగదు. పోటీ ఉన్నప్పుడు వస్తు నాణ్యత తగ్గినచో నష్టము వాటిల్ల గలదన్న భీతితో వస్తు నాణ్యతకై ఉత్పత్తిదారుడు కృషి చేస్తాడు. ఈ విషయాలన్నీ ఇందులో చర్చింపబడినాయి.

**నాల్గవ ప్రకరణంలో** శ్రమ విభజనను గురించి చెప్పారు. ఈ శ్రమ విభజనలో ఒక పనిని పలువురు కార్మికులు పంచుకుంటారు. ఆ వస్తువు తన చేతి మీదుగా చేయబడిందన్న తృప్తి కార్మికుడికి మిగలదు. కానీ ఆర్థిక సంపత్తి పెరుగుతుంది. యంత్రాల వలన శ్రామిక దోపిడీ జరగకుండా శ్రామిక సంఘాలు చూస్తాయి. యంత్రాల వల్ల ఎక్కువ ఉత్పత్తి జరిగి వస్తువు అందరికీ లభించడమే గాకుండా ధర అందరికీ అందుబాటులో వుంటుంది. మానవ సంక్షేమానికి తోడ్పడుతుంది.

**ఐదవ ప్రకరణంలో** ఆధునిక యంత్ర కర్మాగారాల నిర్వహణలో వ్యవహార నిర్మాతల పాత్ర అన్న విషయం చర్చించారు. పెద్ద కర్మాగారాలలో అధికోత్పత్తికి తగిన గిరాకీ అంచనా

వేయడం, సరియైన మోతాదులో పంపిణీ చేయడం మేధావుల చతురతపై ఆధారపడి వుంటుందన్నారు. పెద్దల సంస్థల నిర్వహణకి ఎక్కువ మూలధనం అవసరం. దీనికి ప్రమోటర్సు ఏర్పడతారు. బ్యాంకుల ద్వారా ఋణాలు సంపాదించి జాయింట్ స్టాకు కంపెనీలను ఏర్పరుస్తారు. ప్రతిదానిలోను లాభనష్టలనున్నట్లే దీనిలోను పెట్టుబడిదారులు, వ్యవహార నిర్మాతలు, కార్మికులను మోసగించే అవకాశముంది. ఈ ప్రకరణంలో పై విషయాలన్నీ విపులంగా చర్చింపబడినాయి.

**ఆరవ ప్రకరణంలో** కార్మిక సంఘాలు నియమించుకొని పైన చెప్పిన కష్టాలను తొలగించుకోవచ్చునని వివరించారు. న్యాయ సమ్మతంగా తమకు కావలసిన సదుపాయాలు, రావలసిన వేతనాల విషయంలో కార్మికులు జాగ్రత్త పడాలన్నారు. నేడు ప్రభుత్వం కూడా కార్మిక చట్టాల ద్వారా వారి సంక్షేమాన్ని సంరక్షిస్తున్నది.

వీటి ననుసరించి యాజమాన్య సంఘాలు ఏర్పడతాయి. కార్మిక యాజమాన్య సంఘాల మధ్య స్పర్థలున్నా, పరస్పర అవగాహనలో సమస్యలు పరిష్కరించుకొని అధికోత్పత్తికి దోహదం చేయాలని రెడ్డిగారు భావించారు.

**ఏడవ ప్రకరణంలో** యంత్ర యుగం – పెట్టుబడి భాగస్థ సమాజాలు, కావలసిన ధనం సమకూర్చుకొనే విధానం, వ్యవహార నిర్మాతలు చోదక మండలాదుల ద్వారా కర్మాగారాదుల నడుపుకొనే విధానం, లాభనష్టాలు ఇత్యాది విషయాలను వివరించారు. 'మేనేజింగ్ కమిటీ' ద్వారా కర్మాగారాన్ని నడుపుకోవడం మనదేశంలో జరగని పనిగా రెడ్డిగారు పేర్కొన్నారు. ఈ రోజు ఇరువురు కలిసి కర్మాగారాన్ని నిర్మిస్తే వారిద్దరు రేపు విడివిడిగా లాయరు దగ్గర వుంటారని, కలిసి వ్యాపారం చేయడం మనకు చేతగాదని చెప్పారు.

**ఎనిమిదవ ప్రకరణంలో** 'సప్లై డిమాండ్'ల సామరస్యం లేనిచో వ్యాపారం సరిగా నడవదని సప్లై తక్కువై 'డిమాండు' ఎక్కువయితే ధరలు పెరిగి వినియోగదారుడు నష్టపోతాడని, అధికోత్పత్తి జరిగితే డిమాండు తగ్గి ఫ్యాక్టరీకి అంటే యాజమానులకు నష్టం వస్తుందని, ఇలాంటి ఆర్థిక కల్లోలాలను ఖండా ఖండ, క్షోభలుగా చెపుతారని రెడ్డిగారు విపులీకరించారు.

**తొమ్మిదవ ప్రకరణంలో** పరిమిత స్పర్థ కలిగించే విషయాలు ఆర్థిక సంక్షోభాల నుండి కాపాడుకొనే విధానం 'ట్రస్టులు' అనే ధర్మ సంస్థల నుండి అమెరికా దేశం నిమ్నోత్పత్తిని, అధికోత్పత్తిని ఏ విధంగా కాపాడుకున్నది చెప్పారు. యాజమాన్యం వాటాదారులని మోసం చేసే

విధానాన్ని విడమరచి చర్చించారు. అమెరికా ప్రభుత్వం వీటినేవిధంగా అదుపు చేసింది తెలిపారు.

ఇంగ్లాండులో ఈ సంఘాలు పద్ధతి లేదు. యాజమాన్యాలన్నీ మాట్లాడుకొని అంగీకార భావంతో పనిచేస్తాయి. ఈ సంఘీభావాన్ని కారహిత్య సంఘాలు అంటారు. (Cooperative) ఇవి ఉత్పాదకుల అన్యోన్యతాపద్ధతి వినియోగదారుల అన్యోన్యతాపద్ధతి అని రెండు రకాలు. ఈ పద్ధతుల వల్ల ప్రజలకు కలిగే లాభనష్టాలు రెడ్డిగారిందులో చర్చించారు.

రెడ్డిగారు ఆనాడు రెండు భాగాలలో చర్చించిన అంశాలు ఈనాడు అర్థశాస్త్రం ఒక్కొక్క అంశమే ఒక్కొక్క విభాగంగా మారి ప్రత్యేక శాస్త్రంగా అభివృద్ధి చెందింది. ఈ అర్థశాస్త్రంలో ఎన్నో శాఖలు ఏర్పడినాయి. ఉదాహరణకి కర్మాగారాలకు సంబంధించిన 'Industrial Economics' వ్యవసాయానికి సంబంధించిన Agricultural Economics లాంటివి.

ఆంగ్ల పదానికి సరియైన తెలుగు పదాలు వాడుకలో లేని రోజుల్లో వీరు ఆర్థిక శాస్త్రాన్ని తెలుగులో రాయగలిగారంటే వీరి శాస్త్ర, భాషా పరిజ్ఞానం పాఠకులకు వేరే చెప్పనవసరం లేదు. శాస్త్రం సత్యాధారం. కావ్యంలో వలె ఊహ, ఊహామాత్రంగానైనా కనిపించదు. జగత్తులో కలిగి, కరిగిపోయిన సత్యాలెన్నో శాస్త్ర సంబంధమైనవి వున్నాయి. వీటిని దర్శించ శక్తి సామర్థ్యాలు గలవాడే శాస్త్రవేత్త గాగలడు. తాను దర్శించిన వాటిని విడమరచి వివరించగల శాస్త్రవేత్త కర్తృత్వ జ్ఞానం సామాన్యమైనది గాదు. బహుముఖ శాస్త్ర పఠనా పరిజ్ఞానం, లోకజ్ఞత వల్ల ఇది లభిస్తుంది.

అర్థశాస్త్రమంటే ఆర్థిక కార్యకలాపాలను తెలియజేసే శాస్త్రం. మానవుని కార్యకలాపాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అర్థంతో ముడిపడి వుంటాయి. ఈ శాస్త్రాన్ని ఆంధ్రులకు పరిచయం చేయడమనేదే, ఈ శాస్త్రం రాయడానికి గల ముఖ్య ఉద్దేశం. ఈ ఒక్క శాస్త్ర పరిచయానికి శాస్త్రజ్ఞుడు ఎన్నో ఇతర శాస్త్రాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది. తాను చెప్పదలచుకున్న శాస్త్రమే గాక, దానితో ముడిపడిన ఇతర శాస్త్రాలన్నింటా పాండిత్యం, లేదా అనుభవం సంపాదించాలి.

శాస్త్రానికి, కళకు కొంత వ్యత్యాసం వుంది. శాస్త్రాన్ని కళగా రూపొందించను రెడ్డిగారు ప్రయత్నించారు. శాస్త్రం విజ్ఞానప్రదాయిగా ఉంటుంది. కళ అంటే నేర్చిన విద్యను మానవుడికి ఆనందం కూర్చేలా అందించగల నేర్పు, తత్త్వం, చరిత్ర, అర్థ, తర్క విషయాలన్నీ శాస్త్ర సంబంధాలు, శిల్పం, చిత్ర రచన ఇత్యాదులు కళలు. కేవలం విద్యలతో పొట్ట నిండదు. రాజ్యం

బలవంతమవ్వాలంటే నాగరికతకు ప్రాణమైన కళలుండాలి. ఇవి దేశ పురోభివృద్ధికి కారణాలవుతాయని రెడ్డిగారి అభిప్రాయం.

కళలను చెప్పిన వీరు లలితకళలైన సాహిత్య, సంగీతాలను ప్రస్తావించలేదు. అవి వీరి జ్ఞప్తినుండి దాటుకున్నవని అనలేము. అర్థశాస్త్రవేత్తగా వీరి దృష్టి వృత్తి కళల వైపు మొగ్గుజూపడం గమనిస్తే కళలను సమాజ ప్రయోజనకారులుగా మలచుకోవడం, వీరి ధ్యేయమనిపిస్తుంది. దేశాభ్యుదయాన్ని కాంక్షించే వీరు శాస్త్రంలో సాహిత్య విలువలను చొప్పించి శాస్త్రాన్ని కళావంతం చేశారు.

శాస్త్ర విషయాలను కళావంతంగా, మనోరంజకంగా, ఆకర్షణీయంగా చెప్పవలెనన్న వీరి ఆలోచన అర్థశాస్త్ర ఆరంభం నుండి అంతం వరకు వ్యక్తమౌతూనే వుంది. సాహిత్య సంబంధమైన కావ్యోదాహరణలను శాస్త్రంలో చూపించి ప్రజల సోమరితనాన్ని, అశుభ్రతని, అజ్ఞానాన్ని పోగొట్టి దేశాభివృద్ధికి అవరోధంగా నిలిచే దుష్టభావాలను చిత్రవధ గావించారు. శాస్త్రంలో సాహిత్య విలువలు ఉండడం వల్ల శాస్త్రం విలువ పెరిగింది. శాస్త్రానికి కళాబాంధవ్యం ఏ విధంగా జరిగిందనే ఉద్దేశాన్ననుసరించి, సాహిత్యవేత్త గూడా ఈ శాస్త్రాన్ని మరో కోణం నుంచి పరిశీలించ వీలవుతుంది. ఉదాహరణలు పేర్కొనే సందర్భంలో రెడ్డిగారు పురాణాలు, భారతం, సుమతి శతకాదులను గుర్తు చేయడం వలన అరటి పండు వలచి చేతిలో పెట్టిన విధంగా అందరికీ ఈ శాస్త్ర విషయాలు సులభగ్రాహ్యంగా ఉన్నాయి.

శాస్త్రంలో సాహిత్యం చొప్పించడంలో పఠనోత్సాహం పెరిగే అవకాశముంది. తెలుగు భాషతి నూత్న పదజాల సిరి యేర్పడింది. చెప్పదలచుకున్న విషయానికి స్పష్టత, అర్థ సౌలభ్యం ఏర్పడ్డాయి. ఈ అర్థశాస్త్రం ఏ ఇతర అర్థశాస్త్ర గ్రంథాలకీ అనుకరణ గాదు. అనువాదం గాదు. స్వతంత్రం.

"శాస్త్రం బుద్ధి గమ్యం, ఆయా శాస్త్రాలందు ప్రవేశం, అభిమానం గల ఏ కొద్దిమందికో శాస్త్ర గ్రంథాలు రుచించును. వారు మాత్రమే వాటిని చదివి జ్ఞానం పొందుదురు" అన్న ప్రతిపాదన కట్టమంచి వారి అర్థశాస్త్రం కొట్టి పారేస్తుంది. భారత అర్థశాస్త్రం కావ్యం వలె సార్వకాలీన, సార్వజనీన పఠనావశ్యకత గలిగివుంది.

అర్థార్జన అనర్థహేతువనుకునే వారు, కోరికలు పాపమని భయపడి పనిమానుకొని నిష్కామకత్వంతో నీరు గారే ప్రజలు పురుషార్థాలు సాధించలేరు. మూఢమత భావాలతో మనస్సుకి మసిబూసికొని దేశానికి ద్రోహం చేయక శాస్త్ర జ్ఞానం అలవరచుకొని ఆర్థికాభివృద్ధికి

తోడ్పడమని చెప్పడం ఈ రచనలో కనిపిస్తుంది. ఇది నీతిశాస్త్రం గాదంటూనే పరోక్షంగా నీతులెన్నింటినో ప్రదర్శించారు రెడ్డిగారు.

### 1.9.6.4 భారత అర్థశాస్త్రంలోని ఉదాహరణలు – ప్రతిపాదికలు:

ఈ గ్రంథంలో నీతిశాస్త్రం తర్కం, మతం, రాజకీయ శాస్త్రం, చరిత్ర, మనస్తత్వ శాస్త్రం, సాంఘిక శాస్త్రం మొదలగు శాస్త్రాలన్నీ ఇందులో చోటు చేసుకున్నాయి. వీరు విషయాన్ని విపులీకరించను ఎన్నో తత్త్వసంబంధమైన నీతి, ధర్మ, సాంఘిక, హేతువాదాలకు అనుగుణమైన సూక్తులు, ప్రతిపాదనలు చేసివున్నారనడానికి కొన్ని ఉదాహరణలు.

1. "మన యొక్క శాస్త్రాలు వేయి తలల సర్పముల వంటివి" (బా. అ. శా. పుట–29).
2. "ధర్మార్థములు పరస్పర హేతువులు" (పుట–36).
3. "అభ్యాసము వలననే! యనాచారము సైతము యాచారములట్లు తోచును" (పుట–45).
4. "దారిద్ర్యమనునది సుగుణముల వలన గలుగు సుఖము గాదు" (పుట–32).
5. ఏమియు లేనినాడు తప్పు చేయదనుట నిజము గాని, తప్పు చేయనందున ఏమియు లేనివాడయేననుట నిశ్చయము గాదు" (పుట–36).
6. "బీదలు విధి లేక మంచివారుగా నుండినుండవచ్చును గానీ అది కారణమున మంచివారెల్లరు బీదలుగా నుండవలయుననుట యసంబద్ధ ప్రలాపము" (పుట–22).
7. "నిష్కామియైన వారికి లోకమంతయు నిష్ప్రయోజనము మూల్యసూన్యమై యుండును" (పుట–32).
8. "ప్రయత్నం చేయు మనుజునికి లక్ష్మి స్వయంగా వచ్చి చేరును. (పుట–39). అర్థశాస్త్రంలోని ఈ ప్రతివాదనలన్నింటినీ రెడ్డిగారు తర్కబద్ధంగా నిరూపించారు".
9. "ఇండియాలో కాలయాపన చింత మందునకై నా దొరకదు" (పుట–470).
10. "మనుష్యులు జ్ఞానసంపన్నులగుదురేని వెట్టి తానంతట అది వదులును" (పుట–452).
11. "శీలము అభ్యాసం వలన గుదురును" (పుట–45).
12. "తెగువ లేనిచో జయమసాధ్యం" (పుట–432).
13. లోకోపకార బుద్ధి యున్నవారికి స్వప్రయోజనత్వం నశించును" (పుట–45).

14. "నీతివాక్యాలెన్నింటినో ఆర్థికాభివృద్ధిని దృష్టియందుంచుకొని వీరు వలసినప్పుడంతా చెప్పినారు. శాస్త్ర అవగాహన సులభంగా స్మృతిపథంలో నిలవాలంటే జ్ఞాపకం పెట్టుకోదగిన ఉదాహరణలుండాలి. సాకెట్ సిలిండరు లాగ ఖచ్చితంగా అమరిన ఉదాహరణలెన్నో ఇందున్నవి".

15. "ఆశ అరటిచెట్టు వంటిది. ఫలమునకు గారణభూతమయ్యు ఫలాభివృద్ధితో క్షయము దాల్చును" (భా. అ. శా. పుట–54).

16. "సంగీత విద్వాంసుల రీతిని మనము నారోహములంజేసితిమి, తలనుండి తోకవరకు తడిమి చూచితిమి. ఇప్పుడు తోకనుండి తలవరకు పరీక్షింతుము". (భా. అ. పుట–67).

17. "నర్థము, మూల్యం ప్రయోజనము వీనకుండు, సాంగత్యం నెఱుంగుట ఈ శాస్త్రమున విఘ్నేశ్వర ప్రార్థన వంటిది". (భా. అ. పుట–49).

వస్తువు గుణమును బట్టి వెలల చలనం అధికమగునో మెల్లంగనో యుండును అన్న విషయానికి ఉప్పును ఉదహరించారు. ఉప్పు ప్రాణాధార వస్తువు గాన మనకవసరం.

దాని నెక్కువ ఉపయోగించిన అరుచి పుట్టును కాబట్టి దానియందలి మమత పరిమితం. ధర యెక్కువయైనను ఇతర వస్తువుల వ్యయం దగ్గించియైనను ఉప్పు కొనవలయును, వెల హెచ్చు అగుటచే గిరాకీ తగ్గదు. ఇటువంటి ఉదాహరణలు అన్ని కాలాలకీ సంబంధించినవి వీరు వాడారు.

నూరు కథలవాడుగా చిన్ననాట పేరుపడ్డ రెడ్డిగారు అర్థశాస్త్రంలో ఎన్నో కథోదాహరణలు ఇచ్చినారు. ఈ ఉదాహరణలు పఠనా శ్రద్ధాసక్తులను పెంపొందింప జేయుటయేగాక, శాస్త్ర పఠనం వల్ల ఏర్పడే అలసట, మానసిక గ్లానిని పోగొడతాయి.

అధిక మగుడుడ విసంబగు నమృతమైన అధికంగా తింటే అమృతమైన విషమౌతుందన్న అర్థం. ఈ సామెత ఉదహరిస్తూ కథ చెప్పారు. పూర్వమొక రాజు మిగుల లోభియై, ధనమునకు మించినది లేదని ధనమును ఆశించి తపముచేయ దేవుడు ప్రత్యక్షమై ఏమి వరం కావలయునని అడుగ నేను ముట్టినదంతయు బంగారం గావలెననెను. దేవుడు వరమిచ్చి అంతర్థానమాయెను. పిమ్మట రాజు మహానందంతో నింటికి వచ్చి తాను సంపాదించిన వరము గూర్చి భార్యకు తెలిపి సంతోషంతో ముద్దు పెట్టెను. వెంటనే భార్య బంగారు బొమ్మగా మారెను. ఇది యేమి గ్రహచారమని నౌకరుని పిలిచి ఆకలి కోర్వలోక అన్నం పెట్టమనగా వడ్డించిన పదార్థంలన్నియు స్వర్ణమయములయ్యెను. విధి లేక యేకాదశి అయ్యెగదా యని నీరు ద్రావబోవ అదియు బంగారమయ్యెను.

ఒక్క దెబ్బకి రెండు పిట్టలు పడినట్లు రెడ్డిగారు శాస్త్రోదాహరణలతో పాటు నీతిని గూడా ఇందు బోధింపదలచారు. ఇలాంటి పాశ్చాత్య సాహిత్యానికి సంబంధించిన కథలు 'రాక్ పెల్లరు' వంటి సంఘంలో జరిగిన సత్యమైన కథలను ఉదహరించి విషయం స్పష్టం గావించారు.

### 1.9.6.5 పురాణ సంబంధమైన ఉదాహరణలు:

సాధారణ కథలతోపాటు, పురాణ సంబంధమైన ఉదాహరణలు ఈ అర్థశాస్త్రంలో చోటుచేసుకొని వున్నాయి. పురాణాల ప్రభావం వీరిపై అధికంగా వుండి వీరు ఉదాహరణలు అందులోనివి గ్రహించారనడానికి లేదు. ఆనాటి సమాజంలో పురాణాలు పండిత పామర జనరంజకంగా వుండేవి. పురాణోదహరణల వల్ల తాను చెప్పదల్చుకొన్న ఆర్థిక న్యాయాలను సునాయాసంగా పఠితల తలలకెక్కించడం వీలవుతుందని రెడ్డిగారు ఆయా సందర్భాలలో పురాణ కథలకు సంబంధించిన ఉదాహరణలు ఇచ్చి సందర్భ శుద్ధి, విషయ సౌలభ్యతని సమకూర్చారు. భూమి రత్నగర్భ అన్నది పురాణోదితమైన విషయం, ఈ విషయాన్ని రెడ్డిగారు విమర్శించిన విధానం ఇది. "భూదేవికి వసుమతి, రత్నగర్భయను నామములు గలవు గానీ, తనంతట వస్తువులు గానీ, రత్నములు గాని మనకు కొనితెచ్చు యిచ్చునంతటి కరుణాశాలిని గాదు. మఱేమన్న మించు వారికే గాని యితరుల కెట్టి ఫలము నొసగదు. ఈ ప్రపంచముప నణగియుండు ప్రయోజనములన్నియు శ్రమార్జితములే గానీ యూరక దొరకునవిగావు".

"మనుష్యునకు వస్తువును సృష్టించు ప్రభావం లేదు. విశ్వామిత్రునకు బిదపవడ్లు, రాగులు, లోహములు, కొయ్య నురువులు నుత్పత్తిజేయు బ్రహ్మతేజము గలవాడెవ్వడును లేదు. ఇక మన మహిమచే సాధ్యం లెవ్వియన వస్తువులో లీనమై యుండు స్వాభావిక శక్తులను ఉచిత రీతి నడచునట్లు చేసియందలి ప్రయోజనములు వెలిపుచ్చి వినియోగములుగా చేయుటయే" ఇటువంటి ఉదాహరణముల ద్వారా రెడ్డిగారు శ్రమచేత వస్తువు పుడుతుంది గానీ దేవుడు వచ్చి మన కోర్కెలు తీర్చడని. మన అభ్యుదయానికి శ్రమ మూలమని చెప్పుటకై చెప్పిన విషయం ఇది.

మన అవివేకం ఆర్థికాభివృద్ధిని ఏ విధంగా నిరోధిస్తుందో రెడ్డిగారు పేర్కొన్నారు. గృహ అవసర నివాసానికి కట్టెలు కొట్టి, వ్యవసాయం కోసం అరణ్యాలని చదును చేయడంవల్ల వర్షాలను కోల్పోతున్నాం. ఇది ఎరుగక ఈనాడు ధర్మం నశించిన కారణంగా ఇలా జరుగుతున్నదని వాపోరాదన్నారు. కలియుగానికి, త్రేతాయుగానికి నిజమైన వ్యత్యాసం అరణ్య సముదాయమే గానీ ధర్మ దేవతా పాదములు గావు. తాత్కాలిక ప్రయోజనార్థులను వివేక

శూన్యులు నగు వారిచే నట్టి కాఱడవులన్నియు గొట్టబడి నాశనము జరిగినది అని రెడ్డిగారు శాస్త్రబద్ధంగా కారణాలు తెలియజేశారు. ప్రతి విషయాన్ని హేతుబద్ధంగా వివరించడం, ఆలోచించడం ఈ శాస్త్రంలో కనిపిస్తుంది.

**"కార్యఫలములయెడఁ దానకర్త ననుట**
**కడు నెఱుంగమి జువ్వె! దాఁ గర్తయేని**
**దవిలి తనదైన కార్యజాతంబు లెడ్ల**
**జెడక ఫలియించునట్లుగాఁ జేయరారే?"**

మన ప్రజల్లో చోటు చేసుకున్న భావనలివి. పురుష ప్రయత్నాని హీనంగా నెంచరాదు. నేను సర్వశక్తుడనుగాను. నాకే శక్తియు లేదు. నా ఎగురుటకు రెక్కలు లేవు గాబట్టి, నడచుటకు కాళ్ళు లేవు అన్నట్లు పురుష ప్రయత్నాన్ని విమర్శించడం మంచిది కాదని, జన్మించడం, మరణించడం మన చేతిలో లేవని తక్కిన అన్నీ గూడ మనకు సాధ్యం కావని, వదలడం న్యాయం కాదని, ప్రయత్నించి ఫలితం కోసం చూడకుండా కార్యాన్ని నిర్వహించాలని వీరు సూచించారు.జాతిచే తక్కువ అని తలంచక, అధైర్యపడక, శిక్ష, తర్ఫీదుల వలన అధిక శక్తివంతులు గావాలని కోరి, భర్తృహరి రాసిన ఈ క్రింది పద్యాన్ని ఉదహరించారు.

**"తనిసిరే వేల్పుల కధి రత్నము చేత**
**వెఱచిరే ఘోరకాకోల విషము చేత**
**విడిచిరే యత్న మంమృతంబు వొడముదనుక?**
**నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు అన్న"**

అమృతాన్ని బడయడానికి సముద్రాన్ని మదించిన వేల్పులు, రాక్షసులు ఘోర విషాన్ని వెరచి యత్నాన్ని తమ మనో నిశ్చయాన్ని మానుకోలేదు. అందువలన పని సాధించడానికి ఎంత శ్రమనైనా ఓర్వాలన్నది వీరి భావం. ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చే విషయాలు సహజ ఆలోచనలను పురికొల్పే విషయాలు. ఆర్థికాభివృద్ధికి అనువైన సూత్రాలు. భారతీయుడన్నవాడు చదివి తెలుసుకోవలసిన విషయాలెన్నో వున్నాయి అర్థశాస్త్రంలో.

## 1.10 కట్టమంచి వారి వ్యక్తిత్వం:

మానవునికి వ్యక్తిత్వం అనేది అతని అంతరంగిక విషయం. ఇది అతని అభిరుచులు, అనుభవాలు, ప్రవర్తన ఆలోచనలు మొదలైన వాటిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని అంచనా వేయాలంటే పై విషయాలను గమనించటంతో పాటుగా, ఆ

వ్యక్తితోటి సహవాసం, కలిసి మెలసి గడిపిన జీవితం ద్వారా తెలుసుకోవచ్చు. కట్టమంచి రామలింగారెడ్డితో పరిచయమున్న వివిధ వ్యక్తులు అతని గురించి చెప్పిన మాటల ద్వారా అతని వ్యక్తిత్వాన్ని తెలుసుకోవచ్చు.రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారిపై కట్టమంచి రామలింగారెడ్డి ప్రభావం ఎక్కువనే చెప్పుకోవచ్చు.

*"సాహిత్య సంస్కారమున నాకు కడపటి గురువాయన వారితో నాకు పరిచయం కలిగింది ప్రాయశః 1910లో అప్పటికే ఆయన పాండిత్యము వ్యుత్పత్తి, ప్రఖ్యాత సర్వతో బద్ధంగా నెలకొన్నవి. పాత ప్రపంచమున ప్రాకులాడుచున్న నాకు వారితోడి సహవాసము ఆధునిక ప్రపంచ తలుపులు తెరచి ఆహ్వానించింది''*[50]

అన్న రాళ్ళపల్లి మాటలు వారిని రెడ్డిగారు ఎంత ప్రభావం చేసింది మనకు తెలుస్తుంది. అంతేకాకుండా రెడ్డిగారు ఒక వ్యక్తిని అభామానిస్తే ఆ బంధం చివరిదాకా ఎలా ఉంటుంది అన్నది రాళ్ళపల్లి మాటల్లో...

*"నాది సనాతన సంప్రదాయం. ఆయనది ఆధునికంలో ఆధునికం. అప్పటికి అయనకంటే నాకు ఎక్కువ తెలిసిదంటే ఒక్క సంస్కృత భాషా సాహిత్యం మాత్రమే. అయినా ప్రథమ దర్శనంలోనే ఆయన నాయందు చూపిన స్నేహము, గౌరవము, పక్షపాతము ఎంతో తీదీపులై సూదంటు రాయిగా నాపాలికి పరిణమించినవి. అట్లె పెరిగినవి. కనుక ఆయన గురించి ఏమి చెప్పినా నన్ను కలుపుకొనక చెప్పలేను. ఇరు ప్రక్కల మూడవ వ్యక్తి చొరవలేని ముగ్ధ మధుర సంబంధం మాది*[51]*".*

రాళ్ళపల్లివారు కావ్యాలు చదివితే ఎంతో శ్రద్ధగా వినేవారు రెడ్డిగారు. అలాగే ఆయన కవిత్రయం గురించి చెప్తుంటే రాళ్ళపల్లివారు శ్రద్ధగా వినేవారు. ఇలా పరస్పరం సాహిత్య చర్చల్లో మునిగి తేలడం వారి సాహిత్య వ్యక్తిత్వానికి నిదర్శనం.కట్టమంచి రామలింగారెడ్డిలో కొన్ని వైరుధ్యాలు కనిపించేవని చెప్తూ ప్రముఖ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావు ఇలా అన్నారు.

*"భావాలలో ఆయన అతివాది, ఆచరణలో మితవాది, విశ్వాసాలలో ఆయన డెమోక్రాట్, అభిరుచుల్లో యారిస్టోక్రాట్. సారస్వతంలో కొత్త ప్రక్రియలను, కొత్త పోకడలను ఆయన ఆహ్వానించేవారు. భాషావిషయంలో మాత్రం పచ్చి గ్రాంథికాన్ని అభిమానించేవారు. ఆయన దృష్టిలో చిన్నయసూరి వచన శైలి ఉత్తమోత్తమైనది. పద్యంలో తిక్కనకిచ్చే స్థానాన్ని గద్యంలో*

---

[50] . డా. సి.ఆర్. రెడ్డి–. పుట:78.

[51] . –సి.ఆర్. రెడ్డి పీఠికలు.1

*ఆయన చిన్నయ సూరికిచ్చేవారు. భావాల విషయంలో సాహసాన్ని, స్వాతంత్రాన్ని కోరడంతో పాటు, భాష విషయంలో సాంప్రదాయాన్ని, చాందసాన్ని వరించడం డా. రెడ్డిని పోలిన విలక్షణ వ్యక్తికే చెల్లు. అని నార్లవారు చెప్పిన మాటలు రామలింగారెడ్డి విశిష్ట వ్యక్తిత్వాన్ని వ్యక్తపరుస్తుంది[52]".*

ఆయనది విశిష్టమైన వ్యక్తిత్వం అని నార్ల వెంకటేశ్వరరావుగారు చెప్తూ...

*"ప్రేమను రేకెత్తించగల వ్యక్తిత్వం ఆయనది. అదరితో ఆయన చనువుగా మెలిగేవారు. అందరిని నోరార పలకరించేవారు. నవ్వేవారు, నవ్వించేవారు. దగ్గరికి తీసేవారు. దయగా చూసేవారు. ఎవరిలోనైనా ప్రతిభను కనుగొంటే ఒక వజ్రాల గని తనకు దొరికినట్లే సంతోషించేవారు. ఎన్ని విధాల ఆయన ఎందరిని పైకి తెచ్చారో లెక్కేలేదు*[53]

అని వ్యాఖ్యానించారు. ప్రాంతీయతనుకానీ,కులతత్వాన్ని కానీ రెడ్డి ఎప్పుడూ ప్రోత్సాహించేవాడు కాదని ఈయన గురించి రాసిన వారి అభిప్రాయం. దీనికి ఉదాహారణగా అతడు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపాధక్షుడుగా ఉన్నప్పుడు చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తిగానీ, రెడ్డికులానికి చెందిన వ్యక్తిగానీ విశ్వవిద్యాలయంలో చెప్పుకోదగ్గ ఉద్యోగంలో ఒక్కరూ నియమింపబడలేదని చెప్తారు. ప్రాంతీయ తత్త్వము, కులము ప్రాతిపదికగా ఈ నాట ఉద్యోగ నియమకాల్ని చూస్తున్న మనకు ఆనాటి కాలంలో యదార్థాలైన వింతగా కనిపిస్తాయి. ఇలాంటి ఉదార స్వభావంగల వ్యక్తిత్వం రెడ్డిగారిది[54].

రామలింగారెడ్డి మద్రాసులో విద్యాశాఖాధికారిగా ఉన్నప్పుడు దళితులకు పాఠశాల ప్రవేశం కల్పించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా ఉన్నప్పుడు విద్యార్థి వసతి గృహాల్లో వంటవారుగా నియమించుకోమని సిఫార్సు చేసిన ఉదాత్తమైన వ్యక్తిత్వం కలిగినవారు.ఇంతటి ప్రతిభా పాటవాలుకలిగిన రెడ్డిగా అన్ని రంగాలను తామరాకుమీద నీటిబొట్టులా అన్నింటిని సృశించుకుంటూ వెళ్ళారు తప్ప ఏ ఒక్క రంగంలోనూ అత్యున్నత స్థానానికి వెళ్లలేకపోయారు.నార్లవెంకటేశ్వరరావుగారి మాటల్లో.....

---

52 . డా. సి.ఆర్. రెడ్డి–పీఠిక–2.

53 డా. సి.ఆర్. రెడ్డి–పీఠిక–పుట:5

54 . ఉదార చరితుడు–మన కట్టమంచి–పుట:36.

***"ఆయన కృషి చేసిన ప్రతి రంగంలో రెడ్డిగారు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినట్టే కనబడి అల్లంత దూరంలో ఆగిపోతున్నారు. తన ప్రవృత్తిలోని కొన్ని వైరుధ్యాలవల్లే శిఖరాగ్రానికి కొంచెం దిగువగా ఆగిపోవలసి వచ్చిదేమో?*** [55]

*డా. రెడ్డిగారు నాకు యూరోపియన్ సదుపాయాలు కావాలి నా ఆత్మ స్వదేశీ, ఉదరం మాత్రం విదేశీది అన్నారు. ఛలోక్తిగా అన్నా ఆయన ప్రవృత్తిలోని వైరుధ్యాలను ఇది సూచిస్తుంది. అభిమానం విద్యకు విజ్ఞానానికి సంబంధించిన వాటిపట్ల. ఆకర్షణ రాజకీయాలపట్ల. ప్రవృత్తిలోని ఇట్టి వైరుధ్యాలకు ప్రజ్ఞ ప్రభావాలలోని వైవిధ్యం తోడైతే వ్యక్తిత్వానికి విధిగా విలక్షణత్వం రాదా? ఈ విలక్షణత్వమే రెడ్డిగారిని ఏ శిఖరాగ్రానికి చేరనివ్వలేదు''*[56]అనే మాట వాస్తవానికి దగ్గరగా ఉందని కట్టమంచి రామలింగారెడ్డిగారి జీవితాన్ని, రచనలను పరిశీలించిన వారికి అర్థమవుతుంది.నార్లవారి మాటలనుబట్టి చూస్తే రెడ్డిగారు ఏ రంగంలోనూ ఇమడని వ్యక్తిగా మనకు కనిపించినా ఆయన వెళ్ళిన రంగంలో చేసిన కృషి మాత్రం చాలా గొప్పదని చెప్పవచ్చు.

## 1.11 ఛలోక్తులు

కట్టమంచి వ్యక్తిత్వాన్ని గురించి చెప్పుకొనేటప్పుడు ఆయన సమయస్ఫూర్తిని తెలిపే చతురోక్తులను అనేకులు పేర్కొంటూ ఉంటారు.

- పానగల్లు రాజా మంత్రి వర్గం మీద విశ్వాస రాహిత్య తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంలో కట్టమంచి దాడికి నిలబడలేక పానగల్లు రాజా ఎప్పుడో కట్టమంచి రాసిన వ్యక్తిగత ఉత్తారాలను బయటికి లాగి ఆయన నోరు మూయించాలని చూశారు. వెంటనే కట్టమంచి "ఇంగ్లాండులో ప్రేయసు ప్రియులు రాసుకున్న ప్రేమ లేఖలు విడిపోయేనాడు బయటపెట్టుకోరు" అన్నారు. వెంటనే రాజా ఆ ఉత్తరాలను లోపలికి దోపుకున్నారు.
- 1937లో మిశ్రమ మంత్రవర్గం ఏర్పడితే బాగుంటున్నారు కట్టమంచి రాజగోపాలాచారితో. "మంత్రి వర్గం ఏర్పడి నాలుగు నెలలే అయ్యింది. అప్పుడే మార్పులా" అన్నారు రాజగాపాలాచారి. వెంటనే కట్టమంచి నేను

[55] డా. సి.ఆర్. రెడ్డి–పీఠిక–పుట:4

[56] డా. సి.ఆర్. రెడ్డి–పీఠిక– పుట:2

లెక్కల్ని గురించి మాట్లాడటం లేదు రాజకీయాల  గురించి మాట్లాడుతున్నాను అన్నారు.

- పి. కమలమ్మ అనే సెనెట్ సభ్యురాలు పెండ్లయిన తర్వాత బి. కమలమ్మ అని పేరు మార్చుకున్నారు. అప్పుడు కట్టమంచి 'పరుషం సరళం అయ్యిందే' అని అందర్నీ నవ్వించారు.
- కట్టమంచి ఒకసారి  మద్రాసు స్టేషనులో దిగిపోతుంటే ఒక విలేఖరి ఎదురుకాగా, "నాకు పోర్టర్ కావాలి రిపోర్టర్ కాదు" అని చమత్కరించారు.
- మద్రాసులో ఎగ్మూరులో కట్టమంచి ఒక సభలో ప్రసంగిస్తుండగా రాళ్ళుపడ్డాయి. అందుకు జస్టీస్ పార్టీ మద్దతు ఉందని భావించిన కట్టమంచి 'జస్టీస్ పార్టీ వాళ్ళు ఇంకా రాతి యుగంలోనే నడుస్తున్నారనడానికి ఇదే నిదర్శనం' అన్నారట. ఇలాంటివి ఆయనను గురించి ఎన్నో వినిపిస్తుంటాయి.

## 1.12 రాజకీయ రంగం

1905లో ఇంగ్లాండులో జరిగన పార్లమెంటు ఎన్నికల్లో కేంబ్రిడ్జి యూనియన్ క్లబ్ కార్యదర్శిగా లిబరల్ పార్టీ తరపున 100 సభలలో ప్రసంగించి అయ్యో  రెడ్డి భారతీయుడు అయిపోమాడు, లేకుంటే బ్రిటను ప్రధాని అయి పోయేవాడు కదా అని అనిపించుకున్న దిట్ట. ప్రపంచ రాజకీయ పరిజ్ఞానం కలిగి రాజకీయ ప్రసంగాలు ఉత్తేజకరంగా చెయ్యగలిగిన కట్టమంచి, భారత రాజకీయాల్లోకి ప్రవేశించి ఏమీ కాలేకపోవడం పెద్ద విషాదం. కట్టమంచి రాజకీయ ప్రవేశం గురించి కె.ఆర్. శ్రీనీవాసయ్యంగార్ "It proved more a fresh than a fresh start" అని వ్యాక్యానించడం సబబే. తన వాగ్ధాటితో ఎవరినైనా నోరు మూయించగల సత్తా, భాషలో స్పష్టత, నిశిత గుణం, తర్కం, మేళవించి ప్రతిపాదితాంశానికి ప్రాణం పోయగల శక్తి ఉండి, కూడా రాజకీయాల్లో రాణించలేక పోయారు కట్టమంచి. వెళ్ళడం వెళ్ళటమే జస్టిస్ పార్టీలోకి వెళ్లారు. ఇది అబ్రాహ్మణ పార్టీగా పేరు పొందింది. మద్రాసు శాసన సభలో సమయస్ఫూర్తి, హాస్యచతురత, వాదనపటిమ గల మంచి వక్తగా పేరుపొందారు. 1922 మార్చినెల బడ్జెట్ మీదజరిగిన చర్చిలో కట్టమంచి చేసిన ప్రసంగం చారిత్రాత్మకమైనదని విజ్ఞుల అభిప్రాయం. పరిశ్రమలు లేని మన దేశంలో రెవెన్యూ అబ్కారీలు ఆదాయ మార్గాలుగా ఉండటం వలన పేదల మీద పన్నుల భారం పడుతుందని, ఇది కాకుల్ని కొట్టి గద్దలకు

వేయటమే అని కట్టమంచి ఆనాడే హెచ్చరించారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి ప్రజా ప్రయోజనకరమైన అంశాల మీద ఖర్చు తగ్గించేసి పోలీసులు, కోర్టులు మీద ఖర్చు పెట్టడం అన్యాయమని అభిప్రాయ పడ్డారు. అంతేగాక విద్యాసంస్థలలో అగ్రకుల ఆధిపత్యాన్ని కూడా ఆయన ఖండించారు. 1923-24 సంవత్సరపు బడ్జెట్ మీద జరిగిన చర్చలో, సైన్యం మీద డబ్బు ఖర్చు పెట్టడం తగ్గించి రాయలసీమ కరువు లాంటి సమస్యలను పరిష్కరించమని కోరారు.

ముక్కుసూటిగా వెళ్ళే కట్టమంచి పవర్ పాలిటిక్స్ తో రాజీపడలేక బయటికొచ్చేశారు. కొందరు మిత్రులతో కలిసి యునైటెడ్ నేషనల్ పార్టీని స్థాపించారు. 1930లో ప్రభుత్వ దమననీతిని నిరసిస్తూ ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపాధ్యక్షపదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ ఉద్యమం బలపడటానికి దోహదం చేశారు. గాంధీజీ ఉద్యమ ప్రాశస్త్యాన్ని గురించి రౌండ్ టేబుల్ సమావేశాల గురించి వ్యాసాలు రాశారు. 1935లో కాంగ్రెస్ అభ్యర్థిగా శాసన సభకు ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా బోర్డు అధ్యక్షులయ్యారు. మళ్ళీ 1936లో విశ్వవిద్యాలయానికి వెళ్ళిపోయారు. తిరిగి రాజకీయాల్లోనికి రాలేదు. విద్యార్థి దశలోనే రాజకీయాలను వంట బట్టించుకుని, ఉపాధ్యాయుడుగా తరగతి గదులలో ప్రపంచ రాజకీయాలను బోధించి కట్టమంచి రాజకీయ ఆచరణలో గొప్ప వక్త గానే  తప్ప కార్య నిర్వాహకుడిగా రాణించలేకపోయారు.

## 1.13 సాహిత్య, సామాజిక దృక్పథం:

సాహిత్యం, సమాజం రెండూ అవినాభావ సంబంధం గలవి. సమాజం నుండి సాహిత్యం పుట్టుకొస్తుంది. సాహిత్య సామాజికాంశాలపట్ల రామలింగారెడ్డి దృక్పథాన్ని పరిశీలిద్దాం. సాహిత్య సారస్వతంలో రెడ్డిగారు కొత్త పోకడలను, కొత్త ప్రక్రియలను ప్రవేశపెట్టినా వారి రచనల్లో కొంత వైవిధ్యం కనిపించేది. ఎలాంగంటే భావంలో నవ్యతను ప్రవేశపెట్టి భాషలో మాత్రం ప్రాచీనాన్ని మాత్రమే వాడేవారు. బహుశ దీనికి కారణం తాను చిన్నప్పుడు చదువుకున్న గురువులు కారణం కావచ్చు.

> *"తర్కశాస్త్రంపట్ల రామలింగారెడ్డికి ప్రత్యేకమైన అభిప్రాయలున్నాయి.*
> *అది మనిషిలో వాదన పటిమను పెంచుతుంది కానీ పరిపూర్ణమైన*
> *మానవుడిగా చేయడానికి దోహదపడుతుందని చెప్పలేం.*

*ఇది తర్కశాస్త్రంపట్ల రెడ్డిగారికున్న అభిప్రాయం''*[57].

చిన్నప్పటినుండి రెడ్డికి కుల, ప్రాంతాల అభిమానం లేదని ఇంతకు ముందే వివరించుకున్నాం. అందుకేనేమో చిన్నప్పుడే వారి మాష్టారు ''మీదే కులం'' అని అడగ్గా "నాది ఆదిమవాసి" కులం అని సమాధానం చెప్పి కులాలపట్ల అతనికున్న వ్యతిరేకతను ప్రదర్శించారు. సామాజికంగా వర్ణ, వర్గ భేదాలనేవి విద్యావకాశాలకు ఆటంకం కారాదనే దృక్పథం ఈయనలో కనిపించేది. అందువల్లనే ఈయన విద్యాధికారిగా ఉన్నప్పుడు దళితులకు పాఠశాల ప్రవేశం కల్పించారు. ఇది కులాలపై, తక్కువ కులాల వారిపై రెడ్డిగారికున్న దృక్పథం. వ్యక్తిత్వంలోను, సాహిత్యంలోను విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న కట్టమంచి రామలింగారెడ్డిగారు1951 ఫిబ్రవరి 24 మద్రాసులో చనిపోయారు.

ఇంతవరకూ సి.ఆర్.రెడ్డిగారి జీవితవిశేషాల్ని, సాహిత్యాన్ని పరిచయం చేసుకున్నాం. రాబోయే అధ్యాయంలో తెలుగు సాహిత్య విమర్శ స్వరూప స్వభావాల్ని, పేర్కొని కట్టమంచి రామలింగారెడ్డి గారి కవిత్వతత్వవిచారం గ్రంథంలో కనిపించే విమర్శ విశేషాల్ని ఆధారంగా చేసుకొని విమర్శకుడిగా ఆయన కృషిని, ఆయన విమర్శ దృక్పథాన్ని వివరించేప్రయత్నం చేస్తాను.

[57] . సి. ఆర్. రెడ్డి– పుట:16.

రెండవ అధ్యాయం

# కట్టమంచి

# సాహిత్య విమర్శ దృక్పథం

రెండవ అధ్యాయం

# కట్టమంచి సాహిత్య విమర్శ దృక్పథం

కట్టమంచి రామలింగారెడ్డిగారిపై పాశ్చాత్య సాహిత్య ప్రభావం విస్తృతంగా ఉందని ఆయన జీవితాన్ని, రచనలను పరిచయం చేసుకున్న తర్వాత స్పష్టంగా తెలుస్తుంది. ఆయన తాను చదువుకునే రోజుల్లో చదివిన కళాపూర్ణోదయం, దానిపై రాసిన విమర్శ వ్యాసం ఆయనలోని లోతైన ఆలోచనను అప్పటికే గమనించగలిగే అవకాశం ఉన్నా, పాశ్చాత్య దేశాల్లో చదువుకోవడం, తర్వాత భారతదేశం వచ్చి మరలా ఆ వ్యాసాన్ని రాయడంలో ఎంతో పరిపక్వత కనిపిస్తుంది. అందువల్ల ఆ 'కవిత్వ తత్వ విచారం' తెలుగు సాహిత్య విమర్శలో ఎంతో ప్రాధాన్యం పొందింది. అందువల్ల ఈ అధ్యాయంలో ఆ గ్రంథాన్ని అనుసరించి కట్టమంచి రామలింగారెడ్డి గారి సాహిత్య విమర్శ దృక్పథాన్ని తెలుసుకుందాం.

## 2.1 దృక్పథం :

సాహిత్యంలో 'దృక్పథం' గురించిన చర్చ ఆధునిక విమర్శలో విస్తృతంగా కనిపిస్తుంది. విమర్శకుడు ప్రపంచాన్ని, సాహిత్యాన్ని పరిశీలించే విధానాన్ని ఇక్కడ దృక్పథం అంటారు. ఇది సాధారణంగా సాహిత్యంలో భారతీయ దృక్పథం, పాశ్చాత్య దృక్పథంగా అధ్యయనం చేస్తుంటారు. ఈ దృష్టితో కట్టమంచి రామలింగారెడ్డి గారిది ఏ దృక్పథమో గుర్తించి, ఆ సాహిత్యాన్ని పరిశీలించడం ద్వారా ఆయన సాహిత్య దృక్పథం స్పష్టమవుతుందని అనుకుంటున్నాను.

కట్టమంచి రామలింగారెడ్డిగారు భారతీయ ఆలంకారిక గ్రంథాలను, పాశ్చాత్య గ్రంథాలను విస్తృతంగా చదివారు. అందువల్ల 'కవిత్వతత్త్వవిచారం' గ్రంథాన్ని పాశ్చాత్య సాహిత్య విమర్శన దృక్పథంతో పరిశీలించారని ఈ గ్రంథాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. దీనితో పాటు ఈయనకున్న **'ప్రాపంచిక దృక్పథాన్ని'** పరిశీలించడం కూడా అవసరమనుకుంటున్నాను. ఈయనకు మానవాతీత శక్తుల పట్ల నమ్మకంలేదు. దైవం కంటే మనిషికే ప్రాధాన్యాన్నిస్తాడు. సమాజంలోని పరిస్థితులే మనిషి అస్తిత్వాన్ని నిర్ణయిస్తాయని

భావిస్తారు. అందుకనే ఆర్థికంగా బలవంతులు, సామాజికంగా ఉన్నత స్థాయిలో ఉన్నవాళ్లు తమకంటే క్రిందిస్థాయి మనుషులకు సహకరించాలని భావించే మానవతా లక్షణాలు కట్టమంచి వారిలో ఉన్నాయి. అందుకనే దళితులకు కూడా విద్యాసౌకర్యాలు గురించి ఆలోచించారు. మొత్తం మీద ఈయన ప్రాపంచిక దృక్పథాన్ని 'భౌతక దృక్పథం'గానే భావించాలి. కానీ, ముసలమ్మ మరణం వంటి కావ్యాల్ని రాయడం వల్ల ఆయన్ని పూర్తిగా భౌతిక వాదిగా భావించవచ్చా? అనే సందేహం రావచ్చు. కానీ, అది తొలిదశలో రాసిన కావ్యం. తర్వాత ఆయన విస్తృతంగా అధ్యయనం చేశారు. ఆ అధ్యయననమే తన రచనల్లో ముఖ్యంగా విమర్శ, ఆర్థిక, రాజకీయ రచనల్లో ప్రతిఫలిస్తుంది. కాబట్టి ఆయనను భౌతిక వాదిగానే భావించే వీలుందని ఈ పరిశీలనలో గుర్తించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంతో సాహిత్యాన్ని, ఆయన ఆలోచనను పరిశీలిస్తే, ఒక శాస్త్రీయమైన దృక్పథానికే ఆయన ప్రాధాన్యాన్ని ఇచ్చారని సూత్రీకరణ చేసే వీలుంది. దీన్ని ' కవిత్తతత్వ విచారం', ఇతర రచనల్లో చూడొచ్చు. ఇప్పుడు కవిత్వ తత్వవిచారాన్ని పరిశీలిస్తాను.

## 2.2 కవిత్వ తత్వ విచారం – కట్టమంచి విమర్శన దృక్పథం:

కవిత్వ తత్వ విచారం1899లో వ్యాసరూపంలో ప్రారంభమైనది. అది 1914 నాటికి సమగ్ర గ్రంథంగా రూపు దాల్చింది. ఈ గ్రంథం రావడంతో విమర్శా రంగంలో నూతన యుగం ప్రారంభమైనదని విమర్శకుల అభిప్రాయం. [1] 1899 మద్రాసు క్రైస్తవ కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు సి.ఆర్.రెడ్డి కళాపూర్ణోదయంపై ఒక వ్యాసం రాశారు. ఆ వ్యాసం ఆ కళాశాలలోని సాహితీ సంస్థ అయిన ఆంధ్ర భాషాభిరంజనీ సభలో మిత్రుడు మొండేటి బాపనయ్య ప్రోత్సాహంతో చదివి వినిపించారు. ఆ వ్యాసం విన్న పండితులు బాగుందని ప్రోత్సహించారు. వేదంవేకటరాయ శాస్త్రి ఆ వ్యాసంలోని అవ్యక్త దోషాలను సరిచేసుకుంటే మంచి విమర్శ కాగలదని ప్రోత్సహించారు.1899 నాటికి ఈ వ్యాసం బాగా ప్రాచుర్యం పొందింది. కానీ అచ్చులోకి రాలేదు. దాన్ని అచ్చు వేద్దామని వావిళ్ళ వారు అడగ్గా అప్పటికే ఇంగ్లాండ్ చదువు ముగించుకొని రావడంవల్ల మళ్ళీ కొత్త ప్రతిని తయారుచేసే క్రమంలో ఇది ఒక ఉద్గ్రంథంగా తయారైందని రెడ్డిగారు కవిత్వ తత్వ విచారానికి రాసిన పీఠికలో[2] చెప్పుకున్నారు.

[1] గౌతమవ్యాసములు.పుట:103

[2] సి.ఆర్.రెడ్డి పీఠికలు, పుట: 27

కవిత్వ తత్వ విచారంలో మూడు భాగాలున్నాయి. మొదటి ప్రకరణంలో ఆదికవుల గుణదోషాలు, పద్యానికి, గద్యానికి గల భేదాలు, భావనాశక్తిని గురించి, వేమన సహజ కవిత్వం గురించి చెప్పారు. అనవసర అలంకారాల వల్ల కథ కుంటుపడుతుందని భావం కవిలో లోపించినప్పుడే అలంకారాల సంఖ్య అధికం అవుతుందని చెప్పారు. రెండవ ప్రకరణంలో పూర్వ ప్రబంధాలను వివరిస్తూ వసుచరిత్ర అనుసరించి వచ్చిన ప్రబంధాలను పిల్ల వసుచరిత్రలని పిలవచ్చని వాటిలోని లక్షణాలను చూపిస్తూ, వ్యంగ్యంగా, చమత్కారంగా విమర్శించారు. ప్రబంధాలలో నాటకీయత లోపించి ఒకే మూసలో పోసిన బొమ్మల తీరుగా కావడానికి ఆనాటి సాంఘిక పరిస్థితులే కారణమని పేర్కొన్నారు. మూడవ ప్రకరణంలో కళాపూర్ణోదయ రచనలో కనిపించే ప్రతిభా శైలి, ప్రభావతీ ప్రద్యుమ్నంలో ఏ విధంగా పరాకాష్టకు చేరిందో వివరించారు.

కవిత్వ తత్వ విచారాన్ని ఒక సాహిత్య విమర్శ గ్రంథంగానే కాకుండా లాక్షణిక గ్రంథంగా కూడా చూడవచ్చు. కవిత్వతత్వ విచారం ప్రథమ భాగంలో ఎక్కువ భాగం కవితా లక్షణాలు, భావనాశక్తి, లక్షణాంశాలను వివరించి చెప్పారు. ఆనాటి విమర్శకులు ప్రాశ్చ్య, పాశ్చాత్య సాహిత్య అంశాలన్నింటిలో ప్రతిభా పాటవాలు ఉండటంచేత ఆ రెండు సాహిత్య దృక్పథాలను తులనాత్మకంగా పరిశీలించారు. ఈ ప్రయత్నంలో కొన్నిచోట్ల సంస్కృత అలంకారిక సిద్ధాంతాలను విడిచిపెట్టడం జరిగింది.

కట్టమంచి రామలింగారెడ్డి కవిత్వ తత్వ విచారంలో ప్రధానంగా, భావనాశక్తి, భావతీక్షణత, ప్రభందములు – శృంగారము, వర్ణనలు, అలంకారాలు, పాత్ర రచన తత్త్వము, నాటకీయత, కవితానీతి గద్య పద్య తారతమ్యాలు అనే అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో ఈ అంశాలన్నీ ప్రాశ్చ్య, ప్రాశ్చాత్య లక్షణాలతో పోల్చి చెప్పారు. రామలింగారెడ్డి అనుషంగికంగా ప్రతిపాదించిన కథాలక్షణము, ఐక్యలక్షణము, ప్రబంధ లక్షణము, సమీక్ష చేశారు. పాశ్చాత్య ప్రభావంతో వెలువడిన రెడ్డిగారి విమర్శన దృక్పథాన్ని పరిశీలిద్దాం.

### 2.2.1 భావనాశక్తి:

భావాలను ప్రతిబింబింప జేయుట భావనాశక్తి(పుట:9). ఇది రచయితకు అత్యంత ప్రధానమైన విషయం. కవితను కళ్ళకు కట్టినట్లు హృదయం ఆహ్లాదంగా రచించడాన్నే కవి భావనా పటిమకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. రెడ్డి ఈ విషయాన్ని చక్కగా విశ్లేషించారు. *"భావనాశక్తియనగా విషయములను మనసులో ప్రతిబింబించినట్టు చేయు సామర్థ్యము. ఒక్క*

*ప్రతిబింబించుట యనయేల! ప్రత్యక్షముగా నవతారము నెత్తునట్లు చేయుట"* [3]అని రెడ్డిగారు భావనాశక్తిని నిర్వచించారు. విషయాన్ని ప్రతిబింబించినట్లు చేసినంత మాత్రాన భావనాశక్తి గల కవిని శ్రేష్ఠుడు అనవచ్చునా? అనే సందేహాన్ని తీర్చేటట్లుగా కొన్ని ఉదాహరణలు ఇచ్చారు. *"సీత, ద్రౌపది, సావిత్రి, దమయంతి, శూర్పణఖ మొదలగు స్త్రీలు కవి కల్పణమునకు చేరిన వారయ్యును, మనకు చరిత్రలోని స్త్రీల కంటెను మరియు మనము నిత్యమును జూచుచూ వాదులాడుచునున్న ఇరుగుపొరుగు భాగ్యశాలుల కన్నను నెన్నియో మడుంగులు సత్యముందాల్చిన వారై స్ఫురించు చున్నారు గదా! చూడబోయిన బాండవులు, దుర్యోధనాదులు, రామభరతులు మొదలగు మూర్తీభవింప జేయువారే మహాకవులు." [4]*

కల్పిత పాత్రలకు సైతము జీవమున్నట్లు పాత్రచిత్రణ చేయువారే మహాకవులని రెడ్డిగారి అభిప్రాయం. సి.ఆర్.రెడ్డి ప్రతిపాదించిన భావనాశక్తి ఆంగ్లంలో Imagination అనే పదానికి సమానంగా భావించబడింది.

***"Imagination has been variously defined as a power responsible for visual images, singly or, in association: as the capacity for making from these images, ideal combinations of characters and objects on the one hand, and chimeras and castles in Spain on the other; as a sympathetic projection of the artist into character and situation; as the faculty which creates the symbols of abstract conceptions; as the poetic equivalent of mystical intuition; as creation itself the shaping power inherent in man".[5]***

పాత్రలన్నీ కళ్ళముందు ప్రత్యక్షంగా రచయిత సృష్టించే విధానాన్ని Imagination అనవచ్చు. సంస్కృత లాక్షణికులు చెప్పిన "ప్రతిభ" దీనికి కొంత దగ్గరగా అనిపిస్తుంది. ప్రతిభ, వుత్పత్తి, అభ్యాసములు కావ్య హేతువులని మన అలంకారికులు చెప్పారు. కావ్య హేతువుల గురించి భామహుడు ***"కావ్యంతు జాయతే జాతు కస్య చిత్ప్రతిభావత"*** అని చెప్పారు[6].ప్రతిభావంతుడైన కవికి మాత్రమే కావ్య నిర్మాణం చేయడం సాధ్యమవుతుందని భామహుని అభిప్రాయం. రెడ్డిగారు కూడా ప్రతిభావంతుడైన వాడినే కవిగా

[3] కవిత్వతత్వవిచారము.పుట:4

[4] కవిత్వతత్వవిచారము.పుట:4

[5] Dictionary of world literary terms, forms, technique, criticism

[6] సాహిత్యసోపానములు.పుట:18

గుర్తించారు.అలంకార, వ్యాకరణ, ఛందః శాస్త్ర పాండిత్యాలు కావ్య నిర్మాణానికి కారణాలు కాలేవని రెడ్డిగారు ప్రతిపాదించారు.

*"వ్యాకరణము, యతిప్రాసలు అన్నియుందప్పక కుదిరిననూ భావనాశక్తి లేనియెడల నట్టి పాండిత్యము జీవము లేని యాకారము బలె జడంబుగ గాన్పించును."*[7]

అలంకార, ఛందో వ్యాకరణ శాస్త్రాల కన్నా కవిత్వానికి, భావనాశక్తి ప్రధానమని రెడ్డిగారి అభిప్రాయం. *"జన్మముచేతనే కవిగావలయుగాని, పఠనము, అభ్యాసము నివియుండిన మాత్రము చాలదు. తోడంబుట్టిన చాతుర్యముండినచో నివి సహాయ భూతములై వృద్ధిని, వికాసమును గల్పించవచ్చును. స్వాధీనంబగు మనో గాంభీర్యమలవడి యుండదేని కృషిజేయుట విత్తునాటక యెరువు వచ్చినట్లు కొన్ని పురుగులు మాత్రము సృష్టికి వచ్చునేమో!"*[8]

పుట్టుకతోనే కవి కావాలన్న రెడ్డిగారి ప్రతిపాదన. జగన్నాధుని సిద్ధాంతానికి సన్నిహితంగా ఉంది. జగన్నాధుడు ప్రతిభను అదృష్ట జన్యముగను, వుత్పత్యాభ్యాస జన్యముగను చెప్పారు.శక్తి సంస్కార విశేషమని మమ్మట్టుని అభిప్రాయం.

**"శక్తిః కవిత్వ బీజరూప సంస్కార విశేషః**
**యాంవినాకావ్యం న అసరీత్; అస్పతం కోప హసనీయంస్యాత్"**[9]

ఈ సిద్ధాంతాన్నే రెడ్డిగారు ప్రతిపాదించినది. ఇదే కావ్యాలంకార సూత్రంనందు కూడా ఉంది.

**"కవిత్వ బీజం అవిభానమ్ కవిత్వస్య బీజం కవిత్వబీజం**
**జన్మాంత రాగత సంస్కార విశేష కశ్చిత్ యస్మాద్బీజం వినాకావ్యం**
**ననిష్పద్యతేః నిష్పన్నం వాపహస్య యతేనం స్యాత్"**[10]

కవిత్వం బీజరూపమైన ప్రతిభ కలది. జన్మాంత రాగతమైన ఒకానొక విశేషము. అది లేని కావ్యం హాస్యాస్పదంగా ఉంటుందని కావ్యాలంకార సంగ్రహంలో చెప్పబడింది. అభిజ్ఞాన శాకుంతలానికి వ్యాఖ్య రాసిన శ్రీనివాసచార్యులు ప్రతిభ గురించి ఈ విధంగా చెప్పారు.

**"శక్తిః కవిత్వ బీజం హి**
**ప్రాక్తనీ సంస్కృతా మాతా**

---

[7] కవిత్వతత్వవిచారము.పుట:4

[8] కవిత్వతత్వవిచారము.పుట:5

[9] కావ్యప్రకాశము.పుట:6

[10] కావ్యాలంకారసూత్రము.అ.1-అది.3

**యయా లినా న ప్రసరే**

**త్కావ్యం శిక్షితా వపి"**

**ఇది దిండినాపి కేవల వ్యుత్పత్తి మతః కావ్యం ప్రత్యుక్త**

**"ప్రజ్ఞానవనహోన్మేష శాలినీ ప్రతిభామతా**

**తదను ప్రాణనా జ్జీవేద్రవనా నిపుణః కవిః**

**సతి వక్తరీ సత్యర్థేసతి శబ్దాను శాసనే**

**అస్తితన్న వినాయేన పరిశ్రవతి వాఙ్మయం"**

కవిత్వం బీజరూపమైన శక్తి కలిగి ప్రాచీన సంస్కారం కలిగి ఉంటుంది. అది లేకపోతే కావ్యాన్ని కేవలం అభ్యాసం చేత రచింపలేము అని దండి అభిప్రాయం. వ్యుత్పత్తి ప్రజ్ఞ అనునిత్యం నూతనమైనవని శ్రీనివాసాచార్యుల అభిప్రాయం.

**"సరస్వతీ స్వాదు తదర్థవస్తు**

**నిష్యంద మానా మహతాం కనీనామ్**

**అలోక సామాన్య మిభివ్య వ్యక్తి**

**పరిస్పురంస్తం ప్రతిభా విశేషమ్"**[11]

మహాకవుల యొక్క ప్రతిభా విశేషాలు అసామాన్యములై ప్రకాశిస్తుంటాయి అని ఆనందవర్ధనుడు చెప్పారు.ఈ అలంకారికులు చెప్పిన సిద్ధాంతాలన్నీ రెడ్డిగారు చెప్పిన భావనాశక్తి సిద్ధాంతానికి సన్నిహితంగా ఉన్నాయి. భావనాశక్తి అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించే సందర్భంలో సంస్కృత లాక్షణికుల భావాల్ని ఆంగ్ల విమర్శకుల భావనలను దృష్టియందు ఉంచుకోని వారిరువురిలోని లక్షణాలను గ్రహించి భావనాశక్తి అనే పేరుతో సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడని పరిశోధకుల అభిప్రాయం.

### 2.2.2 భావ తీక్ష్ణత:

***"భావనాశక్తిని ఉద్దీపింపజేయు ప్రకృతి భావతైక్ష్యము. ఈ భావతైక్ష్యము భావనాధుని నుండి ఉబ్బెత్తుగానుబుకు ఆవేశము. నిద్దుర నుండి జీవకళకు ఎగురజిమ్మను నిస్తబ్ధవ నుండి గీతికాధారలను వెడలించును. రసబంధుర హృదయంనుండి సౌందర్యమును కురిపించును ఇట్టి భావతైక్ష్యము"***[12] రెడ్డిగారు ఈ విధంగా నిర్వచించారు.

[11] ధ్వన్యలోకము.ఉ.1.శ్లోకం.6

[12] కవిత్వతత్వవిచారము.పుట:8

- మనుష్యుల మనంబులో నిరంతరం సంయోగముందాల్చిన ప్రకృత్తులు మూడు గలవు.
- ఆలోచనములు, కార్యకారణములంగూర్చి విచారణము వస్తు స్వరూపము నిర్వయించుట యిత్యాదులు.
- భావములు అనగా మనోవికారములు. ఉదా: కామ క్రోధాదులు, ప్రేమ, పశ్చాత్తాపము, దయ, దాక్షిణ్యము మొదలగు చిత్త సంచారములు అనగా నేదైనానొకదానింగోరి దానిని సాధింపవలయునని ప్రతిజ్ఞ బూనుట.

ఈ మూడు శక్తులలో భావనాశక్తిని అధికంగా వ్యాప్తి చేయునది భావములు. రామలింగారెడ్డి భావాశక్తికి సహాయకారులగు భావములను మూడు రకాలుగా విభజించారు. ఆలోచన, భావము, సంకల్పము అను మూడు శక్తులు భావనాశక్తిని ఉద్దీపింప చేస్తాయని చెప్పారు. వీరు ప్రతిపాదించిన భావతైక్ష్యము అను పదము ఇంగ్లీషులోని Inspiration అను పదానికి సమానార్థకంగా వాడబడుతుంది. ***Inspirationను నిర్వచిస్తే "A poet is said to be inspired when he is believed to function not in the same way as other workers not depending on his own intellectual powers, but acted upon by superior force that determines the quality of his work.*** [13]

ఒక కవి ఇతరుల రచనా విధానము తన ప్రజ్ఞా విశేషములచే గాక ఒకానొక అత్యధిక శక్తిచే తన రచనను ప్రదీప్తి గావించినప్పుడు భావావిష్టుడైనట్లుగా చెప్పవచ్చు. ఈ అభిప్రాయాన్ని రామలింగారెడ్డి ఈ విధంగా చెప్పారు. ***"కొయ్యలరీతినో, మహర్షుల చందంబుననో నిర్వికార స్థితి నుండువారు పద్యములు రాయనేర్తురుగానీ కవులగుట యసంభవము. ఏ వృత్తాంతమునైన జూచునట్లు వర్ణింపవలయునన్న దాని యొక్క స్థితిగతులను అందలి పాత్రముల సుఖః దుఃఖములను, రోమి, రోమమునకు దాన్నే మనఃపూర్వకముగా ననుభవించినందప్ప తద్రూపముగా నభినయింప నెవరికినీ వరముగాదు. చిత్త చాంచల్యము గూడదనువారు యిట్టి అనుభవములకు మనసిచ్చి సమ్మతింపరు గావున గారెయందు శాస్త్రజ్ఞాన మొకవేళ బ్రకాశమునకు వచ్చిన రావచ్చును గానీ శిల్పకళలేమాత్రము మొలకెత్త నేరవు[14].*** కవి తన అంతరంగమున అనుభూతి చెంది రచించిన రచన ఉత్తమ రచనగా భావించబడుతుందని రెడ్డిగారి అభిప్రాయం. ఈ భావమును సంస్కృత అలంకారికులు కూడా చెప్పారు.

---

[13] Dictionary of world literary terms, forms, technique, criticism.pg:163

[14] కవిత్వతత్వవిచారము.పుట:9

ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకంలో భావావేశమునకు ఆదికవి వాల్మీకిని ఉదాహరణగా చెప్పారు.

**కావ్య స్యాత్మా స ఏవార్థస్తధా చాదికవేః పురా**

**క్రౌంచ ద్వంద్వ వియోగోత్థః శోకః శ్లోకత్వ మాగతః**[15]

వివిధ వాచ్య వాచకరచనా ప్రపంచ చారుణః కార్యస్య స ఏవార్థః సారభూతః, తధాచాదికవేః వాల్మీకౌః సన్నిహితర్సహచారీ విరహకాంతర క్రౌంచా క్రన్ద జనితః శ్లోకతయా పరికాతః... వివిధ వాచ్య వాచకముల రమణీయమైన కావ్యమునకు అర్థమే ఆత్మ వంటిది. కావునే ఆదికవి వాల్మీకి యొక్క సన్నిహిత క్రౌంచ మిధున వియోగ సంజనితమైన శోకమే శ్లోకరూపంలో జనించింది. అనగా వాచ్యార్థములకంటే భిన్నమైన ఈలాంటి శక్తి రచనా హేతువగుతున్నది అదే భావావేశము. రెడ్డిగారు చెప్పినట్లు ఇది కవి రోమరోమానికి తాను అనుభవించి రచించిన రచన అవుతుంది. ధనంజయుడు దశరూపకాలలో భావనాశబ్దాన్ని ఈ విధంగా నిర్వచించారు.

**"యస్తు సర్వ రసాన్భావయన్ భావ ఇతి కవేరంతర్గతం భావం భావయన్**

**భావ ఇతచ తదచినయ కావ్యయోః ప్రవర్తమానస్య ప్రవృత్తి నిమిత్త కథనం"**[16]

దశరూపకారుని అభిప్రాయం ప్రకారం దృశ్యకావ్యములందు భావన అంతర్గతంగా ఉంటుంది. భాలావిష్ణుడైనతం మాత్రాన కవిని తప్పుగా తలంచరాదని లోచనాకారుడు అభిప్రాయపడ్డారు.

**"శృంగారేతి శృంగారోక్త విభావానుభావ వ్యభిచారి చర్వణా**

**రూప ప్రతితీమియః నతు స్త్రీ వ్యసనీతి మంతవ్య"**

శృంగారీ అనగా శృంగారోక్తములయిన విభానుభావా వ్యభిచారీ భావముల చర్వణకనురూపమైన ప్రతీతి కలవాడని అర్థము కానీ స్త్రీ వ్యసనము కలవాడని అర్థం తీసుకోనరాదు.

పై విషయాన్ని ఇక్కడ మరొక విధంగా రామలింగారెడ్డి చెప్పారు.***ఈ విషయమూ పామరులు సైతము గొంతకు కొంత యెరిగినదే. కావునే కాళిదాసు, తిక్కన మొదలగు మహా కవులెల్లరును రసికులనియు స్త్రీలోలురనియు వారు గాథలు కట్టియుండుట***[17]...

[15] ద్వన్యలోకము.ఉ.1.శ్లోకం.5

[16] దశరూపకము.పుట:4

[17] కవిత్వతత్వవిచారము.పుట:9

సాహిత్యమునందు కొందు పురుషులను శృంగార పురుషులుగా గుర్తించుట వారి భావావేశ శక్తి అని రెడ్డిగారి అభిప్రాయము. ఈ విధంగా గుర్తించరాదని లోచనకారుని అభిప్రాయం.

భావనాశక్తికి ఉత్సాహమునకు సమ సంబంధ సామ్యము కలదు. ఈ రెండింటి సంబంధాన్ని రెడ్డిగారు ఈ విధంగా నిరూపించారు.

***"ఘనములైన రాజకార్యంబులందాసక్తినీ ప్రవేశించినవారు గద్య పద్యాది నిర్మాణ శిల్పమునకుం దొడగు వారైనచో సులభముగను ద్వరితముగనుదత్కళా ప్రవీణులౌట నైసర్గికము. కార్యగంభీరుల రచనల యందు సారము, వీర్యము, ఉద్వేగము, చుఱుకుదనము ఇత్యాది నానా పదంబులచే బేర్కొనబడు సుగుణమెఖండు అఖండముగా నుండును.*[18]**

కవికి కవిలోగల ఉత్సాహానికి గల సంబంధాన్ని రెడ్డిగారు వివరించారు. దీనికి కాళిదాసు – తిక్కనలను ఉదాహరణలుగా పేర్కొన్నారు.

***"దీని రాజు కార్య విచక్షణుడైన మన తిక్కనయే నిర్వికల్పుడైన సాక్షి కాళిదాసుడును గార్యోత్సాహపరులలో మిన్నమైనవాడని యతనిం గూర్చిన కథలచే నూహింపచవచ్చును".*** [19]

భావనాశక్తిని గురించి బసవరాజు అప్పారావు అభిప్రాయం:

"ఈ భావనాశక్తి స్వభావమును గూర్చి కట్టమంచి రామలింగారెడ్డిగారు తమ కవిత్వ తత్వ విచారమున బహు విపులముగను చక్కగను మనసున కెక్కునట్లుగను రాసినారు.

### 2.2.3 ప్రబంధములు – శృంగార వర్ణన:

ప్రబంధాలలోని శృంగార వర్ణనలను నవ్యసాహిత్య విమర్శకులు సునిశితంగా విమర్శించారు. ఈ విమర్శ చేయుటకు వారిపై కొంతవరకు భావకవిత్వ ప్రభావం ఉండి ఉంటుంది. అమలిన శృంగార సిద్ధాంతం ఆధునిక సాహిత్యాన్ని అమితంగా ప్రభావం చేసింది. స్త్రీకి సమాజంలో గౌరవాభిమానాలు పెరిగాయి. స్త్రీని కేవలం భోగ వస్తువుగా కాకుండా పూజ్యవస్తువుగా చిత్రించారు. ఈ సమయంలోని ప్రాచీనసాహిత్యాలలోని ప్రబంధాలలో మితిమీరిన శృంగార వర్ణన ఆధునిక సాహిత్య విమర్శకులకు ఏవగింపు కలిగింది.

కందుకూరి వీరేశలింగం పంతులు సరస్వతీ నారద విలాపంలో నిరర్థక శబ్ద ప్రయోగాలతో, వ్యర్థ అలంకార ప్రయోగాలతో నిండి రస పోషణకు ప్రాధాన్యం ఇవ్వని

---

[18] కవిత్వతత్వవిచారము.పుట:9

[19] కవిత్వతత్వవిచారము.పుట:10

రచనలను వ్యంగ్యంగా విమర్శించారు.ప్రబంధ రచనలను గుడ్డిగా అనుకరించి పచ్చి శృంగార కావ్యాలు వెలిసినట్టి క్షీణ యుగాన్ని కవిత్వాన్ని విమర్శించారని చెప్పవచ్చు.

రామలింగారెడ్డి క్షీణయుగంలో వచ్చిన కవిత్వాన్నే కాక కొన్ని ప్రబంధాలను ప్రత్యక్షంగా విమర్శించారు. వీరేశలింగం విమర్శించిన నిరర్థక వ్యర్థ శబ్ద ప్రయోగములనే కాక వ్యర్థాలంకార ప్రయోగాలను, మితిమీరిన కొత్తదనములేని శృంగార రసపోషణమును తప్పు బట్టారు. శృంగార రసపోషణ, వర్ణనపై కవిత్వ తత్వ విచారంలో ఎక్కువ విమర్శించారు. కవిత్వ తత్వ విచారంలో పాశ్చాత్యుల శృంగార వర్ణనకు, మన యొక్క శృంగార వర్ణనకు గల భేదాలను చెప్పారు.

*"వారి యొక్కయు మన యొక్కయు తారతమ్యము లేవనగా, మనవలె వారంగాంగ వర్ణమంతగా జేయరు. జేసినను మొగము, కన్నులు మొదలగు బహిర భాగములు మాత్రము ప్రశంసింతురు. మనలో నకశిఖ పర్యాంతము విప్పి చూపుట నందఱు న్యాశయించున కావ్య లక్షణము. పడకటింటిలోనికి వెళ్ళిన గూడ చెలికత్తెలామెను వదలినను వదలదుగాని కవిమోమె ఒక నిముషమైన వదలడు ఱెప్ప వేయక యట్లే చూచుచుండును. రవి గాంచని చోట కవి గాంచుట మనలోని ముఖ్య సంప్రదాయం. వేదాంత విద్యాదీప్తిమంతమైన ఈ పుణ్య భూమిలో నీరు _______ యుండుటకు గారణమేమన స్త్రీలను జాగ్రత్తగా మఱుగున నుంచుటయే."*[20]

మనకు పాశ్చాత్యులకు శృంగార వర్ణనలో గల భేదాన్ని అందులో అంగాంగ వర్ణన ప్రధానమైనదని రెడ్డిగారు చెప్పారు. ఈ భేదానికి వీరు చెప్పిన శృంగార వర్ణన తెలుగు సాహిత్యంలో కేవలం ప్రబంధ యుగంలో మాత్రమే ప్రారంభమైనది. అప్పటి నుండే శృంగార వర్ణన మితిమీరి కావ్యాల్లో ప్రవేశించింది. శృంగార రస వర్ణన పరిణామ క్రమాన్ని జోగారావుగారు ***కవిత్రయం దగ్గర నుండి నేటిదాకా దాని పరిణామ క్రమాన్ని అది పతనావస్థకు చెంది చివరకు కూచిమంచి జగ్గన నోటిలో బూతులు పలికే స్థితి వచ్చినది ఆంధ్ర శృంగార రసపోషణము.*** [21]ఈ పచ్చి శృంగార వర్ణనలతో పాఠకులు విసుగెత్తినారని చెప్పారు.

శృంగార వర్ణన ఉదాత్త స్థాయినుండి దగజారుటకు రెడ్డిగారు కొన్ని కారణాలను చూపించారు. స్త్రీల గుణాన్ని పాశ్చాత్యులు శ్లాఘించగా, మన కవులు రూపాన్ని మాత్రమే వర్ణించారు. ఇలా చేయుటకు కారణం మన వారిలో దేహ సాంగత్యమే కానీ మనః సాంగత్యం లేకపోవుటయే కారణమని చెప్పారు.

---

[20] కవిత్వతత్వవిచారము.పుట:88

[21] భారతి.వైశాఖమసము1952.

ఆనాటి సాంఘిక పరిస్థితులను బట్టి చూస్తే రెడ్డిగారి అభిప్రాయం సమంజసంగానే అనిపిస్తుంది. శృంగార రసపోషణ ప్రబంధ యుగంనుండి అధికమైనదని చెప్పుట నిర్వివాదాంశము. ఆ కాలం నాటి సాహిత్యము రాజ దర్బారులలో వెలసిన సాహిత్యం వల్ల కావచ్చు, కేవలం రాజులను ఆనందింపజేయుటకై సాగించిన రచనలు కావచ్చు ఈ శృంగార వర్ణన ఆధునికసాహిత్యంలో కూడా బలంగానే కనిపిస్తుంది అని గురజాడ ప్రతిపాదించారు.

*"కావ్యాములలో శృంగారమెంతవరకు వర్ణతీతమను చర్చ తెలుగు పత్రికల్లో జరుగుచున్నది. ఒక్కొక్క పుస్తకమును బట్టి దానిలోని పది పంక్తులు తీసి వాటిని పచ్చి శృంగారంగా యెంచి పుస్తకమును గ్రహించుటన్నది అల్పదృష్టి. గతకాలంలోనూ, అన్యదేశంలోనూ కళల స్థితిని కానకచేయు సిద్ధాంతము బట్టి సిద్ధాంతములు కానీ గట్టి సిద్ధాంతములు కానరావు. పాశ్చాత్య కవులలో శృంగారము మెండా, మనలో మెండా? అను విషయమున పండితులు భిన్నాభిప్రాయులై యున్నారు. పాశ్చాత్యులు మన కావ్యములందు పచ్చి శృంగారము మెండని అనాలోచితముగా వ్రాయుట కలదు గానీ, వారింట మంటి కుంపటని వారు చూచుకున్నచో వారు నోరెత్తరని నా నమ్మకము."*[22]

రెడ్డిగారి కాలం నాటికి శృంగార రస చర్చ ఏ విధంగా సాగుతున్నదో దీనిని బట్టి తెలుస్తుంది. శృంగారమనేది సర్వ సాహిత్యములందు కొద్దిగానో, గొప్పగానో గల రసరాజమే. ఆ శృంగార రసము దేశకాల బేధములనుసరించి భిన్న స్థాయిలతో ఉంటుంది. అశ్లీల శృంగారము దోషము కానీ అధిక శృంగార వర్ణన దోషము కాదు.

కవియతీతి కవిః కవియతి అనగా వర్ణయతి అని అర్థము. దర్శనాత్ వర్ణనాచ్చాద రూఢాలోకే కవిశ్వతిః వర్ణనాశబ్దము కవి శబ్దంలోనే కనిపిస్తుంది. వర్ణనలని అష్టాదశ వర్ణనలుగా అలంకారికులు నిర్ణయించారు. కథాకథనము, సన్నివేశ చిత్రణలు లాంటి విషయాలు కూడా వర్ణన కిందకే వస్తాయి. సమర్థుడగు కవి చేసిన వర్ణనము సన్నివేశమునకు పాత్ర పోషణమునకు సరిపావునవిగానుండును. అలా కాకుండా కొంతమంది కవులు వర్ణనౌచిత్యము కోల్పోయి వర్ణిస్తారు.

రెడ్డిగారు వర్ణనకు, అంగాంగమునకు సాంగత్యముండాలని ప్రతిపాదించారు.

*"వర్ణములకన్నా ముఖ్యమైన విషయమేదనగా కావ్యమునందలి యంగాంగములకుం గల కలయిక. పొత్తు పొసగని వర్ణనలు, రసమునకుం ప్రతికూలములు"*[23]. అలంకార

---

[22] వ్యాసచంద్రిక.పుట:9

[23] కవిత్వతత్వవిచారము.పుట:29

గ్రంథాలలో పేర్కొన్న అష్టాదశ వర్ణనలను పొందికతో సంబంధంలేక కావ్యాలలో చొప్పించిన కవులనే రెడ్డిగారు విమర్శించినది. ఈ లోపము అలంకార గ్రంథకర్తలది కాదు ఎందుకంటే వారు వాచకములైన వర్ణనాదులకు వాచ్యములైన రసముతో పొత్తు ఉండాలని అది అవసరం కూడా అని చెప్పారు.

**" వాచ్యానాం వాచకానాంచ యదౌచిత్యేనయోజనం**

**రసాది విషయే ణైతత్కర్మ ముఖ్యం మహాకవే"**[24]

వాచకములైన వర్ణనలకు, వాచ్యములైన రసాలకు చక్కని పొత్తు కుదిర్చి తద్వారా సంపుష్టి కలిగించడం ప్రధాన కర్తవ్యమని పై శ్లోకానికి అర్థం.

## 2.2.4 కావ్యం – అలంకారాలు:

కావ్యాలలో అలంకారాలు అవసరమా? అనవసరమా? అను చర్చను రెడ్డిగారు చేశారు. వీరు కొన్ని అలంకారాలు రసపోషణకు అటంకములని ప్రతిపాదించుట సాహిత్యలోకంలో సంచలనం కలిగించింది. వీరి అభిప్రాయాన్ని ఖండిస్తూ బహుజనపల్లి సీతారామయ్యగారు "అలంకార తత్వ విచార విమర్శనము" అనే గ్రంథాన్ని రచించారు. కొన్ని అలంకారాలు రసపోషణకు అవశ్యకమని వీరి సిద్ధాంతాన్ని సూక్ష్మ దృష్టితో పరిశీలించిన అదే నిజమని తోస్తుంది. ***"మన కావ్యములలో నుపమాద్యర్థాలంకారములును, అనుప్రాసాది శబ్దాలంకారములను దఱచుగా నుపయోగింపబడియుండుట యెల్లరకు దెలిసిన సంగతియే. అందు శబ్దాలంకారములంతగా ముఖ్యములు గావనుట యందఱు నొప్పుకొందురు. గాన వానిమాట ప్రస్తుత్త మాటుండనిత్తము. అలంకారములలో ప్రధానమైనవి ఉపయోత్ప్రేక్షాదులు. వీటికి మూలాభూతమైన ధర్మమేదనగా ప్రకృత వస్తువునకు మఱేదోయొక వస్తువునకు నామరూప స్వభావాదులంబట్టి సామ్యము కల్పించెడు శక్తి పోలికలను స్థాపించుట సొగసైన కార్యమే యైననూ కవితకు ఖండితముగా నుండవలసిన లక్షణము కాదు. మనవారు అలంకారముల యెడ నమితాదరత కొన్నవారు కాబట్టి యొకటి రుం కారణములు జూపుట యావశ్యకము. శిల్పమునకు వర్ణమప్రధానము కాదనువారెవరును లేరు."***[25]

ఇక్కడ రెడ్డిగారు ప్రతిపాదించిన అంశాలేవంటే, వర్ణనలో శబ్దాలంకారాలు అంత ముఖ్యం కాదు. ఉపమ, ఉత్ప్రేక్ష అలంకారాలు ప్రధానమైనవి. ప్రతి వర్ణనలోనూ అలంకారాలు

---

[24] ధ్వన్యలోకము.

[25] కవిత్వతత్వవిచారము.పుట:13

తప్పక ఉండాలనే నియమం లేదు. ఈ అంశాలను అలంకార శాస్త్రానుసారంగా పరిశీలించిన వీరి అభిప్రాయము సమంజసంగానే అనిపిస్తుంది. అలంకారాలను ఏ రీతిలో ప్రయోగించారో రెడ్డిగారు ఈ విధంగా చెప్పారు.

*"అలంకారములంగూర్చిన ముఖ్య పద్ధతులెవ్వియనన అయ్యవి ప్రయత్నము లేకయే వచ్చినంత సహజముగా నుండుట కథలోని స్త్రీ పురుషులు మాట్లాడునప్పుడు పాత్రౌచితములైనటువంటి కొన్ని అలంకారాలను మాత్రమే ప్రయోగించుట. కవియే వర్ణించినపుడొకింత యెక్కువగానలంకారములు వాడినను దోషము లేదు".*[26]

అలంకారములప్రయత్నముగా వచ్చినటులుండవలెను గానీ, ప్రయత్నపూర్వకముగా ప్రయోగించినట్లుండరాదు. పాత్రల సంభాషణ నడుమ కవియే వర్ణించునప్పుడు అలంకారములు ప్రయోగించవచ్చు అనే రెడ్డి ప్రతిపాదన అవశ్యకమైనదని చెప్పవచ్చు.

### 2.2.5 కావ్యం – పాత్ర రచనా తత్త్వం:

సంస్కృతాంధ్ర సాహిత్యాలలో నాయకుడు అలంకార శాస్త్ర నియమానుసారంగా ధీరోదాత్తుడు, ధీరలలితుడు, ధీరోద్ధతుడు, ధీరశాంతుడు అని నాలుగు రకాలుగా ఉంటారు. ప్రతి కావ్యంలో నాయకుడు ఒకే రీతి పాత్రను పోషించుట ఇంచుమించుగా చూస్తున్నాము. ఇలాంటి స్థితిని వ్యతిరేకిస్తూ రెడ్డిగారు పాత్రలయందు విభిన్న స్థితిగతులుండాలని ప్రతిపాదించినారు.

*"పాత్రముల చరిత్రములను విస్తరించుటలో వర్ణనీయమైన పద్ధతి యేదనగా స్త్రీ పురుషులు గుణానుగుణమైన నడవడికల వారయ్యును ప్రబంధములయందువలె కావ్యములందును గల దేశ వర్తమానము వలన దొక్కొక్క యెడ విరుద్ధమైన వర్తము గలవారుగా నున్నట్లు ప్రవర్తించుట. సర్వకాలములయందును సర్వావస్థలయందును ఏకరీతిగా వర్తించువారుండుటయందు మొత్తము మీద జూడ ఎంత క్రమముగానున్నట్లు దోచినను సూక్ష్మముగా బరీక్షించి చూచిన యెడల వంకరలేమాత్రము లేకుండవు. బుజుమార్గం బట్లుండగా నిక్కమైన యుపజ్ఞ లేమిచే బరులో, పెద్దలో చెప్పినట్లు వ్రాయజూజు నలతి కవులు అలంకార శాస్త్రములలో నాయికా నాయకులకు జాతలలనేర్పరచి గుణముల నిర్ణయించి యుండుట బాగుగా పరికించి యున్నవారు గాన నదియ యెక వేదయను కానీ ప్రమాణమును పిచ్చిబట్టి యందు బేర్కొనబడిన ధీరోద్దాత్త ప్రభూతులలో దమకు వలయువారిని స్వీకరించుకొని*

[26] కవిత్వతత్వవిచారము.పుట:14

*యెల్లదెరగులం బ్రాచీనోపదిష్ట మార్గంబుననే వర్ణించి యెదుట నిలుపుటయు కృతకృత్యగా భావించిరి."*[27]

ఇక్కడ అలంకార సిద్ధాంతాలను గుడ్డిగా అనుకరించే కవులను విమర్శించారు.శాస్త్రానుసారంగా పాత్ర నిర్మాణం చేయకూడదని వీరి అభిప్రాయం. ప్రాచీన సాహిత్యం అంతటా పాత్రలు ఒకే రీతిలో వర్ణించబడ్డాయని విమర్శించారు.అంత మాత్రమున తెలుగు సాహిత్యంలో పాత్ర రచనా నైపుణ్యమును చూపినవారు లేరా?

పాత్రలనితరతుల్యములని రెడ్డిగారు నిరూపించారు. ***"సుప్రసిద్ధమైన పాత్రలనియు ననితరతుల్యములు, మరియు ననితరతుల్యములే సుప్రసిద్ధములు. ఉదా: ద్రౌపది, సీత, సావిత్రి, శకుంతల, మండోదరి, శూర్పణఖ మొదలగువారు ఎల్లరచిత్తములలోను జక్కగా దమ తమ గుణములచే బ్రకాశమానాలుగనున్నారు. వీరిలో మంచివారు సైతము భిన్నమూర్తులే గానీ ప్రత్యేకపరచుటకు సాధ్యము కాని యెకేయచ్చున గొట్టినట్టి బొమ్మలు కారు ఇక ప్రబంధ స్త్రీలన్ననో యట్లుగాదు.అందఱుకునొకటేమూర్తి".*** [28]

భారతంలోని పాత్రచిత్రణలో వైవిధ్యం కనిపిస్తుంది. ప్రబంధ పాత్రలలో పాత్రలన్నీ ఒకే తీరుగా ఉంటాయని విమర్శించారు.పాత్ర చిత్రీకరణలో వైవిధ్యముండాలన్న రెడ్డిగారి అభిప్రాయం పాశ్చాత్య సిద్ధాంతాలలో కూడా కనిపిస్తుంది.

***"It is not claimed that all human beings can be classed in one or the other of the sharply separated groups".***[29]

వ్యక్తికి, వ్యక్తికి కొంత బేధముంటుంది. ప్రపంచంలో పుట్టిన ఏ వ్యక్తికి, వ్యక్తికి మధ్య ఏదో కొంచెమైనా తేడా ఉంటుంది. అలాంటి బేధం లేకుండా ఉండుట సాధ్యం కాదని పై పంక్తులలోని అర్థము. ఈ సిద్ధాంతాన్నే అనుసరించి రెడ్డిగారు చెప్పినట్లుగా కావ్యంలో పాత్రలన్నీ ఒకే రీతిగా ఉండునట్లు చేయడం మంచి పద్ధతి కాదు అన్నది సమర్థనీయంగానే ఉంటుంది. పాత్రలను కవి తను ఊహించి, తన దృక్పథం అనుసరించి రాయడం సమంజసంగా ఉంటుంది కానీ మిగతా వారు శాసిస్తే వచ్చే పాత్రలు అంత సజీవంగా ఉండవని రెడ్డిగారి అభిప్రాయం. ***"బింబములకు ప్రతిబింబముల నుత్పాదించుట కవి చేయవలసిన పనికాదు. మరి ఫోటోగ్రాఫర్‌ది తన మనస్సుకు దగినట్లు, తన కన్నులకు గోచరించునట్లు వ్రాయవలయునే గానీ యింకెవరికో***

[27] కవిత్వతత్వవిచారము.పుట:21

[28] కవిత్వతత్వవిచారము.పుట:23

[29] *Abnormal psychology.Pg:435*

*తోటినట్లుగా వ్రాయజూచుట మూఢమతము. అట్లు చేసిన బద్యములు సిద్ధించినను గవిత పక్వస్థితికి రాజాలదు. ఇందునకు గారణములు మనసులు వేఱు. సంపూర్ణముగా సరిపోలునవి దుర్ఘటములు గావున నేవిషయం గూర్చి చర్చించిననూ సరే యొకనికి తోచు భావము లితరుల భావములతో గొంతవరకు సదృశములై యున్నను గొంతవరకు భిన్నములుగను నుండుననుట ప్రకృతి లక్షణము".*[30]

మానవ ప్రకృతిని పరిశీలించినప్పుడు సన్నివేశములు సమానములైననూ ఆయా పాత్రల ఊహలలో కొంత సామ్యము కనిపిస్తుంది. బింబ ప్రతిబింబాలలాగా ఒకే రీతిగా నుండుట అస్వాభావికం అని రెడ్డిగారి అభిప్రాయం. ఆనందవర్ధనుడు కూడా ధ్వన్యాలోకంలో పాత్ర రచన ఒకే విధంగా ఉండరాదని చెప్పారు.

**"సంవాదో హ్యన్య సాదృశ్యం తత్పునః ప్రతిబింబవత్।**
**అలేఖ్యాకారవత్ తుల్య దైహివచ్చ శరీరిణామ్**
**తత్ర పూర్వ మన న్యాత్మ తుచ్ఛాత్మ తదనన్తరమ్**
**తృతియయ ప్రసిద్ధాత్మ నాన్వసామ్యంత్యజేత్కవిః ।।"**[31]

కవి తన ఊహకు వచ్చిన విధంగా పాత్ర నిర్మాణం జరగాలనే రెడ్డిగారి ప్రతిపాదనకు ధ్వన్యాలోకం ఊతం ఇస్తుంది, బలపరుస్తుంది. మిశ్ర చరిత్రముగానీ పాత్రములు ప్రకృతి విరుద్ధములని రెడ్డిగారి అభిప్రాయం.

*"పాత్రములంగూర్చియావఱకు స్థాపింపబడిన పద్ధతులు రెండు విధాలు. అవి, 1) నిర్జీవములట్లు బిఱ్ఱ బిగిరి యుండగూడదు, 2) మఱి తీగవలె నల్లునవిగానున్న నింపును సత్యమును వహించినవగును అనుట. ఇక్కడ విశేషించదగిన అంశం ఏదంటే పాత్రల చరిత్ర మంచిగానో చెడ్డగానో ఉండినట్లు తీర్చుట. శిల్పదోషాలలో ఒకటి. ఏ లోపమూ లేని స్త్రీ పురుషులు ఉండరు. మఱి కేవలము దుష్టులైన మానవులును గంటికి గానరారు. మనుష్య ప్రవృత్తి మిశ్రమమైనది"*[32]. పాత్రలు ఎప్పుడూ ఒకే రీతిగా కాక వాటిలోని మంచిచెడ్డలను యదార్థ జీవితమునకు ప్రతిబింబంగా వర్ణించాలని రెడ్డిగారి అభిప్రాయం.

పాత్రలు విభిన్న పరిస్థితులలో విభిన్న రీతులుగా ఉండాలి అనే అభిప్రాయంతో పాశ్చాత్య విమర్శకులు కూడా అంగీకరించారు. సంస్కృత అలంకారిక సిద్ధాంతాలను

---

[30] కవిత్వతత్వవిచారము.పుట:21

[31].ధ్వన్యాలోకము.ఉ-4,శ్లో.12

[32] కవిత్వతత్వవిచారము.పుట:27

అనుసరించి రాసే రచనలలో మాత్రము పాత్రల స్థితిగతులలో విభిన్నతను అంతగా వర్ణించి చెప్పలేదు. ఈ సిద్ధాంతాన్ని విమర్శిస్తూ వెంకటేశ్వర్లు గారు ఈ విధంగా చెప్పారు.

*"నాయిక ప్రవర్తని వర్ణించుచో నేదుశ్చేష్టలలో గూడదలవని వర్ణింపవచ్చునా? అట్లు వర్ణించుచో నాయకుని అభిలషణీయ జ్ఞానము సాఫల్యము నొందునా ఏ మానవుడైన నెంత సృష్టి దర్మ దెలిసినను దనకచిలుషణీయమైన నాయిక సర్వోత్కృష్ట చరిత్ర గలదిగను, సర్వోత్కృత సౌందర్యము గలదిగను ఉండవలయునని కోరునే గానీ యేదుశ్చేష్టలో గలదిగా గానీ యే యసుందర రూపమో గలదిగా గానీ యుండవలెనని కోరునా? ఏ శిల్పులైనా తమ ప్రతిమలకు గొన్ని దోషములను/వైకల్యములను సంక్రమింపచేయజూతురా? కనుక రసభంజక మిశ్రమ ప్రవృత్తియే వర్ణ్యమే".*[33] లోపసహితమైన పాత్రల వర్ణన అంగీకారం కాదని వెంకటేశ్వర్లుగారి అభిప్రాయం. వీరి అభిప్రాయం అంత సమంజసంగా లేదు ఎందుకంటే పాత్రల స్థితిగతులలోని మార్పులను వర్ణించినంత మాత్రాన పాఠకులు నిరాదరించరు. నిర్జీవములాగా ఉండే పాత్రలయందు నిరాదరణ ఉంటుంది. మిశ్రమ చరిత్రగల పాత్రలు భారతంలో ఉన్నాయని రెడ్డిగారూ ఉదాహరణలతో నిరూపించారు.

*"నీతి యనునది శకుని కైతవము యొక్క యపరావతారము. నీతిరహితమైన విజృంభణము ఆశ్చర్యకరమైనను, ఆనందకమగునో కాదో, మఱియు సుగుణములే కొన్ని యెడల బరస్పర విరుద్ధములగుటయు సంభవించేదు.అపుడేదేనొక న్యాయమును నిరాకరించుట విధిలేని యకృత్యము దృష్టాంతము కర్ణ పర్వమున గృష్ణుడు చెప్పిన కౌశికోపాఖ్యానము, సత్యము ధర్మమే అయినను దొంగలు వచ్చి నీ సొత్తెక్కడ నీ సొత్తెక్కడని యడిగిన నిజము చెప్పవలయునా? శత్రువులు వచ్చి నీయింట జొచ్చిన వాడెక్కడనున్నాడు జూపుమా వాని గొంతు గోయవలయు అని మర్యాదగా బ్రార్థించిరేని, నిజము చెప్పిన భూత దయ నశించును. కనికరము నుద్ధరించిన ననృత దోషము ఘటిల్లును. అట్లగుట గేవలము నిరంజనత నిర్వికారత, నిష్కళంకత ఇత్యాద్య భావములు మానవ ప్రకృతికిం చేరినవి కావు. మన నడతలు మిశ్రమములు".*[34]

ఇక్కడ రెడ్డిగారు చూపిన ఉదాహరణలు పరిశీలించిన వెంకటేశ్వర్లు గారి వాదము నిరాధారమైనదిగా తోస్తుంది. పాత్రల మనస్తత్వము ఒకే తీరుగా నుండి తీరాలి అనే వాదము సరికాదని భారతంలోని పాత్రల ద్వారా తెలియవస్తుంది. కావ్యాలలోని పాత్రచిత్రణ అలంకార శాస్త్రానుసారంగా, గుడ్డిగా చిత్రించకుండా, కవి స్వభావరీతిగా మనస్తత్వ స్థితిని అనుసరించి

---

[33] భారతి.మార్చ్.1938

[34] కవిత్వతత్వవిచారము.పుట:28

చిత్రించాలని రెడ్డిగారు అభిప్రాయపడ్డారు. లాక్షణకారుడిపై ఆ సిద్ధాంతాలపై గౌరవముంచినా వాటిని పూర్తిగా గుడ్డిగా అనుకరించకుండా కవి స్వతంత్రుడై ఉండాలని వీరి అభిప్రాయం. ఈ అభిప్రాయాలు పాశ్చాత్య విద్యా ప్రభావంవల్ల ఏర్పడి ఉండవచ్చు.

## 2.2.6 ప్రబంధాలు – నాటకీయాంశాలు:

శ్రవ్య కావ్యాలలో సహితము దృశ్యకావ్యముల ఛాయలు చిత్రించుటకు వీలగుటయేగాక రుచి బేధమును కూడా కలిగింపయుండును. ఈ విషయము ప్రాచీన అలంకారికులకు గానీ, రచయితలకు గానీ తెలియని విషయము కాదు. ఆ దృక్పథాన్ని అనుసరించి శ్రావ్య కావ్యాలయందు సంభాషణాది విషయాలందును నాటకీయతను వెతుకుటను ప్రారంభించిరి. రెడ్డిగారు కావ్యములందలి నాటకీయతకు అధిక ప్రాధాన్యత నిచ్చిరి. భావనాశక్తి నాటకీయ కౌశలములో ననుసంధించునని ప్రతిపాదించిరి.

***"కేవలం కల్పితములైన వానింగూడ సాక్షాత్కారముందాల్చిన చేతనములంజేయ జూచునది కావున భావనాశక్తి నాటక కౌశలంబులలో ననుసంధించి యుండును అనగా నాటక రచనాశక్తి యున్నంగానీ కావ్యములు సైతము యదార్థములుగా కన్పింపును. విరాటోద్యోగ పర్వంబులంజదివి జూచిన వారికి తిక్కన యెడ నీ కళా కౌశలంబెంత పరిపూర్ణంబుగా నుండెననుట నావంటి వాడు చెప్పవలసిన పనియేమి? సంజయుడు, ధృతరాష్ట్రుడు, ధర్మరాజు, ద్రౌపది, కృష్ణుడు, దుర్యోధనుడు, కర్ణుడు మొదలగువారు మన యెదుటనే మాటాడు మీడ్కినుండుట. పండిత పరమ విదితము. పాత్రల నడవడికని వారి చేష్టలకును, మాటలకునుగల సమ్మేళన మెంత దృఢము"***[35]. నాటకీయతున్నగానీ కావ్యములు యదార్థములుగా గాన్పింపవని వీరి సిద్ధాంతం. ఈ సిద్ధాంతం అక్కడక్కడా కవిత్వ తత్వ విచారంలో చెప్పుచునే ఉన్నారు. వీరి సిద్ధాంతం గురించి సంపత్కుమారాచార్య ఈ విధంగా ప్రస్తావించారు. ***"నాటకసరణి లేక నాటకీయత అనగానేమి? అది దృశ్యకావ్యములందెట్లుండెనో ఆయన స్పష్టం చేయలేదు. చెదురుమదురు ప్రస్తావనలను బట్టి పాత్రోచితమైన భాష పద్య ప్రయోగము, సంభాషణలలో, పాత్రలలో కథను పెంచుట వంటిది నాటక సరణిగా స్ఫురించును."***[36]

---

[35] కవిత్వతత్వవిచారము.పుట:8

[36] ఆధునికతెలుగుసాహిత్యవిమర్శ:సాంప్రదాయికరీతి.పుట:75

వీరి అభిప్రాయం ప్రకారం రెడ్డిగారు నాటకీయత గురించి శ్రావ్య కావ్యాలలో ఎలా ఉందో చెప్పాడు, అంతేకానీ దృశ్య కావ్యములలో ఎట్లా ఉండాలో చెప్పలేదనుట సమంజసం కాదు. శ్రావ్య కావ్యాలలో ఎలా ఉందో చెప్పడమే ముఖ్య ఉద్దేశం. ఈ నాటకీయతను విశ్వనాథ వారు కూడా సిద్ధాంతీకరించారు. ***"ఉక్తి ప్రత్యుక్తిలో వైఖరి, వృత్తి వర్తిష్యమాణ కథాంశములు లుప్తములో సూచితములుగా రచించిన మఱియు నాటకీయ రచనగాననుకోవచ్చును.***[37] రెడ్డిగారు ప్రతిపాదించిన సిద్ధాంతముననుసరించి పాత్రల సంభాషణ వైఖరితోబాటు, పాత్రల నడవడికలో నా యొక్క ప్రత్యేకతము నాటకీయతలోనికి వచ్చును.

### 2.2.7 కావ్యంలో నీతిబోధ– ప్రాధాన్యం?

కావ్యాలలో నీతిబోధ ఉండవచ్చునా? లేదా అను విషయంపై రెడ్డిగారి అభిప్రాయం ఈ విధంగా ఉంది. ***"కావ్యము, శిల్పము, నీతిశాస్త్రము గాదు, దర్మ శాస్త్రము గాదు, శిల్పము యొక్క ఉత్కర్ష నిష్కర్షపు నేర్పుఱుపవలయునన్న దాని రచనా విధానములబంట్టి నిరూపింపనగునేగానీ భగవద్గీతల యంత వారి శుభమిందులో లేదు. రామానుజ భాష్యంవలె ముక్తిదాయకంగాదా అని వాపోవుట నిర్నిమిత్త ప్రలాపము . తుదకు గోప్యములు పచ్చిగా వర్ణించిననూ నీతిశాస్త్రములంబట్టి ఖండించుట తెలివి తక్కువ. మఱి రసభంగము కాదా యనుటయే అల్ప విమర్శనము యొక్క ఒక్క పరీక్ష. తక్కిన పరీక్షలిట యధిక ప్రసంగములు."***[38]

ఇందులో కావ్యానికి నీతికి సంబంధం లేదని చెబుతూ, కావ్యాన్ని శిల్పదృష్టితో చూడాలని చెప్పారు. కావ్యానికి నీతికి ప్రత్యక్ష సంబంధం లేకపోయినా నీతి బాహ్యములైన అంశాలను కావ్య వస్తువుగా గ్రహించడం అన్నది జరుగదు. అంత మాత్రాన కావ్యమంతా నీతిబోధ ప్రారంభించినా అది నీతిశాస్త్రమవుతుంది గానీ కావ్యం కాదు.

కావ్యంలో నీతి అంగంగానే ఉండాలి అంతే కానీ ప్రధానం కాదు. కావ్యమును, నీతిశాస్త్రమును పరీక్షించినట్లు పరిశీలించుట దోషము. దేశ కాలానుగుణంగా సంఘంలో ఉండే నీతి మరొక కాలంలో, మరొక సంఘంలో మారవచ్చు. ఇదే నీతి అని ఇదమిద్ధంగా చెప్పలేము.కవితకి, నీతికి గల సంబంధాన్ని I.A. Richards ఈ విధంగా ప్రతిపాదించారు.

***"Yet since the fine conduct of life springs only from fine ordering of responses far too subtle to be touched by any general ethical maxims,***

[37] ఆధునికతెలుగుసాహిత్యవిమర్శ:సాంప్రదాయికరీతి.పుట:75

[38] కవిత్వతత్వవిచారము.పుట:93

*this neglect of art by the moralist has been tantamount to a disqualification. The basis of morality as shelly insisted, is laid not by preachers but by poets. Bad taste and crude responses are not mere flaws in an otherwise admirable person. They are actually a root evil from which other defects follow. No life can be excellent in which the elementary responses are disorganized and confused"*[39].

గద్య పద్య తారతమ్యము:

గద్యపద్య స్వరూప స్వభావములను వివరించుచూ రెడ్డిగారు ఈ విధంగా తెలియజేశారు. *"విషయ ప్రధానమైనది గద్యము, రస ప్రధానమైనది పద్యము అట్లగుట బ్రతిపదార్థమును రూపంబగు రచన వచనమునంజేసిన నొప్పుగుగానీ పద్యరూపముగా నొనరించిన వ్రాయువారికి సుఖము లేదు. చదువు వారికంతకు మున్నే లేదు. ఇక కావ్యముగా దెనిగించ నెంచిరిలో అప్పుడు సమయోజితములైన సంక్షేప విక్షేపముల జేకూర్చినగానీ మనసు కరిగించునట్టి రుచియు భావోద్రేకంబును గలుగనేరవు."*[40]

ఇట విషయ ప్రధానముగ గద్యముగను, రస ప్రధానమైనది గద్యంగా ప్రతిపాదించారు. సాంద్రమైన అనుభూతి భావోద్వేగముతో అభివ్యక్తమగునప్పుడు దానికొక గతిక్రమం ఏర్పడటం సహజమే. అదే చందమునకు మూలాధారం. ఛందోరహితమైన యభివ్యక్తి సహితము అనుభూతిని, చమత్కృతిని కలిగించు శక్తి లేనే లేదనుటయు పొరపాటే. కావున పైన చెప్పినది స్థూల విభాగమే కాగలదు. అనుభూతి ప్రధానమే గాక విషయమే ప్రధానంగా చెప్పదలచుకొన్న రచయిత గద్యాన్ని ఆశ్రయిస్తారు.గద్య పద్యాల రెండింటిలో విషయం ప్రధానంగానున్న గద్యం కంటే పద్యంనందు రసాధికృత కలిగి ఉంటుందన్నది సర్వామోద విషయం. ఈ అభిప్రాయాన్ని ఈ కింది విధంగా ఆలోచనామృతము అన్న పుస్తకంలో పేర్కొన్నారు.

"గద్యము సమతల గామినియో వాహినియైన, పద్యము గిరి శృంగానిస్సరన్నిర్ఝరణీ సదృశము. అంచగమునమునందలి యాకర్షకత పద్యము నందున్న, గద్యమున గజగమునందలి గంభీర్యమున్నది. అనుభూతి వ్యంజక మగుట పద్యము హృదయ పేరితము కాగా, తర్క బద్దమగుట గద్యము బుద్ధి ప్రధానమగుచున్నది. రసభరిత భావాభివ్యక్తిని బట్టి యొకదానియందు సాగమున బోలె తరలతా ద్రనీ భూతత్వములు పరివ్యాప్తములైన తర్కబద్ధ

[39] *Principles of Literary Criticism.Pg:47*

[40] కవిత్వతత్వవిచారము.పుట:3

తద్య కథనముననుసరించి వేరొక్క దానియందు ఆకసమున వలె నచంచలతయును లక్షమొక్కటే యమ్యు వేతత్కర్తన్య పానమున గద్యపద్యముల రూపములు మార్గములు కొంత భిన్నములగుచున్నవి. పైన వివరించిన సాహిత్యపరమైన సిద్ధాంతములనే గాక రెడ్డిగారు సందర్భానుసారముగా మరికొన్ని సాహిత్య లక్షణాలను కూడా ప్రతిపాదించారు.

ప్రబంధ లక్షణాలను వివరిస్తూ "ప్రబంధములలో కథ ముఖ్యము కాదు. మఱి వర్ణనలకు నవకాశముబ్బుటకై తెచ్చి పెట్టుకున్న నెపము అనగా వర్ణనలు కధా సాంగత్యములేనివనుటకు పర్యాయ వచనము అని ప్రబంధములు కథా ప్రాధాన్యము కన్నా వర్ణనా ప్రాధాన్యము కలదగని చెప్పారు. శాస్త్రములు ఆదేశించునట్లుగా కావ్యములు రచించుట సమంజసం గాదని వీరి సిద్ధాంతము". ***"ప్రాచీనులు వ్రాసినట్లను అలంకార శాస్త్రములాదేశించినట్లును విరచింప ప్రయత్నించుట తెలివి తక్కువ పని. ఏలన ఒక కవి వ్రాసిన విధమున నింకొకడు వ్రాయు జాలమి ప్రకృతిసిద్ధమైన యర్గళము".*** [41]

ఇందునకు కారణములు:

1) మనసులు వేఱగుటంజేసి భావాదులను వేఱు. వివిధ బంగుల స్ఫురణము గలవారు ఒకే తీరున నభినయింప జూచుట పరిహాసమునకు హేతువు.

2) భావము భాష ఇవి పరస్పర సాంగత్యముందాల్చియున్నవి".

లక్షణ సిద్ధాంతాలను అనుసరించి కావ్యరచన చేయరాదు అనే అభిప్రాయం సాహిత్య అభిమానులకు మింగుడు పడలేదు. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసము గల కవి లక్షణ గ్రంథాల ఆధారంగా రచన చేయడు, అతని మనస్సులోని భావపరంపరలను అనుసరించి రచన సాగిస్తారు.తనలో జీర్ణించుకుపోయిన సంస్కారముల ఆధారంగా అప్రయత్నంగానే అతని చేతిలో నియమ పాలన జరిగిపోవును. ప్రతిభావంతుడై నియమ పాలనయందు అత్యాసక్తి గల కవి లక్షణ గ్రంథాల ఆధారంగా రచన చేస్తారు.

### 2.2.8 కథా నిర్వహణ పద్ధతులు:

కథానిర్వహణ పద్ధతిని కాలసరణి–హేతుసరణి అని విభజించారు. ***"కథను వివరించు పద్ధతులు రెండు విషయములు జరిగినట్లు కాలక్రమానుసారంగా చెప్పుట కాలక్రమమును వదిలి స్వారస్యమగు నేసందర్భమునైనా ప్రారంభించి పిదప వెనుక ముందరగా కథను పెంచి పూర్తి***

[41] కవిత్వతత్వవిచారము.పుట:65

***చేయుటయు ఇందునకు దృష్టాంతములు".***[42] కాలసరణి పద్ధతికి భారతరామాయణాదులను హేతుసరణికి కళాపూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్నములను ఉదాహరణగా చూపిరి.

వీరు ప్రతిపాదించిన మరియొక కథాలక్షణము ఐక్యము. "ఐక్యమనుదాని నీ విధంగా సిద్ధాంతీకరించిరి. ***"ఐక్యమను కథాలక్షణమును పరీక్షించు పద్ధతి యేదనగా, ఉన్న భాగముల దీసివేయవచ్చునా, క్రొత్తవి యేవైన జేరవచ్చున యని విమర్శించుట. ఈ కార్యములు పొసగనివైన నైక్యము స్ఫుటము. సాధ్యములైన నైక్యభావమపక్వము".*** [43]

ఈ ఐక్య లక్షణము ఆంగ్లంలోని Unity of Plot అను సిద్ధాంతమునకు సన్నిహితమైనది. శైలి విషయమును ప్రస్తావించుచూ విషయము, శైలి రెండును ముఖ్యములుగా పేర్కొనెను. ఈ విధంగా రెడ్డిగారి లాక్షణిక విమర్శయందు కొంతవరకు ప్రాచీన అలంకార శాస్త్రములోని విషయములు అంతర్గతంగా గోచరించుచున్నాను చాలా సిద్ధాంతములు పాశ్చాత్య ప్రభావముచే వెలసినవే రెడ్డిగారి లక్షాణిక విమర్శ సిద్ధాంతాలను స్థూలంగా ఈ విధంగా విభజించవచ్చు.

- ➢ కవిత్వమునకు భావనాశక్తి ముఖ్యము. అలంకారములు కాదు.
- ➢ కథలో ఐక్యత ఉండవలెను.
- ➢ కావ్యంలో సమానితములైన విషయము, శైలి రెండూ ముఖ్యమే.
- ➢ పాత్రల ప్రవర్తనలో వైవిధ్యముండాలి.
- ➢ అలంకార శాస్త్రానుసారంగా రచన ఉండరాదు.
- ➢ కథన పద్ధతిలో నాటకీయత, శైలికి అదనపు సౌకర్యం చేకూర్చిన కళా మర్మం గుర్తించాలి.

ఈ విధంగా లక్షణ సిద్ధాంతాన్ని అంశాలను, ప్రాశ్చ్య, పాశ్చాత్య లాక్షణికుల అంశాలలో సమన్వయిస్తూ ఆధునిక తెలుగు సాహిత్య పరిశోధనకు కొత్త దారులు వేశాడు.

ఆధునిక సాహిత్య ప్రక్రియలో విమర్శ కూడా ఒక ప్రక్రియగా ఒక వినూత్న దృక్పథంతో వెలువడుతున్న రోజులలో రెడ్డిగారి విమర్శ సాహిత్య విమర్శ రూపురేఖలనే మార్చేసింది. విమర్శ లక్షణ గ్రంథాల సారంగా సాగే పంథాను వదలి నూతనంగా ప్రయాణించసాగింది. రెడ్డిగారు కళాపూర్ణోదయంపై రాసిన వ్యాసం కవిత్వ తత్వ విచారంగా రూపు దాల్చడం తెలిసిందే. ఇందులో ప్రాచీన అంశాలనుండి ఒక క్రమానుగతంగా పరిశీలించిన వీరి విమర్శ దృక్పథాన్ని

---

[42] కవిత్వతత్వవిచారము.పుట:170

[43] కవిత్వతత్వవిచారము.పుట:191

అంచనా వేయడానికి వీలుగా ఉంటుందని పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు, ఇతరములు అని వీటిని వర్గీకరించి వారి విమర్శ దృక్పథాన్ని అంచనా వేయడం జరిగింది. ఈ అంశాల మీద రెడ్డిగారు చేసిన చర్చ విమర్శ, గురించి పరిశీలిద్దాం.

## 2.3 భారతంలో భావనాశక్తి :

భారతం రెడ్డిగారి అభిమాన గ్రంథం. చిన్నప్పటినుండే రెడ్డిగారికి భారత, భాగవతాదులతో పరిచయముంది. భారతంపై రెడ్డిగారి సమగ్ర అభిప్రాయాలు వెలువడకపోవడం సాహిత్యానికి తీరని లోటుగా చెప్పవచ్చు. భారతంపై ఒక మంచి విమర్శా గ్రంథం రాయాలని రెడ్డిగారికి ఉండేది అని చెప్పడానికి కింది పద్యాలే ఉదాహరణ.

**"శైలి వృత్తముననగా**
**ధాలో చనలన్ మహోద్భుతాఖిల వివిధ పా**
**త్రాళి ప్రదర్శనంబున**
**భూలోకమునందు మొదటి పుస్తకమగుటన్**
**నాతంఁడ్రికనారతమును**
**జీతోయుదమిచ్చినట్టి శిష్టచరిత్రం**
**చైతనరారుట మొదలగు**
**హేతువులంజేసి మనసునీడ్చిన దగుటన్**
**దానికి నానేర్చినది**
**ద్యానిపుణత కొలది జీతునాంధ్రంబున వ్యా**
**ఖ్యానము యదార్థ సం వి**
**జ్ఞాన విధానముల నవ్యకళ లేర్పడగన్"**[44]

భారతం పై ఇంతటి ప్రేమ కలుగుట కారణం ఇతని తండ్రి సుబ్రహ్మణ్య రెడ్డి ప్రభావం ఇతనిపై అధికంగా ఉండటమే. ఈ పద్యాలు 1919లలో రచించారు.1914లో ప్రకటించిన కవిత్వ తత్వ విచారంలో భారతంపై రెడ్డిగారికి గల మక్కువ, అధికారం వ్యక్తమవుతాయి. ఆంధ్ర భారతమనకు అంతటి ప్రశస్తి వచ్చుటకు కారణం, కవిత్రయము వారి ప్రతిభయే అని రెడ్డిగారి అభిప్రాయం. ***"భారత కవులకు భావనాశక్తి యెంతయు గంభీరము, సమయోచిత వర్ణనా ప్రావీణ్యమునఁ దిక్కనతో సమాను లెవరును లేరు. అరపా లైనవారును లేరన్న సత్యమునకుఁ***

[44] సి.ఆర్.రెడ్డి పీఠికలు:పుట.64

*దలవంపు రాదు. పనికిమాలిన యలంకారములు వారి కవిత్వమున నపరిమితములు గావు. తుదకు వర్ణనములకుం బూనునపుడు సైతము కథ యొక్క వేగమునకు భంగము గలిగింపనంత మితముగ౯ జేయుదురేకాని కథ మఱపునకు వచ్చునంత దీర్ఘముగా నెప్పుడును సాగబెట్టరు. అనగా నిక్కమైన కవిత వీరియందు నెలకొన్నదని నా విన్నపము".*[45]

ఇతిహాసాల విషయంలో వర్ణనలను ఎంతవరకు ఇముడ్చుకోవాలో అను విషయాన్ని కవిత్రయం వారు బాగా గుర్తించారని రెడ్డిగారు పేర్కొన్నారు. ప్రబంధాలలోని ఔచిత్యానౌచిత్యాలను ఖండించుచూ భారతంపై ఇలాంటి విషయాలను ప్రతిపాదించారు. భారత రచన గురించి అందులోనూ తిక్కన భారతం గురించి త్రిలింగ పత్రికలోని అభిప్రాయం ఇది.*"తిక్కన గురించి ఈయన చేసిన అతి స్తోత్రము. తరువాత ప్రబంధకర్తలను గుఱించి వ్రాసినంత దూషణములు చూడగ బొగడుటగానీ తెగడుటగానీ వారింగనూ నేర్చుకొనవలసి యున్నదని స్పష్టమగుచున్నది".*[46] ఈ విమర్శను గమనిస్తే తిక్కనను రెడ్డిగారు అధికంగా పొగడినట్లు గుర్తించవచ్చు. వీరి రచనలను సమగ్రంగా పరిశీలిస్తే రెడ్డిగారికి తిక్కన అంటే ఎంత అభిమానమో. నన్నయ, ఎఱ్ఱనలపై  కూడా అంతటి అభిమానం ఉందని చెప్పవచ్చు. భారతం ఎంతటి అభిమాన గ్రంథమైనా ఆ గ్రంథంలోనూ రెడ్డిగారు తప్పొప్పులను ఎత్తి చూపారు.

"భారతమున అధికంగా నీతిబోధను చేర్చుటను రెడ్డిగారు ఎత్తిచూపారు" కాని ధర్మబోధ ప్రతిపాదనము కథాగమనమునకు భంగము కలిగించినను ఉద్దేశము మాత్రము నిత్యోపదేశము. నిత్యోపదేశము భారతమున ఏక కాలంలో చేరిననూ ప్రశస్తి హేతువులలో ఇది తక్కువది కాదు. భారతము ఇతిహాసము. ఇతిహాసములలో ప్రధాన కథ చారిత్రక సత్యమైనదిగా నుండి కొంత శాస్త్ర పరిచయము ఉండవలయును – దేవాసుర సంబంధముండవలయును పారంపర్యాప్రదేశ క్రమము కలిగి ఉండవలయును కాన భారతము శాస్త్ర సంబంధమైన ఇతిహాసమనుటలో సందేహం లేదు. అట్టి భారతం సుదీర్ఘ నిత్యోపదేశమని రెడ్డిగారు విమర్శించుట అంతా సమంజసంగా లేదు.

## 2.4 ప్రబంధరచనలో పింగళి సూరన ప్రత్యేకత :

ప్రబంధాల గురించి కవిత్వ తత్వ విచారం మొదటి భాగం రెండవ ప్రకరణంలో చెప్పారు.ప్రబంధ కవులని మధ్యమ కవులని పేరు పెట్టారు.పింగళి సూరన శ్రీకృష్ణదేవరాయల

---

[45] కవిత్వతత్వవిచారము.పుట:17

[46] త్రిలింగ.జనవరి.1914

కాలంవాడని, రామరాజభూషణుడి ముందువాడని తెల్పినారు.అంతే కాకుండా సూరన పాశ్చాత్య కవి షేక్స్పియర్ సమకాలికుడని కూడా పేర్కొన్నారు.

పింగళి సూరన మధ్యమ కవులకి చెందినవాడు కావడం వల్ల మహాభారత గ్రంథాన్ని బాగా పఠించి ఉంటాడని రెడ్డిగారి అభిప్రాయం. ఎందుకంటే భారత రచనలోని కొన్ని వర్ణనలు కళాపూర్ణోదయంలోని వర్ణనలకు కొంత సాదృశ్యం కనిపిస్తుండడం వల్లనే ఇతనికి ఆ సందేహం వచ్చి ఉంటుంది. ఈ అభిప్రాయానికి ఉదాహరణ భారతంలో ధర్మరాజు కర్ణుడు అన్న అని తెలిసి బాధపడిన విధానాన్ని సుముఖాసత్తి, మణిస్తంభుడు తన భర్త అని తెలిసిన తరువాత వారిద్దరి పరిస్థితులను తెలియజేసే అంశాన్ని ఇక్కడ ఉదాహరించారు.

"కర్ణుడు తనయన్నయోట మెరింగిన పిదప ధర్మరాజు చింతించిన విధంబు –

**ఆ. అతని మేనుగుంతియట్టులకైవడి**
**యరయ నేను జూచి యాత్మనెద్ది**
**కారణంబో యిట్లుగా ననుచుండుదు**
**నేమిసేయు వాడనింక జెపుమా** [47] **(శాంతి పర్వం)**

ఈ విధంగానే సుముఖసత్తి, మణిస్తంభుడు తన భర్త అని తెలిసిన తరువాత పలికిన మాటలు –

**సీ. ఇందాక నెఱుగ నేనేమియంటినో మిమ్ము**
**ననుచు గన్నీళ్ళు రానడచికోనుచు**
**నదపులమాటలు నగవుల మీయందు**
**దొంటికై వడి గోంత దోచుచున్న**
**వసుధ మానిసిఁ బోలు మానుసులు లేరె**
**(కళాపూర్ణోదయం)**
**యనుచునుండుదు**[48]

ఇలా భారతంలోని వర్ణనలకు కళాపూర్ణోదయంలోని వర్ణనలకు కొంత సౌఖ్యం ఉండటంవల్ల సూరన తనకంటే ముందు కవులను ముఖ్యంగా భారత కవులను సూరన బాగా చదివాడని రెడ్డిగారు అభిప్రాయపడ్డారు. పింగళి సూరన నన్నెచోదుని అనుకరించి ఉన్నాడని మానవల్లి రామకృష్ణ కవిగారు వ్రాసియున్నారు. ***శ్రీనాథుడి వైఖరీ కూడా కళాపూర్ణోదయ కావ్యంలో***

[47] కవిత్వతత్వవిచారము.పుట:45

[48] కవిత్వతత్వవిచారము.పుట:45

***కొన్నిచోట్ల కానవచ్చెడిది. కవులయందు కనిపించు ఇట్టి సాదృశ్యం విచారములైనను మిక్కిలి ముఖ్యములని భావించాలి.***[49] సూరన పై కూడా దేశ కాల పరిస్థితుల ప్రభావం పడిందని కట్టమంచి రామలింగారెడ్డి పేర్కొన్నారు.సూరన తన పూర్వకవులను అనుసరించి వారి ప్రభావంవల్ల అంతా ఆమోదయోగ్యంగానీ మార్గాలను అనుసరించి ఉన్నాడు అని విమర్శించారు.***"ఇట్లు మన సూరన యుత్కృష్టులైన గ్రంథకర్తల జాడల నెరిగిన వాడయ్యు గొంతవరకూ నంతమంచివి కాని మార్గములనవలంభించి యున్నారు.దీనికి కారణం మేమనగా ఎట్టివాడైనను దన కాలంలో శ్రేష్ఠములని యెన్నంబడిన రీతుల వివరించ జూచుట సహజము***".[50]

సూరన దేశ కాల పరిస్థితులను అనుసరించి రచనలు చేశారు.సూరన కాలం నాటికి ప్రబంధ కవిత ప్రాచుర్యంలో ఉంది. అందుకని సమకాలీనుల మెప్పు కోసం, కుటుంబ పోషణార్థం, సూరన కూడా ప్రబంధ ధోరణిలోనే రచనలు చేశారు.అయినా కూడా ప్రబంధ కూపంలో పూర్తిగా పడక స్వంత ప్రతిభను కనబరచి అటు పోషకులను, ఇటు తన స్వతంత్రతను నిలబెట్టుకున్న వివేకవంతుడని రెడ్డిగారు సూరన కవిత గురించి ప్రసంశించారు.

### 2.4.1 ప్రబంధ లక్షణ విమర్శ:

తెలుగు సాహిత్యంలో ప్రబంధం ఒక ప్రక్రియగా విరాజిల్లుతుంది. సాహిత్యకారులు కొంతమంది ప్రక్రియా భేదాన్నిబట్టి ప్రబంధ యుగం అని సాహిత్య చరిత్రని విభజించారు. ప్రాచీన కావ్యాలన్నింటినీ పరిశీలిస్తే కొన్ని పురాణ ధోరణికి చెందినవిగా కనిపిస్తే మరికొన్ని ప్రబంధ ధోరణికి చెందిన రచనలుగా కనిపిస్తాయి.

ఆంధ్ర వాఙ్మయంలో ప్రాశస్త్యం పొందిన ప్రక్రియ ప్రబంధం. ఇంతకీ ఈ ప్రబంధ శబ్దం ప్రాచీనమైనదా? అర్వాచీనమైనదా? సంస్కృత వాఙ్మయమున ఈ శబ్దం ఏ అర్థమున వాడబడింది. సంస్కృత అలంకారికులు దీనిని నిర్వచించారా? ఆంధ్ర అలంకారికులు కూడా వారి అర్థాన్నే గ్రహించారా? తెలుగు ప్రబంధ కవులు అలంకారికుల నిర్వచనానుసారమే తమ గ్రంథాలను రచించారా? ప్రబంధమనగా నేమి? దాని లక్షణాలు? వీటన్నింటికీ సమగ్రంగా శ్రీ కాకర్ల వెంకట రామ నరసింహంగారు ***ఆంధ్ర ప్రబంధములు – అవతరణ వికాసములు*** అను గ్రంథంలో వివరించారు.

---

[49] కవిత్వతత్వవిచారము.పుట:47

[50] కవిత్వతత్వవిచారము.పుట:47

### 2.4.2 ప్రబంధ శబ్దం:

తెలుగు సాహిత్యంలో మొట్ట మొదటిసారిగా నన్నెచోడుని కాలంలో ఈ ప్రబంధ శబ్దం కనబడుతున్నది. కానీ సంస్కృత సాహిత్యంలో మాత్రం ఈ ప్రబంధ శబ్దం దీనికంటా ప్రాచీనమైనదిగా కనిపిస్తుంది. సంస్కృతంలో దండి మొదలైన లక్షణాకారులు కావ్య భేదాలని చెప్పి ఉన్నారు. వాటన్నింటినీ సేకరించి ధ్వన్యలోకకారుడు ఆనందవర్ధనుడు ఈ విధంగా నిరూపించి ఉన్నారు.

**పర్యాయబన్దః ఖణ్డకావ్య స్వరూపః**
**సమప్తాయామవ్య వాన్తర క్రియా**
**యాం వసన్తాద్యేకతమ వర్ణనీయ**
**వస్తు వర్ణనాత్మకః ప్రబంద్ధః**

ఇలా కావ్య భేదాలను, కావ్య లక్షణాలను చెప్పేటప్పుడు ఆనందవర్ధనుడు రెండు, మూడు చోట్ల ప్రబంధ శబ్దాన్ని ప్రయోగించాడని కాకర్ల వెంకట రామ నరసింహంగారు చెప్పారు. ప్రబంధ శబ్దం సర్వ గ్రంథ సామాన్య వాచకమని వెంకట రామ నరసింహంగారు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ఆనందవర్ధనుడు చెప్పిన కావ్య లక్షణాలన్నింటిలో ప్రబంధ శబ్ద ఉచ్చారణ లేదు. పర్యాయ బంధమును, ఆఖ్యాయికను, కథను కూడా ప్రబంధ నామంగానే ధ్వన్యాలోకకారుడు పేర్కొన్నారు.

సర్వసామ్య వాక్యం అయిన ప్రబంధ శబ్దాన్ని సంస్కృత అలంకారికులు, ఇతిహాసాలకు, నాటకాలకు, లక్షణ గ్రంథాలకు సమానార్థకంగా ఈ ప్రబంధ శబ్దాన్నే వాడారు. సాహిత్య దర్పణకారుడు రామాయణ, భారతాలని ప్రబంధాలని వ్యవహరించి యున్నారు.వీటినే కాక మాలతీ మాదవం వంటి దృశ్య కావ్యాలను కూడా ప్రబంధ నామమునే వ్యవహరించి యున్నాడని కాకర్ల రామ నరసింహం పేర్కొన్నారు.

**వర్ణరచనామో రుదాహరిష్యత్ – ప్రబన్దేయథా – మహాభారతే**
**శాన్త్రః రామాయణే కరుణః మాలతీ మాధవ రత్నా వల్యాదౌ**
**శృఙ్గారః ఏవమన్యత్ర**

ఈ విధంగా విశ్వనాథుడు శ్రావ్య కావ్యాలైన భారత, రామాయణ ఇతిహాసాలని, దృశ్య కావ్యాలైన మాలతీ మాధవం వంటి నాటకాలనీ ప్రబంధ శబ్దంగా ప్రయోగించారు. అదే విధంగా అభిజ్ఞాన శాకుంతలానికి వ్యాఖ్య రాసిన శ్రీనివాసాచార్యులు కాళిదాస కవి

నాటకాలన్నింటినీ ప్రబంధాలుగానే పేర్కొన్నారు.[51]జయదేవుడు తన పసన్న రాఘవమునందు నాట్య ప్రబన్ధయతియజ్ఞల సంవిధానమ్ అని నాటకాన్ని ప్రబంధంగా వ్యవహరించాడు.[52]కొందరు అలంకారికులు లక్షణ గ్రంథాలను కూడా ప్రబంధం అనే వ్యవహరించి ఉన్నారు.

**ప్రతాపరుద్ర దేవస్య**
**కీర్తి మాశ్రిత్య నిర్మితః**
**అలఙ్కర ప్రబన్ధోయం**
**సన్తః కర్ణోస్సవోస్తు వః** (ప్రతాపరుద్రీయం)

తెలుగు లక్షణకారులు కూడా కావ్యాల్ని, ప్రబంధాల్ని, చాటు ప్రబంధాల్ని రెండు విధాలుగా నిరూపించారు.

**అట్టి కావ్యంబు ద్వివిధమై యతిశయిల్లు**
**ఒరువడి బ్రబంధ చాటు ప్రబంధములవ**
**నర్గముల సంస్కృతమున, నాశ్వాసములను**
**దెనుగున, బ్రబంధమనునది తనరు గృష్ణ"** (అప్పకవీయం – 1-27)

**తెలుగు కవులు వాడిన ప్రబంధ శబ్ద ప్రయోగం:**

తిక్కన తన మహాభారత రచనను ప్రబంధమండలిగా పేర్కొన్నారు. తిక్కన తన భారతావతారికలో

**అని రచనాకౌతకుమున, మన మలరఁగ నీప్రబంధ–మండలి కధినా**
**తునిగా నేపురుషునిఁ బే, ర్కొనువాఁడనొ యనుతలంపు – గూరినమదితోన్**

అంటూ తన భారత రచనను ప్రబంధ మండలి పేర్కొన్నారు."నిర్వచనోత్తర రామాయణంలో కూడా "మత్ప్రణీత రామాయణాఖ్య ప్రబంధ"మని చెప్పారు.

★ నన్నెచోడుని కుమార సంభవాన్ని కొంతమంది పరిశోధకులు మొట్ట మొదటి ప్రబంధంగా పేర్కొంటారు. ప్రబంధ శబ్దాన్ని తెలుగులో వాడిన మొట్ట మొదటి కవి కూడా నన్నెచోడుడే.

**జంగమ మల్లిఖార్జునిని సర్గకవిస్తవనీయ సూక్తియు**
**క్తింగొనియాడి సత్కలిత గేసము లేగను రక్తయై సభా**

---

[51] ఆంధ్ర ప్రబంధము – అవతరణ వికాసం: పుట:5

[52] ఆంధ్ర ప్రబంధము – అవతరణ వికాసం: పుట:5

**షాంగన దక్క నేలిన మహత్వము లోకమునం బ్రసిద్ధిగా**

**భంగిగ విస్తరించెద బ్రబంధము సద్ప్ర ప్రబంధురంబుగన్**

అని కుమార సంభవ పీఠికలో ప్రబంధ శబ్దాన్ని తన కావ్యానికి చెప్పుకున్నారు.

★ దండి దశకుమారచరిత్రను తెలుగులో పద్య కావ్యంగా రచించిన కేతన కూడా దశ కుమారచరిత్రను "తత్ప్రబంధమఖండనంబుగా నమ్మహత్ముని వంశావతారంబు వర్ణించెద అంటూ ప్రబంధంగా పేర్కొన్నారు.పాల్కురికి సోమన, బసవ పురాణంలోఉడుమురి కన్నప్పను కథలో శివపూజను వర్ణిస్తూ ప్రబంధ శబ్దమును ప్రకృష్టమగు బంధము అనే అర్థంలో వాడారు. ఎర్రన, శ్రీనాథుడు, మంచన, నంది మల్లయ, ఘంట సింగన, పిల్లలమర్రి పినవీరభద్రుడు మొదలైన కవులు వారి రచనలను ప్రబంధాలుగానే పేర్కొన్నారు.

### 2.4.3 ప్రబంధ భేదాలు:

ఛందో భేదాన్ని అనుసరించి ప్రబంధాన్ని నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. పద్య ప్రబంధం, గద్య ప్రబంధం, పద్యగద్య (చంపూ) ప్రబంధం, ద్విపద ప్రబంధం అని నాలుగు భేదాలున్నాయి. అదే విధంగా విషయాన్ని బట్టి చూస్తే పురాణ ప్రబంధమని, భక్తి ప్రబంధమని రెండు రకాలుగా చెప్పవచ్చు. రసభేదాన్ని బట్టి చూస్తే శృంగార, భక్తి రస ప్రాధాన్యంగల ప్రబంధాలే ఎక్కువ కనిపిస్తున్నాయి.

ఈ విషయాన్ని కాకర్ల వెంకట నరసింహం ప్రబంధాన్ని నాలుగు విధాలుగా చెప్పారు: 1) పౌరాణిక ప్రబంధాలు – మను, వసుచరిత్రలు; 2) చారిత్రక ప్రబంధాలు – కుమార ధూర్జటి– కృష్ణరాయ విజయం, అందుగుల వెంకయ్య రామరాజీయం, దిట్టకవి నారాయణకవి – రంగరాయచరిత్ర; 3) సాంఘిక ప్రబంధాలు – కందుకూరి రుద్రకవి – నిరంకుశోపాఖ్యానం;

4) కల్పిత ప్రబంధాలు – పింగళి సూరన కళాపూర్ణోదయం మొదలైనవి.

### 2.4.4 ప్రబంధ లక్షణాలు:

ప్రబంధాలలో పదార్థ భావ ఘటనము – అనగా చక్కని పదాల కూర్పు ముఖ్యమని తెలుస్తున్నది. కావ్యాలంకార చూడామణి కర్త విన్నకోట పెద్దన ప్రబంధ లక్షణాలను అష్టాదశ వర్ణనాత్మకంగా ఉండాలని చెప్పారు.

**అట్లు కవికృతమైన కావ్యత్రయంబు**

**గద్యపద్య మిశ్రమ సంపాద్యమండ్రు**
**నగర ముఖ్యాష్ట దశవర్ణనములచేత**
**బరగు నదియును భార్య ప్రబంధమనగ –**

ప్రబంధమంటే ఇది గద్యాలకు మిశ్రమ కావ్యంగా ఉంటూ, నగర, పుర వర్ణనల దశ రూప వర్ణనలు కలిగి వర్ణనీయంగా ఉండేది ప్రబంధం అని చెప్పారు.

**పురవారాశి మహీధరర్తు శశిభృత్పూషోద యోద్యాన పు**
**ష్కర కేశీ మధుపానమోహన వియోగ క్షేమయాన స్వయం**
**వర పుత్రోత్సవ మంత్ర ద్యూత రణ దోర్వై క్రాంతి సంకీర్తనా**
**కర మష్టాదశ వర్ణనాత్మకము తత్కావ్యంబు భవ్యంబిలన్**

ఇలా అష్టాదశ వర్ణనలు ఉండాలని విన్నకోట పెద్దన పేర్కొన్నారు.ఆంధ్ర లాక్షణికులు కూడా సంస్కృత అలంకారికుడు దండి చెప్పిన లక్షణాలే వీరు కూడా చెప్పారు. నన్నెచోడుడు కుమార సంభవంలో పేర్కొన్న లక్షణాలు.

**వన జలకేళీ రవి శశి**
**తనయోదయ మంత్ర గతి రత క్షితిభ ర ణాం**
**బునిధి మధు ఋతు పు రోద్యా**
**హ నగ విరహ దూత్య వర్ణనాష్టాదశమున్**

తెలుగులో లాక్షణికులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా ప్రబంధ లక్షణాలను పేర్కొన్నారు. బాగా ప్రసిద్ధి పొందినది నన్నెచోడుడు చెప్పిన అష్టాదశ వర్ణనలే. ఈ లక్షణాలన్నింటినీ క్రోడీకరిస్తే కొన్ని నిర్వచనాలు ఏర్పడతాయి. అవి:

- ప్రబంధములో వస్త్వైక్యం ఉండాలి.
- ఏకానాయకాశ్రయమై ఉండాలి.
- అష్టాదశ వర్ణనలుండాలి.
- శృంగారం ప్రధాన రసంగా మిగిలినవి అంగి రసాలుగా ఉండాలి.
- ప్రబంధాలు స్వతంత్ర రచనలై ఉండాలి.
- ఆలంకారిక శైలి కలిగి ఉండాలి.

పైన చెప్పిన అంశాలన్నీ అన్ని కావ్యాలలో కనబడకున్నా ఆయా యుగ, కాల ధర్మాల బట్టి, వాటి ప్రాధాన్యాన్ని బట్టి అవి ప్రబంధాలుగానే వ్యవహరించబడుతున్నాయి.

కట్టమంచి రామలింగారెడ్డి ప్రబంధ లక్షణాలు వాటిలోని వస్తు నిర్మాణ పద్దతులను ఏ విధంగా విమర్శించినది చూద్దాం.

కట్టమంచి రామలింగారెడ్డి భారతము, ప్రబంధాలు రెండూ ఒకే కోవకు చెందుతాయని అభిప్రాయపడ్డారు.

*"నాకుం జూడ ప్రబంధములును భారతాదులు కొంతవరకూ బోలియున్నవి గానీ పరమా పూర్వములు రావు ఎట్లన; ఈ రెండు రచనలయందు కథ ప్రాచీనము, భారతము మూలమునకు ప్రతిపదార్థ టీక కాదు. మఱి రస సంపోషణార్థము కవిత్రయము వారు కొన్ని యెడల చెంజియు గొనియెడల ఆక్షేపించి వ్రాసియున్నారు. ప్రబంధములు మాత్రమేమి ఎక్కువ? నిజమే వీనియందు వర్ణనలు బహుళము గానున్నవి. పూర్వ కవులు నాలుగు పద్యము లెక్కువ యను సందర్భమున వీరు నలువది యున్నను జాలదని యోషింతురు"* [53]ఇలా కొన్ని అంశాలలో భారతం కూడా ప్రబంధ కోవకే చెందుతుందని అభిప్రాయపడ్డారు.

రామరాజ భూషణుడు వసుచరిత్రలో చెప్పిన

**"కేవల కల్పనాకథలు కృత్రిమ రత్నము లాద్య సత్కథల్**
**వావిరిబుట్టు రత్నములవారిత సత్కవి కల్పనా విభూ**
**షావహ పూర్వ వృత్తములు సానలదీరిన జాతిరత్నముల్**
**గావున ట్టిమిశ్రకథగా నోనరిమ్పుము నేర్పు పెంపునన్"**[54]

ఈ పద్యంలో కావ్యం ఏలా ఉండాలో భట్టుమూర్తి చెప్పారు.కేవలం కల్పనాకథలు కృత్రిమ రత్నాలతో పోల్చి అలాంటి కావ్యాలు పఠనార్హం కాదని చెప్పడాన్ని కట్టమంచి రామలింగారెడ్డి విమర్శించారు.

"ప్రబంధము స్వకపోలకల్పితముగానున్న నదియోక దోషమట శుద్దముగ బూర్వ వృత్తములుగాకున్న నదియు సరిపడదట! కథ ప్రాచీనముగానూ వర్ణనములు నవీనముగానూ నున్న సానవెట్టిన జాతిరత్నములవలె నిగనిగలాడునని రామరాజభూషణుని అభిపాయం". ఈ అభిప్రాయంతో చూసిన కళాపూర్ణోదయం ప్రబంధాలలో చేరదు దానికి రెడ్డిగారు

ఈ బహిష్కారము కష్టముగాదు! నష్టముగాదు! మఱి గొప్పతనమునకొక కారణమని చెప్పవచ్చును అని కళాపూర్ణోదయాన్ని ఒక ప్రత్యేకమైన గ్రంథంగా చూశారు.మూసబోసి ఒకే వర్ణనలుగల ప్రబంధాల సరసన కళాపూర్ణోదయాన్ని చేర్చడంకంటే ప్రత్యేకంగా అమూల్యమైన

---

[53] కవిత్వతత్వవిచారము.పుట:51

[54] కవిత్వతత్వవిచారము.పుట:51

గ్రంథంగా చూడటమే మేలని రెడ్డిగారి అభిప్రాయం. అల్లసాని పెద్దన "ఆంధ్రకవితా పితామహుడు అనే బిరుదు ఎంత మాత్రం సమంజసంగా లేదని విమర్శించారు.ఎందుకంటే ప్రబంధ సాహిత్యం కంటే ముందే ఆంధ్ర సాహిత్యం వచ్చింది. కానీ పూర్వీకులు కొందరు ప్రబంధ సాహిత్యం నూతనమైన మహా సృష్టి అనుకొని దానికి ఆద్యుడు పెద్దన కాబట్టి పెద్దనతోనే ఆంధ్ర సాహిత్యం మొదలైందని, ఆ బిరుదు ఇచ్చారని రెడ్డిగారు అభిప్రాయపడ్డారు.

*"శ్రీ కృష్ణదేవరాయలు మనుచరిత్రకారుడని, ఆంధ్ర కవితా పితామహుడను బిరుదంబుతో బూజించెను అనగా కవిత్వమును సృష్టికి దెచ్చినవాడను ధ్వని! అల్లసాని పెద్దనకుంబూర్వమొక కవిబ్రహ్మ యుండెగానీ వానిని మనవారు మఱచిరో, స్థానభ్రష్టుని జేసిరో లేక యొక్కొక్క మన్వంతరమునకొక బ్రహ్మ యేర్పడుట మంచి విభాగమని యెంచిరో*[55]... అని విమర్శించారు.

*"ప్రబంధంలో కథ ముఖ్యం గాదు. మఱి వర్ణనలకు నవకాశమబ్బుటకై తెచ్చి పెట్టుకున్న నెపము. అనగా వర్ణనలు కథాసాంగత్యములేనివనుట. సందర్భశుద్ధిలేనివనుటకు పర్యాయ వచనము".* [56]

ఈ అభిప్రాయం వసుచరిత్ర తరువాత వచ్చిన ప్రబంధాల గురించి చెప్పాడు చేమకూర వెంకటకవి విజయ విలాసం తప్ప క్షీణ యుగంలో వచ్చిన ప్రబంధాలన్నీ కాద అంగాంగ వర్ణనలతో, శ్లేషలతో విసుగు తెప్పించాయని సి.ఆర్. రెడ్డి విమర్శించారు.

ఈ అభిప్రాయంతో కాకర్ల వెంకట నరసింహంగారు ఏకీభవిస్తూ తన ***ఆంధ్ర ప్రబంధములు – అవతరణ వికాసాలు*** అన్న గ్రంథంలో ప్రబంధ కవితకు వర్ణనలు ముఖ్య అంగము. తుదకీ వర్ణనలే మితిమీరి ప్రబంధ రచనకొక కళంకము నాపాదించినవి అని అభిప్రాయపడ్డారు.

"ప్రబంధాలలో వర్ణనలు తప్ప కథ ఉండదని, ఆ వర్ణనలు చేయుట కొరకే ఆశ్వాసములు ఆశ్వాసములు రాస్తారని విమర్శించారు.కవి ఒక కావ్యాన్ని రచించాలని చూసినప్పుడు పుర వర్ణన, రాజు ఆగమనం ఇక్కడికే ఒక ఆశ్వాసం, రాజు నఖసిఖ పర్యంతం రెండవ ఆశ్వాసం, రాజు కన్నెను ఊహించుకొనుట మూడవ ఆశ్వాసం ఇలా కథలో పస లేకున్నా తమ వర్ణనా పాండిత్యాన్ని ప్రదర్శించడం కోసం కవులు ఇలాంటి చప్పిడి ప్రబంధాలు రచించారని

---

[55] కవిత్వతత్త్వవిచారము.పుట:51

[56] కవిత్వతత్త్వవిచారము.పుట:52

విమర్శించారు.ప్రబంధములలోని పాత్రలన్నీ కూడా ఒకే విధంగా ఉండటాన్ని కూడా విమర్శించాడు''.

*"పాత్రలన్నియు నొక్క తీరు దాల్చిన బొమ్మలు. అలంకార శాస్త్ర ప్రకారం చెక్కబడినవి ఆయా కావ్యాలలోని పాత్రములు నిర్జీవములు యట్టుండుతోబోయిన నెంతో పుణ్యము!"*[57] ప్రబంధాలలోని పాత్రలన్నీ ఒకే తీరుగా మూస పద్ధతిలో ఉన్నాయని విమర్శించారు.పాత్రల పేర్లు మార్చి స్వభావము, చరిత్ర, నడివి మొత్తే ఒకేలాగా ఉండునట్లు రచించారని అభిప్రాయపడ్డారు.రామరాజ భూషణుని వసుచరిత్రలో అనవసరమైన వర్ణనలు, శ్లేష చమత్కృతులు ఉన్నాయని విమర్శించారు.అవి కథ నిర్మాణానికి ఏ మాత్రం తోడ్పాటులేనివని వాటివల్ల విసుగు తప్ప మరొక ప్రయోజనం లేదని చెప్పారు.

ఈ ప్రబంధంలోని చిత్ర కవిత్వాన్ని మెచ్చుకున్నారు.

"వసుచరిత్రలోని కొన్ని పద్యములు చిత్రకవిత్వంజూచిన బారిపోవలయునను వారిసైతామాకర్షించునంత రమణీయములు'' ని

**చ. "చలిత లతాంత కాంతియను చందురు కావి చెఱంగుదాఁటి స**
**మ్మిళిత వయో విలాసముల మీటిన విచ్చు ఫలస్తనాగ్రముల్**
**వెలువడఁ గప్పెఁ దత్తణమ వేల్లితద్రోహద ధూపధూమకుం**
**తలముల విచ్చి దాడిమ లతాలతాంగి నృపాలు చెంగటన్"**[58] **(వసుచరిత్ర)**

చిత్రకవిత్వంలోని రమణీయతను మెచ్చుకున్నారు.వసుచరిత్ర భాషా విషయమున మంచి పట్టు సాధించినది అని రెడ్డిగారి అభిప్రాయపడ్డారు.

వసుచరిత్రను అనుసరించి అనేక పిల్ల వసుచరిత్రలు సాహిత్యంలో వెలువడ్డాయి. అవన్నీ కూడా వర్ణనలు హెచ్చుగా చేస్తే కథాహీనంగా ఉండడంవల్ల పాఠకులకు రోత కలిగించేవిగా ఉన్నాయని విమర్శించారు.ప్రబంధ రచనలలో నాటకీయత లేదనివిమర్శించాడు.

*"పాత్రోచితమైన భాష శ్లేషబంధురములైన కావ్యములలో మచ్చుకైనా దొరుకునే? చెలికత్తె నోరు దెరచినను మా కన్యామణి నోరు దెరచిననేమి? బయటబడునది శ్లేషయే.*[59] అందును అభంగ శ్లేష'' పాత్రల సంభాషణలో కూడా అంతా ద్వంద్వార్థంలో స్ఫురించే మాటలేగానీ

---

[57] కవిత్వతత్వవిచారము.పుట:54

[58] కవిత్వతత్వవిచారము.పుట:58

[59] కవిత్వతత్వవిచారము.పుట:59

నాటకీయంగా పాత్రల సంభాషణలు లేవని రెడ్డిగారి అభిప్రాయం. ప్రబంధములన్నీ అలా ఉండటానికి ఆ ప్రాంత ప్రభావం కారణమని అభిప్రాయపడ్డారు.

*"శ్రీ కృష్ణ దేవరాయల కాలంలో విజయనగరమెంతో ఖ్యాతి గాంచియుండెను. రాయచూరు మహా యుద్ధమున హిందువులు మహమ్మదీయులను ఓడించి వారి రాజ్యములంబ్రవేశించి యడ్డులేని అధికారము వెలయించు వారైరి. దేశమున బౌరుషము దేదీప్యమానంగా నున్నందున గావ్యములందునునది ప్రతిఫలింపక పోలేదు"*[60] అని ప్రాంత ప్రభావం రచనలమీద ఉంటుందని చెప్పారు.అందుకే శ్రీకృష్ణ దేవరాయల కాలంలో వచ్చిన ప్రబంధాలన్నీ కూడా నవ్యతతో నిండి ఉన్నాయని చెప్పారు.అముక్తమాల్యద, వసుచరిత్ర, పారిజాతాపహరణం, శ్రీ కాళహస్తీశ్వర మహత్మ్యం వంటి ప్రబంధాలలో నవ్యతా గుణము కవి నిండు హృదయంతో రాశాడని అభిప్రాయపడ్డారు.తరువాత కాలంలో తల్లికోట యుద్ధంలో హిందువులు పరాజితులై మహమ్మదీయులు విజయనగర సామ్రాజ్యాన్ని ధ్వంసం చేయగా పాడు గోడలు తప్ప దేశ రాజరికానికి ఏవియు అడ్డుగా నిలబడలేదని చెప్పారు.పాలెయగాళ్ళు స్వతంత్రులై ఉన్నంతలో వాళ్ళు కొంత సేవ చేసిరి. అయినా ప్రబంధ కవులకు సామాన్య జనులు కావ్య వస్తువు కోరువారికి రాజులు, రాజ కన్నెలే వారి కావ్య వస్తువని విమర్శించిరి. అలాంటి వారిమీద రాసే కవిత్వం, రచన వారి నఖసిఖ పర్యంతాన్ని వర్ణనలలో ముంచెత్తి పండితుల పోషణ చూసుకుందురని అలాంటి కవిత్వం సమాజానికి ఎంతకూ పనికి రాదని అభిప్రాయపడ్డారు.**" ఈ దేశము బీదసాదలపై నాదరము గల కవి యెవఁడైన నున్నాడా?తుదకు బీదసాదలైన నున్నారా? యును సంశయము పట్టినను దప్పు వారిదిగాదు! శోకరసము వర్ణింప వలయునన్న ననుకూలమగు సందర్భ మెయ్యది? క్రొవ్వు కాఱెడు నాయికా నాయకుల యూహామాత్రములైన కష్టములా?"**[61]

పాశ్చాత్య దేశాలలో ఇలాంటి దుస్థితి లేదని వారికి సుందర మనోహరంగా అనిపించిన ప్రతి దానిని వారు కావ్య వస్తువుగా స్వీకరించి వారి భావాంబర వీధిలో అనిపించిన భావనలతో కవిత్వం రాస్తారని చెప్పారు.

### 2.4.5 కళాపూర్ణోదయము:

---

[60] కవిత్వతత్వవిచారము.పుట:59

[61] కవిత్వతత్వవిచారము.పుట:61

ప్రబంధాలలోకెల్లా ఈ గ్రంథాన్ని సి.ఆర్. రెడ్డి ఉత్తమమైన ప్రబంధంగా పేర్కొన్నారు. ఇందులోని పాత్రలు వాటి ఫ్లాష్‌బ్యాక్లు ఎంతో ఉత్సాహంగా కథను ముందుకు నడిపించి ఒక ఉత్సుకతను కలిగిస్తాయని చెప్పారు.ఇంతగా మెచ్చుకున్న ఈ రచనలో కూడా చివరి దశలో ఎక్కువ వర్ణనలు చోటు చేసుకున్నాయని విమర్శించారు.ఈ గ్రంథం మీద సి.ఆర్.రెడ్డి అభిప్రాయాన్ని, విమర్శను ఇప్పుడు చర్చిస్తాను.

## 2.4.5.1 మణిహార వృత్తాంతము:

సూరన కథావస్తు నిర్మాణంలో మణిహార వృత్తాంతం ప్రధానమైనది. ఈ వృత్తాంతం కథ మొదటి నుంచి చివరి వరకూ ఈ వృత్తాంతానికి ప్రధాన కథకి సంబంధం ఉంటుంది. ఈ మణిహారం విష్ణువు దగ్గర ఉంటుంది. సంగ్రహుడు  విష్ణువు కొరకు తపస్సు చేసి ఈ మణిహారాన్ని సంపాదిస్తారు.తరువాత ఒక బ్రాహ్మణుని శాపంవల్ల గతం మరచిపోయి సత్వదాత్ముడు అనే పేరుతో రాజుగా కొంత కాలం పరిపాలిస్తారు.తరువాత కళాపుర్ణానికి మంత్రిగా సలహాలు ఇస్తుంటారు.బ్రాహ్మణ శాపంవల్ల గతం మరచిపోయిన సంగ్రహుడు విష్ణువుచే పొందిన మణిహారాన్ని దేవాలయంలో వదిలి ఉంటారు.అది పూజకై వచ్చిన మధురాపుర బ్రాహ్మణుడికి దొరుకుతుంది. కొన్ని రోజులు ఆ బ్రాహ్మణుడు ఆ హారానికి పూజా పునస్కారాలు చేసి శ్రీకృష్ణుడికి అర్పిస్తారు.శ్రీకృష్ణుడు నారదుని శిష్యుడైన మణికంధరుని దండకానికి ముగ్ధుడై ఆ హారాన్ని ఇస్తారు.మణికంధరుడు అలఘువ్రతునికి, అలఘువ్రతుడు కళాపూర్ణునకు, కళాపూర్ణుడు మధురలాలసకు ఇచ్చారు. ఇలా ఆ హారం ఒకరి నుంచి మరొకరికి చేతులు మారి చివరకు మధురలాలస చేతికి వస్తుంది. అత్యంత రమణీయ మనోహరమైన కల్పనకు ఆలవాలమైన ఈ వృత్తాంతాన్ని సి.ఆర్. రెడ్డి నిశితంగా విమర్శించారు.ఈ కల్పనలో గల లోటుపాట్లను సునిశితంగా విమర్శించారు.

*"ఈ రీతి కల్పన మహత్తరమైన దయా నిష్కళంకంబుగాదు, ఎట్లన హారము యొక్క నాయికమణి యెవ్వరి హృదయ స్థలమున నెంతవరకూ సోకియుండునో యంతవరకును వారి సర్వజ్ఞత్వము, వ్యాఖ్య పటుత్వము సిద్ధించునని విష్ణుని వరము. దాని సత్యమును అనుభవమునకు దెచ్చుకోను లోపల సంగ్రహుడు శాపహితుడాయె! మధురాపురి బ్రాహ్మడన్నన్ దానిని గంతములో ధరింపక పూజనేయుచు బహు వర్షములున్నాడట! వాని భార్య యొక్క చిత్తస్థైర్యమెంత దృఢమో! ఆమె గూడా దొంగతనముగానైనా దానిని వేసుకోనలేదు. శ్రీకృష్ణుడు మణికంధరుని మెడలో వేసనాడుగానీ యది బాలతగనుపట్టు విష్ణుని కలాపము గావున*

*దద్భుజాంతర స్థితికి చాలా కొప్పి గళసీమన యెంతుయు గుప్తమై యుండెనట". బాలతగనుపట్టు అను విశేషము సమంజసమా? పూజారి బ్రాహ్మణుడు ఇచ్చినది బాలకృష్ణునకా షోడశ సహస్ర మహిషీయుతునకా?*[62]

ఈ భాగంలోని కథాకల్పనంకు రెడ్డిగారు ఆశ్చర్యపడుతూనే మరికొన్ని లోపాలను చూపారు.

అవి:

- సంగ్రహుడు శాపం ఇచ్చిన వెంటనే శాపగ్రస్తుడు అగుట సమంజసమా?
- బ్రాహ్మణుని భార్య అయిననూ స్త్రీ సహజ చాంచల్యముచే ధరించి యుండువచ్చును గదా?
- బాలతగనుపట్టు ఎవరిని ఉద్దేశించినది?

రెడ్డిగారి విమర్శను కృష్ణారావుగారు ఖండించారు. సంగ్రహుడు మణిహారాన్ని ధరించకుండానే శాపగ్రస్తుడయ్యాడు అనే రెడ్డిగారి అభిప్రాయాన్ని విమర్శిస్తూ...

"This is apparently an exaggeration that the poet actually says though Maduralalasa is this.

**చ.** **ఇక నేమి చెప్పుదు జనాధిప యాయతిముఖ్యు డంత నె**
**మ్మనమున బట్టలేక ప్రతిమన్ బిగియార గవుంగిలించె నిం**
**పొనరగ లేచివచ్చి కడ నొక్కమఱుంగన నష్ట సుగ్రహుం**
**డునికి యెఱుంగమిన్ నగియె నుండగలె కతడుం గికాకికన్** (కళాపూర్ణోదయం)

**వ.** **వగుటయు నతండది వినియు వినని చందంబు గల్పించు**
**కొని తత్ప్రతి మాలింగనంబోక యదృచ్ఛా చేష్టా**
**విశేషంబుగా కల్పించుటకు దాత్కాలిక యుక్తి**
**నద్దేవాలయంబున వెండియుంగల దౌవారికాది**
**ప్రతిమలనట్లే యాలింగనంబు చేయుచు నమస్కరించి**
**తత్ప్రదక్షిణంబు నేయ దొడంగిన సుగ్రుహుండును**
**నతని కపట చేష్ట తెఱంగెఱింగి యిట్లెంత చేసిన**
**బూర్వంపు జేతనే నెఱుంగుదును గదాయది మఱన** (కళాపూర్ణోదయం)
**ననుచు మఱియు పరిహసించె దానవయ్యితి**

---

[62] కవిత్వతత్త్వవిచారము.పుట:144

***"The underlined words in the above passage clearly show that Sugraha utilised the manihara to ascertain the real motive when the ascetic embraced other to conceal his emotions. Otherwise Sugruha could not have so positively asserted his opinion and ridiculed his behaviour. The nature of the course also substantiates this poet".***[63]

కృష్ణారావుగారి అభిప్రాయం ప్రకారము నతని కపట చేష్టల తెఅంగెఱింగి అను వాక్యమాధారంగా సుగ్రహుడు మణిహారాన్ని ధరించినట్లుగా అభిప్రాయపడ్డారు. మునీశ్వరుని కపట చేష్టలు తెలుసుకోనుటకు మణిహారాన్ని ధరించవలసిన పనిలేదు. అతని కుతంత్రాలు సామాన్య మానవునికి కూడా అర్ధం అవుతాయి. మణిహారాన్ని ధరించి సుగ్రహుడు కాలజ్ఞానాన్ని పొంది ఉంటే ముని శాపాన్ని కూడా ముందే పసిగట్టి ఉండేవాడు కదా! కాబట్టి సుగ్రహుడు మణిహారమును ధరించలేదు అనే విషయం ఇక్కడ మనకు అర్థమవుతుంది. సత్యమును అనుభవములోకి తెచ్చుకోను లోపల సుగ్రహుడు శాపగ్రస్థుడయ్యాడు అను రెడ్డిగారి మాటలు యథార్థము. ఈ విషయం పై దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారు...

***"సుగ్రహుని గ్రహచారము బాగున్నచో దాని నాయకమణి హృదయ స్పర్శ అయినప్పుడు హార మహిమ బయలువడునని బాలకృష్ణుని వల్ల వినియున్నవాడు గావున ఏ దారమో వెనక తట్టముడివెట్టి తన హృదయమునకు నాయికమణి తగులునట్లు పోవవుం బెంచి ధరించి దాని సర్వజ్ఞత పాదక మహిమ తెలుసుకొని యుండెడివారు.కానీ ఆ యోగమతనికి లేకపోయినది. సర్వజ్ఞత్వము సంపాదించు ప్రయత్నములో ఉన్న అల్పత్వము కూడా ఊడిపోయింది.***"[64]

ఈ రమణశాస్త్రి ప్రకారం హారం పొడువుగా ఉండి దానికి దారంకట్టి పెద్దగా చేసుకొని హృదయ స్థానానికి తాకునట్లు కట్టుకొని ఉండవచ్చు. ఆ ప్రయత్నంలో ఆ ఆలోచన కూడా తట్టలేదు సుగ్రహునకు అని ఇతని అభిప్రాయం కానీ ఇక్కడ అసలు హారమునే ధరించనప్పుడు అది పొడవుగా ఉందా! పొట్టిగా ఉందా అనే చర్చ అసమంజసం.

మధురాపురి బ్రాహ్మణుడు హారమును ధరించకపోవుట అతని భార్య కూడా ఆ హారాన్ని ధరించకపోవడాన్ని రెడ్డిగారు తప్పుబట్టారు. ఈ విమర్శను కృష్ణారావుగారు తప్పుబడుతూ... బ్రాహ్మణుని భార్య ఆ హారమును ధరించినచో మరియొక సన్నివేశము సృష్టించవలసి వచ్చును. అప్పుడు కావ్య సమైక్యతకు భంగం కలిగి ఉంటుందని అభిప్రాయపడ్డారు. బ్రాహ్మణుని భార్య

---

[63] *studeys in kalapurnodaya: Pg.106*

[64] శ్రీ.ఎం.ఆర్. అప్పారావు సమ్మాన సాహిత్య సంచిక:పుట145

హారమును ధరించునట్లుగా వర్ణించవలసి ఉండాల్సింది అని రెడ్డి అభిప్రాయం. ఆమె ఆ హారాన్ని ధరించుటకు ప్రయత్నించినట్లు కనబడలేదు. స్త్రీకి సహజమైన ఆభరణధారణాభిలాషను వ్యక్తపరచకపోవుట యందలి అసహజత్వాన్ని రెడ్డిగారు ఎత్తి చూపారు. బ్రాహ్మణ స్త్రీ... ఆభరణాలు ధరించుటకు ప్రయత్నించుట, దైవభక్తి ప్రేరితుల యొక్క బీదవారి యొక్క మానసిక స్వభావానికి భిన్నమని కృష్ణారావుగారి అభిప్రాయం.

అన్ని బంధాలు త్యజించి దైవ చింతనతో బతికే స్త్రీలు ఆభరణాల పట్ల అంత శ్రద్ధ చూపకపోవచ్చు కానీ బీద స్త్రీలు మంచి ఆభరణాలు ధరించాలని అనుకోవటంలో అతిశయోక్తి లేదు. అదిగాక చేతికి దొరికిన దానిని అనుభవించక ఉండరు. ఆ బ్రాహ్మణ స్త్రీ ఆ హారమును ధరించక పోవడానికి కారణం దైవభక్తిచేత అయి ఉంటుంది. లేకుంటే భర్త మాట జవదాటని స్త్రీ అయినా అయి ఉంటుంది. అంతే గానీ బీదరికం చేత ధరించలేదు అనుట యుక్తం కాదు.

కృష్ణారావుగారు తమ వాదనకు బలం చేకూర్చే విధంగా ఎరుకలవారు వస్త్రధారణ చేయకపోవుట ఉదాహరణ చూపారు. అయితే ఇది అంత సమంజసంగా అనిపించదు. ఎందుకంటే బ్రాహ్మణ స్త్రీ మణిహారమును ధరించక పోవడానికి ఎరుకల వారు వస్త్రధారణ చేయకపోవడానికి అసలు సంబంధమే లేదు. ఎరుకల వారు అనాదిగా వస్తున్న ఆచారం కారణంగా వస్త్రధారణ చేయరు. అంత మాత్రంచేత బ్రాహ్మణ స్త్రీతో పోల్చుట సమంజసం కాదు. మణిహారమును బ్రాహ్మణ దంపతులు ధరించినా ఎటువంటి ఉపయోగం ఉండేది కాదని కృష్ణారావుగారు చెప్పిన మాటలు అంత సమంజసంగా లేవు.

రెడ్డిగారి అభిప్రాయం పై కాళూరి వ్యాసమూర్తిగారు తన భావాలను ఈ విధంగా వ్యక్తపరిచారు.

***"మధురాపురి బ్రాహ్మణదద్ది వ్యవహారము దేవతాలయంబున లభ్యమైనందున నతి పవిత్రమైనదిగా నెంచి దానిని వెల్పుబలే భక్తి పూజింప జోచ్చెను. భర్త భక్తితో పూజించు హారమును భార్య యెట్లు ధరించును'***[65]. అతని భార్య దొంగతనముగానైన దానిని వేసుకొనలేదు అని రెడ్డిగారు ఆక్షేపించుట సమంజసం కాదు". వీరి అభిప్రాయంలో కొంత నిజం ఉంది. కానీ అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించే వస్తువును దేవుడి గదిలో పెట్టి నిత్యం పూజ చేయడంవల్ల మంచి జరుగుతుంది అన్నది నేటికి సమాజంలో ఉన్న అంశమే.

రెడ్డిగారి సందేహంలో ఆశ్చర్యము కనిపిస్తుందే కానీ, పరిహాసం కలపడదు. దీనిని కొందరు హేళనగా చూశారు. అది అంత యుక్తమైనది కాదు.

[65] కవిత్వతత్వవిచారంవిమర్శనము:పుట.16

"బాలతగనుపట్లు" అను విశేషణము సమంజసమా? పూజారి బ్రాహ్మణుడిచ్చినది బాలకృష్ణునకా? లేక షోడశ సహస్ర మహిషీయుతునకా? అనునది మరొక ప్రశ్న. రెడ్డిగారి విమర్శను ఖండించుచూ కృష్ణారావుగారు ఈ విధంగా చెప్పారు.

***"He would not have raised this irrelevant question had he not apparently overlooked these verse.***

***But Vishnu did not say that the manihara would adjust its size with the wearer. The Brahmin presented that manihara of Balakrishna to Sri Krishna when presented to Manikandhara and put on hung close to his neck. But its central jewel did not touch his heart. Where is the inappropriateness?***[66]

బ్రాహ్మణుడు హారమిచ్చినది బాలకృష్ణునకా? లేక షోడశ సహస్ర మహిషీయుతునకా? అన్న రెడ్డిగారి ప్రశ్నకు బదులుగా షోడశ సహస్ర మహిషీయుతునకే అని సమాధానం చెప్పిరి. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు సరిగా పద్యాన్ని చూడలేదనుట సమంజసం కాదు. ఎందుకంటే కాలేజీ చదివే రోజులనుండే కళాపూర్ణోదయాన్ని రెడ్డిగారు చదివారు. దువ్వూరివారు కూడా బ్రాహ్మణుడు మణిహారమును శ్రీకృష్ణునకే ఇచ్చెనని అభిప్రాయపడిరి. కథాగమనంలో అసహజత్వం ఉండరాదనుట ఆధునిక సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ఆధారంగా రెడ్డిగారు విమర్శించినది సమంజసంగా ఉంది. అనుభూతికి భంగము కలగకుండా విమర్శ కొనసాగాలి. కావున రెడ్డిగారు ఇక్కడ లోపము చూపిన విధానములు అసహజములు. హారము బాలకృష్ణునకు కాక షోడశ సహస్ర మహిషీయుతునికి ఇచ్చెనని అనుకోవడం సమంజసం. ఇక్కడ వివాదానికి తావులేదు. మణిహార వృత్తాంతంలో వీరు చూపిన విమర్శా విధానం ఆధునిక దృక్పథాన్ని సూచించేదిగా ఉన్నా రెడ్డిగారు ఇందలి కొన్ని అంశాలను మరొక తీరుగా వ్యక్తం చేసినా బాగుండేది. బ్రాహ్మణుడు హారమును ఎందుకు ధరించలేదు అన్న అనుమానం విమర్శకుడు గానీ పాఠకుడు గానీ చెప్పవలసిన అవసరం లేదు. పూజ్యాభావముచేతనే ఆ దంపతులు ధరించి ఉండరు అని చెప్పగలిగిన రాచబాట ఉండగా ఇలాంటి అనుమానం లేవదీయుట గ్రంథమునకు గానీ గ్రంథకర్తకు గానీ న్యాయము చేకూర్చదు.

***"నాడట్లు భోదయం బగుటయు నుడుగుటయు నేతన్మూలంబులని యెవ్వరు నెఱుంగ కుండుటను నిది సామాన్య హారంబయను తలంపున మావారు దాచి మఱచుట జేసి నాటినుండి***

---

66 *studeys in kalapurnodaya: Pg.108*

*నేటిదాకా నిద్య వ్యవహారంచెన్నడును ధరియించుట లేదు. నేడాభరణ సమయంబున బ్రసంగ వశంబున దలంచికొని చేతులు తత్ ప్రాప్తి ప్రకారం చెజింగింప విధి సుముహూర్త లబ్దంబైన ప్రధమ భూషణం బనియు, భవద్దత్తంబనియు నత్యాధరంబున దెప్పించి హృదయభాగస్పర్శి నాయకత్వంబుగా నిపుడు ధరియించివన్నదాన". 67*

కళాపూర్ణోదయంలోని వచనంలో రెడ్డిగారు రెండు సందేహాలను వ్యక్తపరిచారు. కథా సందర్భంలోని వారి విమర్శ ఈ విధంగా ఉంది. ***"ఇందలి అసంభావ్యములు రెండు – కన్యగానుండునప్పుడు ఆ రాజు గాలియైనాసోకునాదేవుడా..యని వ్యధ గూర్చున్న విరహ వేదన కాలమున పెండ్లినాడు. ఎన్నడు రాని ప్రసంగవశము ఇప్పుడేల పైబడవలయును? రెండవది హృదయ భాగస్పర్శి నాయక రత్నంబుగా బుద్ధి నిష్కారణముగా నేలపాడవలయును.."68***
ఇందులో మొదటిది మధురలాలసకు మణిహార సంబంధమైన సంభాషణ. పూర్వము రానిది పెండ్లినాడే ఎందుకు రావలయును? ఆ మణిహారము హృదయ భాగము స్ఫరించ ధరించవలెనని తలంపు ఎందుకు కలుగవలెను? అనునవి రెడ్డిగారి సందేహాలు.

ఈ సందేహాన్ని విమర్శించుచూ కృష్ణారావుగారు అభిప్రాయాన్ని ఈ విధంగా చెప్పారు.

*"మధురలాలస మణిహారమును బాల్యంలో గ్రహించినది కావున మరచిపోయేడి* ***అవకాశమున్నది అని అభిప్రాయపడిరి",69*** ఇది అంగీకరించదగిన విషయం కాదు. దీనిని పెద్దలు మాత్రము జ్ఞాపకముంచుకొనగలరు అనిరి. వారు కూడా మణిహార వృత్తాతంతమును జ్ఞాపకము చేసినట్లు కనపడదు. కళాపూర్ణుని వృత్తాంత స్ఫురణలో ఉన్నవారు మణిహార వృత్తాంతమును మరచిపోయిరనుట సమంజసమా? మధురలాలస కళాపూర్ణుని భార్య కాలదను విషయం మణిస్తంభ రూపానుభూతులకు తెలియును. ***"తదనంతరంబు యిమ్మణిస్తంభనందనుడు రూపానుభూతిని మదాశయంబిలిచి" మీబాలిక కథలన్నియు వింటిరే కదా! మీ భాగ్య వైభవంబునకు నెందు నీడులేదిది మెదలునాకు మీరలత్తమామలైరి సందియంబు లేదు. మీరలింక దక్కిన కొలువులింకమాని యీ శిశువును గొనిపోయి పోషింపదనుటయు నతనికి సత్యదాత్ముండిట్లనియె..."70***

---

67 కళాపూర్ణోదయం:ఆ.8.వచనం.117

68 కవిత్వతత్వవిచారము.పుట:144

69 *studeys in kalapurnodaya: Pg.109*

70 కళాపూర్ణోదయం:ఆ.6.వచనం.209

ఈ వచనం ప్రకారం మధురలాలసను పెంచినది వీరే. మణిస్తంభ రూపానుభూతులకు మదాలసతో ప్రత్యక్ష సంబంధము లేదనుట హాస్యాస్పదము. కళాపూర్ణుని గురించి మధురలాలస విచారించినంతగా మిగిలిన పరిజనము విచారించ లేదనడము సమంజసం కాదు.

**చ. మునుకొనికూర్మి నెచ్చెలుల ముచ్చట వేళల దద్గుణౌఘముల్**
**వినివిని వినయర్థ మొకవేళను మనవి సత్యం భావనం**
**గనకని కన్నయంతయును గావ్య వినిర్మితిచేత దార్చుచుం**
**గొనకొని మిక్కిలింబెనిచె గోమలి ప్రేమను నామహీసుపైన్ (కళాపూర్ణోదయం)**

చెలికత్తెలు ముచ్చట్లాడు వేళల్లో కళాపూర్ణుని వృత్తాంతము వినిపించుచూనే ఉన్నారు. ఒకవేళ తల్లిదండ్రులు మరచిపోయిరి అనుట భావించుటకు వీలులేదు.

**చ. పొలుపుగాదున్నురే నిదురపుచ్చుటకై తమతల్లిపైడి యు**
**య్యాల నిడియూచుచో గువలయాధిపు పాటలు పాడినంగరు**
**బలరుచు గిరికేరినగు ననులు పాటలు పాడినంగరం**
**బలయుచు నేడ్చులోకుల పూరాపతి భక్తి యటంచు నవ్వగన్**
**(కళాపూర్ణోదయం)**

తల్లి జోలపాటలు కూడా కళాపూర్ణుని మీదే పాడుతున్నది. మధురలాలస వృత్తాంతము లోకులకు కూడా తెలుయును అందుకే వారు కూడా మధురలాలస పతిభక్తికి ఆశ్చర్యపోవుచుంటిరి. కళాపూర్ణుని వృత్తాంతం సర్వవిధితము. మణిహారమును మరచి కళాపూర్ణుని మాత్రము స్మరించిరనుట సమంజసం కాదు. పెద్దలు మణిహారమును మరచిపోయి ఉండరు. సూరన కథాగమనమునకు అనువుగా మణిహార ప్రసక్తిని మరుగు పరిచాడు అనుట సమంజసము.

మణిహారము హృదయస్పర్శిగా ధరించవలెనను భావన అప్రతర్కికముగా స్ఫురించుట ఒక లోపంగా రెడ్డిగారు భావించారు. స్త్రీలు ఆభరణాలు ఎప్పుడు ధరిస్తారో సంస్కృతీపరంగా గమనిస్తే రెడ్డిగారి విమర్శకు శక్తి తగ్గిపోతుంది అని కృష్ణారావుగారు పేర్కొన్నారు.

మన సంస్కృతిపరంగా పరిశీలించిన వివాహ సందర్భమున వధువుని సర్వాలంకార భూషితురాలుగా చేయుదురు. అందునా బాల తోడుగుల పేర బాల్యము నుండియే ఆభరణములు అలంకరింపజేయుదురు. అయిననూ ఆ సమయంలో మణిహారం మరుగున పడిపోయినది. ఇన్ని ఆభరణాలు అలంకరించివారు మణిహారమును అలంకరించలేదు.

వరునిచే వధువునకు బాల్యములోనే సమర్పించబడిన మణిహారము ఏల ధరించబడలేదు? అన్నది ఆలోచించదగినది. కళాపూర్ణుని దిగ్విజయానంతరము – ***"అలంకృతయగు సమయంబున బ్రసంగ వశంబున జెలుల వలన నాత్మబాల్య సమయ సంప్రాప్త రత్నహారము సుద్దివిని ప్రాణవల్లభుని ప్రథమానుగ్రహ విశేషంబైన యాయాభరణంబు ధరించుటకు నభిలాషంబు వాడమదానిం దెప్పించి నిచ్చు హృదయాస్థలలంబియగుటకు దగునట్లుగా నిరుగదల కొన్ని మణులు నిలిపి నూతన సూత్రంబునం గ్రుచ్చి ధరియించి యంచిత విలాసంబు పరిఢవలిల్ సురటిగోని వరునికడ కరికి పరిచర్య నేయుచుండునంత."***[71]

మధురలాలస మణిహారమును ధరించు కొనినట్లు వర్ణించబడింది. రెడ్డిగారి అభిప్రాయంపై వ్యాసమూర్తిగారి అభిప్రాయం పరిశీలించదగినది. ***"మధురలాలస రాజాదిరాజకూతురును జక్రవర్తి భార్యయునగుట వల నగలకు గోదువ యుండదు కదా! కావున నీ హారము సంగతి యెవ్వరికినీ జ్ఞప్తికి రాకపోవుటను తటస్థింపవచ్చును కదా? ఈ విరహా వేదనావసరమున బ్రసంగము రాకుండుట గూడ నొక భూషణమే. వివాహ కాలమందు నూతనాభరణములు వచ్చును గదా! కొద్దిపాటి ధనవంతులు యిండ్లలో గూడ నగల విషయమైన మఱపులు గలుగుట సహజముగా నున్నది. అట్టి స్థితిలో రాజాధిరాజుల చక్రవర్తుల భవనములలో మఱపుండుట యందాశ్చర్యము ఏమిగలదు? ప్రసంగవశమున నాహారము కళాపూర్ణలబ్ధంబైన ప్రథమ భూషణంబని తెలియవచ్చుటచే సదా దానిని ధరింపనెంచి సరిపోవునట్లు పెద్దది గావించి మధురలాలస ధరించినది. అది భగవదత్తమనియు, దివ్యమైనదనియు వారికి తెలియదుగాన మధురలాలస దానిని పెద్దది చేయించుకోని ధరించినది".***[72]

ఎంత రాజు కూతురు అయిననూ, అన్ని నగలున్నా అంతటి ప్రాశస్త్యంగల హారమును మరచిపోవుట తగదు. కళాపూర్ణునిచే ఇవ్వబడిన హారంగా మధురలాలసకు అంతవరకూ తెలియకపోవుటకు గల కారణము ఇక్కడ లభించలేదు. కాబట్టి వ్యాసమూర్తిగారి అభిప్రాయం అంత సమంజసం కాదని చెప్పవచ్చు. ఈ విషయంపై దువ్వూరి అభిప్రాయం గమనిస్తే "***పతి యోసంగదలచిన అపురూపభూషణము గూర్చిన ప్రశంసా ప్రసంగములే ఆ దినమున అంతఃపురమున సఖీజన సమాజ మధ్యమున సాగియుండుట సహజము. ఆ సంభాషణములలో సకలాభరణములు ధరించుకొను ఆ సందర్భమున బాల్యమున పతియొసంగిన భూషణ***

[71] కళాపూర్ణోదయం:ఆ.8.వచనం.145

[72] కవిత్వతత్వవిచారవిమర్శనము:పుట.17

*ప్రసంగము దారలక తప్పదు గదా! అది భర్త్రృదత్తమని సఖులు తెలిపినారు. తెలిసిన పిమ్మట గూడ దానిని ధరించియే భర్త సన్నిధికేగవలయును కుతూహలము మధురలాలసకు కలుగకమానదు గదా! ఆ ధరించుటలో సయితము మణికంధరుని మాధిరిని మగవానిగా బోలె కంఠమాలగా ఉన్నదాని నున్నటుల మెడకు దగుల్చుకొనుటగాక మఱికొన్ని మణులు కూర్చి అందమైన హారంగా తయారుచేసుకొని ధరించి ప్రియునికగపడు ముచ్చట ఆ యువతికి ఆ సందర్భమున పొడముట సముచితము సమంజసం".* [73]

వీరి అభిప్రాయం కూడా అంత సమంజసంగా లేదు. మిగిలినవారు చెప్పిన అభిప్రాయాలనే ఇతడు కూడా వెలిబుచ్చారు.రెడ్డిగారు చెప్పిన మణిహార కల్పనలోని పింగళి సూరనార్యుని లోపములకు విమర్శకుల సరైన ఉపపత్తులు చూపలేకపోయారు. ఈ కల్పనలోని లోపములన్ని కథాగమనానికి అనుకూలంగా మలచబడినవి అని అంగీకరించక తప్పదు. ఈ రీతిగా కథాగతిని నడపకపోయినచో రసభంగము జరిగి కావ్యమునకు ప్రమాదము జరుగుతుంది. కళాపూర్ణోదయంలో మణిహార వృత్తాతంము, ఒక మణిహారం. రెడ్డిగారి మణిహార విమర్శపై దువ్వూరివారి అభిప్రాయం. ***"ఈ రీతి ప్రత్యాంశమును సూక్ష్మదర్శనమున పరికించి సూరనార్యుని మణిహారమునకు సోకిన దృష్టి దోషమును పరిశీలకులు పరిహరింతురు గాక. కమనీయమగు హార కల్పనకు కళంకము తోలంగుగాక, మణిహారము మెఱుగులు మఱుగుపడక మహా జ్వాలములై మెఱయుగాక"*** [74]అని మణిహార వృత్తాంత విమర్శని ఇక్కడితో ముగించారు. ఈ మణిహార వృత్తాంతంలోని లోపాలు కథా నిర్వహణ కోసం సూరన కావాలని కల్పించినవి కావడంచేత ఎవరి విమర్శలు ఇక్కడ చర్చకు నిలువలేక పోయినాయి. రామలింగారెడ్డి సూరన కల్పనలోని కామరూపకథను, దివ్యదృష్టి మొదలైన రచనలను విమర్శించారు. ఈ కల్పనలు కథకు రసపుష్టిని కలిగించిననూ కవిలోని భావనాలోపాన్ని ఎత్తి చూపిస్తాయి. భావనాలోపం జరిగితే అసహజమైన అసందర్భమైన కల్పనలను కవి ఆశ్రయిస్తారు.సాధ్యమైనంతవరకు కవి అసహజ విషయములు తన రచనలో ప్రవేశింపనీయకూడదు. ఈ విషయంపై రెడ్డిగారి అభిప్రాయం ఇది.

***"కోకములో నదృష్టములు నిర్హేతుకములైన యాకస్మికముల లేకపోలేదు. గాని పదే పదే వలసిన చోటునెల్ల గోక తాళీయ న్యాయముల నాశ్రయించుట కల్పనకు మిక్కిలిగా రాఱంత కామరూపములు. దివ్యదృష్టి ఇత్యాదులు అన్ని కష్టములకు ననుకూలించు సాధనములుగా***

---

[73] శ్రీ.ఎం.ఆర్. అప్పారావు సమ్మాన సాహిత్య సంచిక:పుట148

[74] శ్రీ.ఎం.ఆర్. అప్పారావు సమ్మాన సాహిత్య సంచిక:పుట148

*ప్రశస్తములు గావు. సర్వ సందర్భములలో జీర జాలినవి యీ కథలో దప్పక చేర్పదగిన యంశములని చెప్ప వీలులేదు కనుక నిట్టి వే సందర్భములను జేర్పకుంటమేలు కథకెల్ల సూత్రమువలెనుండు నీ హారమిన్ని వక్రముల కాప్పదమగుట చింతావహము".*[75]

నిర్హేతుకమైన ఆకస్మిక సన్నివేశాలయందు కామరూప దివ్యదృష్టి వర్ణనలను మొదలైన అసహజ కల్పనలను రెడ్డిగారు అంగీకరించుచూ పదే పదే వీటిని ఆశ్రయించుట మాత్రం లోపంగా భావించారు. అసంభవ కల్పనలను శాస్త్రకారులు అంగీకరించిరి. ప్రతి సాహిత్యములోనూ ఇటువంటి అసహజ కల్పన ఉంటాయి. వీటన్నింటినీ వ్యతిరేకించుట తగదు.

అరిస్టాటిల్ తన సాహిత్యంలో ఇలాంటి సాధ్యాసాధ్యాలను గురించి స్వాభావిక, అస్వాభావికాల గురించి వివరించారు. ***"సాహిత్యమునందు ఎడనెడ కన్పట్టు సన్నివేశములను వెలికి తీసి వాని సాధ్యాసాధ్యాలను స్వాభావికులను చర్చించుట కంటే కథాశరీరమునందు వాని పొందిక ఎంతవరకు? చూచుటయే సమంజసము".***[76]

ఈ అభిప్రాయంతో చూసిన అసహజ విషయములు పదే పదే కల్పించడంలో మణిహార వృత్తాంతం లోపభూయిష్టమైనదని రెడ్డిగారి అభిప్రాయం. ఈ అభిప్రాయంతో కృష్ణారావుగారు ఏకీభవించలేదు. ***"ఇలాంటి సన్నివేశాలలో లోపము కవిది కాదు పాఠకునిది, విమర్శకునిది అవుతుందని పాఠకుడు, విమర్శకుడు సహృదయులై ఉండాలని చెప్పారు.దీనికి బలం చేకూర్చే విధంగా అభినవగుప్తుని అభిప్రాయాలని ఉదాహరణగా ఇచ్చాడు***". [77]

సాహిత్యంలో అసహజ విషయాలు ఎలాంటివి అను అంశంలో రెడ్డిగారికి సరైన అవగాహన లేదని కృష్ణారావుగారు అన్న మాటలు అసమంజసాలు. అసహజ విషయాలు సాహిత్యంలో ఉండవచ్చు కాకపోతే అవి మితిమీరకూడదు అన్న అభిప్రాయంలో సి.ఆర్. రెడ్డి చెప్పారు. రామలింగారెడ్డి కళాపూర్ణోదయాన్ని రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగం షష్ఠా శ్వాసములోని 189వ పద్యం వరకు, రెండవ భాగం 189 పద్యం తరువాతది అని రెండు భాగాలుగా విభజించారు. ఇది కవి ప్రతిభను పట్టి చేసిన విభజన అయి ఉంటుందని పరిశోధకుల అభిప్రాయం. ఎందుకంటే ప్రథమ భాగంలో కనిపించే ప్రతిభాపాటవాలు రెండవ భాగంలో కనిపించకపోవడమే అని రెడ్డిగారు అభిప్రాయపడి ఉండవచ్చు.

---

[75] కవిత్వతత్త్వవిచారము.పుట:183

[76] సి.ఆర్,రెడ్డి.రచనలు-పరిశీలన:పుట.158

[77] *studeys in kalapurnodaya: Pg.112*

2.4.5.2 కళాపూర్ణోదయం – సంవిధానం :

*"షష్ఠా శ్వాసములోని 189 పద్యం వరకున్నంత ప్రౌఢ తరువాతి భాగములు లేవు. ఈ గ్రంథమంతటితో సమాప్తి జేసియున్న సమాంతరమై యుండును. ఏడవ, ఎనిమిదవ ఆశ్వాసములలో భావనాశక్తి, ప్రతిభ మొదలైన కవిత్వ మూలశక్తులు బలహీనములు తుదకు మధురలాలస పరిణయాదులు వర్ణింపకున్ననూ తత్పూర్యకథనే నూహ్యములు. కావున వానిని చోందించి యుంట పునరుక్తిబోధిని ప్రధానాఖ్యానముతో నైక్యము వీని కత్యల్పము. అట్లుండియు నీ నిరర్థక ప్రస్థానంకు గవియేల ప్రవర్తించి నాడనుట చింతనీయము". [78]*

మధురలాలస పరిణయమును పూర్వకథ ద్వారా గ్రహించవచ్చును. మళ్ళీ ఆ వృత్తాంతమును వర్ణించడం వల్ల పునరుక్తి రోషం కలిగిందని రెడ్డిగారి అభిప్రాయం. కళాపూర్ణోదయం ద్వితీయ భాగం శాస్త్రాను కావ్యాల ఆధారంగా రాయడంవల్ల లోప భూయిష్టంగా ఉందని రెడ్డిగారు అభిప్రాయపడ్డారు.

మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు కళాపూర్ణోదయంలోని ద్వితీయ భాగాన్ని మూలకథతో సంబంధం లేకుండా ఒక అనుబంధంగా పేర్కొన్నారు. ***"నిజముగా కళాపూర్ణోదయం 169వ పద్యముతో సమాప్తమే. ఇచ్చటికది కదా కావ్యముతో సరిపడియున్నది. కానీ దీనిని సూరనార్యుడు ప్రబంధముగా జేయుటకై తక్కిన భాగము పెంచెను అందు మధురలాలస యవ్వనుము, విరహము, వివాహము, సమావేశము, పుత్రోదయము, యుద్ధము, విజయము అనేడి ప్రబంధ లక్షణాలన్నీ వర్ణింపబడినవి. రెండు శ్వాసములకు పైగా నింకను గ్రంథము రచింపబూనిన కవీంద్రుడు పూర్వకథా సందర్భమిసుమంతయు మిగులకుండగా జేయుట యర్థముగా నుండిదని తలచి మణిహార వృత్తాంతమును మిగిల్చియుండును.*** [79] సత్వదాత్ముని కథ ప్రారంభించగానే మణిహారవృత్తాంతము కదులును. అందుకై అతనికథ వచ్చునప్పటికి శిశువు నడుమేట్టినట్లు కల్పించియున్నాడు.ఎనిమిదవ ఆశ్వాసమున సత్వదాత్ముని కథయు మణికందరుని కావ్యము మెదలైనవి ఈ హరమువల్లనే మదురలాలస నోటనే బయటకు వచ్చును. మల్లాది సూర్యనారాయణశాస్త్రి రామలింగారెడ్డి అభిప్రాయంతో ఏకీభవించారు. సత్యాదాత్ముని కథ ఆరంబించగానే వృత్తాంతము అయిన వెంటనే బాలిక కదలుట సూరన భావ కవితాకల్పనకు అనుగుణంగా జరిగినదే అన్న అభిప్రాయాన్ని

---

[78] కవిత్వతత్వవిచారము.పుట:180

[79] కళాపూర్ణోదయం.మల్లాదిసుర్యనరాయన భావప్రకశీక టీక:పుట.363

వ్యక్తీకరించారు. ఈ విషయంలో రెడ్డిగారు ఒక స్థాయిలో ఆగిపోతే, మల్లాది సూర్యనారాయణగారు దృక్పథము మరి కొంచే ముందుకు సాగింది. ఈ విషయంలో కృష్ణారావుగారు కూడా రెడ్డిగారి అభిప్రాయంలో ఏకీభవించారు. ***"If this criticism is right, the poet must be said to have committed a grave blunder and the theme to have a horrible cancer in its body".*** [80]

వీరి విమర్శనా స్థాయి మరి గాఢంగా ఉంది. Horrible cancer అనే పదం ఆలోచించాల్సినదే. రెడ్డిగారు కళాపూర్ణుని వివాహ వృత్తాంతం చెప్పడం పునరుక్తి దోషం అవుతుంది అన్న అభిప్రాయంతో వెంకట మురళీకృష్ణగారు విభేదించారు.[81]

***వ. తదనంతరంబు యిమ్మణిస్తంభనందనుడు రూపానుభూతిని మదాశయంబిలిచి" మీబాలిక కథలన్నియు వింటిరే కదా! మీ భాగ్య వైభవంబునకు నెందు నీడులేదిది మెదలునాకు మీరలత్తమామలైరి సందియంబు లేదు. మీరలింక దక్కిన కొలువులింకమాని యీ శిశువును గొనిపోయి పోషింపడనుటయు నతనికి సత్యదాత్మ్మండిట్లనియె...*** [82]

ఈ వచనంలో రూపానుభూతి మదాశయులు అత్తమామలైనట్లుగా కళాపూర్ణుడు ప్రకటించారు.కళాపూర్ణ మధురలాలస వివాహమైనట్లు చెప్పవలసిన అవసరం ఉంది కదా! తిరిగి సూరనార్యుడు వివాహమును వర్ణించుట లోపము కాదు. మంగళాంతము చేయవలసిన, బాధ్యత కవికున్నది. మితిమీరిన వర్ణనలు పరిహరించదగినవే అంటూనే ఉన్నంతవరకూ ప్రబంధ రచనాధోరణిని అనుసరించి వచ్చినవిగా భావించవచ్చును అన్నది మురళీకృష్ణగారి అభిప్రాయం[83].

ఇక్కడ కళాపూర్ణుడు రూపానుభూతి మదాశయుడు అత్తమామలు అని చెప్పడంలోనే తెలిసిపోతుంది. కళాపూర్ణుడికి మధురలాలసకు వివాహం జరిగిందని, దాని మళ్లీ ప్రత్యేకంగా చెప్పడం వల్ల పునరుక్తి తప్ప వేరే ఉపయోగం ఉండదు. కళాపూర్ణోదంలోని ప్రథమభాగం రెడ్డిగారిని బాగా ఆకర్షించింది. పూర్వభాగంలోని ప్రబంధంలో సాధారణంగా కనపడే అంత లోపములు లేవు అందుకే వీరిని ఆకర్షించింది. గుణదోషాలను చెప్పడంలో రెడ్డిగారు

---

[80] *studeys in kalapurnodaya: Pg.112*

[81] డా॥ సి.ఆర్. రెడ్డి, తెలుగు రచనలు – ఒక పరిశీలన.162

[82] కళాపూర్ణోదయం:ఆ.8.వచనం.186

[83] డా॥ సి.ఆర్. రెడ్డి, తెలుగు రచనలు – ఒక పరిశీలన..162

వెనుకాడరు.ఎంత అభిమాన గ్రంథమైనా ఉన్న లోపాలను చూపుటలో వెనుకడుగు వేయకపోవడం రెడ్డిగారిలోని విశేషం.

*"ప్రథమ భాగంలో కాలదోషములంతగా లేవు అనగా ప్రబంధముల తీరు తక్కువయనుట. మఱి సర్వలక్షణ సంపన్నతిచే కలిగిన దోషములు పెక్కులున్నవి". [84]*

*"మణికంధరుడు తపస్సు చేయుటకు నుపోద్ఘాతమో యనునట్లు నిస్సంగత్వ దోషభాజనమైన యాత్రాభివర్ణన మొకటి చేయంబడి యున్నది. ఈ యాత్రలచేఁ గథకుఁ గలుగు ఫలములు రెండు.వైపుల్యము, వైరస్యము ఆ! ఒక యూహమై దీనిని సార్థకమందమా! ఈ ఋషి తపోభంగమునకై రంభ రాఁబోవుచున్నదికదా! ఆమెకు నసహ్యము గలగుకుండునట్లు కొన్ని స్నానములు చేయించి శుభ్రకాయునిగాఁ జేసి యుంతమని కవి తర్కించి యుండునా? తర్కించియుండెఁబో. కోరిక యీడేరు మార్గమిది గాదుగదా! ఎట్లన, వీరెన్ని మునకలు వేసిన నేమి? తపస్సులోఁ గూర్చుండి యేకాగ్రముగ మైమఱచి కొన్ని వత్సరములు – వత్సరములు లేల? – వాసరములున్నంజాలదా! – మలయమారుతమువలె ప్రజ్వరిల్లుటకు: అనాదరణ పాత్రమగు నీ ప్రసంగములకు నాహుతిగా నీఁబడినవి సుమారు నలువదియైదు పద్యములు..." [85]*

యాత్ర వర్ణన వలన వైపుల్యము వైరస్యము కలుగుచున్నదని భావించి తిరిగి వాటిని కూడా సాధించలేకపోయేరని తమ అభిప్రాయమును వ్యక్తపరిచారు. రంభకు అసహ్యం కలగకుండా ఉండేటట్లుగా ఈ వర్ణన చేసి ఉంటాడు అని చెప్పుట రెడ్డిగారి హాస్య ధోరణికి నిదర్శనం. దీర్ఘ కాల యాత్రా వర్ణన అనవసరమని కొన్ని వారములుంచాలని వీరి అభిప్రాయం. అంత ఎక్కువ వర్ణనలచే పాఠకుడికి విసుగు తెప్పించకుండా మనోహరమైన వర్ణనలు కొద్దిగా ఉంచితే మేలని రెడ్డిగారి అభిప్రాయం. ఒక విధంగా రెడ్డిగారు యాత్రా వర్ణన అంగీకరించరను విషయం అర్థమవుతుంది. ఈ విషయంపై మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారి అభిప్రాయం.

*"మణికంధరుడి యుగ తపస్సుకు జంకి దానికి భంగము కలిగింప నింద్రుడు రంభను దపోవనమునకు బంపుట ప్రధాన కథాభాగము. అదియే కథకు మూలాధారము. అట్టి తపస్సు చరింప మణికంధరుడు సిద్ధము కావలెను. అందుకు నారదుని యుపదేశమును బుణ్య క్షేత్రసేవయను సాధనములు వానిని సక్రమంగా వర్ణింపక ప్రధాన పాత్రల చర్యను వర్ణించుట ఆయా నాటి కవుల పద్ధతి. కావున దన ప్రబంధము పుణ్యవస్తు వర్ణనా కర్ణనీయముగావలెనన్న*

---

[84] కవిత్వతత్త్వవిచారము.పుట:184

[85] కవిత్వతత్త్వవిచారము.పుట:185

*సూరనార్యుని సవిశేష ప్రతిజ్ఞను పూర్తిగావించెడి యీ వర్ణనము ప్రబంధోచితమగుటంబడ్డ యనావశ్యకమును, బ్రధాన కథ కడ్డమునని భావించుట సరికాదు. అది గాక పది పద్యములలో మూడాశ్వాసాలకు సరిపడ్డ కథను పరుగెత్తించిన కథౌచితీ మర్మజ్ఞుడగు కవీంద్రుడీ యాత్రావర్ణన ప్రధాన కథకడ్డమగునో యరుచి గలిగించునో తెలియనివాడు కారు.చక్కగా బరిశీలించినచో ద్వారకలోని నారదుని గానాభ్యాసమును సమర్థించుటకు గల్పింపబడిన మాత్సర్య వృత్తాంతము వలె మణికంధరుని నుగ్ర తపస్సునది ఆ పుటకు సాధనమైన యీ యాత్రా వృత్తాంతము నావశ్యకమని తోచకపోదు. అదిగాక లోకజ్ఞుడైన కవి తన కాలమందలి జనసామాన్యము నభిరుచి నెక్కువగా బాటించునన్న విషయము మరువరానిది".*[86]

మణికంధరుని తీర్థయాత్ర భవిషత్తులోని తపస్సుకు మూలము. కథౌచితీ మర్మజ్ఞుడు కావునే తీర్థయాత్ర వర్ణన చేశారు.జనసామాన్యుల అభిప్రాయం ప్రకారం అని మల్లాదివారి భావన.

ఈ అంశాలను రెడ్డిగారు చాలావరకూ అంగీకరించారు.ప్రబంధోచితిని సూరన తీర్థయాత్ర వర్ణన చేసెననుది సర్వంగీకార విషయము ఈ వర్ణన కథాగమనమునకు భంగము అను రెడ్డిగారి అభిప్రాయంతో మల్లాదివారు ఏకీభవించలేదు. "పది పద్యములలో మూడశ్వాసముల కథను బరుగెత్తించిన కథౌచితిమర్మజ్ఞుడు" అన్న మల్లాది వారి వాఖ్యలు గమనించదగ్గది. యాత్రావర్ణన విషయంలో సూరనగారి కథాచితిమర్మజ్ఞత్వము యాత్రవర్ణన విషయంలో ఏమైనది? ఈ లోపము మల్లాది వారికి కనిపించలేదు. మల్లాదివారి అభిప్రాయం ప్రకారం ప్రబంధోచితి రీతిని సూరనార్యుడు వర్ణించెను అను విషయం అంగీకరించదగినది.

*"పింగళి సూరనార్యుడు రాఘవ పాండవీయంలో అర్జున తీర్థయాత్ర వర్ణన చేశారు.దీని వలన తీర్థయాత్ర వర్ణనలో సూరనార్యునికి అభిరుచి మెండని తెలియుచున్నది. తీర్థయాత్ర వర్ణన విడిచిపెట్టినచో కలభాషిణి మణిస్తంభుని మాంత్రిక శక్తులను నెమ్మిడిది కాదు. పాఠకులు కూడా మొదటిసారిగా ఈ వర్ణన చదివినచో మణిస్తంభుని శక్తి సామర్థ్యములమీద అనుమానము రాదు...*"[87] అని కృష్ణారావుగారి అభిప్రాయం.

తీర్థయాత్ర వర్ణనముపై కృష్ణారావుగారు వ్యక్తం చేసిన భావములు అంత సమంజసంగా అనిపించవు. రాఘవ పాండవీయంలో సూరన అర్జున తీర్థయాత్ర వర్ణన కథా సందర్భమునకు తగినది. ఈ వర్ణన సూరన అభిరుచికి అనుగుణంగా సాగింది అనుటకంటే కథానుగుణంగా

---

[86] కళాపూర్ణోదయం.మల్లాదిసుర్యనరాయన భావప్రకశిక టీక:పుట.90

[87] *studeys in kalapurnodaya: Pg.129*

సాగింది అనుట ఉత్తమము. మణిస్తంభుడు కలభాషిణిని నమ్మించుటకు విస్తృత యాత్రవర్ణన చేయవలసిన అవసరం లేదు. తీర్థయాత్ర వర్ణన తరువాత మణిస్తంభుడు కలభాషిణిని నమ్మించుటకు ప్రయత్నం చేశాడు అనటానికి ఈ పద్యాలు ఉదాహరణలు.

క. అని యాదిక్కునకు విలో
కనములు నిగుడించి యదె నిగాఢపుఁబద్మా
సన మునఁ గూర్చున్నాఁడో
వనిత యిపుడు దృఢ సమాధివర్తన మీఱన్ (కళాపూర్ణోదయం.2ఆ-165)

చ. అనుటయు నాలతాంగికడునద్భుతమింతయు నోమహాత్మమీ
కనుఁగవ కిప్పు డిమ్మెయిఁ బ్రకాశతఁ దత్సకలప్రవర్తన
ల్గనఁబడుచున్న వేయనినఁ గంజముఖీ యనుమానమున్న ని (2ఆ-166)
ష్టనుపుము దవ్వుగాఁజెలుల నచ్చటితత్క్రియలెల్లఁ జెప్పెదన్

సీ. అనుడు మహాత్మ మి మ్మంత నే నొరయంగ
నర్హనే మీపల్కులందుఁ గలదె
యనుమాన మనుటయు నైన నిందేమి త
ప్పిదియు వినోద మోయింతి యనుచు
బలిమి నాయక చేతఁ జెలుల నిద్దఱిఁ గడు
దవ్వుగా నంపించి త్క్రియలును
దద్వాక్యములుఁ జెప్పి తార్కాణచేసి యో
యబ్జాక్షి, యిది యెట్టు లట్టు లతని (కళాపూర్ణోదయం.2ఆ-167)

గీ. తీర్థయాత్రయుఁ దపమును దేటపఱుప
నొదవినపుడు గదా మదికొదవ దీఱు
దూరతాతారతమ్యవిచార ముండు
నేమొ లే దొక తెరు వది యెఱుక పఱుప

చ. అన విని యట్టి వేళ నికటావనిజంబున నున్న చిల్క యో
యనఘచరిత్ర నీపలుకులం దొకచోట నసత్యశంక గ

ల్గునె మును చెప్పినట్టికతలుం దలపోయ యథార్థము ల్మనం

బున సరిదాఁకెనాకనినఁబుల్గుఁగనుంగొనియద్భుతంబుతోన్ (2ఆ–168)

మణిస్తంభుడు చెప్పిన దానిని బట్టి కలభాషిణికి నమ్మకం ఏర్పడిందని భావించడం సమంజసం. పాఠకులు యీ వర్ణనకు ప్రభావితులగుదురు అనుటలో యుక్తియుక్తము లేదు. సుదీర్ఘ యాత్రావర్ణన లేకపోయిననూ పాఠకులలో ఉత్సుకత ఏర్పడక మానదు.

***"మణికంధరుని యునికినెదుట జూచుచున్నట్లు చెప్పుటచే గలభాషిణి యాశ్చర్యపడినది అని అవకాశముగా గొని సిద్ధుడు తన మహిమ ఋజువు పరచియు "ఇది దగ్గరి సంగతి గనుక చెప్పినావు దూరమందలి విషయమెట్లు నిజమగునా? అంటే ఋజువు చేయనాకు వేఱొక యుపాయము లేదని యూరకున్నారు.ఈ మాట చిలక సాక్షమునకు బీజము".[88]***

మల్లాది వారి అభిప్రాయం ప్రకారం తీర్థయాత్రా వర్ణన వలన కలభాషిణి సిద్ధునకు లొంగలేదు. తదానంతరం మహిమల ప్రదర్శనా ప్రభావం చేత సిద్ధునియందు కలభాషిణినికి నమ్మకం ఏర్పడినది. "***తీర్థయాత్రా వర్ణన వలన కలభాషిణి నలకూబరునియందు అనురాగము వృద్ధినొంది కళాపూర్ణుని నుండి దృష్టి మరల్చుటకు పనికి వచ్చినదని వ్యాసమూర్తిగారి అభిప్రాయం. అదే విధంగా లనకూబరుని పొందు దుర్ఘటనము అని కూడ కవి ధ్వనింప జేసెను."[89]*** తీర్థయాత్రా వర్ణన వల కథాగమనమునకు భంగము కలిగినది అను రెడ్డిగారి అభిప్రాయాన్ని వ్యాసమూర్తి అంగీకరించలేదు. తీర్థయాత్రా వర్ణన ఈ విధంగా సమర్థించిరి. మణికంధరుని తీర్థయాత్ర వర్ణనాకాలంలో కలభాషిణికి నలకూబరునిపై అనురాగము కలిగినదనుట సమంజసం కాదు. కలభాషిణి నలకూబరునిపై అనురాగము, మణికంధరునితో పరిచయమునకు ముందునుండి ఉన్నది. మొదటిసారి చూసినప్పుడే కలభాషిణి నలకూబరుని రూప లావణ్యములకు ముగ్ధురాలయినది. కలభాషిణి ఆలోచనలకు అనుకూలంగా నారదుడును"**... నీవకా నే**

**రవై దైవనియుక్తి గొంత ప్రాప్తిగలిగినన్"**

ఈ వాక్యమందు కలభాషిణి స్పష్టంగా తనకు నలకూబరునియందు అనురాగమున్నట్లు వ్యక్తం చేసింది. ఈ విధంగా ప్రథమాశ్వాసములోనే కలభాషిణికి నలకూబరునియందు అనురాగమున్నట్లుగా స్పష్టపడుచుండగా తీర్థయాత్రాకాలంలోనే మణికంధరునికి దూరంగా

---

[88] కళాపూర్ణోదయం.మల్లాదిసుర్యనరాయన భావప్రకశిక టీక:పుట.103

[89] కవిత్వతత్వవిచారవిమర్శనము:పుట.19

నుండుటయు అంతఃపూర్వమే నలకూబరునిపై ఉన్న అనురాగ బీజము బహిర్గతమవుటకు కారణమైంది అన్నది సమంజసంగా ఉంది. పై అంశమే కాక ప్రబంధరీతిలో ఈ వర్ణన సాగింది అను చెప్పుట ఉత్తమం. ఈ విధంగా అంగీకరించుటలో కళాపూర్ణోదయమునకు గానీ సూరనకు గానీ లోపము జరగదు.

కళాపూర్ణోదయంలోని అసహజ కల్పలనలలో పసిపాప నోట పలికించిన యోగ విద్యా సంభాషణ ఒకటి పాత్ర స్థాయికి తగినట్లుగా కాక అసహజంగా అనిపిస్తుంది. వయస్సులో చిన్నదైన ఆ పాప ఎక్కువ వయస్సు ఉన్న, అనుభవం ఉన్న వృద్ధురాలిలాగా యోగ పరిజ్ఞానాన్ని ప్రదర్శించుట అంత ఉచితంగా అనిపించదు. ఈలాంటి వర్ణనలు పాఠకులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. విమర్శకుడికి కథాగమన లోపమునకు కారణంగా అనిపించవచ్చు. అసహజ కల్పనలకు వ్యతిరేకుడగు రెడ్డిగారు సూరన లోపాన్నే ఈ విధంగా విమర్శించారు. ***"పసిపాపచే చేయబడిన యోగ విద్యా విషయకమైన దీర్ఘ ప్రసంగము. ఈ విమోచన మార్గ ప్రదర్శనము శుద్ధముననవసరము, అసంగతము, అసమ్మతము..."***[90]వీరి అభిప్రాయం ప్రకారం యోగవిద్యా విషయక చర్చ లేకపోయినా కథా రీతికి భంగము రాదు. వీరి భావంతో ఏకీభవించని వ్యాసమూర్తిగారు కళాపూర్ణోదంలోని యోగవిద్యా చర్చను సమంజసమైనదిగా అంగీకరించారు".

"రెడ్డిగారు ఇందలో అద్భుతమును గ్రహించలేదని చెప్పుట సమంజసం కాదు. బాలిక ప్రసంగము విన్నవారికి ఆశ్చర్యం కలగకపోగా అసహ్యం వేయవచ్చు. పాఠకులకు ఆశ్చర్య సంతోషము కలిగించుటకే సూరన యోగవిద్యా చర్చ చేశాడని భావించినను, ఆ రసానందం కలగడానికి అవకాశం తక్కువ ఎందుకంటే సుదీర్ఘ శాస్త్ర చర్చ యోగ శాస్త్ర పారంగతులకు ఆనందదాయకం అవుతుంది కానీ, సూరన కల్పనా వైచిత్రికి మురిసిపోవు సామాన్య పాఠకునికి అది సరిగా అర్థం గాక విసుగు పుట్టిస్తుంది.

కృష్ణారావుగారు ఈ యోగవిద్యా వర్ణనని మరొక విధంగా సమర్థించారు. ***అలఘువ్రతుడు బాలిక శక్తి సామర్థ్యాలను పరీక్షించడానికి ఈ ప్రశ్న వేసెనని భావించారు". [91]***

---

[90] కవిత్వతత్త్వవిచారము.పుట:187

[91] *studeys in kalapurnodaya: Pg.133*

బాలిక శాస్త్ర జ్ఞానము పరిశీలించి అలఘువ్రతుడు విశ్వాసము నిల్పుకొనునను కృష్ణారావుగారి భావన సరైనది కాదు. బాలిక మీద అలఘువ్రతునకు ముందుగానే నమ్మకం కుదిరిందనడానికిదే ఉదాహరణ.

**"కనియె తత్కృపచేత యోగప్రకార**
**ములు సమస్తంబు తద్యోగ విలసనమున**
**భావమెప్పుడూ తనయందు బాదుకొలుపు**
**చునికి జేసి స్వభావవాఖ్య మొనరదాల్చె"** (కళాపూర్ణోదయం.ఆ.5-140)

ఈ బాలిక యోగ విషయం ప్రసంగము తీసుకొని వచ్చిన వెంటనే అలఘువ్రతుడు

**"అనుడి వినియ మెప్ప నలఘువ్రతండు కే**
**ల్మోగిచి సకల బోధములకు నిధివి**
**నీవెఱుంగ నియవిలే యోగముల్**
**చెప్పవలయుననిన శిశువు పలికె"** (కళాపూర్ణోదయం.ఆ.5-141)

ఈ వాక్యం అలఘువ్రతుడు పలుకుటయందు గల భావమేమి? ఆమెను పరిశీలించుటకై అట్లు పలికియుండునా? అలఘువ్రతుని వినయము అవినయమా? అన్న శంక కృష్ణారావుగారి ఉద్దేశముననుసరంచి కలుగుచున్నది. అలఘువ్రతునకు బాలికయందు సంపూర్ణ విశ్వాసం ఉంది అనుటకు మరొక ఉదాహరణ –

**"అలగువ్రతుడపుడు కృతాం**
**జలియై యాశిశువు జూచి సర్వము నీకుం**
**దల పగ విదితమ యీ భూ**
**దలపతి జన్మము తెలంగు దయదెలుపదగున్"** (కళాపూర్ణోదయం.ఆ.5-91)

ఈ వాక్యమునందును అలఘువ్రతునకు బాలిక అద్భుత శక్తులయందు గల విశ్వాసము వ్యక్తమగుచుండెను. ఈ రీతి విభిన్న స్థలములయందు అలఘువ్రతుడు బాలిక అద్భుతశక్తికి ముగ్ధుడగుచుండగా ఆమెను పరీక్షించుటకు ప్రశ్నించెననుట యుక్తము కాదు. ఈ విషయాలాధారంగా పరిశీలించిన సూరన కొన్నిసార్లు కావాలనే కొన్ని వర్ణనలు చేశాడని అర్థం చేసుకోవచ్చు. యోగవిద్యా విషయముననుఁ తనకున్న పరిజ్ఞానాన్ని ప్రదర్శించాడు అను రెడ్డిగారి అభిప్రాయం సమంజసమైనదే నన్న వీరి అభిప్రాయంతో మల్లాది వారునూ ఏకీభవించారు.

*"స్వభావ సిద్ధుని యోగవిద్యాభ్యాసము నెపముగా నిందు యోగవిద్యా ప్రకారము విశదీకరింపబడినది. సూరన నార్యుని యోగశాస్త్ర విజ్ఞానము ప్రకటితమగుటకును గ్రంథము*

*పెరుగుటకు నది యుపయోగించినది గానీ నిజముగా నీ భాగమునకు బ్రధాన కథతో సంబంధ మిసుమంతయు గానబడదు".*[92]

ఈ యోగవిద్యా విషయక ప్రసంగము రెడ్డిగారి ఉద్దేశ ప్రకారం అనవసరం, అసంగతం, అసమ్మతము. ఈ విధంగా అనుటకంటే మల్లాది వారన్నట్లు ఆ కాలమందలి అభిరుచికి తగ్గట్లుగా ఉత్తమ విషయాలను వర్ణించుట కావ్యము పుణ్య వస్తు వర్ణనా కర్ణనీయము కాదగునన్న కవి ఉద్దేశమునకు సరిపడినదనుకొనుటయే సమంజసము.

రెడ్డిగారు తన ముసలమ్మ మరణం కావ్యాన్ని విషాదాంతంగా ముగించారు.ఈ ధోరణి అభిరుచి కళాపూర్ణోదయ విమర్శయందు కూడా కనిపిస్తుంది. ప్రబంధ కవులలోని శోకాంత వర్ణనా నిషేధమును ఈ విధంగా విమర్శించారు.

***ఇంత సుందరమగు పాత్రము వర్ణనము శోకాంతముగాఁ జెప్పుట కిష్టము లేమిచేతనో. మఱి, మన కవులకుం బట్టిన దౌర్భాగ్య మతంబు కతంబుననో, మణికంధర ఖండితమస్తకయగు నా లలనాశిరోమణి కాళికాదేవి కరుణా ప్రసాదంబున "పునస్సహితమస్తకయు, నిజపురీ వర్తినియునై తన బంధుమిత్రాదుల నలరించుచు" సుమారు రెండు సంవత్సరము లుండి పిమ్మటఁ గాలప్రాప్తమరణ మాయెనని కరుణరసప్రధానమగు నీ భాగముయొక్క సొంపును గవి వికలంబొనర్చి యుండుట భాషాదుర్దశగదా?*[93]**.

ఈ బలి విధానంలో మరణించిన కలభాషిని పునర్జీవినిగా కవిచేయుట సమంజసంకాదని, శోకంతమగు ఈ రసమయ సన్నివేశము సూరన బంగపరిచాడని రెడ్డిగారి అభిప్రాయం.

ఈ సన్నివేశంలో కలభాషిణి ప్రధమ జన్మము నందలి ప్రయోజనమును కవి ఉపసంహరించెను. మరుజన్మము నందుగానీ ఆమెతో ప్రయోజనములేదు. కళాపూర్ణోదయమునందు అద్భుతశక్తి వర్ణన మెండుగా కలదు అట్టి శక్తియుక్తులకు ఇది అనువగు స్థలము దేవి మహిమలు ప్రదర్శించి యుండవచ్చును. ఈ అభిప్రాయమునే కృష్ణారావుగారు వ్యక్తీకరించారు.

***The first thing to be noted is that the poet never meant or intended to write a regular tragedy in the Greek sense. His object was***

---

[92] కళాపూర్ణోదయం.మల్లాదిసుర్యనరాయన భావప్రకశిక టీక:పుట.294

[93] కవిత్వతత్వవిచారము.పుట:266

***quite different and he wanted to express something else which is to be discussed in the next chapter.***[94]

రెడ్డిగారు భావించినట్లుగా ఈ సన్నివేశము విషాదాంతముగా ముగియుట సమంజసమైనది కాదు. రచయిత విషాదాంతముగా రచించు ప్రయత్నము చేయనిచో ఒక కథాంగమును గ్రహించి విషాదాంతముగా ముగియలేదని విమర్శించుట ఉచితం కాదు. పునర్జన్మ యనునది ముందుగానే తెలియపరచిన పిదప విషాదాంతము యొక్క ఆవశ్యకత గోచరింపదు.

కళాపూర్ణుని దిగ్విజయ యాత్ర ఘటమును విమర్శించుచూ ఆ ఘట్టంలో చెప్పబడిన ఆయుధాలు కథాకాలం నాటికి ప్రఖ్యాతం కాదని చెప్పారు.యుద్ధ వర్ణన చేయు కథాకాలానికి రచయిత కాలానికి మధ్య వ్యత్యాసము ఉంది. కథాకాలము శ్రీకృష్ణుని నిర్యాణ సమయానంతరము నాటిది. ఆ కథాకాలమునకు గల ఆయుధ విశేషాలను కవి వర్ణించవలసి ఉన్నది. ఆ విధంగా కాక తన కాలంనాటి ఆయుధ విశేషాలను వర్ణించుటను లోపంగా రెడ్డిగారు విమర్శించారు.

***"పిరంగులు, జబురుజంగులు, తుపాకులు మొదలగు నాధునికోపకరణములు వాడబడినవట! ఈ వికృత కవి యెట్లోర్చెనో! పిమ్మనింకొక రాజుతో గజయుద్ధము. ఈ రీతిని గటారులతో పోరు మొదలగు దానిని భారతకాలమునుండి మొగలాయిలనాటివరకు బ్రఖ్యాతికి వచ్చిన పద్ధతులనన్నింటిని ఏ కథలో నేకకాలమున నడిచినట్లె వర్ణించి యుంట కాలౌచిత్యమునకు మారణక్రియ".***[95]

ఇక్కడ రెడ్డిగారి విమర్శ కాలౌచిత్యమునకు ఆధారంగా చేయబడింది. వస్తు వర్ణనా సముదాయము కథాకాలానుగుణంగా ఉండాలని వీరి అభిప్రాయం. ఈ లోపం ఒక్క సూరనలోనే కాక తెలుగు కవులలో సహజంగా కనిపిస్తుంది.

**"సయంత్రఖనకంబును,శోపశలగప్రతోలికంబును... పాట్టాలక గోపురమును, సత్మరాంకుశంబును శతఘ్నీకలాంగలంబును సపరశ్వధలోభ చర్మంబును... నైన మాద్వారవతీ పురంబు..."**[96]

---

[94] *studeys in kalapurnodaya: Pg.136*

[95] కవిత్వతత్వవిచారము.పుట:313

[96] శ్రీకృష్ణభారతము,అరణ్యపర్వము.1 ఆ.261 వచనం

ఆధునికుడైన శ్రీపాదవారు తన కవితయందు శతఘ్ని వంటి ఆయుధాలను మహాభారతంలో ప్రవేశపెట్టారు.

ఈ విషయంపై కృష్ణారావుగారి అభిప్రాయం ఇది.

***"If there is still any error of anachronism at all it is too be attributed to the earlier curters but not to Surana".[97]***

వీరు సూరనయందు లోపములేదని భావించడం భావ్యం కాదు. ప్రాచీన కవులందలి లోపములు పరిహసించి రచన సాగించుట ఉచితమైన విషయము.

రెడ్డిగారు చూపిన ఈ లోపము అంగీకరించవలసిందే కానీ మరొక రీతిగా సమర్థింప వీలులేనిది. కవి తన కాలానుగుణమైన విషయాలు వర్ణించుననుట సర్వవిధితము సూరనార్యుదును కృష్ణదేవరాయల కాలంనాటికి ప్రసిద్ధి వహించిన ఆయుధ విశేషాలను వర్ణించారు.

రెడ్డిగారు కాలౌచిత్యమునకు ఆధారంగా చేసిన విమర్శలోని రెండవ భాగము లోపభూయిష్టంగానున్నది. కవి తన కావ్య సౌందర్యానికై కొన్ని మార్పులు చేర్పులు చేస్తారు.సహృదయుడగు విమర్శకుడు వాటిని విడిచి పెట్టాలి. సూరన కళాపూర్ణుని దిగ్విజయం నాటి ప్రసిద్ధులైన రాజులను విడిచిపెట్టారు.వారి చరిత్ర మనకు కనిపించదు. ఆ విషయమై రెడ్డిగారి అభిప్రాయమిది. ***"రుక్మినీ కాంతునకు దరువాత నీ రాజువలె సద్గుణలెవ్వరు లేరని కురుకాది దేశాదీశులం కానుకలు పెట్టినారట. పాండవుల మనుమడైన పరీక్షిత్తు సార్వభౌముడాయెనని జగత్ ప్రసిద్ధమగు కథయుండగా నీ కళాపూర్ణుణితో బోటిగా బెట్టుట. కొండంగని తగుదాక గోరుట గాదే! ప్రపంచ ప్రఖ్యాతములకు కథలతో విరోధించునట్టి కల్పనలు ఆమోగ్యములు."[98]***

సూరన ప్రసిద్ధుడైన పరీక్షిత్తు రాజ్య పాలన చేయుచుండగా వానిని విడచి కళాపూర్ణుని ప్రసిద్ధునిగా వర్ణించుట తగదని రెడ్డిగారి అభిప్రాయం. ఈ కథయందు కళాపూర్ణుడు రాజుగా వర్ణించదలచిన ఉండుట అవసరము. అందుకే కళాపూర్ణుని వర్ణించారు.పరీక్షిత్తు వంటి రాజుల చరిత్ర వర్ణించుట కవి ధ్యేయం కాదు కావున వర్ణించిక పోవుటే సమంజసము. ప్రసిద్ధిచెందిన కథలోల విరోధించు రీతి కల్పనలు గావించుట సాహిత్య ప్రసిద్ధము ఈ విషయము అలంకారికులు కూడా అంగీకరించి ఉన్నారు.

---

[97] *studeys in kalapurnodaya: Pg.124*

[98] కవిత్వతత్వవిచారము.పుట:316

"ఇతివృత్త ప్రయుక్తేపి కథావైచిత్ర్య వర్తిని
ఉత్పాద్యాలవలావణ్యదన్యా భవతి వక్రతా
తథాయథా ప్రబంధస్య సకలస్యాపి జీవితమ్
భాతి ప్రకరణం కష్టాది రూఢ రసనిర్భరమ్" (వక్రోక్తిజీవితం.4ఉ-3శ్లోకం)

అని కుంతకుడు ప్రతిపాదించారు. ఇతివృత్తమునందు ప్రయుక్తమగు కథావైచిత్ర్య మార్గమునందు కూడా ఉత్పాద్య కథాలేశము యొక్క లావణ్యముచే ఒకానొక వక్రత కలుగును. దానిచే ఆ ప్రకరణము పరాకాష్ట నధిరోహించిన రసంతో నిండినదై ప్రబంధమున అంతటికినీ జీవితం వలె అవుతుంది. కళాపూర్ణోదయంనుందు ఈ పరీక్షిత్తుని చరిత్రను వదిచియుండుటచే కళాపూర్ణుని కీర్తి ప్రతిష్టలు ప్రతిపాదించుటకు అనువైనది.

సూరన పరీక్షిత్తు విషయ వృత్తాంతమై మార్పులు, చేర్పులు చేయలేదు. ఆ విషయమును సంక్షిప్తపరిచి సూరన రచించారు.ఈ విషయమై కృష్ణారావుగారి అభిప్రాయం.

***"If he had described Kalapurnaas having taught with Krishna or Pariksit, it might be regarded as blunder even then before convicting a writer of this charge may other things have to be taken into consideration".*** [99]కళాపూర్ణుడు, శ్రీకృష్ణునితో కానీ, పరీక్షిత్తుతో కానీ యుద్ధము చేసినట్లు వర్ణించిన అప్పుడు పరీక్షిత్తు వర్ణన చేయకుంటే అది దోషం అవుతుంది గానీ ఇప్పుడు అవ్వదు అని కృష్ణారావుగారి అభిప్రాయం. ఈ విషయంలో వ్యాసమూర్తిగారి అభిప్రాయం ఇది.

***"పరీక్షిత్తు జగత్ప్రసిద్ధ సార్వభౌముడే కవి ఆదినే కళాపూర్ణోదయము కల్పిత కథ అని చెప్పియున్నారు.కల్పిత కథలో యదార్థమును వెతుకు వారెవ్వరు కల్పిత పాత్రుడగు కళాపూర్ణునకు పరీక్షిత్తు లొంగిపోయెను. పాత్ర కల్పితము గావున పరీక్షిత్తు కీర్తికి గళంకము రానే రాదు. అంతటిని కళాపూర్ణుడు జయించెను. గావున కళాపూర్ణుని యశస్సునకు లోపము లేదు. కవి పరీక్షిత్తు నెత్తుకొనక కావ్యమునకు శోభ కూర్చెను. రెడ్డిగారు దానిని సమ్మతించలేదు".*** [100] వ్యాసమూర్తిగారు కల్పిత కథలో యదార్థమును పాకులాడుట సమంజసము కాదు అని చెప్పారు. కల్పిత కథలయందు కూడా యదార్థమునకు సన్నిహితంగా నుండు కల్పనలనే చేయవలెను. రెడ్డిగారు భావించినట్లుగా పరీక్షిత్తు యొక్క ప్రాభవమును విడిచిపెట్టుట సూరన లోపంగా కాక కావ్యశోభా హేతువుగా ఆంగీకరించడం మంచిది.

---

[99] *studeys in kalapurnodaya: Pg.125*

[100] కవిత్వతత్త్వవిచారవిమర్శనము:పుట.58

పాత్రల వయస్సు మీద కూడా రెడ్డిగారు విమర్శ చేశారు.

పాత్రల వయస్సును బట్టి కవి తన గ్రంథాన్ని పాత్రచిత్రణ చేయుచుండును. పునర్జన్మ యుక్తమైన కళాపూర్ణోదయంలోని కొన్ని పాత్రల వయస్సెంత? అను ప్రశ్న పాఠకులకు రాక మానదు. ఈ విషయంలో రెడ్డిగారి దృక్పథము ఈ క్రింది విధంగా ఉంది.

***"సుగ్రహుండు ఎన్నెన్నో తపస్సులు చేసి యవస్థలుపడి హారము వడసినారు.పిమ్మట ఆ హారము ఒక బ్రాహ్మణుని యింట నెన్నియో యేండ్లుండినది. తరువాత నది కృష్ణార్పితము. ఆ వెనుక కృష్ణునిచే మణికంధరునికి లభించినది. వాడు గాన విద్య, యాత్ర, తపస్సు ఇత్యాదులలో గడిపిన వత్సరములు కనీసము ఆరు. అట్లగుట మణికంధరునియొద్ద చేరినది మొదలు మధురలాలస రెండవతూరి ధరించువరకూ జరిగిన యేండ్లు ఇరువది నాల్గు ఇక సుగ్రహుని వయస్సెంత యుండునో యూహింపనలవిగాదు".***[101]

మధురలాలస మణిహారము ధరించే నాటికి సుగ్రహుని వయస్సెంత అనే రెడ్డిగారి ప్రశ్నకు కృష్ణారావుగారి సమాధానం పరిశీలించదగినది.

***"To conceive of Sugraha as losing his kingdom at the age of twenty two or thirty five and obtaining the manihara in his thirteenth year does not strike one as an improbability even grating that the necklace remained with the Brahmin for ten years and that thirty years had lapsed before Maduralalasa came to wear it for the second time which this critic concedes Sugraha's age does not exceed seventy years".***[102]

వ్యాసమూర్తిగారి అభిప్రాయం ప్రకారం సుగ్రహుని వయస్సు 43 సంవత్సరాలు అనుట సమంజసం. అటు పిదప మధురలాలస మణిహారమును ధరించిన కాలము 20 సంవత్సరాలు అనుకున్న సుగ్రహుని వయస్సు 63 సంవత్సరాలని భావించవచ్చు. మొత్తం మీద మధురలాలస మణిహారం ధరించే నాటికి సుగ్రహుని వయస్సు 63–70 సంవత్సరాల మధ్యలో ఉంటుంది.

కళాపూర్ణోదయంలోని పాత్రల వయస్సుకు తగిన ప్రవర్తన ఉండలేదని రెడ్డిగారు భావించారు. పాత్రల స్వరూప స్వభావాలు వయోపరిమితి ఆధారంగా ఉండవలెను. ఆ విధంగా

---

[101] కవిత్వతత్త్వవిచారము.పుట.316

[102] *studeys in kalapurnodaya: Pg.126*

వర్ణించకపోతే పాత్రలలో స్వాభావికత ఉండదు. అభినవ కౌముదిని, మధురలాలసకును మధ్య వయస్సులో బేధమును సూరన పాటించలేదని రెడ్డిగారు విమర్శించారు.

*"అభినవ కౌముది యొక్క వయస్సు మొదలైనవి వదిలిపెట్టుదము.కలభాషిణి మణికంధరునిచే బుట్టె పునర్జీవితయై ద్వారకను మెలింగినది రెండేండ్లు. ఆవఆకే యభినవ కౌముది ప్రాయముది శల్యాసురుడు వెన్నాడి కొన్నెండ్లు తరిగియుండును గాన 17 సంవత్సరాలు దక్కువ లెక్క. ఈమెకు దగిన నాధుడూగా నుండవలయునని కళాపూర్ణునకు సద్యోయౌవనము విధింపబడెను. కళాపూర్ణుడు పుట్టినప్పటికి నామె వయస్సు 18 సంవత్సరాలు యనుకొనురు.మధురలాలస వివాహమప్పటికి నామెకు అధమ పక్షము 34–35 సంవత్సరములు నిండియుండెను. ఎట్లు లెదనన్ననూ ముప్పదికి తక్కువ యుండదు. ఇన్నాళ్ళు సంసారము చేసిన ఆమెకు కొత్త పెండ్లి కూతురునకును రూపయౌవన వర్తనవిభ్రమాదులచే తారతమ్యమైన నుండునట్లు కవి వర్ణించినాడా విచారింపుడు".*[103] రెడ్డిగారి అభిప్రాయం ప్రకారం మధురలాలస వయస్సు 18 సంవత్సరాలు అభినవ కౌముది వయస్సు 34–35 సంవత్సరాలు. వీరిద్దరి యందు గల బేధమును అనుసరించి ముగ్ధనాయికలుగా తలంపవచ్చు.

**చం. నవ నవ కమయౌవన సనధయు, నల్పరతంబు గఅపన**
**య్యువతి యోముగ్ధ మధ్య సద్రుశోదిత యౌవన కామయైరతాం**
**తవివశయౌలతాంగి సతత ప్రతితోల్బణకాను యౌవనో**
**త్సవ,సురతాది మోహమును దాల్చు తలోదరి ప్రౌడనానగున్**[104]

*(కావ్యాలంకార సంగ్రహం)*

అని నాయికా లక్షణాలను భట్టుమూర్తి చెప్పారు.ఇంకా స్పష్టత రావడానికి ముగ్ధ లక్షణాలను గమనిద్దాం.

**శా.ఆలాపంబున కుత్తరంబాసగాదాయాసంబునగొని,తా**
**నాలోకింపదు,పాటలాధర మరమ్ధాస్వాద సమ్మర్దముం**
**దాళంజాలదు,కౌగాలీయదు తనూతపంబు చల్లాజగా**
**నేలజ్జావతి,తవ్రతంబుదయి తాభీష్టంబు గాకుండునే**[105]

---

[103] కవిత్వతత్వవిచారము.పుట.319

[104] కావ్యాలంకార సంగ్రహం:2ఆ–24పద్యం

[105] కావ్యాలంకార సంగ్రహం:2ఆ–25పద్యం

ఈ లక్షణాలను సూరన మధురలాలసయందు పాటించారు.

ఏ పలుకులుం జెవిం బడగనీక పెనుంగుచు మోముదవ్వుగా
బాపుచుద్రోపులాడు సతిపాణి తలంబుల యేళనంబు యు
ర్వీపతి క్రిందిభోగమటు వేడ్కనానర్ప ముఖాబ్జముంగడుం
బాపక యాలకించుటయే బ్రహ్మసుభోదయమయ్యేనయ్యేడిన్

సీ|| ప్రధిత మిధోరగ కథల మంతనముల
హృదయంబులోపలి బెదురు దీర్చి
సవ్యాజకృత కుచ స్పర్శది లీలల
నంగాగ మేళన మలవరించి
జిలిబిలి నెయ్యంపు జిట్టకంబుల చేత
నెలన నవ్వు చెక్కుల మొలవ జేసి
లజ్జా పదంబు లల్లన మాటిమాటికి
జేనకుచునొక్కింత సిగ్గుపరచి
యిపుడు కుసుమ సోయకాగ మాధ్యమ నాధి
కారసిద్ధిగొంత గాలుగజేసే
నావసుంధరాధి పావతంసుండు రూ
పానుభూతి తనయ కాదరమున"[106]

ఇక్కడ కళాపూర్ణుడు మధురలాలస హృదయంలోని బెరుకుదనం, లజ్జను పోగొట్టడాన్ని బట్టి ఈమె ముగ్ధనాయిక అని తెలుస్తుంది. అభినవ కౌముది మధ్యనాయిక అవ్వటంచే మధ్య లక్షణాలను పరిశీలిద్దాము.

"మద్యా విచిత్ర సురత్రా ప్రరూఢ స్మరయౌవనా
ఈషత్ప్రగల్భ వచనా మధ్యమ వ్రీడితా మాతా"[107]

అని సాహిత్య దర్పణమున గలదు. ప్రగల్భ వచనాశక్తి అభినవ కౌముది యందు కనిపిస్తుంది.

ఉ. పాటల గెల్చినట్టి సతిపల్కులు పల్కులుగాక యిట్లునే

---

[106] కళాపూర్ణోదయం:7ఆ–154పద్యం

[107] సాహిత్యదర్పణం

జోటమినున్న మాపలుకులో నృప! యేటికి నీకు వట్టియా
మాటకేమి పోదు. యదిమక్కువ వేఱొక చోటనుండగా
బోటుదనాలు చెన్నె? విముటోంట్లకు దక్కిన వారికింబలెన్"[108]

(కళాపూర్ణోదయం)

ఈ విధంగా అభినవ కౌముది మధురలాలసయందు వయోరూపతారతమ్యమును సూరన పాటించారు.రెడ్డిగారి అభిప్రాయం ప్రకారం స్పష్టంగా మరింత బేధము పాటించి ఉండవలసిందని చెప్పడం సమంజసం. రెడ్డిగారి విమర్శను కృష్ణారావు ఖండించినట్లు కనిపిస్తుంది.

వ్యాసమూర్తిగారు రెడ్డిగారి అభిప్రాయంతో ఏకీభవిస్తూ మధురలాలస అభినవ కౌముదుల మధ్య వయో తారతమ్యమును సూరన పాటించలేదని చెప్పారు.

ప్రథమ భాగంలో సూరన చేసిన సుదీర్ఘ యాత్రావర్ణన అసమంజసంగా ఉందని రెడ్డిగారు భావించుటలో వీరికి ప్రబంధ అతి దీర్ఘ వర్ణనలపై గల యావగింపు అర్థమవుతుంది. అసహజ కల్పనలను నిరసించారు. పాత్రల వయోభేదమున సుదీర్ఘ చర్చ చేయుట విమర్శలో ఒక నూతన రీతిగా చెప్పవచ్చు. ఇది పాఠకునికి సాహిత్యంపై అభిరుచి కలిగించడానికి దోహదపడుతుంది. కథాగమనంలోని ఒక సన్నివేశాన్ని తీసి విషాదాంతంగా రచించిన బాగుండేది అని రెడ్డిగారు భావించుట వారికి విషాదాంత కావ్యాలపై గల అభిరుచి, ఆసక్తి వ్యక్తమవుతుంది. కథాకాలాన్ని భిన్నమైన రీతిలో సన్నివేశ కల్పనలు చేయడం సహజం కాదు అన్న వీరి అభిప్రాయం అంగీకరించదగినది.

ఇంతవరకూ పరిశీలించిన కవిత్వతత్వవిచార గ్రంథంలో అంశాలు భారతీయ ఆలంకారిక విషయాలని చర్చిస్తున్నట్లు అనిపిస్తున్నా అవి ముఖ్యంగా భావనాశక్తి, భావతీక్షణత, పాత్రల మధ్య సంబంధం నాటకీయత అనునటువంటి అంశాలు, సృజనాత్మకత మొదలైనవన్ని పాశ్చాత్య విమర్శా దృక్పథంతో విశ్లేషించినట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఈ విషయాన్నీ జి. వి కృష్ణారావు, కాళూరి వ్యాసమూర్తి, కురుగంటి సీతారామయ్య తదితరులు ప్రకటించిన అభిప్రాయాలతో స్పష్టంగా మనం తెలుసుకున్నాం.

కట్టమంచి రామలింగారెడ్డిగారు ప్రతిపాదించి, నిరూపించిన అనేక అంశాలు కవిత్వతత్వవిచారం లో ఉన్నాయి. వీటిని సోదాహరణంగా విశ్లేషించే ప్రయత్నం చేశాను.

[108] కళాపూర్ణోదయం:7ఆ–122పద్యం

రామలింగారెడ్డి కవిత్వ తత్వ విచారంలో పింగళి సూరన కళాపూర్ణోదయం, ప్రభావతీ ప్రద్యుమ్నం రచనలనే కాకుండా, భావనాశక్తికి ఉదాహరణగా వేమన, పల్నాటి చరిత్ర వంటి వాటికి కూడా తన గ్రంథంలో పేర్కొన్నారు. వాటిని గురించి ఏయే విమర్శ పద్ధతుల ద్వారా పరిశీలించారో తర్వాత అధ్యాయాల్లో పరిశీలిద్దాం.

★★★

మూడవ అధ్యాయం

# కట్టమంచి వారి సాహిత్య విమర్శ పద్ధతులు

## మూడవ అధ్యాయం

# కట్టమంచి వారి సాహిత్య విమర్శ పద్ధతులు

సాహిత్యాన్ని విమర్శించడానికి కొన్ని పద్ధతులను పాటించాలి.సాహిత్య స్వరూప , స్వభావాలనుబట్టి, కాలమానపరిస్థితులను బట్టి,ఆసాహిత్యాన్ని అనుశీలించే పద్ధతిని బట్టి విమర్శకుని శక్తి సామర్థ్యాలు అవగాహన స్పష్టమౌతాయి. కట్టమంచి రామలింగారెడ్డి గారు సంప్రదాయ సాహిత్యాన్ని ఆలంకారిక స్వభావాన్ని ప్రదర్శిస్తూనే ,వస్తుతత్త్వ పద్ధతిలో విశ్లేషించారు.కవులను వారి జీవితం,రచనలను కవిజీవితకావ్య సమన్వయపద్ధతిలో సమన్వయించారు.

కావ్యాలనుతులనాత్మక పద్ధతిలో వస్తువు, పాత్రలను వివిధాంశాలను తులనాత్మకంగా విశ్లేషించారు. తిక్కన, పింగళి సూరన, వేమనలను కవి జీవిత కావ్యం సమన్వయ పద్ధతిలో శాస్త్రీ యంగా విశ్లేషించారు. వీటితో పాటు కావ్య సంవిధానాన్ని అలంకారిక పద్ధతిలోనే విమర్శించారు.వీటన్నింటిలోనూ చారిత్రక, సామాజిక, వస్తుతత్త్వాన్ని విశ్లేషించడం వీరి విమర్శలో కనిపించడం ఒక ప్రత్యేకత. వాటిని ఈ అధ్యాయంలో సోదాహారణంగా వివరించే ప్రయత్నం చేస్తాను.

### 3.1 తులనాత్మక విమర్శ:

ఆధునిక విమర్శా పద్దతులలో తులనాత్మక విమర్శా పద్దతి ప్రాముఖ్యం కలది. ఈ పద్దతి కూడా ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్లనే తెలుగులో సంభవించింది. మాథ్యూ ఆర్నాల్డ్ అను ఫ్రెంచి రచయిత పుస్తకము “History of Comparative”ను అనువాదం చేస్తూ 1848లో Comparative Study అను పదమును ప్రథమంగా ప్రయోగించారు. ఫ్రెంచ్ సాహిత్యమునందు 1800, 1820 సంవత్సరం నాటికి ఈ విమర్శ ప్రచారంలో ఉంది. ఈ తులనాత్మక విమర్శను ఈ విధంగా నిర్వచించారు.

***Comparison is a method used by all criticism and sciences, and does not in any way adequately describe the specific procedures of literary study. The comparison between literature or even moment’s***

***figures and works is really a central theme in literary history though such book as F.C. Green's minuet.***[1] ఈ తులనాత్మకపద్ధతి విజ్ఞాన శాస్త్రంలోనూ, సాహిత్య విమర్శయందునూ అనుసరించుచున్నప్పటికీ సాహిత్యంలో దీనికి సమగ్ర స్వరూప నిరూపణ జరగలేదు.

సాహిత్యముల పరస్పర సంబంధం కానీ, సన్నివేశముల మధ్య కానీ అలంకారిక రచనల మధ్య కానీ తులనాత్మక పరిశీలన చేయుట ఈ విమర్శ ముఖ్య ఉద్దేశం. ఈ తులనాత్మక పరిశీలన అనునది విభిన్న సాహిత్య అంశాల మధ్య కూడా చేయవచ్చు. ప్రపంచ సాహిత్యముల మధ్య సంబంధ బాంధవ్యాలు సదావగాహన సమకూర్చుటకు ఇది ఒక మార్గము.రెడ్డి గారి విమర్శలు పరిణామక్రమం నిశిత దృష్టి విశాల దృక్పథం కనిపిస్తాయి. అప్పటి ఆంగ్ల సాహిత్య విమర్శలో సాగుతూ ఉండిన తులనాత్మక విమర్శ రెడ్డి గారి పై ప్రభావం చూపింది. రామలింగా రెడ్డి కవిత్వ తత్వ విచారము గ్రంథంలో తులనాత్మక విమర్శ చేశారు అని భావించవచ్చు. ఎలాగంటే ఒకే కవి కి చెందిన రెండు రచనలను తీసుకొని పరిశీలించాడు. వాటిలోని తారతమ్యాలను తన రచనలో చర్చకు పెట్టాడు. అంతేకాకుండా కవిత్వతత్వ విచారంలో మధ్యయుగ కవులకు పూర్వ యుగ యువకులకు గల రచనా విధానంలో భేద సాదృశ్యాలను వివరించాడు. మధ్య యుగ కవి అయిన సూరనకు పాశ్చాత్య కవి అయిన షేక్ స్పియర్ సమకాలికుడు అని గుర్తించి వారి ఇరువురిలోని సామీప్యతను చూపించారు. తెలుగు గ్రంథాలలోని ఇతివృత్తాలను పాశ్చాత్య గ్రంథాలలోని ఇతివృత్తాలను పోల్చి చూశారు. కళాపూర్ణోదయం, ప్రభావతీ ప్రద్యుమ్నంలోని రచన భేదాలని తులనాత్మకంగా పరిశీలించి కవి వ్యక్తిత్వంలో మార్పు వచ్చినట్లే రచనల్లో కూడా మార్పు చేసుకుంటుందని రెడ్డి గారు వివరించారు. పంచమి వ్యాస సంపుటిలో సీత, ద్రౌపదుల మనస్తత్వాన్ని తులనాత్మకంగా పరిశీలించాడు.

1) రంగనాథ రామాయణ కర్తృత్వం, 2) అవాల్మీకములు. ఈ రెండు అంశాలపై ఎంతో పరిశోధనాత్మకంగా, తులనాత్మక విమర్శన దృక్పథంలో తన అభిప్రాయాలను వెల్లడించాడు.

### 3.1.1 రంగనాథ రామాయణ కర్తృత్వం:

రంగనాథ రామాయణ కర్తృత్వ నిర్ణయం గురించి రామలింగారెడ్డిగారి తులనాత్మక విమర్శనారీతిని పరిశీలించవచ్చు. రంగనాథ రామాయణం రెడ్డిగారి అభిమాన గ్రంథాలలో

[1] Theory of Literature.Pg:46

ఒకటి. అందువలనే వీరు ఆంధ్ర విశ్వవిద్యాలయం అధ్యక్షులుగా ఉన్న సమయంలో ఈ గ్రంథాన్ని ప్రకటించారు. ఈ కావ్య పీఠిక రచనా సన్నివేశము విచిత్రంగా జరిగింది.[2]

మొదటిసారిగా ఈ రంగనాథ రామాయణ గ్రంథాన్ని పరిశోధించు కార్య భారము శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి దక్కింది. వీరికి చేదోడు, వాదోడుగా గన్నవరపు సుబ్బరామయ్యగారు ఉన్నారు. ప్రభాకరశాస్త్రిగారికి అనారోగ్యం కారణంగా ఈ పీఠిక రచనా భారము రెడ్డిగారిపై పడింది. వీరికి అనారోగ్యం కలగడం వల్ల ఈ కార్యము లక్ష్మీకాంతంగారిపై పడింది. ఎట్టకేలకు లక్ష్మీకాంతంగారు రంగనాథ రామాయణానికి పీఠికను ప్రకటించారు. ఈ పీఠిక స్వతంత్రం కాదని చెప్పవచ్చు. రెడ్డిగారి అభిప్రాయాలను సేకరించి వారి స్వతంత్ర భావాలను కొన్ని చేర్చి వీరు పీఠికను రచించారు.[3] పింగళి లక్ష్మీకాంతం గారి పీఠికలోని విషయాలతో తృప్తిపడక రెడ్డిగారు ఇంకొక పీఠికను రచించి అనుబంధ పీఠికగా ప్రకటించుకున్నారు.

ఈ వ్యాసములో రెడ్డిగారు రంగనాథ రామాయణాన్ని రచించినవారు రంగనాథుడనే కవిగాక గోన బుద్ధారెడ్డి అని ప్రకటించారు. దీన్ని తెలుగు వాఙ్మయ చరిత్రలో మొట్ట మొదటిసారిగా ప్రతిపాదించినవారిలో రెడ్డిగారు అనడం గమనర్హము. ఈ విషయాన్ని అనంతకృష్ణశర్మగారు ఇలా ప్రకటిస్తూ..." ***నేనెఱిగినంత వఱకును ఇది సత్యముగాదను వాదమును లేవదీసిన వారిలో రామలింగారెడ్డిగారే మొదటివారు. వారి కవిత్వతత్త్వవిచారమున రంగనాథుడనువాడు కట్టు కథలకు జేరినవాడు గాని నిజమైన వ్యక్తి కాదు అన్నారు"*** [4]

***'కవిత్వతత్త్వవిచారము' అనే విమర్శా గ్రంథంలో మొట్ట మొదటగా ఈ విధంగా ప్రతిపాదించారు. "రంగనాథుడనెడు వాడు కట్టు కథలకు జేరిన కవియేకాని వాస్తవ్యుడు గాదు"*** [5]. ఈ సిద్ధాంతాన్ని రెడ్డిగారు 'History of Telugu Literature' అనే గ్రంథ పీఠికలో ఇలా ప్రకటించారు. ***"Men of genious like Kona Buddha Reddy, one author of Ramayana, which has been spuriously attributed to a mythical Ranganadha, Uncreable to Dravidanize the Ramayana itself "*** [6]. ఈ

---

[2] డా,సి.ఆర్.రెడ్డి పీఠికలు పుట:123.

[3] రంగనాథ రామాయణ, పుట:1

[4] సారస్వతాలోకము, పుట:94.

[5] కవిత్వతత్త్వవిచారము, పుట:18

[6] History of Telugu Literature, pg:6

విధంగా కవిత్వతత్త్వవిచార రచనా కాలం నుండి రంగనాథ రామాయణం కోన బుద్ధారెడ్డి కృతి అని చెప్పారు. సాహిత్య చరిత్రకారుల్లో ప్రధానంగా వీరేశలింగంగారు తొలిసారిగా రంగనాథ రామాయణాన్ని రంగనాథుడే రాశాడని ప్రతిపాదించారు. ***"రంగనాథుడనునతడు రామాయణమును ద్విపద కావ్యముగ రచించిన కవి"***[7].

ఇలా వీరేశలింగంగారు ప్రతిపాదించిన సిద్ధాంతంపై రెడ్డిగారు నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. బుద్ధారెడ్డి ఇంటి పేరు "గోన? కోన?" అనే విషయంపై రెడ్డిగారి అభిప్రాయం పరిశీలించదగ్గ అంశం. వీరు ప్రయోగించిన పదాలను పరిశీలిస్తే బుద్ధారెడ్డి ఇంటి పేరు "గోన" అని తెలుస్తోంది. 'History of Telugu Literature' అనే గ్రంథంలో మాత్రం కోన బుద్ధారెడ్డి అని రాసినారు. ఈ విషయం గురించి అనంతకృష్ణశర్మగారు ఇలా అన్నారు..." ***బుద్ధారెడ్డి యింటి పేరు "కోన" గాని "గోన" కాదు. "గోన" శబ్దము అర్థము లేనిది. గసడదవాదేశపు మహత్తుచే వచ్చిన కూర్పు. ఇది "సాగరాంధ్రుల"లో వాడుకలో నుండు గడప. దాండ, దిద్దు మొదలగు వాని వంటి భిన్నొచ్చారణమే..."*** [8]. ఈ విషయం అప్రస్తుతం కావున రెడ్డిగారి అభిప్రాయం ప్రకారం బుద్ధారెడ్డి ఇంటి పేరు "గోన" అని గ్రహించవచ్చు. రెడ్డిగారు రంగనాథ రామాయణ రచనా కాలాన్ని నిర్ణయించడానికి అనుసరించిన విధానం వీరి చారిత్రక పరిశోధనకు నిదర్శనం. ఈ గ్రంథ రచనా కాలనిర్ణయం ప్రకటనకు బూదవూరు, రాయచూరు శాసనాలను ఆధారం చేసుకున్నారు. బూదవూరు శాసనం మాత్రం పరిశీలించదగిన విషయం. ఈ శాసనము ఆధారంగా వీరు గ్రహించిన అంశాల ప్రకారం కుప్పము భూపతి/రామాయణ కర్త కూతురు కానీ. అతని తాత అయిన బుద్ధా భూపతికి కూతురు కావచ్చు అని నిర్ణయించారు. అయితే మొదటి సిద్ధాంతాన్ని అంగీకరిస్తే 'కుప్పము' రామాయణ కర్త బుద్ధ భూపతి కూతురు అని రెడ్డిగారు అంగీకరించారు. రంగనాథ రామాయణ రచనా కాలం క్రీ.శ.1240 సంవత్సరంగా సిద్ధాంతం చేశారు. రెడ్డిగారు తన ప్రసంగంలో ఇంకొక నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. తిక్కన రామాయణాన్ని రాయడానికి బుద్ధ భూపతి రామాయణం అంతకు ముందే ఉన్నట్లు రెడ్డిగారు భావించారు.

భాస్కర రామాయణంలో రంగనాథ రామాయణ ప్రభావం అధికంగా కనిపించడం వల్ల రంగనాథ రామాయణం భాస్కర రామాయణం కన్న ముందు రచన అని రెడ్డిగారు ప్రకటించారు. ఇలాంటి అభిప్రాయాలను రెడ్డిగారు ప్రకటించడానికి కారణం ఈ గ్రంథంపై

---

[7] ఆంధ్ర కవుల చరిత్ర, పుట:227

[8] సారస్వతాలోకము, పుట:95

ప్రత్యేక అభిమానమే కారణంగా చెప్పవచ్చు. ***"మొత్తం మీద నీతడు తిక్కనకు సమకాలికుడో, పూర్వికుడో కావచ్చును. వెనుకటి వాడు మాత్రము కాదు"***[9] పైన రెడ్డిగారు చెప్పిన అంశాలన్నీ పింగళి లక్ష్మీకాంతంగారు చెప్పారు. లక్ష్మీకాంతంగారు రెడ్డిగారి లాగ రంగనాథ రామాయణ కర్తృత్వ కాలాన్ని క్రీ.శ.13వ శతాబ్ది పూర్వభాగంగా ప్రకటించారు. కర్తృత్వంలో అనుసరించిన రెండు విధానాలు ఆంతరంగిక నిదర్శనాలుగా చెప్పవచ్చు. శాసనాల ఆధారంగా రామాయణాన్ని గోన బుద్ధారెడ్డి రచించాడని చెప్పిన తర్వాత గ్రంథస్థ నిదర్శనాన్ని బహిర్గతం చెశారు.

**"అనియంధ భాష భాష ధీశనిభుడు**
**వినుత కావ్యాగమ విమల మానసుడు**
**పారి తాచారు ఉపార ధీశరధి**
**భూలోకనిధి గోన బుద్ధ భూవిభుడు**
**తమ తండ్రి పిట్టల ధరణీశుపేర**
**బనుగోన నరిగండ బైరవు పేర**
**నలఘు నిశ్చల దయాయతబుద్ధి పేర**
**లలిత సద్గుణ గణాలంకార పేర**
**నాదిఛంద్ర తారార్కమై యొప్పు మిగిలి**
**భూచక్రమున నతిపూజ్యమై వెలయ**
**నసమాన లసిత శబ్దార్థ సంగతుల**
**రసికమై బెలువాందు రామాయణమున**
**బరగ నలంకార భావముల్ నిండ**
**గరమొప్పకీ... కాండంబు చెప్ప**

**(రంగనాథ రామాయణం, పుట:82)**

అనే అశ్వాశాంత పద్యం ఆధారంగా రంగనాథ రామాయణాన్ని గోన బుద్ధారెడ్డి రచించాడని నిరూపించారు.

*"ఇంతకంటే వేఱేమి నిదర్శనములు గావలయును. బుద్ధారెడ్డియే రంగనాథ రామాయణము కర్తయని నిరూపించుటకు? ఇది యంతయు బుక్కిటి పురాణములను, జనశ్రుతులను ప్రోగుచేసి వానిని యుక్తులతో మేళవించి కూర్చిన కూటకరణముకాదు. మఱియేతద్ గ్రంథావతారికలో శాసనాక్షరములవలెనున్న ఆయా పంక్తులు ఎత్తిచూపుచు*

9 పంచమి, పుట:6

*నిరూపించిన యధార్థ విషయము. రంగనాథ రామాయణమును బుద్ధారెడ్డి రచించినట్లున్న నిదర్శనములా గ్రంథమునందే యుండనేవో యనుమాన ప్రమాణములను బుక్కిటి పురాణములను ఆధారముగా గాని కొందఱు విమర్శకులు రంగనాథుడను నాక కృత్రిమ పురుషుని గల్పించి యేతత్ కృతి కర్తృత్వమును నాతని కంట గట్టబూనుట శోచనీయము"*[10] ఇలా రంగనాథున్ని కృత్రిమ పురుషునిగా పేర్కొనడాన్ని అనంతకృష్ణశర్మగారు అంగీకరించలేదు.

*"రంగనాథుడను నొక కవియుండె యీ రామాయణము వ్రాసి బుద్ధరాజు పేర ప్రకటించుట, దీని నెఱుగని సమకాలికులు మూలమున దీనికి రంగనాథ రామాయణమును పేరు పిలచుటయు అసాధ్యము గాదు. కొంతవఱకు అసంభవమని మాత్రము చెప్పక తప్పదేమో. అంతేకాని రంగనాథుడు "కృత్రిమ పురుషుడని" రెడ్డిగారి వలే దృఢముగా చాటుట నాచేతగాని పని. లేని వ్యక్తిని భావనచే సృష్టించి ఇందటిలో వొక బుద్ధారెడ్డి మీద వేయేల పడవేయవలయునో, అందుచే నెవరికి తృప్తియె నాకర్థము కాని విషయము"*[11]. అనంత కృష్ణశర్మగారు రంగనాథ రామాయణ కర్తృత్వ నిర్ణయం గురించి రెండు భావాలను కలిగినట్లు కనపడుతున్నది. రెడ్డిగారి 'కృత్రిమ పురుష' పదప్రయోగానికి విపరీత వ్యాఖ్య ఉన్నట్లు కనిపిస్తోంది. ఇంకోవైపు ప్రత్యక్ష సాక్ష్యాలు ఉండగా పరోక్ష సాక్ష్యాలను ఆశ్రయించుట ఉచితం కాదని చెప్పారు. రంగనాథుడ్ని కృత్రిమ పురుషునిగా రెడ్డిగారు పేర్కొనడాన్ని శర్మగారు విమర్శించారు. రంగనాథ రామాయణ కర్త రంగనాథుడని సిద్ధాంతాలు చేసిన పూర్వీకులను ఖండించారు. వీరేశలింగారి వాదాన్ని వ్యతిరేకిస్తూ "ఆత్మస్తుతి చేసికొనియున్నాడు" కవులు నాతని స్తుతి చేకికానరు. కనుక గోన బుద్ధారెడ్డి రాయలేదని, చెప్తూ రంగనాథుడు రాశాడని అనేక విమర్శకుల అభిప్రాయాలను వ్యతిరేకిస్తూ రెడ్డిగారు తెలుగు సాహిత్యంలో ఆత్మస్తుతి చేస్తున్న కొందరి తెలుగు కవుల పద్యాలను చూపి తెలుగు కవులలో ఆత్మ, శ్లేష చేయడం అరుదుగా ఉంటాయని భావించారు. *"తెలుగు కవులలో కవిత్రయము వాఱును మఱికొందఱును దక్కనాత్మ శ్లాఘన చేసికానిక వారరుదు. అది ఆత్మ ప్రతిభాషిష్కరణమే గాని తమ్ముదాము పొగడు కానుటముగా నేరదు. ఇంతమాత్రముచే వారి గ్రంథకర్తృత్వమును నవ్వాజము నేయుట యన్యాయము"...*[12]. ఈ "రంగనాథ రామాయణము" అని పేరుకు కారణాలను పింగళి లక్ష్మీకాంతంగారు చెప్పిన

---

[10] పంచమి, పుట:16

[11] సారస్వతాలోకము, పుట:98

[12] పంచమి, పుట:18

వాటిని అంగీకరిస్తూ తమ మిత్రులు వేమూరి విశ్వనాథశర్మ రాసిన విషయాలను ఉటంకించారు. రంగయ్య యాజ్ఞ వలన కుప్పయ బుద్ధ భూపాలుని రామాయణ ప్రతిని రాశాడని దానిని బట్టి రంగయ్య పేరు మీదనే రంగనాథ రామాయణం రచించబడినది అని పింగళివారు భావించారు"[13]. ఈ సిద్ధాంతాన్ని రెడ్డిగారు అంగీకరించలేదు. "గోన బుద్ధ రామాయణమునకు ప్రతి రాయించుటకయి ప్రోత్సహించిన రంగమ్మ నుద్దేశించి రచింపబడిన పై ద్విపద యే మాత్రమ గుణము లేని చప్పడి రాత. చచు రాత యన్నన్ను అమితోక్తిగాదు. దౌర్భాగ్యపు ద్విపద యొక్క కర్తను బట్టి బుద్ధ భూవిభుని మహత్తర కృతికి రంగనాదాఖ్య సంభవించెననుట సాహసమైన మాటయేగాదు. మఱి కేవలము విపరీతము. కావున నీ రామాయణమునకు నుత్పత్తి స్థానమదియని నేను నమ్మజాలను"[14].

రెడ్డిగారి అభిప్రాయము ప్రకారము రంగనాథ రామాయణము అని పేరు కలుగుటకు హేతువుగా పింగళి లక్ష్మీకాంతముగారి అభిప్రాయములను అంగీకరించినట్లు గోచరించుచున్నది[15]. గోన బుద్ధారెడ్డి శూద్రకవి కావున అన్యాయము చేసి ఉండవచ్చునని మరికొందరు ప్రతిపాదనలు చేశారు. ఈ సందర్భంలో బ్రాహ్మణ కవులు, బ్రాహ్మణేతర కవులకు అన్యాయం చేసినారా! అనే విషయాన్ని చర్చించారు. "హిందూ సంఘంలోని జాతీయ, వైషమ్యజనత భావాల వల్ల బ్రాహ్మేతర కవులకు అన్యాయం కల్పించారా! న్యూనత కల్పించాడా అనుట నిష్పక్షపాత బుద్ధితో వివరించవచ్చు. రెడ్డిగారి జాతీయవాది వైషమ్య భావాలను హిందూ సమాజానికీ ప్రతిపాదించడాన్ని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు నీరసించారు. ***"జాతీయవాది వైషమ్యజనిత భావములు మనుష్య సంఘమునకు సామాన్య ధర్మములు అట్లే మనలోను గలవు. అంతేకాని యవి హిందూ సంఘమునకి ప్రతినియతములు గావు. జాతి యొక్కటి మాత్రము మనలో తక్కిన సంఘముల కంటే కొంచెము ప్రబలముగా నున్నదనవచ్చును"*** [16].

శర్మగారు చెప్పినట్లుగా జాతి, మతాలు, లను మానవ సమాజంలో సామాన్యము కానీ హిందూ మహా సమాజంలో అధికంగా ఉండటంవల్ల రెడ్డిగారు అలా భావించడంలో తప్పేమీలేదు. జాతి అనేది అధికము అని శర్మగారు అంగీకరించారు. ఈ లోపాన్ని రెడ్డిగారు విమర్శించుట అంగీకరించాల్సిన అంశం. ఈ దుర్గుణము సాహిత్య చరిత్రలో చూడటాన్ని

[13] పంచమి, పుట:18

[14] పంచమి, పుట:21

[15] గౌతమవ్యాసములు,పుట:122

[16] సారస్వతాలోకము, పుట:98

వ్యతిరేకించారు. ఈ సందర్భంలో విచారించాల్సిన సంగతులు రెడ్డిగారు ఇచ్చిన వానిలో మొదటి చూసినప్పుడు అప్పకవి తన లక్షణ గ్రంథములో

**"ధరణీసురుడు, ప్రశాంతుడు**
**గురుభక్తుడు, శూచియు, గల్పకడు, పూర్వకవీ**
**శ్వరవాక్ ప్రయోగదక్షుడు**
**కరుణామతి, యెవ్వడతడు కవియన బరుగున్**

**(అప్పకవీయము, పుట:44)**

అని అన్నాడు. అంతటితో విరమిస్తే గౌరవంగా ఉంటుంది.

**"ఉపవగలిగిన శయ్యల నాప్పియున్న**
**యంఘ్రభవుని కావ్యంబు గ్రాహ్యంబుకాదు" (అప్పకవీయము)**

రెడ్డిగారు అప్పకవి ప్రయోగంలోని 'ధరణీసురుడు' అను శబ్దంపై చర్చ చేశారు. "నానృషిః కురుతే కావ్యమ్" అను ఆర్యోక్తిని బట్టి ఋషి శబ్దానికి ధరణీసురుడు అని అనువాదం చేయవచ్చని భావించారు. అప్పకవి యంఘ్రభవు కావ్యంబు గ్రాహ్యంబుగాదు అను సమంజసం కాదు. శర్మగారు చెప్పినట్లు సాహిత్యకారులు అప్పకవి వాక్యాలను ఆచరణలో పెట్టినట్లు కన్పించదు. రెడ్డిగారు భావించినట్లు బ్రాహ్మణ ద్వేషంతోనే రాసెనా? అనుట పలికించినట్లు శర్మగారి అభిప్రాయం వ్యక్తం చేశారు.

"నిజము చూడబోయిన పైన అప్పకవి మాటలకు" నానృషి, కురుతే కావ్యమ్" అను ప్రానుడి మూలం ఋషి అనగా ధరణీసురుడని తెనిగించుట స్థూలమైన పొరబాటు. దానికర్థము జన్మతా బ్రాహ్మణుడని యతడు తలంచియుండనేని అదియంతకంటే పెద్ద దషము. "నావిష్ణుః పృధివీపతిః" అను వాక్యము పై వాక్యము తరువాత దానికి ఎకరాల నేల పబ్దాదారులందఱు శ్రీ మహా విష్ణువు నవతారములని యర్థము చెప్పవలెనన్నది అప్పకవి తెనిగింపు. కాని "ప్రశాంతుడు అను విశేషణు చేయుటచే అప్పకవికి పై ఋషి శబ్దము యొక్క నిజమైన యర్థము కాంతమైన తెలియకపోలేదని యూహింపవలసి యున్నది"[17]రెడ్డిగారు భావించినట్లు అప్పకవి చెప్పిన అంగీకరించ తగినది కాదు. కానీ శర్మగారు చెప్పినట్లు అప్పకవి శబ్ద ప్రయోగంలోని విశిష్ట గుణము పరిశీలించినట్లయిన కవిత్వం ఋషిత్వమే బీజముగా అంగీకరించాల్సిన అంశం.

[17] సారస్వతలోకము, పుట:100

*“ఎక్కువ జాతివాడు తక్కువ జాతివానిని స్తుతింప గూడదు గాదా! బ్రాహ్మణులు సరిసమాన నమస్కారములు అనులోకములకు జేయజాలరు. అనగా నాచారము రీతిని ఇదియే కదా! కారణము బ్రాహ్మణ కవులు. శూద్ర కవులకు సకృత్తుగా దప్పి స్తుతింపకుండుటకు”*[18] అని రెడ్డిగారు ఆంధ్ర సాహిత్యంలో మరి ఒక లోపాన్ని చూపిరి. ఇందులో రెండు ఆశయాలు కలవు. ఒకటి జాతిపరంగా బ్రాహ్మణులకు శూద్రులకు నమస్కరించుట జరిగి వుండేదని రెడ్డిగారి అభిప్రాయం. శర్మగారు రెడ్డిగారి భావాలతో ఏకీభవించి ఉండలేదు.

*“కాని ఎక్కువ తక్కువయను భావములున్నంత కాలము స్తుతులు నమస్కారములు ఎక్కువ వారికి తక్కువ వారికి చేయుట స్వభావము చేయవలయుట ధర్మము ఆ సంకేతములకీ సంకేతములు స్ఫోరకములు. దీనికి విపరీతముగా ఎక్కువగారు తక్కువగారు అట్టి మర్యాద చూపుట వ్యక్తిగతమైన యౌదార్యమునకు గుర్తుకాని సామాన్య న్యాయము కాదు కాజాలదు...*[19]. ఈ విషయమై శర్మగారు ఎక్కువ తక్కువ అను భావాలను దీన్ని బట్టి గ్రహించారో అవగతము కాదు. రెడ్డిగారు జాతిపరంగా ఎక్కువ, తక్కువ అను అంశాలను గ్రహించారు. అందునా బ్రాహ్మణ జాతిలోని లోపాలను చూపి అంతమే కాని మానవ స్వభావాలను గూర్చి చర్చించి వుండలేదు. శర్మగారు రెడ్డిగారి రెండు అంశాలను విమర్శిస్తూ “బ్రాహ్మణేతర కవులు చేసిన కవిస్తుతులలో ఈ దోషము లేదా? నన్నెచోడుడు, బుద్ధారెడ్డి, భట్టుమూర్తి మొదలగువారి యేబ్రాహ్మణేతర కవులను స్తుతించినారు? మఱియు బ్రాహ్మణులను పొగిడి పొగిడి పెద్ద చేసిన రాజులు పాళయగార్లు అందఱును అందఱును బ్రాహ్మణేతరులేకదా![20]. నన్నెచోడుడు మొదలైనవారు బ్రాహ్మణులు, బ్రాహ్మణేతర స్తుతించిన సన్నివేశాలను కలవు కదా! అని శర్మగారు భావించుట సమంజసం ఈ వాదనకు నిరాధారణము. అనాటి కవులు పూర్వకవి స్తుతిలో స్తుతింపక విడిచిన కవులు జాతిపరంగా గాక వారి కవితా ప్రతిభను పరిశీలించడాన్ని ఉచితముగా ఉంటుంది. పూర్వకవి స్తుతిలో అందును స్తుతింపలేరు కదా! అలా కోరిక ఉండునో పూర్వకవి స్తుతియే గ్రంథ పరిణామమును మించి ఉండగలదు.

జాతి ద్వేషమే కాక మత ద్వేషాన్ని సాహిత్యచరిత్రలో కనిపించవచ్చు అని రెడ్డిగారి అభిప్రాయం. “పాల్కురికి సోమనాథుడు మొదలయిన యుత్తమ కవులకు స్తుతి పాఠములలో పేరు లేకుండటకు మత బేధము తప్ప వేఱుహేతువులున్నదా? కవిత్రయముతో తులతూగదగిన

---

[18] పంచమి, పుట:22

[19] సారస్వతాలోకము, పుట:101

[20] సారస్వతాలోకము, పుట:101

వారెవ్వరనిని నన్నెచోడుని చెప్పి మరియొకరి వెన్నవలయును. అట్టి నన్నెచోడుడు మన కవుల యొక్క పూర్వ కవుల యొక్క స్తుతులలో సిర్నాముడు కదా! ఈ వింత యాతని సాహిత్యమందలి యనాదరణచే సంభవించినదా? మత బేధము వలననా?[21]. సోమనాథుడు కవులకు స్తుతి పాఠాలలో వేరు లేకుండుటకు కారణం మతబేధమా? సాహిత్యంలోని అనాదరణమా? అని రెడ్డిగారి ప్రశ్నకు సమాధానం కోసం శర్మగారు ప్రయత్నం చేశారు. "ముఖ్యమైనది అతడు ప్రశాంతుడు కాకపోవుటయే. అతనిది అణపరాని యుద్రేకము. అది అతని శైవాభిమానమందును ఇతరావమాననందును మితిమీఱి యనుహ్యామైనది[22]. ఇలా శర్మగారు చెప్పినట్లు సోమనాథుడు మతావేశపరుడే కాని అతని సాహిత్యం ఆవేశం చేతనే పాఠకలోకం గ్రహించలేకపోయినదని కవులు గుర్తించలేదని భావించటు సమంజసము కాదు. శైవ కవులకు మతావేశము సహజమే. చారిత్రక హేతువుకు ఆదరణ లభించిందని చెప్పడానికి సమంజసంగా ఉన్నది. నిర్ణయంగా, కవుల మధ్య వచ్చే అభిప్రాయం చెడు ప్రభావంతో ఇలాంటివి వచ్చేవని వీరి అభిప్రాయం.***"ధూర్జటి యొక్క కవితామాధుర్యమునకు ఉత్పత్తిస్థానము". సుకుమార వార వనితాధీరపానమట! రామరాజభూషణ రత్నఖచితచారు మస్తక కలాపవాగరియుట"[23].***

రెడ్డిగారి ఈ విమర్శను శర్మగారు మతపరంగా సమర్థించడానికి ప్రయత్నించారు. "ధూర్జటి సుకుమారవారవనీతాధీరపాన కథ సత్యమేనని అది తెనాలివారి మధ్య వైష్ణవ మహత్తుగా వచ్చును. వైష్ణవునికి మత్సరముండవచ్చునట. శైవునికి కామమేలయుండరాదు? మఱియు బసవేశ్వరుడు పోషించిన పంద్రెండు వేల మిండ జంగాల వంటివి చూచినచో కామపురుషార్థ విషయమున ఇతరుల దృష్టి కన్న శైవుల దృష్టికాంత భిన్నముగా ఉదారముగా నుండునని మనకు తోపక తప్పదు"[24] .అయితే అసలు సమస్యను విడిచి వేరొక రీతితో శర్మగారు సమాధానం ఇచ్చుట అసంగత్యం. వీరి దృక్పథం ఒక రీతితో సమంజసంగా వున్నది. ఈ చెడు ప్రచారానికి కారణం కవులలోని మత్సరము కావచ్చు లేదా వారి ప్రవర్తన కావచ్చు. ఇలా నిరాధార విషయాలు చర్చనీయాంశాలు కావు. వినోద కారణాలే కానీ విమర్శనాంశాలు కావు. ***"అసూయాది వైషమ్యముల బ్రభవింప జేయుటలోను, మత బేధము వంటిది జాతి బేధము" అని తెలుపుచూ సాహిత్య చరిత్రయందని కొన్ని సంఘటనలను చూపిరి.***

[21] పంచమి, పుట:22

[22] సారస్వతాలోకము, పుట:102

[23] పంచమి, పుట:23

[24] సారస్వతాలోకము, పుట:103

*"ఆముక్తమాల్యద కృష్ణరాయల కృతమని ప్రత్యక్ష ప్రమాణములుండగా, గూఢ వాదములచే అల్లసాని పెద్దన దీన్ని ప్రచురించుట, చిన్నయ సూరి తన బాలవ్యాకరణ సూత్రములను కృష్ణమూర్తి శాస్త్రి కారికల (Stanzes) నుండి దొంగలించి వాడుట మొదలయినవి"* [25]ఇలా ప్రాతిపదికగా ఈ ప్రచారం జరిగిందని భావించారు. నాటి లాక్షణికుల రచనా కర్తృత్వాన్ని తప్పుగా గుర్తించడాన్ని మొదలైన సన్నివేశాలను అపప్రథకు లోను చేశారని కానీ కుల ప్రసక్తిగా వచ్చినవి కావని చెప్పవచ్చు. ఈ రకమైన విమర్శ రెడ్డిగారు చేయడానికి కారణం "జస్టిస్" పార్టీ ప్రభావం, కులాధిక్యతను తొలగించడమే వీరి ముఖ్య ఉద్దేశంగా చెప్పవచ్చు. ఆ ప్రభావం వీరి రచనల్లో స్వతంత్రంగా కనిపిస్తుంది. ఈ చర్చ ముగించి రెడ్డిగారు రాసిన భావాలను చూస్తే... *"ప్రాచీన విషయ దర్శత్వము నేడు లేదు. మన సంఘము మాఱినది. మనము గుణమునుబట్టి పోవుదుముగాని, కులగోత్రముల బట్టికాదు"* [26]అని తన విమర్శను తెలియజేశారు.

### 3.1.2 అవాల్మీకములు:

భారతీయ సాహిత్యంలో ఆదికవి వాల్మీకి. ఆదికావ్యం రామాయణం మూల రామాయణాన్ని ఆధారంగా చేసుకొని తరువాత ఎన్నో రామాయణాలు వచ్చాయి. అందులో మూలంలో లేని కథలు కొన్ని వచ్చాయి. ఇలా వచ్చిన కథలని అవాల్మీకులనే వ్యాసంలో పేర్కొన్నాడు.

### 3.1.2.1 అవాల్మీకములు – గోనబుద్ధుడు (వ్యాస, వాల్మీక రామాయణ అంశాల మధ్య భేదాలు):

రంగనాథ రామాయణంలోని అవాల్మీకాంశాలు అనేకం ఉన్నాయి. వాల్మీకి రామాయణానికి అది మాతృకమైనది కాదు అని రెడ్డి అభిప్రాయపడ్డాడు. రంగనాథ రామాయణంలో కొన్ని నూతన విషయాలు కల్పించబడ్డాయి. అంతే కాకుండా మూలంలోని కొన్ని విషయాలు ఈ రచనలో వికృతులు చెంది ఉన్నాయి. అంత మాత్రం చేత వాల్మీకేతరములన్నీ ప్రక్షిప్తములని భావింపదగునా! తన దేశమునందు తన కాలమునందు ఊకుడు కథలుగను వీధి పాటలుగను కీడు కౌడు లేని సామాన్య జనులలో వారి హృదయాల భావముల కెక్కినరీతి వ్యాపించియుండిన రామాయణ సంబంధిత గాథలను, బ్రాతల యొక్క రూప నిర్మాణాలను దానవలంభించి స్వీకరించెననుట శుద్ధముగా అనాదరణీయమైన

[25] పంచమి, పుట:23

[26] పంచమి, పుట:23

యోచనయా?[27] అని ప్రశ్నించాడు. ఆనాటి కాలం ప్రజలలోని ప్రచారంలో ఉన్న కథలని గోనబుద్ధుడు తన రచనలో రాశారు. ఇలాంటివి దేశ కాలానుగుణ రచితములు గాక నిర్హేతుక విశ్వామిత్ర సృష్టులా అని ప్రశ్నించాడు. గోనబుద్ధారెడ్డి ప్రతులను గురించిన సత్యాసత్య విచారము సాహిత్యాన్ని అనుసరించి చేయాలి కానీ చెదలు పట్టిన ప్రతులను చూసి కాదని విమర్శించాడు.

కాలాంతర దేశాంత స్థితిగతులను అనుసరించి ప్రజలలో సర్వసామాన్యంగా వచ్చు ఇతిహాస కథలు కవి సృష్టికి మూలాధారంగా ఉన్నప్పటికీ దానిమీద ప్రజాసృష్టికి చెందిన అనేక విధాలైన మార్పులను, పాఠకుల అభిరుచిని పెంపొందించుటకు భారత భాగవతాలనుండి, రామాయణం నుండి కూడా ఇలాంటి ఉదాహరణలు ఎన్నో చూపి ఉన్నాడు.

దశరథుడు **ముదమున నాతడు పెండ్లియయ్యె మువ్వురు సతులన్**

(అరణ్యపర్వం – 268).

అందు కౌసల్యకు రాముడును గైకేయికి భరతుండును సుమిత్రకు లక్ష్మణ శతృఘ్నులు జనియించిరి (అరణ్యపర్వం – 269).

భారతంలో అందరి వలనే దశరథుడు కూడా బిడ్డలని కన్నట్లున్నది. పుత్రకామేష్టియాగం వల్ల కాదు. పాయసం తాగడం వల్లగాదు. పుత్రకామేష్టి లేకపోవుటయు కాదు. ***"నిజసుక్రత పరిపాకంబునం జేసికనియె".***[28] ఇది హిందువులలో సాధారణంగా ఉండు భావన. అనగా పుణ్యములచేత పుత్రులు కలుగుదురని, భార్యలచేత కాదని చమత్కారపూర్వకంగా విమర్శించాడు. రావణుడు తన తలలను ఒక్కొక్కటి ఖండించుకోనుచుండగా పదవ తలను ఖండించేటప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమైనట్లు భారతంలో ఉంది. కానీ ఇది వాల్మీకి రామాయణంలో లేదు. కొన్ని శతాబ్దాల తరువాత రావణుడు తపస్సు చేసింది బ్రహ్మ కోసం కాదు, శివుడి కోసం అని...

**కృత్తత్మ శిరములు నేత్తమ్ము లెవ్వని**

**నీలకటార్చనా నియమములకు** (పంచమి)

వాల్మీకి రామాయణంలో కైకేయి భర్త దగ్గర నుండి పొందిన వరములు రెండు. భారతంలో ఒకటి అని మాత్రమే ఉంది.

---

[27] పంచమి:పుట.87

[28] పంచమి:పుట.89

కం. ధరణీశ! తొల్లి నాకుం
గరుణించిన వర మొకండు గల
దది మదిలోఁ బరికించి యిప్పు డొసఁగుము
చిరముగ సత్యవ్రతంబు సెల్లింపు తగన్ (అరణ్యపర్వం:300)

తే. యౌవరాజ్యపదంబునయందు భరతు
నధిప! యభిషేక మొనరింపు; మడవిలోన
నొలసి పదునాల్గువర్షంబు లుండ నాన
తిమ్ము రాముని; నురువర మ్మిదియ నాకు (అరణ్యపర్వం:302)

- రామ పట్టాభిషేకానికి ముందు భరతుడు మేనమామ గారింటికి పంపినట్లు భారతంలో లేదు. ఈ రామ పట్టాభిషేక విషయంలో ఏదో కుట్ర ఉంటుందనే ఊహే భారతంలో కనిపించదు. కానీ ఇది వాల్మీకి రామాయణంలో ఉంది.
- రంగనాథ రామాయణంలో శ్రీరాముడు తనకు జరగవలసిన పట్టాభిషేకము గురించి కౌసల్యా సుమిత్రలకు తెలుపుతాడు. కైకేయికి తెలుపడు.

భారతం ప్రకారం వాలీ సుగ్రీవులకు జరిగింది ఒక్కటే యుద్ధము. రామాయణం నందు జరిగింది రెండు సార్లు. నాకుంజూడ భారతంలోని గథయే సహజముగా, విశ్వసనీయంగా ఉందని రెడ్డిగారు చెప్పిన దానికి వివరణ ఇచ్చారు. “దెబ్బలు తిని పరుగెత్తక పోయినవాడు అంత త్వరలో పునర్యుద్ధమునకు వచ్చుట యరిది. ఆంజనేయుడు తగు సమయంలో సుగ్రీవ నరుద పల్లవ రామంబు రాఘవుడు వాలీ యెవడని యెఱంగి యమోఘ బాణములతో వాణింజంపుట కొంతవరకు భీమదుర్యోధనాధుల యుద్ధంలో అర్జునుడు భీమునికి తొడలు తట్టి సంజ్ఞ చేసిన విషయాన్ని పోలి ఉన్నదని చెప్పాడు. ఈ రెండు విషయాల్లో సంజ్ఞ సామ్యమైన అంశంగా రెడ్డిగారు పరిగణించాడు.

పేరుకు రంగనాథ రామాయణంలో అవాల్మీకాంశాలను చెప్పిన ఇక్కడ చెప్పినవన్నీ భారతంలో గల రామాయణ కథలోని అంశాలు. ఇక్కడ మూల రామాయణం, భారత రామాయణంలోగల అవాల్మీకాంశాలను తదనంతర వచ్చిన రామాయణాలలోని ఎన్నో గర్భితమైన భేదాలను ఈ వ్యాసంలో చర్చించడం రెడ్డిగారి విమర్శనా దృష్టికి నిదర్శనం.

### 3.1.2.2 కంబ రామాయణం – అవాల్మీకాంశములు:

తమిళంలో అగ్రగణ్యులకు కవులలో కంబ మహాకవి ఒకడు. మనకు గోనబుద్ధారెడ్డి రచించిన రంగనాథ రామాయణం ఎలాంటిదో, తమిళులకి కంబ మహాకవి రచించిన కంబ

రామాయణం అలాంటిది. అరవ దేశంలో బాగా ప్రాచుర్యం పొందిన రామాయణం కంబ రామాయణమే అయితే ఈ కవి వాల్మీకి రామాయణాన్ని పూర్తిగా అనుకరించలేదని సి.ఆర్. రెడ్డి అభిప్రాయపడ్డారు.

*"కంబ మహాకవియు వాల్మీకిని సంపూర్ణంగా అనుకరింపలేదు. మఱి యార్యవర్తనమునకు నెక్కువ సమీపమున నుండు నాంధ్ర దేశంలోని యెల్ల రామాయణములకంటే వాల్మీకేతరములను, తద్భిన్నాంశములను నెక్కువగా బోధించినాడు".*[29]

కంబ కవి వాల్మీకినీ పూర్తిగా అనుకరించకుండా కాలాంతర, దేశాంతర గతంగా జరిగిన మార్పులతో రామాయణ కథను రాశాడని అభిప్రాయపడ్డాడు. అరవ దేశానికి పక్కనే ఉన్న ఆంధ్రదేశంలో వచ్చిన రామాయణంలో కూడా ఇన్ని కల్పనలు, అవాల్మీకములు లేవని రెడ్డిగారు విమర్శించారు.

- ➢ శివధనుర్భంగమునకు ముందే సీతారాములు పరస్పరావలోకనము, ఒకరినొకరు వలచుటయు కంబ రామాయణమున కలదు. అనగా సీత శుద్ధముగా బణముకాదనియు కొంత వరకిందు స్వయంవర లక్షణాలున్నాయని రెడ్డిగారి భావన. పూర్వకాలంలో ఆర్యులలో గొప్ప గొప్ప కుటుంబ స్త్రీలను సయితము విక్రయించుట స్వయంవర వాజ్యముగా బాణముగా నిచ్చుటయు సదాచారముగా నుండెను. ఇట్టి పుణ్యస్త్రీత్వము ద్రావిడులకు నచ్చలేదు కాబోలు[30].
- ➢ దశరథుని మిథిలానగర ప్రయాణ సన్నాహము, వియ్యాలవారిని జనకుడు విడిదలల విడియించుట అట బుష్పాపచయము, జలక్రీడ, మధుపానము మున్నగు వర్ణనమవాల్మీకములు – తదనంతరాచారముల రీతి రాయబడినవి.[31]
- ➢ భరతుడు తనకు బితృకర్మలు సేయరాదని దశరథుడు నిషేధించును. వశిష్ఠుడు భరతుని వారించి శతృఘ్నునిచే శ్రాద్ధ విధులు చేయించును. ఇది వాల్మీకములోని పరస్పర వైరుధ్యముల నివారణ.[32]
- ➢ కైకేయి దోషమును క్షమించి భరతుని పుత్రవాత్సల్యముతో జూడుమని రాముడు దశరథుని ప్రార్థింపగా నతడు సమ్మతించును (సీతాగ్ని ప్రవేశ ఘట్టము). [33]

---

[29] పంచమి:పుట.81

[30] పంచమి:పుట.81

[31] పంచమి:పుట.82

[32] పంచమి:పుట.82

[33] పంచమి:పుట.82

- కంబ రామాయణమందలి సీత "రాక్షలతో మనకేల విరోధము" అని రాముని వారింపదు, లక్ష్మణుని కఠినోక్తులాడదు. నీవిటనుండి వెడలకున్నచో చిచ్చుణికెదనని (అగ్నిప్రవేశం) లక్ష్మణునితో బ్రతిన సేయును (ఎక్కడ జూచినను చిచ్చులు ప్రజ్వరిల్లు కాలమేమో అది)[34].
- ఇందలి రావణుడు సీతను నేలతో బెల్లగించి పోవును. ఇది తదనంతరము దేశంలో వ్యాపించిన పాతివ్రత్య ధర్మోద్ధరణకై రాయబడిన మాట. సీతను రావణు డంటిన యెడల ఆమె యొక్క పరమ ప్రాతివత్యం చెడునని గడ్డపాఱతో గుంత దవ్వి, ఆమె అక్కడనే స్థిరముగా నిలిచియుండగా, బెల్లగించి పోయినాడని చెప్పుట ఆమె యొక్క శుచిత్వము చెడలేదనుట. నిజమైన క్షాత్ర గుణ ప్రకాశితంబులైన వీర యుగమందలి స్త్రీలకు నెట్టి సందర్భములందు బలాత్కార ప్రజానిత దోషములంటినట్లును, దత్ద్వారా వారి కులముకు గాని, గౌరవము గానీ, చెడినట్టు ఎక్కడనూ లేదు.

దీనికి ద్రౌపది వస్త్రాపహరణం, సైంధవుడి బలాత్కారాన్ని ఉదాహరిస్తూ... "దుశ్శాసనుడు ద్రౌపదిని ఏకవస్త్రను, రజస్వలను దలపట్టి యీడ్చుకొని వచ్చి సభలో విగత వస్త్ర గావించినను, ఆమెను సైంధవుడు బలాత్కారముగా బట్టుకొని రథంపై నిడుకొని పోయిననూ, గీచకుడు వీధి మధ్యమున నఅందర యెదుట దన్ని క్రింద పడునట్లు చేసినను, ఆమె యెడ భారత స్త్రీ పురుషులలో నెవరికైననూ అసహ్యత గానీ, యగౌరవం కానీ కలిగెనా? అని ప్రశ్నించాడు.

వాల్మీకి రామాయణంలో రావణాసురుడు సీత తొడల కింద జేయి వైచి ఎత్తుకొని పోయెనని చెప్పబడి యున్ననూ దానిచే సీతయొక్క పేరు ప్రతిష్ఠలకు నేమాత్రమయినా న్యూనత గల్గెనా? రామాయణ కాలమునాటికే యీ విషయం నందు హిందూ సంఘ చరిత్రమునందు కొన్ని మార్పులు కలిగి యుండెను. తన్ను భుజములపై నిడుకొని రామునొద్దకి దీసుకొని పోదునని ఆంజనేయుడు పల్కగా, సీత అతడు రామభక్తుడని యెరింగియు ***"బరపురుషుల నంటను కావున రాను. వచించుటను, ద్రౌపది ఘటోత్కచునిపై స్వారీ చేయుటతో బోల్చి చూడుడు.*** [35]

ఈ కాలపు స్త్రీలు పురుషులతో పాటుగా సంచరించుట వారికి శీలము లేకపోవడం వలనా లేక? అఖండముగా సంకోచమునకు అతీతంగా ఉండవలెననా ఆలోచించండి అని చెప్పాడు. మన వారికి బలమును, క్షాత్రమును కొంతవరకూ క్షీణ స్థితికి వచ్చి స్త్రీ రక్షణమున

---

[34] పంచమి:పుట.82

[35] పంచమి:పుట.83

తగినంత శక్తి లేకపోవుట వలన బలం లేనివాడు సంశయాత్ముడు  కనుక, పాతివ్రత్యముల పేరిట, నీతులు నిర్బంధముల పేరిట హైందవులలో స్త్రీలని అణచి వేశారని పేర్కొన్నాడు.

- లక్ష్మణుడడవిలో ఒక రేయి నీరు తేబోగా అయోముఖి యతని మోసగించి మత్తు చల్లి కొనిపోవును. రాముడతని గూర్చి మిక్కిలి విలపించును, వెదకును (ఇది హనుమదుపాసకుల సృష్టి కాబోలు).[36]
- రాముడు మాంసాహారి కాడు. గుహుడు తేగా వలదనును ఆర్యులు మాంసాహారులు, దక్షిణాత్యులలో శైవ సిద్ధాంతము ప్రధాన మతము. బ్రాహ్మణేతరులు సైతము శాఖాహారులు. రాముణికి కంబ రామాయణమున ఆ గతి పట్టుట సహజము.[37]
- వాలీని రావణుని కంబడు యెక్కువ గౌరవించినాడు (వాలీ ద్రావిడ దేశీయుడగుటయు అన్యాయముగను అధర్మముగను చంపబడినవాడు కావుటయు ఈ ఆదరణకు గారణములా) అని సందేహించాడు.[38]
- వాలీ భార్యయగు తార పతివ్రతగా చిత్రింపబడినది. సుగ్రీవుడామెను తల్లిగా భావించి విధేయతతో వర్తించును (ఎన్నాళ్లు ఇట్లు చూచెనో తెలియదు కానీ మన వైవాహిక సాంప్రదాయములలో "తార మండోదరి చైవ" అని మండోదరి వంటి పతివ్రతగా తార పేర్కొనబడి యున్నది. [39]

ఇక్కడ రామలింగారెడ్డిగారు ఒక ప్రశ్న వేశారు. ఏకపతిత్వము  కాక బహుపతిత్వము సదాచారముగా నుండిన యెడల అప్పుడు పాతివ్రత్యము అసంభవమగునా? అని చెప్తూ అలా చూసినప్పుడు ద్రౌపది కంటే పతివ్రతలెవరుంటారు అని చెప్పాడు.[40]

- ❖ లక్ష్మణుడు కిష్కింధ కేగి వైధవ్యము నొందిన తారను గాంచినంతనే తన తల్లులు జ్ఞప్తికి వచ్చి కనుల నీరు గాంచును.[41]
- ❖ అన్నను జంపింప యత్నించిన సుగ్రీవుని మనము నమ్మ ప్రవర్తింపదగునా అని లక్ష్మణుడు అన్న అగు శ్రీరామునితో అన్నప్పుడు దానికి రెడ్డిగారు వాస్తవంలోని పరిస్థితులను ఈ విధంగా చెప్పారు. రాజకీయాలలో బలము సంపాదించుట

---

[36] పంచమి:పుట.83

[37] పంచమి:పుట.84

[38] పంచమి:పుట.84

[39] పంచమి:పుట.84

[40] పంచమి:పుట.84

[41] పంచమి:పుట.84

ప్రధానమైన రీతి. మంచివారిని గాదు మన పక్కకు జేర్చుకొనుట, మన పక్కన చేరినవారందరూ మంచివారే అని నేటి రాజకీయాలలో కనిపిస్తున్నది ఇలాంటి అంశాలే అని చెప్పాడు.

- ❖ విభీషణుడు రాజ్య కాంక్షతో వచ్చినాడు కాన మనలో జేర్చుకోనవచ్చునని హనుమంతుడు రామునకు దెలుపును. [42]
- ❖ విభీషణుడు నీచ పాత్రము. ఇన్నాళ్ళు గ్రుక్కు మిక్కుమనక యూరకయుండి బలవంతుడు పై నెత్తి వచ్చుట తోడనే అన్నపై ధర్మశాస్త్రము ప్రయోగించిన పెద్దమనిషి! రాజ్య కాంక్ష తనయాశయమైనందున తప్పక తన ప్రక్కనే యుండునని హనుమంతుని నీతివాదము.[43]
- ❖ విభీషణుని భ్రాతృ ద్రోహము నెత్తపోడచి యింద్రజిత్తుని నోటగవి యతనిని దిట్టించును (దాక్షిణ్యాత కవులలో విభీషణ వ్యామోహమంతగా లేదు. ఆర్యులకు సాహాయ్యము చేసినందు చేతనా?).
- ❖ గుహలో దగుల్కొన్న హనుమదాదులను స్వయంప్రభ మంత్రబలముచే వెలికి దెచ్చినట్లు వాల్మీకము నందు కలదు. స్వయంప్రభ తన్ను వేడగా హనుమంతుడు తలతో ఢీకొని గుహ పై భాగమును భేదించి దారి కల్గించును.[44]
- ❖ విభీషణుడు రావణనకు నీతి గరపు సందర్భమున హిరణ్యకశిప చరిత్ర నుగ్గడించును.
- ❖ ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగపాశముగానీ బ్రహ్మాస్త్రము గానీ రాముని బంధింపలేదు.[45]

ఎట్లు బంధించును? ఆయన దేవుడు కదా! దేవుని దేవిగారు తప్ప ఇంకెవరు బంధింపగలరు? అని చమత్కరించాడు.

- ❖ కుంభకర్ణుడు యుద్ధమునకు రాగా విభీషణుడతనితో సంభాషించి రామపక్షమునకు ద్రిప్ప ప్రయత్నించి విఫల మనోరథుడగుట. కుంభకర్ణునిలో క్షాత్రమెక్కువ సమయోజిత ధర్మశాస్త్రము తక్కువ.[46]

---

[42] పంచమి:పుట.85

[43] పంచమి:పుట.85

[44] పంచమి:పుట.85

[45] పంచమి:పుట.85

[46] పంచమి:పుట.86

- ❖ రావణుడు సీతకు రాముడి శిరోధనువులు జూపి బెదిరించుట లేదు. యా మాయాజనకుని గల్పించి సీత దుర్నీతులు గఱపి యామె మనస్సును దిప్పజూచెను.[47]
- ❖ రావణుడొక్కసారియే రామునెదుట నిల్వలేక విహ్వలుడయ్యెను. రెండవసారి స్థైర్యముతో నిలిచి పోరి ప్రాణములు విడిచెను.[48]
- ❖ మాల్యవంతుడు రాముని విష్ణువుగా శంకించి దృష్టాంతములతో రావణునకు దెలుపును. ఇంద్రజిత్తు తన బ్రహ్మాస్త్రము అతనిని జెనకకపోవుటచే రాముడు విష్ణువై యుండునని సంశయించి తండ్రికి తెలుపును.[49]
- ❖ వాల్మీకి శతృఘ్నుని గుణముల గూర్చి యెచ్చటను బ్రస్తావింపలేదు. భరతుడగ్ని ప్రవేశము సేయ నిశ్చయించి శతృఘ్నుని గాంచి యీ రాజ్యము నీవు కాపాడుచూ వచ్చునంత నతనికి. సప్పగించమని తెలుపుగా నతడు.[50]

**చ. జనకునిసత్యవాఖ్యుని గజల్వగ,నన్నవనిం జోరంగ సే**
**వనమోనరింప గానలకు బ్రాతిగా దమ్ముడోకండు వోవ,రా**
**మునిపునరాగ మావధియు బోవగ, దమ్ముడోకండు జీవముల్**
**తనుకగ వీడుచుండ, గడతమ్ముడు రాజ్యము సేమిజెల్లరే**
**చ. అడవుల నన్నయుండ,బురమందలి భోగములందే తమ్ముడ**
**న్నుడిజగమాడునంచు మదినొబ్బి తపించుచు నుండి**
**యగ్నిలోబడచును చిన్నతమ్ముదోడవంగల డంచు దలంతుగాకయీ**
**యెడరు సహించి యేబ్రదికి యేలగ బోలునే యీధరాస్థలిన్**

తీరున గౌరవించియున్నాడు కంబ కవి.

ఈ విధంగా కంబ రామాయణంలో కంబ మహాకవి కల్పించిన కథలను ఎత్తిచూపాడు.

## 3.1.3 భాసుడు – రామాయణ నాటకాలు: తులనాత్మక విమర్శ:

---

47 పంచమి:పుట.86

48 పంచమి:పుట.86

49 పంచమి:పుట.86

50 పంచమి:పుట.86

రామాయణంలోని కథల ఆధారంగా భాసుడు రెండు నాటకాలను రచించాడు అవి 1) ప్రతిమ నాటకం, 2) అభిషేకము. ఈ రెండు నాటకాలలో భాసుడు చేసిన మార్పులు చేర్పులను గురించి ఈ వ్యాసంలో చర్చించాడు.

| ప్రతిమ నాటకం | రామాయణం |
| --- | --- |
| • రామ పట్టాభిషేక సమయంలో శతృఘ్నుడయోధ్య యందే యుండును | భరతునితోబాటు కైకేయుల ఇంటికి వెడలి యుండును. |
| • భరతుడు లక్ష్మణుణి కంటే చిన్నవాడు. | రామునికి దరువాతివాడు. లక్ష్మణుని కంటె పెద్దవాడు. |
| • సీతాపహరణం జరిగిన పిమ్మట సుమంతుడు దండకారణ్యమునకు వెళ్ళివచ్చునట్లు కలదు. | ఈ అంశమే లేదు. |
| • వంశచ్ఛేదకమైన యన్యాయమును కుమారుడు నిందించునప్పుడు కైకేయి చెప్పిన సమాధానము “పదునాల్గు దినములన బోయి పొరపాటున పదునాలుగేండ్లంట” ననుట పాత్ర సంస్కారయుతమైన కల్పన | -- |
| • రావణ సంహారార్ధము రామునకు సహాయముగా భరతుడు సేనా సన్నాహమొనర్చుట కల్పితము. | ఇందు లేదు. |
| • వాలీ సముద్ర మధన సమయమున తాను సురాసురులకు సహాయం చేసినట్లు చెప్పుట. కంబ రామాయణమున ఈ విషయమైన వృత్తాంతము భాసుని అనుకరణము జనసామాన్యమునందిది ప్రతీతి వహించి యుండవచ్చును. | -- |

- భారత అరణ్య పర్వమునందు వలనే –– ఆనవాలుగా ఆంజనేయుడికి ఉంగరం యొసిగినట్లు లేదు.
- ఇందు సేతు బంధనము లేదు. –– రామునికి భయపడి సముద్రుడు రెండు పాయలై నిలిచి త్రోవ *యొసగెను*. వసుదేవునకు యమున త్రోవ యొసిగినట్లు. ఇట్టి గాధ యూధుల పురాణంలో గలదు. అక్కడ ఈ సంభావన జరిపినది శోణ సముద్రము.
- ఇంద్రజిత్తును జంపినది యెవరను మీమాంసకు నిందు నవకాశము గలదు. లక్ష్మణ సహాయుడై రాముడే చంపినట్లున్నది. మఱియొక చోట నీ కొడుకును (ఇంద్రజిత్తు)ని జంపి రాముడు, లంకను దహించుటకో యన మీఱి వచ్చుచున్నాడనియు నున్నది ఇదే మాత్రమైన సత్యమున్న యెడల సీతను జంపి రామునికి దీవ్ర దుఃఖమాపాదింప వలయును రావణుద్దేశమునకు సహజమైన హేతువు కల్గినట్టులేర్పడును.
- రాముని పట్టాభిషేకమయోధ్యలో జరిగినట్టు లేదు. త్వరగా నాటకం ముగించాలని లంకలోనే పట్టాభిషేకము జరిగినట్లు అభాస కల్పన చేసినాడు భాసుడు.

- అరణ్యవాసము విధింపబడిన విషయము లక్ష్మణుడు చెప్పు వరకు రామునకు తెలియదు.
- సీత లక్ష్మణుని తులనాడినట్లు లేకుండుటే కాదు తులనాడ నవకాశమే లేదు. ఏలన రామాజ్ఞయై లక్ష్మణుడు ఋషుల సందర్శనార్థము అంతకుముందే తరలిపోయినందున పర్ణశాల యందు లేడు.
- కొందఱు మునులు సీతాపహరణమును రామునికి దెలుప నుద్యమింతురు.

రాముడు వనవాసం చేస్తున్నప్పుడు ఎందరో ఋషులు వచ్చి చూసి వెళ్ళారు. సీతాపహరణం జరిగిన సందర్భంలో ఒక్క ఋషి వచ్చినట్లు కానీ కనపడదు. భాసుని నాటకంలో ఆ కొఱత ఆరవ అంకారంభంలో విష్కంబముచే తీరినది.

- సీతాపహరణ ఘట్టంలో శ్రీరాముడికి తెలియడం కోసం తన నగలన్నీ ఉడ్చి అచ్చడచ్చటనో, మూటగా గట్టిగానీ వేసింది. ఇది అన్ని రామాయణాలలో ఉన్నది. సీత ఆంజనేయుడికి ప్రత్యాభిజ్ఞాగా తన శిరోభూషణమిచ్చుట భాసుని నాటకములలో లేకపోవుటకు కారణం ఆమె నగలన్నీ మూటగట్టి పారవైచుటయని నాకు తూచుచున్నదని రెడ్డిగారి సందేహాన్ని వెలిబుచ్చారు.[51]

  రామాయణంలో పరమ దృష్టురాలుగా కైకేయి కనిపిస్తుంది. భాసుని నాటకంలో ప్రమాద పతితయైన దయనీయగా కాన వస్తుంది. అదే విధంగా సీత లక్ష్మణుని దుర్భాషలాడుట అను కళంకం కూడా నాటకంలో దుడిచి వేయబడింది. ఈ విధంగా రామాయణ కావ్యాలలోని కథలనాధారంగా భాసుని నాటకం ఏ విధంగా రూపుదిద్దుకొనిందో, అందులోని ఉచితానుచితాలను చర్చించడం జరిగింది.

### 3.1.3.1 అభిషేకము:

ఈ నాటకము మూలకథను యథాతథంగా అనుసరించబడిందని పేర్కొన్నాడు. కానీ హనుమంతుడు సీతను వెతుకు సందర్భంలో చేసిన సముద్ర లంఘనము,

[51] పంచమి:పుట.111

జలములు పాయనిచ్చుట చేత కల్పింపబడింది. భాసుని కాలంన వానరుల సేతు నిబంధన గాథ సర్వజన ప్రసిద్ధిగా లేదో లేక సర్వజన సమ్మతము కాకపోయెనో? అని సందేహించాడు. లంకా దహన స్మారకమైన వాక్యము ఒక్కటి కూడా ఈ నాటకంలో లేదని పేర్కొన్నాడు. ఈ విధంగా ఆది కావ్యమైన రామాయణం గురించి, దాని ఆధారంగా వచ్చిన కావ్యాలలో, నాటకాలలో కల్పనలు, కథలు, అవాల్మీకములు అన్నింటి గురించి ఎంతో కూలంకషంగా చర్చించారు. దీనిని బట్టి చూస్తే రామాయణాన్ని ఎక్కువ సార్లు పఠించాడని అర్థమవుతుంది. అందుకే అవాల్మీకాంశము ఏ చిన్నది అయినా ఇట్టే పసిగట్టాడు. ఇది రామలింగారెడ్డిగారి సునిశిత పరిశోధనాదృష్టికి తార్కాణం.

## 3.1.4 భారత, భాగవతాలు – తులనాత్మక విమర్శ:

**ప్రాచీనములు – వికృతులు** పేరుతో రాసినవ్యాసంలో భారత–భాగవతాలలోని కొన్ని ఘట్టాల్ని తారతమ్యాన్ని వెలికి తీసి పాఠకలోకానికి అందించడమే కాక వాటి అనౌచిత్యాల్ని తర్కబద్ధంగా విమర్శించాడు. భారతంలో లాగా కాకుండా భాగవతంలో పాండవుల చరిత్రను వక్రీకరించడాన్ని విమర్శించాడు.

***"భారతంలో పోల్చి చూచిన యెడల భాగవతము నిన్న మొన్న పుట్టిన పురాణము. ఇట్టి కాలాంతరమున వ్రాయబడిన యీ గ్రంథము నందు భారతమునకు విరుద్ధములైన విధముల గొంతవఱకు బాండవుల చరిత్ర వర్ణింపబడియుండుట విచార్యము".***[52]

ఈ విధంగా భాగవతంలో కొన్ని మూలంలో లేనివి వర్ణించిన ఘట్టాలని ఉదాహరణలతో చూపించాడు.

| | |
|---|---|
| • అశ్వత్థామ నిదురబోవు ఉపపాండవులు మొదలైనవారిని సంహరించి తొడలు విరిగి పడియుండిన దుర్యోధనుని జూచి యా శుభ వర్తమానమును దెలిపి యాతని మనోవస్థతను డిందు వడజేసెను. | ‹ ద్రౌపతీ పుత్రులు శిరంబుల ఖండించి తెచ్చి సమర్పించెను (ఈ దురాచారము వీరయుగముల నుండినట్లు తోపదు. ఖండింపబడిన శిరములతో, ప్రేవుల హారములను ధరించి యూరేగుట నవీన సాంప్రదాయము). |

[52] పంచమి:పుట.29

| | |
|---|---|
| • అశ్వత్థామ యొక్క సౌప్తిక క్రీడ జరుగునప్పుడు ద్రౌపది మత్స్య నగరంలో నుండెను. ఆమెను బిలుచుకోని వచ్చుటకు ధర్మరాజు నకులుని బంపెను | ద్రౌపది యుండిన స్థలము శిబిరము. స్థలాంతరమునకు బోలేదు. |
| • అశ్వత్థామపై బగదీర్చుటకు ద్రౌపది భీమసేనుని నియోగించింది. (అక్కఱ గలిగినప్పుడెల్లా ద్రౌపది భీమసేనుని దడవును, తక్కినప్పుడు అర్జునుని) | అర్జునుడేని యోగంబు లేకయే “మద్గాండీవ నిర్ముక్త భీకర బాణంబుల నేడు వాని శిరమున్ ఖండించినే దెత్తు దచ్చిరముం దొక్కి జలాంబులాడు మిచటన్ శీతాంశు బింబాననా యని సంబోధించుట భాగవత శైలీ విశేషము (ఇట్టి స్నానాలు చేయుట పరమ భాగవతుల కాలపు శాంతి క్రీడ కాబోలు). |
| • అశ్వత్థామ అపజయానంతర మరణ్య ప్రవేశము జేయును తపస్సుకై (అన్నీ బోయిన పిమ్మట దపము దక్క వేఱుగతి యేది?). | అర్జునుడశ్వత్థామను బంధించి తెచ్చి ద్రౌపదికి నివేదించును. మంచి బ్రాహ్మణ కానుక అప్పుడు బ్రాహ్మణ శక్తి చాలా ముదిరినదట (ద్రౌపది – వయస్సెక్కువ యగుకొలది చాందసములు ప్రబలును గదా! |
| • పరీక్షిత్తు పుట్టినప్పుడే గతాయువు, కుంతి, పాండవులు నింటలేరు. కుంతి సుభద్రా ద్రౌపతులు శోకతప్తులై ఆక్రోచించు చుండగా శ్రీకృష్ణుడు హస్తినలో నా వఱకే యుండినవాడు కృపాళుడై వచ్చును. | అశ్వత్థామ యొక్క బ్రహ్మ శిరోనామ కాస్త్రము దన ప్రాణములందీయ గడుగుడు నుత్తరాగర్భములోని పిండము గొప్ప రోదన చేయ బ్రారంభించుచున్నది ద్రౌణ్యస్య విస్పృష్ట మిదం మదంగం సంతాన |

తల్లియైన ఉత్తర యొక్కయు, నితరుల యొక్కయు దుఃఖము చూచి తపించినవాడై, తాను పూర్వమిచ్చిన మాటను దలచుకోని చచ్చిన యా శిశువును దన మాహాత్మ్యముచేత బ్రదికించును. ఈ ఘట్టము మనస్సు నుదపింపజేయునదే కాదు, రంజింపజేయునదియు. శ్రీకృష్ణుని యొక్క సౌహార్థము, పాండవ పత్నుల కతనియందు గల ప్రేమ, భక్తి, విశ్వాసము ఇవన్నియు జక్కగా కన్నుల గట్టినట్లు చిత్రింపబడి యున్నవి.

ఎదుటగల భాగవత కథ భారతమున లేదు. ఇందు పరస్పర వైరుధ్యము కనబడేడిని ఇచ్చట యాదవ వినాశనము ధృతరాష్ట్రుని యాశ్రమవాస పూర్వమే యట! ఇంకొకచోట నుత్తర మందున అని యన్నిటికంటె మించిన వైరుధ్యము.

భీజాంకుర పాండవా నాం. ఇత్యాది విధములనప్పుడు శ్రీకృష్ణుడు కరివరదుడు సూక్ష్మ స్వరూపంతో గొప్ప గదను ధరించి ఉత్తరాగర్భమున బ్రవేశించి బ్రహ్మ శిరోనామ కాస్త్రముతో, ఉత్తరకు నిద్రాభంగము కాకుండునట్లు ఘోరమైన యుద్ధముచేసి, దానిని విధ్వంసము చేసి పరీక్షిత్ ప్రాణములను రక్షించును. ఈ గాధలో సౌమనస్యము లేదు. అసహ్యకరమన్నను అసంగతము కాదు. భక్తి హెచ్చు కొలది, సౌమనస్యము భావనాశక్తి తగ్గును కాబోలు. విదురుడు తీర్థాత్ర చని మైత్రేయునిచే నాత్మజ్ఞానంబు దెలిసి, మరల హస్తినాపురికి వచ్చి ధర్మరాజును జూచి సమస్త లోక వర్తనంబు విశదీంబుగా జెప్పుచు యాదవుల యొక్క క్షమము చెప్పిన యెడల అతడు "ఉగ్ర శోకమున బెగ్గిలి కుందెడినంచు నేమియున్ వినుమని చెప్పుడయ్యె యందు వీరుల నాశము.

- గాంధారీ యొక్క ప్రేరణయే ధృతరాష్ట్రుని యాశ్రమవాసోన్ముఖ మనకు ముఖ్య కారణము.

ముఖ్య కారణము విదుర బోధ.

- ధృతరాష్ట్రుడు ధర్మరాజు చేత బిమ్మట బరజనుల చేత ననుజ్ఞగొని వనవాస ప్రయాణమారంభించును.

  ఎవ్వరికీ జెప్పక సగము రాతిరిలో దుర్గమంబగు హిమమవన్నగంబునకు నిర్గమించును. గాంధారీ విదుర సహితుడై మఱునాడు ధర్మరాజు "మాతల్లిదండ్రులీ మందిరంబున లేరు; సంజయ! వారెందు జనిరి నేఁడు?" అని ఆక్రోశించును.

- సంజయుడే గాడు; గాంధారీ ధృతరాష్ట్రులలో దన కొడుకులెంత బ్రతిమాలినను వినక కుంతియను వారి శుశ్రూషార్థమై యడవికిఁ బోవుట కన్నుల నీరు గ్రమ్మంజేయునట్టి ఘట్టములలో నొకటి.

  కుంతి ఇంటనే యుండును అనుగమింపద.

- గాంధారీ ధృతరాష్ట్రులు దేహ పరిత్యాగము దావాగ్ని వలన

  ధృతరాష్ట్రుడు యోగాగ్ని వలన శరీరమును దప్తము గావించి విసర్జించును. గాంధారీ కంత యోగసాధన లేదు. కాబట్టి సామాన్యమైన యగ్గిలో బడి సహగమనం బోనర్చును.

- విదురుడు ధృతరాష్ట్రుని మరణమునకు మున్న యోగమార్గమున శరీర త్యాగము చేసి ధర్మరాజునందు లీనమగును (వారిరువురును మీమాంససంభూతులవుట వలన).

  ధృతరాష్ట్ర నిర్యాణము చూపబడిన విదురుడు చింతా సంతాప మెదవ (బీతస్వాంతుండై తీర్థములకు జనియె విదురునికి మరణప్రాప్తియైనది ప్రభాస తీర్థమున సంతాపముచేత

| | |
|---|---|
| | బీతస్వాంతులగుట మహాత్ముల లక్షణం కాబోలు!). |
| • యాదవ సంక్షోభ మారంభమైన తోడనే కృష్ణుండర్జునకు సందేశమంపగా నప్పుడాతడు ద్వారవతికి వెడలును. | హరిజాడన్ నరుడేగినాడు. నెల లేడయ్యెం గదా! యని యేడు నెలలకు బూర్వమే వెడలినట్లు భాగవతములోని వృత్తాంతము. |
| • కుంతీ గాంధారీ ధృతరాష్ట్రులతో దావాగ్నిచే గైవల్య ప్రాప్తినందెను. | యాదవ వినాశము కృష్ణ వినాశము నంతయు విని "మదమున సంసారమార్గమునకుం బాసెన్" (తపస్సునకు బోయనో, మరణించెనో స్పష్టముగా లేదు). |
| • పాండవులేవురును ధీరస్వరూపిణి ద్రౌపదితో మహాప్రస్థాన మొనర్చిరి. | వీరందరూ కలిసి వెడలినట్లు స్పష్టముగా లేదు మఱి వేరు వేరుగా బోయినట్లు స్ఫురించెడిని. ధర్మరాజు "చిత్తంబున బ్రహ్మము నావృత్తము గావించుకోనుచు ఉత్తర దిశ కేగె నిర్మలోద్యోగమునన్ అని యెకవచన ప్రయోగము. మఱియు అంత నాతనితమ్ములనిల పుత్రాదులు బహుళ విజ్ఞాన, దావాగ్ని భసిత కర్ములైన యేకాంతులకు లక్షమై వెలుంగు ముఖ్య నారాయణ స్థానమునకు జనిరి. (భాగవతం కాబట్టి పాండవులు పరమ భాగవతులైరి). |
| • మహాప్రస్థానంలో ద్రౌపది చనిపోయినది. తన పతులకు పూర్వము ఆమె మరణమే మొదటిది. | ముండ మోసినట్లు త్రోచెడిని "ద్రుపద రాజపుత్రియు బతుల వలన |

| | |
|---|---|
| తరువాత సహదేవ నకులార్జున భీమసేనుల నిర్యాణములు. | నుపేక్షితయై "సరియిక జెప్పనేల, భాగవతురులై విష్ణు పదంబు జేరె. |

- భారతం చదివిన వాడెవ్వడైననూ ఏ కారణం చేతనైననూ ద్రౌపది పతులచేత నుపేక్షితయగుట సాధ్యమని యెంచగలడా? పతులనెల్లర దన గంభీరవర్తనమునంజేసి తనకు నిత్య దాసులుగా చేసికొన్న లోకోత్తర చరిత్రను విడనాడు విభులుందురే? ఇట్టి రసభాస ప్రకారములు భాగవత రచనా కాలమున ఆ శుష్కకవిలోనో ఆనాటి ప్రజల మందబుద్ధిలోనో యుండియుండుట. నా హృదయమును విస్మయ విషాదములచే దహింపజేసెడిని. దీని గురించి ఇంకా విపులంగా సీత–ద్రౌపది అనే వ్యాసంలో చర్చించాడు.

భారతంలో లాగానే హరివంశం – భాగవతంలో కూడా కొన్ని భేదాలను వివరించి చెప్పారు. హరివంశంలోని కృష్ణజన్మాదికమునకు భాగవతములోని దానికి గల విభిన్నతలు చూపించాడు. భాగవతం కంటే హరివంశం చాలా ప్రాచీనమైనది. కాబట్టి భాగవతం ప్రాచీన గాథలయొక్క వికృతి అనదగును అని నిరూపించాడు.[53]

హరివంశంలో కృష్ణ జన్మకు, భాగవతంలోని కృష్ణ జన్మకు గల భిన్నత్వాన్ని ఒక్కో అంశాన్ని సూక్ష్మంగా పరిశీలించి తెలియజేశాడు.

| హరివంశం ప్రకారం | భాగవతం ప్రకారం |
|---|---|
| • కంసునికి అతని వధించుటకై విష్ణువు కృష్ణుడై పుట్టబోవునది తెలుపుట నారదుని కలహ వచనము ఆకాశవాణి లేదు ఉండినను ఆమె అవలంబించినది మౌనముద్ర. | • ఇచ్చట ఆకాశవాణి వాణి. |
| • దేవకి చెరసాలలో బంధింపబడినట్లు లేదు. ఒక యింటనే యుండినట్లు, కంసుడు వారి చర్యలను బరీక్షించి తెలుపుటకై వేగుల వారిని గావలివారుగా నియమించినట్లును | • కారాగ్రహము నందు ఉండి అన్ని బిడ్డలను మృగములైన కనవట. ఇంక మానవులెట్లు కనిరో. |

[53] పంచమి:పుట.35

దెలుపబడియున్నది (హరివంశ
గాథయే సమంజసమనెడి తూచును).

భారతం ద్వాపరాంతమునకు చెందిన గాథ. భాగవతం వేయి నూరేళ్ళ తరువాతది. భాగవతాదుల చేతిలో పడి కథ నిక్రృష్టతను పొందినదని వీరు భావించారు.[54] హరివంశంలో కృష్ణలీలలు ఔచిత్యశోభితంగా ఉన్నదంటూ రెడ్డిగారు రెండింటిలోనున్న విధానం వెల్లడి చేశారు.

వెన్న, పాలు, పెరుగు నెవరికి దెలియకుండా సంగ్రహించుట దూడలను ఆవుల చెంత వదలుట, పసి బాలుర పోకిరి పనులు హరివంశంలో కనిపిస్తుండగా భాగవతంలో కృష్ణలీలలు శృతిమించి ఉన్నాయని కొన్ని పద్యాలు ఉదాహరించాడు.

క. **వెన్నఁ దినఁగఁ బొడగని మా**
**పిన్నది యడ్డంబు వచ్చి పిఱిఁదికిఁ దివియన్**
**జన్నొడిసి పట్టి చీఱెనుఁ**
**జిన్ని కుమారుండె యితఁడు? శీతాంశుముఖీ!** (పంచమి, పుట:43)

క. **కొడుకులు లేరని యొక సతి**
**కడువఁగఁ దన్ను మగనిఁగాఁ గైకొనినం**
**గొడుకులు కలిగెద రని పైఁ**
**బడినాఁ డిది వినుము శిశువు పనులే? తల్లీ!** (పంచమి, పుట:44)

పై విధంగా యశోదమ్మతో శ్రీకృష్ణుని ఆగడాలను వివరించి చివరగా...

**ఓయమ్మ నీ కుమారుడు**
**మా యిండ్లను పాలుపెరుగు మననీడమ్మా**
**పోయెదమెక్కడికైనను**
**మాయన్నల సురభులాన మంజులవాణీ** (పంచమి, పుట:46)

అని గోపికలు యశోదతో మొఱ పెట్టుకుంటారు. దానిని రెడ్డిగారు ఈ విధంగా విమర్శించారు. ***తుదకు నీ యమ్మలక్కలకు పాలు పెరుగుపై నుండు నభిమానం కూతుండ్రుయు***

[54] పంచమి:పుట.42

*కొడండ్రుయు సౌశీల్యమందు లేదాయేగా! అప్సరోంశ సంభూతులు కాబట్టి పాతివ్రత్యం కంటే పాలే ముఖ్యమేమో అని వ్యంగ్యంగా విమర్శించాడు.*[55]

హరివంశ భాగవతాలలోని వర్ణనలు మన ముందు ఉంచి ఉచితానుచితాలను పాఠకులే నిర్ణయిస్తారని వదిలేశాడు.

## 3.1.5 ద్రౌపది – సీత: తులనాత్మక విమర్శ:

భారతంలో రెడ్డిగారు అమితంగా మెచ్చుకున్న స్త్రీ పాత్ర ద్రౌపది. ద్రౌపది పాత్రపై అంత ప్రేమ కలగడానికి వారి గ్రామంలో ద్రౌపది ఆలయాలు ఉండటం, ద్రౌపది ఉత్సవాలు జరగడం కూడా కారణం కావచ్చు.[56]

భాగవతంలో పాండవులు ద్రౌపదిని ఉపేక్షించారు అని వికృత కల్పన చూసి దానికి బాధపడి ద్రౌపది ఎక్కడా పాండవులచేత ఉపేక్షింపబడలేదు. గౌరవం పొందింది అని నిరూపించడం ఈ వ్యాసంలోని అంశం.

ఈ వ్యాసాన్ని రామలింగారెడ్డి నాలుగు భాగాలుగా విభజించి చెప్పాడు.

1) ద్రౌపది యెడ బాండవులు చూపిన గౌరవాదరములు.
2) ద్రౌపది తన్ను గూర్చి చెప్పుకున్న ప్రకారము.
3) కుంతికి ద్రౌపది యందుండెడి ప్రేమ.
4) సీతా – ద్రౌపతులు.

ఈ నాలుగు అంశాలలోని విషయాలను రెడ్డి కూలంకషంగా చర్చించాడు.

### 3.1.5.1 ద్రౌపది యెడ బాండవులు చూపిన గౌరవాదరములు:

ప్రాచీనములు – వికృతులు అన్న వ్యాసంలో భారతం చదివిన వాడెవ్వడైనా ఏ కారణం చేతనైనా ద్రౌపది పతులచేత ఉపేక్షించబడిందని అనుకుంటాడా? అనే ప్రశ్నకు వివరణగా ఈ వ్యాసాన్ని రాశారు. ద్రౌపది పాండవుల దగ్గర ఎంతటి ఉత్తమ స్థానాన్ని పొందిందో తెల్పడానికి కొన్ని ఉదాహరణలు చూపాడు. అరణ్య పర్వంలో ద్రౌపది ధర్మరాజుల సంవాద ఘట్టంలో ద్రౌపది ఎంతో రాజనీతిజ్ఞత కలదానిగా, వివేకవంతురాలిగా రామలింగారెడ్డి ప్రశంసించాడు. ***"అరణ్య పర్వమునందలి ద్రౌపదీ ధర్మరాజుల సంవాదము వలన ద్రౌపది యెంతో***

[55] పంచమి:పుట.47

[56] డా॥ సి.ఆర్.రెడ్డి, పుట:204.

*విజ్ఞానవతియనియు, వివేకవంతురాలనియు, రాజనీతియందు ప్రగల్భమనియు తేటతెల్లమగును. సరి సమానురాలిగా నామె తనతో ప్రతివాదములు సలిపినందుకు భర్త కినియలేదు, విసుగు చెందలేదు".*[57]

అరణ్య పర్వంలో గంధమాధన పర్వతానికి పోవునప్పుడు ద్రౌపది నడవలేక మూర్ఛిల్లినప్పుడు భర్తలు ఆమెను మోసుకోని వచ్చారని అది ద్రౌపది పట్ల పాండవులకున్న ఆదరాభిమానాలను పేర్కొన్నాడు.[58] ద్రౌపది తన భర్తలను ఆజ్ఞాపించుట అధికారము, గౌరవాభిమానాలు కలిగిందని రెడ్డిగారు నిరూపించాడు.

ద్రౌపది సౌగంధికా కమలం అందానికి ముగ్ధురాలై ఆ కమలం తెమ్మని భీముణ్ని కోరినప్పుడు, భార్య కోరికయే ఆజ్ఞగా, అన్న ధర్మరాజు ఆజ్ఞ లేకుండా కమలం తేవడానికి వెళ్తాడు. అప్పుడు ఆ కమలం ఉన్న వనాన్ని కుబేర భటులు రక్షిస్తుంటారు. వారితో యుద్ధం చేస్తాడు. ఆ యుద్ధ వాతావరణం చూసి ధర్మరాజు జాగ్రత్తగా ఉండాలని అటుఇటు చూస్తే భీముడు కనిపించడు. అప్పుడు అక్కడే ఉన్న ద్రౌపదిని ఇలా అడిగాడు.

**క.** **ప్రియ సాహసుండు భీముఁడు**
**భయవిరహితుఁ డెందుఁబోయె బహురాక్షస సం**
**శ్రయ మిగ్గిరి గంధర్వా**
**న్వయం సేవ్యం బేకచరుఁడు వాఁ డెయ్యెడలన్**
(అరణ్యపర్వం–పద్యం: 371)

**ఆ.వె.** **భూరిభుజుఁడు దానె పోయెనో నీ వెట**
**యేని పుచ్చితో నిజేచ్ఛ నతని**
**నని యజాత శత్రుఁ డడిగినఁ బతికిఁ**
**బాం చాని యిట్టు లనియె సంభ్రమమున** (అరణ్యపర్వం–పద్యం: 372)

అని ప్రశ్నిస్తాడు.

దానికి సమాధానంగా ద్రౌపది –

**మధ్యాక్కర.** **ధరణీస నీకు నాయిచ్చిన పసిఁడి తామరపువ్వు**

57 పంచమి:పుట.53

58 పంచమి:పుట.53

గురువాయు వశమున వచ్చినను దానిఁ గొని యిట్టిపువ్వు
లరుదు గాన కుఱంగటం గలిగెనేని యర్థిఁ దెమ్మనిన
నరిగె నీశాను దిక్కునకు నీ తమ్ముఁ డతి వేగమును[59]

(అరణ్య పర్వం–పద్యం: 373)

ధర్మరాజు నేను నికిచ్చిన బంగారు కమలం గాలివాటం వల్ల ఎగిరిపోయింది. అలాంటి అరుదుగా ఉన్న కమలాలు ఇక్కడ ఎక్కడైన ఉన్నట్లయితే తెచ్చిపెట్టు అని అర్థింపగా భీముడు ఈశాన్య దిక్కుగా వెళ్ళాడు అని ద్రౌపది ధీరముగా సమాధానం చెప్పింది. ఇలా ధీరత్వం కలిగి భర్తలనే ఆజ్ఞాపించే అధికారం కలిగినది ద్రౌపది. మరోసారి ఇలాగే ద్రౌపది పువ్వుల కోసం భీముని పంపిస్తుంది. అంతకుముందే ధర్మరాజు భీమునికి ***"చేయకు మయ్య యిట్టిచెయ్య లనఘ యింక"*** [60]అని ఆజ్ఞాపించి ఉన్న ఆ మాటలను ద్రౌపది కోరిక ముందు మరచిపోయి పువ్వులు తేవడానికి వెళ్తాడు.

ద్రౌపదిపై పాండవులకు అపారమైన నమ్మకం ఉందని చెప్తాడు. భీముడు ఒక సందర్భంలో కృష్ణుణి సాయం కంటే, ద్రౌపది సాయమే మనకు ముఖ్యమని ప్రకటిస్తాడు.

**"*పాంచాలి* సేసిన *తపంబు* పెంపున నీ శోభనంబు సమకూటెను కృష్ణుని సహాయము కంటే కృష్ణా సాహాయ్యమే ముఖ్యమని భీముడు అందఱి యెదుట బ్రకటించినట్లు జెప్పుట"**[61] ద్రౌపది యందు వీరికి గల నమ్మకం, కృతజ్ఞత ఎలాంటివో తెలిసి వస్తాయి అని చెప్పాడు. ఇలా ద్రౌపది పతుల దగ్గర అధికారము, గౌరవము, స్వాతంత్రము కలిగి ఉంది. ఎక్కడ కూడా పాండవులు ఆమె పట్ల అశ్రద్ధగా ఉండినట్లు లేదని నిరూపించాడు.

శాంతి పర్వంలో ధర్మరాజు తన బంధువుల మరణాలను చూసి దుఃఖితుడై విరక్తితో వనవాసం వెళ్ళాలని నిర్ణయించుకుంటాడు. ఆ సందర్భంలో అలా చేస్తే పిరికివారు, దద్దమ్మలనుకుంటారు అనే అర్థం వచ్చేలా "నిటసేయ తగదు రాజ్యము సేయుట ధర్మమని బోధించింది[62]. ఇలా అన్ని విషయాల్లో పాండు నందనలకు అండగా ఉండి వారి గౌరవాభిమానాలు పొందిందే కానీ ఎప్పుడూ ఉపేక్షించబడలేదు అని నిరూపించాడు.

### 3.1.5.2 ద్రౌపది తన్ను చెప్పుకున్న ప్రకారం:

---

[59] అరణ్య పర్వం, పుట:514, తి.తి.దే. ముద్రణ

[60] పంచమి:పుట.57

[61] పంచమి:పుట.58

[62] పంచమి:పుట.63

ద్రౌపది కృష్ణుడితో తనకు జరిగిన పరాభవాన్ని గురించి చెబుతున్న సందర్భంలో తనను గురించి ఇలా చెప్పుకుంది –

**సీ. పార్థివప్రభుఁడైన పాండుమహీపతి**
**కోడల నయి, యుద్ధకుశలు లయిన**
**పాండుతనూజుల భార్యనై, పూజ్యుఁడ**
**వైన నీ యనుజనై, యధికశక్తిఁ**
**బరఁగు ధృష్టద్యుమ్ను భగినినై, ధృతరాష్ట్రు**
**పట్టిచే సభఁ దలపట్టి యీడ్వఁ**
**బడి, పాపకర్ముచేఁ బరిధాన మొలువంగఁ |**
**బడి, దారుణం బైన పరిభవంబు**

**కం. శరణనినవారిఁ గరుణా**
**కరులయి రక్షించు పురుషకారాన్వితులే**
**శరణని యఱచిన నాలిం**
**పర భీమార్జునుల బాహుబల మేమిటికన్?**

ఈ పద్యాలలో రామలింగారెడ్డి రెండు విశేషమైన మాటలను గుర్తించి వాటి ద్వారా ద్రౌపది ధైర్యవంతురాలుగా చెప్పే ప్రయత్నం చేశాడు.

***"ఇచ్చట గమనించవలసిన ముఖ్యాంశాలు రెండు. మొదటిది పరిధాన మొలువంగబడి మరుగమాట విధంగా విస్పష్టంగా నుడువుట; ధీరురాలు అబలయైన తనకు రక్షణంబులేని యెడ నవమతి నొకడు కల్పించిన ఆ పాపము, అనైచ్యము, ఆ యధమత్వము తనకు జెందదు. ఇక జెందవలసినది దుర్మార్గులైన కౌరవులకు, మిన్నక చూచుచుండిన పాండువులకును".*** [63]

పాండురాజు కోడలని, పాండవుల భార్యని, నీ సఖిని దృష్టద్యుమ్నుడి సహోదరిని అలాంటి నన్ను దుశ్శాసనుడు నిండు సభలో వలువ వొలిచి దారుణంగా అవమానించాడు. ఆ పాపము, ఆ అధమత్వము, ఆ అనైచ్యము నాకు చెందదు. దుర్మార్గులైన కౌరవులకు, రక్షించమని వేడుకున్నా రక్షించలేని ఈ పాండు పుత్రులకు చెందుతుంది అని భర్తలను ఎత్తిపొడుపు మాటలతో ప్రశ్నించిన ద్రౌపది ధైర్యాన్ని రామలింగారెడ్డి ప్రశంసించాడు.

రెండవది సంచలనమైన విషయంగా భావించవచ్చు.

---

[63] పంచమి:64

*"భర్తల యెదుట శ్రీకృష్ణునుద్దేశించి 'నేను నీ సఖి'నని పల్కుట. తన శీలమునందు, దన గౌరవమునందు, దన జగదారాధ్యత యందు నెంత దృఢమైన విశ్వాసము లేనిది పరపురుషునితో నిజ పురుషుని యెదుటయందు నెంత దృఢమైన విశ్వాసము లేనిది పరపురుషునితో నిజ పురుషుని యెదుట నేను నీ సఖిని, నీవు నా సఖుడవు అని చెప్పజాలనది. ఇది కొంత వివాస్పదమైన అంశంగా తోస్తున్నది". "పూజ్యుడువైన నీ సఖియునై"* [64] ఈ వాక్యంలో **సఖి** అను పదాన్ని తెలుగు నిఘంటువులు స్త్రీ లింగపరంగా –

చెలికత్తె -- శబ్దరత్నాకరం, 1912.

చెలియ, చెలికత్తె -- బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు, 1903.

సఖి, చెలికత్తె -- తెలుగు నిఘంటువు–తెలుగు–తెలుగు, 1979, జి.యన్. రెడ్డి

అనే అర్థాలను ఇస్తున్నాయి. పుంలింగపరంగా చూసినప్పుడు సహాయకుడు, స్నేహితుడు అనే అర్థాలను ఇస్తున్నాయి. ద్రౌపది నీ సఖినై అనడంవల్ల శ్రీకృష్ణుని చెలియ అనే అర్థం వస్తుంది అని భర్తల ముందు మరొక పురుషునికి అలా చెప్పడానికి ద్రౌపదికి తనయందు అపారమైన నమ్మకం ఉందని నిరూపించాడు.

**గమనిక:** తిరుమల తిరుపతి దేవస్థానంవారు ముద్రించిన మహాభారతంలో **"పాండు తనూజుల భార్యనై! పూజ్యుడైన నీ యనుజనై"** అని ఉంది. సఖి అన్నది అంత సమంజసంగా ఉండదని తరువాత మార్పు చేసి ఉండవచ్చు.

### 3.1.5.3 సత్యా ద్రౌపది సంవాదమునందు:

మార్కండేయ మహర్షి ధర్మరాజుకు కోరిన కథలు చెబుతున్న సందర్భంలో సత్యభామ, ద్రౌపది ఏకాంత స్థలంలో కూర్చొని ఈ విధంగా మాట్లాడుకుంటున్నారు. సత్యభామ ద్రౌపదిని ఇలా అడుగుతుంది –

**సీ. నీ ప్రియభర్తల నిర్మలవృత్తుల**
**ప్రకట తేజుల లోకపాలనిభులఁ**
**బార్థుల నీ వొకభంగిన వదలక**
**చెలువ యెబ్బంగి భజింతు దగిలి?**
**యొక్కఁ డొక్కనికంటె నువిద నీ కెక్కుడు**

[64] పంచమి:65

నసురక్తు లగుట యత్యద్భుతంబు
నగుమొగంబులకాని నాతి నీదెస నెప్డు
బతులకుఁ గిన్క యెప్పొట లేదు (అరణ్యపర్వం-290)

తే. వ్రతము పెంపొ మంత్రౌషధవైభవంబొ
సరసనైపథ్యకర్మకౌశలమొ చతుర
విభ్రమోల్లాసరేఖయొ వెలఁది నీవి
శేషసౌభాగ్య హేతువుఁ జెపుమ నాకు (అరణ్యపర్వం-291)

ద్రౌపదీ! నీ భర్తలు ఏడుగురుని నీవు ఒకే అనురాగంతో ఏ విధంగా సేవిస్తావు. నీ భర్తలైదుగురూ ఒకరికంటే మరొకరు నీకు అనురక్తులు కావడం ఆశ్చర్యంగా ఉంది. అందరూ ఎప్పుడూ నీతో నవ్వుతూ మాట్లాడుతారు, కోపగించుకోరు. పతుల వలన నీవు పొందే విశేష సౌభాగ్యానికి కారణం ఏమిటి? ఏదైనా వ్రతం చేసిన ప్రభావమా! మంత్రౌషద మహిమనా? నాకు చెప్పు అని సత్యభామ అడుగుతుంది.

దానికి ద్రౌపది కొంత కోపగించుకున్నదై ఆ కోపాన్ని బయటకు కనబడనీయకుండా ఇలా చెబుతుంది.

**వ. మరియు ధర్మరాజు నగరియందు కనకమణిమయభూషణాలంకృతులైన పరిచారకులు నూరువేలు రేయును పగలును పాత్రహస్తులై అభ్యాగతభోజనంబులు ఒడగూర్చువారును అందరు గలరు** (అరణ్య పర్వం-307)

**వ.పరమ యశోధనులగు పాండునందనులు నిజకుటుంబ భారంబు సర్వంబు నాయంద సమర్పించి తారు నిర్భరులై ఇష్టవిహారంబుల నుండుదురు**[65]

ధర్మరాజు అంతఃపురంలో నూరువేల మంది సేవకులు పగలు రాత్రి సేవ చేస్తారు. అవన్నీ నేను దగ్గర్నుంచి చూసుకుంటాను. మదగజాలను, గుర్రాలను పరిరక్షించేవారిని నేనే నియమించి వాటిని పర్యవేక్షిస్తుంటాను. సేవకుల సకల సౌకర్యాలు, జీతభత్యాలు అన్ని నేనే పర్యవేక్షిస్తుంటాను. వారు నా మీద సంసారపు బరువు మోపి హాయిగా తమకు ఇష్టమైన తావులలో విహరిస్తుంటారు. కుటుంబ విషయాలు చూసుకునేది నేనే అని చెప్తూ ఇంకా ఇలా అంది.

ఆ. వేగజాము గలుగవెడ నిద్రఁబొందుదుఁ

[65] అరణ్య పర్వం, 5 ఆశ్వాసం, 307 పద్యం: పుట:861

గాని రాజ్యభార కార్యయుక్తి
నబ్జనయన నాకు నాహారనిద్రల
కెడయు లేదు నువ్వెయెల్ల ప్రొద్దు (అరణ్య పర్వం-308)

ఆ. ఇట్టి వర్తనముల నెపుడుఁ బాండవులకు
దగిలి ప్రియము సేయఁదగితిఁగాని
మగువ నీవు సెప్పుమందులు మంత్రంబు
లింద్ర జాలములును నేనెఱుంగ [66] (అరణ్య పర్వం-309)

ఈ పనులన్నీ నిర్వహించి రాత్రి ఒక జాము మాత్రమే నిద్రపోతున్నాను. వెంటనే లేచి కార్యనిర్వహణ దీక్షలో మునిగిపోతాను. నా భర్తల ఆ విషయాలన్నీ నామీద వదిలి నిశ్చింతగా తమ రాజ్యభార వ్యవహారాలలో నిమఘ్నులై ఉంటారు. ఇటువంటి ప్రవర్తనతో నా భర్తల అనురాగాన్ని పొందుతున్నాను కానీ నీవనుకున్నట్టు మందులు, మాకులతో కాదు అని సత్యభామ చెబుతుంది.

ఇక్కడ రామలింగారెడ్డి కుటుంబంలో సంసారిక విషయాలపై ఆడ వారికి అధికారమున్నట్లు అంతఃపురంలోని తన ఇంటికి యజమానురాలులాగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న ఆత్మాభిమానం గలదిగా ద్రౌపదిని చెప్పదలచుకున్నాడు. ఈ సామ్రాజ్యమంతా నాదే, దీనికి నేనే పట్టపురాణిని అని ద్రౌపది తెలియజెప్పడం కోసం ఇది ఉదాహరణగా ఇచ్చాడు.

### 3.1.5.4 సైంధవ దుర్మతి ఘట్టము:

పాండవులు ద్రౌపదిని ఆశ్రమంలో ఉంచి వేటకు వెళ్ళినప్పుడు సైంధవుడు ఆమెను బలాత్కరించి ఎత్తుకుపోతాడు అప్పుడు పాండవుల పరాక్రమాల గురించి చెబుతుంది. అంతే కాకుండా నాకు సహాయం చేయడానికి శ్రీకృష్ణుడు కూడా ఉన్నాడని ద్రౌపది చెప్పుతుంది.

చం. అతులితవృష్ణి కేకయబలావళితోఁ బటుశంఖఘోష భీ
షితభువనత్రయుం డగుచు శీఘ్రతురంగరథాధిరూఢుఁ డై
జితదనుజాన్వయుండు యదుసింహుఁడు వెన్నుఁడు ముట్టి నిన్ బరి
క్షతబలుఁ జేయు నాకు దెసగల్గు టెఱింగెదు గాక యత్తఱిన్
(పంచమి:పుట.66)

[66] అరణ్య పర్వం, 5 ఆశ్వాసం, 307 పద్యం: పుట:862

శ్రీకృష్ణుడు నా సహోదరుడు, పాంచజన్యం ధరించి వచ్చి నిన్నెదిరించి నిన్ను నిర్మూలించినప్పుడు తెలుస్తుంది నీకు అని శ్రీకృష్ణునిపై ఎంత నమ్మకముందో చెబుతుంది.

**క. ననుఁ బెఱవనితల చందం**
**బున నవమానింప నీకుఁ బోలదు మత్పా**
**వనపాతివ్రత్యమహిమ**
**ననిశము నేకీడు నెందు నందు నన్నున్ (పంచమి:పుట.66)**

ఇతర వనితల్లాగా నీవు నన్ను అవమానించడానికి వీలు లేదు. పరమ పవిత్రమైన నా పాతివ్రత్య మహిమ నన్ను ఎల్లప్పుడు కాపాడుతుంది అని తన మహత్మ్యమునందు ఎంతో నమ్మకం కలిగి ఉంటుంది. సైంధవుడిని చంపవద్దని ధర్మరాజు భీమునితో అన్నప్పుడు ద్రౌపది... ***"నప్పాపాత్ముని దెసం గృప సేయ వలవ; దవశ్యంబును వాని వధియించి, నాకుం బ్రియంబు గావించునది; యట్టి ద్రోహి యెల్ల భంగుల వధ్యుం"డనియె***[67] అని చెప్పుటలో ద్రౌపది స్వాతంత్ర్యము, సహజత్వము కనిపిస్తాయని రెడ్డిగారు అభిప్రాయపడినాడు. అదే విధంగా విరాట ఉద్యోగ పర్వాలలోని కొన్ని ఉదాహరణలు చూపి ద్రౌపది తన్ను గురించి ఏ విధంగా చెప్పుకున్నదో, దాని ద్వారా ఆమె స్వాతంత్ర్యం, ఆత్మాభిమానం ఎలాంటివో పాఠకులకు తెలిపే ప్రయత్నం చేశాడు రామలింగారెడ్డిగారు.

### 3.1.5.5 కుంతికి ద్రౌపది యందుండెడి ప్రేమ గౌరవములు:

పాండవులు శ్రీకృష్ణుని సంధి కోసం కౌరవుల దగ్గరికి పంపినప్పుడు కృష్ణుడు కుంతీ దర్శనార్థం ఆమె మందిరమునకు వెళ్తాడు. అప్పుడు కుంతీ కుమారుల యోగక్షేమాలు తెలుసుకొని "యకట! ద్రౌపది సాధ్వి; సుఖంబె దానికిన్?" అని ద్రౌపది గురించి

**చ. కొడుకుల కంటె నయ్యనుఁగుఁ గోడలి కెక్కుడు గూర్తుఁ గోడలుం**
**గొడుగులు సేయు భక్తి కట కోటి మడుంగులు భక్తి నాకు నె**
**ప్పుడుఁ దగఁ జేయుచుండు నది పుణ్యచరిత్ర కులాగ్రగణ్య క్రొ**
**త్తడి సకలంబుఁ జూడ సభ దైన్యముఁ బొందుట సూచి పొక్కితిన్**

**(పంచమి:పుట.68)**

కొడుకులు కంటే కోడలంటేనే నాకు చాలా ఇష్టం. కుమారులు చూపు ప్రేమ కంటే కోటి రెట్లు భక్తితో ఆమె నాకు సేవలు చేస్తుంది. పాంచాలి పవిత్రమైన నడవడి కలది. కులంలో వన్నెకెక్కింది. ఆ మగనాలు అందరూ చూస్తుండగా కురుసభలో అంతటి అవమానం జరగడం

---

[67] పంచమి:67

చూసి బాధపడ్డాను. అత్తనే ఆ విధంగా స్వాధీనం చేసుకుంది అంటే ఆమె సామాన్యురాలా! అంటూ ద్రౌపది సేవాతత్పరతను కుంతియందుగల గౌరవాన్ని ప్రకటింపజేశాడు.

ఇలా చాలా చోట్ల కుంతి ద్రౌపదిమీద ప్రేమ చూపించింది. సుభద్ర కంటే ద్రౌపది గురించి ఎక్కువ సార్లు ఆలోచించింది. ద్రౌపది యందు కుంతికి యనలేని ప్రేమ.

భారతంలో యుద్ధం జరగడానికి నిజమైన కారణం ద్రౌపది పట్ల కౌరవులు చూపిన దుర్నీతి కారణం గాంధారీ అభిప్రాయపడినట్లు సి.ఆర్. రెడ్డిగారు పేర్కొన్నాడు[68].

**సీ. అచ్యుత వీఁడె మహాభీలభుజుఁడగు**
**భీముగదాహతి భూమిఁ గూలి**
**యాతనిచేత సర్వాంగంబులందును గలుగు**
**క్రొన్నెత్తురు కాంక్షఁ ద్రావఁ**
**బడి మఱి తెగటారి పడియున్నవాఁడు**
**దుశ్శాసనుఁ డీతండు సభకు ద్రుపద**
**పుత్రి నీడిచి తెచ్చి పొలువతనమ్మునఁ**
**బతులసన్నిధిఁ గురుక్షితివిభునకుఁ**

**తే. గర్ణునకుఁ జిత్తసంప్రీతి గాఁగఁ దూల**
**పుచ్చెఁ బెక్కువిధంబుల నొచ్చి యామ్మ**
**గాక్షి యప్పుడు మారుతి యంతరంగ**
**మేర్పఁ దలఁపించుదానన యింత వుట్టె** (పంచమి-72)

దుశ్శాసనుడు ఆనాడు సభలోకి ద్రౌపదిని ఇడ్చుకొని వచ్చి, దుర్యోధనుడు, కర్ణుడు సంతోషపడేడట్లు ఆమెను చాలా రీతులలో అవమానించారు. ఆ సమయంలో భీముడి గుండెలు మండిపోయేలా ద్రౌపది తన బాధను ప్రకటిస్తూ ఏడ్చిన ఏడుపు ఆ ఘోరానికి కారణం దాని వలనే ఇదంతా జరిగిందని గాంధారీ పుత్రుల మృత దేహాలను చూసి విలపించింది.

గాంధారీకి ఉన్న అభిప్రాయమే కుంతికి కూడా ఉండేనని గాంధారీ, ధృతరాష్ట్రులతోటి ఆశ్రమవాసానికి వెళుతున్న కుంతిని ధర్మరాజు వెళ్లవద్దని ప్రార్థించి –

**అయ్యమ లాత్మతోడబవనాత్మజుడిట్లను ధర్మపుత్రుని**
**వెయ్యదియుక్తహేతువుగా నిమ్మెయిబాసేదు!నీదుపాన్పునం**
**గయ్యముజేసిభూపతిని కాయములంబరి మర్చేదల్లి నీ**

[68] పంచమి:72

**కియ్యన లక్ష్మీమాదిచరియింపక యిప్పుడువయబడియే (పంచమి:72)**

నీవీ రాజ్యాన్ని వదిలి వెళ్లకూడదు అని ధర్మరాజు ప్రార్థిస్తున్నప్పుడు భీముడు నీ మాట మీదనే కదా ధర్మరాజు యుద్ధం చేసి రాజ్యం సంపాదించాడు అనగా అప్పుడు కుంతీ –

**గౌరవంబున సుకుమారత్వమున నొప్పు!నిప్పోత్తి దలవట్టి యీడ్చితెచ్చి**

**సభలోననట్లు దుశ్శాసనుడవమాన పెట్టంగ నచ్చటి పెద్దలెల్ల**

**బలుకక యుండనబ్బన్నం బునకునోర్వవలసె మీకప్పటికలఘుతేజ**

**నీతేజమట్టులు నీఱయి పోయిన!బాండుని కులము చెప్పంగ జూప (ఆశ్రమవాస పర్వం–16)**

పూజించదగిన లక్షణములు, సౌకుమార్యము కలిగి ఉన్న ద్రౌపదిని జుట్టు పట్టుకొని ఈడ్చుకుంటూ తీసుకొని వచ్చి సభలో దుశ్శాసనుడావిధంగా అవమానం చేస్తుంటే, ఆ సభలో ఉన్న వృద్ధులంతా ఏమీ మాట్లాడకుండా చూస్తుంటే అటువంటి కష్టాలను చూస్తూ ఉండవలసి వచ్చింది. కానీ మీ తేజస్సు బూడిదఅయిపోకుండా ఉండడానికి కృష్ణునితో ఆరోజు అలా చెప్పాను అని కుంతి కూడా ద్రౌపదికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవడానికే యుద్ధం కోరుకున్నదని రెడ్డిగారు నిరూపించారు.

## 3.1.6 సీతా – ద్రౌపదులు : తులనాత్మక విమర్శ:

ఈ వ్యాసంలో సీతా ద్రౌపదిల వ్యక్తిత్వాల గురించి చర్చించాడు.

రామలింగారెడ్డి సీత మనస్తత్వ విశ్లేషణ చేస్తూ ఆమెను ఒక గృహిణిగా పేర్కొన్నాడు. ***సీత ద్రౌపదిలాగా లోక హృదయహారిణి, అయినా ఇంటి దీపము, జగజ్జ్యోతి కాదు. తనవరకే తాను చూసుకుంటుంది. సభలకు పోదు, అట్టి వాటిలో మాట్లాడే శక్తి, రక్తి రెండూ ఆమెలో కనిపించవు. వాదప్రతివాదాలకు, సంఘర్షణ ప్రతిఘటనలకు, అనుకూల వచనాశైలికి ఆమె పనికిరాదు. శుద్ధ పేలపిండి, బెల్లపు ముద్ద, అల్లము లేదు ఆమె నిర్మాణంలో మిరియములంతకన్నా లేవు.***[69] మహా సాధ్వి అని కొంచెం ఘాటుగా విమర్శించాడు. మహా పతివ్రత చివరకు లక్ష్మణున్ని కూడా పతివ్రతా భంగమని ఎట్లా తులనాడిందో మనకు తెలియదా అని చెప్ప ఏదైనా ఆపద వస్తే రామ! లక్ష్మణ! దేవతలారా అని అర్థిస్తుందే కానీ ప్రతిఘటించదు. రావణుడు ఎత్తుకొని వెళ్తునప్పుడు ప్రతిఘటించకుండా సహాయం కోసం అర్థించిందని పేర్కొన్నాడు.

[69] పంచమి:పుట.74

ఇంటిపట్టున ఉండే ఒక మామూలు గృహిణిలాగా, పరపురుషుని మనస్సులో తలచుకోని మహా పతివ్రత సీత అని పేర్కొన్నాడు.

### 3.1.6.1 ద్రౌపది మనస్తత్వ చిత్రణ:

ఈనాటి అమెరికా దేశంలోని నాయకురాళ్ళంత స్వతంత్రురాలు ఈ స్వతంత్ర్యమునకు ఆధారము ఆమె యొక్క ధర్మజ్ఞత, వివేకము, రాజనీతి నైపుణ్యము, జ్ఞాన సంపద, ధీరత్వము, మహోన్నత శీలము. సర్వజన హృదయార్షక ప్రభావము. ఆమె అన్యోన్యమూర్తి, నిష్కలంకిత అలాంటివారిని తమ ఇంటివారే కాక యెల్లవారు ప్రేమిస్తారు, గౌరవిస్తారు.

ఆమె వృత్తాంతమును అలంకారయుక్తంగా చెప్పాలంటే కైశీకీ ప్రధానము. శృంగార, కరుణ రసాల సమ్మిళితము అప్పుడప్పుడు ఆరభటి, రౌద్ర బీభత్సమయము, సాత్వతీ, వీర భయానక సమ్మిళితము.

వీటికి ఉదాహరణగా ఈ వృత్తాంతాన్ని చూపాడు. ***"యుద్ధానంతరము ధర్మరాజు పశ్చాత్తాపముచే జలించిన హృదయం కలవాడై రాజ్యము విడనాడుటయకాదు; ప్రాణ త్యాగము కూడా చేయవలెను రీతిగా"*** [70]

**"ప్రాయోపవేశమున ని**
**క్కాయంబుఁ దొఱంగఁ దలపు గదిరెడు, సంతా**
**పాయత్తచిత్తు, నకట క**
**టా! యని పోనిండు నను దృఢవ్రతయుక్తిన్** (పంచమి:పుట.75)

ఈ విధంగా బాధపడుతుంటే పాపాత్ములను శిక్షించే ప్రవృత్తి కలిగి, భూ ప్రజలను రక్షించే బాధ్యతను సామర్థ్యంతో చేయకపోగా రాజవంశాల బ్రాహ్మణులనుసరించే అతీంద్రియ బహిరింద్రియ నిగ్రహదులను మనసునందు పోషించడం ధర్మం కాదని ధర్మరాజుకు చెబుతూ ఇంకా ఇలా అంటుంది.

నీకేనా అన్ని కష్టాలు నాకు లేవా అనే విధంగా –

**నాయట్లు వడినయంగన,**
**లేయెడలం గలరె యిట్టియేనును ధర్మా**
**పాయము నీ కగు ననువెఱఁ**
**బాయన గృహధర్మ వృత్తిఁ బౌరవముఖ్యా** (పంచమి:పుట.75)

---

[70] పంచమి:పుట.75

అనుట చూస్తే తన జీవితం, తన సుఖమునకై ఎప్పుడూ వినియోగించలేదని ధర్మోద్ధరణమే తన పరమాశయమని స్పష్టమవుతుంది.

పండిత హృదయాలకంటే పామర హృదయాలో సత్య నిర్ణయ శక్తి ఎక్కువగా ఉంటుందని దీనికి ఉదాహరణే ద్రౌపదిని పామర ప్రజలు గుడులు కట్టి, భజనలు, ఉత్సవాలు చేసి ఆరాధించుట అని పేర్కొన్నాడు.

పాండవులు ద్రౌపదిని గొప్పగా పరిగణించి ఆమె తలంపులే తమ తలంపులుగా, ఆమె కోర్కెలు, తమ ఆజ్ఞలుగా ప్రవర్తించారు. ఇలాంటి ఉదాహరణలు ఇంకా చాలా ఉన్నాయి. ఆమె వారి భార్య, పర దేవత అలాంటి ఆమెను భాగవతంలో ఉపేక్షించినట్లుగా చిత్రించడం ఆనాటి గాథలవల్ల అలా రాసి ఉండవచ్చని ఊహించాడు. అంతేకానీ ఇది కవి స్వయంకృతాపరాధమని భావించడం సమంజసం కాదని పేర్కొన్నాడు.

### 3.1.7 **భాసుడు రచన**– భారతంతో తులనాత్మక విమర్శ:

ఈ వ్యాసంలో భారతంలోని కథలు భాసుని నాటకంలో ఎలాంటి మార్పులు చెందాయో చూపించాడు. మధ్యమ వ్యాయోగము, దూతవాక్యము, దూతఘటోత్కచము, కర్ణభారము, ఊరుభంగము, పంచరాత్రము నాటకాలు ఏ విధంగా మార్పు చెందాయో వివరించాడు.

| 3.1.7.1 **దూతవాక్యము** | **భారతము** |
|---|---|
| • దుర్యోధనుడు చక్రవర్తి. | • ధృతరాష్ట్రుడు చక్రవర్తి. |
| • రాయభారపు సభలో కౌరవులు తప్ప అన్యులు లేరు . | • నారదాది ఋషులు గలరు. |
| • దుర్యోధనుడు ఇందు ఉత్తముడుగా చిత్రింపబడినాడు. | • దుర్యోధన పాత్ర ఇందు దుష్ట వ్యక్తి. |

#### 3.1.7.2. **కర్ణభారము**

| | |
|---|---|
| • ఇంద్రుడు కర్ణని కవచ కుండలాలు యాచించుట (యుద్ధ భూమిలో). | • పాండవారణ్యావాసకాలమున. |
| • శల్యుడు కర్ణునియెడ సానుభూతి గల సారధిగానే చిత్రింపబడినాడు. | • శల్యుడు ద్రోహబుద్ధి గలవాడు. |

#### 3.1.7.3. **దూతఘటోత్కచము**:

| | |
|---|---|
| • ఘటోత్కచుడు ధృతరాష్ట్రుని కడకు రాయబారిగా పోవుట కల్పితము. | • భారతంలో లేదు. |

### 3.1.7.4. ఊరుభంగము:

| | |
|---|---|
| • దుర్యోధనుని తోడలు విఱుగ గొట్టుమని సూచించినది శ్రీకృష్ణుడు. | • ఇందులో అర్జునుడు చెప్పాడు. |
| • దుర్యోధనుని కొడుకగు దుర్జయుడు తోడలు విరిగి పడియున్న తండ్రి యొద్దకు వచ్చుట, తండ్రికొడుకుల సంవాదము. | • ఇందీ విషయములే లేవు. |
| • అశ్వత్థామ మాటలతోనే దుర్జయుని పట్టాభిషిక్తుని జేయుట యిందు కల్పితములు. | • భారతములో లేవు. |

### 3.1.7.5. మధ్యమ వ్యాయోగము:

| | |
|---|---|
| • ఇందలి కథ యంతయు జయత్కారముగా గల్పింపబడినది. | • ఇందులో లేదు. |

### 3.1.7.6. పంచరాత్రము:

| | |
|---|---|
| • గోగ్రహణమును అంశము దప్ప నితివృత్తమంతయుఁ కల్పితమే. గోగ్రహణము పాండవులను బయలుపఱచుటకు దుర్యోధనుడు దుర్బుద్ధితో తలపెట్టినట్లుగా భారత వృత్తాంతము. నాటకంబునందిది చాలా చిత్రంగా మార్చబడినది. | • |

దుర్యోధనుడు యజ్ఞ మొనర్చుటయు, యజ్ఞ దక్షిణకై తాను జేసిన అర్థ రాజ్య ప్రధాన వాగ్ధానమునకు సమయముగా గోగ్రహనోద్యమ ముపక్రమింపబడినట్లు ఈ నాటకంలో చిత్రింపబడింది. ఉత్తరణ గోగ్రహణమునకు బూర్వము దుర్యోధనుడు యజ్ఞము తలపెట్టుటయు దానికందరు బంధువులతోపాటు అభిమన్యుడు కూడా వచ్చుటయు గోగ్రహణమున కెత్తిపోవునప్పుడు అభిమన్యుడు కౌరవులతోడ గూడి వెడలి తండ్రితో యుద్ధము చేయుటయు మొదలైన రసవత్తరమైన కల్పనలు ఈ నాటకంలో కలవు.

ఊరుభంగము, పంచరాత్రము అను నాటకములలో దుర్యోధన పాత్రచిత్రణము నిష్కళంకముగా, ఉదారముగా, సార్వభౌమోచితంగా బోషింపబడింది.[71]

### 3.1.8 భాగవతం:

భారతంలోని కథలాగానే భాగవత కథను కూడా బాలచరిత అన్న నాటకంగా చిత్రించాడు భాసుడు. అందులో ఉన్న కల్పనలు ఇవి.

| 3.8.1 బాలచరిత | భాగవతము |
| --- | --- |
| • శ్రీకృష్ణుడు దేవకీవసుదేవుల ఏడవ సంతానము. | • ఇందులో ఎనిమిదవ సంతానం. |
| • యశోదకు పుట్టిన పిల్ల చనిపోయినట్లును, ఆ పిల్లను పూడ్చి పెట్టుటకు అడవికి వచ్చిన నందగోపుని వసుదేవుడు కలుసుకొని బాల కృష్ణునతనికి అప్పగించినట్లును, అంతనా చచ్చిన శిశువు భద్రుకగా వసుదేవుడు తీసుకోని వచ్చినట్లును కల్పితము. | • భాగవతంలో లేదు. |
| • వసుదేవునికి యమునానది పాయలిచ్చుట అమూలకము. | • |
| • కృష్ణుడు బాలక్రీడలలో రాధాది గోపికలతో నెఱపిన వినోద శృంగార చేష్టలిందు స్మరింపబడలేదు. | • |

పురాణాలలో సామాన్యంగా చెడ్డవిగా కనిపించే పాత్రలను, మంచివిగా చిత్రించుట, వస్తు సన్నివేశాలను సందర్భంగా కల్పించుట అన్నవి ఈ మార్పులుగా కారణంగా రామలింగారెడ్డి పేర్కొన్నాడు. ఈ ఐదు వ్యాసాలలోని అంశాల ద్వారా మూల రచనలో ఉన్న అంశాలను కల్పితంగా ఎలా మార్చారో చెప్పి పాఠకులకు సత్యాన్ని అందించారని చెప్పవచ్చు.

---

[71] పంచమి:106

## 3.2 ఆలంకారిక విమర్శ– వస్తు దృక్పథం

ఈ విమర్శ ప్రాచీన కాలానికి సంబంధించినది. సాహితీ విషయంలో అలంకారికులు ప్రామాణికులు. అలంకారిక నిబంధనల ఆధారంగా గ్రంథాన్ని విమర్శించుట 'అలంకారిక విమర్శ'. ఈ నియమాల ఆధారంగా రాసిన గ్రంథాలను మంచి గ్రంథాలని, అలంకారిక నియమాలను లోబడని గ్రంథాలను తప్పుడు గ్రంథాలని నిర్ణయించుట ఈ అలంకారిక విమర్శ పద్ధతి. నిన్న మొన్నటి వరకు భారతదేశంలో ఇలాంటి విమర్శనయే కొనసాగింది. భారతదేశంలోనే కాక పాశ్చాత్య దేశాలలో కూడా ఇలాంటి విమర్శే ప్రచారంలో ఉండేది. పాశ్చాత్యులకు ఆరిస్టాటిల్ రచించిన "పొయెటిక్స్" గ్రంథము పరమ ప్రమాణంగా ఉండేది. ఈ గ్రంథంలో చెప్పబడిన నియమాలను అనుసరించి విమర్శ చేసేవారు.

కట్టమంచి రామలింగారెడ్డిగారికి అత్యంత ఇష్టమైన కావ్యం మహాభారతం. చిన్నప్పటినుండే తండ్రి సాంగత్యంలో భారతాన్ని బాగా అధ్యయనం చేశాడు. ఇంత అభిమాన గ్రంథం మీద రెడ్డిగారి సమగ్ర విమర్శ వెలువడకపోవడం ఆంధ్రుల దురదృష్టం. భారతంమీద ఒక సమగ్రమైన విమర్శ రాయాలి అన్న కోరిక రెడ్డిగారికి ఉన్నట్టు కింది పద్యాలను బట్టి అర్థమవుతుంది. మహా భారతాన్ని వస్తు దృష్టితోను, కొన్ని అంశాల్లో శైలినీ ఎంతో శాస్త్రీయంగా ఆలంకారిక పద్ధతిలో సమన్వయిస్తూ విమర్శించారు.

*"శైలిని, వృత్తమున, నగా*
*ధాలోచనలన్, మహాద్భుతాఖిలవిధ పా*
*త్రాళి ప్రదర్శనంబున*
*భూలోకమునందు మొదటి పుస్తక మగుటన్"*

**నాతండ్రికనారతమును**
**జీతోయుదమిచ్చినట్టి శిష్టచరిత్రం**
**చైతనరారుట మొదలగు**
**హేతువులంజేసి మనసునీడ్చిన దగుటన్**
**దానికి నానేర్చినది**
**ద్యానిపుణత కొలది జీతునాంధ్రంబున వ్యా**
**ఖ్యానము యదార్థ సం వి**

**జ్ఞాన విధానముల నవ్యకళ లేర్పడగన్"**[72]

ఇంతటి అభిమాన గ్రంథం మీద 1914లో వెలువడిన కవిత్వ తత్వ విచారంలో ఎంతో అద్భుతంగా ప్రస్తావించారు. బాగా పరిశీలించిన కవిత్వ తత్వ విచారం లక్షణ గ్రంథంగానూ, భారతం లక్ష్య గ్రంథంగాను కనిపిస్తుంది. అంతే కాకుండా రాజరాజనరేంద్రుని వర్ధంతి మహోత్సవ సభలో అధ్యక్ష ఉపన్యాసంలో వీరి ప్రతిభ, భారతంపై గల పరిశీలన మరింత విస్తృతంగా తెలుస్తుంది. వీటితోపాటు ప్రాచీనములు – వికృతులు, సీత–ద్రౌపది, భాసుని భారత నాటకాలను పరిశీలిస్తే భారతంపై గల వీరి విమర్శనా దృక్పథం అవగతమవుతుంది.

రాజరాజనరేంద్రుని వర్ధంతి మహాసభ రాజమండ్రిలో ఏర్పాటు చేశారు. దానికి అధ్యక్షులుగా రామలింగారెడ్డి ఉన్నారు. ఆ సభలో అధ్యక్షోపన్యాసం చేస్తూ రాజరాజనరేంద్రుని కాలం నుండి కవిత్రయం కవితారీతుల వరకూ సుదీర్ఘమైన ఉపన్యాసం చేశారు.

సభా మర్యాదను పాటిస్తూ సభలో ఉన్న పెద్దలను సభా నిర్వాహకులను, ఈనాటి అంశానికి సంబంధించి ఇంతకు పూర్వమే పరిశోధనలు చేసిన పరిశోధకులందరినీ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కావ్యరచన ఎంతో కీర్తిని ప్రసాదిస్తుందని అలాంటి కార్యరచనను ప్రోత్సహించిన రాజరాజు కీర్తి కూడా అజరామంగా వెలుగుతుందని తెలియజేశాడు.

"నిత్యమైన ధనము నిర్మలకీర్తియ" అనియు

క. **ఇలగీర్తియెంతకాలము**
**గలిగిప్రవర్దిల్లు నంతకాలమును ని**
**త్యులుకారే కీర్తిగల పు**
**ణ్యులు,కీర్తి హీనుడెందునుం బుజ్యుండే**[73] **(వ్యాసమంజరి)**

అని నన్నయ భారతంలో చెప్పబడింది. సప్త సంతానాలలో కావ్యమొకటి. ఆ కావ్య సృష్టికి కారణం అయిన రాజరాజనరేంద్రుని గురించి నందంపూడి శాసనం ఆధారంగా పరిశోధనాత్మకంగా చెప్పాడు.

విస్తృత పరిధిలో జరిపిన పరిశోధన వేరు, పరిమితి, పరిధిలో విస్తృతాంశాలను చర్చించుట వేరు. వీరు రెండవ కోవకి చెందినవారు.

---

[72] సి.ఆర్.రెడ్డి పీఠికలు:పుట.64

[73] వ్యాసమంజరి:పుట.4

*"తండ్రి విమలాదిత్యుడు, తల్లి చోళరాజ పుత్రికయైన కుందమాంబ భార్యయు జోళ వంశజయ. ఆమె పేరు అమ్మంగదేవి పట్టాభిషేక దినము 1022వ సంవత్సరము ఆగస్టు నెల 16వ తేదీ రాజ్యమేలిన కాలము 1063 సంవత్సరం వరకు"*[74] అని ప్రతిపాదించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు కూడా తన ఆంధ్ర కావ్యకవుల చరిత్రము అనే పరిశోధనా గ్రంథంలో రాజరాజనరేంద్రుని కాలం 1063గా నిర్ణయించాడు. రాజరాజ వెంగి రాజ్యానికి రాజు కాకముందు ఆ రాజ్యం కొంతకాలం చోడుల ఆధీనంలో ఉన్నింది. ఆ సందర్భంలో వర్ణధర్మాలు క్షీణ స్థితికి వచ్చాయని చెప్పాడు.

*"ఆ కాలమున నొక్క రాజ్యతంత్రములయందు కాదు, సంఘమాతాది ప్రకృతులయందును కల్లోలములు ప్రభలి యుండినవి. విజాతీయులైన శత్రువుల దండయాత్రల వల్లనేమి, బౌద్ధ జైనాది మతముల వ్యాప్తిచే నేమి వేద తిరస్కార భూయిష్టములైన కౌత్స, చార్వాది వాదములచే నేమి, హిందూ మతం యొక్క ప్రాణములనదగిన వర్ణ ధర్మాలు క్షీణ స్థితికి వచ్చినవి".*[75]

ఇలాంటి పరిస్థితుల్లో రాజరాజు యొక్క పరిపాలనా బ్రాహ్మణ మత పునరుద్ధరణ కాలంతో సమన్వయింపబడి, వర్ణ ధర్మాల పునరుద్ధరణకు పాటుపడ్డాడు. అంతేకానీ యుద్ధాలు చేయలేదు. రాజ్య విస్తీర్ణం పెంచలేదు. భారతంలో గానీ, శాసనాలలో గానీ రాజరాజు పరాక్రమ శక్తిని వివరించే ఆధారాలు దొరకలేదు. రాజరాజు కేవలం వర్ణ ధర్మాలను వ్యాపింపజేయ తన ముఖ్య ధర్మంగా యెంచినాడని రెడ్డిగారు అభిప్రాయపడ్డాడు.

"నందంపూడి మొదలగు శాసనములలోనూ, భారతములోనూ గల వీటి వర్ణనముల బట్టి చూచిన, వర్ణ ధర్మముల పునర్జీవనము తనయొక్క ముఖ్య వ్యాపారమైనట్ల ననుమానింప వలసియున్నది. రాజరాజెట్టి మహత్మ్యము కలవాడనగా *"వివిధాగమవిహితశ్రముడు సమస్త వర్ణాశ్రమ ధర్మరక్షణ మహామహిముడు, విప్రకులమునెల్ల బ్రోచును, నగ్రజన్ములకు ననుగ్రహమున మహాగ్రహారంబులిచ్చువాడు" ఈ విధంగా బ్రాహ్మణులకు విరివిగా అగ్రహారాలు దానం చేస్తూ వారికి అనుంగుడై వర్ణధర్మాలను నిలబెట్టువారు బ్రాహ్మణులే యని తలచి వారికి పెద్ద పీఠ వేశాడు. దీనికి ఆధారాలు అన్ని బ్రాహ్మణ దాన శాసనములు.*[76]

---

[74] వ్యాసమంజరి:పుట.4

[75] వ్యాసమంజరి:పుట.4

[76] వ్యాసమంజరి:పుట.6

కలియుగంలో కలిగే అనర్థాలనుండి వర్ణధర్మాన్ని రక్షించడానికి మొట్టమొదటగా కంకణం కట్టుకున్నది రాజరాజేనని రెడ్డిగారు అభిప్రాయపడ్డారు[77]

హిందూ పునరుద్దరణ రెండు రకాలుగా జరిగిందని చెప్పాడు. అవి 1) పూర్వమీమాంసకులు యజ్ఞములు, హోమములు మొదలగు వైదిక క్రియలు అవశ్యానుష్ఠేయములని గ్రహించిరి. అవి యాకాలమునకే యాచరణలో సామాన్యముగా లేకపోవుటచేతను వానిని బుణరాచరణకు దెచ్చుట యసాధ్యమని తోచినందునను వైదిక క్రియలలో గ్రహింపబడిన బలి విధానము అహింసా ధర్మమునకు బ్రతికూలములఘుటచేతను, ఈ యహింసాధర్మము బౌద్ధమత ప్రభావముచే సర్వవ్యాప్తమగుటయు శంకరాచార్యులు మొదలగు వేదాంతులు వానికి బ్రాధాన్యమునీయనైరి. వేదముల యందు మనకు భక్తియున్నా వైదిక మత మెప్పుడో అంతరించినది. ప్రస్తుతం మనం గమనించవలసింది. ఆంధ్ర మండలంలో వ్యాప్తికి వచ్చినది పూర్వమీమాంస పద్ధతి. దానికి ఆద్యుడు కుమారిల భట్టు. ఈతనిని రాజరాజు అనుసరించాడని రెడ్డిగారి ఊహ[78]. నన్నయకు పూర్వం కవిత్వం ఉందని చెబుతూ అది పద్యకవిత్వమే కానీ కావ్యాలు కాదని చెప్పాడు.

***"నన్నయకు బూర్వమాంధ్రంబున బద్యరచన యుండెను. ఛందస్సు నుండెను కావ్యములు మాత్రము లేవు. ఈ వింతకేమి కారణము నన్నయ బూర్వము తెనగున కవిత్వమే లేదనియు నతడు మొట్టమొదట లక్షణములు నిర్మించి, లక్ష్యముల దీర్చి వాఙ్మయమును సృష్టించెననియు నమ్మువారెవ్వరూ నీనాటికీ గానరాదు"*** [79].

మహిమన్ వాగన శాసనుండు సృజియింపన్ అను మాట కవుల సామ్రాజ్యమునకు చేరిన అతిశయోక్తి! చరిత్రకారులు ఇది నమ్మరు. యుద్ధమల్లుని బెజవాడ శాసనం వంటివాటిలో తెలుగు భాషకు సంబంధించి ఆధారాలు ఉన్నాయి. నన్నయ కంటే ముందు కృతులు లేవా? అవి ఉంటే ఏమాయెను అన్న ప్రశ్న ఉదయిస్తుంది. దానికి సమాధానంగా మహమ్మదీయులు తగులబెట్టిరి అన్న సమాధానంతో తృప్తి పడుచున్నాము. కానీ ఇప్పుడు అది హేతుబద్ధమైన సమాధానం కాదు.

నన్నయ కంటే ముందే మహాభారతం రచించారు అన్న వాదాన్ని రెడ్డిగారు సమర్థించలేదు. నన్నయ కంటే ముందే భారత రచన జరిగి ఉంటే మళ్లీ నన్నయ ఆ రచనకు

---

[77] వ్యాసమంజరి, పుట:8.

[78] వ్యాసమంజరి, పుట:9.

[79] వ్యాసమంజరి, పుట:9.

పూనుకునే వాడేకాదని నన్నయ కంటే ముందు కావ్యరచన లేదు అని రెడ్డిగారు చెప్పి దానికి కారణాలను కూడా చెప్పినాడు.

- పూర్వము విద్య అనగా సంస్కృత విద్య. అది మంత్రముల రీతి బ్రాహ్మణాధీనము. క్షత్రములకు కొంత ప్రవేశముండెకానీ యితర వర్ణులు విద్యా బహిస్కారమనుభవించుచుండిరి. అగ్రవర్ణులు దేశ భాషలయందును బ్రవీణులు అయినను మతము మొదలగు విద్యలు హీనకులములకు దెలియకుండునట్లు గోప్యముగానించి రక్షించుకోవలయునని యెంచి ప్రవర్తించుండిన వారగుట వారు సామాన్యముగా వాడుకలోనుండు భాషలలో గ్రంథములు రాయకయుండిరి. వారికి దేవభాషయే కానీ దేశ భాష పనికిరాదు[80].

రెడ్డిగారి అభిప్రాయంలో కొంత వాస్తవమున్నది. పూర్వం విద్య అనగా సంస్కృత విద్యే. అందుకనే సంస్కృతంలో రచనలు చేసి ఉంటారు. విద్య నుండి హీనజాతుల బహిష్కారము వాస్తవమే. కానీ వారికి తెలియకుండా ఉండుటకు సంస్కృతంలో రాశారు అనడం అంత సమంజసంగా లేదు.

ఆంధ్ర వాఙ్మయం మూల సృష్టికి కారణం ప్రజలు. వారు సర్వసమానత్వమైన జైన బౌద్ధ మతాలలోకి వలస వెళ్లటం వల్ల వారిని నిరోధించడానికి ఆంధ్రములో రచన చేశారని రెడ్డిగారి ఊహ. ఈ ఊహ పుట్టడానికి కారణం శ్రీ భావరాజు కృష్ణారావుగారి ప్రశంగవశమున చెప్పిన మాటలని పేర్కొన్నాడు.

*"బౌద్ధులు జైనులు మొదలగు వేద నిరాకరణవాదులు తమ తమ మతములలో జనులను చేర్చుకోవలయుననుద్దేశముతో మాతృభాషలో గ్రంథములు రాసి వాటికి వ్యాప్తిని బ్రసిద్ధిని బడసి యుందురు. బౌద్ధుల గ్రంథములనేకములు మాగధియను ప్రాకృత భాషలో వ్రాయబడియుండుట దీనికొక దృష్టాంతము. ఆంధ్రులలో అనేకులు జైనబౌద్ధ మతములను అవలంబించిన వారై బ్రాహ్మణ మతమును విసర్జించి యుండుట సుప్రసిద్ధము అన్యమతముల నవలంభించినవారో వానియందాభిమానము దాల్చినవారో యైన యీ జనుల మరలా హిందూమతంలో జేరువారినిగా జేయవలయునన్నను ఉండు హిందువులు తమ వర్గమును వదలి పోకుండు నట్లుంచవలయునన్నను, దేశభాషా మూలక ప్రచురణములనివార్యములామెను ఇదియు ఆంధ్ర వాఙ్మయ సృష్టికి మూల కారణమని నా యూహ*[81].

---

[80] వ్యాసమంజరి, పుట:10.

[81] వ్యాసమంజరి, పుట:10.

ప్రాజ్ఞ నన్నయ కాలంలో బౌద్ధులు, జైనులు ఆంధ్ర దేశంలో మత వ్యాప్తికై ప్రయత్నించారనుట చారిత్రక ప్రసిద్ధం. కన్నడంలో కూడ ప్రథమ గ్రంథ జైన విద్వాంసులు రచించినదే. కన్నడంలోనే కాక, మరికొన్ని భాషలలో కూడా వీరు రచనలు కనిపిస్తాయి. అయితే వీరు రచించిన ఆ గ్రంథాలన్నీ ఏమాయెను అన్న ప్రశ్నకి సమాధానంగా రెడ్డిగారు ఈ విధంగా చెప్పినారు. ***"ఆ మతములు దక్షిణ దిక్కుకు వ్యాపించునప్పటికి వానికి బాత బాష పాప భాషగా నేర్పడినందునబహుశః తెనుగున నెక్కువగా వ్రాయరేమో! వ్రాసిన కొన్నింటిని ఆ మతస్థులు రూపుమాపినట్లే మన వర్ణధర్మ రక్షకులు ధ్వంసము చేసియుందురు. వేరు కారణములు మృగ్యము***[82].

హిందువులు, జైన, బౌద్ధ గ్రంథాలను తగులబెట్టారని, బౌద్ధ, జైనులు, హిందు గ్రంథాలను తగులబెట్టారని కొంత మంది పరిశోధకులు చెప్పి ఉన్నారు. కానీ వీటికి ఆధారములు లేవు.

**భారతాన్ని అనువదించడానికి కారణాల విశ్లేషణ**

***"భారత గ్రంథ రచన యొక్క యుద్దేశము వర్ణధర్మ రక్షణ గాక వేఱేమి యుండును. భాషనే పరమార్థంగా భావించి సేవించు చిత్తప్రవృత్తి ఆ కాలమున లేదు. ఉండినచో మత గ్రంథములు తప్పు నితర గ్రంథములేల రాయబడకపోయినవి"*** [83].

రాజరాజు భారతాన్ని అనువదించమనడంలో వర్ణధర్మ రక్షణే కాక, తనకు తన వంశ రాజుల వినాలనే కాంక్షతో నన్నయను భారతాన్ని రచించమని కోరాడు. వర్ణధర్మ రక్షణ కోసమే రచించాడు అని చెప్పడానికి భారతావతారికలో ఆధారాలు లేవు.

**మ.	ఇవి యేనున్ సతతంబు నాయెడఁ గరం బిష్టంబు లై యుండుఁ బా**
**యవు భూదేవకులాభితర్పణమహీయఃప్రీతియును. భారత**
**శ్రావణాసక్తియు, బార్వతీపతిపదాబ్జధ్యానపూజామహో**
**త్సవమున్, సంతతదానశీలతయు, శశ్వత్సాదుసాంగత్యమున్**

(ఆ.మ.భా.అవతారిక)

---

[82] వ్యాసమంజరి, పుట:11.

[83] వ్యాసమంజరి, పుట:14.

ఈ పద్యంలో రాజరాజుకు ఇష్టమైన ఐదు విషయాలు పేర్కొనబడ్డాయి. అందులో మహాభారతం వినాలనే కోరిక ఒకటి. అది ఆంధ్ర మహాభారత రచనకు ప్రేరకమైన ప్రధాన కారణం.[84]. అంతే కాకుండా

**చం. హిమకరుఁ దొట్టి పూరుభరతేశకురుప్రభుపాండుభూపతుల్**
**క్రమమున వంశకర్త లనఁగా మహి నొప్పిన యస్మదీయవం**
**శమునఁ బ్రసిద్ధులై, విమలసద్గుణశోభితు లైన పాండవో**
**త్తములచరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెంతయున్**

(ఆ.మ.భా అవతారిక)

కౌరవ పాండవ వంశం చంద్రవంశం. దీనికి మూల పురుషుడు చంద్రుడు. తరువాత ఆ వంశంలో ఎందరో మహారాజులు పుట్టి పుడమిని పాలించారు. వారి కథలను వినాలనేడి కోరికతో నన్నయను భారతం అనువదించమని కోరాడు. వర్ణధర్మ రక్షణమే భారత రచన ఉద్దేశం అనడానికి ఎక్కడ ఆధారాలు లభించలేదు.

**నన్నయ కావ్యశైలి:**

నన్నయ శైలి గురించి రామలింగారెడ్డి ఈ విధంగా అభిప్రాయపడ్డాడు.

***"నన్నయ శైలి మిక్కిలి మనోహరమైనది. అనన్యతుల్యము దాని వంటిది వేఱొండు లేదు. సంస్కృత పదభూయిష్టమై యునన్నూ నర్థ కాఠిన్యమేమాత్రమూ లేనిది అతడు ప్రయోగించు తత్సమములు లితరులనేకులు వాడు తెలుగు పదముల కంటే శబ్దమునందును, అర్థమునందును సరళములు. సాధారణంగా సంస్కృత పదములను సమాసములను బ్రయోగించు వారాడంబరముల బ్రకటింతురు; ఆ పద్ధతికి ననుకూలించిన స్థలముల మాత్రమట్టి శైలిని వ్రాయుదురు. నన్నయ యొక్క జాలమేమనగా కోమలములైన గుణములకును సంయోగము స్థాపించుట".***[85] ఈ శైలి నన్నయవలె ఎఱ్ఱనలో కూడా ఉంది. నన్నయ సాంస్కృత శైలికి ఉదాహరణగా సి.ఆర్.రెడ్డి ఈ పద్యాన్ని ఉదాహరించాడు.

**చం. అలఘు ఫణీంద్ర లోక కుహరాంతర దీప్త మణిస్ఫురత్ప్రభా**
**వలి గలదాని శశ్వదుదవాస మహావ్రత శీతపీడితా**
**చలముని సౌఖ్యహేతువిలసద్బడబాగ్ని శిఖాచయంబులన్**
**వెలుఁగెడుదానిఁ గాంచి రరవిందని భాన లమ్మహోదధిన్** (వ్యాసమంజరి)

---

[84] ఆ.మ.భా.: పుట:12

[85] వ్యాసమంజరి, పుట.16

నన్నయ భారతంలో శ్లేష ఒక్కచోట మాత్రమే ప్రయోగించాడని అదే ప్రబంధ కవులలో అయితే ఈ శ్లేష విధాన శైలి ఎక్కువని విమర్శించాడు.

"అమితాఖ్యానక శాఖలం బొలిచి వేదార్థామలచ్ఛాయ మై" అనే పద్యాన్ని ఒక్కటే శ్లేషలో రచించాడని పేర్కొన్నాడు. నన్నయ రచనలో బహువ్రీహి సమాసములు అధికములనియు, సంబోధన పద్యాదియందు కానీ, పద్యం చివరకాని ఉంటుందని కొన్నిచోట్ల పదాల పునరుక్తి అర్థ గాంభీర్యం, శబ్ద గాంభీర్యానికై, నన్నయ ప్రయోగిస్తాడని నిరూపించాడు.

భారత రచనలో ఎఱ్ఱన శైలికి స్వతంత్రత లేదని కొందరి విమర్శకుల అభిప్రాయం. ఎఱ్ఱన నన్నయ శైలిని అనుకరించడమే దీనికి కారణం. ఎఱ్ఱన నన్నయ శైలిల మధ్య తారతమ్యాన్ని వివరించాడు రామలింగారెడ్డి.

*"ఈ భ్రమకు ఎఱ్ఱా ప్రగడయె కొంతవరకు కారణభూతుడు అరణ్య పర్వాంతమున" దత్కవితారీతియు గొంతదోప" దానును భూరించినట్లు వ్రాసుకొని యుండుట జూచి యా "కొంత" యను నుపాధిని మఱచి "పూర్ణముగా"నని సంకల్పించుకొన్నారేమో? రెండవది నన్నయను అనుకరించినట్లెల్లరకు దెలియుటకై యాతని పద్యములు కొన్నిటిని నిర్లక్ష్యములైన మార్పులతో ధనభాగము తీసికొని యుండుట".*[86]

**నన్నయ శైలి**:

**రయవిచలత్తురంగమ తరంగములన్ మదానాగనక్రసం**
**చయములఁ జంచలచ్చటుల సైనికమత్స్యములన్ భయంకరం**
**బయి,యదువృష్ణి భోజ కుకరాంధక వారిధియుం గలెంగే ని**
**నిర్దయతరరోషమారుత నితాంతసమిరతమై క్షణంబునన్.**

**ఎఱ్ఱన శైలి:**

**రయవిచలత్తురంగమ తరంగములన్ మదానాగనక్రసం**
**చయములఁ జంచలచ్చటుల సైనికమత్స్యములన్ మహోన్నతం**
**బయి కురురాజచంద్రు నుదయంబునఁ దద్దయుఁ బొంగెఁ బ్రస్ఫుర**
**ద్భయదమనోహరప్రకటభంగులఁ దద్భటవార్ధి యుద్ధతిన్**

ఈ విధంగా నన్నయని అనుకరించడం వల్ల ఎఱ్ఱన శైలికి స్వతంత్రత లేదని కొందరు భావించారు. అయినా ఎఱ్ఱన అరణ్య పర్వాన్ని పూరించడంలో గల ప్రధాన ఉద్దేశం అది నన్నయ రచనలాగే కనపడాలనే ఉద్దేశంతో ఎఱ్ఱన నన్నయను యథాతథంగా అనుసరించాడే కానీ

[86] వ్యాసమంజరి, పుట.21

మరొక కారణం కాదు. దీనిని అర్థం చేసుకోకుండా ఎఱ్ఱన అస్వతంత్రుడు అని ఆరోపించడం సమంజసమైనది కాదు.

ఈ విధంగానే నన్నయ, తిక్కన శైలీ తారతమ్యాలను కూడా వీరు వివరించారు.

*"నన్నయ తిక్క రీతుల బరామర్శించుట కనుకూలమైన ఘటములు రాలేదు. ఒకటి అరణ్య పర్వములోని గణికుని రాజనీతియు. ఉద్యోగ పర్వములోని విదురనీతియు, నాకుంజూడ దిక్కనయా సందర్భమున నన్నయను నాదర్శముగా నిడుకొని వ్రాసి యుండునని తూచును. ఈ రెండు ఘట్టములయు సామాన్య లక్షణములేవనగా గందపద్యములెక్కువ నీతికి గంధమనపానము గాబోలు. సొగసైన సామాన్యోపానములు మెండు"* [87].

తిక్కనకు రాజనీతి ధర్మము తెలుసు. ఈ సందర్భంలో నన్నయను తిక్కన అనుకరించాడు అని చెప్పడం కంటే స్వప్రతిభతోనే రచించాడని చెప్పటం ఉచితంగా ఉంటుంది. కంద పద్యములున్నంత మాత్రాన నన్నయను అనుకరించాడు అని చెప్పడం అంత సమంజసం కాదు. కవిత్వానికి ఛందస్సు సామాన్య విషయమే కానీ ప్రధానమైనది కాదు.

నన్నయ తిక్కన శైలిని తులనాత్మకంగా పరిశీలన చేసిన రెడ్డిగారు, తిక్కన రచనా శిల్పాన్ని వేరొకరు అనుకరించలేరని చెప్పారు.

*"కావున దిక్కన రీతిని వ్రాయవలయునన్న తానే తిక్కనావతారమెత్తి నాతని మనోభావాదుల దాల్చిననయౌనుగానీ విరాటపర్వము గ్రుడ్డిగా పాఠము జేసిన కోరిక తుదముట్టదు. ఒకరు సృజించిన శైలి, విషయము, రీతి ఇత్యాది బింబములకు ప్రతిబింబములు రచింపజూచుట మంచిది కాదు".* [88]

ఒక కవి మరొక కవిని అనుకరించాలని చూడటం సమంజసం కాదు. అందులోనూ తిక్కన వంటి కవులను అనుకరించాలని చూడటం హాస్యాస్పదం.

ఇలా అనేకమంది కవులు తమ గ్రంథాలయందు తిక్కన పద్యాలను అనుకరింప చూశారు. ఈ అనుకరణ అనుకరణ గానే ఉన్నది కానీ సహజత్వము పొందలేక పోయింది. ఈ విధంగా తిక్కనను మరొకరు అనుకరించలేరు అనుట సోపపత్తికంగా నిర్ణయించారు.

కవి వ్యక్తిత్వానికి, కవిత్వానికి సంబంధము ఉంటుందని రెడ్డిగారు నిరూపించారు.

"*నన్నయ మహావినయమపరుడు మనలో పండితులాత్మస్తుతి పరాయణులుగను బహుళముగా నుండుట శోచనీయమైన సంగతి గ్రంథాదిని". "నేను నేను అని యుత్తమ*

---

[87] వ్యాసమంజరి, పుట.27

[88] వ్యాసమంజరి, పుట.27

*పురుషుడగా నాత్మవర్ణనము జుగుప్సకలుగునట్లు చేయువారు నన్నయ్య తన్ను గూర్చి చెప్పుకున్న పద్యమొక్కటే. అందును బధమ పురుషముగా నెవ్వడో త్రోవను బోవువానిని గుఱించి వ్రాసినట్లు వ్రాసియున్నాడు. అతిశయోక్తి లేదు. విపరీత వర్ణనలు లేవు*"[89].

నన్నయ తన గూర్చి చెప్పుకొన్న "తనకుగల బ్రాహ్మణు ననురక్తు" అను పద్యము ఆధారంగా నన్నయ ఈర్ష్యాసంతుడు కాదనియు నిరూపించాడు.

***"మఱియు గంభీరుడు గాన నన్నయ ఈర్ష్యావంతుడు గానేరడు. దీనికి నిదర్శనము తాను హృదయపూర్ణముగా దనకు సహాయభూతుడైన నారాయణ భట్టును గుఱించి చేసిన ప్రశంస" [90].***

అని పాయక పాకశాసనుని అని పద్యమును ఉదాహరణగా చూపి అతని విధేయతను నిరూపించాడు. ఈ విధంగా కవి యొక్క రచనారీతిని ఆధారంగా చేసుకొని రచయిత స్వరూపాన్ని నిర్ణయించుటకు చేసిన ప్రయత్నం చాలా ఆదర్శప్రాయం.

నన్నయ రచనపై బౌద్ధమత ప్రభావం కలదని రెడ్డిగారు ప్రతిపాదించారు.

"ఆ కాలమున బౌద్ధ, జైన మతాలు ప్రభావవంతంగా నుండెననుటకు దానిని మన పండితులు లెక్కకు గొన్నారనియు నెరిగితిమి కదా! ప్రాకృత పైశాచీ భాషలు వేంగిలో గృషి చేయబడుచుండినట్లు శాసనములవల్ల దెలియవచ్చెడివి. వానియందు దరచు రాయబడిన గ్రంథములు వేద నిరాకరణములకు జేరినవి. మఱియు బౌద్ధులలో ***"సంఘం శరణం గచ్ఛామి యను నాదేశము ప్రకారము సభాస్తుతి సేయుట యాచారముగా నుండెను. నన్నయ్యము నాపద్ధతి ననుసరించియే కాబోలు సభాస్తుతి చేసియున్నాడు. ఇంకే కవియు జేసినట్లు గానము"*** [91]. సభాస్తుతికి, బౌద్ధ మతమునకు గల సంబంధం విస్తృత పరిశీలనావశ్యకము కలది. నన్నయ రచనలపై మరెక్కడైనను బౌద్ద మతం యొక్క ప్రభావం ఉందేమో అన్న అంశం పరిశీలించదగినది. పూర్వకాలంలో సంఘములు ఉండుట తెలిసిందే. ఆ పండిత సంఘములు పాండిత్య ప్రతిభను పరిశీలించి ఆమోదం తెలిపిన తరువాత అది ప్రాచుర్యంలోకి వచ్చేది. అలా నన్నయ రచన పాండిత్య సభకు వెళ్ళినప్పుడు సభాస్తుతి చేసి ఉండవచ్చు. తమిళ సాహిత్యంలోని సంగమ సాహిత్యం కూడా ఇలాంటిదే. ఏది ఏమైనా ఈలాంటి నూతన అంశాలను ప్రతిపాదించడం రెడ్డిగారి ప్రతిభకు, పరిశీలనా దృష్టికి నిదర్శనం.

---

[89] వ్యాసమంజరి, పుట.37

[90] వ్యాసమంజరి, పుట.40

[91] వ్యాసమంజరి, పుట.40

రెడ్డిగారు భారతంలోని లోపాలను విమర్శించారు. ఈనాడు ఉన్న భారతం అనేక మతాల ప్రభావంచే కాల్పిక గాథలచే విస్తృతపరచి మూలకథ యొక్క సొగసును పాడుచేశారని అభిప్రాయపడ్డాడు.

"గ్రంథము సుప్రసిద్ధమగు జైనులు, వైష్ణవులు, బౌద్ధులు, స్మార్థులు, వీర శైవులు, పౌరాణికులు మొదలగు తెలుగు వారందరూ తమ సిద్ధాంతములనందులో జొనిపి యా యితిహాసమును బాదు జేసిరిగానీ మూలకవి యొక్క భావగాంభీర్యము గణనాతీతమగుటంజేసి యది యింకను బొత్తిగబాడి యింకి నిర్మూలనముగాకున్నయది.

భారతమును వ్యాసుడు ఒకడే రచించినా, అనేక సంవత్సరాలనుండి అనేక విషయాలు తరువాత అందులో చేర్చబడినాయి. రెడ్డిగారు తిరిగి ఈ విషయమును ప్రతిపాదించుటలో నూతనత్వం లేకపోయినా వీరికి భారతంపై గల సునిశిత దృష్టి ఎటువంటిదో తెలుస్తుంది. అనేక ప్రక్షిప్తములు భారతంనందు చేర్చబడటంవల్ల మూల సౌందర్యానికి భంగము కలిగిందని రెడ్డిగారి అభిప్రాయం. ఒక్క భారతంలోనేకాక జనాదరణ పొందిన అన్ని కావ్యాలయందు ఇలాంటి మార్పులు జరుగుతూనే ఉంటాయి.

భారతంలో అధికంగా నీతిబోధను చేర్చుటను రెడ్డి విమర్శించాడు. కానీ భారతంలోని ధర్మబోధ ప్రతిపాదనము కథాగమనానికి భంగం కలిగించిననూ ఉద్దేశ్యము మాత్రము నిత్యూపదేశకము. నిత్యూపదేశము భారతంలో ఒకే కాలంలో చేరినా ప్రసక్తి హేతువులలో ఇది తక్కువది కాదు. భారతము ఇతిహాసము. ఇతిహాసంలో ప్రధాన కథ చారిత్రక సత్యమైనదిగా ఉంటుంది. కొంత శాస్త్ర పరిచయము ఉంటుంది. దేవాసుర సంబంధముండవలయును. పారంపర్యాపదేశ క్రమము కలిగి ఉండాలి. కావున భారతం శాస్త్ర సంబంధమైన ఇతిహాసముగా చూడటం మంచిది. దీనిలో నిత్యూపదేశాన్ని విమర్శించడం అంత సమంజసం కాదు.

భారతంలో రెడ్డిగారికి అభిమానమైన పాత్ర ద్రౌపది. ద్రౌపది యందు అంత అభిమానం ఉండుటకు వారి గ్రామంలో ఉండే ద్రౌపది ఆలయాలు కావచ్చు[92].ద్రౌపది పాత్రను, సీత పాత్రను వీరు తులనాత్మక పరిశీలన చేశారు. ద్రౌపది పాత్రచిత్రణలో నన్నయ, తిక్కనలకు భేదం కలదని వీరి అభిప్రాయం. ***"తిక్కన యొక్క ద్రౌపది డగ్గుత్తికలో వెక్కి వెక్కి యేడ్చుచూ మనకు దుస్సహ సంతాపము కలిగించుచున్నది. నన్నయ యొక్క ద్రౌపది ప్రయత్నించి తన్ను దానుపశించు కానుచు దనకు నా పరాక వెలికి వచ్చిన శోకము మాత్రము సూపుచు నామె యొక్క గరువతనముచే మనమెప్పు నాకర్షించెడును. మఱియు దన చింతతో బ్రారంభించినను***

[92] డా॥ సి.ఆర్.రెడ్డి, పుట:204.

*భీమసేనునికి దక్కిన భర్తలకును కలిగిన కష్టములను మఱువలేదు. పాణి పల్లవంబుల నయన సమ్మార్జనంబు వేయుచునను వర్ణనము ద్రౌపదీ దేవియొక్క పరివేదనా తప్తమూర్తిని మనకండ్ల* ***యెదుట సాక్షాత్కరింప జేసెదునగదా"!***[93] తిక్కన ద్రౌపది వెక్కి వెక్కి ఎడ్చిన, నన్నయ ద్రౌపది తన్ను తాను ఉపశమింప జేసుకొనుననని రెడ్డిగారు నన్నయ తిక్కనల ద్రౌపది పాత్రచిత్రణములో గల భేదాలను నిరూపింప ప్రయత్నించారు. కానీ సోపపత్తికంగా, విస్తృత పరిధిలో వివరించి చెప్పుంటే బాగుండేది. ఈ పరిశీలనలో ఏ పరిస్థితులలో ద్రౌపది పాత్రను సృష్టించారో కూడా గమనించవలసిన అవసరం ఉంది.

ఈ విధంగా రాజరాజ నరేంద్రుని వర్థంతి సభలో రాజరాజు కాలనిర్ణయం మొదలుకొని, కవిత్రయం కవితారీతుల వరకూ ఎంతో సోపపత్తికంగా స్థూలంగా పరిశీలించి భారతంపై గల రెడ్డిగారికున్న అభిమానాన్ని చాటుకున్నారు.

### 3.2.1 ప్రభావతీ ప్రద్యుమ్నం– ఆలంకారిక విమర్శ:

ఈ రచనా విమర్శ చేసేటప్పటికి ఆంగ్ల సాహిత్య ప్రభావం రెడ్డిగారిపై మరింత అధికమైంది. కళాపూర్ణోదయంపై వ్యాసం తిరిగి రాయడం జరిగింది అని చెప్పుకున్నాము కదా! శైలీ విషయంలో ఐక్యత సాధించిననూ అభిప్రాయంలో భేదాలు స్పష్టంగా కానవస్తాయి. ప్రబంధ శృంగారంపై రెడ్డిగారికున్న విముఖత ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది.

*"ప్రభావతీ ప్రద్యుమ్నం నందున్న కవిత్వ విద్యయింకను ఐక్యమునకు వచ్చినది. అనగా శుద్ధ రచనను మాత్రము గమనించి చూచిన వెనుక వ్రాయబడిన ఈ గ్రంథము దానికి పూర్వము కళాపూర్ణోదయం కన్నా కొన్ని విషయములు మిన్న, ఎట్లుందురో! శైలి యింకనూ మంచి పాకమున బడియున్నది. లోకొక్తులు మొదలైన అలంకారములెక్కువ యగుటయుకాదు రమ్యములను అవ్వయ సౌలభ్యము నధికము. కాని భావనాశక్తి యెంతయు దక్కువ. బహుశః కవి వయసు ముదిరిన వాడైనందున రాగములు కృషించియుండును. రాగాదుల విజృంభణ లేనిది భావనాశక్తి యడిర నేర్చునా! ఏది ఏట్లుండే కళాపూర్ణోదయ సందర్భముల కొన్నింటిని ప్రభావతీ ప్రద్యుమ్నములోను అనుకరించియున్నారు.తోల్తటి గ్రంథమందుగల నూతన కల్పనలు వెనుకటిదానిలో లేవు. మరియు నందలి కల్పనలు గొన్ని చిల్లర మార్పులతో చోదింపబడి యున్నవి".*[94]

---

[93] వ్యాసమంజరి, పుట.29

[94] కవిత్వతత్వవిచారము:పుట.93

ప్రధమంగా రాఘవ పాండవీయము, తరువాత కళాపూర్ణోదయం తరువాత ప్రభావతీ ప్రద్యుమ్నము సూరన రచించాడని రెడ్డిగారు అభిప్రాయపడ్డారు. శ్లేషరచనలో ఎంతో ప్రావీణ్యం ఉన్న సూరన కాలక్రమంగా ప్రభావతీ ప్రద్యుమ్నము నాటికి శ్లేష కవిత్వము నిరసించి మరుగునపడి పోయిందేమో అన్న రీతిలో రాశారు.

కవితా స్వరూపంను గురించి, అతని అభిరుచిని గురించి కళాపూర్ణోదయ రచనాకాలం నాటికి ప్రభావతీ ప్రద్యుమ్నము నాటికి అతని రచనలో కొంత మార్పు వచ్చినట్లు గ్రహించవచ్చు. సత్కవితా స్వరూపం స్వభావాలను గురించి అతడు ఈ రెండు గ్రంథములందును అతడు ప్రసంగమున చెప్పిన పద్యాలను నిశితంగా పరిశీలించిన ఈ విషయము తేటతెల్లం కాగలదు.[95]

కళాపూర్ణోదయమందు కథాకల్పనము ఆవిష్కరించేలా కవితా లక్షణాలు ప్రతిపాదించినారు.

**సీ.** **"శబ్దసంస్కార మెచ్చటను జాఱఁగ నీక**
**పదమైత్రి యర్థ సంపదలఁ బొదలఁ**
**దలఁ పెల్ల నక్లిష్టతను బ్రదీపితముగాఁ**
**బునరుక్తి దోషంబు పొంతఁబోక**
**యా కాంక్షితస్ఫూర్తి యాచరించుచును శా**
**ఖా చంక్రమ క్రియఁ గడవఁ జనక**
**ప్రకృతార్థభావంబు పాదు కొనదుకుచు**
**నుపపత్తి యెందు నత్యూర్జితముగ**
**తే.** **నొకటఁ బూర్వోత్తర విరోధ మొందకుండఁ**
**దత్తదవయవవాక్య తాత్పర్య భేద**
**ములు మహావాక్య తాత్పర్యమునకు నొనరఁ**
**బలుక నేర్చుటబహుతవః ఫలము గాదె!"** (ప్రభావతీ ప్రద్యుమ్నం1 ఆ-3)

ఈ రెండింటిలో భేదము సూక్ష్మ దృష్టికి కానీ గోచరింపదు. వీటి భేదాన్ని గమనిస్తే సూరన కవితా దృక్పథాన్ని అందులోని మార్పుని గమనింపవచ్చు. సూరన కవితా దృక్పథంలోని మార్పును రెడ్డిగారు ఈ విధంగా ప్రతిపాదించారు.

[95] కళాపూర్ణోదయం:1ఆ-81పద్యం

*"... యీ రెండు పద్యములం బోల్చి చూచితిమేని నీరెండవకృతి రచించులోపలఁ గవి కొంతమట్టునకు శైలింగూర్చిన యభిప్రాయము మార్చినాఁడనియుఁ జెప్పుట కవకాశమయ్యెడి. కళాపూర్ణోదయ పద్యముంబట్టిచూచినఁ గవి యలంకార శాస్త్రములయెడల బహు భక్తిగలవాఁడనియు, నర్థాలంకారములు మాత్రము గాక శబ్దాలంకారములును అవశ్యానుష్ఠేయములని భావించినట్లును, గానంబడియెడి. ప్రభావతీ ప్రద్యుమ్న పద్యములో నలంకారశాస్త్రముం గూర్చిన విచారచిహ్న లెవ్వియును లేవు. శబ్దాలంకారములంగూర్చి కవి యువ్విళ్ళూరకపోవుటయే కాదు, అర్థాలంకారములనైన ధ్యానించినట్లు పోకడగానము. భావములు, అర్థములు, తాత్పర్యములు, అవయవసంయోగము మొదలగు తలఁపులతోఁ జేరిన లక్షణములమీఁద నేకాగ్రమగు దృష్టిని నిలుపుట మేలని యెంచెనేమో! ప్రభావతీ ప్రద్యుమ్నములో చిత్రకవిత్వ మత్యల్పము. ఇంచుమించు శూన్యము".* [96]

ఇక్కడ సూరన రచనా వైఖరిని రెడ్డిగారు ప్రతిపాదించిన సిద్ధాంతము ప్రకారం కళాపూర్ణోదయము అలంకార శాస్త్ర రీతిని ఎక్కువగా అనుసరించి ప్రభావతీ ప్రద్యుమ్నము రచన నాటికి శాస్త్ర పరిధినుండి బయటపడ్డాడు అని భావించారు. ఒక కవి యొక్క రచనలను క్రమ పరిశీలన చేసి వారి కవితాశైలిలోని క్రమ పరిణామమును పరిశీలించుట విమర్శలోని ఒక పద్ధతి. ఈ విమర్శనా పద్ధతికి పాటించి సూరన శైలీ పరిణామాన్ని వివరించారు.

ప్రభావతీ ప్రద్యుమ్నమునందు గల పాత్రలపై రెడ్డిగారు కొన్ని స్థిరమైన అభిప్రాయాలను ఏర్పరచుకొని తరువాత విమర్శకు దిగారు. "క్షణక్షణే యున్నవతా ముపేతి తదేవ రూపం రమణీయతయా అన్నట్లుగా ప్రతి క్షణంనందును నూతనత్వం ఉండవలెను అన్న అభిప్రాయం ఆధారంగా నూతనత్వంలేని ఈ పాత్రలను విమర్శించారు. ప్రద్యుమ్నుణి యందు రెడ్డిగారి అభిప్రాయం...

*"ప్రద్యుమ్నుడన్ననో విరహాది వేదనలకు నిదానమైన ప్రబంధ పురుషుడే గానీ ఎక్కువ పరివృత్తి గలవాడు గాడు".* [97]

నాయకునియందు ఎటువంటి భావాలు ఉన్నాయో అటువంటి భావాలను ప్రకటించారు.ప్రభావతి పాత్రయందు రెడ్డిగారికి ఎందుకో సదాభిప్రాయం కలగలేదు. బహుశ ఈమె ప్రబంధ నాయికా లక్షణాలక్షిత అగుటజేసి రెడ్డిగారి విమర్శక హృదయాన్ని చూరగొన లేకపోయింది. ఈమె యందు సర్వ సామాన్య లక్షణాలే కానీ విశిష్ట లక్షణాలు కనిపించక

---

[96] కవిత్వతత్త్వవిచారము:పుట.96

[97] కవిత్వతత్త్వవిచారము:పుట.103

పోవుటయు మరొక కారణము. అయినా ప్రభావతి పాత్రయందు రెడ్డిగారి భావములు పరిశీలనార్హములు.

*"... ప్రభావతి యన్ననో నాకుంజూడ నెంతయు నసహ్యరాలు! రూపమున్నది నాథుడెప్పుడు వచ్చి పైబడునాయను తహతహ దట్టముగా నున్నది. రూపమును, గామావేశముందాల్చిన పాతివ్రత్యమున్నం జాలునా...?"*[98]

రెడ్డిగారు ప్రభావతి పాత్రను అసహ్యించుకోవడానికి కారణం విపరీతంగా శృంగార వర్ణన చేయడమే.

***"Language is a social product... thus the study of poetry's sources cannot be separated from the study of society".*** [99]

భాష సామాజిక నిర్మాణము. కావున కావ్యాన్ని చదివేటప్పుడు సామాజిక దృక్పథం నుంచి వేరుచేసి చూడరాదు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రబంధకవుల నాటి సమాజము శృంగార రసమును అభిమానించుటచేత ఆ కవి కొంచెం ఎక్కువగా ఆ రసానికి ప్రాధాన్యం ఇచ్చి ఉంటారు.అంత మాత్రాన ఆ ప్రబంధ శృంగారాన్ని కామము అనుట సమంజసం కాదు.

ప్రభావతికి పితృభక్తి లేదనియు రెడ్డిగారి అభిప్రాయం.[100] పితృద్రోహిగా ఈమెను రెడ్డిగారు అభివర్ణించుటకు కారణం కత్తిని ప్రద్యుమ్నునికి అందించుట. వీరి అభిప్రాయాలను వ్యాసమూర్తి వ్యతిరేకించారు.

ప్రభావతి ఉపాయాంతరము లేకయే పితృభక్తిని ప్రేమాభిమానాలను పారద్రోలినది అని వ్యాసమూర్తిగారి అభిప్రాయం. గాంధర్వ విధిని వివాహమాడుట దోషము గాదు.

వీరి అభిప్రాయం సమంజసంగానే ఉంది. ఎందుకంటే ప్రభావతీ ప్రద్యుమ్నమునందు ఈ సన్నివేశము గమనించినట్లయితే రెడ్డిగారికి ఇలాంటి అనుమానం కలగడానికి అవకాశము ఉండేదికాదు. ప్రద్యుమ్నుని వాక్యాలు ప్రభావతి చేష్టలను పితృభక్తి నుండి బహిర్గతమగుటకు పడిన సంఘర్షణ ఇక్కడ కనిపిస్తుంది.

**ఉ. చేడియ నీ మనంబునకు జింత యొకింత జనించెనేని నేం**
**జూడగ జాలనీ జనకు చొప్పు దలంప హతుండు గాక తా**
**గీడు చలంబు మాన డనికిం జొర కొండొకత్రోవ ద్రొక్కగా**

[98] కవిత్వతత్త్వవిచారము:పుట.103

[99] The magic plant.Pg.18

[100] కవిత్వతత్త్వవిచారము:పుట.104

**గూడద యేమి సేయుదును ఘోరవిచారము పుట్టె నాత్మలన్**

(ప్రభావతీ ప్రద్యుమ్నం5 ఆ–196)

ప్రద్యుమ్నుడు తన మనసులోని బాధనంతా వ్యక్తపరచియుండెను. మార్గాంతరము గనిపించుట లేదు. అట్టి స్థితియందు ఆత్మరక్షణగాక మరేమీ చేయగలరు? అదియును కాక సైన్యము సమీపించుచున్నది.

**చం. అని తననుగూర్చి దానవకులాగ్రణిపై దేగలేని చింత నే**

**యు నదిపు గౌటలగ్గలకు నుగ్రత,డగ్గురు భూరిసైన్యు దం**

**డ్రిని బరికించి యంతి విభునిందము గా చికానంగ త్రో**

**వనేమకి కానకంత బిత్కృవత్సల భావము బాఅమాకుచున్** (ప్రభావతీ ప్రద్యుమ్నం5 ఆ–196)

ఒకవైపు ప్రియుడు మరొకవైపు తండ్రి ఇద్దరూ కావలసినవారే అప్పుడు తండ్రి ఉగ్రుడై వచ్చుట చూసి .....

**తానచని ములనున్నయ**

**నూనతదీయాసి దెచ్చియొసగి గెలువుమి**

**దానవపతి దక్కినయను**

**మానము మానుమని పలికే మానవతి పతిన్** (ప్రభావతీ ప్రద్యుమ్నం5 ఆ–197)

ప్రద్యుమ్నుని చేతిలో కత్తి లేదు. ఆత్మరక్షణకై కత్తి ఇచ్చినది "గెలువుమూ" అన్నదిగానీ "చంపుమో" అని పలుకలేదు కదా!తండ్రిపై ప్రేమ ఉన్నది కావునే ఈ విపత్కర సన్నివేశంలో వాత్సల్యము ప్రారద్రోలుటకు ప్రయత్నించినది. రెడ్డిగారు చెప్పినట్లుగా పూర్వ సన్నివేశాలలో ఎక్కడా ప్రభావతికి పితృభక్తి నిరూపించుకోవడానికి అవకాశం రాలేదు.

***ప్రభావతి పతిభక్తికి, పితృభక్తికి నిదానమైన సచ్చరిత్ర. అట్టి ఆమె ఉభయులకును గమ్యము లేకుండా బోయెను. తెన్నునకయియెంతయో యత్నించి కానక మూలనున్న ఖడ్గమును దానే కొని తెచ్చి యిచ్చినది".*** [101]

ప్రభావతి పాత్రను ద్రౌపదితో పోల్చి ప్రభావతి కన్నా ద్రౌపది ఉత్తమురాలని తేల్చెను. వీరి తులనాత్మక పరిశీలన యిట్టిది.

***"ఈ పరమ పవిత్రురాలితో ద్రౌపది బోల్చుచూడుడు భీమసేనుడు కీచక వధార్థమై ప్రతిజ్ఞ చేయుచూ..."***

***"ఎల్లి యెల్ల విధంబుల నెందు జొచ్చె***

[101] ప్రభావతీ ప్రద్యుమ్నం.పీఠిక,తెల్లాప్రగడ సూర్యనారాయణరావు:పుట.12

*నేని సాధర్మతనయుండు దానవచ్చి*
*యడ్డుపడనేని నీవ పెంపారు కరుణ*
*గాచితేసి నాచేబడు గీచకుండు"*

***అని ద్రౌపదితో గఠినాక్షరములుగా జెప్పుటలో నాపాంచాలి తనకట్టి యవజ్ఞ చేసినను, నా సుతుడు కామాంధుడు గావుట బశ్చాత్తాప పాత్రుండని కనికరించి క్షమించి కావ జూచునంత యుదారచిత్తురాలని ధ్వని కల్పించినందున నా మహాతల్లికి గౌఱత ఘటిల్లెనా!"[102]***

ద్రౌపదిలో ఉన్న క్షమాగుణం ప్రభావతిలో లేదని, వీరిద్దరిలో ద్రౌపది శ్రేష్ఠమైనదని రెడ్డిగారు అభిప్రాయపడ్డారు. ఈ సన్నివేశములు సమానం కావు. ఇక్కడ ఈ పాత్రలను పోల్చి చూడటం అంత సమంజసం కాదు అని వ్యాసమూర్తిగారు అభిప్రాయపడ్డారు.[103] ప్రభావతి సమయం లేకపోవుటచే అలా చేసిందని వ్యాసమూర్తిగారు పేర్కొనడం సమంజసంగా ఉంది. గెలువుము అనుటలో గల స్వారస్యమును చక్కగా వివరించారు. ద్రౌపది, ప్రభావతి పాత్రలయందు ఎంతో వ్యత్యాసముంది. ద్రౌపది క్షమా గుణమునకు ప్రతీక. తన కుమారులను చంపిన అశ్వత్థామను కూడా క్షమించి విడువగల మనస్థైర్యము క్షమాశక్తిగల ఉత్తమురాలు. ప్రభావతి సామాన్య యువతి అందునా ప్రియానురాగవతి. ప్రియుని రక్షణ అవశ్య కర్తవ్యము. వీరిద్దరూ వయస్సులో చిన్నవారు. ప్రభావతి మధ్యనాయిక, ద్రౌపది ప్రౌఢనాయిక. కామాంధుడైన కీచకునకు, ద్రౌపది ప్రవర్తనకు దైవముచే నిర్ణయించబడి తన అనురాగమునకు పాత్రుడైన ప్రద్యుమ్నుని విషయము, ప్రభావతికిని పోల్చుట సరైనది కాదు. రెడ్డిగారు ప్రబంధంలోని శృంగార విరహ వర్ణనములోని లోపాలను సోపపత్తికంగా నిరూపించారు. ఈ వర్ణనల విమర్శా సమయంలో రెడ్డిగారు భావావేశాలను అదుపులో ఉంచుకోలేనివారిగా కనిపించారు. అంత గాఢమైన విమర్శ చేశారు.

***"చెలికత్తె లీరీతిఁ జెయి వేసి విప్పిచూపుటకోర్చెదు రాజకన్యక లెంత సుకుమారులు! పూర్వము అవికెల ధారణ మే యున్నట్టు లేదు. ఇట్లు అంగములంగూర్చి పలవరించుట గణికలకైనఁ దగునా? మోహమనఁగా వీరికి దేహక్రీడయే కదా! ఇదియాశృంగారము! అయ్యో! నాకుచములారా! మీరు ఆయమ్మను జేరియుండిన సుఖపడుదురుగదా! యని యెవరైనఁ దలంతురా! ఆత్మతృప్తి గోరుదురేకాని, యంగాంగములకుఁ బ్రత్యేక సుఖమున్నదని***

---

[102] కవిత్వతత్త్వవిచారము:పుట.105

[103] కవిత్వతత్త్వవిచారవిమర్శనము:పుట.8

*భ్రమించివాని ప్రారబ్ధమునకై విలపించు వారున్నారా? శృంగార ప్రకృతీ మన కవులకు నగోచరార్థము". 104*

కొన్ని చోట్ల రెడ్డిగారు భావావేశాన్ని అదుపులో ఉంచుకోక కొంత గాఢంగానే విమర్శించారు. కాల ప్రభావంచే సాహిత్యంలో చోటుచేసుకున్న విషయాలను సహృదయంతో సమన్వయించాలి అంతే గానీ ఇలాంటి నగ్నరూపమైన మాటలతో వ్యక్తం చేయుట సమంజసం కాదు. ఈ విషయం పై వ్యాసమూర్తి ప్రతివిమర్శ చేసినా తన వాదాన్ని బలపరుచుకునే విధంగా ఉంది. సహృదయ విమర్శకుడు ప్రబంధంలోని లోపాలను ఉపేక్షించుట అవశ్యము.

ఈ విధంగా ప్రభావతీ ప్రద్యుమ్నమునందు శృంగార వర్ణనలపై రెడ్డిగారి విమర్శా సరణి". కథా కల్పనయందు గల లోపాలను రెడ్డిగారు చూపారు. ఈ కల్పనా స్థాలిత్యములు ప్రబంధమందుటను కలదని కాదు. ఒకటి రెండు విషయములందు అట్టి లోపము కనిపించుటచే రెడ్డిగారు ఆ విషయంపై చర్చించారు. అందులో మొదటిదిగదాసాంబుల వృత్తాంతము.

ఇందు సునాభుని కూతురు భోగయొక్కమగు ప్రాయము కుదరక యన్నట్లై పతి చింత దాల్చుట ఉచితము కాని రెడ్డిగారి అభిప్రాయం ఈ సన్నివేశమును సూక్ష్మ దృష్టితో పరిశీలించిన గానీ ఔచిత్య, అనౌచిత్యాలు బయటపడవు.

**"విను వజ్రనాభు తమ్ముడు**
**సునాభు డను ఘోర రాక్షసుండు గలడత**
**త్తనయులుగల రిద్దఱు సొబ**
**గున నిధికలు చంద్రవతియు గుణవతియున్"** (ప్రభావతీ ప్రద్యుమ్నం4 ఆ-12)

అని సూరన చంద్రవతి, గుణవతులను పరిచయం చేశారు.వారి వయసు ఎంత అను విషయము మృగ్యము "సొబగున అధికలు" అని మాత్రము చెప్పి యూరుకొనెను. పిదప వీరి చెలికత్తెలు ప్రశ్నించు సందర్భమున...

**నొప్పుడనుచును దీవించే నప్పుడచట**
**దాదులో మునివర్య యీతలిరుబొండ్లు**
**కధిపులెవ్వారువారల నోనతిండు**
**నావుడునుగొంత చింతించి నారదుండు** (ప్రభావతీ ప్రద్యుమ్నం4 ఆ-12)

104 కవిత్వతత్వవిచారము:పుట.122

ఇట తలిరుబోండ్లు అని పలుకుట సదాభిప్రాయం. వీరి వయస్సును స్పష్టపరచుచున్నది వివాహ యోగ్యమైన వయస్సు కావుననే భర్తల విషయమై ప్రశ్నించిరి. వారి మనోగత భావాలను సూరన ఇలా వర్ణించారు.

**క్రమమున భోగయోగ్యమగు ప్రాయము నిండుచూరా గ**

**భర్త సంయోగమున మనోరథంబునతి గాడము గా గ బతిప్రవృత్తి**

**లాభముగడదవ్వగా వలసి బాలికలిద్దఱ తద్దయున్**

**గత క్షమ గుసుమాస్త్ర బాణముల గాంతియే చిక్కగ జిక్కిరేమనన్**

(ప్రభావతీ ప్రద్యుమ్నం4 ఆ–18)

"భోగ యోగ్యమగు ప్రాయము నిండుచురాగ అనుటను బట్టి అంత క్రితము భోగయోగ్యమగు ప్రాయమ లేదని కాదు కదా! ఆ ప్రాయము పరిపూర్ణమైనదని ప్రకటించుచుండెను. అనగా చంద్రవతి గుణవతులు ముగ్ధానాయికలు. ఇక్కడ వ్యాసమూర్తి అభిప్రాయము గమనింతుము.

***"సునాభుని కూతురప్పటికి బాలిక గాదు. భోగ యోగ్యమైన ప్రాయమునే యున్నారు. అది క్రమముగా నిండి సంగమాభిలాష కలిగించినది".[105]***

ఈ సన్నివేశంనందు రెడ్డిగారి విమర్శ –

***"ద్వారకాపురిలోని గదసాంబులం గూర్చి సునాభుని కూతులకు దెలపిన యామాత్రము వారి యక్కగారైన ప్రభావతికి దెలియపోనేల? ప్రద్యుమ్నుడు భర్తయని యెరింగియు దిక్కులేని పక్షి రీతి నాపెరొదనము జేయుట కృత్రిమ ముగ్ధత్వమా!"[106]***

చంద్రవతి, గుణవతులకు తెలిసిన విషయము, ప్రభావతికి ఏలా తెలియక పోవలయును. ప్రభావతికి ప్రద్యుమ్నుడు భర్త యని యెరింగియు ఏలా ముగ్ధత్వము ప్రకటించినది అని రెడ్డిగారు విమర్శించారు. సహృదయ విమర్శయందు ప్రధానము వహించెడి విషయములు కావు అయినను కల్పనయందు కవి సామాన్య విషయములందు శ్రద్ధ వహించవలసి ఉందని రెడ్డిగారి అభిప్రాయము.

గదసాంబుల విషయము ప్రభావతికి తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే నారదుడు చంద్రవతి గుణవతులకు గదసాంబులు భర్తలగుదురని చెప్పు సమయమున సమీపమునున్నది చెలికత్తెలు మాత్రమే వారు తీసుకున్న నిర్ణయం చూద్దాం.

---

[105] కవిత్వతత్త్వవిచారవిమర్శనము:పుట.10

[106] కవిత్వతత్త్వవిచారము:పుట.146

**కుడిచికూర్చుండి వేటదెచ్చుకొంటి యొకటి**
**యెన్న నెక్కడిద్వారక ఎక్కడిగద**
**సాంబులివి విన్న బెనుచేటు స్వామి చేత**
**నసురులకు బగ వీడ టయాపురంబు** ( ప్రభావతీ ప్రద్యుమ్నం4 ఆ–16)

**అని తమలోన దారాడ చిరాపలుకేందును నుబ్బకుండ**
**ద్దనుజవరేణ్య కన్యకలు తపస వాక్యమువిన్నయదిగా**
**మనమున గూర్మిహెచ్చి నియమంబులు నోములుదానధర్మ వ**
**ర్తనలు గరంబు సల్పుదురు తద్గద సంబశుభంబే కోరుచున్** ( ప్రభావతీ ప్రద్యుమ్నం4 ఆ–17)

ఈ విషయం బయట చెప్పిన స్వామి వలన ఇబ్బందులు కలుగుతాయని భయంతో ఆ వాక్యాలు బయటపడకుండా జాగ్రత్తపడ్డారు. అందువలన అక్క అయిననూ తెలియుటకు వీలులేదు.

ప్రభావతీ ప్రద్యుమ్నుడు తన భర్త అని తెలిసినను విచారించుటకు హేతువు పార్వతీదేవి కలలో "నీ విభుడు ప్రద్యుమ్నుడు అని చెప్పినది కానీ మిగిలిన వివరములేవియు తెలియలేదు".

**కమలదళాక్షిరో వినవుగా కలయొక్కటిగంటి వేకువన్**
**సమాదికమైన యద్భుతమొనర్చుచునున్నదియోన్నుకొన్నలో**
**కమును గన్నవిన్నయది గాదదికొంతనిజంబు కొంత స్వ**
**ప్నమునని పల్కి సిగ్గుకతన్ మదిచెప్పక దాచెదాచినన్** (ప్రభావతీ ప్రద్యుమ్నం1 ఆ–122)

కొంత నిజంబు, కొంత స్వప్నముం అగుటంజేసి తల్లడిల్లినది గాన కృత్రిమ ముగ్ధత్వమని భావించడం సరికాదు.

కల్పనా స్థాలిత్యముల పేర రెడ్డిగారు మరొక విమర్శ చేశారు. కవి ఉపాయాంతరములచే కార్యము సాధ్యమగుచుండగా వేరొక ఉపాయము నాశ్రయించుట కల్పనా నైపుణ్యమునకు లోపమని రెడ్డిగారు చెప్పారు.

**"వజ్రనాభుని పురింజొచ్చు నుపాయమునకు సూచకముగ నుంటయ భద్రుని చరిత్రము యొక్క ముఖ్యోద్దేశము. ఉపాయాంతరము లున్నయెడల నీచరిత్రంబు వ్యర్థంబగును. కాన నితరములగు వెరవులు సాధ్యములని కవి కనబఱచియుండుట గొప్ప పొరబాటు. కథయొక్క కూర్పు బిగి తప్పిన దనుటకు దార్కాణములు"**[107].

[107] కవిత్వతత్వవిచారము:పుట.146

రెడ్డిగారి సిద్ధాంతమును అంగీకరించవలసింది. సాహిత్య విమర్శయందు ఇది అనుసరణీయము. ఈ విధమైన కల్పనా స్థాలిత్యమునకు ఉదాహరణముగా ప్రద్యుమ్నుడు తేటి రూపమున అంతఃపుర ప్రవేశము గావించుట భద్రుని వేషము ధరించి వజ్రనాభపుర ప్రవేశము సల్పుట అను సన్నివేశములు చూపిరి.

"తేటియైనవాఁడు హంస యేల కాఁగూడదు! ఆ పురిఁ బ్రవేశము హంసలకు సుగమము. అవి వాలయముం బోవుచు వచ్చుచుండినవి.

"తడవుల బట్టి యేము సతంబును బోదుమువాని
వీటికిన్,గడుమతిచాల మింగడపు గక్కుఱి తిన్సురలోకనాథ"

అని శుచిముఖి ఇంద్రునితో నివేదించి యతని కొఱకై వేగు పని నడపుట కొప్పుకొన్నది. కావున *మాయాగఘునుండు రతీశ్వరుడు" భద్రావేశము దాల్చినది. చూడగా గోటితో బోవుదానిని గొడ్డలి తెచ్చినట్లు".*[108]

ప్రద్యుమ్నుడు తేటి రూపమునే ఏలా ధరించవలెను? అను విమర్శకు సమాధానము రెడ్డిగారు భావించినట్లు హంస రూపమును ధరించిన అది మరొక ప్రమాదమునకు దారితీయునని సూరన తలంచెనేమో!ఇక ప్రద్యుమ్ముడు మాయాఘునుడు భద్రావేషము ధరించుటేల? అను విమర్శ గమనించదగినది.

ఈ కథయందు ప్రభావతీ ప్రద్యుమ్నులతోడి చంద్రావతీ గుణవతులయు గదసాంబుల వివాహము జరగవలసి ఉన్నది. వివాహములు ముఖ్యమైనను వజ్రనాభుని వధ దైవకార్యము. ఈ రెండు ఫలసిద్ధులు ఒకే కాలంలో జరగవలసి ఉన్నది. ఈ ప్రణాళిక కుదరడానికి సూరన ప్రద్యుమ్న గదసాంబులను ఏక కాలంలో రంగప్రవేశము చేసెను. ప్రద్యుమ్నుడు మాయా వేశమున వజ్రనాభపురం ప్రవేశించినచో తిరిగి వజ్రనాభుని ఎదుట ఏ విధంగా ప్రత్యక్షం కాగలడు? దానిని నివారించుటకై ప్రద్యుమ్నుని కృష్ణుడు ఆదేశించును. ఇట సూరనార్యుని రచనయందు కల్పనా స్థాలిత్యము లేదని భావించుటయే ఉచితము.

ప్రద్యుమ్నుడు ప్రభావతీ గృహమునుండి తన విడిది వరకు భూవివరమును ఏర్పాటు గావించుటయు రెడ్డిగారు కల్పనా స్థాలిత్యముగా పరిగణించిరి. మరియు ప్రభావతి యొక్క గదినుండి తన విడిది వరకు రాకపోకలు నిర్విఘ్నంగా కొనసాగించడానికి ప్రద్యుమ్నుడు సొరంగమార్గమొకటి నిర్మించుకున్నారు.ఇది నిరర్థక క్రమము. కాకి, పిల్లి, ఎలుక మొదలైన గృహ జంతువుల రూపము దాల్చి ఏదేచ్ఛముగా నేల సంచరించరాదు.

---

[108] కవిత్వతత్వవిచారము:పుట.147

రెడ్డిగారు అభిప్రాయపడినట్లుగా ప్రద్యుమ్నుడు యథేచ్ఛగా తిరుగుటయందు ఏ అభ్యంతరము ఉండదు. ఈ భూ వివరము ప్రద్యుమ్నుని కోసం కాక లక్ష్య సిద్యర్థము గావించుట కవి హృదయంగా భావించుట మంచిది. ఈ భూవివరము యొక్క ప్రసక్తి గ్రంథమునందు మూడు చోట్ల కనిపిస్తుంది. ప్రభావతిని ప్రద్యుమ్నుడు ప్రధమ సమాగానంతరము విడిచి వెళ్ళుచూ...

*"ఇది మొదలగ మాపులెల్ల నిచ్చటికి వచ్చెద గానీ తేపులు దప్పకుండ మావిడిదిని యుండకున్న రహస్య భంగము పుట్టిన మన మనోరథంబు విఘ్నకులుంబంగుగా వునసిక్కడ నుండి మదీయ నివాసంబు దాక భూవివరంబు గల్పించుకొని పోయెదు దద్వారం బన్యులు కెఱుక పడకుండునట్లుగా సంవరణంబు గావింపుమని చెప్పి..."*[109]

ఈ వాక్యాలలో ప్రద్యుమ్నుడు భూవివరమును ప్రద్యుమ్నుడు స్వప్రయోజమునకై కల్పించినట్లుగా గోచరించుచున్నది. శుచిముఖి ప్రద్యుమ్నునితో గదసాంబులను చంద్రవతి గుణవతులతో సమాగమమునకు ఏర్పాటు గావించుమని ప్రార్థింపగా – ***"అంత ప్రద్యుమ్నుండు శుచిముగిం జూచి సునాబతనయుల కడకుంజని తమ హృదయేశ్వరులిదే వచ్చుదరని యూఱడింపుమని పిలిచి తానును గదసాంబులకిష్ట సిద్ధియగునట్లు నాత్మకల్పిత భూవివర ద్వారంబున దానవిశ్వర కన్యాంతఃపుర ప్రవేశము గల్పించి నిజాంగనం గూడి రమియించు చుండెనపుడు".***[110]

ఇందు భూవివరము యొక్క ప్రయోజనము స్పష్టపడెను. వారిరువురును మాయాశక్తికలవారు. ఈ మార్గము కల్పించకున్న వారికి ప్రయాసమాగమెట్లు కల్పించబడెను.

వజ్రనాభుడు కోపోద్రిక్తుడై ప్రద్యుమ్నుని సమీపించుచున్న సమయమున మరియొకసారి భూవివరము యొక్క ప్రయోజనము గోచరించును.

***"... నీ బెడిదంపు రక్కసుని యక్కజంపు విక్రమంబు కుమారులకు నొర్వ శక్యంబు గాదని. పూర్వ విహిత మహీవివర ద్వారంబున నాక్షణంబు ప్రవేశించి భీతివశంబున నొక్కచోటనే చేరియున్న తమ కళత్రంబుల యుత్తలపాటు దీర్చి..."***[111]

తమ కుమారులను రక్షించుకొనుటకు ఈ మార్గముపయోగించితి. ఇట్లు భూవివర ద్వారము ప్రద్యుమ్నుని రాకపోకలకు, గదసాంబుల రాకపోకలకును తమ సంతతిని

[109] ప్రభావతీ ప్రద్యుమ్నం 5 ఆ–55 వచనము

[110] ప్రభావతీ ప్రద్యుమ్నం 5 ఆ–96 వచనము

[111] ప్రభావతీ ప్రద్యుమ్నం 5 ఆ–193 వచనము

రక్షించుకొనుటకు ఉపయోగపడినది. ఇన్ని ప్రయోజనాలకు ఉపయోగపడిన ఈ భూవివరము కల్పనా దారిద్ర్యమునకు సంకేతంగా చెప్పవలసిన పనిలేదు.

రెడ్డిగారు విమర్శించిన మరొక స్థాలిత్యము శ్రీకృష్ణుని ప్రవేశము అతడు వజ్రనాభపురమును యుద్ధ సమయమున ప్రవేశించిన రీతిగానే అంతకుముందుగా ప్రవేశింపవచ్చు కదా! అని

***"ఇక వజ్రనాభ పురమన్నచో తపమున బ్రహ్మ ప్రసన్నుజేసి మేరువు పొంత మారుతతాపములకు న్నిజానుమతి దక్క బ్రవేశమెనర్ప రానిది... గా నతనిచే నిర్మింపబడినది! అనుమతిలేక కృష్ణుడిప్పుడు చొచ్చినట్లు ఇక గొంతముందుగా వచ్చియుండిన నెవ్వరైన దలదీసియుందురా? విష్ణువు యొక్క మహత్మ్యమున కతిశయము గల్పింపబోయి బ్రహ్మ సంకల్పమునకు కథా కల్పనమునకు విచ్ఛేదము దెచ్చిపెట్టుకొని యుండుట మంచి బేరముగాదు".***[112]

కృష్ణుడు యుద్ధమునందే ప్రవేశించినారు.అంతకుముందు ఏల ప్రవేశించలేదు? అన్న ప్రశ్నకు ముందుగా కృష్ణుడు ఆ పురము ప్రవేశించాడా? లేదా? అన్నది నిర్ణయించవలసి ఉంది.

**కాంచనదీప్తిచే బసిడి గట్టు తేరంగున గళ్ళకోట సూ**
**చించ గదాను భాస్కరుని చెన్నువహించెను దానిజుట్టు రా**
**సంచరణం బొనర్చుచును శౌరితనూజుడు కోటచుట్టునన్**
**డించిన దైత్యస్తన్యము వడిందమ మున్పలె విచ్చిపాఅగన్** (ప్రభావతీ ప్రద్యుమ్నం5 ఆ-100)

ఈ సన్నివేశాన్ని పరిశీలిస్తే యుద్ధము అంతఃపురంలో ప్రారంభమైయి క్రమక్రమంగా కోట వెలుపలికి సాగినట్లు తెలుస్తుంది.

**కృష్ణుని ప్రవేశ వర్ణన:**

**అంతగేశవుడంచ వేగరులచే నాదైత్యు సంగ్రామ వృ**
**త్తాంతంబున్విని తర్ద్యవాహకుడు చక్రాద్యాయుధ స్రోల్ల స**
**త్కతిక్రాంత దిగంతురండయి వడిన్ దావచ్చే నచ్చోటికిన్**
**సంతోసంబున వజ్రసత్వరగతి స్పందించి సేవింపగాన్** ప్రభావతీ ప్రద్యుమ్నం5 ఆ-212

అచ్చోటికిన్ అనే పదాన్ని బట్టి కృష్ణుడు వజ్రనాభపురు బహిః ప్రదేశమునకు మాత్రము వచ్చెను గానీ లోనికి ప్రవేశించెనని తలంచుట సమంజసం కాదు.

ఈ విషయం వ్యాసమూర్తిగారు చెబుతూ

---

[112] కవిత్వతత్త్వవిచారము:పుట.146

*"రాజకీయ/యుద్ధ విషయము/ప్రపంచ జ్ఞానము గల్గినవాడు కావున కవి చక్కగా వ్రాసి యున్నారు.యుద్ధము ప్రారంభమైన యెడల పురము దాటి వెలువల రండు అనునది శ్రీకృష్ణుని మొదట యేర్పాటని రెడ్డిగారికి బోధపడినది కాదు. కవి స్పష్టపరచిననూ రెడ్డిగారికి అవగాహనము కాలేదు..."*[113]

సూరన రచనలోని లోపంగా ఒక ఉపమానమును చూపారు. ఇంత చిన్న విషయాన్ని కూడా ఎత్తి చూపడంతో రెడ్డిగారి సూక్ష్మ పరిశీలనాదృష్టి ఎంటో అర్థమౌతుంది. ప్రభావతీ సౌందర్యమును శుచిముఖి ప్రద్యుమ్ననకు చెప్పే సందర్భంలో..

**కొసరకచుపుచేత గడుగ్రోలిన నీచెలువంబు చెల్వ మా**
**నసమున నెంత మిక్కిలి ఘనంబుగా హత్తెనోగాని యప్పుడో**
**రసికశిఖావతం పయదు రత్నమ కాకరకాయ రీతిగా**
**గిసలయ వాణిచున్న గ్రవకేన గాగుర్పోడిచెంబోరింబొరిన్** (ప్రభావతీ ప్రద్యుమ్నం5 ఆ-149)

ఈ పద్యంలోని కాకరకాయ ఉపమానము సరిపోలదని విమర్శించుచూ "కాకరకాయలు యందుజిల్లెడుకాయ యనరాదో! పంతము బట్టి యేవైన గుణములు బలాత్కరముగా లాగివేయ జూచినచో విఱుపులు తప్పవు"[114].

ప్రభావతీ ప్రద్యుమ్నంపై సుదీర్ఘ చర్చ సాగించినందుకు రెడ్డిగారి అభిప్రాయం –

*"దోష విచారము చాలా దూరము చేసితిమి. ఇందునకు కారణములు రెండు నిష్పక్షపాత బుద్ధితో నొరయుట విమర్శకుల ధర్మము. రెండవది కళాపూర్ణోదయం యొక్క గొప్పతనము. కొలత యెత్తగోరిన సాధారణ ప్రబంధములకుం దానికింగల వ్యత్యాసము ప్రకటించుట యావశ్యకము. ఇంతే కానీ దోషములు జూపినందున గుణములే లేవను నన్యాపవాదము మోపువారము గాము..."*[115]

ప్రభావతీ ప్రద్యుమ్నంపై సుదీర్ఘ చర్చ చేయడానికి కారణాలు చెప్పుతూ పై అంశాలవల్ల కొంచెం వివరణ ఎక్కువగా ఇయ్యవలసి వచ్చిందని అభిప్రాయపడ్డారు.

### 3.2.2 ప్రభావతీ ప్రద్యుమ్నం – రెడ్డిగారికి నచ్చిన అంశాలు:

---

[113] కవిత్వతత్త్వవిచారవిమర్శనము:పుట.14

[114] కవిత్వతత్త్వవిచారము:పుట.149

[115] కవిత్వతత్త్వవిచారము:పుట.131

రామలింగారెడ్డిగారు ప్రభావతీ ప్రద్యుమ్నంలో లోపాలను చూపుతూనే అందులోని గుణాలను గురించి మెచ్చుకున్నారు. వీరి విమర్శ ఆలోచనలకు పదును పెడుతుంది. గ్రంథ పఠనాశక్తిని పెంపొందిస్తుంది.

*"ఈ కావ్యంలో కొన్ని అద్భుత విశేషాలున్నవి. అవి అనితర సాధ్యములు. మానవ ప్రకృతికి నద్దము జూపించునది సంభాషణము విస్మయావాహము. నాటక దర్మములను బోషించియున్నారు.స్థాలిత్యములలో మగ్నమైనదని క్షణమైన నెంచిన వాడనుగాను అనేక పాత్రములు ప్రదర్శింపబడు స్థానముల వర్ణనలు తఱచుగా సంభాషణ మూలంగా జేయబడి యున్నందున నవి పాలుపెక్కినవి. సంభాషణములనగా దీర్ఘ ప్రసంగములు గావు. అవి సామాన్య ప్రబంధకారుల విలాపములు మాటమీదుగా మాట వచ్చిననే యందము బడిపంతులవలె అరగంట వ్యాఖ్యానముం జేసిన నాటక సరణి చెడును. కథయందు నిరర్థకాంగములు మెండుగ లేవు. కల్పన యొక్క జిగిబిగి కళాపూర్ణోదయముకన్నా సాంద్రమని నా విజ్ఞప్తి".*[116]

ఇది స్థూలంగా ప్రకటించిన అభిప్రాయము. ప్రభావతీ ప్రద్యుమ్నమునందలి సంభాషణలు నాటక దర్మములు, సంభాషనాత్మక వర్ణనలు అన్నవి శ్రేష్ట గుణములుగా రెడ్డిగారు భావించారు. ఈ రచనలోని వర్ణనలు రెడ్డిగారిని ఆకర్షించాయి.

సీ. "తొలుదొల్తనయ్యేక తురగంబు మండల
గతిచారియగుచు నిక్కంబు దోఁచె
నావెనుకను సరూపాశ్వాలి చెదరక
చక్రాకృతిని బర్వుసరణిదోఁచె
నంతటననతిస్ఫుటావయవంబుగా
నెనసియేకాంగ వేష్టనతఁ దోఁచెఁ
దుదిఁ దద్విభూషణ ద్యుతిరాజి మాత్రంబు
కొఱవి త్రిప్పినరీతి మెఱసిదోఁచె

తే. నంతకంతకు గతివేగ మగ్గలింప
రాఁగవాగె యెచ్చరిక పరాకుజియ్య
యను జనులు రిచ్చవడి తమపని మఱువఁగఁ
బరఁగునమ్మేటినెఱరౌతు ప్రౌఢికతన" (ప్రభావతీ ప్రద్యుమ్నం2 ఆ–32)

[116] కవిత్వతత్వవిచారము:పుట.131

ఈ పద్యంలోని అత్యుక్తి అద్భుతమైనది. అత్యుక్తి అసాధ్యమనిపించరాదని రెడ్డిగారి అభిప్రాయం.

*"అత్యుక్తియుండిన నిట్లుండ నొప్పు, శుద్ధముగ నసాధ్యమని తోఁపఁగూడదు. మఱి యపురూపములైనను భావ్యములుగనున్న స్వారస్యమెక్కువ".* [117]

ప్రద్యుమ్నుడు మోహగ్రస్తుడై ఉన్న సమయంలో సూరన వర్ణించిన విధానం మిగిలిన ప్రబంధ కవులకంటే భిన్నంగా ఉంది.

**చం. ఇది పదిలంబుగా నడుగకే నపుడక్కట కోర్కిఁ దాచిన**
**ట్టిదొరతనంపు నీటు ప్రకటించితిఁ, బాపపు లజ్జ నన్ను నో**
**రదిమె, ననాదరంబు తెఱఁగై యది హంసికిఁ దోఁచె నేమొ! ని**
**ల్వదమఱియించుకైన, గఱువల్చవి గాని కథల్వచింతురే!**

(ప్రభావతీ ప్రద్యుమ్నం5 ఆ-5)

*"విరాళిపాలైన ప్రద్యుమ్నుడు నిర్హేతుకములగు నుత్సాహ, నిరుత్సాహ స్థితులందాల్చి లేనిపోని కారణముల నూహించుట మోహగ్రస్తులకు స్వాభావికమైన స్థితి. ఇది యీ కవి వర్ణించినట్లు లితరు లెవ్వరుఁ జేసినజాడ నాకుం దెలియదు. వినుండు".* [118]

ఈ వర్ణనయందు గల స్వాభావిక స్థితిని రెడ్డిగారు అభినందించారు. స్వభావికంగా మోహగ్రస్తుడు లేనిపోని కారణములూహించును ఆ విషయమునే రెడ్డిగారు సమర్థించుట సమర్థనీయము.

## 3.3 పాత్రల మనస్తత్వ చిత్రణ : ఆధునిక విమర్శన దృష్టి

ప్రభావతీప్రద్యుమ్నం ప్రబంధంలో రెడ్డిగారికి ఇష్టమైన పాత్ర శుచిముఖి. *"ఈ గ్రంథమున నాశ్చర్యకరమైన పాత్ర శుచిముఖి. ఈ హంసి యొక్క దిట్టతనము, బిగువు, నేర్పు, తీపి మాటలు, మెత్త మనసు, చమత్కారము నాహ్లాదకరములు".* [119]

ఈ పాత్ర సమగ్ర స్వరూపాన్ని రెడ్డిగారు పరిశీలించారు. శుచిముఖి సంభాషణలో రెడ్డిగారిని ఆకట్టుకున్న అంశాలు రెండు: 1) ప్రభావతి రూప లావణ్యాలు ప్రద్యుమ్నునికి చెప్పే విధానం, 2) ప్రద్యుమ్నుని సౌందర్యం గురించి ప్రభావతికి చెప్పిన విధానం.

---

117 కవిత్వతత్వవిచారము:పుట.133

118 కవిత్వతత్వవిచారము:పుట.133

119 కవిత్వతత్వవిచారము:పుట.131

ప్రభావతీ శుచిముఖిల వాగ్యుద్ధము గురించి చెబుతూ “అన్నిటికైనను సొగసైన ఘట్టము ప్రభావతీ శుచిముఖుల వాగ్యుద్ధము. తన రహస్యము ప్రకాశముగచేయక ప్రద్యుమ్నుని వృత్తాంతముఁ దెలిసికొన వలయునని ప్రభావతియు, ఆగుట్టు దీసికాని యాపెకోర్కి నెరవేర్చకూడదని హంసియు, నొండొరులఁ జఱచి మల్లయుద్ధ నైపణింజూపుట (అనఁగా మాటల మాత్రము) యుత్తమోత్తమ ప్రదర్శనములలో గణ్యము. స్త్రీ స్వభావము నెంత నేర్పుతోఁ గనుపఱచుచున్నాఁరు.

ఈ సన్నివేశంలోని పద్యాలన్నింటినీ ఉదాహరణలుగా చూపి ఉన్నారు.దీనిని బట్టి ఆ పాత్ర స్వభావం రెడ్డిగారిని ఎంతగానో ఆకర్షించిందని చెప్పవచ్చు.

సాధారణమైన పురవర్ణన ఈ ప్రబంధంలో కనిపించకపోవడం మరొక విశేషము. కావ్య ప్రారంభంలో చేసిన ద్వారకాపుర వర్ణనము పాత్రముఖమున చేయుట ఉచితము మరొక ప్రబంధ కవి అయిన ఈ విషయం సుదీర్ఘ వర్ణన చేసి ఉండెడివారు.పాత్ర ముఖమున గాక కవియే వర్ణించి యుండెడివాడు అని రెడ్డిగారు అభిప్రాయపడ్డారు.

***“ఇంద్రుడు చింతాక్రంతయై యుండబట్టి పురవర్ణనాదులచే నతనికిమరపుగల్పింపజూచుట సారధి ధర్మమే కదా!కావున నియ్యది ప్రబందములనెల్ల సర్వసాధరణములగు దిక్కులేని వర్ణనలకు జేరినదిగాదు.మరి సార్ధకము..”*** [120]

ఇక్కడ రెడ్డిగారు ప్రతిపాదించిన విషయము పురవర్ణన విశిష్టమైనదని వీరు ప్రయోగించిన “చింతాక్రాంతుడై” అనే పదం పట్టుకొని వ్యాసమూర్తి విమర్శించారు.

***“ఇంద్రుడు లోకహితకార్య పర్యాలోచనంబునకై చనుదెంచె... అనియు” రధిక సారధులు తత్తద్వస్తు సందర్శన సమయ సముచిత వచోరచనల వినోదించుచు వచ్చిరి అనియు గవి వ్రాసి యున్నందున నింద్రుడు చింతాక్రాంతుడై ద్వారకానగరంబునకు రాలేదని దెలియవచ్చుచున్నది”.*** [121] ఈ విషయంపై వ్యాసమూర్తిగారు ఇంత చర్చింప అవసరం లేదు. పురవర్ణన ప్రారంభించుట ముందుగానే మాతలి ఎందుకు పురవర్ణన ప్రారంభించబడియున్నది రాయబడింది.

**వ. ఇట్లు గనుపట్టు నాపట్టణంపు సోంపునకు శిర:**
**కపంబునేయు నిలింప వల్లభునింపు పెంపు**
**పరికించి కించిదుల్లసిత విలోచనంబుల నా సహస్ర**

---

[120] కవిత్వతత్వవిచారము:పుట.137

[121] కవిత్వతత్త్వవిచారవిమర్శనము:పుట.1

**విలోచను విలోకించి తదీయ రథ సూతుండగు**

**మాతలి యిట్లనియె (ప్రభావతీ ప్రద్యుమ్నం1 ఆ–55 వచనము)**

పుర సౌందర్య సమ్మోహితుడైన నిలింప వల్లభునింజూచి మాతలి పురవర్ణన ప్రారంభించెను.

ప్రభావతీ ప్రద్యుమ్నమునందుగల విశిష్ట గుణములలో ముఖ్యమైన అంశము అవయవ సంయోగము పరస్పరం కలిగియుండుట.

***"కథలో గాధన్వయములేని సంగతులు ప్రభావతీ ప్రద్యుమ్నము నందు మృగ్యములు అవయవముల సంయోగము పరస్పరము నిందుంబలె నాంధ్రగ్రంథముల నెచ్చటంగానము."***[122]

ప్రభావతీ ప్రద్యుమ్నమును ఆంధ్ర గ్రంథముల అన్నిటికంటె విశిష్టమైనదిగా రెడ్డిగారు గుర్తించారు. ఈ విధంగా రామలింగారెడ్డి ప్రభావతీ ప్రద్యుమ్నములోని విశిష్ట గుణములకు వ్యక్తపరిచారు. ఈ గ్రంథంలోని సంభాషణాత్మక శైలి, నాటకీయత, వర్ణనానిపుణాత్వమును పరిశీలించిరి. ప్రద్యుమ్న శుచిముఖి పాత్రలు విశిష్ట పాత్రలుగా గణించారు. అవయవ సంయోగము కలిగియుండు ప్రబంధము యొక్క విశిష్ట లక్షణంగా గుర్తించారు.

ఈ గ్రంథంలో వీరికి కనిపించిన కొన్ని లోపాలలో ప్రభావతీ పాత్ర సర్వప్రబంధ లక్షణ సంపూర్ణంగా చిత్రీకరించుట కల్పనా స్థాలిత్యముల పేర రెడ్డిగారు ప్రతిపాదించిన అంశాలు విమర్శా ప్రతిభకు చిహ్నాలుగా నిలుస్తున్నాయి. ప్రభావతీ ద్రౌపది తులనాత్మక పరిశీలన వీరి విమర్శనా శక్తికి నిదర్శనం. ఈ విధంగా రెడ్డిగారు ప్రభావతీ ప్రద్యుమ్నములో గుణదోషాలు రెండింటినీ ఎత్తి చూపి సద్విమర్శకుడు అనిపించుకున్నారు.

## 3.3.1 కళాపూర్ణోదయం – వస్తుతత్వపరిశీలన:

విమర్శకుడు కావ్యంలో గుణదోషాలను నిష్పక్షపాతంగా, నిగ్రహంతో చూపించగల సమర్థుడై ఉండాలి. రెడ్డిగారిలో ఆ ప్రతిభ అసామాన్యంగా ఉంది. అందుకే మొదట దోషాలను చూపించారు.ఇప్పుడు కళాపూర్ణోదయంలోని కథా కౌశల నిర్మాణంలోని అద్భుత గుణాన్ని ప్రశంసిస్తున్నారు.కొన్నిచోట్ల వీరి విమర్శలను సహృదయంతో స్వీకరించినట్లు కనపడదు. ప్రతి విమర్శకుడు రెడ్డిగారి గుణదోషాలను విమర్శించారే గానీ, ప్రశంసలోని విధానాన్ని, ప్రతిభను

[122] కవిత్వతత్వవిచారము:పుట.101

గుర్తించ లేకపోయారు. రెడ్డిగారు ఈ కావ్యంలోని గుణాలను ప్రశంసించిన విధానం చూస్తే వారు ఎంతటి రసహృదయులో అర్థమవుతుంది.

*"కళాపూర్ణోదయ మాంధ్రంబున నద్వితీయమైన గ్రంథము. ఏ జాతికిం జేరనిదిగాదు. తనంతటి నొక క్రొత్త రకము. ఆంధ్రభారతాదులు సంస్కృతేతిహాసములకుం బరివర్తనములు, మను వసుచరిత్రాదులయందు గథలు నవీనములు గావు. ప్రాచీన గ్రంథములనుండి గ్రహింపబడినవి ఈ విమర్శకు గుఱియైన కావ్యమన్నచో కవి యొక్క స్వసృష్టి".* [123]

తెలుగు సాహిత్యంలో ఇప్పటివరకూ కళాపూర్ణోదయం లాంటి గ్రంథం రాలేదని వీరు అభిప్రాయపడ్డారు. ఇతర భాషా గ్రంథాలతో పోల్చిన కూడా నిలబడగల ఒకే ఒక శక్తి కళాపూర్ణోదయానికుందని వీరి గాఢమైన నమ్మకం. ఈ కావ్యంలో కాల ప్రభావంచే కలిగిన లోపములు అధికంగా ఉన్న, గుణాలు కూడా చాలా ఉన్నాయని వీరు అభిప్రాయపడ్డారు. వీరి కవిత్వ తత్వ విచార గ్రంథాన్ని పరిశీలిస్తే అది ఈ అభిప్రాయంపైనే ఆధారపడి ఉన్నట్లు తెలుస్తుంది. ప్రబంధ కవుల ప్రభావం నుండి సూరన తప్పించుకోలేకపోయిన దానిని మాత్రము రెడ్డిగారు విమర్శించారు. ఈ విషయాన్ని గమనిస్తే ఈ రచనపై సహృదయ విమర్శ చేశారో లేదో తెలుస్తుంది. ఈ విషయాన్ని పరిశీలించకుండా ప్రతివిమర్శకులు కేవలం రెడ్డిగారు దోషాల్ని పట్టుకొని విమర్శించడం మంచిది కాదు.

ఆంగ్ల సాహిత్య ప్రభావం, విమర్శలోని బావ స్వాతంత్ర్యాన్ని బాగా ఆకళింపు చేసుకున్నవాడు కావడంచేత ప్రబంధాలపై సదాభిప్రాయాలున్ననూ, తనకు లోపంగా అనిపించిన దానిని ఎత్తి చూపారు. ఈ మార్గంలో కొన్నిచోట్ల చిన్న చిన్న అంశాలను కూడా తప్పుబట్టారు. ఈ లోపాలను చూపడంలో అవలంబించిన వైఖరి సంప్రదాయవాదులకు మింగుడు పడలేదు. కళాపూర్ణోదయం మూలకథా విషయమైన ప్రసంగమును లేవనెత్తిరి.

*"బాణునిచే సంస్కృతమున రచింపబడిన కాదంబరి వంటిదని అందురుగాని దాని నుండియైన సూరనార్యుడు విషయము గ్రహించినట్లు గానము".*[124]

కళాపూర్ణోదయము మూలకథకు కాదంబరికి సంబంధం లేదని రెడ్డిగారు భావించారు. అచ్యురావుగారు[125], దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారు మొదలైనవారు కళాపూర్ణోదయానికి మూలకథ కాదంబరి అని పేర్కొన్నారు.

---

[123] కవిత్వతత్వవిచారము:పుట.91

[124] కవిత్వతత్వవిచారము:పుట.91

[125] పింగళిసూరన:పుట:78

ప్రభోద చంద్రోదయము, లింగ పురాణము, వసుచరిత్ర, కాళహస్తీశ్వర మహత్మ్యం, పారిజాతాపహరణం, మార్కండేయ పురాణం, అముక్తమాల్యద కొంతవరకూ ఆధారముగా చెప్పిరి. మల్లాది సూర్యనారాయణ శాస్త్రి కళాపూర్ణోదయానికి, కాదంబరికి ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు[126].

కృష్ణారావుగారు కాదంబరి కళాపూర్ణోదయానికి మూలం అని వాటి సంబంధం గురించి సుదీర్ఘమైన చర్చ చేశారు[127].

పునర్జన్మల నిర్మాణ విషయము తప్పించి ఈ రెండు గ్రంథాలకు ఎటువంటి సంబంధం లేదని వీరి అభిప్రాయము. రెడ్డిగారు ప్రతిపాదించిన సిద్ధాంతమును తరువాతి విమర్శకులు స్పష్టంచేశారు.

సూరన కల్పనా సామర్థ్యానికి రెడ్డిగారు ఆకర్షింపబడినారు. తిక్కన మొదలగు కవులకున్న కల్పనా సామర్థ్యము ప్రబంధ కవులలో ఒక సూరనకు మాత్రమే ఉంది. ప్రబంధ కవులందరూ వెళ్ళిన మార్గమున సూరన వెళ్ళలేదు. కొత్త మార్గాన్ని తీసుకొని ప్రబంధ పోకడలలో నూతనత్వాన్ని ప్రతిపాదించారు.ఆ ప్రతిభకు సి.ఆర్.రెడ్డి జోహారులర్పించాడు.

*"గొడ్డెల మంద రీతి నొకరు పోయిన దారి నేతల వంచికొని యందఱు పోయిరి. గానీ స్వేచ్ఛాగమనము దల్పలైరి"*[128] అను రెడ్డిగారి అభిప్రాయం. ప్రబంధ కవులందరికి వర్తిస్తుంది. ప్రబంధ కవులలో సూరన తప్ప మిగిలిన వారందరూ కల్పనా సామర్థ్యం లేనివారని వీరి అభిప్రాయం. ప్రబంధ రచనలు అన్ని స్థూల దృష్టితో చూసిన ఆ విధంగానే అనిపిస్తాయి. సూక్ష్మ పరిశీలన చేయనివారిలో కల్పనా సామర్థ్యములోని వైవిధ్యము వ్యక్తం కాదు. రెడ్డిగారు కళాపూర్ణోదయంపై భాగవతం ప్రభావం ఉందని నిరూపించే ప్రయత్నం చేశారు.

*"మణికంధరుణి తీర్థయాత్రాభి వర్ణనములో నతడు సేవించిన క్షేత్రముల కనేకములకు గవి యంత్య ప్రాస నియమాలపాదించుట బమ్మెర పోతన విలాస ప్రభావమేమో!"*[129]

**మ. యమునం జూచెను వీచికాచయమునం బ్రాంచద్ఘనశ్యామతో,**
**యమునన్ సారస కైరవొచ్చయమునన్ సారావభృంగీ నికా,**
**యమునం జక్రమరాళసంచయనునన్ వ్యాఘోషితాఘువ్య పా**
**యమునన్ సంతతపుణ్యనిశ్చయమునన్ హర్షప్రకర్షంబు గన్**

---

126 భారతి-vol.24 issue-2

127 *studeys in kalapurnodaya: Pg.41*

128 కవిత్వతత్త్వవిచారము:పుట.88

129 కవిత్వతత్త్వవిచారము:పుట.99

(కళాపూర్ణోదయం 2ఆ 119)

పోతన అంత్యానుప్రాసాలంకార ప్రియుడు. సూరన కూడా ఈ విషయంలో పోతనను అనుసరించాడని అనుకోవడం సమంజసంగా ఉంటుంది. కళాపూర్ణోదయ కావ్యంలో క్రమ పద్ధతి ముఖ్యమైనదని రెడ్డిగారి అభిప్రాయం. సూరన కథాగమనంలో మిగిలిన ప్రబంధ కవులకంటే భిన్నంగా అనుసరించారు.కనుకనే కథా ప్రారంభాన్ని విచిత్రంగా ప్రారంభం చేశారు.మరొక కవి ఈ విధంగా ప్రారంభించి ఉండరు.ఈ విషయాన్నే ప్రతిపాదిస్తూ...

*"కాలక్రమం బట్టి చూచిన నీకథకు నాదిమ భాగము పంచమాశ్వాసములోని సరస్వతీ చతుర్ముఖుల లీలా కేళి. అనగా సామాన్య కవులు వ్రాసి యుండిన బంచమాశ్వాసము ప్రధమాశ్వాసమై యుండును. చూచితిరా! ఈ కవి యొక్క కూర్పులో గథా ప్రారంభమునకు గావ్య ప్రారంభమునకు నెంత దల్పో! ఇట్లు దూరస్థములయ్యు నల్లిక చెదరక జిగిబిగా నున్నందును నియ్యని గాఢా శ్లేషముం గాంచి యున్న".*[130]

పాత్రల స్వరూప స్వభావాన్ని సంభాషణ రూపమున వ్యక్తంచేయుట ఉచితం గానీ సుదీర్ఘ వర్ణనలచే పాత్రల స్వరూపమును స్పష్టపరచుట ఉచితము కాదు. ప్రబంధ కవులందరునూ పాత్రల స్వరూపమును విస్తృత వర్ణనలచే అవగాహనగునట్లు చేయుచుంటిరి. సూరన ప్రబంధ కవుల రచనకు భిన్నంగా రచించిన గమనింపదగింది. ఈ విశిష్ట లక్షణమును రెడ్డిగారు గుర్తించారు. *"నాటక రీతిని సంభాషణాదులచే వృత్తములం బ్రకటించుటయందు నీ గ్రంథము అసదృశ్యము. సామాన్య కవులు రాజునొక్కని బేర్కొని నతని దేహ మనో లక్షణముల ముప్పది, నలువది పద్దెములచే పొడవుగను, అసంగతముగను గ్రంథాదినే వర్ణింతురు. అనగా తత్పూర్వ కవుల రీతినే మాఱుమాటల జేయుస్తవమనుట వందిమాగధి స్తుతులచే నెవ్వని గొప్పతనమును సాక్షాత్కారముల జెందినట్లు తోపదు. గుణముల చర్యలచే ప్రకటతమగును".*[131] కళాపూర్ణోదయంలోని ప్రధాన పాత్రల వర్ణన మొదటనే సుదీర్ఘ వర్ణన చేసి పాఠకులకు విసుగు కలిగించకుండా చేశాడని రెడ్డిగారి భావన. *"కళాపూర్ణోదయంలో రాజవర్ణన చేయలేదు. ప్రభావతిలోనూ చేయలేదు. ఇందులకు గతంబేమె యెక్కొ! బహుశః గ్రంథాదిని రెండింటి యందును రాదగిన మహాత్ముడు కృష్ణురు.ఇతడు సుప్రసిద్ధుడు కావున గవి యితని గురించిన*

[130] కవిత్వతత్త్వవిచారము:పుట.174

[131] కవిత్వతత్త్వవిచారము:పుట.187

*ప్రస్తావనము లనావశ్యకములని విరమించెనో! యోజింపురు.తెలిసి చేసిన మనకేమి? తెలియక జేసిన మనకేమి? పాకము బాగున్న నామోదించుట సరి.*[132]

కృష్ణుడు జగద్విఖ్యాతుడు గనుక వర్ణించి ఉండలేదు అని చెప్పడం సరికాదు. ప్రబంధ కవులు శ్రీకృష్ణుడు కవితా వస్తువుగా లభిస్తే మరింత భక్తిప్రపత్తులతో వర్ణిస్తారు. సూరన కృష్ణుని వర్ణన అప్రస్తుతం అనుకొని వదిలి పెట్టారు.సంభాషణ శైలీ శిల్పానికి తిక్కన ప్రసిద్ధురు.ఆ తరువాత తిక్కనతో సమానమైన సంభాషణా శైలి శిల్పమును పోషించదగినవాడు సూరన ఒక్కడే. *"మానవ ప్రకృతిని అద్దంవలె జూపు శక్తి గలవాడు సంభాషణలు దీర్చుటలో దిక్కనకు సరివచ్చువాడును అని సూరనార్యుని ప్రశంసించినందుకు దద్కారణమైన ముఖ్యభాగములలో గొన్ని యేవనగా యిరువురు రంభలు నలకూబరులును నేయనుచితములకు నవీప్సితములకును బాల్పడక కృతార్థులగు తృతీయ చతుర్థా శ్వాసములలోని ఘట్టములు".*[133]

ఈ ఘట్టాలు సంభాషణలకు, నాటకీయతకు ప్రసిద్ధి వహించాయి. ఈ ఘట్టాలలోని సన్నివేశ సంభాషణా చాతుర్యానికి రెడ్డిగారు అనేక ఉదాహరణలు గ్రహించారు.

**"అంత మదింపకు వేయని పల్కిననంత మదింపకు వేయనుచున్**
**గంతులడంచెద తెమ్మనిపల్కిన గంతులడం చెదతెమ్మనుచున్**
**రంతులనేమి ఫలంబని పల్కిన రంతులనేమి ఫలంబుమనుచున్**
**బంతము చూడగదేయని పల్కిన బంతము చూడగదేయనుచున్** (కళాపూర్ణోదయం 3ఆ 204)

*రూపమున ప్రతిబింబములు, మాటలు, ప్రతిధ్వనులు మాటలే గానీ దెబ్బల సరసము పోతనకైనా బోరుకరములు అభినయములకేగానీ కొట్లాటకు గావని స్త్రీల నైజమతముగదా!"*[134]

ప్రబంధ శృంగారమును పరిహసించు రెడ్డిగారు కళాపూర్ణోదయంలోని కొన్ని శృంగార సన్నివేశాలను అంగీకరించారు.అసభ్య శృంగారాన్ని అసహ్యించుకున్నారే గానీ సభ్య శృంగారమును ఆనందించారు. విషయం అవగాహన చేసుకోలేని విమర్శకులు రెడ్డిగారిపై నిందలు వేయడం సమంజసం కాదు. ఈ కావ్యంలో వారు అభిమానించిన శృంగార సన్నివేశాలు ఇవి.

*"సూరన ప్రతిభావంతుడు కనుక సంపూర్ణముగా బాండిత్యబద్ధుడు గాజాలరు.స్వశక్తియే గురువుగా నూతన మార్గములందొక్కి యతడు ప్రకటించిన యసాధారణ శృంగారములకు*

---

[132] కవిత్వతత్త్వవిచారము:పుట.189

[133] కవిత్వతత్త్వవిచారము:పుట.191

[134] కవిత్వతత్త్వవిచారము:పుట.201

*ముఖ్య నిదర్శనములివి. శల్యాసుర విషయము. సుగాత్రీశాలీనుల వృత్తాంతం, సరస్వతీ చతుర్ముఖుల విలాసం కలభాషిణి చరిత్రము*[135].

కళాపూర్ణోదయంలోని కలభాషిణి పాత్ర రెడ్డిగారిని అమితంగా ఆకర్షించింది. ఆమె ప్రబంధ నాయకుల కందరిలోనూ శ్రేష్టమైనదని ఆయన అభిప్రాయం.

"ఈ కథయందలి పాత్రములపైకి నాకు బ్రియతమము కలభాషిణి నిక్కువమైన శృంగార భావములకు బ్రకాశకురాలు శాస్త్రకారుల శృంగారమను వీరి అభిప్రాయము ఎంతో సమంజసమైనది. వ్యాసమూర్తి భావించిన రీతిగా నీచ పాత్ర గావింపరాదని సూరన భావించిన ఏ రాజకుమారినో సృష్టించి యుండెడివారు.రెడ్డిగారు భావించిన రీతి కలభాషిణి ఉత్కృష్ట పాత్ర అనుటలో సందేహం లేదు.

రెడ్డిగారు కళాపూర్ణోదయాన్ని భారతాన్ని తులనాత్మక పరిశీలన చేసిరి. భారతం ప్రభావం పింగళి సూరనపై ఉందని వీరి అభిప్రాయం.

*"పింగళి సూరనార్యుడు మధ్యమకవులకు జేరినవారు.గావున ప్రాచీన గ్రంథములను, ముఖ్యంగా భారతమును బహు శ్రద్ధతోనూ, భక్తితోనూ బఠించియుండును. ఇందుల కమ్మహేతిహాసములలోని గుంభనల జ్ఞప్తికిఁ దే జాలినంత సాదృశ్యముగల రచనలఁ దాఁజేసి యుంట యొక సాక్ష్యము".*[136]

ఇది రెడ్డిగారి తులనాత్మక విమర్శా విధానానికి నిదర్శనం భారతంలో ధర్మరాజుకు కర్ణుడు తన అన్న అని తెలిసిన తరువాత బాధపడిన విధం.

**"అతని మేను గుంతి యట్టులకైవడి**
**యరయ నేను జూచి యాత్మ నెద్ది**
**కారణంబొ యిట్లుగా ననుచుండుదు**
**నేమిసేయువాఁడ నింకఁ జెపుమ!"**[137]

ఈ విధంగానే సుముఖాసత్తియు మణిస్తంభుడిని గూర్చి పలికిన విధానం.

**సీ. ఇందాఁక నెఱుఁగ నేనేమి యంటినొ మిమ్ము**
**ననుచుఁ గన్నీళ్ళు రా నడఁచికొనుచు**
**నడపులమాటల నగవుల మీ యందుఁ**

---

[135] కవిత్వతత్వవిచారము:పుట.215

[136] కవిత్వతత్వవిచారము:పుట.45

[137] కవిత్వతత్వవిచారము:పుట.45

దొంటికైవడి గొంత దోcచుచున్న
వసుధమానిసిcబోలు మానుసులులేరె
యనుచునుండుదు[138]

భారతంలోని వచన రచన కళాపూర్ణోదయంలోని వచనరచనను తులనాత్మకంగా పరిశీలిస్తూ...

*భీష్మాటోపమును వర్ణించుచున్న భారతములోని కొన్ని వచన ముల ననుసరించి, కళాపూర్ణోదయములో అష్టమాశ్వాసములోని "ఇత్తెఱcగున నప్పార్థివోత్తమం డత్యంతచిత్రంబైన" ఇత్యాది దీర్ఘ వచనములు వ్రాయంబడియున్నట్లు దోcచెడిని".*[139]

ఈ విధమైన తులనాత్మక పరిశీలనపై రెడ్డిగారి భావాలు గమనించదగినవి. తెలుగు సాహిత్య విమర్శయందు పోలికలంబట్టి గ్రంథ చౌర్యము జరిగినట్లు నిర్ణయించుట జరుగుచున్నది. సందర్భమును బట్టి భాష, శైలి, పరస్పర సన్నిహితములగును.

*"కవులయందు గాన్పించు నిట్టి సాదృశ్యములు విచార్యములైనను మిక్కిలి ముఖ్యములని భావించుట తగదు. పోలికలంబట్టి చౌర్యము నొడిగట్టుట తగదు. సందర్భము లభిన్నములుగ నున్నచోట్ల భాషయుc గొంత సాదృశ్యముం దాల్చుట య ప్రకృతము గాదు. విషయము, శైలి యివి పరస్పర సమన్వితములు. అట్లగుట విషయ సంభూతమైన పదసాదృశ్యము కావలయునని తెలిసి తెచ్చిపెట్టుకొన్న కల్పనయని సంశయించుట పొరపాటు. అయినను సాదృశ్యములు విశేషించి బహుళముగ నుండిన నితరులc జూచి వ్రాసినాcడను నిర్ణయ మనివార్యము."*[140]

రెడ్డిగారు ఈ గ్రంథంపై చేసిన విమర్శ నూతన విమర్శా మార్గమును చూపించింది. ఈ గ్రంథంలో వీరు చూపిన విశేషములు పాఠకులకు అభిరుచిని కలిగించే విధంగా ఉన్నాయి. ఈ విధంగా రెడ్డిగారు గ్రంథంలోని గుణదోషాలను చూపి విమర్శలో నూతన పంథాను అనుసరించారు.

## 3.4 సాంఘిక విమర్శ పద్ధతి:

కవిపై, దేశ, కాల, సంఘ ప్రభావాలను గురించి చర్చించు విమర్శే సాంఘిక విమర్శ. కవి స్వతంత్ర భావము కలవాడు అయిననూ తన రచనలో దేశ, కాల పరిస్థితుల ప్రభావం పడకుండా చూడలేరు.అతడు పుట్టి పెరిగిన ప్రదేశం, సంఘం, సమాజం, కాల ప్రభావాలు

[138] కవిత్వతత్వవిచారము:పుట.45

[139] కవిత్వతత్వవిచారము:పుట.47

[140] కవిత్వతత్వవిచారము:పుట.59

అతని రచనపై ఖచ్చితంగా పడతాయి. అవి ప్రత్యక్షంగా ఉండవచ్చు, పరోక్షంగా కూడా ఉండవచ్చు. సాంఘిక విమర్శకు ఆద్యుడు టైనీ. ఇతడు ఫ్రాన్స్ దేశస్థుడు.

***"Literature is the consequence of the moment, the race and the milieu." 141***

కాలము, సంఘము, పరిసరాలు మూడింటి స్వరూపము యొక్క పరిణామమే వాఙ్మయము. De Bonald సాహిత్యమునకు, సంఘమునకు ఉన్న సంబంధమును వివరించుచూ "Literature is an expression of society'."[142]

సంఘము యొక్క భావ ప్రకటనయే సాహిత్యం అని చెప్పవచ్చు. దేశ కాల పరిస్థితులు కవిపై ఉన్నట్లుగానే కవి ప్రభావము సమాజంపై ఉంటుంది అని Harry Levin అభిప్రాయం.

"***The relations between literature and society are reciprocal; literature is not only the effect of social causes. It is also the cause of social effects"***[143]

ఒక గ్రంథాన్ని సరిగ్గా అవగాహన చేసుకోవాలంటే, ఆ గ్రంథము ఏ దేశ కాల పరిస్థితుల్లో రచింపబడిందో అవగాహన చేసుకోవాలి. ఆ గ్రంథంలోని పాత్రలు ఎందుకు సృష్టించబడినాయో ముందుగా అవగాహన ఉండాలి అప్పుడే గ్రంథము సమగ్ర స్వరూపము బాగా అర్థమవుతుంది.

"***Sociological Criticism can then help us to avoid making mistakes about the nature of the work of literature we have before us by throwing light on. Its function or on the conventions with reference to which certain aspects of it are to be understood."***[144]

సాంఘిక విమర్శ అన్నది గ్రంథమును గూర్చి మనలోని అభిప్రాయ లోపాలను సరిచేసి గ్రంథం యొక్క ముఖ్య ఉద్దేశమును అవగాహనకు తెచ్చునట్లు చేయును. ఈ పద్ధతి విమర్శ గ్రంథము యొక్క ప్రయోజనమే కాక పాత్రల స్వరూప స్వభావాలను కూడా బహిర్గతం చేస్తుంది. పాత్రల స్వరూప స్వభావాలను గురించి పాఠకుని మనస్సులోని సందేహాలను తీర్చుటలో ఈ సాంఘిక విమర్శ కొంత వరకూ సహాయపడుతుంది.

---

141 సాహిత్యదర్శనం-పుట:27

142 Theory of Literature.Pg:43

143 సాహిత్యదర్శనం-పుట:27

144 *Critical Approaches to Literature.Pg:364*

**సాంఘిక విమర్శ పద్ధతి**లో రెండు ప్రధాన అంశాలను గురించి చర్చించాడు. అవి – 1) స్వయంవరములు రాక్షస వివాహములేనా? కాదా?, 2) హిందూమతపరిణామంలో భజనకూటముల పాత్ర? అనే రెండు అంశాలపై పరిశోధనాత్మకంగా రాసి, ఉదాహరణలతో సహా సోపత్తికంగా నిరూపించాడు.

### 3.4.1 స్వయంవరములు రాక్షసవివాహములేనా? కాదా?:

ప్రాచీనకాలంలో క్షత్రియులలో కనిపించే వివాహ పద్ధతిలో స్వయంవరం ఒకటి. దీని గురించే ఈ వ్యాసంలో చర్చించాడు. ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యాన్ని ఈ విధంగా తెలియజేశాడు.

***"మన పూర్వులైన యార్యులలో స్వయంవరములు వివాహ పద్ధతులలో నొకటిగా ఉండెననుట ప్రసిద్ధి. అనేకులు స్వయంవరములు కన్యక యొక్క ఇష్టప్రకారం ఆమెచే వరింపబడిన వరుని కోరి పెండ్లాడటం యని యనుకొనుచున్నారు ఇందలి సత్య నిర్ధారణకు దోడ్పడ జూచుటయు యీ వ్యాసం యొక్క ఉద్దేశ్యము".*** [145]

స్వయంవరంలో అనేక దేశాధినేతల రాజులు వచ్చి ఉంటారు. వారిలో ఆమెకు నచ్చిన వరుడిని యెంచుకొని వివాహం చేసుకోనే అధికారం ఆమెకు ఉంటుందని అనుకుంటారు కానీ వాటిలో కన్య అనుభవించే సాధకబాధకాలను ఈ వ్యాసంలో క్షుణ్ణంగా వివరించాడు.

**స్వయంవరం – అర్థ వివరణ**:

- ***Choice of husband by oneself; the public choice of a husband by a princess.***[146]రాణి తనకు కావలసిన వరుదుని ఎంచుకోవడం
- ***The election of a husband by a Princess or daughter of at a public assembly of Suitors held for the purpose.***[147]
- తనంతట భర్తను వరించుట.[148]

**స్వయంవరోత్సవము**:

[145] వ్యాసమంజరి:పుట.218

[146] బ్రౌణ్య తెలుగు–ఇంగ్లీష్ నిఘంటువు, 1903.

[147] శంకరనారాయణ తెలుగు–ఇంగ్లీష్ నిఘంటువు, 1953

[148] తెలుగు నిఘంటువు, తెలుగు–తెలుగు

***A day appointed for the selection of a husband by Princess out of an assembly of Suitors[149].***

పై నిఘంటువు అర్థాలను పరిశీలిస్తే ఒకరోజు అన్ని రాజ్యాలలో చాటింపు వేయించి స్వయంవరం ప్రకటిస్తారు. వచ్చిన రాజులలో నుండి తనకు నచ్చిన వరుడుని ఎంచుకొని వివాహం ఆడవచ్చు. దీనినే స్వయంవరం అంటారు. అంటే స్వీయ ఎంపిక అని అర్థం చేసుకోవచ్చు. స్వయంవరం అనే వివాహ పద్ధతి కేవలం క్షత్రియలు అంటే రాజులలోనే ఉండేదని రామలింగారెడ్డిగారి అభిప్రాయం. క్షాత్ర ధర్మాన్ని అనుసరించడంవల్ల పరాక్రమంతో అపహరించి చేసుకొనే వివాహాలకు, స్వయంవరాలకు సాదృశ్యముందని రామలింగారెడ్డిగారి ఊహ. నిజమైన స్వయంవరం, గాంధర్వ వివాహం వంటిదని అది ఇద్దరి ఇష్టప్రకారం జరుగుతుందని పేర్కొన్నాడు. అలా కాకుండా రాజు ఇష్టం మేరకు స్వయంవరం ఏర్పాటుచేసి అందులో వచ్చిన వారు ఎవరూ నచ్చిన నచ్చక పోయినా వివాహం చేసుకోవాలి అన్నదాన్ని రామలింగారెడ్డిగారు రాక్షస వివాహం కిందికి వస్తుందని పేర్కొన్నాడు.

వీటి గురించి మరింత స్థలంగా తెలియాలంటే మన ప్రాచీన హిందూ వివాహ వ్యవస్థ గురించి తెలియాలి అప్పుడే రామలింగారెడ్డిగారు ప్రతిపాదించిన అంశం అర్థమవుతుంది.

### 3.4.1.1 హిందూ వివాహం – రకాలు:

మన హిందూ వివాహ ధర్మాన్ని గురించి ఆ వివాహాలలో ఉన్నటువంటి భేదాలను గురించి వాటి మూల స్వరూపాన్ని గురించి వేదాల వల్ల మనకు తెలస్తుంది. ఋగ్వేదంలోని పదవ మండలంలోనిదైన 85వ సూక్తంలో బ్రహ్మ వివాహం వర్ణనం కనిపిస్తుంది. ఇందులో కన్యాదానం మొదలైన విషయాలు పేర్కొనబడ్డాయి. ఋగ్వేదంలోనే మరొకచోటు గాంధర్వ వివాహ వర్ణన కనిపిస్తుంది. అలాగే అధర్వణవేదంలో కూడా వివాహానికి సంబంధించిన ప్రస్తావన ఉంది. మనుస్మృతిలో వివాహంలోని రకాలను గూర్చి చెప్పబడ్డాయి.

**"బ్రహ్మో దైవస్త దైవార్షః ప్రాజాపత్య సధా సురః.**
**గాంధర్వో రాక్షసశ్చైవ పైశాచ శ్చాష్టమ్మో ధమః"**[150]

అని ఉంది. బ్రహ్మము, దైవము, ఆర్షము, ప్రాజాపత్యము, ఆసురము, గాంధర్వము, రాక్షసము, పైశాచము అని వివాహాలను ఎనిమిది రకాలుగా పేర్కొనబడ్డాయి. ఏదైనా ఒక ఆచారం

---

[149] బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు

[150] మనవివాహవ్యవస్థ:పుట.17

ముందుగా అనాగరికంగా ఉండి సమాజం దానిని సహించక పోవటం, సంస్కర్తలు వాటిని సంస్కరించడం. ఆ ఆచారంలో క్రమేణా మార్పులు జరిగి సంస్కరించబడటం అది ప్రశస్తరూపంలో సమాజంచేత అంగీకరింపబడటం అనేవి మనం చరిత్ర ద్వారా తెలుసుకున్న సత్యాలు. ఈ ఎనిమిది రకాల వివాహ స్వరూప స్వభావాలను తెలుసుకున్నప్పుడు మిక్కిలి క్రూరమైన పద్ధతి, అతి ప్రాచీనమైనదనీ, ఉత్తమమైనది ఆధునికమని తెలుస్తుంది. అందుకని ప్రాచీన పద్ధతులనుండి ఆధునిక పద్ధతుల వరకూ వివాహంలోని రకాలు వాటి స్వరూపం గూర్చి తెలుసుకుందాం.

**పైశాచం**:

**సుప్తాం మత్తాం ప్రమత్తాం వార హో యత్రీపగచ్ఛతి।**

**స పాపిష్ఠో వివాహోనాం పైశాచశ్చాష్టమోఽధమః॥**[151]

నిద్రపోతున్న, ఏకాంతంలో ఉన్న, స్పృహ లేకుండా ఉన్న, కన్యతో మైధునం (లైంగిక సంపర్కం) చేయడం, మోసగించడం, అపహరించడం పైశాచికం. ఇది వివాహాలన్నింటిలోకి నీచమైనది.

ఇంత నాగరికులమని విద్యావంతులమని చెప్పుకునే ఈ రోజుల్లో కూడా ఇలాంటి సంఘటనలు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి.

**రాక్షస వివాహం**:

**హత్వాభిత్వాచఛిత్వా చక్రోశన్తీం రుదతీం గృహాత్**

**ప్రసహ్యకన్యాహరణం రాక్షసోవిధిరుచ్యతే**[152]

ఏడుస్తూ పెడబొబ్బలు పెడుతున్న కన్యను, ఆమె బంధువులను కొట్టి లేదా చంపి, గాయపరచి, బలాత్కారంగా లాక్కొని పోయే పద్ధతి రాక్షస వివాహం. అంటే రాక్షస పద్ధతిలో కన్యయొక్క అనుమతి కోసం, ఆమె తల్లిదండ్రుల, బంధువుల అనుమతి కోసం ప్రతీక్షించకుండా బలాత్కారంగా హరించుకుపోవడం. మన పురాణేతిహాసాల్లో ఇలాంటి పద్ధతి అక్కడక్కడ కనిపిస్తుంది.

రుక్మిణీ శ్రీకృష్ణుల వివాహం, సుభద్రార్జున వివాహం రాక్షస పద్ధతిలోనే జరిగింది. కాకపోతే యిక్కడ వధువు అనుమతి ఉంది. బంధువుల అనుమతి లేదు. భీష్ముడు యుద్ధంలో

---

[151] మనవివాహవ్యవస్థ:పుట.18

[152] మనవివాహవ్యవస్థ:పుట.20

కాశీరాజును ఓడించి అతని కూతురు అంబను విచిత్రవీర్యునికిచ్చి వివాహం చేయడం కోసం అపహరించడం కూడా ఈ పద్ధతి క్రిందికే వస్తుంది.

**గాంధర్వం**:

**ఇచ్ఛాయాన్యోన్య *సంయోగః* కన్యాయాశ్చ వరస్యచ**

**గాంధర్వస్య తు విజ్ఞేయో మైధున్యః కామసంభవః**[153]

వధూవరులిద్దరూ కామానికి బద్ధులై స్వేచ్ఛగా సంయోగం చెందడం అనే పద్ధతిని గాంధర్వం అంటారు. ఇందులో వధూవరుల తల్లిదండ్రుల ప్రమేయం ఉండదు. వధూవరుల కామమే ప్రధాన పాత్ర వహిస్తుంది. ఈ పద్ధతిలో ప్రేమకు ప్రాధాన్యం ఎక్కువ. వధూవరుల అభీష్టం మేరకు ఈ వివాహ పద్ధతిలో ఉంటారు. కాబట్టి ఇది అందరికీ ఇష్టమైన పద్ధతి.

ఉదా: శకుంతలా దుష్యంతులు వివాహం. సత్యవతీ శంతనులు వివాహం మొదలైనవి ఈ వివాహ పద్ధతికి ఉదాహరణలు.

**స్వయంవరం**:

పురాణ ఇతిహాసాల్లో స్వయంవరం గురించి చదువుతూ ఉంటాం. అయితే దీనిని కూడా గాంధర్వ పద్ధతిగానే కొంతమంది పరిగణిస్తారు. కానీ వీటి రెండింటిలోనూ కొద్దిపాటి భేదం ఉంది. గాంధర్వ వివాహ పద్ధతిలో వధూవరులిద్దరి ప్రమేయం ఉంటుంది. ఇతరులకేమీ సంబంధం ఉండదు. స్వయంవరం అలా కాదు ముందుగానే పెద్దలు కన్య తనకు తగిన వరుణ్ణి వరించడానికి ఏర్పాట్లు చేస్తారు.

**స్వయంవరం రకాలు**: స్వయంవరం రెండు రకాలుగా ఉంటుంది. అవి 1) సామాన్య స్వయంవరం, 2) విశిష్ట స్వయంవరం.

**సామాన్య స్వయంవరం**:

ఆడంబరం ఏమీ లేకుండా జరుగుతుంది. కన్య తనంతట తానే వరుణ్ణి అన్వేషించి నిశ్చయించుకుంటుంది. తన కుమార్తె రజస్వల అయిన మూడు సంవత్సరాలలోగా వరుణ్ణి వెదకి వివాహం చేయకపోతే, తనంతట తానే వరుణ్ని వెతికి వివాహం చేసుకునే అధికారం, స్వేచ్ఛ కన్యకుందని మనుశాస్త్రం చెబుతుంది.[154]

ఉదా: సావిత్రీ స్వయంవరం.

---

[153] మనవివాహవ్యవస్థ:పుట.23

[154] మనవివాహవ్యవస్థ:పుట.26

స్వయంవరం అనేది క్షత్రియులకు అభీష్టమైనదే అయినా వారు కన్యను అపహరించడానికే ఇష్టపడతారు అని మహాభారతం చెబుతుంది.[155]

**స్వయంవరంతురాజన్యా:ప్రశంసంతి ఉపయాన్తీచ**

**ప్రమథ్య తు హృతామాహుర్జ్యాయసీం** ***ధర్మవాదినః***

***విశిష్ట స్వయంవరం:***

ఈ పద్ధతిలో తండ్రి తన కుమార్తె వివాహం కోసం పెద్ద సభ ఏర్పాటు చేయడం రాజకుమారులంతా ఆ సభకు రావడం, వధువు అలంకృతమై పూలదండజేతపట్టి చెలికత్తె వెంట రాగా సభా మండపంలో ప్రవేశించడం. చెలికత్తె ఒక్కో రాజకుమారుని గుణగణాలను వర్ణించి చెప్పడం. రాజకన్య తనకు నచ్చిన రూప లావణ్య, విద్యా పరాక్రముని మెడలో మాల వేయడం, పిమ్మట కన్య వారిద్దరికీ వివాహం జరిపించడం ఈ స్వయంవర వివాహ పద్ధతి.

ఇందుమతి, దమయంతి మొదలైనవారికి ఇలాంటి వివాహములు అయితే మరికొన్ని స్వయంవరాలలో వరుని పరాక్రమ ప్రదర్శనాదులకు సంబంధించిన కొన్ని షరతులు విధించడం, వరుడు ఆ పరీక్షలో నెగ్గితే మెడలో మాల వేయడం తరువాత వివాహం జరిపించడం ఉంది. ఉదా: సీతా స్వయంవరం, ద్రౌపదీ స్వయంవరం ఇలాంటివి. ఈ పద్ధతి పూర్వపు మహారాజుల వంశాల్లో ఉన్నట్లు తెలుస్తుంది.[156] ఈ విశిష్ట స్వయంవరం అనే ఆచారంలోనే కన్య యొక్క అభీష్టం కంటే ఆమె తల్లిదండ్రుల అభీష్టానికి వారు విధించిన షరతులకు అధిక ప్రాధాన్యం వచ్చింది. కన్య యొక్క ఇష్టానికి ప్రాధాన్యం తగ్గింది. దీనినే కట్టమంచి రామలింగారెడ్డి విమర్శించినది.

**అసురం (మానుషం)**:

కొంతమంది ధర్మ శాస్త్రకారులు అసుర వివాహమే 'మానుషం' అన్నారు.

**జ్ఞాతిభ్యో ద్రవిణం దత్వా కన్యాయై చైవ శక్తి తః।**

**కన్యా ప్రదానం స్వాచ్ఛంద్యా దాసురో ధర్మ ఉచ్యతే॥**[157]

వరుడు కన్యకు ఆమె బంధువులకు యథాశక్తి ధనం యిచ్చి స్వచ్ఛందంగా కన్యను వివాహం ఆడటాన్ని అసురం అంటారు. ఈ వివాహంలో ధనం ప్రధాన పాత్ర వహిస్తుంది.

---

[155] మనవివాహవ్యవస్థ:పుట.27

[156] మనవివాహవ్యవస్థ:పుట.27

[157] మనవివాహవ్యవస్థ:పుట.28

**ఆర్షము**:

**ఏకం గోమిథునం ద్వే వా వరాదాదాయ ధర్మతః।**

**కన్యాప్రదానం విధివదార్షో ధర్మః స ఉచ్యతే॥**[158]

యజ్ఞయాగాది కార్యాలు నిర్వహించుకోవడం కోసం కన్నె యొక్క తండ్రి వరుని దగ్గర నుండి ఒకటి, రెండు జతల ఆవులు, ఒక ఆబోతును గ్రహించి కన్యాదానం చేస్తాడు. గోమిథునాన్ని గ్రహించడం యజ్ఞం కోసం కాబట్టి దీన్ని 'ఆర్షము' అన్నారు.

**ప్రజాపత్యం**:ఏ విధమైన కన్యాశుల్కాలు లేకుండా కేవలం ఆధ్యాత్మిక దృష్టితో జరిగేది.[159]

**దైవము**:తండ్రి తన కన్యను అలంకృతను చేసి తాను చేస్తున్న యజ్ఞంలో పౌరోహిత్యాన్ని నిర్వహిస్తున్న ఋత్విజునకు దానం చేసే వివాహం.[160]

**బ్రహ్మము**:విద్యావినయ సంపన్నుడు, శీలవంతుడు అయిన వరుని ఆహ్వానించి ఏ విధమైన శుల్కం తీసుకోకుండా సాలంకృతమైన కన్యను సదక్షిణంగా దానం చేయడం. ఇవి మన పూర్వకాలపు వివాహ పద్ధతులు. అందులో స్వయంవరాన్ని రామలింగారెడ్డిగారు విమర్శిస్తూ, దానిని రాక్షస వివాహంతో పోల్చాడు. [161]ఇవి మన పూర్వకాలపు వివాహపద్ధతులు.వీటిలో స్వయంవరాన్ని రామలింగారెడ్డి విమర్శిస్తూ దానిని రాక్షస వివాహంతో పోల్చాడు.

స్వయంవరం రాక్షస పద్ధతికి సమానం అని చెప్పడానికి రామలింగారెడ్డి కొన్ని ఉదాహరణలు చూపెట్టాడు. స్వయంవరంలో దినము, లగ్నము అని చూసుకొని స్వయంవరం ప్రకటిస్తారు. ఆ వచ్చిన రాజులలో ఆమె మనస్సుకు నచ్చినవాడు తప్పక వచ్చి ఉంటాడని ఏమినిజము అని ప్రశ్నించాడు. **"ఆనాడు వచ్చిన వారిలో గన్యక యొక్క మనస్సుకు నచ్చినవాడు తప్పక వచ్చియుండుననుట మేమినిజము? మరి వచ్చిన వారెల్ల దనకేల యనిష్టులు కారు"** [162]అని ప్రశ్నించాడు. అలా నచ్చినా, నచ్చక పోయిన ఆమె పూల హారం ఎవరో ఒకరి మెడలో వేయక తప్పదని, ఆమె మనస్సుకంటే, పెళ్ళి చేయడమే స్వయంవరం ప్రధాన లక్ష్యం అని అభిప్రాయపడ్డాడు. రామలింగారెడ్డి చెప్పిన అభిప్రాయం విశిష్ట స్వయంవరం అనే వివాహ

---

[158] మనవివాహవ్యవస్థ:పుట.34

[159] మనవివాహవ్యవస్థ:పుట.36

[160] మనవివాహవ్యవస్థ:పుట.38

[161] మనవివాహవ్యవస్థ:పుట.39

[162] వ్యాసమంజరి:పుట.218

పద్ధతికి సంబంధించినది. ఈ పద్ధతిలో కన్నె యొక్క అభీష్టం కంటే, ఆమె తల్లిదండ్రుల నిర్ణయానికే విలువ ఎక్కువ. కాబట్టి రాజులు వచ్చారు ఎవరినో ఒకరిని తప్పక వరించాలి లేకుంటే ఆ సభ ఏర్పాటు చేయడానికి అయిన ఖర్చు, వ్యర్థము వచ్చిన రాజులందరూ ఆమె తండ్రి పైకి దండెత్తి వస్తారని చెప్పాడు. స్వయంవరంలో, కన్నె స్వతంత్రంగా ఇష్టపడి చేసుకోదు కాబట్టి ఇది రాక్షస వివాహంలో ఒక ఉప వర్గమని రెడ్డిగారు అభిప్రాయపడ్డాడు. **"స్వయంవర విజితయైన కోమలి" అనే ప్రయోగం భారంతో ప్రయోగించబడి ఉంది. దీనికి రామలింగారెడ్డి స్వయంవరంలో 'విజిత' అనగా పరాక్రమంతో అపహరించబడినది అన్న అర్థం తీసుకున్నాడు.**[163] మహాభారతంలో స్వయంవరం క్షత్రియులకు అభీష్టమైనదే అయినా వారు కన్యను అపహరించడానికే ఇష్టపడతారు అని పేర్కొంది.

**స్వయంవరంతురాజన్యాఃప్రశంసంతి ఉపయాన్తీచ**

**ప్రమథ్య తు హృతామాహుర్జ్యాయసీం ధర్మవాదినః**[164]

ఇక్కడ భీష్ముడు కాశీరాజు కూతురి స్వయంవరంలో అంబను రథం ఎక్కించుకొని అపహరించుకొని పోవడాన్ని స్వయంవరం అంటారా అని ప్రశ్నించాడు. వారు చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికి క్షత్రియులకు గాంధర్వ రాక్షసంబులు ఉత్తమమని ధర్మశాస్త్రాలు వెల్లడించాడని విమర్శించాడు. ఈ స్వయంవరంలో విచిత్రవీర్యుడు ఉండడు. ఇంకా కన్యలు వారిని వరించిరనుట రసాభాసమైనది అని అభిప్రాయపడ్డాడు. ఈ విధంగా చేయడంవల్ల దీనికి రాక్షస వివాహానికి భేదం లేదని రెడ్డిగారి అభిప్రాయం.

- స్వయంవరంలో గొడవలు, కొట్లాటలు ఎక్కువగా జరుగుతాయి. ఎవడి దగ్గర ఎక్కువ బలపరాక్రమాలు ఉంటే వాడిదే విజయం అని దుర్యోధనడు శుభాంగి అను కన్య స్వయంవరంలో చేసిన యుద్ధాన్ని పేర్కొన్నాడు. ప్రతి స్వయంవరం సమరంగా మారుట ఆ యుగధర్మమని పేర్కొన్నాడు.

నలదమయంతుల స్వయంవరం అసలు స్వయంవరమే కాదని పేర్కొన్నాడు. ఎందుకంటే స్వయవరం కంటే ముందే వారిద్దరు ఒకరినొకరు ఇష్టపడ్డారని వారిని కలపడానికి కల్పించబడిన కృత్రిమ కార్యమే దమయంతి స్వయంవరం అని అభిప్రాయపడ్డాడు. ఈ స్వయంవరంలో శాంతంగా, గొడవలు లేకుండా జరగడానికి కారణం ఇంద్రాది దేవతలు రావడం వల్ల మిగతా రాజులు ఎవ్వరూ కూడా యుద్ధం చేయడానికి సాహసించినవారు

[163] వ్యాసమంజరి:పుట.218

[164] మనవివాహవ్యవస్థ:పుట.27

కాలేదని అభిప్రాయపడ్డాడు. సీతా ద్రౌపది వివాహాలు కూడా రాక్షస వివాహాల క్రిందకే వస్తాయని పేర్కొన్నాడు. **“ద్రౌపదీ సీతా స్వయంవరములు స్వయంవరములు కావు. నిర్దిష్ట కార్యము చేసినవానికి గన్యనిచ్చియే తీరవలయునని నిర్ణయము ప్రకారమావివాహములు జరిగెను. కావున వానియందు గన్య స్వయం వరించి చేయునది గానీ చేసినది గానీ యొక్కటియులేదు. తుదకు జయశీలుడైనవాడు” నా యన్నదమ్ములందరినీ బెండ్లాడమని కోరగా నట్లునుజేయుట ద్రౌపదికి దటస్థించినది. ద్రౌపదియు, సీతయు బాణములవంటి వస్తువులు వైవాహిక స్వాతంత్ర్యము వారికి లేదు. ఈ నిర్దిష్ట కార్యము బరాక్రమ సూచకములు గాన ఈ వివాహములునూ రాక్షస కృత్యములే అని అభిప్రాయపడినాడు.**[165]

నిర్దిష్ట కార్యం చేసినవాడే కన్యను పెండ్లాడాలి అనే నియమం ద్వారా వారిద్దరూ వారి ప్రమేయం లేకుండా పెండ్లి చేసుకుంటారు అని రెడ్డిగారి అభిప్రాయం. రాక్షస వివాహ పద్ధతి రాజులనుండి సామాన్య జనులకు కూడా ఆ పద్ధతి అలవడిందని చెబుతూ అండమాన్ నికోబార్ దీవులలో కన్నెలు వరుడు మనుషులను వధించి ఎన్ని పుఱ్ఱెలు తెచ్చి ఇస్తే అంత పౌరుషవంతునిగా ఆ కన్నెలు ఎంచుతారని ఇది కూడా రాక్షస వివాహ పద్ధతికే చెందిందని కాకపోతే రూపం మార్చుకుందని అభిప్రాయపడ్డాడు.[166] ఇప్పటి మన ఇండ్లలో జరిగే వివాహ తంతు కార్యక్రమాలలో కూడా ఆ స్వయంవర, రాక్షస వివాహాల ఆనవాళ్లు అక్కడక్కడా కనిపిస్తాయని చెప్పాడు.

గాంధర్వ వివాహ పద్ధతి ఉత్తమమైనదని అది వేదములు పుట్టక ముందు నుంచి మనుష్యులలో వ్యాపించి ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ విధంగా స్వయంవరానికి, రాక్షస పద్ధతితో పోల్చి చెప్పాడు. ఇవన్నీ కూడా రెడ్డిగారి ఊహ ప్రతిపాతిమైనవే కానీ వాటికి శాస్త్ర గ్రంథాలలో కానీ, భారత, రామాయణాదులలో గానీ తగిన ఆధారాలు లేవు. కాబట్టి రెడ్డిగారి అభిప్రాయాల పట్ల పరిశోధకులు, విమర్శకులు విభిన్న అభిప్రాయాలను వెలిబుచ్చారు, కొందరు సమర్థించారు, మరికొందరు ఖండించారు.

### 3.4.2 హిందూ మత పరిణామంలో భజనకూటముల ప్రాముఖ్యం:

మన భారతదేశంలో ప్రతి గ్రామంలోనూ భజన మందిరాలు ఉన్నాయి. వాటి చరిత్ర వాటికి హిందూమతంలోని ఇతర సాంప్రదాయాలతో గల సంబంధాన్ని గురించి ఈ వ్యాసంలో చర్చించాడు. హిందూ మతానికి వైదిక క్రియలు ఆధారములు అనగా యజ్ఞయాగాదులు, అవి

[165] వ్యాసమంజరి:పుట.221

[166] వ్యాసమంజరి:పుట.222

జన సామాన్యానికి అందుబాటులో ఉండేవి కావు. క్షత్రియులు, బ్రాహ్మణుల చేతుల్లో ఉండేవి ఆ కార్యాలు. అవి వారి వైయుక్తిక పనుల కోసం చేయబడేవి కానీ సమస్త జన బాహుళ్యం కోసం అవి చేయబడేవి కావు అనేది రెడ్డిగారి అభిప్రాయం. ఉదాహరణకి పుత్రులు కావలసినవారు పుత్రకామేష్టియాగం చేయడం లాంటివి. మరికొన్ని యాగములు, రాజుల జయ చిహ్నాలు, సార్వభౌమత్వము, క్షాత్ర బలంచే స్థాపించిన రాజసూయ, అశ్వమేధ యాగాలు చేయుట ఆనాటి వైదికాచారాలలో ఒకటిగా పేర్కొన్నాడు. వీటివల్ల ప్రజలకు లాభం ఏమీ ఉండదని, విందు భోజనాలు తప్ప అని విమర్శించాడు.[167] పాశ్చాత్యులలో ఉన్న జాతీయతా భావం, భారతీయ హిందువులలో లేదని రెడ్డిగారి భావన. దానికి కారణం మతం. మన మతం జాతీయ భావాన్ని పెంపోదించేదిగా లేదు. స్వాభిమానము, కులాభిమానము పెంపోదించేదిగా ఉందని విమర్శించాడు. ఈ అల్పమైన దృష్టితో ఏర్పడిన ఆచారాలలో వైదిక మతం ఒకటి.[168]

వైదిక శక్తులను క్షుద్ర పూజల వంటివని పేర్కొన్నాడు. వీటిని ప్రథమంగా యాస్కుడు, గౌతముడు నిరాకరించారు. హింసా ప్రవృత్తి కావడంవల్ల బౌద్ధులు, జైనులు వైదిక క్రియలను నిరసించారు. రాను రానూ వైదిక క్రియల స్వరూపం మారినది కానీ వాటి ఉద్దేశం మారలేదు. ఒక వ్యక్తికో, ఒక కులానికో ప్రయోజనం కలిగించేవిగా ఉన్నాయి కానీ, సంఘ సామాన్యము యొక్క శీలము, పురోభివృద్ధికి, జాతీయతా ప్రయోజనాలకు అనువైనవిగా లేవు. రెండు మార్గాలలో వేదం పరిణామం చెందిందని పేర్కొన్నాడు.[169]

### 3.4.2.1 పూర్వమీమాంస పద్ధతి:

యజ్ఞహోమాది క్రియలు ఈ పద్ధతిలో ప్రధానము. వేదాలు దేవుడి కంటే గొప్పవని, దేవుడు వేదాలకు సాక్షమే కానీ కర్త కాడని అసలు దేవుడున్నాడా? లేడా అన్న మీమాంసలు, వాదోపవాదాలు ఈ పద్ధతిలో జరిగాయి.

### 3.4.2.2 ఉత్తరమీమాంస పద్ధతి:

దీనినే జ్ఞానకాండము అంటారు. ఇవి ఆత్మ సంతృప్తిని ఇవ్వవు. మానవుడు వాంఛపరుడు. వాంఛ నెరవేర్చుకొను జూచుట మానవ నైజము. తత్వశాస్త్రంవల్ల వాంఛలెలా నెరవేరుతాయి. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన కర్మ సిద్ధాంతం మోక్షం వచ్చుటకు ఫలాపేక్ష

[167] వ్యాసమంజరి:పుట.224

[168] వ్యాసమంజరి:పుట.225

[169] వ్యాసమంజరి:పుట.225

లేకుండా పనులు చేయుట అన్నది చప్పిడి సిద్ధాంతమని. దీనిని ముసలివారికి, వినడానికి పనికి వస్తుంది తప్ప ఇంకా దేనికి పనికి రాదని విమర్శించాడు. [170]

నిష్కామ వ్యవహార తత్త్వానికి మూల పురుషులు జ్ఞానవాదులు. కర్మ, భక్తి యోగాలయందు దీనికి స్థానం లేదు. కాబట్టి మతంలో అనుష్ఠానమునకు వచ్చిన మార్గములు రెండే. ఈశ్వర మార్గమైన కర్మ మార్గము, భక్తి మార్గము. వీటిలో మళ్ళీ రెండు మార్గాలున్నాయి. వ్యక్తి పద్ధతి, సామాజిక పద్ధతి.[171]

### 3.4.2.3 వ్యక్తి పద్ధతి:

కర్మలను, పూజలను ఒక వ్యక్తి తన మేలు కోరి స్వయంగా కానీ, పురోహితుని ద్వారా కానీ చేయడం. ఇది అన్ని మతాలలోనూ ఉంది.

### 3.4.2.4 సాంఘిక పద్ధతి:

హిందూ దేవాలయాలలో జరిపే పూజలను, క్రైస్తవులు, మహమ్మదీయులు వారి వారి ప్రార్థనా మందిరాల్లో జరిపే పూజలను తారతమ్య దృష్టితో పరిశీలిస్తే ఈ భేదం తెలుస్తుంది. మన పూజలన్నీ కూడా వ్యక్తిగతమైనవి. దేవునితో పూజారి చేయు వ్యక్తి బేరము.

చర్చిలలో, మసీదులలో పూజా విధానం లేదు. వారు ఒక సమయాన్ని అనుసరించి అందరూ సమావేశమై సమూహంగా పూజలు చేస్తారు. వారు పూజారి చెప్పిన స్తోత్రములు భక్తులు  కూడా ఒకేసారి చెప్పుతారు. దీనివల్ల ప్రతి ఒక్కరు పరోక్ష పూజే కాకుండా ప్రత్యక్ష పూజ కూడా చేసినట్లు అవుతుంది. ఇది వారిలో ఉన్న సంఘ ఐక్యానికి నిదర్శనము. మొత్తం మీద తాను, తన కులం దానికి మించి లేదు అనిఉండేవారము మనము. అందుకే హిందువులు అంత ఐక్యంగా లేరు అని భావించాడు[172].  ముందు జాతి తరువాతనే కులం అనేది పాశ్చాత్యుల పద్ధతి.

మొదటగా హిందూ మతంలో ఈ దోషాన్ని కనిపెట్టినవాడు సిక్కుల మత గురువు గురునానక్. మహమ్మదీయుల చేతిలో హిందువులు పరాజయం పాలవ్వడం చూసి తాను స్థాపించిన మతంలో భజనలకు, ప్రార్థనలకు స్థానం కల్పించారు. వాటి ద్వారా

---

[170] వ్యాసమంజరి:పుట.227

[171] వ్యాసమంజరి:పుట.227

[172] వ్యాసమంజరి:పుట.228

మహమ్మదీయులని ఓడించే శక్తిని సిక్కులకు కలిగించాడు[173]. 1924 సంవత్సరంలో గాంధీగారిని కలవడానికి పంజాబ్ వెళ్లినప్పుడు సిక్కుల ఐక్యతను చూసి ఆశ్చర్యపడి ఆ విషయాలను వారి మిత్రుల ద్వారా తెలుసుకున్నాడు.

సిక్కులు అందరూ కూడా నిర్దిష్ట సమయంలో ఆడ, మగ భేదం లేకుండా వారి ప్రార్థన మందిరానికి వచ్చి రోజుకి మూడు సార్లు కీర్తనలు పాడుట వారి ముఖ్య విధి. ఇలా ప్రతిరోజు అందరూ కలిసి సంకీర్తనలు పాడటం, దాని ద్వారా ఐకమత్యం సాధించారని తెలుసుకున్నాడు.

ఇలా మహమ్మదీయుల నుండి ఈ అంశాన్ని గ్రహించి మన దేశంలోని సిక్కులలో ప్రవేశపెట్టాడు. తరువాత హిందూ మతం కూడా ఈ పద్ధతిని అవలంబించింది. కానీ సిక్కులలో పరిణామం చెందిన విధంగా హిందువులలో పరిణామం చెందలేదు.

### 3.4.2.4 హిందువుల భజనలలోని విశేషాలు:[174]

- ఇందు ఆరాధింపబడేవారు ప్రజా సామాన్యము యొక్క హృదయాన్ని ఆకర్షించిన రాముడును, కృష్ణుడును. వీటిలో రామ మందిరాలే ఎక్కువ. దేవతలు మనుష్యుల వంటివారు. మనలాగే సుఖదుఃఖాలను అనుభవించినవారు. జన్మమునందు ఒకరు బ్రాహ్మణుడిగా, ఒకరు క్షత్రియుడుగా, మరొకరు శూద్రుడుగా జన్మిస్తారు.
- పూజా విధానము జనులందరూ కలిసి చేయు కీర్తనము, అర్చనలు, అభిషేకాలు లేవు. క్రియలు, కర్మలు లేవు. వైదిక సాంప్రదాయాలు ఏ మాత్రము లేవు. పూజారులు లేరు. ఇది సామాన్య ప్రజలకు అనుకూలించిన పూజ! సమష్టిగా సంఘంచే చేయబడునది. భక్తి మార్గ ప్రధానము. యాగాది, కర్మలకు, సాంఘిక భజనకూటములకు చాలా తేడా ఉంది.

భజన మందిరంలో మూల స్థానము, మూల స్థానములు అని స్థలాంతర భేదములు లేవు. అందరూ సమానంగా కూర్చొందురు. అందరూ దేవుడికి స్వయంగా వారి చేతులచే ఫల, పుష్పాలు అలంకరించి పూజిస్తారు. ధూప దీప నైవేద్యాలు గుళ్లలోని పూజా విధానాల అనుకరణాలు. ఇవి ఇక్కడ భజనకు సంబంధించినవి కావు. గుళ్ళు కర్మకాండ విధానానికి చెందినది, భజన అందుకు విరుద్ధమైనది.

---

[173] వ్యాసమంజరి:పుట.228

[174] వ్యాసమంజరి:పుట.228

హిందూ పరిణామ దశలో చివర వచ్చినవి భజనకూటములు. ఇవి ఉత్తమోత్తమమైనవి అని ప్రశంసించారు. అయినా ఈ భజనలలో కూడా కొందరు బ్రాహ్మణ పూజా విధానం ప్రవేశ పెట్టడం వల్ల భజనల లక్ష్యం దెబ్బతిన్నది. కొన్ని కారణాల వల్ల గ్రామాలలో భజనలు మానుకున్నారు. భజన కూటమిని గుడిగా మారిస్తే మనకు, సమాజానికి అంత మంచిది కాదు. గుడినే భజన కూటములుగా మారిస్తే భేదాలు తోలగి ఐక్యంగా ఉంటారు. తద్వారా దేశం ఐక్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇవన్నీ కట్టమంచి రామలింగారెడ్డిగారి సాధారణ వ్యాసాలతో పాటు, ఆయన సాంఘిక విమర్శ దృష్టిని తెలియజేస్తాయి. కేవలం సాహిత్యాంశాలే కాకపోయినా, చాలా విషయాలు సాహిత్యాంశాలతో ముడిపెట్టి రాయడం ఒక ప్రత్యేకత.

కట్టమంచి రామలింగారెడ్డి గారు ఏ విషయాన్నైనా తులనాత్మకంగా పరిశీలించడం ఆయన విమర్శలో కనిపించే ఒక ప్రత్యేకత. కవి జీవితం విమర్శలో తిక్కన, పింగళి సూరన, వేమనలను సమన్వయించినప్పటికీ ఆయన దృష్టి ప్రధానంగా తులనాత్మక విమర్శ గానే కనిపిస్తుంది. రంగనాథ రామాయణ కర్తృత్వాన్ని ఆయన వివిధ రామాయణాలతో పోల్చి విశ్లేషించడం కూడా ఈ విషయాన్నే నిరూపిస్తుంది. తులనాత్మక విమర్శలో కూడా సామాజిక, చారిత్రక అంశాలపై ఆయన దృష్టి కేంద్రీకరించారు. రంగనాథ రామాయణాన్ని వాల్మీకి రామాయణంతో పరిశీలించి అవాల్మీకులను గుర్తించారు. ఇక్కడ ఆయన ఒక పరిశోధక విమర్శకుడుగా కనిపిస్తాడు. రంగనాథ రామాయణంతో కంబ రామాయణాన్ని, బాసుని రామాయణ నాటకాలను కూడా తులనాత్మకంగా పరిశీలించాడు. రామాయణ తోపాటు భారతాన్ని, భాగవతాన్ని తులనాత్మక పరిశీలన చేసి దానిలోని వివిధ పాత్రలలో గల ఔచిత్య అనోచిత్యలను నిర్మొహటంగా విశ్లేషిస్తారు. భాగవతం కంటే హరివంశం ప్రాచీనమైనదని స్పష్టంగా చెప్పాడు.ముఖ్యంగా స్త్రీ పాత్రలను రామాయణంలోని సీత మహాభారతంలోని ద్రౌపది లను తులనాత్మకంగా పరిశీలించారు. ఇక్కడ కట్టమంచి వారికిగల పురాణేతిహాస పాండిత్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విధంగా ఆయన రామాయణ, భారత, భాగవతాలు, ప్రబంధాలను పరిశీలించడం ఒక విశిష్టమైన అంశం. ఆలంకారిక విమర్శ చేస్తున్నప్పటికీ, శైలి, పదాలు, శబ్దాలు వాటి సౌందర్యమంతా సామాజికాంశాలతోనే ముడిపడి ఉందనే పద్ధతిలో కొనసాగుతుంది. ఈ విధంగా ఈ అధ్యాయంలో ఆయన పాటించిన వివిధ విమర్శపద్ధతులను పరిశీలించిన తర్వాత సి .ఆర్ .రెడ్డి గారు తులనాత్మక విమర్శకుడిగానే ప్రధానం గా కనిపిస్తారు.

ఈ అంశాలన్నీ ఇంతవరకు ఈ అధ్యయంలో విశ్లేసించాను.రాబోయే అధ్యాయం లో విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి గారి స్థానాన్ని వివరించే ప్రయత్నం చేస్తాను.

## నాల్గవ అధ్యాయం

# విమర్శకుడిగా

# కట్టమంచి రామలింగారెడ్డి

## నాల్గవ అధ్యాయం

# విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి

కట్టమంచి రామలింగారెడ్డి గారు విమర్శ దృక్పథాన్ని గత అధ్యాయాలలో పరిశీలించాను. విమర్శకుడిగా ఆలంకారిక, సాంఘిక, కవి జీవిత, తులనాత్మక విమర్శ పద్ధతులలో ఆయన విమర్శ చేసినప్పటికీ తులనాత్మక విమర్శకుడుగానే ఆయన చేసిన కృషి కనిపిస్తోందని ఆ అధ్యాయాలలో గుర్తించాం. ఈ అధ్యాయంలో విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి గారి ప్రత్యేకతను ఆయన ప్రతిపాదించిన అంశాలను ఆయన విమర్శ దృష్టిని, దృక్పథాన్ని బట్టి ఆయన విమర్శ తత్వాన్ని నిరూపించే ప్రయత్నం చేస్తాను. దీనితో పాటు తెలుగు సాహిత్య విమర్శకులు చెప్పిన అభిప్రాయాల్ని కూడా దీనిలో క్రోడీకరించడం వల్ల విమర్శకుడిగా కట్టమంచి వారి కృషి స్పష్టమవుతుందని భావిస్తున్నాను. భారతీయ, పాశ్చాత్య సాహిత్య అధ్యయనంలో ఆయన చేసిన అధ్యయనాన్ని విమర్శ కృషిని ఆయన సమన్వయాన్ని ఈ అధ్యాయం లో ప్రత్యేకంగా పరిశీలించడం ఈ అధ్యాయం లక్ష్యం.

రామలింగారెడ్డి విమర్శనా దృక్పథాన్ని అధ్యయనం చేసే ముందు విమర్శకు సంబంధించి స్థూలంగా తెలుసుకోవడం అవసరం. కవికి పాఠకునికి మధ్య వారధి లాంటి వాడు విమర్శకుడు. కావ్యంలోని విషయాలను పాఠకుడికి సులభతరంగా అర్థమయ్యే లాగా చేయడం విమర్శకుడి పని. ఒక రకంగా విమర్శకుడు కవితో సమానమైన వాడు. పాశ్చాత్య విమర్శకులు అధికశాతం మహాకవులని పేరు గాంచిన వారు. వర్డ్స్ వర్త్, కాల్ రిడ్జ్, షెల్లి, ఆర్నాల్డ్ వీరంతా కవులుగా ఎంత పేరు పొందారో విమర్శకులుగా కూడా అంతటి పేరు గడించారు. తెలుగులో కవి విమర్శకులు ఒకరిలోనే ఉండటం అరుదు. కవి కాని విమర్శకులు చేసే విమర్శ కంటే కవియే విమర్శకుడై చేసే కావ్య విమర్శ విలువైన విమర్శ అవుతుంది.

తెలుగులో విమర్శ అనేది ఒక పక్రియగా ఉంది. ఇది ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులోకి వచ్చింది. ఆంగ్లంలో విమర్శని criticism అంటారు. Criticism అనే పదాన్ని ఆంగ్లంలో క్రీ.శ.17వ శతాబ్దం నుండి సాహిత్యపరంగా వాడుచున్నారు. ***The conscious of evaluation of appreciation of a work of art either according to the critics personal taste***[1].

విమర్శకుని స్వాభిరుచిని అనుసరించి హృదయాంతర్గత భావ పరిణామము గానీ, కళాత్మక శిల్పముగా అభినందించుట గానీ విమర్శ అనవచ్చు. ఈ criticism అను పదాన్ని విస్తృత పరిధిలో ప్రయోగించారు. గుణదోష నిర్ణయం నుండి శిల్ప రమణీయం వరకూ చెప్పే ప్రతి అంశాన్ని criticism అనే పదం కిందనే వాడటం జరుగుతుంది.

ఎవరు ఎన్ని అర్థాలు, వివరణలు, వ్యాఖ్యానాలు, విమర్శకు ఇచ్చినప్పటికీ అందరూ సూత్రప్రాయంగా అంగీకరించినది 'To judge' వాస్తవ పరిశీలన  విమర్శ అని చెప్పవచ్చు.

### 4.1 విమర్శ లక్షణాలు:

విమర్శ ఆంగ్ల సాహిత్య ప్రభావంతో రావడం వల్ల పాశ్చాత్యులు చెప్పిన విమర్శ లక్షణాలను పరిశీలిద్దాం.

కావ్యాన్ని చదివినప్పుడు తన హృదయాంతర్గత భావాన్ని తిరిగి వ్యక్తీకరించుటయే విమర్శ అగును. ఒక కావ్యాన్ని గానీ, ఒక గ్రంథాన్ని కానీ చదివినప్పుడు తనకు అనిపించిన గుణ దోషాలను తార్కిక దృష్టితో విమర్శకుడు వ్యక్తీకరిస్తారు.

***I had much rather know what I should feel like it I adopted the believes of Lucretius than how Lucretius would have felt if he had never entertained them.***[2]

విమర్శకుడు తన మనస్సులో అనుభూతి చెందిన తీరును స్పష్టంగా, సక్రమంగా, సహేతుకంగా, ఆకర్షణీయంగా చెప్పడానికి కొంత శక్తి సామర్థ్యాలు సంపాదించవలసి ఉంది. కవికి గల కొన్ని ప్రధాన లక్షణాలతో పాటు, మరికొన్ని అదనపు శక్తులు కలిగి ఉన్నప్పుడే విమర్శకుడు తన పనిని సక్రమంగా నిర్వర్తించగలరు.

---

[1] Dictionary of world literary terms, forms, technique, criticism.pg:66

[2] A P REFACE TO PARADISE LOST.pg:64

*The good critic is one who recognizes that it is only because he knows as much as he does that he is able to discriminate at all.* [3]

జీవితంలో ఎక్కువ భాగము చదవడానికి వెచ్చించి అనేక రచనలను చదివి ఆకళింపు చేసుకొన్న విమర్శకుడు కవి కంటే గొప్పవాడుగా పరిగణించబడతాడని R.J. Rees అనే విమర్శకుని అభిప్రాయం.

*The opinion of a man who has spent a great part of his life for reading and studying the poetry of others, is probably more worth having than that of a practitioner who has read less.*[4]

ఈ అభిప్రాయం విమర్శకుడు అనేక గ్రంథాలను చదివి జ్ఞానాన్ని సంపాదించినవాడై ఉండాలని చెప్తుంది.

*Criticism can never be a science; as D.H. Laurence stated that it is in first place much too personal and in the second is concerned with values that science ignores all claims to turn literary study into a science; says how are external dubious.*[5]

ఒక కాలం నుండి మరొక కాలానికి వచ్చేసరికి విమర్శలో కొంత మార్పు వస్తుంది. ఈ అభిప్రాయాన్ని పరిశీలిస్తే విమర్శ శాస్త్రం కన్నా కొంత భిన్నంగా తోస్తుంది.

ప్రతి రచయితయందు రచయిత, విమర్శకుడు అని ఇద్దరు ఉంటారు. వాళ్లిద్దరూ భిన్న భిన్న పరిస్థితులలో బయటపడతారు.

1) విమర్శక కవి:విమర్శకుడు కవిగా కూడా ఉండవచ్చును.

2) విమర్శకుడు: కేవలం విమర్శకుడిగా కూడా ఉండవచ్చు.

విమర్శకుడుకావ్యాన్నిచదువుతున్నప్పుడుఅతని హృదయాంతర్గత భావములలో జరుగు భావ పరంపరలను I.A. Richards ఈ విధంగా తెలియజేశారు.

*What gives the experience of reading a certain poems its value? How is this experience of reading a certain poem its value? How this experience better than another? Why prefer this picture to that? In*

[3] The literary critics.Pg:227

[4] introduction to english literature.Pg:233

[5] style and stylistics.Pg:46

***what way should we listen to music so as to receive the most valuable moment? Why is one opinion about the work of art as good as another?***[6] వీటన్నింటి సమాధానమే విమర్శ యొక్క సమగ్ర స్వరూపం అని చెప్పవచ్చు.

కావ్యం యొక్క గుణ దోషాలను పరీక్ష మూలంగానే నిర్ణయించాలని కాళిదాసు "మాళవికాగ్ని మిత్రం"లో చెప్పారు.

**"పురాణ మిత్యేవ న సాధు సర్వం, నచాపి కావ్యం నవమిత్యవద్యం**
**సంతః పరీక్షాన్యతరత్ భజంతే, మూఢః పరప్రత్యయనేయ బుద్ధిః"** [7]

విమర్శకుడు కావ్యాన్ని, గ్రంథాన్ని అందులోని విశేషాంశాలను అర్థం చేసుకోవడానికి దారి చూపుతాడు అంతే కానీ అతని అభిప్రాయమునే ప్రమాణంగా తీసుకోరాదని R.J. Rees ఈ విధంగా చెప్పారు.

***The good critic is the map-maker or the guide whose assistance invoke setting out to explore that vast and ill-defined territory... he is neither ruler nor creator of the territory which he conducts us.***[8]

సహృదయుడు, స్వతంత్రుడు అయిన పాఠకుడు విమర్శకుని పైన గుడ్డిగా ఆధారపడకూడదు. విమర్శలోని నిజనిజాల్ని పాఠకుడు స్వంత బుద్ధితో ఆలోచించి స్వీయానుభూతినే ప్రమాణంగా ఎంచుకోవాలి.

"*విమర్శకు వర్ణనం, విశ్లేషణ, వివేచన, సమన్వయం, అనుశీలనం అనేవి ప్రధాన లక్షణాలు*[9]" . విమర్శకుడు విమర్శించే ముందు సహృదయంతో రచనను అధ్యయనం చేసి అనుభూతికి తెచ్చుకోవాలి. శాస్త్రీయమైన అధ్యయనం, విషయైక దృష్టి సత్యాన్వేషణ విమర్శకుడికి అవసరమైన లక్షణాలు. విమర్శలో విషయనిష్ఠమైన గుణదోష పరిశీలన ప్రధానంగా ఉండాలి. విమర్శకుడు ఓ కవి దర్శనాన్ని పరిశీలించిన తరువాత, ఆయన రచనలోని సాహిత్య, సాహిత్యే తర అంశాలను విశ్లేషించి దాని విలువ నిర్ణయిస్తాడు. రచయిత దృక్పథాన్ని వివరిస్తాడు. సరైన విమర్శకుడు వైయక్తిక దృష్టితో రచనకు ప్రశంసల దండ వేయకుండా, దానిలోని లోటు పాట్లను కూడా వివరిస్తాడు. పాఠకుని అనుభూతి సమగ్రతకు

---

[6] Literary criticsm.Pg:141
[7] మాళవికాగ్నిమిత్రము.పుట: 8
[8] An introduction to english literature.Pg:260
[9] జీవియస్ వ్యాసాలు: పుట:16.

సహాయపడతాడు. రచయిత చైతన్య స్థాయి ఎదగడానికి దోహదం చేస్తాడు. విమర్శకుడికి సాహిత్య, సామాజిక శాస్త్రాలతో, సాంస్కృతికాంశాలతో గాఢమైన అభినివేశం ఉండాలి. రచనలు వెలువడిన కాలమాన పరిస్థితులని, రచయిత అనుభవాన్ని ,దృక్పథాన్ని విమర్శలో చూపెట్టాలి. ఆర్. ఎస్. సుదర్శనం అన్నట్టు ***"కవి వ్యక్తిత్వానికి సంఘానికి, కావ్యానికి గల మౌలిక సంబంధాన్ని గుర్తించలేని విమర్శ వెర్రితలలు వేస్తుంది.[10]"*** విమర్శకుని దృక్పథం ఏదైనా ఒక రచనలోని వస్తువుని, పాత్రల స్వరూప స్వభావాన్ని, సామాజిక భూమికను నిర్మాణ శిల్పాన్ని ప్రతిపాదిత తత్వాన్ని అనుశీలించాలి. చారిత్రక పరిణామ క్రమంలో ఆ రచనా స్థానాన్ని అంచనా వేయాలి. ***అనుశీలన*** అన్న గ్రంథంలో వడలి మందేశ్వర రావు విమర్శకుడి లక్షణాలను ఈ విధంగా చెప్పాడు.[11] అవి

1. విమర్శకుని ప్రధాన లక్షణం భావుకత. కవి ప్రయాణం చేసిన మార్గాన్నే విమర్శకుడు పయనాన్ని సాగించాలి. (పుట: 33)
2. కావ్యాన్ని చూడగానే తొలుత కనపడేది శబ్దం. ఆ శబ్దం యొక్క లక్షణం విమర్శకుడికి తెలియాలి. ............ శబ్దం ఔచిత్యాన్ని విచారించడమే కాక, అది సహృదయునిలో కలిగించే హృదయ స్పందనాన్ని కూడా అతడు వినగలగాని. (పు : 33)
3. సాహిత్యంలో విశిష్ట స్థానమున్న కవి ఏ రెండు యుగాలకు ఒకే విధంగా కనపడక పోవచ్చు. కాలంతో పాటు భాష, అభిరుచులు, సారస్వతపు విలువలు, సాహిత్య ప్రక్రియలు మారడం వల్ల, ఆ కవిని చూసే పద్ధతిలో మార్పులు తప్పనిసరి అవుతాయి. అందుకే ఏ యుగానికాయుగం, ఏ తరానికాతరం కవిని పరిశీలించుకుని అవగాహన చేసుకోవలసిన అవసరం ఏర్పడుతుంది విమర్శకునిలోని భావకుడు దీన్ని బాగా ఆకళింపు చేసుకోవాలి.( పు: 39)
4. సాహిత్యాన్ని పరీక్ష చేయటానికి విమర్శకునికి ప్రధానంగా అలవడవలసిన, అలవరచుకోదగిన లక్షణం నిర్మమత. (పుట : 40)
5. విమర్శకుని మూర్తి మత్వం విమర్శలలో ప్రతిఫలించడం మంచిది కాదు. విమర్శకుని స్వాతంత్ర్యం, అతని ప్రతిభ విమర్శలో ప్రతిఫలిస్తే ప్రమాదం లేదు. కాని అతని ఇష్టా

[10] సాహిత్యంలో దృక్పధాలు:పుట: 1

[11] అనుశీలన,పుట:33

ఇష్టాల్ని విమర్శలో ప్రతిఫలిస్తే అది విమర్శకాక రచయిత యొక్క అభిరుచిని బట్టి ఇచ్చే వ్యాసం అవుతుంది. (పు: 42)

6. విమర్శకుడు కవి వంటి వాడే ..... తన అభిమానాలకు పూర్తిగా ప్రత్యేకమైన దృక్పథాన్ని కూడా సౌమనస్యంతో కవి ఏ దృక్పథంతో చూశాడో ఆ దృష్టితో చూడటం ఎంత కష్టమైనా విమర్శకుడికి అవసరం. (పు: 42)
7. సాహిత్య సిద్ధాంతాలకు లోబడి జరిగే విమర్శలు కొన్ని ఉన్నాయి ఇటువంటి సందర్భాలలో మమకారాలకు అసలే అవకాశం లేదు. ఉన్న కావ్యాలను నిర్ణీతమైన సూత్రాలతో శాస్త్రీయమైన పద్ధతులతో పరిశీలించడమే ఇక్కడ విమర్శకుని పని. (పు: 42)
8. కవి సమకాలిక జగత్తు స్పందనలను తన కావ్యంలో వినిపింపచేస్తాడు. విమర్శకుడు సమకాలీన సహృదయులలో ఆ కావ్యం కలిగించే స్పందనలను తన విమర్శలో వినిపింపచేస్తాడు. (పు: 43)
9. నిరంతర కావ్య పఠనం వల్ల పదును తేలిన హృదయంతో సాహిత్య సిద్ధాంతాలని మదించాలి. వాటి విలువలను మదింపు కట్టాలి. విమర్శకు అలంకార శాస్త్రంలోని పారిభాషిక పదాలు తూకపు రాళ్ళలా ఉండకూడదు. (పు: 52)
10. విమర్శకునికి చారిత్రక దృక్పథం చాలా అవసరం. ..... కవి దేశకాలాలతో ఆరంభమై కవిగా అతడు పోషించినా విలువలతో, సాధించిన సాహిత్య గుణాలతో సాగిపోయి, సమస్త సాహిత్యంలోనూ అతని స్థానాన్ని నిర్ణయించడానికి తోడ్పడేటట్లుగా ఉండాలి. (పు: 53)
11. విమర్శకునికి ప్రధానంగా కావాల్సినవి కేవలం రచయిత జీవితంలోని జాబితాలు కావు. విమర్శకుడతని భావుకతలోని వైవిధ్యాన్ని, మేథలోని నైశిత్యాన్ని పరిశీలించాలి. ఇవి రచనల్లో సహస్ర ముఖాలుగా ఎలా విస్తరిల్లి, రచయిత ఎలా ద్రష్ట కాగలిగాడో కూడా విమర్శకుడు నిరూపించాలి. (పు: 13)

విమర్శకునికి ప్రతిభ, పాండిత్యమే కాదు. ఓర్పు, నేర్పు కూడా చాలా అవసరం. విమర్శకుడు నిర్లక్ష్యంగా కాక బాధ్యతాయుతంగా శాస్త్రీయమైన ప్రామాణిక దృష్టితో పరిశీలించాలి. మంచి రచనలు రావడానికి సరైన విమర్శ దోహదం చేస్తుంది. రాచమల్లు

రామచంద్రా రెడ్డి అన్నట్లు సమకాలీక సజీవ రచనల మీద సరైన విమర్శ సాహిత్య వికాసానికి చాలా అవసరం...... ***ఒక రచనలో దోషం చూపించాలంటే ఎంతో ఆత్మవిశ్వాసం ఉండాలి. దీర్ఘ వాదోపవాదాలకు సిద్ధమై ఉంచాలి. కొంతైనా సాహసం ఉండాలి. సాహిత్యం ద్వారా సమాజ శ్రేయస్సులాంటిది ఏదో సాధించవచ్చనే విశ్వాసం బలంగా ఉన్న వాళ్లే సాహసం చేయగలరు.***[12] ***సాహిత్యాన్ని ముందు హృదయంతో ఆస్వాదించిన తరవాత మేధతో***[13] పరిశీలించేవాడే ఉత్తమ విమర్శకుడవుతాడని ఆయన భావించాడు. ఉదాత్తమైన సాహిత్యం పాఠకులను చేరడానికి ఉత్తమ విమర్శకు అవసరం ఎంతైనా ఉంది. ఉత్తమ విమర్శల వల్లనే రచనలకు ప్రచారం లభిస్తుంది గుర్తింపు పెరుగుతుంది. వ్యక్తుల బుద్ధి వికాసమే కల యొక్క సాంఘీక ప్రయోజనం కాబట్టి సాహిత్య అభిలాష పెంపొందించాలి. కొడవటి గంటి కుటుంబ రావు భావించినట్లు ***విమర్శనాశక్తి పెరగనిదే సాహిత్యాభిలాష పెరగదని కూడా గమనించాలి.***[14] విమర్శించడం అంటే మెచ్చుకోవడమూ, తెగడటమో కాదు. విమర్శ శాస్త్రీయంగా నిర్వహించబడాలి. వ్యక్తిగతమైన దూషణ భూషణలకు దానిలో చోటివ్వకూడదు. అవసరాన్ని బట్టి విమర్శకుడు ప్రతి విమర్శకులు చేయాలి. ఒక రచనను విశ్లేషించి సాహిత్య చరిత్రలో దాని విలువను అంచనా వేసేవాడు విమర్శకుడు. రచయిత స్థానాన్ని విమర్శకుడే నిర్ణయిస్తాడు. భావుకత నిర్మమత లోతైన అధ్యయనం మానవత్వం సహృదయత కలవాడే మంచి విమర్శలు వెలయిస్తాడు.

ఈ లక్షణాలన్నీ కట్టమంచి రామలింగారెడ్డిగారిలో కనిపిస్తాయి. ఈయన కేవలం విమర్శకుడు మాత్రమే కాదు, కవి, కూడా అని ఇంతకుముందే పరిచయం చేసుకున్నాం. అందువల్ల సృజనశీలమైన అనేక అంశాల్ని తన విమర్శలో లోతుగా విశ్లేషణ చేయగలిగారని ఆయన విమర్శను బట్టి చెప్పవచ్చు. పాశ్చాత్యుల్లో కవులు విమర్శకులుగా, విమర్శకులు కవులుగా ఉన్నారు. ఈ లక్షణాలు ఎన్నో కట్టమంచి వారిలో కనిపిస్తాయి. ఎందుకంటే పాశ్చాత్య దేశాల్ని పర్యటించారు. యూరోపియన్ సాహిత్యాన్ని బాగా చదువుకుని పాశ్చాత్య భావాలను తనలో ఇముడ్చుకున్నవాడు. అందువల్ల భారతీయ సాహిత్యాన్ని కూడా పాశ్చాత్య సాహిత్య

[12] సారస్వత వివేచన:పుట: 27

[13] సారస్వత వివేచన, పుట:41

[14] సాహిత్య ప్రయోజనం:పుట:132

ప్రభావంతో పరిశీలించేనేర్పు ఆయనలో కనిపిస్తుంది. అదే ఆయన భారత, భాగవత, రామాయణాది విషయాలను విశ్లేషించే సమయంలో కూడా ప్రదర్శించారు. భారతీయ సంఘ పరిస్థితులతో ప్రేరణ పొందిన మానసిక పరిపక్వత కలవారు.

సంప్రదాయం అనే పదానికి విశాలమైన అర్థం ఉంది. Traditional doctrine of knowledge అని నిఘంటువు అర్థం. Tradistion is the handing of the past to the present అని మరొక నిర్వచనం. ఈ నిర్వచనాన్ని పరిశీలిస్తే రామలింగారెడ్డి పూర్వ సంప్రదాయాలను ఆధునిక రీతితో సరిపోల్చి ఒకరకమైన తులనాత్మక విమర్శ చేశాడనిపిస్తుంది. సాంప్రదాయ ప్రభావం కట్టమంచి పై కొంత ఉన్నా ఆయన ఆ ప్రభావంలో మునిగిపోలేదు. పాశ్చాత్య పద్దతులు వీరి సంప్రదాయజ్ఞతలో మార్పులు తెచ్చాయి. రాజకీయంగా, అర్థశాస్త్ర రీత్య వీరిపై పాశ్చాత్య ప్రభావం ఎక్కవగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఇదే వీరి సాహిత్య విమర్శ లోనూ కనిపిస్తుంది. నా మనసు స్వదేశీయం నా ఉదరం విదేశీయం అన్న రెడ్డి గారి మాటలను బట్టి చూస్తే ఆయన స్వదేశీ విదేశీ భావ చర్చలోలితుడేమో అనిపిస్తుంది.

సి. ఆర్. రెడ్డి పాశ్చాత్య విమర్శనా పద్ధతుల్లో తెలుగు సాహిత్యాన్ని విమర్శించారు. అది పూర్తి అనుకరణ కాదు. మన సంప్రదాయంలో లేని మెరుగైన విషయాలను గ్రహించడం వివేకవంతుల లక్షణం. ***విదేశీయులకు మేలైనవన్ని మనకు కావు. వారి రాజతంత్రాలు మనకు పనికి వస్తాయని గ్రహించరాదు అని రెడ్డి గారు వివరించారు.***[15] మాతృ భాషలోని పాండిత్యం వీరికి సహజసిద్ధంగా వచ్చింది. ఆంగ్లభాషా ప్రావీణ్యం స్వయంకృషితో నేర్చుకున్నారు. ప్రపంచ చరిత్ర పోకడలు వీరికి కరతలామలకం. చారిత్రకంగా భారతీయ దాస్యానికి గల కారణాలను వీరు విమర్శలో పరిశీలించారు. తెలుగు ప్రబంధాలను సంఘ ప్రయోజన దృష్టితో వివేచన చేశారు. సాహిత్యానికి ఆనందమే గాక దేశ భవిష్యత్తుని తీర్చిదిద్దే శక్తి సామర్థ్యాలు కలిగి ఉండాలన్న అభిప్రాయాన్ని ప్రకటించారు. వీరు కళాపూర్ణోదయం విమర్శలోని అభిప్రాయాలు కొన్ని ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

***"ఆర్య దాస్యం వదిలి ఆంగ్లేయ దాస్యంలో బడుట యేమాత్రం మంచిది కాదు. ఎట్టి పారతంత్ర్యమును స్వాతంత్ర్యమునకు నీడు కాదు. సాతంత్ర్యమనగా ఒరులతో సంబంధము లేక యుండుట కాదు. మరి మన బుద్ధిని ప్రయోగించి ఎన్ని కాలముల ఎన్ని దేశముల యందలి***

---

[15] భారత అర్థశాస్త్రము:పుట.14

*గుణములను సాధ్యమైనంతవరకు గ్రహించి మనలో జీర్ణము చేసుకొనుట మంచిదన్న"*[16] రెడ్డి గారి అభిప్రాయంలో పాశ్చాత్య ప్రభావం ఏమాత్రం ఉందో గ్రహించవచ్చు. సాంప్రదాయం కాలానుగుణంగా మారడం వల్ల దీనికి జీవం ఏర్పడుతుంది. మన ప్రాచీన సంప్రదాయాలన్ని సక్రమమైనవని వాటిని యధాతధంగా అనుకరించడం ఎంత పొరపాటో  పాశ్చాత్య సాంప్రదాయాలు మనకు సరిపోవని, ఆధునిక భావాలు అర్థం లేనివని అనుకోవడం పొరపాటే. సాంప్రదాయాన్ని యోచన లేకుండా సంక్రమింప చేసుకోవడం ఉచితం కాదని నవ్యతని ఆస్వాదించడం శ్రేష్టమని జాన్ ఇలియట్ అభిప్రాయపడ్డారు.

నాగరిక ప్రపంచంలో మానవుడు  ప్రపంచవ్యాప్తంగా ఉన్న విషయాలను పరిశీలించి వాటి లోని సత్సంప్రదాయాలను చేజిక్కించుకొని మానసిక అభివృద్ధిని తద్వారా దేశ అభివృద్ధిని సాధించుకోవాలి అన్నది రెడ్డి గారి అభిప్రాయం. మన సంస్కృతికి గిరి గీసుకుంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఏ రంగంలోనూ అభివృద్ధి సాధించాలేమని ఆయన వివరించారు. సాంప్రాదాయోల్లంఘనం అంటే కొందరికి భయం. ముఖ్యంగా కవులు పాత పద్ధతులను అనుసరించి సాహిత్య స్థబ్ధతకు కారణమయ్యారు. ఆనాటి సాంఘిక పరిస్థితులు వారినలా నడిపించాయని రెడ్డి గారు గ్రహించారు. సాహిత్యంలో కొత్తదనం తీసుకురావాలన్న ఆశావాదం నూతన సాంప్రదాయాన్ని సృష్టించి మనలోని భేషజాన్ని వదిలించాలన్న ఆపేక్ష  వీరి విమర్శలో కనిపిస్తుంది. ప్రాచీన సాంప్రదాయ విమర్శనా పద్ధతులను వీరు తడిమి చూపలేదు అందువలన మీరు ప్రాచీన పద్ధతులను ఎరుగని వారని చాలా మంది విమర్శకుల అభిప్రాయం కానీ రెడ్డి గారు ప్రతి చిన్న విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించేవారు.

పూర్వకవులు పురాణాల నుండి చిన్న చిన్న కథలను తీసుకొని కావ్యాలు రాసేవారు. ధర్మ అర్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలుని సాధించాలనే ఉద్దేశం కవులకు ఉండేది. ధర్మం అర్థం కామ మోక్షాలు సంగతి అటుంచి అర్థాజన జరగాలంటే రాజుల ప్రాపకం ఉండాలి. వారి ప్రాపకం కోసం ఎన్నో ప్రబంధాలు వెలువడినాయి. ఈ గ్రంథాలు గ్రహీతల ఆమోదంకోసం రాయబడినవి కాబట్టి సంఘపరమైన ఆలోచనలకు తావు ఉండేది కాదు. ఇటువంటి సాహిత్య సృష్టి రెడ్డి గారికి నచ్చలేదు. కవుల్లో ఉన్న అర్థాజనతత్వం పారద్రోలి కవిత్వం ప్రజా క్షేమం కోరి వెలువడేదిగా ఉండాలని వీరు భావించారు. వేదాలు,భగవద్గీతలు

[16] సి.ఆర్.రెడ్డి.పీటికలు:పుట.74

మన సాహిత్యంపై ఎన్నో చెరపని ముద్రలు వేశాయి. కవులు సంప్రదాయం పేరుతో కొన్ని నిశ్చిత అభిప్రాయాలను కలిగి రచనలు చేయడం చూస్తే రెడ్డిగారికి వేదాల్లో లేని విషయాలు సృష్టించినట్లు అర్థమైంది. ఇష్టం వచ్చినప్పుడల్లా వేదాలని సాక్ష్యానికి పిలవడం వేదాల్లో ఇలా చెప్పబడి ఉంది అలా చెప్పబడి ఉందని ఉన్నది లేనిది కల్పించి చెప్పడం రెడ్డి గారికి నచ్చలేదు.

కావ్య ప్రయోజనం ప్రధానంగా ఆనందమని ఆలంకారికుల అభిప్రాయం. భరతుని నిర్వచనంలో లోకోపదేశం మమ్మటుని నిర్వచనంలో ఉపదేశం కావ్య ప్రయోజనాలుగా కనిపిస్తాయి. పాశ్చాత్యులలో కూడా చాలామంది ఆనంద ఉపదేశాలు కావ్య ప్రధాన గుణాలుగా పేర్కొన్నారు. వర్డ్స్ వర్త్, డ్రైడెన్, బ్లేక్ మొదలైన వారు ఆనందం ప్రధానమని, మిల్టన్ నీతి బోధ ప్రధానమని, ఫిలిప్ సిడ్నీ ఆనంద సందేశాలు రెండు ముఖ్యమైనవని అన్నారు. కావ్య ప్రయోజనం విషయంలో ప్రాచీన ఆలంకారికులకు పాశ్చాత్యులకు పెద్ద వ్యత్యాసం లేదు. అలాగే కవిత్వతత్వ నిర్వచనంలో కూడా పెద్ద తేడా ఏమీ కనిపించదు. కవిత్వ నిర్వచనం ప్రయోజనాల విషయంలో రెడ్డి గారి భావం సమాజ అభ్యుదయ పరంగా ఉంటుంది. కవితజగత్తు వాస్తవజగత్తు కంటే భిన్నమైనది కాదని కవి పాఠకుని అనుభూతులను కూడా అర్థం చేసుకొని రాయాలని రెడ్డి గారి అభిప్రాయం. డాక్టర్ జాన్సన్ సాధారణ మానవ ప్రకృతిని యధాతథంగా చిత్రించడం చేయాలి అని చెప్పిన నిర్వచనానికి ఇది దగ్గరగా ఉంది. ఒక విధంగా పరిశీలిస్తే జాన్సన్ ప్రభావం రెడ్డి గారిపై పడి ఉండవచ్చు.

### 4.2 రామలింగారెడ్డి సాహిత్య విమర్శపై – పాశ్చాత్య ప్రభావం

పాశ్చాత్య పద్ధతులపై గల అభిమానం సాహిత్య శ్రేయస్సుకు సంఘ పురోభివృద్ధికి దోహదం చేసేది అయితే దానిని మన్ననలతో స్వీకరించాల్సి ఉంటుంది. సాహిత్య విమర్శ అనగానే కట్టమంచి రామలింగారెడ్డి గుర్తుకు వస్తారు. ***తెలుగులో సాహిత్య విమర్శ ఆధునిక యుగము నందు అవతరించిన ఒక సాహిత్య ప్రక్రియ. ఇది అవతరించిన తొలి దశలో ప్రాయకంగా రంధ్రాన్వేషణ తత్పరతతో పరస్పర నిందారోపణలతో తర్జనభర్జనలతో కండన మండనములతో కొండొకచో వ్యక్తి దూషణములతో సైతము సాగుతూ వచ్చిన విమర్శనా ధోరణికి కొత్త రూపాన్నిచ్చినది రెడ్డి గారికి ఉన్న పాశ్చాత్య సాహిత్య సంపర్కం.***[17]

[17] అనంతరాగం:పుట.210

భావనాత్మకమైన కావ్య సృజనశక్తియు వస్తు తత్వ వివేచనాత్మకమైన కావ్య విమర్శ ప్రజ్ఞయు నోకే వ్యక్తిలో నెలకొని యుండుట అసంభవము కాకపోయినను అసాధారణం. అట్లు ఉండుటయే తటస్థించినవాడు ఆ వ్యక్తిచే రచింపబడిన కావ్యం కళాకౌశలభూషితము తత్కృతమైన విమర్శనము రసవంతతమ్మును నగును. అట్టి వానిని కేవలం విమర్శకుడని గాని కవి అని గాని కాకుండా విమర్శక కవి అని పేర్కొనదగును. ***ఆంగ్లేయ సారస్వతమున నిట్టి ఉభయ ప్రజ్ఞము గల మహనీయుడు గత శతాబ్దిలో మ్యాత్యూ ఆర్నాల్డ్, ఆంధ్ర సారస్వతమున ఈ శతాబ్దంలో కట్టమంచి రామలింగారెడ్డి గారు.***[18]

ఆర్నాల్డ్ కు పూర్వం విమర్శకులు ఉన్న వారి కన్నా భిన్నంగా కావ్య వస్తువు కావ్య ప్రయోజనం విషయాలలో శ్రద్ధ చూపించే వ్యక్తి ఇతడు. ప్రాక్పశ్చిమ దేశ సాహిత్య గ్రంథాలు చదివి వాటి ఆదర్శాలని, వాటి ప్రయోజనాన్ని అవగతం చేసుకుని నవసమాజ నిర్మాణానికి కావలసిన పరివర్తన రచనల ద్వారా తీసుకురావచ్చు  అన్న పరిపూర్ణ విశ్వాసంతో సమాజ వైఖరులపై సూక్ష్మ దృష్టి పరచి వివేచన జ్ఞానంతో అత్యంత ఆధునిక రీతులలో సాహిత్య విమర్శకు పునాదులు వేశారు. ప్రాచీన కావ్య విమర్శలోని ఛాయలను తుడిచి వేశారు. తెలుగు కవులలో పింగళి సూరన కు ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించిన విమర్శకుడు కట్టమంచి రామలింగారెడ్డి. విమర్శకుడు తాను ఎన్నుకునే గ్రంధాన్ని బట్టి విమర్శనా విధానాన్ని మార్చుకోవలసి ఉంటుంది అన్న నూతన ఉద్దేశాన్ని కల్పించినవారు రామలింగారెడ్డి గారు. ప్రబంధాలలో కనిపించని ప్రత్యేక గుణ విశేషాలను కళాపూర్ణోదయం ప్రభావతీ ప్రద్యుమ్నంలో వీరు గుర్తించారు. రామలింగారెడ్డి 1894లో కళాపూర్ణోదయం పై విమర్శ వ్యాసం రాసేనాటికి విమర్శకుడిగా ప్రసిద్ధి చెందలేదు. కావ్య పఠనానంతరం తనలో కలిగిన స్పందనకు వివరణాత్మకంగా వ్యాఖ్యానించగలిగే ప్రతిభ వారిలో ఉన్నది. కావ్యావిష్కృతి జరిగాకనే విమర్శకుల ఆవిష్కృతం జరుగుతుంది. కవి వెనకనే విమర్శకుడు ప్రాధాన్యత వహిస్తాడు. కవి లేనిదే విమర్శకుడు లేడు కావ్యం లేనిదే కావ్య విమర్శ లేదు. విమర్శకులెందరో కావ్య రచన కన్నా కావ్య విమర్శనా శక్తి  కష్టమని తెలిపినారు.  వస్తువు తయారీ ముడిసరుకులపై ఆధారపడినట్లే కావ్య విమర్శ కావ్యం పై ఆధారపడి ఉంటుంది. రెడ్డి గారి విమర్శకి పూర్వం కళాపూర్ణోదయంని ఎవరు ఉత్తమ కావ్యం గుర్తించినట్లు కనపడదు. సద్విమర్శ వలన ఉత్తమ

---

[18] గౌతమవ్యాసములు:పుట.106

గ్రంథ అవతరణకు అవకాశం ఏర్పడుతుంది. కావ్యానుభూతి పాఠకునుకి లభిస్తుంది. సంఘాన్ని దృష్టిలో పెట్టుకుని సహృదయపూర్వకంగా విమర్శించే విమర్శకుని వలన గ్రంథ సంస్కారం, గ్రంథ సంస్కారం మూలంగా సంఘసంస్కరణ కలగగలదన్న ఆశాభావాన్ని ఉదయింపనిచేసిన వారు కట్టమంచి రామలింగారెడ్డి. తండ్రి సమక్షంలో జరిగిన భారత, భాగవత, రామాయణ కావ్య చర్చలలో పాలుపంచుకున్న రెడ్డి భారత భాగవత రామాయణ కావ్య మాధుర్యాన్ని చవిచూశారు. వాటి రచనా శైలిని చూసిన తర్వాత ప్రబంధాల రచనాశైలిపై ఏవగింపు కలిగింది. ఆ ప్రబంధాల్లో నూతన కల్పన పద్ధతులున్న కళాపూర్ణోదయం రెడ్డి గారిని ఆకర్షించింది. విమర్శకుడికి కవికి వలె కావ్య రచనపై ఉన్న ఏకాగ్రత, చిత్త శుద్ధి, ప్రపంచ జ్ఞానం, పాండిత్య పరిచయం సహృదయం ఉన్నా గాని రాణింపురాదు. అన్నింటికంటే మిన్నగా విమర్శనాత్మక శైలి సర్వమానవ విదితంగా, సులభగ్రాహ్యంగా, ఆకర్షణీయంగా ఉంటేనే అది సమాజ పరంగా కొంత ప్రయోజనాన్ని సాధించగలుగుతుంది. రేఖా ప్రాయంగా ఉన్న విమర్శనా విధానానికి వీరు మెరుగులు దిద్దారు. రెడ్డి గారు విదేశాల నుండి తిరిగి వచ్చిన తర్వాత వావిళ్ల వారి కోరిక మేరకు విమర్శ వ్యాసం తిరిగి రాశారు. ఆయనకు తెలియకనే తన భావాలలో మార్పు వచ్చిన విషయం వారు గమనించారు. కవిత్వతత్వం సాహిత్య క్షేత్రంలో నూతన మార్గాన్ని ఏర్పరిచింది.రామలింగారెడ్డి భావాలు చాలా వరకు పాశ్చాత్య పద్ధతులను అభిమానించేవిగా ఉంటాయి. ఒక్క విమర్శలోనే గాక ఇతర విషయ సంబంధంగా కూడా పాశ్చాత్య పద్ధతులపై మొగ్గు చూపారు. పాశ్చాత్య విద్యా బోధన శాస్త్ర ప్రకారం జరుగుతుందని అందుకే ప్రజా అభివృద్ధిని సాధించగలుగుతున్నదని భావించి పురాణ పద్ధతిలో నడిచే మన విద్యావిధానాన్ని మార్చినట్టే విమర్శను కూడా మార్చి సఫలీకృతుడు అయ్యాడు.

పాశ్చాత్య సంప్రదాయం ప్రకారం ట్రాజడీకి సమాంతరమైన విషాదాంత కావ్యాన్ని సాహిత్యంలో ప్రవేశపెట్టారు. వీరి ఉపన్యాసాలలో, వ్యాసాలలో పాశ్చాత్య రచయితల, విమర్శకుల అభిప్రాయాలు ఉదహరిస్తూ ఉంటారు. I agree with russel, I agree with moore ఇలాంటి మాటలు వారి నుండి వస్తూ ఉంటాయి. ఆ కాలంలో hegellians అనబడే బ్రాట్లే, బోసన్ , క్వైట్, గ్రీసు మొదలైన వారు పోషించిన ఆదర్శవాదం అనే తాత్విక విధానం అంత వరకు ఉండేది. వారి దర్పం వీగిపోయేలా ఇంగ్లాండ్లో రస్సెల్, మూర్, సెల్లర్ మొదలైనవారు యథార్థ వాదానికి పునాదులు వేశారు. అమెరికాలో విలియం జేమ్స్

(pragmatism) ఉపయుక్త లేదా ప్రయోజకత వాదం వ్యాపింపచేస్తూ ఉండేవారు. ఫ్రాయిడ్ పేరు ఆ రోజుల్లో ఎక్కువగా విన్నట్లు జ్ఞాపకం లేదు. బెల్ ఫ్రండ్, వైట్ హెడ్ ఇద్దరూ కలిసి రాసిన ప్రిన్సిపల్ మ్యాథమెటిక్స్ అచ్చయ్యి వుండినది. కొన్నేళ్ల క్రితం హోమ్ యూనివర్సిటీ లైబ్రరీలో వెలువడిన సన్ ప్రాబ్లమ్స్ ఆఫ్ ఫిలాసఫీ అనే పుస్తకం ఇకమీదట తన అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించదని దాన్ని తాను వాపసు తీసుకుంటున్నానని రస్సెల్ విజ్ఞప్తి చేశాడు. కానీ ఆ గ్రంథమూల అధికారులు ఆ పుస్తకం ఆ గ్రంథాలయంలో కొనసాగించేందుకు రస్సెల్ అనుమతి పొందారట. రస్సెల్ మొదటి భార్య వారి నుండి విడిపోయింది. ది ఇంటర్నేషనల్ జనరల్ ఆఫ్ ఎథిక్స్ పత్రికలో ఎ ఫ్రీ మ్యాన్ వర్కషాప్ అనే వ్యాసాన్ని రాసినందుకు గొప్ప సంచలనం రేగింది. అలాంటి రోజుల్లో కేమ్ బ్రిడ్జ్లో ఉంటూ యదార్థ వాద ప్రతివాదనల్లో ఒకరుగా రెడ్డి గారు తమ వ్యక్తిత్వం రూపొందించుకున్నారు.[19] రెడ్డి గారిలో విమర్శ నరనరాన జీర్ణించుకుపోయిన దేమో అన్న అనుమానం వచ్చే సందర్భాలు ఎన్నో ఉన్నాయి ఎవ్వరిని లెక్క చేయక తాను అనుకున్న దాన్ని స్పష్టం చేయాలన్న పట్టుదల రెడ్డిగారి గుణం. ఆ పట్టుదలే రంగనాథ రామాయణాన్ని గోన బుద్దారెడ్డి రాసాడని నిరూపించడంలో కనిపిస్తుంది. రంగనాథ రామాయణానికి తానే పీఠిక రాయాలని సంకల్పించి వేటూరి ప్రభాకరశాస్త్రికి ఇలా ఉత్తరం రాశారు. ***I am told you want me to write the preface it is unnecessary to have both pre faces and introduction enough if there is one. in the introduction on that I shall make the necessary references to you please let me have the facts about your collection with this scheme.***[20]

రెడ్డి గారు తన భావాలను పింగళి లక్ష్మీ కాంతం గారితో చెప్పి పీఠిక రాయించి దానితో తృప్తి పడక వారే మరల పీఠిక రాశారు రెడ్డి గారి సాహిత్య విమర్శ ఆంధ్ర లోకానికి వెలుగు నివ్వగా., రాజకీయ విమర్శ రాజకీయరంగంలో ఎదగనీయకుండా చేసింది. దీనికి కారణం వారి మాటకున్న నిజాయితీతో కూడిన కాఠిన్యం.

***నిండు మనంబు నవ్య నవనీత సమానము పల్కు దారుణకండల శాస్త్ర తుల్యము జగన్మృత విప్రలయందు నిక్కవ రెండు రాజు లందు విపరీతము*** అని భారతంలోని పద్యాన్ని

[19] C.r.reddy centenary souvenir.pg.91

[20] మణిమంజరి:ఫిబ్రవరి.83

ఉదాహరణగా చెప్పి గంటిజోగి సోమయాజి గారు రెడ్డి గుణాలను అన్వయిస్తే దానికి రెడ్డి గారు బాగుంది కానీ రెండు కూడా నాయందు విపరీతము కాదు. 50% నేను అంగీకరిస్తాను. నా వాక్కులో యధార్ధతతో కూడిన కాఠిన్యం ఇంతో అంతో ఉంటుంది. అట్లా నా మాట మృదువు అని పొగడకు అని అన్నారంట ప్రతిదాన్నీ విమర్శనా దృష్టితో చూసినట్టే తనను తాను విమర్శించుకోవడం కూడా రెడ్డి గారిలో కనిపిస్తుంది.

అర్ధశాస్త్రం రాసే సమయంలో వీరికి మనుస్మృతి కామందకం చాణుక్య అర్ధశాస్తం విజ్ఞానేశ్వరీయం  మొదలైన గ్రంథాలు తనకు ఉపయోగపడే విధంగా లేవని జాన్ స్టువర్ట్ మిల్ రాసిన అర్ధశాస్త్రాన్ని మనసులో ఉంచుకొని భారత అర్ధశాస్త్రాన్ని పాశ్చాత్య శాస్త్ర పద్ధతిలో రాశారు. అలాగే సాంప్రదాయ రీతికి భిన్నంగా ఎవరు నూతన రచనలు చేసిన నిండు హృదయంతో వారికి అభినందనలు తెలిపేవారు. నండూరి సుబ్బారావు గారు రాసిన ఎంకి పాటలుని మెచ్చుకున్నారు. ముసలమ్మ మరణం రాసేనాటికి రెడ్డి గారికి ప్రాచీన సంప్రదాయం మీద గౌరవం ఉంది. అందుకే అందులో ప్రాచీన కవితామార్గం కనిపిస్తుంది. 1899లో మద్రాసు క్రైస్తవ కళాశాలలో ఆంధ్ర భాషాభి రంజని సమాజ సభలో పింగళి సూరనపై రెడ్డి గారు ఉపన్యాసం చదివి వినిపించినప్పుడు వేదం వెంకటరాయ శాస్త్రి వంటి ప్రముఖులు పరిశీలించి సవరణలు సూచించారు. రాజమండ్రిలో ఆ వ్యాసాన్ని చదివినప్పుడు పండిత ప్రశంసలకు నోచుకుంది. దానికి కారణం రెడ్డి గారి విమర్శ ఆనాటికి కొత్తది కావడం.

### 4.3 తులనాత్మక విమర్శ

రెడ్డి గారి విమర్శలు పరిణామక్రమం నిశిత దృష్టి విశాల దృక్పథం కనిపిస్తాయి. అప్పటి ఆంగ్ల సాహిత్య విమర్శలో సాగుతూ ఉండిన తులనాత్మక విమర్శ రెడ్డి గారి పై ప్రభావం చూపింది. 1848లో మాథ్యూ ఆర్నాల్డ్ అనే ఫ్రెంచ్ రచయిత తులనాత్మక పరిశీలన అనే పదాన్ని కొత్తగా వాడి నిర్వచించారు. ***Comparison is a method used by all criticism and Sciences and does not in any way add quality describe the specified procedures of literary study. The formal comparison between literature are even movements handworks 30 really a central theme in literary history. Though such books as fC greens minute.***[21]

---

[21] సి.ఆర్.రెడ్డి.జీవితం-సాహిత్యం:పుట.272

తులనాత్మక విమర్శ గురించి ఎస్వీ రామారావు గారు ఈ విధంగా రాశారు. రచయితపై పూర్వ కవి ప్రభావము ప్రసరించుట స్వాభావికం. అది అనుకరణం కాదు. ప్రతిభావంతుడైన కవి తరువాత వారికి మార్గదర్శకుడు అవుతాడు కావున తులనాత్మక పరిశీలన కవి స్థానము నిర్వహించుటకు కావ్యత్మంను నిరూపించుటకు ఉపకరించును. ఒక యుగంలోని కవులను గాని ఒక ప్రక్రియను అవలంభించిన గాని ఒకే వస్తువును స్వీకరించిన కవులను గాని తారతమ్య నిరూపణ చేయుట సమాలోచన చేయుట ఉచితము. వివిధ భాషా కవులలోని సామ్య వైషమ్యాల పరిశీలన కూడా కావ్య ప్రమాణాన్ని నిర్ణయించుటకు తోడ్పడును అని తులనాత్మక విమర్శ గురించి చెప్పారు. రామలింగా రెడ్డి కవిత్వ తత్వ విచారము గ్రంథంలో తులనాత్మక విమర్శ చేశారు అని భావించవచ్చు. ఎలాగంటే ఒకే కవి కి చెందిన రెండు రచనలను తీసుకొని పరిశీలించాడు. వాటిలోని తారతమ్యాలను తన రచనలో చర్చకు పెట్టాడు. అంతేకాకుండా కవిత్వతత్వ విచారంలో మధ్యయుగ కవులకు పూర్వ యుగ యువకులకు గల రచనా విధానంలో భేద సాదృశ్యాలను వివరించాడు. మధ్య యుగ కవి అయిన సూరనకు పాశ్చాత్య కవి అయిన షేక్ స్పియర్ సమకాలికుడు అని గుర్తించి వారి ఇరువురిలోని సామీప్యతను చూపించారు. తెలుగు గ్రంథాలలోని ఇతివృత్తాలను పాశ్చాత్య గ్రంథాలలోని ఇతివృత్తాలను పోల్చి చూశారు. కళాపూర్ణోదయం, ప్రభావతీ ప్రద్యుమ్నంలోని రచన భేదాలని తులనాత్మకంగా పరిశీలించి కవి వ్యక్తిత్వంలో మార్పు వచ్చినట్లే రచనల్లో కూడా మార్పు చేసుకుంటుందని రెడ్డి గారు వివరించారు. పంచమి వ్యాస సంపుటిలో సీత, ద్రౌపదుల మనస్తత్వాన్ని తులనాత్మకంగా పరిశీలించాడు.

### 4.4 సాంఘిక విమర్శ

De bonold అనే పాశ్చాత్య విమర్శకుడు literature I am expression of society చెప్పగా harry livin సాహిత్యానికి సంఘానికి అవినాభావ సంబంధం ఉందని సాహిత్యం సాంఘిక ప్రభావం వల్ల మార్పులు చెందుతుందని సంఘ పరమైన మార్పులు సాహిత్యంలో చోటుచేసుకుంటాయని అభిప్రాయపడినాడు. రెడ్డి గారి విమర్శలో సాంఘిక విమర్శకు స్థానముంది. కావ్యంలోని సంఘటనలకు సాంఘిక సంబంధం ఉంటుంది. ఇది చారిత్రక సత్యం అని రెడ్డి గారు అభిప్రాయపడ్డారు. సమాజానికి సాహిత్యానికి పరస్పర సంబంధాన్ని తెలిపేది సాంఘిక విమర్శ (సోషియోలాజికల్ క్రిటిసిజమ్). రచయిత జీవితము,

దేశ, కాలము, నాటి సాంఘిక విశ్వాసములు మత రాజకీయ పరిస్థితులు మొదలైన విషయాలు కేంద్రంగా చేసుకుని కావ్య వివేచన చేయడం ఈ విమర్శ లక్షణం. దీనికి చారిత్రక విమర్శ అని పేరు .చారిత్రక నేపథ్యంలో సాహిత్యాన్ని పరిశీలించి దాని ఆధారంగా నాటి సామాజిక జీవితం నిరూపించుట ఈ విమర్శ విధానం. 19వ శతాబ్దిలో టైన్  పండితుడు దీనిని ప్రతిపాదించాడు.

*దేశ చరిత్రను బట్టి చూచినచో యుద్ధ వీర కృత్యంబులకు గడంగు కాలంబులో మాత్రము కవిత్వమును విజృంభించుచుండోననుట నిర్వవాదమున నెరంగునగు. ఇందులకు హేతువును విశదము. అట్టి కాలములో నెట్టి జడులను, ఋషులను గొంతకు గొంతయినా దేశభక్తియు, శత్రు సంహేనన సంరంభమును దాల్పకయా నీదు ఇక సామాన్యమైన వారన్నచో హృదయములు పగులున్నట్లు వీర్యది భావ భావములు దాల్చుట ప్రకృతి విరోధంబుగాదు.*[22] అట్టి సమయంలో ఆత్మలు ఎన్నో భావములు తాండవమాడు  చుండగా దుఃఖము దిగులు మొదలైన మానసిక క్షోభలుండగా ఆ కాలం వారిలో నుద్రేకం అనేది వర్ణించ వీలుకానిదిగా ఉండేదని అదే కవితా శక్తికి ప్రాణాధారం అని తిక్కన కవిత్వం భావోపోతంగా ఉండటానికి ఆనాటి సాంఘిక పరిస్థితి కారణమని రెడ్డి గారు వివరించారు. రెడ్డిగారు డి బోనల్డ్ సిద్ధాంతానికి అనుగుణంగా భాషా చరిత్రలు దేశచరిత్రలు నిత్య సంయోగములని చెబుతూ ఆంధ్రదేశంలో వీర్య శౌర్యాది గుణములు విరాజిల్లే కాలంలో  నన్నెచోడుడు ,నన్నయ, తిక్కన మొదలైన కవులు ప్రాబల్యానికి వచ్చారన్నారు. కావున వారి రచనలలో రసము అమేయమని ఉత్సాహం అనే గుణం వెల్లి విరుస్తుందని అభిప్రాయపడ్డారు. *మహమ్మదీయుల చే నోడింపబడి యుక్కుతక్కువై కుక్షింబరులమై యున్న కాలంలో బుట్టె పెరిగిన ప్రబంధ కవులలో పాండిత్య బలము విశేషంగా ఉన్నను పందతనమెక్కటి మెక్కువగా నున్నదే గాని ధైర్యముతో తల యెత్తుకొని మనుష్యులలో మనుష్యుడిగా తిరుగుటకు తగిన ఉత్సాహం అంతగా కనిపించదు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో పౌరుషంమెకింత యుద్దీపించేకాని యయ్యది మెరుగు తీగవలె నొక్క నిమిషము మాత్రం ఆంధ్ర ప్రపంచం దగదిగితము చేసి యంతర్ధానమయునందున యదారీతిని నగాధమగు  మరల చీకటి యాక్రమించినది అన్నది రెడ్డి గారి అభిప్రాయం.*[23]  *ఘనములైన రాజు కార్యములందు ఆసక్తి గాని ప్రవేశించిన వారు గద్య పద్యాలు నిర్మాణ శిల్పమునకుం తొడంగువారైచో వారు*

[22] కవిత్వతత్వవిచారము:పుట:10

[23] కవిత్వతత్వవిచారము:పుట:11

*సులభముగానూ త్వరితముగానూ దత్కళా ప్రవీణులౌట నైసర్గికము కార్య గంభీరముల రచన యందు సారము, వీర్యము, ఉద్వేగం, చురుకుదనము ఇత్యాది నానా పదములచే బేర్కొనబడు సుగుణ మొఖండు అఖండముననుండును.*[24] కావున అట్టి వారి కృతులు కేవలం పండితుల గ్రంథములవలె రుచిలేనివిగను, చప్పిడివిగను, మొద్దుబారినవిగను ఉండవు అని విద్యా దురంధరులైన మార్లీ ప్రభువు గారు సమర్థించారని రెడ్డి గారు పేర్కొన్నారు,.

కవిత్వం, భావనా శక్తి, పాండిత్య బలం, ప్రతిభా, శైలి, రచన తత్వం, పాత్రలు, స్వభావ వర్ణన, ప్రబంధాలు, నాటక సరణి, వర్ణనలు ఇలాంటి విషయాలను కవిత్వతత్వవిచారములో రెడ్డిగారు లక్ష్య లక్షణ సమన్వితంగా వివరించారు. పాశ్చాత్యులలో రెడ్డి గారికి నచ్చి మెచ్చిన కవితా గుణం ప్రకృతి వర్ణన. ప్రబంధాలలోని ప్రకృతి వర్ణన కృత్రిమత్వంని వీరు విమర్శించారు.

మనవారిలో ననేకులు నిఘంటువులలో ఉండు ప్రకృతియే గాని బయటనున్న ప్రకృతి యొట్టిదో తమ సొంత కనులతో చూచిన పాపానపోలేదు[25] అని రెడ్డి గారు విమర్శించారు. పాశ్చాత్య కవి వర్డ్స్ వర్త్ పొలాలను వృక్షాలను అతి రమణీయంగా కన్నులకు కట్టినట్లు వర్ణించాడు. daffodils solitary raaper కవితా ఖండికలో ప్రకృతి సిద్ధమైన వర్ణనలు మనకు ప్రకృతిని సాక్షాత్కరింప చేస్తాయి. అతి సామాన్యమైన పువ్వులను చెట్లు కదలికలను కవి పాఠకుల ముందుంచి హృదయాలకు పాకేట్లు చేస్తాడు. ఓ పల్లె పడతి పాడుకుంటూ గడ్డి కోసుకునే దృశ్యాన్ని కవి solitary raaperలో వర్ణించాడు. కీట్స్, షెల్లీ వంటి రొమాంటిక్ కవులు ప్రకృతిని నేత్రానందంగా సహజ సుందరంగా వర్ణించే రచనలు చేశారు. సహజ వర్ణనలను చవిచూసిన రెడ్డి గారికి ప్రబంధాలలోని కృత్రిమ వర్ణనలు నచ్చకపోవడంలో ఆశ్చర్యం అనిపించదు.

కవిత్వం ప్రజల జీవితాల సామీప్యంగా వెళ్లాలని సంఘ పరిస్థితులు కవితలో ప్రతిబింబించాలని రెడ్డి గారి అభిప్రాయం. రెడ్డి గారిలో ఇలాంటి అభిప్రాయాలు ఏర్పడడానికి కారణం పాశ్చాత్య సాహిత్య ప్రభావమే. చార్లెస్ డికెన్స్ రచనలలో సాంఘీక అన్యాయాలను ప్రతిఘటించడం. కనిపిస్తుంది. డికెన్స్ ద టేల్ ఆఫ్ టూ సిటీస్ అలీవర్ టిస్ట్ టేల్  డేవిడ్ కాపర్ ఫీల్డ్ బ్లాక్ హౌస్స్ వంటి రచనలో సమకాలీన సాంఘిక వాతావరణాన్ని బాగా చిత్రించాయి.

[24] కవిత్వతత్వవిచారము:పుట:12

[25] కవిత్వతత్వవిచారము:పుట:17

ఉదాహరణకి టేల్ ఆఫ్ టు సిటీస్లో డ్యూకు రథం జనసాంద్రత గల వీధుల గుండా వేగంగా వెళ్లేటప్పుడు ప్రజలు తమ ప్రాణాలను రక్షించుకోవలసివచ్చేది. ప్రజలకు ప్రాణాంతకంగా ఉన్న ఈ పరిస్థితులపై రథసారథికి గాని రథంలోని యజమానికి గాని శ్రద్ధ ఉండేది కాదు. ఇలాంటి నిరంకుశ సామ్రాజ్య పాలన ప్రతిఘటించే విధంగా అందులో సన్నివేశాలు చిత్రించబడ్డాయి. ప్రజలలో రావలసిన చైతన్యాన్ని కవి తన రచనల ద్వారా తీసుకువస్తాడు. పాశ్చాత్య కవులు స్వతంత్రేచ్ఛ గలవారై ప్రజాక్షేమం కోసం రచనలు చేశారన్న విషయం రెడ్డి గారి విమర్శను పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది. సాంఘిక చైతన్యం కలిగించని రచనలు చేయడం వ్యర్థమని రెడ్డి గారి అభిప్రాయం. ఈ దృష్టితోనే మన కవుల రచనలను పరిశీలించారు. ***"మన వారిలో సంఘ చరిత్రమను భావము ఉన్నదో లేదో భావమే లేనిది ప్రవృత్తి ఎక్కడిది తమ తమ కుటుంబములయు, తెగలయు క్షేమ చింత యే గాని రాష్ట్రం గురించి చింతలు లేని వారగుటం చేసి వీరి ప్రారంభములచే దేశమునకేమాత్రం మాన ప్రాణ రక్షణములు సమకూరవు. అట్లగుట వీరి కృత్యములు గంభీరోద్యమములు. వీరిచే తెలివియు విరివియు గాంచు కవిత సాధారణ జనులపై నేల దృష్టించును? తమ కడుపు మీద తప్పునింకెద్దాని మీదను గన్ను మనసు బోనివాని పై బరుల కన్నుల మనసులునేల పారును*** [26] అని రెడ్డి గారు ప్రజలలో పరివర్తన కలిగించని రచనలు చేసిన మన కవులను నిందించారు. కవిత్వ తత్వ విచారంలో కవులపై నిందారోపణలు చేయడం చాలా చోట్ల కనిపిస్తుంది. దేశాభ్యుదయానికి గానీ, దేశ దుస్థితికి గానీ సాహిత్య ప్రభావం చాలా కారణం. ప్రజా యోగ్యమైన సాహిత్య మనుగడకి ఓ ఊతకర్ర లాగా పనిచేస్తుంది. ఆ ఊతకర్ర ను అందించే కవి అప్రమత్తుడు, సార్థపరుడు అయితే సంఘం ఆధారంలేని కుంటి బ్రతుకు బ్రతక వలసి వస్తుంది.

ట్రాజెడీ అనేది పరుల దుఃఖ గాథ. దాని వలన ప్రజలు ఎదుటి వారి బాధలను తమ బాధలు తో పోల్చుకొని ఊరట పొందుతారు. ప్రతి దినం కలతపడే మనస్తత్వం గల వారికి సీతాదేవి వంటి మహాసాధ్వి కష్టాలు కొంత ఊరట కలిగిస్తాయి. సామాన్య మానవుడికి ఎన్నో సమస్యలు ఉండగా మన ప్రబంధ కవులు రాజుల శృంగార కథలను చెప్పడం రెడ్డి గారికి నచ్చలేదు. మన కవులు ఉన్నత కులానికి సంబంధించిన వాళ్ళు. వాళ్ళు ఉన్నత వంశీయులైన

[26] కవిత్వతత్వవిచారము:పుట:23

రాజులకు సంబంధించిన కథలనే కావ్యాలలో రాశారు. తక్కువ కులాల వాళ్లకు విద్య అవకాశం తక్కువ కాబట్టి వాళ్లు వాళ్ల చరిత్రను, కథలను రాసుకో లేకపోయారు అని చెప్పారు.

చరిత్ర చదివిన వాడిగా ఆనాటి సాంఘిక పరిస్థితులకు రెడ్డి గారి అవగాహన ఇది. అందువలనే వీరు సంఘ పరమైన దృష్టి నుండి పక్కకు వెళ్లి విమర్శించలేదు. వీరి విమర్శనా ఖడ్గం ఆదర్శ భావాలతో సంకుచితత్వాన్ని తెగ నరుకుతూ పోయింది. జాతి వైషమ్యాన్ని విమర్శించే వీరు కవిత్వ తత్వానికి, సంఘ దుస్థితికి ముడిపెడుతూ వచ్చారు. మానవతాదంతో నిండిన ఈ విమర్శా విధానంలో కరువు దనం, కరుకుదనం పాఠకులకి కనిపిస్తున్నాయి.

## 4.5 ప్రతిభ – భావనా శక్తి

రెడ్డిగారు ప్రతిభని భావనాశక్తిని విభిన్న అంశాలుగా చెప్పారు. వర్ణనా శక్తిని, కల్పనా శక్తిని సందర్భ శుద్ధిని పాత్రోచిత పద్య రచనలను ప్రతిభలోని వేర్వేరు అంశాలుగా గుర్తించారు. రెడ్డిగారు భావనాశక్తిలోని అంశాలని చెప్పారే గాని భావనా శక్తిని కూడా ఊహకందని మహత్తరశక్తి గానే ఊహించారు. అలంకారికులు చెప్పిన ప్రతిభా ఉత్పత్తులను రెడ్డి గారు భావనా శక్తిలో చేర్చలేదు. వీరి దృష్టిలో ఈ రెండింటి లోనూ భావనాశక్తి లేదు[27]. ఈ భావనా శక్తి కి ఆంగ్లంలో ఇమేజినేషన్ అన్న అర్థం తీసుకున్నా సరైన అర్థం స్పందించదు కానీ కొంత వరకు సరి పుచ్చుకునే రకంగా 19వ శతాబ్దపు కవి వర్డ్స్ వర్త్ భావనాశక్తికి ఉదాత్త స్థానాన్ని తన రచనలలో కల్పించాడు. రెడ్డి గారు ఎన్నో చోట్ల ప్రాచీన లాక్షణికుల పారిభాషా పదాలను విమర్శించి కొత్త పదాలను విమర్శలో వాడడం గమనిస్తే స్వసంకేతాలను వాడడం రెడ్డిగారికి ఇష్టమని అర్థం అవుతుంది అని సీతా లక్ష్మమ్మ గారు తన పరిశోధనలో చెప్పారు.

***నూతన శాస్త్ర పరిచయం వలన మాయ సంపర్కము వలననో తమలో కలిగిన పూర్వ భావాలను వ్యక్తీకరించటం అన్య సాంప్రదాయ సంపర్కం వలనో తమలో కలిగిన అపూర్వ భావాలను వ్యక్తీకరించుటకు నూతన పదజాలము సృష్టించుటలో పూర్వ పదములచే లక్షణాలార్థముగా వాడుటో తప్పనిసరి యగును. ఈ పద్ధతులలో అన్య దేశ పద ప్రయోగము భాషా స్వచ్ఛతకు పహతి కలిగించును. రెడ్డిగారు అట్టి స్వచ్ఛతా బ్రహ్మమును బొత్తిగా నొల్లడు.***

[27] కవిత్వతత్వవిచారము:పుట:46

*మరి పూర్వపదములనే పూర్వార్థములకు తగినట్లుగా మలతురు. ఆ మలచిన్న వాటిలో అస్పష్టతకు గురి అయిన వాటిలో ప్రతిభ ఒకటి అని లక్ష్మీకాంతం గారు పేర్కొన్నారు.*[28]

రెడ్డి గారి భావనాశక్తి వర్డ్స్ వర్త్ ఇమేజినేషన్ కొంతవరకు సమానార్థాలు అయిన భావనాశక్తిని రెడ్డి గారు స్పష్టంగా వివరించలేదు. భాషని నిర్వచించడం ఎంత కష్టమో ఈ భావనాశక్తిని నిర్వచించడం అంతే కష్టం. సూరన కవిత్వాన్ని రెడ్డిగారు విమర్శించడానికి కావలసినంత కారణం ఉంది. సూరన షేక్స్పియర్ ఒకరికొకరు తెలియకపోయినా వారిరువురూ సమకాలీకులు. వారికి జాతి మత వేష భాషలు వేరు అయినా వారు రాసిన కథలలోని పోలికలకు రెడ్డి గారు ఆశ్చర్యపడ్డారు. షేక్సపియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనగా తబ్బిబ్బుల ప్రహసనము అను నాటకానికి రంభానలకూబరుల కథకు భేదం లేదని రెడ్డి గారు వివరించారు[29]. సూరన షేక్స్పియరుకు సమకాలీనుడు కావడం వారి రచనలలో పోలికలు ఉండటమే కాక సూరన కళాపూర్ణోదయం కథలోని ప్రత్యేకత, రచనలోని సంక్లిష్టత శైలి లోని మాధుర్యం కోమలత్వం రసానుగుణ్యత రెడ్డి గారిలోని విమర్శనా శక్తిని పురిగొల్పాయి. రెడ్డి గారికి సూరనలాగే డ్రైడెన్, జాన్సన్, కాల్ రిడ్జ్, జాన్ రస్కిన్, రోమా, లోల, మ్యాథ్యూ ఆర్నాల్డ్, థామస్ మెకాలేలు రెడ్డిగారి అభిమాన రచయితలని వారి రచనలు ఉపన్యాసాలు చదివిన వారు విన్న వారు వారి సాహిత్యాన్ని అధ్యయనం చేసిన వారు చెబుతున్నారు.

ఏ అంశం చెప్పవలసి వచ్చినా రెడ్డిగారు పాశ్చాత్య కవులను విమర్శకులను ఆదర్శ వాదులగా గుర్తు చేసుకుంటూ వెళతారు. ***పాశ్చాత్య భాషలలో పోస్టోరల్స్ నాబడు పాశుపత్యాది గ్రామాంతర వృత్తుల వారి కృత్రిమ జీవిత స్వభావం వాదుల వర్ణించు కావ్యములనేకములున్నవి. అవి గ్రీకు లాటిన్ భాషలో గోపగోపికా సంచార సంచారములు యెంతయు హృదయారంజకములని చెప్పారు.***[30]

**అలంకారాలు వాడకంపై విమర్శ**

[28] గౌతమీ వ్యాసాలు పుట 88.

[29] కవిత్వతత్త్వవిచారము:పుట:151

[30] సి.ఆర్.రెడ్డి. పీఠికలు:పుట.164

ఆంగ్ల కవుల కంటే ఆంధ్రకవులలో అలంకారాలు అధికమని, అందున ప్రబంధాలులో ఎక్కువ అని చెప్పిన రెడ్డిగారు ఆంగ్ల కవుల అలంకార ప్రయత్నాన్ని గురించి చెప్పకుండా ప్రబంధ కవులను కవిత్రయం వారితో పోల్చి ప్రబంధాలలో అలంకారాలు ఎక్కువని ధ్రువీకరించారు. కవిత్వ తత్వవిచారం రెండవ ముద్రణ సందర్భంలో రాళ్ళపల్లి వారికి ఉత్తరం రాస్తూ రెడ్డిగారు అలంకారాలను గురించి కోత్త అధ్యయనం రాయదలచుకొంటిననియు కాని రాయకనే ముద్రించుచున్నాననియు రాశారు. దీనిని బట్టి చూస్తే సమయాభావం చేత అలంకార చర్చ తాను అనుకున్నంత చేయ లేదని అర్థమవుతుంది.

రెడ్డిగారు కవిత్వతత్వవిచారం, వ్యాసాలు ఉపన్యాసాలు లోనే కాకుండా వివిధ గ్రంథాలకు రాసిన పీఠికలో కూడా వారి విమర్శనా దృక్పథం కనిపిస్తుంది.

## 4.6 కట్టమంచి రామలింగ రెడ్డి పీఠిక విమర్శ:

### 4.6.1 పీఠిక:

పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల 'పీఠిక' అనే ప్రక్రియ వెలుగులోకి వచ్చింది. ఇతర ప్రక్రియల్లాగానే అంటే కథ, నవల, నాటకం వంటి ప్రక్రియాల్లాగా పీఠికా ప్రక్రియ కూడా ముద్రణా యంత్రాలు ప్రారంభమైన నాటి నుండీ ప్రచారంలోకి వచ్చి, నేటి ఆధునిక యుగంలో అది ఒక ప్రక్రియగా నిలదొక్కుకుంది. అంతేకాకుండా దాన్ని విమర్శ రంగంలో ఒక భాగంగా పరిగణింపబడుతుంది. ప్రాచీన కాలంలోని కావ్యావతారికల స్థానంలో ఆధునిక యుగంలో పీఠికలు వచ్చాయి.

కావ్యగతమైన విశేషాంశాలను ఆవిష్కరించి సహృదయ పాఠకుల చిత్తవృత్తిని తదున్ముఖంగా సమాయత్తం చేసేది పీఠిక[31]. కావ్యంలో ఉన్న విశేషాంశాలన్నింటినీ విశ్లేషిస్తూ కావ్యం చదవడానికి పాఠకులను ప్రేరేపించేది పీఠిక అని భాస్కరచౌదరిగారు పేర్కొన్నారు. తెలుగు పీఠికలపై పరిశోధన చేసిన డి. చంద్రశేఖర్ రెడ్డిగారు పీఠిక అంటే ఏమిటో చెప్తూ ఒక నిర్వచనాన్ని ఇచ్చారు[32].

***"ఒక గ్రంథానికి ముందు ఆధారాలు, చరిత్ర, పరిధి, ప్రణాళిక పద్ధతి, ప్రయోజనం, లక్ష్యం మొదలైన వాటిని వివరిస్తూ సహకరించిన వారికి కృతజ్ఞతలు చెప్తూ ఆ గ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమయ్యే అధిక సమాచారాన్ని అందించే ప్రత్యేక వ్యక్తిత్వం కలిగిన రచన***

---

[31] సి.ఆర్. రెడ్డి–పీఠికలు–భూమిక, పుట: vii

[32] తెలుగు పీఠిక, పుట: 33

*పీఠిక. ఇది వచన రూపంలోగానీ, పద్య రూపంలోగానీ ఉండవచ్చు. దీనిని గ్రంథకర్తగానీ, ఇతరులుగానీ రాయవచ్చు."* ఈ నిర్వచనాన్ని బట్టి ఒక రచన రాయడానికి ముందుగా సమకూర్చుకున్న ప్రణాళిక, వస్తు సామాగ్రి, రాసేటప్పుడు సహాయ సహకారాలందించిన వారికి కృతజ్ఞతలు చెప్పడం వంటి విషయాలను పీఠికాకర్త మాత్రమే కాకుండా, ఇతరులు కూడా రాయవచ్చునని తెలుస్తుంది. పీఠిక వచన రూపంలో గానీ, పద్య రూపంలో గాని రాయవచ్చు అని డా. చంద్రశేఖర్ రెడ్డిగారు పీఠిక గురించి వివరించారు.

ఇప్పుడు మనం చెప్పుకుంటున్న పీఠిక అనే మాట ప్రాచీనకాలంలో 'కావ్యావతారికలు' అన్న మాటకు బదులుగా వాడుకున్నదే. కాకపోతే పీఠికకు కావ్యావతారికకు కొద్దిపాటి తేడాలుంటాయి. కావ్యవతారికను గ్రంథకర్త మాత్రమే రాస్తాడు. పీఠికను గ్రంథకర్తతో పాటు మిగిలిన వారెవరైనా కూడా రాయవచ్చు. పీఠిక ఆధునిక సాహిత్యంలో హఠాత్తుగా బయటపడింది కాదు. ప్రాచీన కావ్యనాటకాది అవతారికల ప్రస్తావనల్లో ఆధునిక పీఠికా లక్షణాలు ఉండటంవల్ల ఆధునిక పీఠిక శబ్దాలు పరిణామక్రమంలో రూపుదిద్దుకున్నాయి. అయితే కావ్యవతారికల్లో కేవలం లక్షణ చర్చకు మాత్రమే అవకాశం ఉండేది. కానీ పీఠికలో లక్ష్య పరిశీలనకు కూడా ప్రాముఖ్యం ఉంది. ఏది ఏమైన నేడు మనం చెప్పుకుంటున్న పీఠిక ప్రాచీనకావ్యాల్లో అవతారికగా ఉండి ఉంటుందని పండితుల అభిప్రాయం.

## 4.6.2 పీఠిక-నిర్వచనాలు:

"పీఠిక" అనే పదానికి నిఘంటువులు కొన్ని అర్థాల్నిచ్చాయి. వాటిని పరిశీలిద్దాం.

a. "*గ్రంథము రాయబడు తదుత్పత్తి క్రమము"* అని శబ్ద రత్నాకరము పేర్కొంటున్నది.[33]
b. "*వ్యాఖ్యానాదులందురాబోవు వాక్యన్వయము తెలుపుటకై ముందు రాయు సందర్భ సూచక వాక్యము"* అని వావిళ్ళ నిఘంటువులో పేర్కొన్నారు.[34]
c. "*గ్రంథాదిని రచింపబడు ప్రస్తావనము అవతరణిక"* అని సూర్యరాయాంధ్ర నిఘంటువులో పీఠికకు అర్థాన్ని పేర్కొంటున్నారు[35].

---

[33] శబ్ద రత్నాకరము, -పుట:44

[4] వావిళ్ళ నిఘంటువు. పుట:190

[5] సూర్యరాయాంధ్ర నిఘంటువు సంపుటం ఒకటి పుట:302

నిఘంటువుల అర్థాన్నిబట్టి చూస్తే ప్రాచీనకాలంలో కావ్యాలకు రాసిన నిర్వచనాలే అయినప్పటికీ అవతారికకు సమాన పదంగా నేడు "పీఠిక"కు కూడా వీటినే అన్వయించుకోవచ్చు. పై నిఘంటు అర్థాలవల్ల పీఠిక వల్ల కింది విషయాల అవగాహన కలుగుతుందని తెలుస్తుంది.

- అవతారిక గ్రంథాదిలో ఉంటుంది.
- గ్రంథ ప్రారంభ క్రమాన్ని తెలియజేస్తుంది.
- ముందు రాబోయే అన్వయానికి తగిన నేపథ్యాన్ని సిద్ధం చేస్తుంది.

ఆధునిక కావ్యంలోని పీఠిక కూడా కావ్యం మొదటనే ఉంటుంది. గ్రంథ క్రమాన్ని అందులోని విషయాన్ని విశ్లేషిస్తుంది. కాబట్టి అవతారికలో చెప్పిన అర్థాలనే పీఠికకు అన్వయించుకోవచ్చు. అవతారిక, పీఠిక ఒకటేనా అనే చర్చలోకి వెళ్ళేముందు పీఠికకు తుల్యంగా వాడే మరికొన్ని పదాల గురించి తెలుసుకుందాం. తొలిపలుకు, ముందుమాట, మున్నుడి, నానుడి, పరిచయం, ప్రస్తావన, ఉపోద్ఘాతం, భూమిక మొదలైనవి. వీటి అర్థాల కోసం ప్రత్యేకించి నిఘంటువులు చూడనవసరం లేదు. ఎందుకంటే వీటిని చూడగానే అర్థమై పోతుంది. కాకపోతే 'ప్రస్తావన' అనే మాట నాటకరంగంలో ఉపయోగిస్తారు. ఇంకా 'ఉపోద్ఘాతం' అనే మాటను మాత్రం సూర్యరాయాంధ్ర నిఘంటువు తెలుగు సాహిత్య కోశాల్లో కొన్ని నిర్వచనాలు కనిపిస్తాయి.

తెలుగులో పీఠిక అన్న ప్రక్రియకు ఆంగ్లంలో Preface అన్న పదం ప్రయోగంలో ఉంది. ఈ Preface అనే మాటకు ఆంగ్లంలోనే ఇంచుమించుగా అనేక సమానార్థక పదాలు కనిపిస్తున్నాయి. అవి Exordium, Foreword, Introduction, Invocation, Preamble, Prelude, Proem, Prologue, Protasies. వీటిలో Foreword, Introduction Preface అనే మాటలకు అర్థాలు ఆ మాటల్లోనే ఉన్నాయి.

### 4.6.3 ఆధునిక కావ్యాలు–తెలుగు పీఠిక:

ఆధునిక కాలంలో గ్రంథ పరిష్కరణకు కవుల పూర్వ పరచర్చలకి అవకాశం లేకుండా పోయింది. ఎందుకంటే 20 శతాబ్ది కాలంలో అనేక కవితోద్యమాలు వచ్చాయి. అందువల్ల కవిత్వ స్వరూపం, ప్రయోజనం మారి పోయాయి. సాహిత్యం సాహిత్యం కోసమే అన్నట్లు ఆ కాలంలో రచనలు వెలువడ్డాయి. ప్రాచీన సాహిత్యదృక్పథానికి వ్యతిరేకంగా భావకవిత్వం వస్తే, దానికి వ్యతిరేకిస్తూ అభ్యుదయం, విప్లవం, దిగంబరం, స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం

ఇలా అనేక ఉద్యమాల వచ్చాయి. సామాజిక జీవితంలో వచ్చిన మార్పులు సాహిత్యంతో బాటుగా నడిచాయి. కావ్య కవిత్వంలోనే కాకుండా విమర్శలో కూడా అనేక మార్పులు వచ్చాయి. మారుతున్న కవిత్వానికనుగుణంగా, కావ్యానుశీలన సూత్రాలను విమర్శకులు నూతనంగా ఏర్పరుచుకున్నారు. విమర్శకులు పాశ్చాత్య పద్ధతులు, సూత్రాలతో తెలుగు సాహిత్యానికి అన్వయించి సమీక్షిస్తున్నారు. కొందరు విమర్శకులు, కవులు, సాహిత్యం, విమర్శ, రాజకీయ సిద్ధాంతాలు రాద్ధాంతాలకు రంగస్థలం కావడాన్ని ఖండిస్తూ, నానాటికీ నశించిపోతున్న కళాత్మక విలువలను సంరక్షించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు. సాహిత్యానికి, విమర్శకు మూలాలు దేశీమై ఉండాలని మరికొంతమంది ఉద్బోధిస్తున్నారు.
ఈ విధంగా సృజనాత్మక సాహితీ రంగంలో, విమర్శనాత్మక రంగంలో సంభవించిన, సంభవిస్తున్న మార్పులన్నీ పీఠికా ప్రక్రియను ప్రభావితం చేస్తున్నాయి. కవులు నూతన ప్రయోగాలు చేసినప్పుడు తామే స్వయంగా కానీ లేక ఇతరుల చేతగానీ దాన్ని వివరించడమూ లేక సమర్థించడమూ చేస్తున్నారు. నూతన సిద్ధాంతాల ప్రచారానికి కవితోద్యమాల ప్రచారానికీ పీఠికను ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్నారు. కవిత్వతత్వ వివేచనకంటే తాను నమ్మిన సిద్ధాంతాల ప్రచారం కోసమే పీఠికా రచన చేసినవారు, చేస్తున్నవారు కూడా లేకపోలేదు అనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి.

## 4.6.4 కొందరు పీఠికా కర్తలు:

కవులుగా, రచయితలుగా, విమర్శకులుగా ప్రసిద్ధి చెందినా వారు కూడా కొందరు చక్కని పీఠికల్ని రాసి వాటిద్వారా గుర్తింపు పొందిన వారు ఉన్నారు. వారి గురించి తెలుసుకుందాం.

## 4.6.4.1 రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ:

అనంతకృష్ణ శర్మగారు పరిష్కృత గ్రంథాలకు, స్వీయ రచనలకు, ఇతర కావ్యాలకు రాసిన పీఠికలు 1978లో సంకలనం చేయబడ్డాయి. ఈ గ్రంథానికి పీఠికను రాస్తూ జి.ఎన్. రెడ్డిగారు *"అవి విషయ ప్రధానములు, విమర్శతత్వ సమన్వితములు, సమీక్షా ప్రాయములు. వైయక్తిక వచన రచనా శిల్ప విలక్షణములు"* అని అన్నారు[36].

రాళ్లపల్లి పీఠికలో శబ్ద చర్చలు, కవిత్వతత్వ వివేచనలు చోటు చేసుకున్నాయి. ఈయన గొప్ప సంగీతజ్ఞులు కనుక అన్నమాచార్య సంకీర్తనల ముద్రణ గ్రంథానికి పీఠిక శబ్ద ప్రపంచం,

---

[36]. రాళ్ళపల్లి పీఠికలు–పీఠిక–పుట:IX.

క్షేత్రయ్య పదసాహిత్యం, తాళ్ళపాక కవుల పదకవితలు, భాషా ప్రయోగ విశేషాలు మొదలైన గ్రంథాలకు వీరు రచించిన పీఠికలు వారి సంగీత కళాభిజ్ఞతకు నిదర్శనాలు. వీరిది కావ్య కళాసౌందర్య దృష్టి. శైలీ రమణీయంగా ఉంటుంది. వేమన గ్రంథ పీఠికలో కవి జీవిత విమర్శ కనిపిస్తుంది. కవి జీవితం, సమకాలీన సాంఘిక పరిస్థితులు కవిత్వంలో ఏ విధంగా ప్రతిభింబిస్తాయో నిరూపించారు. పాండురంగ మాహాత్మ్యము, శ్రీమదాంధ్ర మహా భాగవతములకు రచించిన పీఠికల్లో శబ్ధ చర్చలు, ఛందో విశేషాలు చోటు చేసుకొని సంప్రదాయ పద్ధతిలో రూపొందించబడ్డాయి. మొత్తానికి రాళ్ళపల్లివారి పీఠికలు పరిశోధన, విమర్శ మేళవింపులతో కనబడుతున్నాయి.

## 4.6.4.2 నిడదవోలు వెంకటరావు:

ప్రాచీన తాళపత్ర గ్రంథాలను పరిష్కరించి పరిశోధనాత్మక పీఠికలను రచించిన నాటి ప్రముఖ పీఠిక కర్తలలో నిడదవోలు వెంకటరావు ఒకరు. ఉదహారణ వాఙ్మయశాఖలో అద్వితీయమైన కృషిని చేసి కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారిచేత "పరిశోధనా పరమేశ్వరునిగా" ప్రశంసించబడ్డారు. *విప్రనారాయణ చరిత్రం, సూర్యవంశ శతకం, ధాశరథి శతకం, కట్టావరదరాజ రామాయణం* వంటి ఎన్నో ప్రాచీన ప్రామాణిక గ్రంథాలకు పీఠికల్ని వెలయించారు. పీఠికా రచనలో నిడదవోలు వారికున్న ఆసక్తిని విశ్వనాథవారు "*నిడదవోలు కాపురం పీఠికా పురం*" అని చమత్కరించారు[37].

## 4.6.4.3 వేటూరి ప్రభాకర శాస్త్రి:

తెలుగు సాహిత్యంలో గొప్ప పీఠికా కర్తగా పేరు పొందిన వారిలో వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఒకరు. వీరి పీఠికలు 1985లో 1990 రెండు సంకలనాలుగా ముద్రించబడ్డాయి. వీరు *ఉద్భటారాధ్య చరిత్ర, మను చరిత్ర, బసవ పురాణం, తంజావూరి చరిత్ర, క్రీడాభిరామం , భారత శతకం* మొదలైన గ్రంథాలకు పీఠికలు రాశారు.

ప్రతులను సరిపోల్చి పాఠనిర్ణయం చేయడం, శాబ్ధిక చర్చలు, ఛందోలంకారాది చర్చలు, కవుల పూర్వ పర చర్చలు మొదలైన అంశాలతో కూడుకొని ఉంటాయి వీరి పీఠికలు. వీరి పీఠికలకు విసృతి సాధారణ లక్షణం. వీరు బసవపురాణానికి రచించిన బృహత్పీఠిక పాల్కురికి సోమనాథునికి సంబంధించిన అనేక అంశాలను తెలియజేస్తుంది. దీని ద్వారా తరువాత కాలంలో *బసవపురాణం*పై పరిశోధనలు చేసిన వారికి గొప్ప ఆధారమైంది.

[37]. నిడదవోలు వెంకటరావు రచనలు–పరిశీలన–పుట:10.

క్రీడాభిరామానికి లభించిన ఒకే ఒక్క ప్రతిని ఆధారం చేసుకొని ఆ గ్రంథం శ్రీనాథ కృతమని నిర్ణయించడం వారి ప్రతిభా పాండిత్యానికి నిదర్శణం.

### 4.6.4.4 విశ్వనాథ సత్యనారాయణ:

విశ్వనాథవారి పీఠికలు 1996లో రెండు సంకలనాలుగా ప్రచురించబడ్డాయి. విస్తృతంగా పీఠికలు రాసిన వారిలో వీరు కూడా ఒకరు. కొన్ని పీఠికలు మొహమాటం కొద్దీ రాసినా, ఎక్కువ పీఠికల్లో కావ్యతత్త్వవివేచన చోటుచేసుకుంటుంది. పీఠిక రచన సందర్భంగా కవిత్వ తత్వాన్ని గురించి, శైలిని గురించి, కావ్య రసాన్ని గురించి, శిల్పాన్ని గురించి, కావ్య ప్రక్రియల గురించి, తెలుగు భాషా ప్రశస్తిని గురించి, లోక ప్రవృత్తిని గురించి చేసిన వ్యాఖ్యానాలు అనేకం కనబడుతాయి. వీటన్నింటిని క్రోడీకరించగలిగితే అవన్నీ కలిపి ఒక విమర్శ గ్రంథంగా తయారవుతుంది. ఒక కావ్యం ప్రాశస్త్యాన్ని పొందడానికి, ఆ కావ్య శిల్పం, వస్తువు రెండూ ఏ విధంగా పరస్పరం దోహదకారులవుతాయో వివరిస్తూ *"లోకమునందు బహుకావ్యములు వస్త్వంచిత శిల్పమార్గ భూషితములు చాలా ప్రదేశములు శిల్పికి బ్రతివానికి వానికొక మార్గముండును వాడు సర్వదా ఆ మార్గమునందే సంచరింపగలడు. వాడధికమైన బుద్ధిశాలియైనచో తన మార్గమున కుచితమైన వస్తువునే తీసుకొని దానియందు బ్రవర్తించును. అతని కావ్యమునకు ప్రశస్తి వచ్చును"* అని విశ్వనాథ సత్యనారాయణ అన్నారు[38]. ఈ విధానమైనటు వంటి వ్యాఖ్యానాలు వీరి పీఠికల్లో అనేకం చోటు చేసుకున్నాయి. ఓ కవి, పరిశోధకుడు, విమర్శకుడు పీఠిక రాస్తే ఎలా ఉంటుందో దానికి ఉదాహరణగా విశ్వనాథవారి పీఠికల్ని సూచించవచ్చు.

వీరే కాకుండా తెలుగు సాహిత్యంలో పీఠికా ప్రక్రియను పరిపుష్టం చేసిన వారెందరో ఉన్నారు. వేదం వెంకట్రాయశాస్త్రి, చిలుకూరి నారాయణరావు, మానవల్లి రామకృష్ణకవి, పురాణం హయగ్రీవ శాస్త్రి, పింగళి లక్ష్మీకాంతం, దివాకర్ల వెంకటావధాని, బండారు తమ్మయ్య, తంజావూరు తెవప్పేరు మల్లయ్య, అక్కిరాజు ఉమాకాంతం మొదలైనవారు అనేకమంది పరిష్కరణ గ్రంథాలకు పీఠికలను వీరి పీఠికలన్నీ శాబ్ధిక చర్చాది విషాయాలతో కూడుకొని ఉంటాయి. అది గ్రంథ పరిష్కరణ యుగ ప్రభావం కావచ్చును.

---

[38] . పీఠికలు–విశ్వనాథ అసంకల్పిత సాహిత్యం–పుట:2:193.

### 4.6.5 పీఠికా ప్రయోజనం:

'పీఠికల వల్ల ఏదైనా ప్రయోజనం ఉందా?' అని చాలామంది అడుగుతుంటారు. పీఠికలవల్ల కింది ప్రయోజనాల్ని చెప్పుకోవచ్చు[39].

(a) ప్రాచీన అవతారికల్లో కావ్యప్రశంస, పూర్వకవి స్తుతి, కుకవినింద వంటి వాటికే పరిమితం అయ్యాయి. ఆధునిక పీఠికలు కవితా విమర్శతో పాటు రాజకీయ ఆర్థిక, సామాజిక, పరిణామాలన్నింటిని చర్చిస్తున్నాయి.

(b) అవతారికలో అంకింతం తీసుకున్న వారిని స్తుతిస్తే, ఆధునిక పీఠికలో గ్రంథ రచనకు, ప్రచురణకు, ముద్రణకు, అంకితం తీసుకున్న వారికి కృతజ్ఞతలు తెల్పడం గమనిస్తాం.

(c) స్వీయ పీఠికలో రచయిత వ్యక్తిగత జీవితానుభవాలు, రచనా నేపథ్యం, గ్రంథాన్ని ముద్రించడంలో పడ్డకష్టాలు అన్నింటినీ స్వీయ పీఠికలో చెప్తాడు.

(d) పర పీఠికలో కవి, కాలం, వ్యక్తిత్వం, అతని జీవనశైలి గ్రంథ ప్రశంస, గ్రంథ నేపథ్యం విషయ పరిచయంతో పాటు, కావ్యగుణ దోష విచారణ కూడా కనిపిస్తుంది.

పై విషయాలన్నింటిని గమనించి పీఠిక ముఖ్య ప్రయోజనం "*విషయ వివేచనతో చక్కని శైలీవిన్యాసంతో కూడిన మంచి పీఠికలు పాఠకుల చిత్తాకర్షకాలై రచయిత శేముషీ వైభవానికి నికషోపలాలై విరాజిల్లుతాయి. పీఠికలవల్ల కలిగే ముఖ్య ప్రయోజనం ఇదే*" అని భాస్కర చౌదరిగారు పేర్కొన్నారు[40].

మొత్తంమీద పీఠిక గ్రంథాన్ని అర్థం చేసుకోడానికి తోడ్పడిదిగా ఉండి అందుకు అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది.

సి.ఆర్. రెడ్డి పీఠికలలో ఒక కావ్యానికి లేదా గ్రాంథానికి పీఠిక రాసేటప్పుడు సాధారణంగా వాటిని మూలగ్రంథాలతో పోల్చి, వాటిలోని మంచి చెడులను వివేచించి పీఠిక రాశారు. పీఠిక అనేది విమర్శ రంగంలో ఒక భాగం కాబట్టి, ఇది పీఠిక విమర్శ కిందికి వస్తుంది. పీఠిక రచన ఒక విమర్శ కళగా భావించి, రచనలలో వైయక్తికమైన ముద్రతో విలక్షణంగా పీఠికలు రాయగల తెలుగు సాహిత్యకారులు చాలా తక్కువనే చెప్పుకోవచ్చు. అట్టి వారిలో కట్టమంచి రామలింగారెడ్డిగారు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, విశ్వనాథ

---

[39], తెలుగుపీఠికలు, పుట: 27

[40] . డా.సి.ఆర్. రెడ్డి పీఠికలు–భూమిక.vii

సత్యనారాయణగారు, వేటూరి ప్రభాకర శాస్త్రిగారిని పేర్కొనవచ్చు. వీరి పీఠిక రచనలలో ఒక్కొక్కరిలో ఒక విలక్షణమైన పద్ధతీ, శైలీ కనిపిస్తుంటాయి.

### 4.6.6 రామలింగారెడ్డి పీఠికల్లోని కావ్య విమర్శ విలువలు:

సి.ఆర్. రెడ్డి రాసినటువంటి పీఠికలలో ఎంతో ప్రాముఖ్యమైనది ఒక విమర్శ గ్రంథానికి బీజం వేసి దానికి సంక్షిప్త రూపంగా నిలచినది రెడ్డిగారు పింగళి సూరన కృతి యైన కళాపూర్ణోదయానికి రాసిన పీఠిక. ఈ పీఠికలోని కొన్ని అంశాలు ఒక విమర్శ గ్రంథావిర్భావానికి కారణమైనది. ఆ గ్రంథమే '*కవిత్వతత్త్వవిచారం*'. ప్రాచీన కావ్యాల పీఠికలలో ప్రత్యేకంగా పేర్కొనదగింది కట్టమంచి రామలింగారెడ్డిగారు రాసినటువంటి *కళాపూర్ణోదయ* పీఠిక. కవిత్వతత్త్వవిచారమే ప్రధానంగా సాగిన ఈ పీఠిక విశిష్టమైనది. తర్వాత కాలంలో అదొక విమర్శ గ్రంథంగా పేరొందింది.

- ★ కవిత్వతత్త్వవిచారం అను విమర్శ గ్రంథంలో రెడ్డిగారు కవిత్వ లక్షణాలను ఈ విధంగా ప్రస్తావించారు[41].
- ★ ''*కవికి ఆవశ్యకమైన ప్రధాన లక్షణం భావనా శక్తి. భావనా శక్తి అనగా విషయములను మనసులో ప్రతిభింబించినట్లు చేయు సామర్థ్యం.*''
- ★ ''*ఉద్రేకమూ కవితా శక్తికి ప్రాణాధారము. భావోద్రేకమునందు ఆలోచనకు తావిచ్చిన ఔచిత్యభంగమగును.*''
- ★ ''మనోరంజకమైన కవితా శిల్పమునకు ప్రయోజనం సుఖమే, కానీ చమత్కారం కారాదు''.
- ★ ''*రచన సంవిధానాన్ని బట్టియే కావ్యము యొక్క ఉత్కర్ష, నికర్షలను నిరూపింపనగునూ కానీ నీతినిబట్టి కాదు*''.
- ★ ''*కళ యొక్క పరమార్థము రసము. అందు రీతి, శిల్పం ప్రధానములు*''.
- ★ ''*వ్యాకరణము, ఛందస్సు, అలంకారములు, శ్లేషములు, మున్నగునవి కవిత్వము నందు అప్రధానములు.*''
- ★ ''*ఆలోచన ప్రధానమైన అలంకార శాస్త్రము, భావ బంధురమైన కవితా శిల్పముల దృక్పథములు విరుద్ధములు*''[42] అని రామారావుగారు వివరించారు. కవిత్వానికి ఉండవలసిన లక్షణాలను పై విధంగా చెప్పారు. కట్టమంచి రామలింగారెడ్డి

---

[41] కవిత్వతత్త్వవిచారము *పుట:43*

[42] .. తెలుగు సాహిత్య విమర్శ. పుట:194.

ప్రతిపాదించిన సాహిత్య అంశలలో భావనాశక్తి ముఖ్యమైనది. దాన్ని ఈ విధంగా నిరూపించారు.

★ *''భావనా శక్తియనగా విషయములు మనసులో ప్రతిభింబించినట్లు చేయు సామర్థ్యము. ఒక ప్రరిభింబించుటయననేల? ప్రత్యక్షముగా నవతారమెత్తునట్లు చేయుట''*[43].

★ *''కేవలం కల్పితమైన వానింగూడా సాక్షాత్కారం దాల్చిన చేతనములంజేయం జూచునది కావున భావనా శక్తి, నాటక కౌశలంబుతో నను సందించియుండును''*[44].

★ ''భావనాశక్తినుద్దీపింపజేయు ప్రకృతి భావతైక్షణ్యము మనుష్యుల మనంబులతో నిరంతర సంయోగముం దాల్చిన ప్రకృతులు మూడు గలవు.

(౧) ఆలోచనములు (కార్యకారణములంగూర్చి విచారము చేయుట, వస్తు స్వరూపము నిర్ణయించుట ఇత్యాదులు).

(౨) భావములు–అనగా మనోవికారములు. ఉదాహరణ: కామక్రోదాదులు, ప్రేమ పశ్చాత్తాపము, దయ, దాక్షిణ్యము మొదలగు చిత్త సంచారములు.

(౩) సంకల్పితములు: అనగా ఏదైనా ఒక దానిని కోరి దానిని సాధించాలని ప్రతిజ్ఞ చేయుట.ఈ మూడు శక్తులలో భావనా శక్తిని అధికంగా విజృంభింపచేయునవి భావములు''[45].

★ *''భావనా శక్తి సంఘటనోత్సాహము ఇవి పరస్పర మిత్రములనుట విమర్శ శాస్త్రమందలి యాదిమ తత్త్వము.''*[46]

★ *''భావములతో సాంగత్యము దాల్చినదిగదా భావనాశక్తి.....ఇక భావనాశక్తి యొక్క తెరంగన్ననో మనః ప్రకృతులన్నింటికన్ననూ గోప్యమైనది దాని చర్యలను గణింపే కాదన్నవిక నిరూపించుటేట్లు''* [47]

★ *''భావనా శక్తి అనేక మాయలంబన్నులీల వినోదిని. ఈ మాయలన్నింటికీ సామాన్య లక్షణమొకటియే. ఏ రసము నుత్పాదింపజూచునో దానిని కవియే మనః పూర్ణముగా దాల్చినగాని చదువరులయందు అభిమతమగు చిత్త విభ్రమము కలుగ నేరదు. భావముల నంతములనగా ధములుగాఁ బ్రభవిల్లిన గనియు నమోఘుడగును.''*[48]

---

[43] . కవిత్వతత్వవిచారము,–పుట:04.

[44] కవిత్వతత్వవిచారము, పుట:8

[45] కవిత్వతత్వవిచారము, పుట:8–9

[46] . కవిత్వతత్వవిచారము, –పుట09

[47].కవిత్వతత్వవిచారము, పుట38

[48]. కవిత్వతత్వవిచారము *పుట:43*

కట్టమంచి రామలింగారెడ్డిగారు పైన చెప్పబడినటువంటి భావనా శక్తి లక్షణాలు సంస్కృతాంధ్రం నుండి తీసుకోబడలేదు. పాశ్చాత్య విమర్శలో నుండి తెలుగులోకి తీసుకోబడినవి. కట్టమంచి రామలింగారెడ్డి ఈ కవిత్వతత్వ విచారం గ్రంథంలో విమర్శ లక్షణాలను సిద్ధాంతాలను కూడా సూచనా ప్రాయంగా చెప్పారు.

★ *''విమర్శనము చేయుటలో కథ, పాత్రములు, ప్రకృతి విశేషములు, వర్ణనములు ఇవన్నియు పరస్పర మైత్రి కలిగి విరుపులు లేని ఏకాకృతిగానున్నవా యను విచారణ ప్రధానతమము''.*

★ *"రసభంగమా కాదా అనుటయే శిల్ప విమర్శనము యొక పరీక్ష"*

★ *"వర్ణనములకన్నా కావ్యమందలి అంగాంగములకు గల కలయిక" ముఖ్యము.*

★ *"ఉన్న భాగములనుతీసి వేయవచ్చునా, కొత్తవి ఏవైనా చేర్చవచ్చునా అని విమర్శించుట ఐక్యమను కథా లక్షణమును విమర్శించు పద్ధతి".*

★ *"కథాంగములు ఏకీభావము దాల్చి యెక శరీరముగా ఏర్పడియున్న కళకు ప్రాశస్త్యము."*

ఈ విధంగా విమర్శ లక్షణాలను కొన్నింటిని ప్రస్తావించివున్నాడు.

"*కళను గురించి చెప్పేది కళ విమర్శ*" అన్నాడు వాల్టర్ పీటర్. ఈ అనుభూతిని సాహితీ జగత్తుకు అందించిన ఆధునిక సాహిత్య విమర్శకుడు కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఆయన పీఠికల్లో అనువర్తిత విమర్శ లక్షణం కనిపిస్తుంది. అది అనాటికి కొత్త ప్రయోగం. కాబట్టి కట్టమంచివారు కావ్యానుశీలనయుగాన్ని (Era of evaluative criticism) ప్రవర్తింపజేశారనవచ్చు[49].

కట్టమంచివారి కవిత్వతత్వవిచారం, ఆంధ్ర విమర్శనా లోకానికి ఒక నూతన ద్వారాన్ని చూపించిందనవచ్చు. అంతకు పూర్వం కావ్యాలను విశ్లేషించి విధానం ప్రచారంలో ఉండగా వారు తమ విమర్శద్వారా కావ్యార్థాలకు విలువలుకట్టే విధానాన్ని తెలుగులో ప్రవేశపెట్టారు. చారిత్రక స్పృహకంటే, సాహిత్య మీమాంస స్పృహను విమర్శకు కల్పించారు. పాశ్చాత్య ప్రమాణాలను ప్రాచీనాంధ్ర కావ్యాను శీలనంలో ప్రయోగించి విమర్శ ప్రస్తారాన్ని సాగించారు. ఆ అభినవ దర్శనంలో సజీవ విమర్శ ఆవిర్భవించింది. కావ్యంలో ఆత్మభూతమైన కవితాతత్వం కేంద్రంగా కావ్య నిర్మాణాన్ని వివేచించాలన్నా వివేకం కట్టమంచివార తెలుగు విమర్శకు

---

[49]. ఆంధ్ర సాహిత్య విమర్శ–ఆంగ్ల ప్రభావం:. పుట:28.

నేర్పారు. అనుశాసనం కంటే అనుశీలనం ఆధునిక విమర్శకు అనువైన పద్ధతి అని సి.ఆర్.రెడ్డి గారి విమర్శ గురించి ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు వ్యాఖ్యానించారు[50].

రామలింగారెడ్డి తెలుగుకు సృజనాత్మక విమర్శను చవిచూపించారు. తెలుగులో కవిత్వతత్వాన్ని ఆలోచించే అలవాటు చేశారు. ఆయన ఎంతటి ఆంగ్ల భాష పండితుడో అంతటి ఆంధ్రాభాషాభిమాని. తెలుగులో మాట్లాడితే పొల్లుకైనా ఆంగ్ల పదం దొర్లేదికాదు. ఆయన విమర్శ కూడా ఆ లక్షణాన్ని అలవర్చుకుంది. ఆయన తన విమర్శకు ప్రమాణాలన్నీ చాలా వరకూ ఆంగ్లం నుంచి తెచ్చుకున్నవే కానీ అవి అరువు తెచ్చుకున్నట్లుండవు. విజాతీయాలుగా తోచవు. వారు కావ్యానుశీలనంలో ప్రమాణాలుగా ఉపయోగించే భావనా శక్తి (Inagination) వస్త్వైక్యం (Unity of Plot)మొ. విదేశీయాలైనా విశ్వజనీనాలుగా వారి విమర్శలో వెలుగొందాయి[51]. సంప్రదాయం నుండి ఎదిగి ఆధునికత వైపు దృష్టి సారించిన మనిషి కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఈయన కావ్యాలకు రాసిన పీఠికల్లో కూడా ఆ ఆధునికతే కనిపిస్తుంది.

పింగళి, కాటూరిల 'తొలకరి' కావ్యానికి పీఠిక రాస్తూ ప్రాచీన, ఆధునిక రచనలకూ, భాష, శైలి, ఛందస్సుల భేదాన్ని గుర్తించారు. *"ఆంధ్ర భాషయను మహా వనము కొన్ని శతాబ్దములుగా వ్రాత ప్రబంధములను పండిన యాకులను రాల్చి పాశ్చాత్య సంపర్కమను కృషి మొదలగు కారణములచేత దనకు నిజమైన పునర్వికాసము సూపుటకారంభించి క్రొత్త క్రొత్త చిగుళ్ళను, బూవులను వెలిచుట్టుచూ, నవీన వసంతమును ధరించి యంతయు మనోహరమగా నున్నది. అని భావకవిత్వాన్ని గూర్చి చెప్తూ వాడబడు పదములు వేరు. అవి కూర్పబడు విధములు వేరు"* అని చెప్పినారు[52].

స్థానపతి రుక్మిణమ్మ రాసిన 'కాదంబిని'కి పీఠిక రాస్తూ ఖండ కావ్య శబ్ధ చర్చ చేశారు సి.ఆర్. రెడ్డిగారు. "*ఖండ కావ్యమను మాట నిర్దుష్టము కాదని, నా అభిప్రాయము అభాసమననూ తప్పులేదు. ఖండము అను పదముచే అసమగ్రము, అసంపూర్ణము. ఇత్యాదిభావములు స్పురిస్తాయి. ఖండకావ్యతము తనంటనే పరిపూర్ణము. ఇంకోకకృతి యొక్క విభజనము కాదు; విచ్ఛిన్నముకాదు. మఱి భాగములు అనేకములు కలిసినగాని సహజమైన పూర్ణాకృతి నిర్మాణమునకు రాదు-అను సూచనకు అవకాశం లేనిది*". అంటూ ఇంగ్లీషులోని

[50] .ఆంధ్ర సాహిత్య విమర్శ-ఆంగ్ల ప్రభావం. పుట:29

[51] .ఆంధ్ర సాహిత్య విమర్శ-ఆంగ్ల ప్రభావం-. పుట:29.

[52] .కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలు: పుట 166

'షార్టర్ పోయెమ్స్' అన్న పేరుకు ఈ పర్యాయ పదం సరైందికాదని, చిన్నవి, పొట్టికి, లఘువులు, ధీర్ఘము కానివి ఇటువంటి మాటలలో పేర్కొంటేనే ఉచితమన్నారు. "*అఖండము కానిది కృతకానేరదు. సజీవమైనగానీ మనల రంజింప జేయజాలదు చైతన్యముతోటి సంపూర్ణమైన ఆకృతిగా నుండుటే గదా సజీవ లక్షణము! నిర్జీవము కవిత్వమా! ఇక జీవముండిన యెడల ఖండత్వమెక్కడిది*". అని ప్రశ్నించారు[53].

కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలను వర్గీకరించడంలో సంపాదకులు 'అభిజన కృతుల పీఠికలు' అని ఒక విభాగం చేశారు. అభిజనం అంటే దగ్గరి వారు అని నిఘంటుకార్థం. ఈ పీఠికలోని ప్రత్యేకత ఏమిటంటే ఆయనే చెప్పుకున్నట్లుగా "*మా వంశ చరిత్రయే కాక పూర్వమున మా గ్రామ వృత్తాంత మేరీతిని ఉండేననుటయు గలగన్న మాడ్కినైన గోచరింపక పోదు*" ఈ పీఠికల వల్ల రామలింగారెడ్డి బాల్య జీవిత తెలుస్తుంది[54].

కాళ్ళకూరి గోపాలరావు రచించిన 'అపూర్వ సంఘ సంస్కరణము' నకు పీఠిక రాస్తూ హేళన కావ్య రచనకు తెలుగులో వేమన, కందూకూరి వీరేశలింగం దక్షులని చెప్తూ, ఈ *అపూర్వ సంఘసంస్కరణము* అటువంటి హేళనా కావ్యమని చెప్పారు. అయితే గోపాలరావుగారి భావాల విషయంలో ఏకీభవించలేదు రెడ్డిగారు. ముఖ్యంగా ఈ గ్రంథంలో వాక్పారుష్యము, సర్వతిరస్కారభావమూ, సహజోద్ధారక మార్గాలను సూచించక పోవడమూ రామలింగారెడ్డి మెచ్చని విషయాలు అయి ఉంటాయి. ఇట్లు వీరి అభిప్రాయమున అధునాతన, సనాతన మార్గములు రెండునూ దోష దూషితములే ఇక దిక్కేమయ్య యంటరేని 'కాలమేగతి' యేని యోదార్చుచున్నారు. 'సర్వ సంస్కరణంబులు'ను 'సహజముగ' వచ్చునట. కాలాను సారముగా దనంతట వలదన్నను వచ్చు సంస్కారము నాకు జూడ నొక్కటే అగ్ని సంస్కారము అన్నారు రెడ్డిగారు.

లోపాలను విమర్శించడంతో తృప్తి పడక సన్మార్గాన్ని చూపించాలని రామలింగారెడ్డిగారి అభిప్రాయం. అందుకే వీరికి బ్రాతది పనికిరాదు, కొత్తది మొదలే గిట్టదు. ఇక నేది పనికి వచ్చును మనకి చెప్పరు. ఇకముందు బయలువెడలు గ్రంథములో ఖండనముతో పని చాలించుకొనక సన్మార్గ దర్శనము కొంత కలిగింతురు కాబోలు అన్నారు. ఆర్థిక స్థితి, సంఘస్థితి పరస్పర సంబంధం కలిగి ఉంటాయని మానవ ప్రవృత్తిలో పరమార్థము, భావము, కార్యము అని మూడంశాలు ఉంటాయని, వీటిలో అన్ని మంచివి, అన్ని చెడ్డవి, కొన్నిమంచివి,

---

[53]. సి.ఆర్.రెడ్డి పీఠికలు: పుట174

[54]. తెలుగు పీఠిక, పుట:224

కొన్ని చెడ్డవి కావచ్చునని అంటూ "సంఘపరమైన దృష్టితో జూచిన గార్యములకుండు గౌరవము భావములకు లేదు. అన్నారు[55]. విమర్శకుడికి ఉండాల్సిన లక్షణాల్లో సహృదయత అనేది ఇక్కడ కనిపిస్తుంది.

వస్తువునకు సంబంధించి కట్టమంచి రామలింగారెడ్డి అభిప్రాయాలు విశిష్టమైనవి. విషయం, శైలి పరస్పరం తగినట్లుగా ఉండాలంటాడు. ఆత్మకథ యందు రచన మనోహరము, గాథ లోకోత్తరము అన్నారు. ఇంతకంటే గొప్ప రచనలు వస్తాయని విశ్వాసం ప్రకటించాడు. "*దేశభక్తి, ఆంధ్రాభ్యుదయరక్తి పితృపూజ ఇవన్నియు మనజీవితమున అఖండమైన జ్యోతులు. వాటి వెలుగుచే మనల్ని ఆవరించి ఉండు తమము కొంతకు కొంత విరియును. అయిననూ వీనికిని మించిన యితి వృత్తములు లేక పోలేదు. యావన్మానవుల యాత్మలను పరవశములచేసి హృదయమున కలిగించి మనసులకు నిశ్చైతన్య మొసంగెడు కావ్యములు భారత రామాయణముల వంటివి పుట్టవా యికముందు? హైందవ భావనాశక్తి అడుగంటి ఇంకిపోలేదు. దేశమునకు స్వతంత్ర పరిపాలనా భాగ్యము సంభవించినది. ఈ గొప్పదశకు తగినట్టి వీరకావ్యములను రాయు వారిలో తుమ్మల సీతారామమూర్తి యున్నాడా? లేడా? ఉన్నాడని నా నమ్మిక" అన్నారు. "సరస్వత్యారాధనతోడ దేశారాధనముచేసి శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి ద్విగుణీకృత కృత కృత్యుడైనాడు"* అని పేర్కొన్నాడు[56]. ఈ విషయాలన్నింటినీ చూసినట్లయితే కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలలో కవిత్వాన్ని గూర్చిన చర్చ అధికంగా ఉండటం, ఇంగ్లీషు మాటలు అసలు వాడకపోవటం వంటివి రామలింగారెడ్డిగారి పీఠికల్లో కనిపించే విశిష్టాంశాలుగా పేర్కొనవచ్చును.

మన పూర్వీకులది అలంకారిక విమర్శ. ఇందులో సాహిత్య సాంఘిక విషయాలు కాని మరొక సాహిత్యంతో పోల్చి చూసే తులనాత్మక పద్ధతి ఉండేది కాదు. రెడ్డిగారు ఆలంకారిక విమర్శని విడనాడాడు. రెడ్డిగారి విమర్శలో పాశ్చాత్య విమర్శనా రీతులు చోటుచేసుకోవడంతో వీరి విమర్శ నా స్వరూపమే మారిపోయింది. విమర్శకులు అంటే కేవలం అలంకారిక శాస్త్రంలోని సిద్ధాంతాలను ప్రాతిపదిగా పెట్టుకోని బాగోగులు నిర్ణయం చేసేది కాదని సాహిత్యాన్ని సంఘాభ్యుదయం వైపు నడిపించేదని రెడ్డిగారు భావించారు. అందుకే వీరు భారత రామాయణాలను కూడా అభ్యుదయ దృష్టితోనే చూశారు. వీరు వాడిన భాష వీరి విమర్శనా

[55] . తెలుగు పీఠిక, పుట.245

[56] . తెలుగు పీఠిక, పుట.246

శైలికి సొంపు కూర్చి పెట్టింది. రెడ్డిగారు భాష అధికారం కలిగి తులనాత్మక పరిశీలన, మనస్తత్వ పరిశీలన, సాంఘిక పరిశీలన ఎక్కడ ఏది అవసరమో దాన్ని వినియోగించుకొని కావ్యాలను విమర్శించేవాడు. ఆ రకంగా రెడ్డి గారికి స్వతంత్ర విమర్శ, తెలుగు విమర్శనా రంగంలో స్థానం ఏర్పడింది. రెడ్డి గారి విమర్శకు దేశంలో స్థానం ఏర్పడిన తరువాత అలంకారిక గ్రంథాలను ప్రామాణికంగా తీసుకొని విమర్శించే విధానం కొంత మరుగున పడింది. ప్రామాణిక గ్రంథాల నియమాలను ఉల్లంఘించిన గ్రంథాలను పనికిరానివిగా జమ కట్టడం కూడా తగ్గి వాటిపై పాశ్చాత్య ప్రభావం ఏమైనా ఉందా అనే పరిశీలనా దృష్టి ఏర్పడింది. ఏ గ్రంథాలు ప్రామాణికం లేకుండా వ్యక్తిగతంగా ఆలోచించి చేయబడే విమర్శ కూడా గుర్తింపు, ఆదరణ లభించింది. విమర్శకుడికి కవి యొక్క పాండిత్యం కన్నా కావ్య పరంగా లభించే ప్రయోజనం ముఖ్యంగా మారింది.ఈ విధంగా పీఠికలు రాయడంలో కట్టమంచి వారి విమర్శ విశిష్టంగా కనిపిస్తుందని తెలుస్తుంది. దీనివల్ల పీఠికను విమర్శస్థాయికి తీసుకెళ్ళిన ఘనత కూడా వీరికి దక్కుతుంది.

### 4.7 విమర్శకుడిగా కట్టమంచి – వివిధ విమర్శకుల విశ్లేషణ

తెలుగు సాహిత్య విమర్శకు ఆద్యుడుగా కట్టమంచి రామలింగారెడ్డిగారిని చాలామంది పేర్కొంటున్నారని వివిధ సందర్భాల్లో ప్రస్తావించినప్పటికీ, తెలుగు సాహిత్య విమర్శకుల అభిప్రాయాలను క్రోడీకరించడం ద్వారా 'విమర్శకుడిగా కట్టమంచి' వైశిష్ట్యం మరింతగా స్పష్టమవుతుందని భావిస్తున్నాను.

19వ శతాబ్దం వరకు తెలుగు సాహిత్యరంగంలో సాహిత్యవిమర్శ లేదు. అంతేకాదు తెలుగులో సంస్కృతానికి భిన్నమైన సాహిత్యసిద్ధాంతం కూడా లేదు. దాదాపు ఏడువందల సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు సాహిత్యంలో ఒక యుగాన్నో, ధోరణినో, కావ్యాన్నో పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ ఎవరూ విమర్శ రాయలేదు. కవుల చరిత్రలూ, వ్యాఖ్యానాలూ మాత్రమే సాహిత్యవిమర్శగా చెలామణి అవుతుండేవి. ముఖ్యంగా ఒక కావ్యాన్ని తీసుకొని అందులోని వస్తువునూ, రూపాన్నీ విశ్లేషిస్తూ, వాటి పరస్పర సామంజస్యాన్ని చర్చిస్తూ, ఆ కావ్య ఉద్దేశాన్ని నిరూపిస్తూ విమర్శలు రాసే సంప్రదాయం అప్పటికింకా ప్రారంభం కాలేదు. కవిత్వవిమర్శ మొత్తం కావ్యం ప్రాతిపదికగా కాకుండా ఒక పద్యమో శ్లోకమో ప్రాతిపదికగా సాగుతూ వచ్చింది. ఈ ధోరణికి స్వస్తి చెప్పి ఒక కావ్యాన్ని సమగ్రంగా విశ్లేషించే విమర్శకు రామలింగారెడ్డి గారు "కవిత్వతత్వవిచారం"లో బాటలు వేశారు. అంతేకాకుండా ఒక ధోరణి

కవిత్వాన్ని చర్చించి విలువ కట్టే సంప్రదాయాన్ని కూడా వారే ప్రారంభించారు[57].అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య అభిప్రాయ పడ్డారు.

విద్యా సాహిత్య రంగాల్లో కట్టమంచి వారు కొండంత రెడ్డి. ఆ కొండ శిఖరం నుంచి ఎన్నో మెరుపులు మెరిశాయి , ఉరుములు ప్రతిధ్వనించాయి. ఝురులు ప్రవహించాయి. పరిసరస్థమైన ప్రజానీకం మొదట దిగ్భ్రమ పొందిన తర్వాత మేల్కొంది. ముందుకు సాగింది. సాహిత్య రంగాలలో సరికొత్త భావాలకు, నూతన ఆలోచనరీతులకు మనో వికాసాత్మక మైన విమర్శకు కట్టమంచి వారు చేసిన దోహదం అదృశ్యం. వారి ముసలమ్మ మరణం ప్రబంధ కవితకు మరణం. వారి కవిత్వ తత్త్వ విచారం నూతన విమర్శకు నాంది. ఒకవైపు తెలుగు కవితను, మరోవైపు కవితా విమర్శను నూతన శోభతో, కొత్త కాంతులతో ఆవిష్కరించిన సాహితీమూర్తి కట్టమంచని[58] ఆచార్య జి.ఎన్.రెడ్డి కట్టమంచి గురించి ఆయన కవిత్వం గురించి విమర్శా దృక్పదం గురించి పేర్కొన్నాడు.

తెలుగు సాహిత్య వికాసమునకు కారకులు కట్టమంచి రామలింగారెడ్డి. కావ్య శరీర విచారణమే కావ్య విమర్శగా పరిగణించబడుతూన్న కాలమున విమర్శకుల దృష్టిని కవ్యత్మా వైపు మరల్చిన సహృదయ శిఖామణి కట్టమంచి రామలింగారెడ్డి. కట్టమంచి పరిశీలించని ఆంధ్ర కావ్యములు లేవు. పల్లె పదాలు మొదలుకొని భారతం వరకు గల గ్రంథముల న్నీ ఆయనకు సుపరిచితము.ఆంగ్ల భాషలో అపారమైన వైదుష్యం కలిగి, పాశ్చత్య సారస్వతము అంతయు అవలోకించేను. విదేశాలకు వెళ్ళినప్పుడు ఆ దేశీయ స్థితిగతులను బాగా పరిశీలించి వారి చరిత్ర, సాహిత్యం ,తత్వం, సాంఘిక జీవనం మొదలైన అంశాలన్నింటినీ అవగాహన చేసుకొని స్వతంత్రత, సమానత్వం వారి అభివృద్ధికి మూల కారణం అని తెలుసుకున్నాడు. పాశ్చాత్య సంస్కృతిని జీర్ణించుకున్న వాడు కావడం చే పాశ్చాత్య సంస్కృతి సాహిత్య ప్రభావం అధికంగా కనపడుతుంది. అంచేత నే భారతీయ సాంప్రదాయాలను ఆచార వ్యవహారాలను విశ్వాసాలను అతడు తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ నిరసన దృష్టి అతని రచనలన్నింటిలోనూ కనిపిస్తుంది. సాంఘీక విమర్శయే కట్టమంచి సాహిత్య విమర్శకు హేతుభూతం అయింది. కానీ అంతమాత్రాన ఆయనను కేవలం పాశ్చాత్య వ్యామోహ పరునిగా భావించుట యుక్తము కాదు.

---

[57] శతవసంత సాహితీ మంజీరాలు:పుట.499

[58] Dr.c.r.reddy souvenir:pg.15

నిద్రాణమై ఉన్న భారత జాతిని జాగృతం చేయుటకు ఆవశ్యకమైనది స్వతంత్ర పిపాస అనియు దానికి  పాశ్చాత్య సంస్కారం దోహదం చేయగలదని రామలింగారెడ్డి విశ్వాసం. విమర్శ లేనిదే వివేకో ఉండదు అని భావించిన రామలింగారెడ్డి ఆంధ్ర కావ్య విమర్శ మహరంభమునకు ప్రథమాచార్యులుగా పేర్కొనదగినవారు[59].ఇది కట్టమంచి రామలింగారెడ్డి విమర్శనమీద ఆచార్య ఎస్.వి.రామారావుగారి అభిప్రాయం.

కట్టమంచి రామలింగారెడ్డి రచించిన వ్యాసమంజరికి పింగళి లక్ష్మీకాంతం పీఠిక రాస్తూ ఆధునిక  వచన కవిత్వ  ఆవిర్భావానికి, ఆంధ్ర విమర్శనానికి విరేశలింగం ఆధ్యుడనైనారని చెప్పాడు. కట్టమంచి రామలింగారెడ్డి విమర్శా దృక్పథాన్ని పింగళి లక్ష్మీకాంతం ఇలా చెప్పారు. *"యథార్థమైన ఆంధ్ర కావ్య విమర్శ ప్రారంభము కవులచరిత్ర పుట్టుకకు తరువాత జరిగినది. ఆ మహారంభమునకు ప్రథమాచార్యుడుగా పేర్కోనదగినవాడు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి" అని తెలియజేశారు. ఇవేకాకుండా కట్టమంచి రామలింగారెడ్డి తెలుగు సాహిత్య కవిత్వాన్నీ, వ్యాసరచనాన్ని,విమర్శనా దృక్పథాలను అంచనావేస్తూ "శబ్దసాధుత్వా సాధుత్వ నిర్ణయమే గ్రంథ విమర్శనమనెడి భ్రమతో విద్యాంసులొకరితో నోకరు వాగ్యుద్ధములు చేయుదినములలో,భావకుల దృష్టిని శతాబ్దిక చర్చ నుండి తాత్విక మీమాంసకు మరల్చిన రసికుడు శ్రీ రెడ్డి. కావ్యమునకు శబ్దము ఆదిభౌతికాంశము మాత్రము,అది బహిరము,దాని ఆధ్యాత్మికాంశముతద్గతకళాసౌందర్యము.అదిఅంతరము.విమర్శమార్గమునుబహిరజగత్తు నుండి అంతరజగత్తునకు కొని పోయిన ప్రథమాంధ్ర విమర్శ గ్రంథము  శ్రీ రెడ్డి కృతి కవిత్వ తత్వ విచారము"[60]* అని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.  ఈ పీఠికలో  కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్య సేవను, విమర్శా దృక్పథాన్ని పింగళి లక్ష్మీకాంతం  తనదైన శైలిలో పేర్కొన్నారు.

"నాటి నవ్యసాహిత్యానికి సారధ్యం నెరసిన ముఖ్యులలో ముఖ్యులు డా.కట్టమంచి రామలింగారెడ్డిగారు ఒకరు. ''వారి ఆమోదము పొందడము, కవిగా పట్టభద్రులు

---

[59] తెలుగులో సాహిత్యవిమర్శ:పుట.163

[60] గౌతమి వ్యాసములు,పుట:103

కావడము[61].''   అని ప్రముఖ పరిశోధకుడు, భాషావేత్త పురిపండా అప్పలస్వామిగారు అభిప్రాయపడ్డారు.

భావనాశక్తని ప్రశంసిస్తూ శేషాద్రిరమణకవులు ''సి.ఆర్. రెడ్డి రచనలకు పీఠికలు రాసేముందు ఆయా గ్రంథాలను పలుమార్లు పఠించి గ్రంథ ప్రశస్తి వాఙ్మయమునకు ఆయా గ్రంథములకు గల సంబంధములు సూక్ష్మ దృష్టితో నారసి శ్రీరెడ్డిగారు పీఠికా రచనమున దమకుగల కౌశలమునంత జూపియున్నాడు. స్వారస్యము గ్రహించుట యందును దోషమును గుర్తించుట యందును శ్రీరెడ్డిగారికి అనన్య సామాన్యమగు నేర్పుకలదు. ఒక కవితా విషయమునే కాదు. పాత్ర పోషణమున, ఔచితియందు భావనాశక్తి యందు, రచనా కౌశలమున, విషయ నిరూపణమున, సమస్తాంధ్ర కవుల ప్రజ్ఞతిశయములను దఱచి, దఱచి యెఱింగిన శ్రీరెడ్డిగారి ప్రశంసా రూపములగు పీఠికలగు వాఙ్మయమున ఎంతేని విలువ కలదు''[62]  అని పేర్కొన్నారు.

సి.ఆర్.రెడ్డి గారి వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని మిళితం చేసి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు చెప్తూ ''గ్రంథకర్త ఆశలు, అభిమానములు, రాగద్వేషములు మొదలగు జీవన సూత్రములను గమనించి వారి హృదయావిష్కరణ పద్ధతులు, అందుచే మన హృదయములందు గలుగు సంవాద వివాదములను బయలుపరుచు (విమర్శ) రచనలకు తెలుగులో దారితీసిన వారిలో నేనెరింగినంత వరకూ అగ్రకేసరులు రామలింగారెడ్డిగారే[63]'' అని ప్రశంసించారు.

''కావ్య విమర్శనమున మొట్టమొదటిదియు, స్థూలమైనదియునైన కథా శరీరము యొక్క ముందు వెనుకల పొసగింపులలోని వైచిత్రిని పరిశీలించుట వలన రామలింగారెడ్డిగారు తెలుగులోని మొదటి విమర్శకుడు[64]'' అని ప్రముఖ పరిశోధకుడు, విమర్శకుడు కేతవరపు రామకోటి శాస్త్రి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

*సాహిత్య విమర్శకుడుగా కట్టమంచి సాగించిన ఉద్యమం వలన తెలుగు సాహిత్య విమర్శ పై పాశ్చాత్య కాల్పనిక విమర్శ ప్రభావం ఉప్పెనగా పొంగి ముంచెత్తి వేసినట్లయింది.*

---

[61] సి.ఆర్.రెడ్డి పీఠికలు. viii

[62] శేషాద్రిరమణకవులు, లఘుపీఠికా సముచ్చయం. తొలిపలుకు.xii

[63] ఆద్యుడు కట్టమంచి, అనుమాండ్ల భూమయ్య, పుట: 65

[64] ఆద్యుడు కట్టమంచి, అనుమాండ్ల భూమయ్య, పుట: 65

*ఆయన అగస్త్యుని వంటివాడు కాబట్టి పాశ్చాత్య యుగ చైతన్య పయోధినంతా ఆపోసన పట్టి తెలుగులో దేశీయంగా వెలువరించగలిగాడు. అయినా ఆయనది ఉప్పెన లాంటి స్వభావమే ఆయనకు నచ్చని వాటిని ముంచటం తెలుసు మెచ్చిన వాటిని తేల్చడం తెలుసు. అడ్డం వస్తే కోత పెట్టడం తెలుసు. ఉప్పెన వలన ఒండ్రు మట్టి కొత్తగా వచ్చి పొలాలను సారవంతం చేసినా, ఉన్న పంట ముందుగా గంగలో మునిగి పోయే ప్రమాదం ఉంటుంది. పొంగే ఉప్పెన తీయక మానదు; తీసిన తర్వాత పొలాలకు పడ్డ గండ్లను రైతులు పుడ్చుకుంటారు. ఒండ్రు ను రక్షించుకుంటారు. విదేశీయమైనా ఒండ్రు సారవంతమైన మట్టి. దానిమీద దేశవాళీ పంటలు మూడు పువ్వులు ఆరు కాయలుగా పండించుకుంటారు. రెడ్డిగారు ఆంధ్ర సాహిత్య విమర్శ క్షేత్రానికి అటువంటి మేలు చేశారు. అని కట్టమంచి రామలింగారెడ్డి పాశ్చాత్య విమర్శా విధానం తెలుగు సాహిత్య విమర్శకు మేలు చేకూరుస్తుందని*[65] జి.వి సుబ్రమణ్యం ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం అనే గ్రంథం లో పేర్కొన్నాడు.

తెలుగు సాహిత్య విమర్శలో కట్టమంచి రామలింగారెడ్డి చేసిన విమర్శ కృషిని, వివిధ విమర్శకుల అభిప్రాయాలను తెలుసుకున్నం. దీనినిబట్టి విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి వస్తునిష్టకు ప్రాధాన్యమిస్తున్నారని పాశ్చాత్య ప్రభావాన్ని తెలుగు సాహిత్యం పై ప్రసరింప చేశారని అర్థం అవుతుంది. ఆ విధంగా సాహిత్య విమర్శకుడుగా కట్టమంచి రామలింగారెడ్డి గుర్తింపు పొందారనిపిస్తుంది.

### 4.8 కట్టమంచి సాహిత్య విమర్శ తెలుగు విమర్శకులపై ప్రభావం

రామలింగారెడ్డి సాహిత్య విమర్శ కవిత్వ తత్వ విచారం వెలువడి ఇప్పటికీ దాదాపుగా వంద సంవత్సరాల పైన అవుతుంది. అది ఇంకా పాశ్చాత్య సంప్రదాయం నూతన సంప్రదాయం కనబడుతూనే ఉంది. దీనిని బట్టి చూస్తే అది తెలుగు సాహిత్యంలో పూర్తిగా విలీనం కాలేదేమో అనిపిస్తుంది. దీనికి కారణం ప్రాచీన విమర్శనా పద్ధతి మన పైన వేసిన బలమైన ముద్ర కావచ్చు. సాహిత్యం సంఘం తో ముడిపడి ఉండడం వలన ఈ మూఢ నమ్మకాలు మూఢ సంఘ ప్రగతికి హాని కలిగించే విషయాలు ఎన్నో సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. ఈ సాహిత్యాన్ని విమర్శకులు పరిశీలించి లోపాలను చూసి నూతనమైన

[65] ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం,పుట.146

ప్రతిపాదనలు చేస్తారు ఆ ప్రతిపాదనలు ఆమోదించినప్పుడు కొత్త రచనలు పుడతాయి అలా ఆమోదించబడిన రచనలు విమర్శలు వెలువడిన తర్వాత వచ్చాయి.

రెడ్డి గారు కవిత్వ తత్వం రాసిన తరువాత విమర్శనా గ్రంథాలు రాసిన ప్రతి ఒక్కరూ రెడ్డి గారి విమర్శ విధానాన్ని తడిమి చూడకుండా పోలేదు. రెడ్డి గారి విమర్శ గ్రంథానికి ప్రతి విమర్శగా 1940లో కాళురి వ్యాస మూర్తి **కవిత్వ తత్వ విచార విమర్శనము** అనే ప్రతి విమర్శ గ్రంధాన్ని రచించారు. ఈ గ్రంథంలో రెడ్డి గారు చెప్పిన ప్రతి అంశాన్ని విమర్శిస్తున్నట్టు కనిపిస్తుంది. రెడ్డిగారు కవిత్వ తత్వ విచారంలో ప్రబంద స్త్రీలు అందరూ ఒకే రీతిగా ఒకరిని పోలి ఒకరు ఉంటారు[66] అన్న మాటకు, ఒకేమాదిరిగా నున్న వ్యక్తిత్వం సున్నయగునా చెబుతూ ప్రబంధాల లోని స్త్రీ పాత్రలు ఏ విధంగా వేరుగా ఉన్నాయో పేర్కొన్నాడు. వరూధిని, గిరిక, సత్యభామ, సుభద్ర, మధురలాలస, అభినవ కౌముది, మొదలైన ప్రబంద స్త్రీల ను పేర్కొని వారి చర్యలు ఒకేమాదిరిగా లేవని కవిత్వ మహిమనెరిగిన కవి యిట్లే రాయునని ఇది తెలియని వారు ఏమన్నా కవికి నష్టం, కష్టం లేదని వ్యాస మూర్తి గారు పేర్కొన్నారు. రెడ్డి గారి విమర్శ దేనికోసం చేసి ఉందో అన్నది తెలుసుకొని ఉండి ఉంటే ఇలాంటి ప్రతి విమర్శలు వచ్చి ఉండేవి కాదు. రెడ్డిగారు కావ్య విమర్శ చేసింది, విమర్శ విమర్శ కొరకే అన్న ఉద్దేశంతో కాదు. విమర్శకుడు తన విమర్శలో ఒక్క ప్రయోజనాన్ని ఆశిస్తాడు. అలాగే రెడ్డి గారు కూడా సంఘ అభ్యుదయాన్ని ఆశించే ప్రబంధాలను విమర్శించారు. రామలింగారెడ్డి విమర్శనా ప్రధాన ఉద్దేశం ఇదే.

రెడ్డి గారి విమర్శ నా పద్ధతిని అనుకరిస్తూ ప్రతిఘటిస్తూ సాగిన వ్యాస మూర్తి గారి రచన రెడ్డి గారి విమర్శ మార్గంలో నడిచింది. ఆవిధంగా వీరు రెడ్డి గారు చేత ప్రభావితులయ్యారు అని చెప్పవచ్చు.రెడ్డి గారు పాత్రలను గురించి ప్రస్తావిస్తూ **"పాత్రలు బిగుసు బారినట్లు ఉన్న రంభ లు లేని లోకము గనిపెట్టి యందు ఋషీశ్వరుడగుట తప్ప వేరెండోపాయము లేని ఉపాయము స్త్రీ పురుషుల గుణ గుణ నడవడి వారుగా ఉన్నట్లు ప్రదర్శించుట సర్వకాల సర్వావస్థలయందు ఏకరీతిగా వర్ణించి వార్ ఉండుటయరుదు"**[67] అన్నారు. ఈవిషయాన్నీ విమర్శిస్తూ వ్యాసమూర్తి *"మనస్సులు వేరు సంపూర్ణముగా సరిపోయిన దుర్ఘటన విషయముల గూర్చి చర్చించినను సరే*

[66] కవిత్వతత్వ విచారము:పుట:23

[67] కవిత్వతత్వ విచారము:పుట:23

*యొకనికి దోచు భావము ఇతరుల భావములతో కొంతవరకు సదృశ్యములై యున్నను కొంతవరకు భిన్నములుగా నుండుననుట ప్రకృతి లక్షణము*[68]*. ప్రకృతి శాస్త్రముల యందు సామాన్య గుణములకు గౌరవం మేలైన వస్తు జ్ఞానమే యందు ముఖ్యం అట్లుకాక మనోరంజకమే ప్రధానం గల కవితాది శిల్పము నందు భిన్న గుణములకు గౌరవం ఎక్కువ చూడుడు. ఒక స్త్రీని జూచి మోహించినవాడు ఆమెకి స్త్రీ జాతి అంతటికీ గల సామాన్య గుణములచే ఆకర్షింపబడి మొహించును. పాత్రముల చరిత్రను విస్తరించుటలో ధర్మ నీతి వర్తనముల జూపి అందువలన పాఠకుల కట్టి ప్రవర్తన మలవడునట్లుగా చేయుట కవి కృత్యము. కావుననే శృంగార కావ్యములు రాసిన కవులు కూడా ఉత్తమ నాయికా నాయకుల పరిగ్రహించి వారివారి పవిత్రప్రేమ శాశ్వత దాంపత్యము మొదలగుధర్మ నీతి పరస్పరములగు విషయములు వ్రాసియున్నారు. లోకంలో ఒకరి మనసు వేరొకరి మనసు వాలే ఉండదు. అందరు భిన్న భిన్న ములైన మనసు కలిగిన వారే కానీ జనులనిట్లు నడువవలెను అట్లు నడవని యడల శిక్షా పాత్రులగుదురని శాసనాలున్నవి కదా అట్లే యుత్తమది గుణములను గవి పోషించు గ్రంథము రాసి ప్రజోపయోగ మొనరింప వలెను. మనోజంజకమే కాదు కవిత్వమందు ప్రధానము. దుర్మార్గుడు కానీ సన్మార్గుడు ఎట్టి వారును కూడా ఉత్తమ గుణములు వినుట యందాత్మృత సంతోషము కలిగియుందురు*[69].

వంచకుడు వంచించు వాడుండ కూడదని తలంచును. లోకమునకు దుర్మార్గము గావించు వాడు తనకెవరనూ దుర్మార్గము గావింపరాదని తలంచును. డబ్బు పుచ్చుకొని చంపబోయిన వాడు దగా చేసిన యెడల జంప నెంచిన వాడు నమ్మక ద్రోహమునకై విచారించును. కావున నుత్తమగుణముల కుండు విలువ లోకంలో మరి దేనికిని లేదు అనునది అందరిమనసులలో జేరియుండు ఏకాభిప్రాయము. కావున కావ్యమునకు ప్రధానమైనవి ఉత్తమాదర్శము అని వ్యాస మూర్తి గారి సమాధానం.

ఈ వ్యక్తిత్వాలు ఆదర్శాలు కాలానుగుణంగా మారుతాయి సీతలో ఆనాటి సాధుత్వం ఈనాడుంటే బ్రతకలేరు. వ్యక్తిగత సమస్యలు హావభావాలు పాత్రల భిన్న మనస్తత్వాలు చూపాలని రెడ్డి గారి ఉద్దేశ్యం. రాణులలో ఉండే ఆదర్శాలు కాదు. సామాన్యుల్లో ఎవరి వ్యక్తిత్వం ఎలా చిత్రిస్తే సహజంగా ఉంటుందో అలా పాత్రల వైవిధ్యం ఉద్దేశం వ్యక్తిగత రాగద్వేషాలకు

---

[68] కవిత్వతత్వవిచార విమర్శనము:

[69] కవిత్వతత్వవిచార విమర్శనము:

అనుగుణంగా ఒక వ్యక్తి పొగడడమో మరొక వ్యక్తిని తెగడడమో పరిపాటిగా సాగుతున్న సమకాలీన విమర్శ ధోరణికి స్వస్తి చెప్పి కేవలం కావ్యగతమైన గుణదోషాలు రెడ్డిగారు ఏరి చూపారు.

రెడ్డి గారి విమర్శ ధోరణి పలువురిని ఉత్తేజితులను చేసింది. రెడ్డి గారి విమర్శ గ్రంథానికి పూర్వం పింగళి సూరన రాసిన కళాపూర్ణోదయం స్వతంత్ర కావ్యమని పండితులు నిరాకరించడం వల్ల దానికి రావలసినంత ప్రసిద్ధి రాలేదని రెడ్డిగారన్నారు. రామరాజభూషణుడు కేవలం కల్పిత కథలు కృత్రిమ రత్నాలు అన్నాడు. తెనాలి రామలింగ కవి "ఊహించని తెలియ రాకుండా సూరపరాజు కళాపూర్ణోదయం రచించె అని ఆక్షేపించాడు". ఈ కల్పన కి ప్రతిభ అవసరమని రెడ్డిగారు భావించి విమర్శించారు. గ్రంధాన్ని ఎందరో కవులు విమర్శకులు పండితులు చూడడం జరిగింది. సూరన్న గ్రంథాల మీద ఎన్నో వ్యాసాలు విమర్శన గ్రంథాలు రెడ్డి గారికి ముందు తరువాత వచ్చాయి. రెడ్డి గారి విమర్శ గ్రంథం వెలువడిన తర్వాత కథలోని కావ్యాత్మ ని తర్కించే విధానం పాత్ర చిత్రణ పరిశీలన కావ్య రమణీయత శైలీ ప్రతిభా ఇలాంటి విషయాలను పరిశీలించే నూతన విమర్శనా దృక్పథం విమర్శకులలో చోటుచేసుకుంది. తెలుగుసాహిత్య విమర్శమీదే కాక ఆనాటి సమకాలీన కవులు, విమర్శకుల మీద కూడా రామలింగారెడ్డి ప్రభావం పడింది. దానిని ఇప్పుడు పరిశీలిద్దాం.[70]

### 4.8.1 రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ పై కట్టమంచి ప్రభావం

సాధారణంగా సమకాలికులుగా ఉన్నవాళ్లు లేదంటే ముందు తరాలకు చెందిన వాళ్లు వారి సాహిత్యం వల్ల గాని సాంగత్యం వల్ల గాని ఒకరికొకరు ప్రభావితం అవుతూ ఉంటారు అలాంటి ప్రభావమే రాళ్ళపల్లి పై కట్టమంచి ప్రభావం పడింది. ఇది వారి సాహిత్యం జీవిత చరిత్రను అధ్యయనం చేయడం వల్ల తెలుసుకోవచ్చు. శాస్త్రి గారికి రామలింగారెడ్డి పరిచయం కాక ముందు సంస్కృతంలో మంచి పాండిత్యం ఉండేది. అనేక కావ్య లక్షణ గ్రంథాలను పటించారాయన. సంస్కృతానికే పరిమితమైన రాళ్ళపల్లి వారి పాండిత్యాన్ని రెడ్డిగారు తెలుగు ఆంగ్లానికి విస్తరింపజేశారు. ఈ విషయాన్ని అనంత కృష్ణ శర్మ గారు **"పాత ప్రపంచమనే ప్రాకులాడుతున్న నాకు వారితోడి సహవాసము ఆధునిక ప్రపంచపు తలుపులు తెరచి ఆహ్వానించింది"** అని నా గురువులు అనే వ్యాసంలో చెప్పుకున్నారు. విశాలమైన దృష్టి

[70] రాళ్లపల్లి సంగీత సాహిత్య వ్యాసాలు: పుట:199

అనర్గళంగా మాట్లాడే శక్తి హృదయాన్ని ఆహ్లాదపరిచే హాస్యం, నిశితమైన విమర్శ నిర్భయమైన అభిప్రాయాలు కలగలిసిన కట్టమంచి వారి సాన్నిధ్యం రాళ్లపల్లి వారి ఆధునిక సాహిత్య సాన్నిహిత్యానికి దగ్గర చేసిందని చెప్పవచ్చు. తెలుగు సాహిత్య విమర్శ ప్రపంచానికి రామలింగారెడ్డి గారు అందించిన విమర్శమణి, రాళ్ళపల్లి వారు అని రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ పై పరిశోధన చేసిన ఉమేష్ పేర్కొన్నారు.

మూడేళ్ల పాటు రాళ్లపల్లి, కట్టమంచి ఇద్దరూ రామాయణ, మహాభారత, భాగవత మొదలైన విషయాల్ని చర్చించుకున్నారు. ఒకరికొకరు భావ వినిమయాన్ని గాడంగా చేసుకున్నారు. కాబట్టి అక్కడక్కడా కొన్ని అభిప్రాయాలు కలగలిసినా, కొన్ని అభిప్రాయాలు వైరుధ్యంగా పరిణమించాయి. శర్మగారు తిక్కన వేమన పై కవిత్వం పై మక్కువ పెంచుకోవడానికి రెడ్డి గారితో జరిపిన చర్చలు ప్రధాన కారణం. రెడ్డిగారికి శర్మగారి లోని సంస్కృతపాండిత్యం ఏవిషయాన్ని అయినా నేర్చుకోవాలనే అభిలాష నచ్చాయి. చర్చల్లో శర్మ గారి అభిప్రాయాన్ని కొన్నింటిని అంగీకరించే వారు కూడా, తెలుసుకోవాలనే ఆకాంక్ష రెడ్డి గారిలో అధికం.

శర్మ గారి, రెడ్డి గారి వయసులో వ్యత్యాసం ఉన్న సాహిత్యం వారిద్దరినీ కలిపింది. రెడ్డిగారు శర్మగారి ప్రతిభాపాటవాలు పాండిత్యం మీద ఉన్న నమ్మకంతో డిగ్రీలు లేకున్నా మైసూర్ మహారాజా కాలేజిలో తెలుగు పండితులుగా నియమించారు. ఈ విషయాన్ని శర్మ గారు ఇలా చెప్పుకున్నారు. ***"ఆ కాలేజీలో అది వరకు లేని తెలుగు శాఖను నాకోసమే ప్రారంభం చేయించినాడనినామ్మకం"***[71] అని కట్టమంచి వైలక్షణ్యం అనే వ్యాసంలో చెప్పుకున్నాడు. వేమన పై రాళ్ళపల్లి అంత గొప్ప పరిశోధన చేయడానికి రెడ్డి గారు అందించిన ప్రోత్సాహమే కారణం. ఈ విషయాన్ని బంగోరె ఇలా పేర్కొన్నాడు.... ఏఏ వ్యాసాలు, పుస్తకాలు చదవాల్సింది, ఎవరెవరితో సంప్రదించి ఏయే ప్రదేశాల్లో సంచరించి విషయ సేకరణ జరపాల్సింది సూచిస్తూ రాళ్లపల్లి వారిని పురికొల్పిన తీరు ఈ జాబుల్ని బట్టి ద్యోతకమవుతుంది[72]. ఇంకా అనేక విషయాల్లో రామలింగారెడ్డి రాళ్ళపల్లి వారిని ప్రోత్సహించే వారు.

---

[71] రాళ్లపల్లి సంగీత సాహిత్య వ్యాసాలు: పుట:174

[72] వేమన-సి.ఆర్.రెడ్డి:పుట:30

కట్టమంచి రామలింగారెడ్డి అప్పటికి మైసూర్ మహారాజా కాలేజీలో ఆచార్యులుగా ఉండేవారు. చరిత్ర తత్వ, తర్కశాస్త్రాలు, ఆంగ్ల సాహిత్యం మొదలైన సబ్జెక్టులు చెప్పేవారు. అలాగే కాలేజీ యాజమాన్యాన్ని ఎంతో సమర్థవంతంగా నిర్వహించేవారు. అలాంటి రెడ్డి గారి గురించి రాళ్ళపల్లి చదువుతో సంబంధం లేని వాన్ని కాబట్టి వారి వద్ద పుస్తకం పట్టి చదువుకునే యోగం నాకు లభించలేదు. అది లభించిన శిష్య పరంపరకు వారి యెడ కలిగిన భక్తి గౌరవాభిమానాలు మరి ఏ ఉపాధ్యాయుడు సాధింపలేని గొప్పవని చెబుతూ..... ***"విశాలమైన దృష్టి విశాలమైన వాగ్మిత్వము, హర్దమైన పరిహాస కుశలత, నిశితమైన విమర్శ, నిర్భయమైన అభిప్రాయాలు ఇవి వారి సొత్తులు"*** [73]అని ప్రశంసించారు.కట్టమంచి వైలక్షణ్యం అనే వ్యాసంలో నాకు రామలింగారెడ్డి గారికి కలిగిన బాంధవ్యం కేవలం ఆధ్యాత్మికమైనది, అంటే నా సాంసారిక జీవితంలో ఆయనకు గానీ ఆయన సాంసారిక జీవితంలో నాకు గానీ పరిచయం లేదు. తదనంతరం కొద్దికాలం తరువాత రాళ్ళపల్లి వారి పాండిత్యం పై నమ్మకంతో వేమన మీద ఉపన్యాసాలు ఇవ్వమని వారిని ప్రోత్సహించాడు. స్వయంగా రాళ్ళపల్లి వారే చెప్పుకున్నట్టు "ప్రాత ప్రపంచములోనే పాకులాడుతున్న నాకు రామలింగారెడ్డి సహవాసం ఆధునిక ప్రపంచపు తలుపులు తెరిచినట్లయింది అని చెప్పుకున్నారు. కొన్ని సందర్భాల్లో వారితో ఏకీభవించని సంఘటనలు కూడా జరిగాయి. వీరిద్దరి సాన్నిహిత్యం దినదినాభివృద్ధి చెంది ఇరు ప్రక్కలా మూడవ వ్యక్తి చొరబడలేని ముద్ద మధుర సంబంధం మాదని వారి మైత్రిని గురించి తలచుకున్నాడు. పాశ్చాత్య భావాలతో నిండిన కట్టమంచి వారి సాహిత్య అభిప్రాయాల్ని విని శర్మగారు ప్రేరేపితులయ్యారు.

కట్టమంచి రామలింగారెడ్డి గారు తమ కవిత్వ తత్వ విచారము, అర్థశాస్త్రము, ప్రతులకు ప్రూఫులు చూసే సమయంలో రాళ్ళపల్లి వారు సహకరించారని ఈ విధంగా చెప్పారు.

**శ్రీ మదనంత కృష్ణులు విశేష గుణాద్యులు సంస్కృతాంధ్ర భా**
**షా మహనీయ విద్యల విశారద భావులు నాకు తోడుగా**
**ప్రేమయి గారావంబు మెయి పెక్కు విధముల నిల్చి సేయనే**
**నోమితి గాక లేని యడ నోర్వగా నేర్తునే కార్యభారముల్**[74]

---

[73] రాళ్లపల్లి సంగీత సాహిత్య వ్యాసాలు: పుట:174

[74] కవిత్వతత్వ విచారము.పుట:3

ఈ విధంగా కృతజ్ఞతాపూర్వకంగా రాళ్ళపల్లి వారిపై అమితమైన సాన్నిహిత్యంతో చెప్పారు. వీటికి ప్రూఫులు దిద్దడం మూలంగా ఇవి రెడ్డి గారి రచనలు, కావు శర్మ గారి వనే వదంతులు వ్యాపింప బడినాయి. వాటిని శర్మ గారు ఖండిస్తూ కవిత్వ తత్వ విచారణ కి వచ్చిన కీర్తిని పొందే హక్కు నాకు లేదు అని ఈ సందర్భంగా మూడు అభిప్రాయాలను వెల్లడించారు.[75]

1 కావ్య నాటకాదులను శాస్త్రీయ మగు పారిభాషిక దృష్టితో చూచి తూచుట యొక దారి

2 దాని యందు తెలిసియో తెలియకయో ప్రతిపాదించిన ఆయా కాలపు సాంఘిక రాజకీయాది విషయములన నెరుగు కంటితో మూలమట్టుగా పరిశోధించుట రెండవ దారి.

3. ఇది కాక గ్రంధకర్త యొక్క ఆశలు, అభిమానములు, రాగద్వేషములు మొదలగు జీవన సూత్రములను బయలుపరచుట మూడవది.

వీటిలో మొదటి రెండు మార్గములు ఎంత ఉపయోగకరమైననూ గుమస్తా పనికి చేరినవి కేవలం విషయ సంగ్రహం మాత్రమే. మూడవది అనుభవ సంగ్రహము ఒక్క కావ్యమును విషయికరించు కొని వ్రాసిన మరొక కావ్యం అనవచ్చును. కిట్టి రచనలు తెలుగులో రావడానికి దారితీసిన వారిలో అగ్రేసరులు నెఱింగిన అంతవరకు కట్టమంచి రామలింగారెడ్డి గారే అంటూ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారు రామలింగారెడ్డి విమర్శ గొప్పతనాన్ని ప్రశంసించారు.

రామలింగారెడ్డి రచనలను అన్నింటినీ శర్మగారు చదివారు కొన్నింటికి ప్రూఫులు కూడా చూశారు. సాహితీ చర్చల్లో పాల్గొన్నారు. ఇలా ఒకరికొకరు చర్చలు జరపడం వల్ల ఒకరి ప్రభావం మరొకరి పై సాధారణంగా ఏర్పడుతూ ఉంటుంది. రెడ్డి గారి ప్రభావం శర్మ గారి కవిత్వం మీద కూడా పడింది శర్మ గారు రాసిన తారాదేవి (1911) మీరాబాయి (1913) రెడ్డిగారు చదివి మెచ్చుకొని అచ్చు కూడా వేయించారు. ఈ రెండు కావ్యాలు కూడా స్త్రీ కేంద్రీకృత ఇతివృత్తం తో నడుస్తాయి ఈ దృక్పథం శర్మగారిలో అలవడటానికి రామలింగారెడ్డి గారి ముసలమ్మ మరణం ఒక కారణం.

రామలింగారెడ్డి గారితో శర్మ జరిపిన సాహిత్య చర్చల ఫలితంగా పాశ్చాత్య సాహిత్య విమర్శ రీతులని అవగాహన చేసుకుని ఆయా సిద్ధాంతాలను మరింతగా విస్తృతం చేసిన వారు అనంత కృష్ణ శర్మ గారు. వారిపై కట్టమంచి రామలింగారెడ్డి ప్రభావం ఎలా పడిందో

[75] వేమన.పుట:3

చూద్దాం.కట్టమంచి కవిత్వ తత్వ విచారంలో భావానికి ప్రాధాన్యం ఇచ్చారు. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ భావంతో పాటు వస్తువు, రచనలకు ప్రాధాన్యం ఇచ్చారు. కట్టమంచి భావనాశక్తి ని చెప్పి ఒక ఆలోచన కలిగిస్తే, దాన్ని ఆధారంగా రాళ్ళపల్లి వారు కొంత మెరుగులు దిద్ది సాహిత్య విమర్శకు పటిష్టతను చేకూర్చారు. దీనివల్ల తెలుగు సాహిత్య విమర్శలో నూతన ద్వారాలు తెరుచుకు నట్లయింది. రెడ్డి గారు వేలు చూపితే శర్మగారు హస్తాన్ని దిగమింగి, తెలుగు సాహిత్య విమర్శను మరింత  విశాలం చేశారు.

రామలింగారెడ్డి కవిత్వ తత్వ విచారంలో భావనాశక్తి గురించి విపులంగా చర్చించారు అదేవిధంగా శర్మ గారు కూడా వ్యాసాల్లో కట్టమంచి భావాలకు దగ్గరగా ఉన్న నిర్వచనాలను అభిప్రాయాలను చెప్పినట్లు తెలుస్తుంది.

విమర్శలో కట్టమంచి ప్రభావం రాళ్ళపల్లి పై ఉంది అనడానికి ఇది ఒక ఉదాహరణ **"నాయిక వివాహం అనంతరం ఆమె చెలికత్తెలు అయినా శోభనం గది తలుపులు చెంత వదిలిన వదులుతారు ఏమో కానీ కవి మాత్రం అరక్షణం కూడా ఆమెను వదలడానికి అంగీకరించాడని"**[76] కట్టమంచి వారి పేర్కొంటే, శర్మ గారు ఇలాంటి అభిప్రాయాన్నే.... ***"స్త్రీలను వర్ణించు సన్నివేశం ఎట్టి దైనను మన కవులదృష్టి పడకటింటిలో పెండ్లికొడుకు దృష్టి యే కానీ వేరుండదు"***[77]. అని రాయల నాటి రసికత వ్యాసంలో పేర్కొన్నాడు. ఇంకా వేమన గురించి కవిత్వతత్వవిచారంలో రెడ్డి గారు ***"గాయము కనిపిం పకయు రక్తము కారకయుండునట్లు శరీరమును ఛేదింప చాలినంత మిగులు వాడిగల కత్తి నొకదానిని పూర్వము విశ్వకర్మసన్నిభుడగు  శిల్పి యొకండు  నిర్మించెనని గాథ యొకండు కలదు".***[78] అని పేర్కొంటే ***"గాయపు మందు కత్తికే పూసి కొట్టిన్నట్లు, తిట్టుచునే నవ్వించు హాస్య కుశలత***[79]అని వేమన గ్రంథంలో చెప్పినాడు.

కవిత్వతత్వ విచారంలో విమర్శకు మార్గమైనా అనేక సూత్రాలను నిర్మిస్తూ భావనాశక్తిని ఇలా వివరించాడు ***"భావనాశక్తి అనగా విషయములు మనసులో ప్రతిబింబించినట్లు చేయు***

---

[76] కవిత్వతత్వ విచారము.పుట:41

[77] సారస్వతాలోకము:పుట:16

[78] కవిత్వతత్వ విచారము.పుట.6

[79] వేమన:పుట.3

*సామర్థ్యం ఒక్క ప్రతిబింబించుట యనయేల! ప్రత్యక్షముగా నవతారమెత్తినట్లు జేయుట*”[80]. శర్మ గారు కూడా ఇదే భావనాశక్తిని నాచన సోమన ఇవ్వదగిన స్థానము అనే వ్యాసంలో సందర్భానుసారంగా నిర్వచించే ప్రయత్నం చేశాడు. ***“భావములు ప్రేమ, కోపము, అసహ్యము, అలక్ష్యము, దయ మొదలగు ప్రాణి ధర్మములను వేరువేరుగా చెప్పబని లేదు. వేమన గ్రంథంలో భావనగా పదార్థము యొక్క స్వరూప జ్ఞానము గాని ఇది మంచిది చెడ్డదియను అభిప్రాయం కాదు. మరి విషయమును గూర్చి మనకు కలుగు ద్వేషము, కోపము, అసూయ, అసహ్యము, ప్రేమ, భక్తి మొదలైనవి భావములనబడును***”[81]. అన్నాడు. ఇలా ఈ అంశాలను పరిశీలిస్తే రెడ్డి గారి ప్రభావం శర్మ గారి పై ఉందని చెప్పవచ్చు.

ఈ నిర్వచనాలు అన్నీ పరిశీలిస్తే కట్టమంచి నిర్వచనాలు లక్ష్యంగా కనబడితే రాళ్ళపల్లి వారివి లక్షణంగా ఉన్నాయి. రెడ్డిగారివి నిర్వచనాలు శర్మగారివి ఉదాహరణలు అని అర్థం. వీరిద్దరి అభిప్రాయాలను కోవెల సంపత్కుమార గారు ఈ విధంగా పేర్కొన్నారు. “**రామలింగారెడ్డి భావన శక్తికి కలిగించిన ప్రాధాన్యము పరోక్షమైన ఊత కళంకముల వింగడింపుతో భావకళానిరుపనముతో అనంతకృష్ణ శర్మ గారు కలిగించినది, ప్రత్యక్షమైంది పటిష్టమైనదని.**[82] అని పేర్కొన్నారు.

కట్టమంచి రామలింగారెడ్డి ప్రభావం శర్మ గారి పై భావం లోనే కాక భాష పై కూడా పడింది రామలింగారెడ్డి కవిత్వతత్వవిచారంలో ప్రథమ భాగంలో ఆది కవుల గుణ దోషముల గురించి రాసిన వచనం **“ఆ కాలం అయినా ఆంధ్రదేశమున ప్రబలంగానుండిన కవిత రీతి ప్రబంధ రచన ప్రబంధ కవులకే మధ్య కవులని పేరు గలదు. ఆది కవులయు వీరు జాడలు వేరు. అనేక విషయములు ను విరుద్దములు”.**[83] శర్మ గారు కవిత అనే వ్యాసం ప్రారంభంలో రాసిన వచనం ***“లోకమున మనుజులందరుకును ముఖ్యముగా ఆనందమిదునవి రెండు విద్యయును ధనమును అందు ధనమస్థరమగుటచే నందు వలన కలిగే ఆనందము చిరకాలమొక తీరుగా నుండదు[84]”.***

---

[80] కవిత్వతత్వ విచారము.పుట.19

[81] వేమన:పుట.148

[82] ఆధునిక తెలుగు సాహిత్యవిమర్శ:సాంప్రదాయక రీతి.పుట.102

[83] కవిత్వతత్వ విచారము.పుట.17

[84] రాళ్లపల్లి సంగీత సాహిత్య వ్యాసాలు: పుట:27

వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ వారు అచ్చువేసిన వేమన పద్యములు 1917 గ్రంథానికి రాసిన పీఠిక లోని ***"భాష ఫలాపేక్ష లేక ఇతరులను సంతోష పరచుటకు కాక తాము చేయు పనికి భవిష్యత్కాలమున కలుగగల విలువను గమనింపక కేవలం జిహ్వాచాపల్యమును తీర్చుకొనుటకై స్వాభావికముగా గవన మల్లు వారు ఏ వాంగ్మయము ను గాని అనేకులు ఉండరు.[85]"*** ఇక్కడ ఇద్దరి శైలిలోనూ దగ్గరితనం కనిపిస్తుంది. అరసున్నలు వాడటం సరళ గ్రాంథికం రాయడం మొదలైన అంశాలు దగ్గరగా కనిపిస్తాయి. కట్టమంచి సునందని నవలకు పీఠిక రాస్తూ ఈ గ్రంథం రచించినవారు రాజమహేంద్రపుర వాస్తవ్యాలగు ఆచంటసత్యవతీ దేవి గారు ఈమె మంచి వంశస్థురాలు. విద్యావతి ప్రజ్ఞ భావనాశక్తి ఉపజ్ఞ ఇత్యాది చిత్రకళా గుణములను మంచి శైలిని కల యిదనీ చదువరులే గ్రహింతురు. ముంజేతి కంకణమునకద్దమేలా? నా సాక్ష్యమిందనవసరము[86]. అని రాశారు. శర్మ గారు బండారు తమ్మయ్య వేమన చరిత్ర కు రాసిన పీఠికలోని వచనం. **శివ శ్రీ బండారు తమ్మయ్య గారు యి వేమన ఆ విచిత్ర మహాపురుషుని గూర్చిన విమర్ష గ్రంథములలో ఇప్పటికే కొలికి పూస వీరి శ్రద్ధాభక్తులు రక్తి శక్తులను, అసాధారణంగా కడచిన శతకార్దమున కెక్కువగా ఆంధ్రసాహిత్య ప్రపంచమున ప్రతిఫలించు చునే యున్నవి[87].** ఈ శైలి గమనిస్తే రెడ్డి గారు గ్రాంథికాన్ని వీడలేదు శర్మగారు ఆధునికానికి మారారు అనిపిస్తుంది.

ఇలా భావంలోనూ భాషలోను శర్మ గారి పై రెడ్డి గారి ప్రభావం అధికంగా ఉంది. అనంతకృష్ణ శర్మ గారి పైనే కాక తదనంతరం వచ్చిన విమర్శకులందరూ కూడా రామలింగారెడ్డి విమర్శను పరామర్శించకుండా పోలేదు. దీనినే నవ్యాంధ్ర సాహిత్య వీధులలో కురుగంటి సీతారామయ్య ఇలా పేర్కొన్నారు. "ఈ విధంగా సాహిత్య సంప్రదాయం పైన తిరుగుబాటు ఉద్యమాన్ని రెడ్డిగారు లేవదీసి చెంచయ్య, భుజంగరావు ల వంటి అనుయాయులని సంపాదించుకున్నారు". ఏమైనా రెడ్డి గారి కవిత్వ తత్వ విచారము వచ్చిన తరువాతనే కేవలం శాబ్దిక విమర్శ నశించి ఒక నూతనమైన విమర్శ దృష్టి మన వారికి

[85] రాళ్లపల్లి పీటికలు.పుట:1

[86] డా;సి.ఆర్.రెడ్డి.పీటికలు:పుట.199

[87] రాళ్లపల్లి పీటికలు.పుట:18

అలవడిందని చెప్పవచ్చు. విమర్శ రంగం వైపు వేలు చూపిన వారు ఎందరున్నా వెలుగు చూపిన వారు కట్టమంచి వారు అన్నది స్పష్టం.

### 4.9 తెలుగు కవిత్వంపై రామలింగారెడ్డి ప్రభావం

సాహిత్య విమర్శ పైనే కాక సాహిత్యం పై కూడా రామలింగారెడ్డి ప్రభావం ఉంది రెడ్డి గారు ముసలమ్మ మరణం అనే ఖండ కావ్యాన్ని 1900లో రాసిన అప్పటికీ అది అప్పటికి ఎవరిని ఆకర్షించలేదు. కాబట్టి యువకులపై ఆనాడు దీని ప్రభావం పడలేదనే చెప్పాలి. కానీ సుబ్బారావు గారి తృణ కంకణం ప్రచురణ తర్వాత రెడ్డి గారి గ్రంథము మీదకి కొంచెం దృష్టి మరలింది. అంతవరకు రెడ్డి గారి ఖండకావ్యము గానీ , 1914లో రాసిన అర్థశాస్త్ర అంకిత పద్యాలు కానీ యువజన మనస్తత్వ పరివర్తనంలో భాగముగా తీసుకోలేదు. అని నవ్యాంధ్ర సాహిత్య వీధులు గ్రంథం పేర్కొంది. యువకులపై యువజన పరివర్తనంలో ముసలమ్మ మరణం ప్రభావం ఎట్లా ఉన్నా గురజాడ రచనల మీద ఈ కావ్య ప్రభావం మాత్రం స్పష్టంగా ఉంది. రాయప్రోలు వారి కష్టకమల (1913) స్నేహలత (1914) గురజాడ కన్యకా ఇవన్నీ ముసలమ్మ మరణం కావ్యానికి అను కారణాలుగా వచ్చాయి. దువ్వూరి నలజారమ్మ, ముదివర్తికొండమాచార్యులు నారాయణమ్మ, తరువాత కొంత కాలానికి వచ్చాయి.

***"స్త్రీల గుణ గణములను శ్లాఘనతో వర్ణించుట పాశ్చాత్యులలో సదాచారం. ఏలన గుణముల గణింపక యాకారమును చూచి వలపుగోనుట యజనములలో నభావ్యము" స్త్రీ పురుషుల ధారాళముగా నొండారులతో కలసిమెలసి యుందురు. గాన రూపమునకు దళుకు తక్కువ. ఇంక వలపు జనింప వలయునన్న నడవడి చరిత్రము చదువు సద్గుణములు, కీర్తి కరములందునాసక్తి మొదలగునాత్మ సంబంధములైన యోగ్యత ఆవశ్యకములు. కావున నాయికా నాయకులకు ఇవి యుద్దిపన విభావనములగుట వీనిని వర్ణించుట శృంగార కావ్యములలో ముఖ్యము"***[88]. అని రెడ్డి గారు అభిప్రాయపడ్డారు.

#### 4.9.1 రాయప్రోలు సుబ్బారావు పై కట్టమంచి ప్రభావం

ప్రబంధాలలో స్త్రీని భోగవస్తువుగా సృష్టించారు. వారిది అంగాంగ వర్ణన రెడ్డి గారన్నట్లు ఆ నాటి స్త్రీలు గుడ్డలు విప్పి నాట్యమాడే వారు అన్న సంశయం కలిగేలా ఉండేది. కవుల వర్ణన దీనికి కారణం మనం స్త్రీని సమాజం నుండి దాచడమే అని, ఐరోపావాసులలో ఇలాంటి

[88] కవిత్వతత్వ విచారము.పుట.85

అంగాంగ వర్ణనలు ఉండకపోవడానికి కారణం అక్కడ స్త్రీ పురుషులు కలిసి జీవిస్తారన్నారు. రెడ్డిగారు భావించినట్లు స్త్రీని విలాస వస్తువుగా పరిగణించే రోజులు పోయాయి. స్త్రీ సమాజంలో పురుషులతో పాటు మసలుతూ ఉంటుంది. ప్రేమించిన యువతీ యువకుల మధ్య ఎన్నో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. స్త్రీకి నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను తన కావ్యాలలో చిత్రించి కొంతవరకు పరిష్కారాలను కూడా అన్వేషించాడు. రెడ్డి గారికి నచ్చిన శృంగారం రాయప్రోలు కావ్యాలలో అమలిన శృంగారం అయింది. రాయప్రోలువారు నవ్యాంధ్ర సాహితీ వీధులలో ప్రయాణించడానికి ఒక రకంగా రెడ్డి గారే కారణం అని చెప్పవచ్చు.

రాయప్రోలు వారు రెడ్డి గారి అభిమానకవి. తృణకంకణం కావ్యాన్ని ట్రజడిగా చెప్పి ఉండవచ్చు. ప్రేమించుకుని విడిపోయినప్పటికీ ఒక జంట తిరిగి కలుసుకున్నప్పుడు ఒకరినొకరు సోదరీ సోదరులు గా భావించుకున్నట్లు కవి కల్పించడంలో విషాదం విరిగిపోయింది. ఇందులో కవి ఒక విధంగా భగ్న హృదయాలకి ఒక పరిష్కారాన్ని చూపించాడు. ఆమె వివాహిత, అతడు ఆమె కోసం త్యాగం చేసిన బ్రహ్మచారి. ఆమె జీవితం అతని దారికి వచ్చే వీలు లేదు. అందువల్ల అంతకన్నా ముగింపు ఈ కావ్యానికి లేదు.

రాయప్రోలు వారి స్వప్న కుమారములోలో వస్తువు ఒక స్వప్న వృత్తాంతం. స్వప్నంలో స్త్రీని మోహించుట ఆమె మధుపాత్ర నిచ్చుట దానికి తృప్తి పొందని వాడు తిరిగి ఆమెను కోరుట, ఆమె పరిశుద్ధ ప్రేమను గురించి బోధించి వానికి జ్ఞానం ప్రసాదించుట ఈ కావ్యంలోని విషయాలు. రాయప్రోలు స్నేహలత ఒక విషాదాంత కావ్యం. ఇది ముసలమ్మ మరణం లాగే ఒక వాస్తవమైన కథ ముసలమ్మ ఊరి ప్రజల క్షేమం కోరి త్యాగం చేస్తే, స్నేహలత వరకట్నానికి నిరసనగా తండ్రి గృహం నాశనం కాకూడదన్న భావంతో ఆత్మబలి కావించుకుంది. సంఘంలోని వరకట్నం అనే పిశాచానికి బలయిపోయే కన్యల జీవితాలు చూపించి ప్రజలకు కనువిప్పు కలిగించడానికి కవి చేసిన రచన ఇది. విషాదాంత కావ్యాలలో ముసలమ్మ మరణం తరువాత స్నేహలత ఎన్నదగిన కావ్యమని, తెలుగు వారి ఆచార వ్యవహారాలకు తెలుగుపల్లె సోంపు సొగసులను, తెలుగు కన్నెల లేత మనసుని తీరు తీయ ములను హృద్యంగా చిత్రించిన కావ్యమని నారాయణరెడ్డి గారు భావించారు[89].

---

[89] ఆధునికాంధ్ర కవిత్వం,సాంప్రదాయాలు ప్రయోగాలు:పుట:20

రాయప్రోలువారు రెడ్డి గారి వలె కవిత్వంలో స్త్రీకి పవిత్ర స్థానం ఇచ్చారు. ప్రబంధ కావ్యాలలోని చిత్రణ ఆధునిక కవులకు నచ్చలేదు. శరీర సౌందర్యం కన్నా ఆత్మ సౌందర్యం గొప్పదన్న రెడ్డి గారి భావం రాయప్రోలు వారి కవితల్లో అమలిన శృంగార తత్త్వం సామ్య భావాలుగా కనిపిస్తాయి. రాయప్రోలు వారి తృణ కంకణం, స్నేహలతదేవి, కష్ట కమల, స్వప్నకుమారము. రూప నవనీతం మొదలైన గ్రంథాలన్నీ నాయికా ప్రాధాన్యం తో వచ్చినవే. రెడ్డి గారి నవయమనిలో వలే పురుషునికి జ్ఞానోపదేశం చేయగల స్త్రీ పాత్రలు ఈకావ్యాల్లోనూ కనిపిస్తాయి. ఉదాహరణకు రాయప్రోలు వారి స్నేహలత కావ్యానికి రామలింగారెడ్డి ముసలమ్మ మరణానికి ఎంతో సామ్యం కనిపిస్తుంది. **"సంక్షుబ్ద సాగర కల్లోలములో గాలి వీచినట్లే కొట్టుకొనిపోవుచుండెడి అభినవ కవిత నావ కు కట్టమంచి రామలింగారెడ్డి గారు కర్ణదరులై నిలచిరి. వారు రచించిన కవిత్వ తత్వ విచారము విమర్శ గ్రంథము ఈ నవీనొద్యమమునకు మార్గదర్శకమైనది. ఈ నవయుగ కవితా ప్రభావము యొక్క ఒక్క ప్రథమ రోజులు, రాయప్రోలు సుబ్బారావు గారి కుటీర గవాక్షంలో ప్రవేశించి ఆయనకు ప్రబోధించినవి"**[90] అన్న దువ్వూరి రామిరెడ్డి గారి మాటలు సత్యం.

### 4.9.2 దువ్వూరి రామిరెడ్డి పై రామలింగారెడ్డి ప్రభావం.

దువ్వూరి రామిరెడ్డి గారి కృషీవలుడు రచన రెడ్డి గారి అభిమతానికి అనుగుణంగా చిత్రించబడిన రచన. కవిత్వతత్వవిచారంలో రెడ్డి గారు **"ఐరోపాలోని కవీశ్వరులు కొందరు సైనికులు మొదలగు తక్కువ వృత్తుల వారి బతుకులను వర్ణానార్హములని భావించి ఎంతో సుందరంగా కావ్యములలో వ్రాసియున్నారు. మన గ్రంథములు మాత్రం జదివి ఈ పుణ్యక్షేత్రమైన కురుక్షేత్రము యొక్క స్థితిగతులను చూచు వారికి ఈ దేశము బీదసాదలపై నాదరము గల కవి ఎవడైనా నున్నాడా?"**[91] అని అనుమానం పుడుతుందని రెడ్డి గారు విమర్శించారు. ఆదరం గల కవి నేనున్నానని దువ్వూరి రామిరెడ్డి గారు కాపుల జీవితాన్ని అంటే కృషివలుల జీవితాన్ని కావ్యంగా రాశారు. తాను కర్షక పక్షపాతినని ఇతరులు నిందిస్తారు ఏమో అని సంశాయమున్నా రామిరెడ్డి గారు నవ్యత కోసం ఆ కావ్యం రచించినట్లు చెప్పుకున్నారు. పూర్వ

---

[90] అభినవాంధ్రసాహిత్యం:పుట.180

[91] డా;సి.ఆర్.రెడ్డి.పీటికలు:పుట.162

లాక్షణిక పద్ధతులు వదిలి పెట్టి స్వసంత్ర సీమకు వెళ్ళాలన్న తన ఉద్దేశాన్ని బయటపెట్టారు. దువ్వూరిలోని ఈ భావాలకు ప్రేరణ కట్టమంచి వారు.

కృషీవలుడు కావ్యానికి కట్టమంచి పీఠిక రాస్తూ **"కవి కాపు యువకుడు, విషయము కాపుల జీవితము, దృష్టి అభిమానప్రేరితము. కృషీవలుల జీవితముల ప్రధానాంశంగా గ్రహించిన తెలుగు గ్రంథములలో నిదియు మొదటిది అని చెప్పి ఆగమ పుంజములకు జేరిన గతాను గతికము కాదు. స్వతంత్ర సీమను జరించునది. ఏమీ! పూర్వీకుల విధుల అతిక్రమించ వచ్చునా? వారెర్పరచిన కృతి విధానములు గాక యన్యము లేక్కడైనను ఉన్నవా, అని మూడ భక్తులు ఎవరైనా యాక్షేపించిన యడల కాలమనంతము ఇలా విశాల భావ లోకము క్రమముగా బడయ మార్పు"**[92] అని కవి వారిని తిరస్కరించి తన దారిన తనేగిడిని. వీరుచేసి యుండెడు. కవితా విషయమైన చర్చకు కొన్ని ఏళ్ళ కిందట సందర్భానుసారంగా కవిత్వ తత్వ విచారములో చేసినాడను రెడ్డిగారి మాటలను గమనిస్తే వీరి భావాలను సమకాలికులు పాటించడం వీరికి ఎంత ఇష్టమో అర్థమవుతుంది.

కృషీవలుడులో ప్రకృతిలోని ఒక జాతి జీవితం మనుష్యుల స్వభావం వర్ణించబడింది. రైతుల సంస్కృతికి నిలువుటద్దం ఈ కావ్యం. సహజ వాతావరణాన్ని ప్రకృతి సిద్ధమైన వర్ణనలను మృదుమధుర శైలిని మనం ఇందులో చూడగలం.

నవ్య కవుల కవితా ప్రయోజనం సంఘ పరమైనది కాబట్టి ఇప్పటికీ కూడా ఇలాంటి రచనలు వస్తూనే ఉన్నాయి. వాటిలో ముదివర్తి కొండమాచార్యులు వారి పూర్ణాహుతి, నారాయణమ్మ అనే కావ్యాలు. పూర్ణాహుతి కావ్యంలో శ్రీనాథుని కాలంలో ప్రసిద్ధమైన ఒక వేశ్య కుటుంబంలో పుట్టి త్యాగ శిఖను ముట్టిన వేమాల శెట్టి కథ .(ఇది రెండవది) పెనుగొండ పట్టణాన్ని కుసుమ గుప్తుడు అనే వేశ్య రాజు పాలిస్తూ ఉండేవాడు. అతడు పుత్రకామేష్ఠి చేసి విరూపాక్షుడు అనే పుత్రుని, వాసవి అనే పత్రికను పొందాడు. వాసవి అతిలోక సౌందర్యవతి. వేంగి రాజ్యం పాలకుడైన చాణుక్య విష్ణువర్ధనుడు జైత్రయాత్ర చేస్తూ పెనుగొండ కు వచ్చి కుసుమ గుప్తునిచే సత్కారాన్ని పొందాడు. వాసవిని చూసి మోహించి ఆమెను తనకిమ్మని కోరాడు. కులానికి కలంకం వస్తుందని వెలమ శెట్టి నచ్చజెప్పి పంపించాడు. వేశ్య వర్గం వర్గసాంకర్యం తనదాకా ఆనాటి రాజుకు తెలియజేశాడు. రాజు ఆగ్రహోదగ్రుడై ఆమెను

[92] డా;సి.ఆర్.రెడ్డి.పీటికలు:పుట.162

బంధించి తెచ్చుటకు నిర్ణయించాడు వాసవి తో పాటు నూటరెండు గోత్రాలు వైశ్యులు గోత్రనికొక్క జంట గా అగ్నిగుండంలో పడి ఆత్మార్పణ చేసుకోవడానికి నిర్ణయించుకున్నారు మొదట వాసవి అగ్ని ప్రవేశం చేసింది. అక్కడ మూగి ఉన్న వారిలో ఒక పేద ఇంట వైశ్య బాలిక వేమాల శెట్టిని ఆకర్షించింది. శివాలయంలో ఆమెను పువ్వులు కోస్తూ ఉండగా చూస్తున్నాడు పడగవిప్పిన ఒక త్రాచుపాము అతని పాదాల చెంత కనిపించింది. సద్యస్పూర్తి తో ఆ బాలిక తన బలం కొద్దీ తనను పక్కకు నెట్టింది. ఆ పాము ఆమె పాదాల పై నుండి పాకిపోయింది ఆమె తెలివి తప్పి పడిపోయింది. వేమల శెట్టి బాలికకు చికిత్స చేయించాడు. ఆమె తండ్రి వచ్చి దుఃఖించాడు వేమల శెట్టి ఆ బాలికను తను ప్రేమించానని తండ్రితో చెప్పగా వారు సమ్మతించి ఆమె కోడలిగా స్వీకరించడం జరిగింది.

నెల్లూరులో నీటి కొరత ఏర్పడింది. ఎంతపెద్దబావి త్రవ్వినా నీళ్లు పడలేదు. అప్పుడు వేమాల భార్య రక్తార్పణ చేయగా నీరు పడింది. బావి చెంత సతిపతుల విగ్రహం వెలిసింది. ఇది నెల్లూరు గెజిట్లో ఉంది బాస్వెల్ మాన్యువల్ ,మెకంజీ కైఫియత్తులలో ఈ భావి కథనం ఉంది. గెజిట్ లోని కథను స్వీకరించి ఇతను కూడా రెడ్డి లాగా కావ్యం రాశారు.

ముదివర్తి కొండమాచార్యులు మరొక కావ్యం నారాయణమ్మ. ఈ కావ్యంలోని ఇతివృత్తం సమాజానికి సంబంధించినదే అయినా 100 సంవత్సరాల పూర్వం కథ. గూడూరు సమీపాన వేడిచర్ల గ్రామస్తులైన పాపులమ్మ, ఎరపరెడ్డి కుమార్తె నారాయణమ్మ వివాహ వైభవం గా పాపిరెడ్డికిచ్చి వివాహం చేశారు. పాపిరెడ్డి పశువులు కొనుటకు దార్వాడి కేగి మధ్యలో గోల్కొండలో దిగాడు. అందులో ఒక గిత్త అంబ మొక్కుబడికై ఆపటేద్దుగా వదల దల్చినది. నవాబు దానిని తనకిమ్మని యడిగెను. పాపిరెడ్డి ఇవ్వనందున నవాబు ఆగ్రహానికి లోనై భయముచేత పాపిరెడ్డి కి జ్వరం వచ్చినది. ఓరుగల్లు దాటి నెల్లూరు చేరాడు. ఆ రాత్రి నారాయణమ్మ కి పెళ్లి అయి అయినట్లు కల వచ్చింది.మొక్కు చెల్లుట తోడనే పాపి రెడ్డి మరణించాడు. చిద్వేలు నవాబుకి ఆ రాత్రి నారాయణమ్మ కలలో కనబడి సహగామనానికి అంగీకారం అడిగిందట. నవాబు అంగీకార మై నారాయణమ్మ భర్తతో సహగమనం చేసినది.

కథ పాతదైనా వివిధ వర్ణనలతో,ఊరి తిరునాళ్ళని పల్లెసీమల ఆచారవ్యవహారాలను నారాయణమ్మ పెండ్లి సందర్భంగా రెడ్డి కుటుంబాలలో ఉండే వైభవాన్ని గ్రామ వ్యవస్థలో అబోతుని వదలడం వంటి సమాజ ఆచారాలని భక్తిని ఎన్నో విషయాలను ఈ కవి ఈ

పేరంటాల కథలో చూపించారు. కలలో పెళ్లి జరిగినట్టు కల వస్తే మరణం సంభవిస్తుందని జానపదుల నమ్మకాలని కవి ఇందులో చూపించాడు[93].

నారాయణమ్మ వలె నలజారమ్మ అగ్ని ప్రవేశం చేస్తుంది. గర్భవతిగా ఉండి జొన్న కంకేను తెమ్మంటుంది.భార్య కోరిక తీర్చే తొందరలో తన పొలం నుండి గాక పక్కపొలంనుండి జోన్నకంకే కోసితెస్తాడు. ఆ రోజుల్లో దొంగతనానికి మరణదండన శిక్ష . నలజారమ్మ భర్త మరణానంతరం అగ్నిప్రవేశం చేస్తుంది[94]

పై రచనల అన్నింటిలో ముసలమ్మ మరణం కావ్యాన్ని అనుకరిస్తూ స్త్రీ పాత్రకి ప్రాతినిధ్యం వహించబడి ఉంది. అన్ని రచనలు త్యాగాన్ని తెలిపేవిగా ఉన్నాయి.

చిలుకూరి నారాయణరావు గారి ముసలమ్మ పదం రెడ్డి గారు శైలిని అనుకరిస్తూ పదం గా సాగింది.

**చిటపట చినుకులు చిత్రంగా ఏది**

**ధారలుగా మారు చున్నవి**

**ఘటము తోడను దిమ్మ రించినట్లు**[95]

ఇది చిలుకూరి నారాయణ ముసలమ్మ పదం

**కడవలముంచి వంచిన ప్రకారము మిన్నునేకమయ్యేడు గతి**[96] ఇది రామలింగారెడ్డిగారు శైలి. కట్టమంచి ముసలమ్మని అనుకరిస్తూ, నారాయణరావు గారి కథ కొనసాగింది. నారాయణరావుగారు రెడ్డి గారి కావ్యంలో తెచ్చినన్ని మార్పులు తేలేదు. మాయామర్మం తెలియని ముద్దుల గుమ్మా అనే చిత్రించారు. రెడ్డి గారి వర్ణనలకి అనుగుణంగా నారాయణ రావు గారి పదం సాగింది. కానీ ట్రాజెడీని పద కవిత కింద గ్రహించడం ఆ రోజుల్లో రెడ్డి గారి నుండి సంక్రమించిన నూతన ప్రక్రియ. ఈ విధంగా నారాయణ రావు గారు రెడ్డి గారి వల్ల ప్రభావితం అయ్యారు అని చెప్పవచ్చు. రెడ్డి ప్రభావం తెలుగు విమర్శ పై పడిందని ముందే చెప్పుకున్నాం .కవులు విమర్శకులు రెడ్డి గారి ప్రేరణతో ప్రేరేపితం అయినారు. ద సోర్స్ ఆఫ్ ప్రభావతీ ప్రద్యుమ్నంలో పింగళి లక్ష్మీకాంతం ఇలా రాశారు.

---

[93] పూర్ణాహుతి- ముదివర్తి కొండమాచార్యులు

[94] నలజారమ్మ-దువ్వూరిరామిరెడ్డి

[95] ముసలమ్మ పదం- చిలుకూరి నారాయణ

[96] ముసలమ్మ మరణం:పద్యం.21

***“The author of kavitatatva vicharam has already opened the eyes of the Telugu public to the greatness of the poet. Poet by applying modern principles of literary criticism to have works and by giving a true estimate of his poetic genus. this bulletin dealing critically as it does with the sours of the plot prabhavathi pradyamnam”***[97] రెడ్డిగారు కవుల ఆలోచనలో మౌలికమైన మార్పులు తీసుకు వచ్చారని పాశ్చాత్య విమర్శ విధానంలో తెలుగు సాహిత్య విమర్శను సుసంపన్నం చేశారని పింగళి లక్ష్మీకాంతం గారు అభిప్రాయపడ్డారు. **“ఈ మహాకవి ఎడల లోకమునకు ఇప్పుడిప్పుడే భక్తి గౌరవములు కలుగుచున్నవి శ్రీ రామలింగారెడ్డి కవిత్వతత్వ విచారము సమర్పించబడిన ప్రథమోపహారము. నా ఈ చిన్న వ్యాసము కూడా దద్పద పీఠిక నొకదళమగు గాక[98]”** అని పింగళి లక్ష్మీకాంతం గారు అభిప్రాయపడ్డారు. కవిగానీ, విమర్శకుడుగానీ ఆనందంతో పాటు ప్రజా శ్రేయస్సును కూడా దృష్టిలో పెట్టుకోని వాడు ప్రయోజకుడు. ప్రజలలో కావ్యాల ద్వారా విమర్శల ద్వారా చైతన్యం తీసుకు రాగల శక్తి ఒక్క కలానికే ఉంది. కవియొక్క కలాన్ని సక్రమమార్గంలోకి మళ్ళించగలవాడు విమర్శకుడొక్కడే. కానీ తన అభిమతానికి అనుగుణంగా కవిని మారమని చెప్పడం రెడ్డి గారి అభిమతం కాదు. కవులే తెలుసుకొని కాలానుగుణమైన రచనలను అందించాలని రెడ్డి గారి అభిలాష. గుణదోషాలు రెండింటిని సమాన దృష్టితో చర్చించడమన్నది ముఖ్యం అన్న విషయం రెడ్డి గారి విమర్శనా విధానంలో స్పష్టంగా ఉంది. రెడ్డి గారి విమర్శ విధానం నేటి తెలుగు పరిశోధకుల అందరిలో అంతో ఇంతో ప్రభావం చూపిస్తూనే ఉంది.

కాళూరివ్యాసమూర్తి, కురుగంటి సీతారామయ్య, కోవెల సంపత్కుమారాచార్య, కె.వి.రమణారెడ్డి, మొదలైనవారు కట్టమంచి రామలింగారెడ్డి గారు గురించి కొన్ని ప్రత్యేక గ్రంథాలు, విమర్శ వ్యాసాలు రాశారు. భారతీయ ఆలంకారిక దృక్పథం కట్టమంచి అవగాహన చేసుకోలేదు అనేవి వారి విమర్శలోని ప్రధానాంశం. కానీ అలంకారాలను, అలంకార శాస్త్రాన్ని కట్టమంచి పూర్తిగా వ్యతిరేకించలేదు. కావ్య సౌందర్యానికి అవే ప్రధానం అనడం మాత్రం వ్యతిరేకించాడు. అందువల్ల శిల్ప దృక్పథం కలిగిన కొంతమంది విమర్శకులు కట్టమంచి ని

[97] గౌతమవ్యాసాలు.పుట:114

[98] గౌతమవ్యాసాలు.పుట:114

విమర్శించారు. కానీ కట్టమంచి విమర్శలో అంత లోతు లేకపోతే కవిత్వతత్వ విచారము పై గానీ ఇతర రచనల పై గానీ అన్ని ప్రతి విమర్శలు వెలువడిఉండేవి కాదని స్పష్టమవుతుంది. అందువల్లనే తెలుగు సాహిత్యంలో ప్రముఖ విమర్శకులు అంతా కూడా కట్టమంచి విమర్శను ఆహ్వానించారు. తెలుగు సాహిత్య విమర్శ కు ఒక శాస్త్రీయ దృక్పథాన్ని అందించారని అనేక మంది అభిప్రాయపడ్డారు. కాబట్టి విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి తెలుగు సాహిత్య విమర్శ పై గాఢమైన ముద్ర వేశాడని నిరూపితమవుతుంది.

# ఉపసంహారం

# ఉపసంహారం

విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి అనే నా పరిశోధన అంశాన్ని 5 అధ్యాయాలుగా విభజించాను. ఒక్కో అధ్యాయంలో నేను పరిశోధించి పరిశీలించిన అంశాలను క్లుప్తంగా ఇక్కడ వివరిస్తాను.

**మొదటి అధ్యాయం**లో కట్టమంచి రామలింగారెడ్డి జీవితం – రచనలు పరిచయంలో రెడ్డిగారి జీవితంలోని ముఖ్య ఘట్టాలను స్థూలంగా పరిచయం చేశాను. వారి బాల్యం, విద్యాభ్యాసం, వారి రచనలు ముఖ్యంగా ముసలమ్మ మరణం, కవిత్వతత్వ విచారము, భారత అర్థశాస్త్రం, వ్యాస మంజరి, పంచమి, లగురించి వాటితో పాటు కట్టమంచి రామలింగారెడ్డి వ్యక్తిత్వం గురించి, వారు చేపట్టిన పదవులు, వారి హాస్య చమత్కారం గురించి,ఈ అధ్యాయంలో వివరించాను. వారి విమర్శను అర్థం చేసుకోవడానికి పూర్వ రంగా ఈ అధ్యాయం ఉపయోగపడుతుంది.

**రెండవ అధ్యాయం**లో కట్టమంచి సాహిత్య విమర్శ దృక్పథం అనే అధ్యాయం లో కట్టమంచి రామలింగారెడ్డి గారిపై పాశ్చాత్య సాహిత్య ప్రభావం విస్తృతంగా ఉందని ఆయన జీవితాన్ని, రచనలను పరిచయం చేసుకున్న తర్వాత స్పష్టంగా తెలుస్తుంది. ఆయన తాను చదువుకునే రోజుల్లో చదివిన కళాపూర్ణోదయం, దానిపై రాసిన విమర్శ వ్యాసం ఆయనలోని లోతైన ఆలోచనను అప్పటికే గమనించగలిగే అవకాశం ఉన్నా, పాశ్చాత్య దేశాల్లో చదువుకోవడం, తర్వాత భారతదేశం వచ్చి మరలా ఆ వ్యాసాన్ని రాయడంలో ఎంతో పరిపక్వత కనిపిస్తుంది. అందువల్ల ఆ 'కవిత్వ తత్వ విచారం' తెలుగు సాహిత్య విమర్శలో ఎంతో ప్రాధాన్యం పొందింది. అందువల్ల ఈ అధ్యాయంలో ఆ గ్రంథాన్ని అనుసరించి కట్టమంచి రామలింగారెడ్డి గారి సాహిత్య విమర్శ దృక్పథాన్నితెలిపే ప్రయత్నం చేశాను. కట్టమంచి రామలింగారెడ్డిగారు ప్రతిపాదించి, నిరూపించిన అనేక అంశాలు కవిత్వతత్వవిచారం లో ఉన్నాయి. వీటిని సోదాహరణంగా విశ్లేషించే ప్రయత్నం చేశాను.

మూడవ అధ్యాయంలో కట్టమంచి వారి సాహిత్య విమర్శ పద్ధతులు అనే అధ్యాయంలో సాహిత్యాన్ని విమర్శించడానికి కొన్ని పద్ధతులను పాటించాలి.సాహిత్య స్వరూప ,

స్వభావాలనుబట్టి, కాలమానపరిస్థితులను బట్టి,ఆసాహిత్యాన్ని అనుశీలించే పద్ధతిని బట్టి విమర్శకుని శక్తి సామర్థ్యాలు అవగాహన స్పష్టమౌతాయి. కట్టమంచి రామలింగారెడ్డి గారు సంప్రదాయ సాహిత్యాన్ని ఆలంకారిక స్వభావాన్ని ప్రదర్శిస్తూనే ,వస్తుతత్త్వ పద్ధతిలో విశ్లేషించారు.కవులను వారి జీవితం,రచనలను కవిజీవితకావ్య సమన్వయపద్ధతిలో సమన్వయించారు.

కావ్యాలనుతులనాత్మక పద్ధతిలో వస్తువు, పాత్రలను వివిధాంశాలను తులనాత్మకంగా విశ్లేషించారు. తిక్కన, పింగళి సూరన, వేమనలను కవి జీవిత కావ్యం సమన్వయ పద్ధతిలో శాస్త్రీ యంగా విశ్లేషించారు. వీటితో పాటు కావ్య సంవిధానాన్ని అలంకారిక పద్ధతిలోనే విమర్శించారు.వీటన్నింటిలోనూ చారిత్రక, సామాజిక, వస్తుతత్త్వాన్ని విశ్లేషించడం వీరి విమర్శలో కనిపించడం ఒక ప్రత్యేకత. వాటిని ఈ అధ్యాయంలో సోదాహరణంగా వివరించే ప్రయత్నం చేశాను.

నాల్గవ అధ్యాయంలో విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి. ఈ అధ్యాయంలో రెడ్డి గారి విమర్శ పై పాశ్చాత్య విమర్శ ప్రభావం గురించి వివరించాను. అలాగే రెడ్డి గారు చేసిన తులనాత్మక, సాంఘిక విమర్శల గురించి ఉదాహరణలతో పేర్కొన్నాను. కట్టమంచి రామలింగారెడ్డి పేర్కొన్న భావనా శక్తి, ప్రతిభను సవివరంగా వివరించి చెప్పే ప్రయత్నం చేశాను. అంతేకాకుండా వీరి పీఠికలోని విమర్శ గురించి కూలంకషంగా ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది. కట్టమంచి రామలింగారెడ్డి రాసినటువంటి ముసలమ్మ మరణం, కవిత్వ తత్త్వ విచారం అటు కవిత్వంలోనూ ఇటు విమర్శలొను సంచలనం కలిగించాయి. వీరి రచనల ప్రభావం తరువాత సాహిత్యంపై ఎటువంటి ముద్ర వేశాయి అన్నది ఈ అధ్యాయంలో చర్చించాను. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, బసవరాజు దువ్వూరి రామిరెడ్డి, పింగళి లక్ష్మీకాంతం, మొదలైన విమర్శకులపై రామలింగారెడ్డి కవిత్వ తత్త్వ విచారం ఏ విధమైనటువంటి ప్రభావాన్ని చూపింది అన్న అంశాన్ని ఇందులో వివరించే ప్రయత్నం చేశాను.

***భావి పరిశోధకులకు సూచన:-***

విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి అంశం మీద పరిశోధన చేయడం వల్ల చాలా విషయాలు తెలుసుకో గలిగాను. ముఖ్యంగా వీరి రచనలు, విమర్శా విధానం పట్ల ఒక అవగాహన ఏర్పడింది. తవ్వే కొద్ది చలమలో నీరు ఉరుతున్నట్టు వీరి రచనలలో ఇంకా అనేక కోణాలలో పరిశోధన చేయవచ్చు అని నాకు అనిపించింది. భవిష్యత్తులో సి. ఆర్. రెడ్డి. మీద

పరిశోధన చేయాలి అనుకునే వారికి ఈ కింది అంశాలలో పరిశోధన చేయవచ్చు అని నా సూచన.

1) కట్టమంచి రామలింగారెడ్డి ఆంగ్ల రచనలు – పరిశీలన.

2) కట్టమంచి రామలింగారెడ్డి వ్యాసాలు, ఉపన్యాసాలు – విమర్శనాంశాల విశ్లేషణ.

3) వేమన కవిత్వం – కట్టమంచి దృక్పథం.

4) కట్టమంచి రామలింగారెడ్డి ఆంగ్ల పీఠికలు పరిశీలన.

5) రంగనాథ రామాయణం–రామలింగారెడ్డి పీఠిక వాద వివాదాలు

# ఉపయుక్త గ్రంథ సూచిక

# ఉపయుక్త గ్రంథ సూచిక

## ప్రాథమిక ఆకరాలు (Primary Sources)


**కట్టమంచి రామలింగారెడ్డి రచనలు**

1. రామలింగారెడ్డి.కట్టమంచి,***ముసలమ్మమరణం***. చెన్నపురి: కళారత్నాకర ముద్రాక్షరశాల, 1990.
2. రామలింగారెడ్డి, కట్టమంచి. ***కవిత్వతత్వవిచారము*** అను పింగళి సూరనార్యకృతకళాపూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్నముల విమర్శనము.వాల్తేరు: ఆంధ్రకళాపరిషత్. (ఐదవ ముద్రణ:1973– ప్రథమ ముద్రణ:1914).
3. రామలింగారెడ్డి, కట్టమంచి. ***భారత అర్థశాస్త్రము***.రాజమండ్రి:విజ్ఞానచంద్రిక ప్రచురణ,1958.
4. రామలింగారెడ్డి. కట్టమంచి, ***వ్యాస మంజరి.*** వాల్తేరు: ఆంధ్ర యూనివర్సిటీ ప్రెస్, 1947.
5. రామలింగారెడ్డి.కట్టమంచి,***లఘుపీటికాసముచ్చయము.***ఏలూరు:రామాపవర్ ముద్రాక్షరశాల,1928
6. రామలింగారెడ్డి. కట్టమంచి, ***పంచమి.*** రాజమండ్రి: ఆంధ్ర విశ్వకళా పరిషత్, 1954.


## ద్వితీయ ఆకరాలు (Secondary Sources)


కట్టమంచి గురించి ఇతరులు వేసిన పుస్తకాలు.

7.సుబ్బయ్య, గొర్రెపాటి. **డాక్టర్. సి. ఆర్. రెడ్డి**. విజయవాడ: దేశికవిత మండలి.1961.

8.సుబ్బయ్య, గొర్రెపాటి. **డాక్టర్. సి. ఆర్. రెడ్డి – జీవిత చరిత్ర**. హైదరాబాదు: విజ్ఞాన సరోవర ప్రచురణలు. 2006.

9.రాజారాం,మధురాంతకం. ***సి.ఆర్.రెడ్డి.*** **రెడ్డి** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రచురణ. 2006.

10.భాస్కర చౌదరి, బి. (సం). ***డా. సి. ఆర్. రెడ్డి పీఠికలు***. చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం. 1983.

11. భాస్కర చౌదరి, బి. (సం). ***సాహితీమూర్తి కట్టమంచి***. చిత్తూరు: ఆంధ్రశాఖ ప్రభుత్వ కళాశాల. 1983. (ప్రథమ ముద్రణ:1980).

12. బంగోరె, ***వేమన– సి. ఆర్. రెడ్డి***. విశాఖపట్నం: ఆంధ్ర విశ్వకళాపరిషత్, 1981.

13. భూమయ్య. అనుమాండ్ల, ***ఆద్యుడు కట్టమంచి***. వరంగల్లు, వాగ్వాదినీ ప్రచురణలు, 1992.

14. మహాలక్ష్మి,కట్టమంచి,***కట్టమంచిరామలింగారెడ్డిజీవితం–సాహిత్యం***.తిరుపతి:
సాయిప్రచురణలు ,1991.

15. మురళీకృష్ణ,పి. వి, ***డా: సి.ఆర్.రెడ్డి. తెలుగు రచనలు ఒక పరిశీలన***. పిహెచ్. డి.
అముద్రిత సిద్ధాంత గ్రంథం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, 1981.

16. చంద్రమౌళి,మొరుంపల్లి.కట్టమంచిరామలింగారెడ్డి ***పీఠికలు–పరిశీలన*** ఎం.ఫిల్.
అముద్రిత సిద్ధాంత వ్యాసం హైదరాబాదు విశ్వవిద్యాలయం.2015.

## ఇతర గ్రంథాలు

18. అనంతకృష్ణశర్మ. రాళ్లపల్లి,  ***వేమన.*** వాల్తేరు: ఆంధ్ర విశ్వకళా పరిషత్, 1945.

19. అనంతకృష్ణశర్మ. రాళ్లపల్లి, ***సారస్వతోపన్యాసములు***. హైదరాబాదు:
సారస్వత పరిషత్తు, 1937.

20. అనంతకృష్ణశర్మ. రాళ్లపల్లి, ***సారస్వతాలోకము***. హైదరాబాదు: మృదులా ప్రచురణ, 2009.

21. అశ్వత్థనారాయణ ఘట్టమరాజు, సుందరం ఆర్వీయస్, శ్రీరామ చంద్ర మూర్తి శివలెంక,
***అనంతరాగం.*** బెంగళూరు: రాళ్లపల్లి అభినందన సమితి, 1977.

22. అశ్వత్థనారాయణ ఘట్టమరాజు, సుందరం ఆర్వీయస్, శ్రీరామ చంద్ర మూర్తి శివలెంక.
***రాళ్లపల్లి పీఠికలు.*** బెంగళూరు: రాళ్లపల్లి అభినందన సమితి, 1977.

23. ఉమేశ్. బడిగె, ***రాళ్లపల్లి పీఠికలు పరిశీలిన***. (ఎం.ఫిల్., అముద్రిత  సిద్ధాంత వ్యాసం),
హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 2014.

24. ఉమేశ్. బడిగె, ***రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ జీవితం,రచనలు సమగ్ర పరిశీలిన***. (పిహెచ్.డి,
అముద్రిత  సిద్ధాంత వ్యాసం), హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 2019.

25. చంద్రశేఖర్ రెడ్డి. డి, ***రాళ్లపల్లి సంగీత సాహిత్య వ్యాసాలు***. హైదరాబాదు:
రైతు నేస్తం ప్రెస్, 2016.

26. చక్రధరరావు. లంకసాని, సంపాదకులు. శ్రీ ఎం ఆర్ అప్పారావు సన్మాన సంచిక.
విశాఖపట్నం.1978.

27. జోసఫ్. జి. కట్టమంచి. తెనాలి. ది ఓరియంట్ పవర్ ప్రెస్.1947.

28. సూరనార్య,పింగళి. ప్రభావతీ ప్రద్యుమ్నము. చెన్నపురి, వావిళ్ల ప్రెస్.1968.

29.  సూర్య నారాయణ , పురాణం.కళాపూర్ణోయం. చెన్నపురి. వావిళ్ళ ప్రెస్.1910

30. రమాంజనీ కుమారి. వి, ***విమర్శకునిగా రాళ్లపల్లి***. (ఎం. ఫిల్., సిద్ధాంత వ్యాసం)

హైదరాబాద్: విశ్వవిద్యాలయం, 2005.

31. రమాపతిరావు. అక్కిరాజు, ***కందుకూరి వీరేశలింగం సమగ్ర పరిశీలన***, హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1988.

32. వెంకటేశ్వరరావు. దార్ల, ***పరిశోధకుడిగా ఆరుద్ర***. పిహెచ్. డి. అముద్రిత సిద్ధాంత గ్రంథం, హైదరాబాదు విశ్వవిద్యాలయం, 2003.

33. అహుబలరావు. కల్లూరి, ***రాయలసీమ రచయితుల చరిత్ర***. హిందూపూర్: శ్రీ కృష్ణదేవరాయల గ్రంథమాల, 1977.

34. ఆరుద్ర, ***సమగ్ర ఆంధ్ర సాహిత్యము.*** (నాల్గవ సంపుటి), హైదరాబాద్: తెలుగు అకాడమి, 2012.

35. ఇనాక్. కొలకలూరి, డా, ***తెలుగు వ్యాస పరిణామము***. అనంతపురం: జ్యోతి గ్రంథమాల, 1980.

36. ఉమాకాన్త. విద్యాశేఖరులు అక్కిరాజు, ***నేటికాలపుకవిత్వం***. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం, 2000.

36. కోదండ రామిరెడ్డి. మరుపూరి, ***పాశ్చాత్యులు వేమన***. 1972.

37.గోపాలకృష్ణమూర్తి, శ్రీపాద, ***అర్థశతాబ్దపుఆంధ్రకవిత్వం***. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం, 2000.

38. తిరుమలరావు. సర్దేశాయి, ***విమర్శ– ప్రతివిమర్శ***. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2002.

39. నరసింహం. కె. వి. ఆర్, ***ఆంధ్ర సాహిత్య దర్శనము***. విజయవాడ: క్యాలిటీ పబ్లిషర్సు, 1979.

40. నళిని. ఎస్. ఎస్, ***సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ***. హైదరాబాద్: నవోదయా బుక్ హౌస్, 2009.

41. నారాయణరెడ్డి. సి, ***ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1967.

42. నారాయణరావు, చిలుకూరి. ముసల్లమ్మ. అనంతపురం.1939.

43. నిత్యానందరావు. ***వెలుదండ, విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన***. హైదరాబాదు: ఉస్మానియా విశ్వవిద్యాలయం, 2013.

44. బ్రహ్మానంద. హెచ్. ఎస్, ***తెలుగు సాహిత్య విమర్శ – పాశ్చాత్య ప్రభావం***. అనంతపురం: అక్షర ప్రసార ప్రచురణ,

45. వెంకట అప్పారావు, బసవరాజు. ***ఆంధ్ర కవిత్వ చరిత్రము.*** మద్రాసు. వావిల్లసన్స్.1921.
46. మందేశ్వరరావు. వడలి, ***పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర సిద్ధాంతాలు***. హైదరాబాద్:
తెలుగు విశ్వవిద్యాలయం, 1994.
47. మాధవశర్మ. పాటిబండా. డా, ***తెలుగులో సాహిత్య విమర్శ***, హైదరాబాద్:
ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి, 1976.
48. యువభారతి, ***మహతి***. (భారత స్వాతంత్ర్య రజతోత్సవ సంచిక) హైదరాబాద్:
యూవభారతి పబ్లిషర్స్,1976.
49. రామరావు. ఎస్వీ***, విమర్శక వతంసులు***. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 2011.
50. రామసుబ్బశర్మ. గౌరిపెద్ది, ***ఆలోచన లహరి***. హైదరాబాదు: యువ భారతి, 1980.
51. రామారావు. ఎస్వీ. డా***, తెలుగు సాహిత్య విమర్శ – అవతరణ వికాసములు***. హైదరాబాద్:
పసిడి ప్రచురణలు, 1974.
52. రామిరెడ్డి. దువ్వూరి, ***కవికోకిల గ్రంథావళి***. పెమ్మారెడ్డి పాళెం: కవికోకిల గ్రంథమాల, 1935.
53. రంగాచార్యులు, చలమచర్ల. ఆంధ్ర ప్రతాప రుద్రయశోభూషణం. హైదరాబాదు . 1967
54. లక్ష్మణ చక్రవర్తి, సిహెచ్, వారిజారాణి, పి, విజయ్ కుమార్, జి, (సంపా) ***ఆధునిక సాహిత్య విమర్శకులు– ప్రస్థానాలు. (తొలి మలి తరాలు)*** హైదరాబాదు:
ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగుశాఖ, 2008.
55. లక్ష్మీకాంతం. పింగళి, ***గౌతమ వ్యాసములు***. హైదరాబాదు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1989.
56. లక్ష్మీకాంతము. పింగళి, ***సాహిత్య శిల్ప సమీక్ష***, హైదరాబాద్: మాధవీ బుక్ సెంటర్, 1976.
57. లక్ష్మీనారాయణ. భూపతి, ***కావ్యాదర్శము***. హైదరాబాదు: త్రివేణీపబ్లిషర్స్, 1959.
58. వీరభద్రయ్య. ముదిగొండ, ***కళాతత్త్వ శాస్త్రం మౌలికాంశ వివేచన***. హైదరాబాద్:
జాతీయ సాహిత్య పరిషత్, 1993.
59. వీరభద్రరావు. కొత్తపల్లి, డా, ***తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము***.
సికింద్రాబాద్: అజంతా ప్రింటర్స్, 1960.
60. శేషయ్య. చాగంటి, ***ఆంధ్రకవితరంగిణి***. సంపు 6, 8.
61. సంపత్ కుమారాచార్య. కోవెల, ***ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ సాంప్రదాయిక రీతి***.
62.సీతారామయ్య. కురుగంటి***, నవ్యాంధ్రసాహిత్యవీథులు***. హైదరాబాదు:

తెలుగు విశ్వవిద్యాలయం, 1994.

63. సీతారామచార్యులు, కురుగంటి. అలంకారతత్వ విచారము.చెన్నపురి. కమర్షియల్ ముద్రక్షర శాల.1915.

64. సుబ్రహ్మణ్యం. జి. వి, సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. హైదరాబాదు:
తెలుగు అకాడమి, 2012.

65. సుబ్రహ్మణ్యం. జి. వి, డా, ఆంధ్ర సాహిత్య విమర్శ– ఆంగ్ల ప్రభావం. హైదరాబాద్:
యువభారతి ప్రచురణలు, 1983.

66.సూర్యనారాయణశాస్త్రి. సన్నిధానం, కావ్యాలంకార సంగ్రహం.
రామరాజభూషణుడు, హైదరాబాద్: సాయి లిఖిత ప్రింటర్స్, 2013.

శ్రీనాథ వెంకట సోమయాజులు.నోరి,మన వివాహ వ్యవస్థ.మద్రాసు:రామకృష్ణ పబ్లికేషన్స్,1990

67. వ్యాస మూర్తి, కాళూరి, కవిత్వ తత్వ విచారము విమర్శనము. చెన్నపురి వావిళ్ల ప్రెస్. 1940.

## ఆంగ్ల గ్రంథములు

**72**. Achyuta Rao. Tekumalla. ***The Life of Pingali suranarya.***
world public library association.1941.

73. Narayan Rao, velcheru.shulman David .the demons daughter
(a Love story from India) ***Pingali surana***. Albany.
State University of New York press.2006.

**74**. Anjaneyulu, D*.* ***Dr. C.R.REDDY***. NEW DELHI,
SAHITYA AKADEMI, 1973.

**75.** Chenchia,p. Bhujanga Rao, b. ***History of Telugu literature.***
London. Oxford University press.1928.

**76**. David Ditches. ***Critical approaches*** to Orient longman.1977.

**77**. Herbert, read. ***Literary criticism particular studies***. London.
Faber and Faber limited.1969.

78. Krishna Rao GV. ***Studies in kalapurnodayam.*** *tenali*.prabhasa
publication s.1999.

79. Narla, V.R***. vemanna through Western eyes***.madras.m.sesachalam&co.1969.

80. Prasad,B. ***An introduction to English criticism.***
calvutta.the Macmillan co.1966.

81. Raju,p.t. ***Telugu literature.***bombay.the international Book House ltd.1944.

82. Rene,wellek and Austin,warden. ***Theory of literature***.pengvin books.1976.

83. reddy.c.r.***drama in the East and West***. A lecture, Bangalore.
The amataur dramatic association 1919.

84. Richards’s i.a. ***principles of literary criticism***. London.
Routledge and kegan paul.1970

85. sridevi.s,***Luminaries of Andhra Pradesh***. Hyderabad.

Andra Pradesh sahitya akademi.1976.
86.Srinivasa,Iyengar.***essaysandaddressesc.r.reddy.***waltair. andrauniversity press.1966.

## సాహిత్య పత్రికలు

త్రిలింగ,జనవరి.1914

అభ్యుదయ.1981

కిన్నెర, ఫిబ్రవరి.1955

భారతి,మార్చ్.1938

భారతి, అక్టోబర్ 1947

భారతి, డిసెంబర్.1947

నవ భారతి, డిసెంబర్.1980

భారతి, ఫిబ్రవరి.1984.

రెడ్డిరాణి,

మణి మంజరి, ఫిబ్రవరి.

మిసిమి.డిసెంబర్,2017

## నిఘంటువులు

1.ఆంధ్రభారతి నిఘంటువు (www. Andhrabharthi.com)


2.రాజు. ఎన్. ఎస్, పాఠశాల నిఘంటువు. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం,

3.సీతారామాచార్యులు, బహుజనపల్లి, శబ్దరత్నాకరం. హైదరాబాద్: ఆసియన్ ఎడ్యుకేషనల్ సర్వీస్, 1988.

# అనుబంధం

# పరిశోధన: నాడు, నేడు, రేపు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)



సంపాదకులు

ఆచార్య [illegible]భూషి సంపత్ [illegible]

# PARISOODHANA: NINNA, NEEDU, REEPU

(Research Papers Presented in the International Seminar "Research : Yesterday, Today and Tomorrow")

**Editor: Dr. M. Sampath Kumar**
Prof. & Head, Department of Telugu
University of Madras
Chennai-600 005
Mobile:09444075128
email: madabhushisk@gmail.com

First Edition: February 2016

(c) Editor

Cover Design: Thy Designers, Chennai

**ISBN No. : 978-93-81992-32-6**

Dr. Darla Venkateswara Rao
Associate Professor
Department of Telugu
UNIVERSITY OF HYDERABAD
Hyderabad-500 046.T.S. India.

# పరిశోధన: నిన్న, నేడు, రేపు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)

**సంపాదకులు:**

**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్,** డి.లిట్.

తెలుగు శాఖాధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై-600 005

హక్కులు : సంపాదకులు

మొదటి ప్రచురణ : ఫిబ్రవరి 2016

ముఖపత్ర అలంకరణ: థై డిజైనర్స్

వెల: రూ. 400/-

ప్రతులకు:

**పాలపిట్ట బుక్స్**

16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ

సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు-500 036

ఫోను:040-27678430

# పత్ర క్రమం


001. ఆరాల లింగమల్లయ్య — గంగిరెద్దులాట . . . 001
002. ఆరాల సైదులు — తెలుగు పత్రికలలో బాల సాహిత్య ఆవిర్భావం-వికాసం . . . 004
003. ఈశ్వరబాబు.కె. — ఆంధ్ర మహాభాగవతం-శ్రీకృష్ణుని అష్టభార్యలు . . . 007
004. కంబాల మురళీకృష్ణ — తెలుగు దినపత్రికలు ఆధునిక ధోరణుల అనుశీలన . . . 011
005. కదిరి కృష్ణయ్య — విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట' - భాషా పరిశీలన . . . 015
006. కళ్యాణి జిల్లా — తెలంగాణ రచయిత్రుల నవలలు-స్త్రీల జీవిత చిత్రణ . . . 018
007. కాశింబాబు.ఎ. — కారకవిశేషాలు-తిక్కనగారి ఉద్యోగ పర్వం . . . 021
008. పి.కాళియప్ప — ఆధునికానంతర సాహిత్య విమర్శ-ధోరణులు . . . 025
009. కుంజం శ్రీనివాస్ — కోయతెగ-పండుగలు . . . 029
010. కృష్ణారెడ్డి.సి.యన్ — సీమ కథాశిల్పి - సింగమనేని . . . 031
011. కొక్కిలిగడ్డ వాణి — స్వాతంత్ర్య పోరాటంలో తెలుగు స్త్రీలు . . . 034
012. కోదండ లక్ష్మణ — లకుమ 'గోరింటాకు చందమామ' కవితా వైభవం . . . 038
013. గంధసిరి వీరన్న — బందూక్ నవల- సామాజిక పరిశీలన . . . 042
014. గరికిపాటి గురజాడ — ఆంధ్ర మహాభారతంలో యక్ష ప్రశ్నలు : మానసిక పరిపక్వత . 047
015. గరిగె రాజేష్ — కరీంనగర్ జిల్లా కవిత్వం - వస్తు విశ్లేషణ . . . 049
016. గల్లా జ్యోత్స్న — కొలకలూరి ఇనాక్ 'ఊరబావి' - వస్తువైవిధ్యం . . . 054
017. గాదిరాజు రంగరాజు — సాహిత్యంలో చారిత్రక నాటకాల విశిష్టత . . . 060
018. గాయత్రి.ఎస్ — కడుపు కోత కథా సంపుటి- సామాజిక విశ్లేషణ . . . 063
019. గిన్నారపు ఆదినారాయణ — దళిత సాహిత్యంలో ఆత్మకథలు . . . 066
020. గొంగులూరి కృష్ణవేణి — గంగుల శాయిరెడ్డి కాపుబిడ్డ-రైతు జీవిత చిత్రణ . . . 070
021. గోపాల్.పి — గోపిచంద్ వ్యక్తిత్వం . . . 073
022. గోపాల్ ఆర్. — కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య ప్రస్థానం . . . 075
023. గోపినాథ్ రాథోడ్.పి — మహబూబ్ నగర్ జిల్లా పత్రికలు - సాహిత్య సేవ . . . 078
024. గోవిందు.హెచ్ — మానవల్లికవి మనోహర కల్పనాకావ్యం 'మృగావతి' . . . 082
025. గౌతమ.బి.వి.ఎస్ — సూర్య దినపత్రికలో కవిత్వం : చర్చనీయాంశాలు . . . 085
026. చంద్రమౌళి మొరవపల్లి — కవి జీవిత పరిశోధనల్లో డా:సి.ఆర్.రెడ్డి జీవితం, రచనలు . . . 087
027. చంద్రయ్య.ఎస్ — తిమ్మాజిపేట మండల మౌఖిక భాష-వర్ణనాత్మక వ్యాకరణం . . 090
028. చెన్నకేశవులు.సి — కథామహల్ కథల్లో వస్తువైవిధ్యం . . . 093
029. డుంగావత్ నరేష్ కుమార్ నాయక్ — గోర్‌బోలి భాష - వ్యాకరణం . . . 096
030. తిరుపతి కల్లెబోయిన — నాడు తెలుగు పరిశోధనకు దీప్తి తెలుగు పరిశోధన పత్రిక . . . 103
031. దస్తగిరి.పి — ఆధునిక తెలుగుసాహిత్యం - చాకలివారి జీవిత ప్రస్తావన . . . 105
032. దార సుమన్ — సినిమాలుగా రూపొందిన తెలుగు నవలలు-నాటకీయత . . . 108
033. దాసరి విజయ లక్ష్మి — కొలకలూరి ఇనాక్ కథానికలలో మానవత . . . 112
034. దుర్గ.సి — సర్వజగన్నాథ రెడ్డిగారి 'కచ్ఛపి కావ్యం' - ప్రబోధాంశాలు . . . 116
035. దైద వీరయ్య — దక్కలికుల సాంస్కృతిక సామాజిక జీవనం . . . 119
036. నగరి చాముండేశ్వరరావు — తరికొండ వెంగమాంబ రచనలు-యోగదర్శనం . . . 121

# కవిజీవిత పరిశోధనల్లో డా:సి.ఆర్.రెడ్డి జీవితం, రచనలు

చంద్రమౌళి మొరవపల్లి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

తెలుగు సాహిత్యంలో ఇప్పటివరకు కవి జీవిత పరిశోధనలు జరిగాయి, ఇంకా జరుగుతున్నాయి. ఇలా జరిగిన కవి జీవిత పరిశోధనలవల్ల సమగ్రమైన సాహిత్య చరిత్రను తెలుసుకోవడమే కాకుండా కవి (రచయిత) నివసించిన కాలం నాటి సామాజిక సాంఘిక ఆర్థిక పరిస్థితులను తెలుసుకుంటాం. ఇటువంటి పరిశోధనలు తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణానికి కొంత వరకు దోహదపడతాయి.అందువల్లనే ఈ కవి జీవిత పరిశోధన గురించి ఈ పత్రంలో చెప్పాలనుకుంటున్నాను. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ, తెలుగు శాఖలో డా॥ దార్ల వెంకటేశ్వరావు గారి పర్యవేక్షణలో *విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి* అనే అంశం మీద పరిశోధన చేస్తున్నాను. సి.ఆర్.రెడ్డిగా ప్రసిద్ధుడైన డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి ప్రతిభావంతుడైన సాహితీవేత్త, విద్యావేత్త, పండితుడు, వక్త, రచయిత, హేతువాది. ఆదర్శవాది, రాజనీతిజ్ఞుడు. ఇంతటి ప్రతిభా పాటవాలు ఒక వ్యక్తిలో కనిపించడం చాలా అరుదు. ఆంధ్రభాషాభిరంజని సంఘంలో చురుకైన పాత్ర పోషించాడు. గైక్వాడ్ స్ఫూర్తితో అమెరికాలో విద్యాభ్యాసం చేశాడు. అక్కడినుంచి తిరిగి వచ్చిన తర్వాత బరోడా కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా చేరాడు. 1909లో మైసూరులో విద్యాశాఖలో చేరి 1918 నుంచి 1921 వరకు విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వ్యవహరించాడు. 1951లో అనారోగ్యంతో ఆయన మరణించాడు.ఈ పత్రంలో కట్టమంచి వారి పై జరిగిన పరిశోధనలు, వారి జీవితం, రచనలను, వారి విమర్శ దృక్పథాన్ని సంక్షిప్తంగా పరిచయం చేస్తాను.

**తెలుగుసాహిత్యంలో కవిజీవిత పరిశోధనలు**

కవిజీవిత పరిశోధనలు వివిధ విశ్వవిద్యాలయాలలో డాక్టరేట్ కోసం చేసినవారున్నారు. విశ్వవిద్యాలయాలతో పని లేకుండా స్వీయభిరుచితో కవి జీవితాలపై పరిశోధన చేసినవారున్నారు. కావలి సోదరులు రాసిన దక్షిణకవుల చరిత్ర, కందుకూరి వీరేశలింగం రాసిన ఆంధ్రకవుల చరిత్ర, గురజాడ శ్రీరామ మూర్తి రాసిన కవి జీవితములు, చాగంటి శేషయ్య రాసిన ఆంధ్ర కవుల తరంగిణి, టేకుమళ్ళ అచ్యుత్యరావు మొదలు పెట్టిన పుర్వాంధ్ర కవుల చరిత్ర మొదలైనవి కవుల చరిత్ర నిర్మాణానికి చేసిన విలువైన పరిశోధనలుగా చెప్పవచ్చు. వీటితో పాటు 19 శతాబ్దానికి చెందిన రచయితల సాహితీ వ్యక్తిత్వాలను వాఙ్మయ చిత్రాలుగా రూపొందించిన మధునాపంతుల సత్యనారాయణ ఆంధ్ర రచయితలు, ప్రత్యేకంగా పేర్కొనదగింది. ఈవిధంగా తెలుగు సాహిత్య నిర్మాణానికి కృషిచేసిన వారు ఎంతోమంది ఉన్నారు. విశ్వవిద్యాలయాల్లోకుడా కవిజీవితలపై పరిశోధనలు విరివి గానే జరిగాయి. కందుకూరి మీద అక్కిరాజు రామాపతిరావు, వేమన మీద ఎన్.గోపి, తాపీధర్మారావు మీద ఏటుకూరి ప్రసాద్, ఆరుద్ర మీద దార్ల వెంకటేశ్వర రావు వంటి ప్రముఖులెందరో కవిజీవిత పరిశోధనకై కృషి చేసిన వారున్నారు.

**విశ్వవిద్యాలయాల్లో కట్టమంచిరామలింగారెడ్డి పై జరిగిన పరిశోధనలు:**

విద్యావేత్తగా, సాహితీవేత్తగా, రాజకీయ వేత్తగా ప్రసిద్ధి చెందిన సి.ఆర్.రెడ్డి, మీద వివిధ విశ్వవిద్యాలయాల్లో కొన్ని పరిశోధనలు జరిగాయి. బెనారస్ విశ్వవిద్యాలయం లో సి.ఆర్.రెడ్డి రచనలు-సవిమర్శకపరిశీలన అనే అంశం మీద మురళీ కృష్ణ పరిశోధన చేసారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం లో సి.ఆర్.రెడ్డి జీవితం -రచనలు అనే అంశం మీద, డి.మహాలక్ష్మమ్మ పరిశోధన చేసారు.ఇదే అంశం మీద మద్రాస్ విశ్వవిద్యాలయంలో గంధం అప్పారావు గారి పర్యవేక్షణలో ఎం.వెంకటరెడ్డి పరిశోధన చేసారు. కట్టమంచిరామలింగారెడ్డి ముసలమ్మ మరణం-ఒక పరిశీలన అనే అంశం మీద దామోదర్ రెడ్డి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం లో పరిశోధన చేసారు. కట్టమంచిరామలింగారెడ్డి రచనల్లో సంస్కృతి సాంప్రదాయం అనే అంశం మీద పద్మావతి విశ్వవిద్యాలయం లో పరిశోధన జరిగింది. హైదరాబాద్ విశ్వవిద్యాలయం లో కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలు - పరిశీలన అనే అంశం పై ఎం.చంద్రమౌళి, డా॥దార్ల వెంకటేశ్వరావు గారి పర్యవేక్షణలో ఎం.ఫిల్ చేసారు.సి.ఆర్.రెడ్డి పై అభిమానం ఉన్న మరికొందరు రెడ్డి గారి సాహిత్య కృషిని,వారి జీవిత చరిత్రలను సంకలనాలుగా తీసుకువచ్చి తెలుగు సాహిత్యానికి మహెూపకారం చేసారు.డా॥సి.ఆర్ రెడ్డి జీవిత చరిత్ర , గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, ఆద్యుడు కట్టమంచి అనుమాండ్ల భూమయ్య, సాహితి మూర్తి కట్టమంచి బి.భాస్కరచౌదరి,వంటి వారు కట్టమంచి వారి సాహిత్యాన్ని ,సాహిత్య లోకానికి తెలిపే ప్రయత్నం చేసారు.రెడ్డి గారు తెలుగులోనే కాకుండా ఆంగ్లం లో కూడా మంచి పాండిత్యం ఉన్నవారు.ఈ విధంగా పరిశోధకులు, సాహితీకారులు రెడ్డి గారి సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేసారు.

Professor
Department of Telugu
UNIVERSITY OF HYDERABAD
Hyderabad-500 046.T.S. India.
ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

**పరిశోధనాంశ వివరాలు:**

నేను విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డి అనే అంశం మీద పరిశోధన చేస్తున్నాను ,ఇప్పటివరకు వివిధ విశ్వవిద్యాలయాల్లో సి.ఆర్.రెడ్డి రచనలపై వివిధకోణాల్లో పరిశోధనలు జరిగయి,వీటన్నింటి ఆధారంగా నేను ఆయన విమర్శ దృక్పథాన్ని నాపరిశోధనలో సాహిత్య లోకానికి తెలియజేయలనుకున్తున్నాను .సి.ఆర్.రెడ్డి అనగానే ముందుగా కవిత్వ తత్వ విచారం, ముసలమ్మ మరణం గుర్తుకు వస్తాయి. అయితే వీటితో పాటుగా కొన్ని అంశాలపై వ్యాసాలు, పీఠికలు కూడా రాశారు, యివన్నీ రెడ్డి గారి విమర్శ ద ృక్పథాన్ని తెలియ చేసే విధంగా ఉన్నాయి.

కవిత్వతత్వవిచారము అన్న గ్రంథం మీద అనేక ఖండన మండనలు జరిగాయి,ఈ గ్రంథం సాహిత్య లోకంలో ఒక సంచలనం కలిగించింది. పాత ప్రతిపాదనలను కొట్టివేసి నూతన సిద్ధాంతాలను చూసి సనాతులు మండిపడ్డారు, కవిత్వతత్వవిచారము వచ్చిన వెంటనే సాంప్రదాయిక పండితుల నుండి వ్యతిరేకత వచ్చింది .కురంగంటిసీతారామయ్య గారు ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికలో అలంకారతత్త్వం అన్న వ్యాసం ప్రకటించారు, కాళ్ళకూరివ్యాసమూర్తి కవిత్వతత్వవిచార ఖండనం అనే విమర్శన గ్రంథం రాసారు.విమర్శలో కొత్త దారులు తొక్కుతూ బుర్రా శేషగిరిరావు విమర్శాదర్శనం అనే పుస్తకం రాసారు. దీన్ని ఖండిస్తూ పానుగంటిలక్ష్మీ నరసింహరావు గారు విమర్శాదర్శవిమర్శనం అన్న పుస్తకం వెలువరించారు.ఈ ఖండనమండనలుగా వచ్చిన పుస్తకాలను చూస్తే తెలుగు సాహిత్యం లో కవిత్వ తత్వ విచారము ఎంతటి సంచలనాన్ని రేపిందో అర్థమౌతుంది.

ముసలమ్మమరణం కావ్యాన్ని పరిశీలిస్తే అందులో వస్తువు నవ్యం, భాష సంప్రదాయం, దీన్ని గమనిస్తే ఆధునిక సంప్రదాయ భావజాలాల మధ్య జరిగిన సంవాదంలా కూడా మనకు కనిపిస్తుంది. అన్ని ప్రక్రియలకు తానే ఆద్యుడు అని చెప్పుకుంటున్న వీరేశాలింగంగారి విమర్శరచనలను, సి.ఆర్.రెడ్డిగారి విమర్శను పరిశీలించి ఆధునిక సాహిత్య విమర్శకు ఆద్యుడు ఎవరు అన్న విషయాన్నీ నా పరిశోధనలో చర్చించాలనుకుంటున్నాను. పింగళి సూరన కళాపూర్ణోదయం, ప్రభావతి ప్రద్యుమ్నము కావ్యాలను పరిశీలించి విమర్శను చేసినప్పుడు తులనాత్మక విమర్శకుడిగా కూడా మనకు కనిపిస్తాడు. వీటన్నింటిని నా పరిశోధనలో పరిశీలించి సాహిత్య లోకానికి చెప్పాలనుకుంటున్నాను. కట్టమంచి రామలింగారెడ్డి గారి రచనలన్నింటినీ పరిశీలించడం వల్ల విమర్శకుడిగా ఈయన్ని అంచెనావేయడం జరుగుతుంది. దీనివల్ల పూర్వ విమర్శకుల అభిప్రాయాలను సవిమర్శకంగా పరిశీలించవచ్చు. తెలుగు సాహిత్య విమర్శలో కందుకూరి వీరేశలింగంగారు, కట్టమంచి రామలింగారెడ్డిగారు, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి మొదలైన తొలి తరం వారి విమర్శకుల్లో కట్టమంచి వారి ఆధునికత్వం తెలుస్తుంది. నేటికీ తెలుగు సాహిత్య విమర్శలో గల తొలి తెలుగు విమర్శకుడు కట్టమంచి రామలింగారెడ్డా? కందుకూరి వీరేశలింగం పంతులు గారా? అనే అంశాల్ని శాస్త్రీయంగా గుర్తించగలిగే అవకాశం ఉందనుకుంటున్నాను. ఈ విధంగా తెలుగు సాహిత్య చరిత్ర మరింత పరిపూర్ణమవుతుందని నమ్ముతున్నాను.

**సాహిత్య చరిత్రలలో డా:సి.ఆర్.రెడ్డి స్థానం**

ఆరుద్ర తన సమగ్రఆంధ్ర సాహిత్యంలో కట్టమంచిరామలింగారెడ్డి గురించి చెప్తూ *'తెలుగు నాటకానికి గురజాడ, నవలకు ఉన్నవలక్ష్మీనారాయణ చేసిన సేవ లాంటిది, తెలుగువిమర్శకు సి.ఆర్.రెడ్డి చేసిన సేవ'* అని కొనియాడారు. ఈ ఇద్దరి వాడుక భాషావాదుల మధ్య కాలం లో రెడ్డి గారు తన కవిత్వతత్వ విచారం అనే గ్రంథంతో తెలుగు సాహిత్య విమర్శను ఆధునిక రీతులకు మళ్ళించారు. కావ్యాలలో గల పద్య గద్యాల తారతమ్యం, భావనాశక్తి, రచనా కౌశలం, వస్తు స్వరూపం భావ ప్రకటనల పరస్పర సంబంధాల, విషయం శైలి యీ రెండింటిలో ఏది ముఖ్యమనే చర్చ మొదలైన విషయాలను కూలంకుశంగా చర్చిస్తూ రెండు ప్రబంధాలను విశ్లేషణ చేసి తమ నూతన దృక్పథాన్ని లోకానికి చాటారు. సి.ఆర్.రెడ్డి తెలుగు సాహిత్య విమర్శకు కొత్త ద్వారాలు తెరిచారని కొనియాడారు. *'కవిత్వతత్వం వెలువడిన తరువాత దాన్ని కొంత మంది విమర్శించినా అందులో సరుకు ఉంది కాబట్టి నిలబడగలిగింది'* అని ఆరుద్ర పేర్కొన్నాడు .

కల్లూరు అహోబల రావు రాయలసీమ కవుల చరిత్ర (2సంపుటం)లో కట్టమంచిరమలింగారెడ్డి బాల్య విశేషాలతో పాటు ముసలమ్మమరణం కావ్యం లోని వర్ణనలు తిక్కన, పోతన కావ్యాలలోని పద్యాలకు అనుసరణీయంగా ఉన్నాయని పేర్కొన్నాడు.అంతేకాకుండా రామలింగారెడ్డి. ముసలమ్మమరణం, నవ యామిని, ఆర్థిక శాస్త్రం, కవిత్వ తత్వ విచారము, భారత విమర్శనము, వ్యాస మంజరి(5ఖండములు), ముత్యాల సరములు, దేవీభాగవతము, ప్రహసనములు, ప్రతాపరుద్రీయము, కట్టమంచి సుబ్రహ్మణ్యం రెడ్డి సంక్షేమ చరిత్ర వంటి రచనలు చేశాడని, వీటితో పాటుగా ఆంగ్లంలో కూడా ఉపన్యాసాలు, వ్యాసాలు రాశారని పేర్కొన్నారు. సీమ రత్నాలు మణిదీపాలు అన్న పుస్తకంలో అనంతపద్మం గారు రామలింగారెడ్డి గారి గురించి సంక్షిప్తంగా పరిచయం చేశారు. వీటితోపాటుగా మరికొన్ని సాహిత్య చరిత్రలను చూస్తే రామలింగారెడ్డి

గురించి మనకు కొంత పరిచయం అవుతుంది .

నేను నా పరిశోధన మొదలు పెట్టి 6 నెలలేఅయింది,నా పరిశోధన పూర్తి అయ్యేనాటికి సి.ఆర్.రెడ్డి విమర్శను సమగ్రంగా తెలియజేస్తాను.

**ఆధార గ్రంథాలు**


1) రామలింగారెడ్డి. కట్టమంచి. కవిత్వతత్త్వవిచారము అను పింగళి సూరనార్య కృత కళాపూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్నముల విమర్శనము. వాల్తేరు: ఆంధ్రకళా పరిషత్, ఐదవ ముద్రణ: 1973 (ప్రథమ ముద్రణ: 1914)

2) ఆరుద్ర, సమగ్ర ఆంధ్ర సాహిత్యం. నాల్గవ సంపుటి హైదరాబాద్ :తెలుగు అకాడమి హైదరాబాద్ 2012

3) ఆహోబలరావు,కల్లూరి.రాయలసీమ రచయితుల చరిత్ర.హిందూపురం: శ్రీ కృష్ణదేవరాయ గ్రంధమాల, హిందూపూర్ 1977.



Dr. Darla Venkateswara Rao
Associate Professor
Department of Telugu
UNIVERSITY OF HYDERABAD
Hyderabad-500 046.T.S. India.

# రాయలసీమ జాగృతి

అక్షరాల అమ్ములపొది

సంపుటి : 02 సంచిక : 07
జనవరి 2018 వెల : 20/-



నూతన సంవత్సర, సంక్రాంతి మరియు

## గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

RNI/APTEL/2016/69069

# తెలుగు సాహిత్య విమర్శకు దిక్సూచి సీఆర్ రెడ్డి

ఎం. చంద్రమౌళి, యూజీసీ సీనియర్ రీసెర్చ్ ఫెలో
తెలుగు శాఖ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

కందుకూరి విగ్రహతంత్ర విమర్శనంతో తెలుగులో సాహిత్య విమర్శ ప్రారంభమైతే, దాని వికాసానికి కారణభూతమైనవారు మాత్రం కట్టమంచి రామలింగారెడ్డి. ఈయన రాసిన కవిత్వతత్త్వ విచారం తెలుగు సాహిత్యాన్ని, విమర్శనీ ఒక మలుపుతిప్పింది. "19వ శతాబ్దం వరకు తెలుగు సాహిత్యరంగంలో సాహిత్య విమర్శ లేదు. అంతేకాదు తెలుగులో సంస్కృతానికి భిన్నమైన సాహిత్య సిద్ధాంతం కూడా లేదు... కవిత్వ విమర్శ అంతా కావ్యం ప్రాతిపదికగా కాకుండా ఒక పద్యమో శ్లోకమో ప్రాతిపదికగా సాగుతూ వచ్చింది. ఈ ధోరణికి స్వస్తి చెప్పి ఒక కావ్యాన్ని సమగ్రంగా విశ్లేషించే విమర్శకు రామలింగారెడ్డి గారు 'కవిత్వ తత్వవిచారం'లో బాటలు వేశారని పల్లంపాటి వెంకటసుబ్బయ్య వంటి విమర్శకులు వ్యాఖ్యానించారు. ఇలా తెలుగు సాహిత్య మూల్యాంకనాన్ని ఒక మలుపుతిప్పిన కట్టమంచి రామలింగారెడ్డి 1880 డిసెంబర్ 10వ తేదీన చిత్తూరు జిల్లాలోని కట్టమంచి గ్రామంలో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యం రెడ్డి, నారాయణమ్మ. వీరిది పండిత వ్యవసాయ కుటుంబం.



ఈయన 'కట్టమంచి', 'సీఆర్ రెడ్డి'గా ప్రసిద్ధులు. 1897లో మద్రాస్ క్రైస్తవ కళాశాలలో బీఏ చదివారు. బీఏలో చరిత్ర, అర్థశాస్త్రం, తత్వశాస్త్రం చదివాడు. బైబిలు అధ్యయనంలో కూడా నిష్ణాతుడు. ఈ రెండింటిలోనూ బంగారు పతకాలను పొందాడు. 1906వ సంవత్సరంలో ప్రభుత్వ ఉపకార వేతనంతో లండన్‌లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేశాడు. చదువు పూర్తిచేసుకుని భారతదేశం వచ్చాక బరోడ (1909-1910), మైసూరు (1910-12) ఆస్థానాలలోని కళాశాలలో ఆచార్యుడిగానూ, వైస్ ప్రిన్సిపాల్ గానూ పనిచేశాడు. మైసూరు సంస్థానంలో విద్యాశాఖ అధికారిగా పనిచేసి విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చారు. 1926-1930, 1936-1949 మధ్యకాలంలో ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ప్రథమ ఉపాధ్యక్షుడిగా పనిచేశాడు. 1949లో మైసూరు విశ్వవిద్యాలయానికి ప్రొ-చాన్సలర్‌గా పనిచేశారు. ఆ తరువాత మద్రాసు శాసనసభ్యుడిగా పనిచేశాడు.

కట్టమంచి తెలుగు సాహిత్యానికి సృజనాత్మక రచనల్లో 'ముసలమ్మ మరణం' (1899), నవయామిని (1936), సాహిత్య విమర్శలో "కవితత్వ విచారం" (1914) ఎంతో ప్రసిద్ధిచెందాయి. వ్యాసమంజరి (1939) పీఠికలు, పంచమి (1954) విమర్శవ్యాసాలు, లఘుపీఠికాసముచ్చయం తదితర వాటిని పేర్కొనవచ్చు. సీఆర్ రెడ్డి మద్రాసు క్రైస్తవ కళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన కావ్యం ముసలమ్మ మరణం. ఆంధ్రభాషాభిరంజని సంఘం నిర్వహించిన పోటీల్లో బహుమతి గెలుచుకున్న రచన ఇది. దీనిని 1899లో తన 19వ ఏట రాశారు. సీపీ బ్రౌన్ ప్రకటించిన అనంతపురం జిల్లా చరిత్ర నుంచి ఈ కావ్యానికి వస్తువుని స్వీకరించాడు. అనంతపురం సమీపంలో ఉన్న బుక్కరాయసముద్రం వద్ద చెరువుకు గండి పడి గ్రామాన్ని రక్షించడం కోసం ముసలమ్మ అనే పేరుగల యువతి ఆత్మ బలిదానం చేసుకుంటుంది. ఆ తరువాత చెరువు కట్ట నుంచి నీళ్ల ప్రవాహం ఆగిపోతుంది. ఇది అనంతపురం జిల్లా చరిత్ర గ్రంథంలో ఉన్న మూలకథ. దీనిని కొన్ని మార్పులు చేసి ఒక కావ్యంగా రాశారు సీఆర్ రెడ్డి. ఈ కావ్యాన్ని సంప్రదాయబద్ధంగానే ప్రాచీన ప్రబంధ శైలిలోనే రాశారు. ఈ కావ్యం ముగింపు మాత్రం విషాదాంతంగా ఉంటుంది.

ఒక జానపద స్త్రీ త్యాగాన్ని ప్రబంధంగా తీర్చిదిద్దడం, విషాదాంతంగా ముగించడం అనేవి ఆధునిక అంశాలుగా కొంత మంది భావించారు. కానీ మరికొంతమంది ఆ విషాదాంతం కూడా గ్రామ కళ్యాణానికే కనుక దాన్ని సుఖాంతంగానే భావించాలని అన్నారు. సీ నారాయణరెడ్డి ఈ కావ్యం గురించి వ్యాఖ్యానిస్తూ కొన్ని అంశాలు నవ్యత్వాన్ని ప్రదర్శించినట్లు అనిపించినా అవి సంప్రదాయంలో కొన్ని ప్రయోగాలు మాత్రమే కాని ఆధునికత కాదన్నారు. పింగళి లక్ష్మీకాంతం గారు మాత్రం దీనిని ఆధునికతగా భావించారు. వీటితో పాటు, సీఆర్ రెడ్డి అంకితం గురించి రాసిన వన్నీ పద్యాలే కావడం విశేషం. అర్థశాస్త్రాన్ని అంకితం చేస్తూ రాసిన పద్యాలు (1911), కవిత్వతత్త్వ విచారం గ్రంథానికి అవతారికగా రాసిన పద్యాలు (1913), పెంపుడు కూతురును అత్తవారింటికి పంపే సందర్భంలో రాసిన అంపకాలు (1919), ఆంధ్రమహాభారతాన్ని ప్రశంసిస్తూ విమర్శనాత్మక వ్యాసం రచించగల మన్న కోరిక వ్యక్తం చేస్తూ రాసిన భారత ప్రశంస (1919) అన్నవి ఆయన లఘు కృతులుగా చెప్పుకోవచ్చు.

ఇతర సృజనాత్మక రచనల్లో మరొక ముఖ్యమైన కావ్యం నవ యామిని పేరుతో 1936లో 30 పద్యాల ఖండకావ్యాన్ని రాశారు. దీన్ని సంస్కృతంలో బిల్హణుడు రాసిన బిల్హణీయం నుంచి మూలకథను తీసుకుని కొన్ని మార్పులు చేసి రాశాడు. బిల్హణుడికి సౌందర్యవతి అయిన యామినికి ఆమె శిష్యురాలికి మధ్య జరిగిన రహస్య ప్రేమ కథ మూలంలోని బిల్హణీయంకథ. అయితే యామిని తండ్రి కాశ్మీరు రాజు, బిల్హణుడు ఒక గురువు. యవ్వనస్థుడైన గురువు దగ్గర మరొక యవ్వనస్థురాల్ని ఏ సేవకులు లేకుండా ఒంటరిగా వదలడంలో ఒక అంతర్యం ఉంది. అది గురువుని పరీక్షించడమే దానిలోని ఆంతర్యం. మరొకవైపు రాజ కుటుంబానికి చెందిన ఆ యువతి ప్రవర్తనను కూడా పరీక్షించడం మరొక ఆంతర్యం. దీన్ని సీఆర్ రెడ్డి విశిష్టత లోపించిన కావ్యంగా భావించారు. తన కావ్యంలో బిల్హణుడు యామినిని ప్రేమించి ఆ ప్రేమను వ్యక్తం చేయబోయే ముందు ఎంతో సంఘర్షణకు లోనవుతాడు. అయినా చెప్పకూడదు అనుకుంటూనే చెప్పలేకుండా ఉండలేకపోతాడు. యామిని కూడా ఆ సమయంలో కొంత సంఘర్షణకు గురవుతుంది. అయినా తన వాక్చాతుర్యంతో తనని రుజు మార్గంలో ఎదగనీయమంటుంది. బిల్హణుడు తనను తాను తెలుసుకునేలా చేస్తుంది. ఒక స్నేహితురాలిగా ఉంటుంది. ఈ కావ్యం గురించి విమర్శలు వ్యాఖ్యానిస్తూ ముసలమ్మ మరణం కావ్యంతో పోలిస్తే ఈ కావ్యంలో రెడ్డి గారి పద్య రచన జీవాన్ని కోల్పోయి నిస్సారంగా ఉందన్నారు. అంతేకాదు తన సృజనాత్మక శక్తి స్థానంలో వయసుతో వచ్చే ఉపదేశాత్మకత చోటు చేసుకుందన్నారు. సహజత్వాన్ని వీడి హృదయానికి దూరమై, ఉపదేశంతో నిండి మేధోగతంగా నిలిచిన కావ్యంగా నవయామిని రూపుదిద్దుకొంది. అందుకే అది ముసలమ్మ మరణంలో ఉన్న హృదయానుభూతిని కలిగించలేకపోయిందని విమర్శకుల అభిప్రాయం.

సీఆర్ రెడ్డి రాసిన కవితత్వ విచారం అనే గ్రంథం ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో ముఖ్యమైన రచన. దీన్ని విమర్శకులు ఆంగ్ల సాహిత్య విమర్శలో ఉన్న ప్రముఖ విమర్శ గ్రంథాలతో పోల్చారు. Sidney Appology of poetry, SShelley A defence of poetry, Words worth preface to the lyrical ballads, Coleridge biographia literaria మొదలైన అత్యుత్తమ విమర్శన గ్రంథాలతో పోల్చారు. వాస్తవానికి అలెగ్జాండర్ పోప్ రాసిన essay on criticism, Matthew Arnold essay in criticism రచనల ప్రభావం కవితత్వవిచారంలో కనిపిస్తుందని ప్రముఖ విమర్శకుడు డీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు.

కవితత్వ విచారంలో రెండు భాగాలున్నాయి. మొదటి భాగంలో రెండు ప్రకరణాలు సిద్ధాంత విభాగం, అందులోని మూడో ప్రకరణ, రెండు మూడు భాగాలు అన్వయ భాగాలు. తన గ్రంథంలో కట్టమంచి ప్రతిపాదించిన అంశాలను కింది విధంగా పేర్కొన్నవచ్చు. 1. కవిత్వంలో భావనా శక్తి ముఖ్యం. అలంకారాల ప్రాముఖ్యం అతి తక్కువ. భావనా శక్తి అంటే విషయాలను మనసులో ప్రతిబింబించేటట్లు చేసే సామర్థ్యం. ఇంకా చెప్పాలంటే అవతారమెత్తినట్టు చేయడం. భావనా శక్తి లేని పాండిత్యం జీవం లేని ఆకారం. భావతీక్షణత భావనా శక్తిని ఉద్దీపింపచేస్తుంది. 2. దేశచరిత్ర సాహిత్య చరిత్ర నిరంతరం జంటగా నడుస్తాయి. 3. పాండిత్యం వల్ల కవిత్వానికి పుష్టి కలగదు. అలంకారాలు కవిత్వంలో అనివార్యంగా ఉండాల్సినవి కావు. ఉన్నా అతికినట్లుండాలి. వస్తువును పాఠకుడికి అందించడానికి తగిన మోతాదులో అలంకారాలుండాలి. అలంకారాలు విపరీతంగా ఉండటానికి కారణం భావశూన్యతే. 4. సాహిత్యంలో వస్తువు, శైలి రెండూ ముఖ్యమైన అంశాలే. సందర్భ వ్యతిరేక శైలి అసౌందర్యం, 5. పాత్రలు సహజంగా వైవిధ్య భరితంగా ఉండాలి. పాత్రలలో మానవ సమాజం ఉట్టిపడాలి. అంటే ప్రతిపాత్రలోనూ మంచి చెడు కలసి ఉంది. 6. అలంకార శాస్త్రాలకు కవులు అతుక్కుపోవలసిన పనిలేదు. శాస్త్రాలు రచయితల స్వతంత్ర్యాన్ని హరించరాదు. 7. కావ్యంలో వర్ణనలకన్నా అంగాంగాల కలయిక, పొత్తు పొసగని వర్తనలు రసానికి ప్రతికూలాలు. కథ, పాత్రలు, ప్రకృతి విశేషాలు, వర్ణనలు అన్నీ పరస్పర మైత్రి కలిగి ఉండాలి. కథా గమనానికి అడ్డుపడే వర?నలు చెయ్యరాదు. 8. కళల్లో ప్రధానమైన పురుషార్థం రసం. కళలలో ఉపజ్ఞ లేకపోతే స్వారస్యముండదు. 9. కావ్యంలో నాటక సరళి పటిష్టంగా ఉండాలి. 10. కావ్యం పాఠకులకు ఉత్తమ సంస్కారం కలిగించాలి. ప్రబంధకాలు వర్ణించే తుచ్ఛశృంగారానికి ఆసక్తి లేదు.

ఇలాంటి ఎన్నో కొత్త సాహిత్య విమర్శ సూత్రాల్ని అందించాడు సీఆర్ రెడ్డి. అందుకనే విమర్శకులు ఈయన గురించి వ్యాఖ్యానిస్తూ 'దాదాపు ఏడువందల సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు సాహిత్యంలో ఒక యుగాన్నో, కావ్యాన్నో పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ ఎవరూ విమర్శ రాయలేదు. కవుల చరిత్రలూ, వ్యాఖ్యానాలూ మాత్రమే సాహిత్య విమర్శగా చెలామణి అవుతుండేవి. ముఖ్యంగా ఒక కావ్యాన్ని తీసుకుని అందులోని వస్తువునూ, రూపాన్నీ విశ్లేషిస్తూ, వాటి పరస్పర సామంజస్యాన్ని చర్చిస్తూ, ఆ కావ్య ఉద్దేశాన్ని నిరూపిస్తూ విమర్శలు రాసే సంప్రదాయం అప్పటికింకా ప్రారంభ కాలేదు. ఇలా ప్రారంభించిన ఘనత డా. సీఆర్ రెడ్డిగారికే దక్కుతుందన్నారు. అటువంటి సీఆర్ రెడ్డి 1951 ఫిబ్రవరి 24న అనారోగ్యంతో మద్రాసులో మరణించాడు. కట్టమంచి రామలింగారెడ్డి కంటే ముందున్న విమర్శకులపై పాశ్చాత్య సాహిత్య ప్రభావముండినా అది వారిపై అంతగాడమైన ముద్ర వేయలేదు. తెలుగు సాహిత్య విమర్శను మొదటిసారిగా పాశ్చాత్య సిద్ధాంతాల ఆధారంగా నిరూపించటంలో మొదటి వాడు కటమంచి రామలింగారెడ్డి గారే అని ఎస్వీ రామారావు నిరూపించారు. అందుకే సాహిత్య విమర్శకు దిక్సూచిగా మారారు.